# సాహిత్య మరమరాలు

వందేళ్ల సాహిత్యంలో అపూర్వ ఘటనలు



ముప్పాల సుబ్బరామయ్య

# సాహిత్య మరమరాలు

## వందేళ్ళ సాహిత్యంలో అపూర్వ ఘటనలు


సేకరణ :

**మువ్వల సుబ్బరామయ్య**



**జయంతి పబ్లికేషన్స్**

కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ - 520 002.

# SAHITYA MARAMARAALU

Collection By :

**Muvvala Subba Ramaiah**

**JAYANTHI PUBLICATIONS**
27-1-68, RAHUL BUILDINGS
KARL MARX ROAD,
VIJAYAWADA - 520 002.
ESTD : 1955. Ph : 2577828

First Edition :

**November - 2008**

PRICE :

**Rs. 100-00**

DTP :
**SRI SRINIVASA GRAPHICS**
VIJAYAWADA - 521 108.
PH : 9440397989

Printers :
**NAGENDRA ENTERPRISES**
VIJAYAWADA.

© ACKNOWLEDGEMENTS : ALL AUTHORS AND PUBLISHERS



27.10.1939 - 12.06.2002

తన నిశ్శబ్దాన్ని
రంగులుగా
భాషగా
మహా సౌందర్యవంతమైన
మానవ హృదయంగా
అనువదించుకున్న

**చలసాని ప్రసాదరావు** కు

అంకితం

# కృతజ్ఞతలు

నవంబరు 1998 నుండి డిసెంబరు 2002 వరకు ఆదివారం వార్తలో 'సాహిత్య మరమరాలు' ధారావాహికంగా ప్రచురించిన వార్త దినపత్రిక సంపాదకులకు, యాజమాన్యానికి.

# సాహిత్య సహస్రనామాలు

**(లోపల తారసపడే ప్రముఖులు)**

రవీంద్రనాథ ఠాగూర్
సిస్టర్ నివేదిత
మైకేల్
గురజాడ అప్పారావు
ప్రేమచంద్ (నవాబ్‌రాయ్ లేక ధనపతిరాయ్)
రాహుల్ సాంకృత్యాయన్ (కేదార్‌నాథ్‌పాండే)
ఎం.ఎన్.రాయ్ (మానవేంద్రనాథ్ రాయ్)
ఎలెన్
సర్ సులేమాన్
ఐన్‌స్టీన్
హైసన్ బర్గ్
ఎన్. ఇన్నయ్య
మహాత్మాగాంధీ
వేలూరి శివరామశాస్త్రి
పోలిసెట్టి ఆదినారాయణగుప్తా
తుమ్మల సీతారామమూర్తి
కట్టమంచి రామలింగారెడ్డి
తిక్కవరపు రామిరెడ్డి
దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
నిజామజ్జంగ్
రాయప్రోలు సుబ్బారావు
అనిసెట్టి సుబ్బారావు
మాన్సు (మాండలిక సుబ్బారావు)
అజంతా (విశ్వనాథశర్మ)
ఇస్మాయిల్
జి.వి. రమణమూర్తి
వెంకన్న పంతులు
శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు)
శ్రీరంగం నారాయణబాబు
ఆరుద్ర (భాగవతుల శంకరశాస్త్రి)
కె.వి. రమణారెడ్డి
గోరాశాస్త్రి (గోవిందు రామశాస్త్రి)
గరిమెళ్ళ సీతారాం
ఎస్.టి.జి. వరదాచార్యులు
గొర్రెపాటి వెంకట సుబ్బయ్య
కుందుర్తి ఆంజనేయులు
సి.పి.బ్రౌన్ (ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్)
బంగోరె (బండి గోపాలరెడ్డి)
పురిపండ అప్పలస్వామి
అనంతం
తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి
గిడుగు రామమూర్తి పంతులు
శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి
త్రిపురాన సూర్యప్రసాదరాయకవి
ఆవుల గోపాలకృష్ణమూర్తి
దాశరథి కృష్ణమాచార్యులు
సి. నారాయణరెడ్డి
కాళోజీ (కాళోజీ నారాయణరావు)
సిద్ధయ్య పురాణిక్

జోషీమాన్వీ
స్వామిజీ
బూర్గుల రామకృష్ణారావు
బి. రామరాజు
వేమూరి ఆంజనేయశాస్త్రి
చక్రపాణి (ఆలూరి వెంకట సుబ్బారావు)
ఆలూరి బైరాగి
దేవులపల్లి కృష్ణశాస్త్రి
నన్నపనేని సుబ్బారావు
గొర్తి నారాయణమూర్తి
జోస్యుల రామస్వామి
కౌతా శ్రీరామశాస్త్రి
శరత్ (శరత్‌చంద్ర ఛటర్జీ)
ఉమా రంగనాయకులు నాయుడు
దాదాబాయి నౌరోజీ
మారంరాజు సత్యనారాయణ
కందుకూరి వీరేశలింగం
అందుగుల వెంకయ్య
దిట్టకవి నారాయణకవి
మతుకుమల్లి నరసింహశాస్త్రి
చట్రాతి లక్ష్మీనరసకవి
పరవస్తు వెంకటరంగాచార్యులు
మండపాక పార్వతీశ్వర శాస్త్రి
దేవులపల్లి తమ్మన్నశాస్త్రి
అమరవాది రామకవి
మండలేముల సీతారామశాస్త్రి
తూమాటి దొణప్ప
పానుగంటి లక్ష్మీనరసింహారావు

ఏటుకూరి వెంకట నరసయ్య
కాళిదాసు
భవభూతి
వ్యాసుడు
వాల్మీకి
తిక్కన
శ్రీనాథుడు
కొల్లా శ్రీకృష్ణారావు
కొడవటిగంటి కుటుంబరావు
దేవులపల్లి వెంకటచలపతిరావు
ఒద్దిరాజు రాఘవ రంగారావు
శేషాద్రి రమణకవులు (దూపాటి వెంకట రమణాచార్యులు)
జయంతి రామయ్య పంతులు
సం. సింగరాచార్యులు
పోతన
దేవులపల్లి రామానుజరావు
వీరనరసింహరాయలు
శ్రీపతి శీనప్ప
ప్రొఫెసర్ చంద్రశేఖరం
జాగర్లపూడి లక్ష్మీనరసింహారావు
ఏకా ఆంజనేయులు
ఇటికాల రామశాస్త్రి
నల్లపాటి జానకిరామయ్య
బ్రహ్మజోస్యుల సుబ్బారావు
బెజవాడ శ్రీబసవరాజు
వింజమూరి శ్రీనివాసాచార్యులు
అనీబిసెంట్

జి.ఎం.ఎ. కలకత్తావాలా
అడివి బాపిరాజు
విద్వాన్ విశ్వం (మీసరగండ
విశ్వరూప శాస్త్రి)
శ్రీనివాస చక్రవర్తి
తిరుమల రామచంద్ర
రాంభట్ల కృష్ణమూర్తి
బొమ్మకంటి సుబ్బారావు
బి.సి. కామరాజు
సాల్మన్ రష్దీ
తస్లీమా నస్రీన్
రానా కబ్బాని
అబ్దుల్ రహమాన్ జిదావి
అమీన్ మౌలప్
రన్క్ బినా
లహీబ్ జడ్డో
తుకోవ్స్కీ
కేశవచంద్రసేన్
ప్రతాప్‌చంద్ర మజుందారు
బిపిన్ చంద్రపాల్
గిరీశ చంద్రఘోష్
దువ్వూరి రామిరెడ్డి
సూర్యదేవర సంజీవదేవ్
మెకాలే
గిబ్బన్
జాన్సన్
కార్లైలు
నిరాలా (సూర్యకాంత త్రిపాఠి)
గరిమెళ్ళ సత్యనారాయణ
సుబ్రహ్మణ్య భారతి
వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి
రెంటాల వెంకట సుబ్బారావు
సోమంచి భీమశంకరం
మల్లాది నరసింహశాస్త్రి
మల్లాది రామకృష్ణశాస్త్రి
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
త్రైలింగస్వామి
రావూరి భరద్వాజ
క్వాజా అహ్మద్ అబ్బాస్
మాక్సింగోర్కీ
యం. చలపతిరావు
బాల్జాక్
ఆంటన్ చెకోవ్
జార్జి వాషింగ్టన్ కార్వర్
అబే జె.ఎ. దుబాయి
వేమన
తిప్పాభట్ల వెంకట శివశాస్త్రి
ఫాదర్ అమీను
మామిడి వెంకయ్య
పర్యం అద్వైత బ్రహ్మశాస్త్రి
పర్యం సీతారామశాస్త్రి
పర్యం రామలింగశాస్త్రి
కోటి లింగన్న
సదాబత్తుల ఆదినారాయణ
జూలూరి అప్పయ్య
రావిపాటి గురుమూర్తిశాస్త్రి

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు
వేపా రామేశం
వేమవరపు రామదాసు
అక్కిరాజు ఉమాకాంతం
వీరరాఘవస్వామి
డి. గోపాలాచార్యులు
నోరి నరసింహశాస్త్రి
కాటూరి వెంకటేశ్వరరావు
మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి
త్రిపురనేని గోపీచంద్
విశ్వనాథ సత్యనారాయణ
గోడేపల్లి ప్రకాశరావు
పిశుపాటి చిదంబరశాస్త్రి
అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి
పోకూరి కాశీపతవధాని
దుర్భాక రాజశేఖరం
కొప్పరపు కవులు
వెంకట రామకృష్ణ కవులు
గడియారం వెంకట శేషశాస్త్రి
ఇరివెంటి కృష్ణమూర్తి
కొక్కొండ వెంకటరత్నం
కలశపాకము విజయరాఘవ నాయుడు
పోతం జానకమ్మ
కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి
వి. లక్ష్మణరెడ్డి
సామినేని ముద్దుకృష్ణ
కాళూరి నరసింగరావు
బసవరాజు అప్పారావు
బసవరాజు రాజ్యలక్ష్మమ్మ (సౌదామిని)
గన్నవరపు సుబ్బరామయ్య
ఆంధ్ర శేషగిరిరావు
భాసా సుబ్బారావు
కోటంరాజు పున్నయ్య
చిల్రావూరి యజ్ఞేశ్వర చింతామణి
కోటంరాజు రామారావు
జవహర్‌లాల్ నెహ్రూ
దంపూరు నరసయ్య
జక్కీ సాహెబ్
మీర్జా గాలిబు
డి. రామలింగం
దేవరకొండ బాలగంగాధర తిలక్
ఆచార్య కృపలానీ
నాగార్జునుడు
అశ్వఘోషుడు
వి. ఆర్. బొమ్మారెడ్డి
తారానాథ్
సూరి వెంకటేశ్వర్లు
గుడిపాటి వెంకట చలం
యం.యస్.మూర్తి
జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి
ఈదర లక్ష్మీనారాయణ
గార్లపాటి రాఘవరెడ్డి
వానమామలై వరదాచార్యులు
తుమ్మల వెంకట్రామయ్య
క్రొవ్విడి లింగరాజు
చార్లెస్ ఎడ్వర్డ్ రస్సెల్

గద్దే లింగయ్య
కూర్మా వేణుగోపాలస్వామి దంపతులు
నార్ల వెంకటేశ్వరరావు
ట్రాట్స్కీ
గారిబాల్డీ
బోడేపూడి చిరంజీవిరావు
వరవరరావు
అశోక్
లోచన్
కిషన్
ఎక్స్‌రే
ఐ. సంజీవరావు
సుదర్శన్
సుధాకర్
యాదగిరిరావు
కవి చౌడప్ప
చెదలవాడ పిచ్చయ్య
కొమర్రాజు వినాయకరావు
వుప్పల లక్ష్మణరావు
బుచ్చిబాబు (శివరాజు వేంకట సుబ్బారావు)
ఆరవి
సదాశివరావు
కొప్పరపు సుబ్బారావు
బొందలపాటి శివరామకృష్ణయ్య
కాశీ విశ్వనాథం
పింగళి లక్ష్మీకాంతం
ఆమంచర్ల గోపాలరావు
నండూరి విఠల్

బాలగురుమూర్తి
పెండేకంటి వెంకటసుబ్బయ్య
ఎ.జె.కిద్వాయ్
గుంచాల జగన్నాథరావు
వాడ్రేవు పురుషోత్తం
త్రిపురనేని సుబ్బారావు
చింతా దీక్షితులు
అలెగ్జాండర్ బ్లాక్
వ్లాడిమిర్ మాయాకోవస్కీ
బోరిస్ పాస్టర్నాక్
బోదలేర్
రాంబో
స్విన్‌బర్న్
ఎడ్గర్ అలన్ పో
మహాదేవశాస్త్రి
పాలూరి రాజంశెట్టి
కె.ఎన్. కేసరి
మెల్లీ షోయంగర్
స్వెత్లానా
శ్రీపాద గోపాలకృష్ణమ్మ
హబీబూ
మీరా
ఓలేటి బంగారేశ్వర శర్మ
బంకుపల్లి మల్లయ్యశాస్త్రి
పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి
మల్లంపల్లి సోమశేఖరశర్మ
గొగోల్
చెకోవ్

పుష్కిన్
సిమోసెల్
ఇల్యా ఎహ్రెన్‌బర్గ్
ఉన్నవ లక్ష్మీనారాయణ
నిడమర్తి అశ్వనికుమారదత్తు
రెంటాల గోపాలకృష్ణ
మానేపల్లి తాతాచార్య
బెల్లంకొండ రామదాసు
సోమంచి యజ్ఞన్నశాస్త్రి
గిడుతూరి సూర్యం
లియో టాల్‌స్టాయ్
కొండేపూడి
పి.వి. రాజమన్నారు
ఆచార్య ఆత్రేయ
మహీధర రామమోహనరావు
మహీధర జగన్మోహనరావు
మహీధర కృష్ణమోహనరావు
లెనిన్
దర్శి సుభద్రమ్మ
రంగనాయకమ్మ
ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మ
భాస్కర స్వర్ణాంబ
పోరంకి దక్షిణామూర్తి
రెనెవెలక్
జి.వి. సుబ్రహ్మణ్యం
పరవస్తు చిన్నయసూరి
ఏనుగుల వీరాస్వామయ్య
బేతపూడి సుందరరాయుడు
పుదూరి సీతారామశాస్త్రి
గోకుల్‌చంద్
ఓ హ్రెన్రీ
వాకాటి పాండురంగారావు
రాచకొండ విశ్వనాథశాస్త్రి
హేమింగ్వే
పెరల్ ఎస్. బక్
ద్వివేదుల విశాలాక్షి
ఆగ్డన్ కాష్
ఇ.ఇ. కమ్మింగ్స్
బైరాగి పట్నాయకులు
ఆదిపూడి సోమనాథరావు
అయ్యదేవర కాళేశ్వరరావు
కాటూరి రామకృష్ణయ్య
వేదుల సత్యనారాయణశాస్త్రి
భావరాజు నరసింహారావు
గూడూరి నమశ్శివాయ
కరుణశ్రీ (జంధ్యాల పాపయ్యశాస్త్రి)
బండారు అచ్చమాంబ
కొమర్రాజు లక్ష్మణరావు
బండారు మాధవరావు
కొమర్రాజు అచ్చమాంబ
మండవ శ్రీరామమూర్తి
నాళం కృష్ణారావు
కుదీరాంబోస్
మొక్కపాటి నరసింహశాస్త్రి
అద్దేపల్లి నాగేశ్వరరావు
చావలి సూర్యనారాయణ

చావలి గాంధీ
నెల్లూరి శివరామయ్య
పాలగుమ్మి పద్మరాజు
ఆదిభట్ల నారాయణదాసు
కొడవటిగంటి వెంకటసుబ్బయ్య
కొడవటిగంటి కృష్ణమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
కనక్‌ప్రవాసి (చామర్తి కనకయ్య)
బిపిన్ చంద్ర పాల్
గాడిచర్ల హరిసర్వోత్తమరావు
దరిశి చెంచయ్య
విజయలక్ష్మి పండిట్
ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ
నాయని కృష్ణకుమారి
కనుపర్తి వరలక్ష్మమ్మ
వాసిరెడ్డి సీతాదేవి
తెన్నేటి హేమలత
సి. ఆనందారామం
తురగా జానకీరాణి
లీలావతి మున్షీ
ప్రభుజిత్ కౌర్
కె. రామలక్ష్మి
భానుమతీ రామకృష్ణ
ఎన్.జి. ఆచార్య
నెల్లూరి వెంకట్రామయ్య
సురవరం ప్రతాపరెడ్డి
బి.ఎస్.ఆర్. కృష్ణ
మధిర సుబ్బన్న దీక్షితులు

కొత్తపల్లి సూర్యనారాయణ
జయంతి సూరమ్మ
మల్లవరపు సుబ్బమ్మ
గోపిశెట్టి లక్ష్మీనరసమ్మ
అన్నపూర్ణాదేవి
ఓలేటి సూర్యప్రభాదేవి
దేశిరాజు లక్ష్మీనరసమాంబ
పులవర్తి కమలాదేవి
మల్లాది బుచ్చమ్మ
ఆచంట సతీదేవి
కూచి రామలక్ష్మమ్మ
పి. రాజ్యలక్ష్మమ్మ
అట్లూరి వెంకట సీతమ్మ
మువ్వల మైత్రి
తాపీ ధర్మారావు
తాపీ మోహనరావు
మద్దుకూరి చంద్రశేఖరరావు
వెంకట నరసయ్య (చల్లపల్లి దివాను)
తాపీ రాజమ్మ
కోప్రొట్కిన్
అబ్బూరి రామకృష్ణారావు
ఆచంట జానకీరామ్
విశ్వనాథ వేంకటేశ్వర్లు
జానమద్ది హనుమచ్ఛాస్త్రి
నండూరి రామకృష్ణమాచార్య
ముట్నూరి కృష్ణారావు
బెజవాడ గోపాలరెడ్డి
నాయని మోహనరావు

నాయని సుబ్బారావు
కోలవెన్ను రామకోటేశ్వరరావు
అరవిందుడు
రాజాజీ
సర్వేపల్లి రాధాకృష్ణన్
జిడ్డు కృష్ణమూర్తి
సి.పి. రామస్వామి అయ్యర్
కె.యం. మున్షీ
చిట్టూరి శ్రీనివాసరావు
కె. సంపత్ గిరిరావు
మాస్తి వెంకటేశం అయ్యంగారు
ఐ.వి. చలపతిరావు
వేమరాజు నరసింహారావు
దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
కార్యంపూడి నాగేంద్రుడు
రాజాబహద్దర్ వెంకట రామారెడ్డి
రాజా ధనరాజగిర్జీ
మద్దసాని రామిరెడ్డి
అమూల్యశ్రీ
బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి
బి.ఎన్. రెడ్డి
బి. నాగిరెడ్డి
సముద్రాల రాఘవాచారి
కొసరాజు రాఘవయ్య
శ్రీనివాస శిరోమణి
జి. రామబ్రహ్మం
మాదల వీరభద్రరావు
నజ్రుల్ ఇస్లామ్

హరీన్ ఛటోపాధ్యాయ
గుర్రం జాషువా
దోనేపూడి రాజారావు
డాంటే
బ్యాట్రిస్ పోర్డీనారీ
పెట్రార్క్
లారా
సిడ్నీ
స్టెల్లా
షేక్స్పియర్
ప్యానీబ్రౌన్
కాట్స్
షెల్లీ
హారియట్‌గ్రోవ్
ఎమీలియా విపియాసి
మిసెస్ విలియమ్స్
భైరన్
బ్రౌనింగ్
స్విన్‌బర్న్
నండూరి సుబ్బారావు
తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి
భూసురపల్లి వేంకటేశ్వర్లు
బహుజనపల్లి సీతారామాచార్యులు
పాణా కనకమ్మ
రాయప్రోలు సుబ్బారావు
కె.ఎల్.నరసింగరావు
వి.ఎస్. రమాదేవి
గొట్టిపాటి బ్రహ్మయ్య

దిగవల్లి వెంకట శివరావు
యం. ఆర్. అప్పారావు
ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ
గురజాడ రామదాసు
ఆవంత్స సోమసుందర్
చేకూరి రామారావు
సరిపల్లి ద్వారకనాథ్
ముల్కరాజ్ ఆనంద్
నారుకొండ నాగేశ్వరరావు
జగడం లక్ష్మీనారాయణ
ఘట్టమరాజు
మహాదేవివర్మ
భమిడిపాటి అనంతనారాయణ
గోల్డ్‌స్మిత్
డాస్టోవిస్కీ
భారవి
పురాణం సుబ్రహ్మణ్యశర్మ
ఆస్కార్‌వైల్డ్
ఎ.బి.కె. ప్రసాద్
రజనీపామీదత్తు
బెన్‌బ్రోస్లే
అన్నాప్రగడ కామేశ్వరరావు
కారల్ మార్క్స్
మా గోఖలే
కరుణకుమార్ (కందుకూరి అనంతం)
ఆళ్వారుస్వామి
లక్ష్మీకాంతమోహన్
బొల్లిముంత శివరామకృష్ణ
సుంకర సత్యనారాయణ
వాసిరెడ్డి భాస్కరరావు
తురగా వెంకట్రామయ్య
పూడిపెద్ది వెంకటరమణయ్య
ఏల్చూరి సుబ్రహ్మణ్యం
బెలంకొండ రాఘవరావు
దండమూడి కేశవరావు
సి.వి. కృష్ణారావు
పోలూరి ఆంజనేయప్రసాద్
సముద్రాల రామానుజం
దేశిరాజు కృష్ణశర్మ
గంగినేని వెంకటేశ్వరరావు
జె.వి. సుబ్బారావు
గాజుల లక్ష్మీనర్సుసెట్టి
హార్లే
మునిమాణిక్యం నరసింహారావు
టంగుటూరి శ్రీరాములు
టంగుటూరి ప్రకాశం పంతులు
కనుమర్తి శ్రీరాములు
పులుపుల వెంకట శివయ్య
శారద (ఎస్. నటరాజన్)
మానవల్లి రామకృష్ణ కవి
వేటూరి ప్రభాకరశాస్త్రి
వడ్లమూడి గోపాలకృష్ణయ్య
నేదునూరి గంగాధరం
ఆల్డస్ హక్సులే
పండిత తారానాథ్

కుమారన్ ఆసన్
ఉల్లూర్ పరమేశ్వర అయ్యర్
వల్లథోల్ నారాయణ మీనన్
జి. శంకర కురూప్
కొంపెల్ల జనార్థనరావు
పృధ్వీరాజ్‌కపూర్
బలరాజ్ సహానీ
రవిశంకర్
ఎస్.ఎ. డాంగే
పి.సి. జోషి
కోగంటి గోపాలకృష్ణయ్య
కోగంటి అచ్యుతరామయ్య
కోగంటి వెంకమ్మ
మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
గోటేటి జోగిరాజు
జి.వి.కృష్ణారావు (గవిని వెంకట కృష్ణారావు)
పళ్లెపూర్ణ ప్రజ్ఞాచార్యులు
వ్యాసమహర్షి
కూర్మా వేణుగోపాలస్వామి
జి.ఎన్. రెడ్డి
కొత్త సచ్చిదానందమూర్తి
బాబూ రాజేంద్రప్రసాద్
శివరాణీదేవి
సంపూర్ణానంద్
పోలవరపు శ్రీహరిరావు
నరహరి గోపాలకృష్ణమ్మశెట్టి
జయంతి సూరమ్మ
అయ్యంకి వెంకటరమణయ్య
పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి
భమిడిపాటి కామేశ్వరరావు
మల్లవరపు విశ్వేశ్వరరావు
సరోజినీనాయుడు
అఘోరనాథ్
మేజర్ గోవిందరాజుల నాయుడు
దువ్వూరి వేంకటరమణ శాస్త్రి
కాటన్ దొర
నవగోపాల మిత్తల్
కొడాలి ఆంజనేయులు
అక్కిరాజు ఉమాకాంతం
అనంతపంతుల రామలింగస్వామి
ఆనందగజపతి
ముడుంబై నరసింహాచార్యులు
కొల్లూరి కామశాస్త్రి
మండచిట్టి కామేశ్వరశాస్త్రి
మైసూరు భీమాచార్యులు
నేమాని కోదండ రామయాజులు
రీవా మహారాణి
పూసపాటి రాజకుమారీదేవి
గిడుగు వెంకట సీతాపతి
సత్యవోలు గున్నేశ్వరరావు
కాశీ కృష్ణమాచార్యులు
వావిలికొలను సుబ్బారావు
కూచి నరసింహం
మోచర్ల రామచంద్రరావు
వేదం వెంకట్రాయశాస్త్రి

పురాణం సూరిశాస్త్రి
వెలగా వెంకటప్పయ్య
రాంగేయ రాఘవ్
బాలకృష్ణరావు
వెల్లటూరి స్వామినాథన్
చిట్టా సుందరరామయ్య
కోట సుబ్బారావు
చెరుకువాడ వేంకట నరసింహ సిద్ధాంతి
సమర్థి రంగయ్యసెట్టి
నాగభైరవ కోటేశ్వరరావు
శిష్ట్లా ఉమామహేశ్వరరావు
విరియాల లక్ష్మీపతి
వేమూరి విశ్వనాథశర్మ
న్యాపతి సుబ్బారావు
గురజాడ శ్రీరామమూర్తి
రెంటాల వెంకట సుబ్బారావు
వల్లూరి సూర్యనారాయణరావు
పి. శ్రీరాములు
పండితారాధ్యుల నాగేశ్వరరావు
కప్పగంతుల సత్యనారాయణ
బోయి భీమన్న
జి.వి.శేషయ్య
యండమూరి సత్యనారాయణ
యార్లగడ్డ బాలగంగాధరరావు
మల్లాది సత్యలింగనాయకర్
విహారిలాల్ చక్రవర్తి
ముఖ్దూం
భవానీప్రసాద్ మిశ్రా

పీశుపాటి వెంకటరమణయ్య
ప్రతాప్ గిర్జీ
దాశరథి రంగాచార్య
అయ్యదేవర కాళేశ్వరరావు
మాడపాటి హనుమంతరావు
రావి నారాయణరెడ్డి
పుచ్చలపల్లి సుందరయ్య
బాలాంత్రపు నళినీకాంతరావు
యూజివ్ పాటియర్
రాజా వాసిరెడ్డి శ్రీరామగోపాలకృష్ణ
మహేశ్వర ప్రసాద్
గూడూరి వియ్యన్న
విక్రమదేవ వర్మ
నళినీ మోహన్
వఝ్ఝల చినసీతారామస్వామి శాస్త్రులు
మల్లిక్
సెట్టి ఈశ్వరరావు
అల్లసాని పెద్దన
కూచిమంచి జగ్గకవి
శేషం వెంకటపతి
చేమకూర వేంకటకవి
కవికొండల వెంకటరావు
డబ్ల్యు. హెచ్. ఆడెన్
థామస్
టి.యస్. ఇలియట్
స్టీఫెన్ స్పెండర్
జార్జి బాకర్
బుర్రా సుబ్రహ్మణ్యం

ధనికొండ హనుమంతరావు
జరుక్ దేవయ్య
చాగంటి సోమయాజులు
తుమురాడ సంగమేశ్వర శాస్త్రి
కృత్తివెంట పేర్రాజు
గంజాము వెంకటరత్నం
బాదం వెంకటరత్నం
పిళ్ళారిసెట్టి నారాయణరావు నాయుడు
మాచిరాజు దేవీప్రసాద్
మీసరగండ మునిరామాచార్యులు
తరిమెల నాగిరెడ్డి
నీలం రాజశేఖరరెడ్డి
స్టాలిన్
అడవికొలను సూర్యారావు
దువ్వూరి సాంబమూర్తి
అధికార్ల సూర్యనారాయణరావు
గంటి సూర్యనారాయణ శాస్త్రి
చంద్ర రాజేశ్వరరావు
కె.ఎల్. నరసింహారావు
ప్రకాశచంద్ర శతపథి
గజ్జల మల్లారెడ్డి
వడ్డాది సుబ్బారాయుడు
కామరాజుగడ్డ శివయోగానందరావు
కొడాలి సుబ్బారావు
వారణాసి శ్రీనివాసరావు
మామిడిపూడి వెంకట రంగయ్య
బెళ్ళూరి శ్రీనివాసమూర్తి
కొచ్చెర్లకోట వెంకట కృష్ణారావు
కొత్తపల్లి సూర్యారావు
ధరణీప్రగడ శివరావు
ఎన్. మూర్తిరాజు
గురుభాగవతుల ధర్మారావు
బుర్రా శేషగిరిరావు
నారాయణ తీర్థులు
తెలికిచర్ల వెంకటరత్నం
సజ్జాద్ జహీర్
హిరేన్ ముఖర్జీ
నాయని రంగారావు
రావిచెట్టు రంగారావు
దుగ్గిరాల రాఘవచంద్రయ్య
భోగరాజు నారాయణమూర్తి
వేలాల సుబ్బారావు
కేతవరపు వెంకటశాస్త్రి
ఎ.వి. నరసింహం
బలిజేపల్లి లక్ష్మీకాంతం
వడ్డాది సీతారామాంజనేయులు
దామోజీపురపు వెంకటనరసింహారావు
మద్దూరి అన్నపూర్ణయ్య
ఓలేటి పార్వతీశం
నడకుదుటి వీరరాజు
కొవ్వూరి చంద్రారెడ్డి
అయ్యగారి నారాయణమూర్తి
బంకించంద్ర చటర్జీ
పాంచకడే దేవ్
నగ్నముని (మానేపల్లి హృషీకేశవరావు)
నిఖిలేశ్వర్ (కె. యాదవరెడ్డి)

జ్వాలాముఖి (ఆకారం వీరవెల్లి
రాఘవాచార్యులు)
చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి)
భైరవయ్య (మదన్‌మోహన్ సహాయ్)
మహాస్వప్న (కమ్మిసెట్టి వెంకటేశ్వరరావు)
నాంపల్లి పాండు
జంగాల చిట్టి
కంచికచర్ల కోటేశు
ఎడమనూరి యశోద
అద్దేపల్లి లక్ష్మణస్వామి
జొన్నలగడ్డ సత్యనారాయణ
చెలికాని లచ్చారావు
వంగూరి సుబ్బారావు
దేవరాజు వెంకట కృష్ణారావు
భాగవతుల నృసింహశర్మ
యం.కె. సుగమ్‌బాబు
కమలాకాంత్
కిరణ్‌బాబు
వోల్గా
దేవీప్రియ
మల్లంపల్లి కృష్ణారావు
క్రిస్టఫర్ కాడ్‌వెల్
సుబ్బారావు పాణిగ్రాహి
చలసాని ప్రసాద్
హోమర్
మహారాజ శ్రీరామచంద్రదేవ్
రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు
రావు రామకృష్ణ రంగారావు

కోదాటి రామకృష్ణారావు
కోదాటి వెంకటేశ్వరరావు
ఎస్.బి. రామానుజాచార్యులు
షబ్నవీసు వెంకటరామ నరసింహారావు
అక్కినేపల్లి జానకీరామారావు
వీరన్న శ్రేష్ఠి
పింగళి సూరన
నండూరి రామమోహనరావు
కె. రామమోహనరాయ్
'చందమామ' రామారావు
చార్లెస్ డికెన్స్
నాగళ్ళ గురుప్రసాదరావు
పుట్టపర్తి నారాయణాచార్యులు
జేమ్స్ హెచ్. కజిన్స్
త్రిపురనేని రామస్వామి చౌదరి
కడప కోటిరెడ్డి
అరవిందఘోష్
టి.సి. కైలాసం
కొమ్మూరి సాంబశివరావు
కొమ్మూరి వెంకటసుబ్బమ్మ
రమణ మహర్షి
మైకేల్ మధుసూదన దత్తు
ఈశ్వరచంద్ర గుప్తా
సురేంద్రనాథ్ గంగూలీ
మృణాళినీదేవి
రమేశ్‌చంద్రదత్
కాజా నజ్రుల్ ఇస్లాం
జవహర్‌లాల్ నెహ్రూ

| | |
|---|---|
| పియర్‌చంద్ మిత్ర (టేక్ చంద్ ఠాకూర్) | శివలింగం |
| రాధానాధ్ సిక్థర్ | కువలై కణ్ణన్ |
| అనటోల్ ఫ్రాన్స్ | మధురాంతకం రాజారాం |
| ఎమిలీజోలా | మహాశ్వేతాదేవి |
| భగవతీ చరణ్‌వర్మ | బిర్సముండా |
| ఎస్. సదాశివ | అల్లూరి సీతారామరాజు |
| కొండా వెంకటప్పయ్య | విజన్ భట్టాచార్య |
| దాసు నారాయణరావు | నవారుణ్ భట్టాచార్య |
| కమలాకర వెంకటాద్రి | అసిత్ గుప్తా |
| కాంచనపల్లి కనకాంబ | వెన్నెలకంటి సుబ్బారావు |
| గుడిపూడి ఇందుమతీదేవి | సరళాదాసు |
| దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ | జగన్నాధదాసు |
| కొండా పార్వతి | ధనంజయ భంజ |
| ఉన్నవ లక్ష్మీబాయమ్మ | లోకనాధ విద్యాధరుడు |
| ఈశ్వరచంద్ర విద్యాసాగర్ | ఉపేంద్ర భంజ |
| గోవిందరాజులు నాయుడు | గోపీనాధ మొహంతీ |
| ఎ. సత్యమూర్తి | శీతాకాంత మహాపాత్ర |
| పోలవరపు రామబ్రహ్మము | మనోజ్‌దాస్ |
| కుందుర్తి నరసింహారావు | ఫకీర్ మోహన్ సేనాపతి |
| బొడ్డు బాపిరాజు | జాన్ బీమ్స్ |
| హోరెస్ హెమన్ విల్సన్ | రామనాథరాయ్ |
| మేక్స్ ముల్లర్ | కె.యం.వి.జి. కృష్ణమూర్తి |
| మోనియర్ విలియమ్స్ | సి. విజయశ్రీ |
| బోట్లింగ్ | సురభి మాధవరాయలు |
| రుడాల్ఫ్ రోథ్ | కామినేని యెల్లారెడ్డి |
| జాన్సన్ | పూసపాటి తమ్మ భూపాలుడు |
| గ్విన్ | ముస్టిపల్లి సోమభూపాలుడు |
| దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ | గోపాలరాయలు |

వత్సవాయ బలభద్ర జగపతి
దామెర్ల వెంగభూపాలుడు
రావు రాయడప్ప రంగరాయ నృపాలుడు
బలారి సింహ నరసింహ రాజసింహుడు
రాజా బహిరీపామ నృపాలుడు
వెంకటాద్రి అప్పారాయ
రాజామృత్యుంజయ నిశ్శంక బహద్దరు
రాజా కలిదిండి రామరాజు
రాజా కృష్ణారావు
చినవేంకట రాయణిం
రాజా పార్థపారథి నాయనిం
మంత్రిప్రగడ భుజంగరావు
గోడేచిట్టి జానకయ్యమ్మా గజపతిరావు
భాగ్యలక్ష్మమ్మదేవి
కందుకూరు మహాలక్ష్మమ్మ
రావు రామాయమ్మ
ఆదిలక్ష్మి దేవమ్మ
మన్యం మహాలక్ష్మి
రావు రామాయమ్మారావు
వత్సవాయ వెంకట లక్ష్మాయమ్మ సర్దేశాయి
రాణీ లచ్చమ్మా రావు
రాణీ సరళాదేవి
గోపి
అధికార్ల సూర్యనారాయణ
జనరీ ద బాల్జాక్
ఫ్రెడరిక్ ఏంగిల్స్
హెన్సీ జేమ్స్
మార్సెల్ ఫ్రాస్ట్

ఆల్టస్ హగ్జల్
శ్రీపాద కామేశ్వరరావు
జయంతి గంగన్న
టేకుమళ్ల కామేశ్వరరావు
పిలకా గణపతిశాస్త్రి
అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి
ఐలావజ్ఝుల సూర్యప్రకాశశర్మ
ఖాజా అహమ్మదుల్లాఖాన్
అళియ రామరాజు
ఏలూరి లక్ష్మీనరసింహం
రావాడ సత్యనారాయణ
ఆదిరాజు వీరభద్రరావు
చిదిరెమఠం వీరభద్రశర్మ
అనుముల
పెండ్యాల
కప్పగంతుల
చెలమచర్ల
డి.చంద్రశేఖర్
సత్తిరాజు సీతారామయ్య
రాయసం వెంకటశివుడు
సత్యవోలు గున్నేశ్వరరావు
కల్లూరి వెంకట రామశాస్త్రి
లంకా సూర్యనారాయణ
మనోజ్ బసు
ఆలపాటి రవీంద్రనాథ్
ఆలూరి భుజంగరావు
ప్రకాశరావు
శివం

శ్రీనివాసరావు
చౌడీశ్వరీదేవి
వెంచాశా
కొప్పరపు సుబ్బారావు
పోతన
వేమన
గోపన్న
పుసులూరి సోమరాజు
అన్నమయ్య
కబీరు
సూరదాస్
తులసీదాస్
మీరాబాయి
నమ్మాళ్వార్
పెరియాళ్వార్
తొండర డిప్పొడి యాళ్వార్
గోదాదేవి
త్యాగరాజు
జగన్నాథ పండితుడు
వల్లభాచార్యులు
రామానుజాచార్యులు
బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు
నడింపల్లి వెంకటలక్ష్మీ నరసింహారావు
బొడ్డుపల్లి సోమయాజులు
కల్లూరి సుబ్బారావు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
పప్పూరి రామాచార్యులు
బళ్ళారి రాఘవ
దుగ్గిరాల బలరామకృష్ణయ్య
బోడే నారాయణరావు
బాలగంగాధరతిలక్
అనీబిసెంట్
ఆవుల సాంబశివరావు
త్రిపురనేని శకుంతలా గోపీచంద్
యం. పెరుమాళ్లు
తారాశంకర్ బందోపాధ్యాయ
బిభూతి భూషణ్
మాణిక్ బెనర్జీ
లు–షూన్
అబ్బూరి వరదరాజేశ్వరరావు
కాళూరి వ్యాసమూర్తిశాస్త్రి
వల్లంపాటి వెంకటసుబ్బయ్య
ప్రసాదరాయ కులపతి
రాజారావు
కొత్తపల్లి రవిబాబు
రఘుపతి వెంకటరత్నం
తారకం
దేవులపల్లి శివశంకరశాస్త్రి
కప్పగంతుల రాజేశ్వరి
ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
పింగళి వెంకట కృష్ణారావు
యర్రమిల్లి లక్ష్మీనారాయణ
రుడ్యార్డ్ కిప్లింగ్
మయాం జెలాన్
డేనియల్ జె. బూర్స్టిన్
ఎ.యస్. బ్యాట్

క్రిస్టోఫెర్ సెర్ఫ్
షెర్బీ పూటి
వర్టన్ గ్రెగోరియన్
ఎడ్మండ్ మోరిస్
జాన్ రిచర్డ్సన్
ఆర్థర్ స్కెల్సింగర్
జూనియర్ విలియమ్ స్టిరాన్
గోరెవిడాల్
జేమ్స్ జాయిస్
బెనెట్ సెర్ఫ్
స్కాట్ ఫిట్జరాల్డ్
వ్లాదిమిర్ నబకోవ్
ఆల్డస్ హక్లీ
చంద్రధర్ శర్మ గులేరీ
కిషోరిలాల్ గోస్వామి
బృందావన్ లాల్ వర్మ
జయశంకర ప్రసాద్
రాజా రాధికారమణ్ ప్రసాద్ సిన్హా
విశ్వంభరనాథ్ శర్మా కౌశిక్
జైనీంద్రకుమార్
యశ్పాల్
అజ్ఞేయ
భగవతీచరణ్వర్మ
ఉపేంద్రనాథ్ 'అశ్క్'
ఫణీశ్వరనాథ్ 'రేణు'
ద్విజేంద్రనాథ్ మిశ్ర 'నిర్గుణ'
భీష్మసహానీ
కృష్ణసోబతీ
కృష్ణ బలదేవ్వైద్
రామ్కుమార్
కమల్జోషీ
లక్ష్మీనారాయణ్లాల్
హరిశంకర్ పరసాయీ
మోహన్ రాకేశ్
అమర్కాంత్
ఉషాప్రియంవద
మన్నూ భండారీ
నిర్మల్ వర్మ
మార్కండేయ
రాజేంద్రయాదవ్
కమలేశ్వర్
శేఖర్ జోషీ
శివప్రసాద్ సిన్హా
ధర్మవీర్ భారతి
రఘువీర్ సహాయ్
మనోహర్
శ్యామ్జోషీ
శైలేష్
మటియానీ
భైరవ్ప్రసాద్
శ్రీకాంత్వర్మ
మహేంద్రభల్లా
జ్ఞానరంజన్
కాశీనాథ్ సింఘ్
రవీంద్ర కౌలియా
కామ్తానాథ్

సుధా ఆరోరా
రమేష్‌బక్షీ
ప్రబోధ్‌కుమార్
విజయచౌహాన్
చలసాని ప్రసాదరావు
విష్ణు సఖారామ్ ఖాండేకర్
విష్ణు వామన్ శిర్వాడ్కర్
శ్యామ్ బెనగల్
ఇస్మత్ చొగ్తాయి
అమృతలాల్ నాగర్
స్టాన్లీ బాల్డ్విన్
లాలాలజపతిరాయ్
రుడియార్డ్ కిప్లింగ్
శివచంద్రశర్మ
అసిత్‌కుమార్ హాల్దార్
సురభి మాధవరాయలు
కామినేని యెల్లారెడ్డి
పూసపాటి తమ్మభూపాలుడు
గోపాలరాయలు
వత్సవాయ బలభద్ర జగపతి
దామెర్ల వెంగళ భూపాలుడు
రావురాయడప్ప రంగరాయ నృపాలుడు
నరసింహ రాజసింహుడు
వెంకటాద్రి అప్పారావు
పూసపాటి వీరపరాజు
కొచ్చెర్లకోట వేంకట రామచంద్ర కృష్ణారావు
చినవేంకట రాయుడు
పార్థసారథి నాయుడు
కొడవటిగంటి వెంకటసుబ్బయ్య
ప్రతాపరుద్రుడు
మాచలదేవి
బెండపూడి అన్నయ
అబ్దుల్ రజాక్
సి.వి. (సి. విజయలక్ష్మి)
తేరాల సత్యనారాయణశర్మ
మట్టారెడ్డి
జనమంచి శేషాద్రిశర్మ
అవధానము కృష్ణముని
మానవల్లి రామకృష్ణకవి
కొర్లపాటి శ్రీరామమూర్తి
గడియారం రామకృష్ణశర్మ
కె.బి. కృష్ణ (కాట్రగడ్డ బాలకృష్ణ)
పట్టాభి సీతారామయ్య
ఎన్.జి. రంగా
ఎ.కె. గోపాలన్
నీలం సంజీవరెడ్డి
కంభంపాటి సత్యనారాయణ
కామరాజు నాడార్
ఆచార్య వినోభాభావే
సన్యటు సేన్
వెన్నెలకంటి రాఘవయ్య
పాటూరు సుబ్బారావు
అరవింద ఘోష్
పొణకా కనకమ్మ
బాలసరస్వతమ్మ

వేమూరి లక్ష్మయ్య
చతుర్వేదుల వెంకటకృష్ణయ్య
పట్నం వెంకట సుబ్బారెడ్డి
పొట్లూరు సుబ్బరామయ్య
గండవరపు హనుమంతరెడ్డి
కావ్యకంఠ గణపతిముని
గుంటూరి లక్ష్మీకాంతం
నీలంరాజు వెంకట శేషయ్య
మహాదేవశాస్త్రి
మంత్రిప్రగడ వేంకటరత్నం
రెండవ రామ్‌సెస్
లింగం వీరభద్రయ్య చౌదరి
శ్రీనివాసాచారి
ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం
శ్రీపాద కామేశ్వరరావు
బేకన్‌దొర
పాలకోడేటి సూర్యప్రకాశరావు
మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవి)
బూదరాజు రాధాకృష్ణ
కొసరాజు లక్ష్మయ్య చౌదరి
మాస్టర్ సి.వి.వి.
కొత్త రామకోటయ్య
గొట్టిపాటి సుబ్బయ్య
జమదగ్నిశర్మ
రావి నారాయణరెడ్డి
కొండా వెంకట రంగారెడ్డి
మందుముల నరసింహారావు
మందుముల రామచంద్రరావు
వి.బి. రాజు
సతేంద్రదత్తా
డేవిడ్ గుల్టినోవ్
కొత్తపల్లి వీరభద్రరావు
ప్రతిమాదేవి
మాయాకోవ్‌స్కీ
అలెగ్జాండర్ బ్లాక్
ఒసిప్ మాండల్‌ష్టామ్
అన్నా అఖ్మటోవా
సెర్గీ పసినిన్
ఆంద్రేఖేలీ
బ్రెయసోవ్
బోరిస్ పాస్టర్ నాక్
గుంటూరి శేషేంద్రశర్మ
నార్ల చిరంజీవి
ఆదిరాజు వీరభద్రరావు
ఖండవల్లి లక్ష్మీరంజనం
బిరుదురాజు రామరాజు
కమలాదేవి చటోపాధ్యాయ
జయప్రకాశ్ నారాయణ్
అచ్యుత పట్వర్ధన్
సిడ్నీ వెబ్
యస్.పి. త్రిపాఠి
రుస్తుమ్ శాటిన్
జాన్‌స్ట్రాచీ
పామీదత్

కాళీపట్నం కొండయ్య
కాసు బ్రహ్మానందరెడ్డి
కొంగర జగ్గయ్య
సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి
పురిపండా వెంకటస్వామి
జయంతి సుబ్బారావు
జయంతి వెంకటలక్ష్మి
ఎ.ఎం. ఇక్బాల్
యర్రా సూర్యారావు
పిసుపాటి వేంకటరమణయ్య
ఎం.జి. జోనియన్ డూబ్రియల్
డగ్లర్ బారెట్
ఎడ్వర్ గాస్
మిస్ మరియమ్ నల్లావికా
ఫ్రెడ్రిక్
ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ
విస్టన్‌స్ట్రాచ్
విక్టోరియా మహారాణి
జి.వి.వి. సత్యనారాయణ
కోనేరు నారాయణరావు

పి. లలితాజోషి
వాసిరెడ్డి సత్యనారాయణ
కొండపల్లి కోటేశ్వరమ్మ
నెల్లూరి సత్యనారాయణ
పరుచూరి శ్రీనివాసరావు
గారపాటి పాండు
సింగంపల్లి అశోక్‌కుమార్
అదృష్టదీపక్
జనరల్ గోర్డోన్
ఆర్.బి. శేషాచార్యులు
శివలెంక శంభుప్రసాద్
గాలి బాల సుందరరావు
ముళ్లపూడి వెంకటరమణ
భోగినేని జనార్ధనరావు
అట్లూరి రామమోహనరావు
మువ్వల స్నేహ
డి. సత్యనారాయణ రెడ్డి
విశ్వేశ్వరరావు
గడ్డెన్న
పి.పి.సి.జోషి
దివికుమార్

# సాహిత్య మరమరాలు

## వాడుక భాష


టాగూర్

"1912 వ సంవత్సరం, డిసెంబరు నెల, రెండవ తేదీని కలకత్తాలో రవీంద్రుణ్ణి చూచాను. గేయ కవిత్వంలో బెంగాల్ ముందంజ వేసింది. రవీంద్రుడు వాడే భాష వ్యవహారికమే. అంటే అందరూ మాట్లాడుకునే భాష. ప్రామాణిక గ్రంథ ప్రయోగాలకు విరుద్ధమైన భాష. వ్యాకరణ సూత్రాలు కాదంటూ, ఈ రకమైన బెంగాలీ భాషను ప్రయోగిస్తాడని ఆయనను పండితులు నిందిస్తారు.

'తెడకారి తెచ్చె' అనే పద ప్రయోగం మీద రవీంద్రునికీ, నాకూ సంభాషణ జరిగింది. ఆయన కొద్దిసేపాలోచించి, పూర్వ కవుల ప్రయోగాలలో వుందని చెప్పారు. 'తె' అనేది జానపదుల భాషలో కనిపిస్తుందని నేను సూచించాను.

ఆంగ్లసారస్వత బోధనా పద్ధతులు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని వారి అభిప్రాయం. ఆంగ్లసాహిత్యంపై హెన్రీ – మోర్లే ఇచ్చిన ఉపన్యాసాలను, రవీంద్రుడు ఎంతో ఆహ్లాదంతో విన్నారు. విద్యార్థులకు పరీక్షలు చాలా ఆవశ్యకాలని వారి మతం.


సిస్టర్ నివేదిత ఆయన కథలను కొన్నింటిని అనువదించింది. కాని ఆమె చనిపోయిన తరువాత ఆ వ్రాత ప్రతులు కనిపించలేదు.

'మైకేల్'ను రవీంద్రుడు అనుసరించారు. ఆయన గీతంలోని పాదం ఏ పాదానికా పాదం అంతం కావు. ప్రయోగాలనూ, వ్యాకరణ నియమాలనూ, కాలదన్ని సరికొత్తవి శబ్ధ రూపాలను కల్పించినా, ఆయన సృష్టించిన 'శబ్ధాలు' చలామణిలోకి రాలేదు. అందుచేత మన వెనకాల ఒక టిప్పణి వుంటేకాని, కావ్యం అర్థం కాదు. ఆయన 'మైకేల్' అనే కావ్యం శబ్ధాలంకారాలనే దృష్టిలో పెట్టుకున్నారు. ఈ విషయాన్ని నేను రవీంద్రునికి సూచించాను."

**– గురజాడ అప్పారావు**

* * *

# నవలా ప్రక్రియ



ప్రేమచంద్

"నేను ప్రేమచంద్‌ని గురించి చాలా ముందే వినటం తటస్థించింది. వారి రచనలను 1915 లోనే చదివాను. వారిని ప్రత్యక్షంగా చాలా తరువాత కానీ కలుసుకోలేకపోయాను. ఆయన రచనా శైలి అసమానమైనది. కాని ఆ శైలే ఆయనలోని లోపంగా ఆనాటి విమర్శకులు, హిందీ, ఉర్దూ భాషలలోని పండితులు పరిగణించారు. ఆయన జీవితం లాగే ఆయన శైలి కూడా అతి సరళం. ఆయన తన భాషకి బాహ్యాలంకరణలని, కృత్రిమ వేషధారణని చేయాలని ప్రయత్నించ లేదు. ఎక్కువ మంది ప్రజల ఎక్కువ సౌఖ్యానికి (బహుజన హితాయ, బహుజన సుఖాయ) ఆయన రచనలు చేశారు. నేను మళ్లీ 1921 లో ఆయన రచనలు సాధించిన ప్రజాదరణని చూడగలిగాను. ఆయన రచనలు రెవెటియా అనే కుగ్రామంలోని నిరక్షరాస్యులైన పల్లె ప్రజలను కూడా ఆకట్టుకోగలిగాయి.

1920-30 సంవత్సరాల మధ్య కాలంలో సహాయ నిరాకరణోద్యమ సందేశాన్ని ప్రచారం చేయడానికి ఆయన రచనలు తోడ్పడ్డాయి. నేను వారిని 1926 లో కాశీలో కలుసుకున్నాను. ఒక ప్రసిద్ధ ఉర్దూ రచయిత ఆయన వచన రచన 'పూరబ్‌కి బోలి' (తూర్పు దేశ మాండలికం) అని అభ్యంతరం తెలియజేశారు. ఈ పెద్దమనిషి లక్నోలోని గౌరవనీయమైన నవాబు వంశానికి చెందిన వారు. ఆయన కనక నవలలు వ్రాసి వుంటే అల్లా తప్పక ఆయన్ని ఆశీర్వదిస్తాడు! ప్రేమచంద్ ఉర్దూ, హిందీ భాషలను సాహిత్యంలోని నవలా ప్రక్రియకి ఉపయోగించటంలో ప్రథములు. సారనాథ్ సమీపంలోని ఆయన జన్మస్థానంలో నేను ఆయనను చివరసారిగా కలుసుకున్నాను. ఇస్లామిక్ శిల్పకళకి ముందు కాలానికి కాని, ఆ శిల్పకళ ప్రథమ దశకిగాని చెందిన ఒక విగ్రహం తాలూకు శిరోభాగం వారి ఇంట్లో కనిపించింది. ఆ శిరస్సు తాలూకు జుట్టును బట్టి ఆ విగ్రహం కాయస్థులకి సంబంధించినదని గ్రహించగలిగాను. ఆయన పూర్వీకులు ఎవరికైనా సంబంధించింది కావచ్చు. నేను ఆ శిల్పాన్ని ఒక ప్రధానమైన మ్యూజియమ్‌కి పంపించాను. చాపమీద అక్కడ కూర్చున్నప్పుడు అదే ఆయన ఆఖరి సమావేశం అని ఊహించనైనా ఊహించలేకపోయాను."


**- రాహుల్ సాంకృత్యాయన్.**

* * *

# ఉత్తరాలే ఉత్తమ సాహిత్యం

"మానవేంద్రనాధ్ రాయ్ (ఎం.ఎన్.రాయ్) బేరిల్లీ జైల్లో ఎండలకు తట్టుకోలేక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. జైలు నుండి నెలకు ఒక ఉత్తరం వ్రాసుకోనిచ్చేవారు. అది ఎలెన్‌కు వ్రాసేవాడు. ఆ ఉత్తరాలే ఉత్తమ సాహిత్యంగా కట్టమంచి రామలింగారెడ్డి వర్ణించారు. జైల్లో

ఉన్న ఆరేళ్లలో రాయ్ ఆధునిక విజ్ఞాన శాస్త్రాల్ని మథించాడు. తన అభిప్రాయాలతో గ్రంథాలు వ్రాశాడు. అవి అన్నీ ఇంకా వెలుగు చూడనే లేదు.



ఎం.ఎన్. రాయ్


జైల్లో వుండగా ఎం.ఎన్. రాయ్ చేసిన రచనల్లో కొన్ని కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి లేఖలు, సర్ సులేమాన్‌కు సమాధానంగా వ్రాసిన వ్యాసాలు, పిల్లి ఆత్మకథ, ఆధునిక విజ్ఞాన శాస్త్రపు తాత్విక ఫలితాలు, పదార్థ విజ్ఞానశాస్త్రం, చైనాలో సంక్షోభం పేర్కొనదగినవి. ఎలెన్ జర్మనీ నుండి, ఫ్రాన్స్ నుండి సాధ్యమైనంత వరకు రాయ్ అడిగిన ఆధునిక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను పంపిస్తుండేది. ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతాల గురించి, హైసెన్‌బర్గ్ తేజకణ సిద్ధాంతం (న్యూ క్వాంటం థీరీ) గురించి ఆకళింపు చేసుకున్న రాయ్ తన సిద్ధాంతాలకు ప్రాతిపదికలు వేసుకున్నాడు.

జైలు నుండి బయటకు వచ్చిన తరువాత ఎం.ఎన్. రాయ్ డెహ్రాడూన్‌లో స్థిరపడినారు. రాయ్ గృహమే ప్రతి యేడూ చర్చా శిబిరం అయ్యేది. అదొక పునర్వికాస కేంద్రంగా మారింది. జాతీయవాదంలోని దోషాల్ని, ఫాసిజంలోని ప్రమాణాన్ని గురించి రాయ్ పుస్తకాలు ప్రచురించాడు."

**- ఎన్. ఇన్నయ్య**

* * *

# ఆదర్శ వీర చరిత్ర




గాంధీజీ

"గాంధీగారు 1920 ప్రాంతంలో మిత్రుల ప్రోత్సాహముతో తమ ఆత్మకథను రాయదలచుకున్నారు. కొన్ని ఆటంకాల వల్ల అది కొన్నాళ్లు ఆగిపోయింది. 1925 లో 'నవజీవన్' అనే గుజరాతీ పత్రికలో వారం వారం ఈ ఆత్మకథ ప్రచురించటం ప్రారంభమైంది. ఆ రోజుల్లోనే 'యంగ్ ఇండియా' పత్రికలో దీని ఆంగ్లానువాదం వెలువడుతుండేది. ఈ ఆంగ్లానువాదాన్ని శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు తెలుగు చేశారు. ఈ అనువాదాన్ని పోలిసెట్టి ఆదినారాయణ గుప్తా గారనే తుమ్మల సీతారామమూర్తిగారి మిత్రుడు, తుమ్మల వారికి చూపించి, దానిని పద్య రూపంలో రచించమని ప్రోత్సహించారు. తుమ్మలవారికా విషయమై ఆసక్తి ఉన్నప్పటికీ అందుకు తగిన శక్తిసామర్థ్యాలు తనకు లేవని సందేహిస్తూ అయిదేళ్లు కాలయాపన చేశారు. చివరకు 1932 అక్టోబరు రెండున గాంధీ జయంతి నాడు పద్యానువాదానికి శ్రీకారం చుట్టారు.

తెలుగువారికి ఒక ఆదర్శ వీరచరిత్ర లభించింది. తెలుగులో ఆధునిక చారిత్రక వీర కావ్యాలకు తుమ్మలవారి రచన మార్గదర్శకమైంది. 'భారతీయులను మహోత్సాహానికి, మహనీయమైన కార్యదీక్షకు బురికొల్పు గ్రంథములలో ఈ యాత్మకథను మించినది ఈ దేశమున, ఈ కాలమున మరి యొండు లేదు' అని కట్టమంచి రామలింగారెడ్డి గారిచే ప్రశంసించబడిన ఆత్మకథ మొదటి భాగాన్ని తుమ్మలవారు 7-2-1934 నాటికి పూర్తి చేశారు. ఇది 'చంద్రిక' అనే పత్రికలో 1934 డిసెంబరు నుండి ధారావాహికగా ప్రచురించబడి 1936 లో ప్రత్యేక గ్రంథముగా వెలువడింది. దీనిని పండితలోకం ఎంతో ఆదరించింది. ఆంధ్ర, మద్రాసు, అన్నామలై విశ్వవిద్యాలయాలు దీనిని పాఠ్య గ్రంథముగా నిర్ణయించాయి. 1939 లో నెల్లూరు వర్ధమాన సమాజ పక్షాన తిక్కవరపు రామిరెడ్డి గారీ కృతిని ఆదరించి, తుమ్మలవారిని ఘనంగా సన్మానించారు. ఇలాగే మరికొన్ని సన్మానాలు జరగడంతో ఆత్మకథను పూర్తిగా పద్యరూపంలో రచించాలని సంకల్పించి 1942 లో మళ్ళీ ప్రారంభించి రెండు, మూడు భాగాలు పూర్తి చేసి అనారోగ్య కారణంగా 1951 జనవరి 26 నాటికి పూర్తి చేశారు."

❋ ❋ ❋

# దూరం



రాయప్రోలు

"ఉస్మానియాలో ఉద్యోగానికి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అప్లికేషన్ వ్రాయించి పడేశాడు. 1921 వేసవిలో ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఆ ఇంటర్వ్యూ బోర్డుకి ఛైర్మన్ నిజామజ్జంగ్. ఆయన ఆక్స్‌ఫర్డ్ ఎమ్మే. ఆయన నన్ను లిటరేచర్‌లో కొన్ని ప్రశ్నలు వేశాడు. శాంతినికేతనం నుండి తిరిగి వచ్చిన రోజులవి. ధైర్యంగా సమాధానాలు చెప్పాను. ఈ ప్రశ్నలు, సమాధానాలు అయ్యాక ఆయన 'మీరు ఆంధ్రదేశం నుండి చాలా దూరం పోయి శాంతినికేతనంలో చదువుకున్నారు. ఉద్యోగానికి కూడా చాలా దూరం వస్తున్నారే!' అని అంటే నేనన్నాను. "మొదటిది నిజమే. రెండోది నాకు దూరం కాదు. నేను తెలంగాణ్యపు బ్రాహ్మణ్ణి. మా పూర్వులు ఇక్కడి నుంచే ఆంధ్రా ప్రాంతం వెళ్లా"రన్నాను. "వాళ్లెందుకు వెళ్లారు ?" అన్నారాయన. "మా వాళ్లంతా వైదికులు. గోవధకు వ్యతిరేకంగా, సహించలేక వెళ్లిపోయినారు" అన్నాను. ఆయన అలాగా అని నవ్వాడు. నాకు ఉద్యోగం ఇచ్చారు. 1922 లో చేరాను."

– రాయప్రోలు సుబ్బారావు

❋ ❋ ❋

# నేను సైతం ఓ రచయితను

“ఆ రోజుల్లో అనిసెట్టి సుబ్బారావు, మాన్సు అనే మారు పేరు గల మాండలిక సుబ్బారావు, అజంతా అనే మారు పేరుగల విశ్వనాథ శర్మ, ఇస్మాయిల్, జి.వి. రమణమూర్తి, వెంకన్నపంతులు వంటి రచయితలూ, విశిష్ట పాఠకులూ నన్ను నా గతం నుండి పారంపర్యం నుండి కర్షక జన సంప్రదాయిక మాంద్యం నుండి మేల్కొలిపారు. ముఖ్యంగా అనిసెట్టి సుబ్బారావు నా చేయి పట్టుకుని గేయ రచనలో మెలకువతో తిప్పాడు. ప్రజాశక్తిలో తొలి గేయం 1948 దీపావళి సంచికలో అచ్చైంది. తర్వాత అభ్యుదయ సంచికలలో మరికొన్ని గేయాలు. ఇంకేం ? శతకోటి లింగాల్లో నేనూ ఒక బోడి లింగాన్నయ్యాను.

శ్రీశ్రీగారు, శ్రీరంగం నారాయణబాబుగారు అప్పుడప్పుడు సాదా మంచు తెరలను చీల్చుకునే ఆదర్శ శిఖరాల వలె లేదా మెరపులవలె, ఇటు కనిపించి అటు మాయమయ్యేవాళ్ళు. ‘ఆరుద్ర’ అనే పేరు గల భాగవతుల శంకర శాస్త్రి విశాఖపట్నం నుండి వచ్చి మిత్రులకు మాకు ‘త్వమేవాహం’ వినిపించేవాడు. ఇట్లా ఎన్నెన్నో ప్రత్యక్ష, పరోక్ష, సూక్ష్మ, స్థూల, వ్యక్తా వ్యక్త ప్రభావాలు జత చేరాయో ఏమో, నేను ఒక రచయితనై, నేనెల్లా రచయితనయ్యాను అని రాయగలిగిన (దుః ?) స్థితికి వచ్చాను.”

**– కె. వి. రమణారెడ్డి**

* * *

# మరణ దుందుభి

“సాహితీ దిగ్గంతులకు ‘దుందుభి’ (1982) నామ సంవత్సరం మరణ దుందుభి అయింది. ప్రఖ్యాత జర్నలిస్టు, రచయిత, ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకుడు గోరా శాస్త్రి (1–5–82); ప్రఖ్యాత కథకుడు, విశాఖ రచయితల సంఘం సభ్యుడు గరిమెళ్ళ సీతారాం (26–9–82); ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడు ఎస్.టి.జి. వరదాచార్యులు (  –11–82); సుప్రసిద్ధ జీవిత చరిత్రల చిత్రకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రెపాటి వెంకట సుబ్బయ్య (1–7–82); దిగంబర కవి, విప్లవ కవి, విరసం వ్యవస్థాపకుల్లో ముఖ్యుడు, ‘బందీనైనా బానిసను కాను మృత్యువునే పరిహసిస్తూ శత్రువునే ఎదిరిస్తా’ అంటూ కలాన్ని కత్తిగా ఉపయోగించిన చెరబండరాజు (3–7–82); తెలుగు వచన కవిత్వాన్ని ఉద్యమ రూపంలో చేపట్టి, ‘ఫీవర్ ఫ్రంట్’ ద్వారా యువ కవులను ప్రోత్సహించి తెలుగు కవిత్వాన్ని తేటతెల్లం చేసిన వచన కవితా పితామహుడు కుందుర్తి (25–10–82); సాహితీ పరిశోధనకు ఓ కొత్తకోణం దారి చూపించి, ఆ అన్వేషణలో బలైపోయిన రీసెర్చి రాక్షసుడు, సి.పి. బ్రౌన్ వారసుడు బంగోరె (31–10–82); సాహితీ భీష్ముడు, గిడుగు వారసుడు, వాడుక భాషావాది, లండన్‌లో తెలుగు వెలుగులు ప్రసరింప చేసిన ‘పులిపంజా’ పురిపండ అప్పలస్వామి (18–11–82) మొదలైనవారు మరణ దుందుభిలో కనుమరుగైనారు.”

**– అనంతం**

* * *

# జీవితం



పఠాభి

"నా జీవితంలో జరిగిన కొన్ని విచిత్రమైన యాదృచ్ఛికాల గురించి తరచుగా నేను ఆశ్చర్యపోతుంటాను. యూంగ్ ప్రవచించిన సింక్రానిసిటీ సిద్ధాంతాన్ని బట్టి అవి కేవలం కాకతాళీయ ఘటనలు కావు. మన జీవితాలను రచించే ఆ పారవ్యూహకుడు (మెటా ప్రోగ్రామర్) వేసిన సంకేతాలివి.

గాంధీజీ నా మూడోయేట నెల్లూరులో మా ఇంట్లో బస చేశారు. పట్టణానికి ఓ కొసన, విశాలమైన ఆవరణలో మా ఇల్లు కొత్తగా కట్టారు. గాంధీజీ దానికి శాంతినికేతన్ అని పేరు పెట్టారు. పెద్ద పెద్ద అక్షరాలతో ఆ పేరును తయారు చేయించి మా నాన్నగారు ఇంటిని అలంకరించారు. ఆ పేరు ప్రభావమేమో కాని, మా పినతండ్రి, నేనూ, మా అప్పచెల్లెళ్ళు ఇద్దరూ పశ్చిమబెంగాల్‌లోని శాంతినికేతన్‌లో చదువుకోవడానికి తర్వాత తర్వాత వెళ్ళాం.

ఇప్పుడు నా జీవనసంధ్యలో, వృద్ధాప్యం మెల్లమెల్లగా నాపైకి పాకుతూ వస్తున్న తరుణంలో ఈ జీవితాన్ని మించిన జీవితం కోసం ఎదురు చూడడంలో నేనేదో ఆనందాన్ని పొందుతున్నాను. జీవన సౌందర్యాన్ని మించిన జీవితాతీత సౌందర్యం వైపు వేలు చూపిస్తోంది.

"పాషాణాలలో పవిత్ర మత సూక్తులున్నాయి, పరుగులు తీసే సెలయేళ్ళలో పవిత్ర గ్రంథాలున్నాయి!"

నిజమైన గురువు ప్రకృతి మాత్రమే. అక్కడ నుంచీ ఈ జీవితంలో మనకు ఉపయోగపడే ఎన్నో బోధనలు మనం అందుకోగలం. జీవితం నాకేం బోధించిందన్న మొదటి ప్రశ్నకే తిరిగి వస్తే నే చెప్పగలిగింది ఒక్కటే. అది తప్పకుండా నాకు ఎన్నో బోధించి వుండవచ్చు. కాని, దురదృష్టవశాత్తూ అవేమిటో నాకు తెలీవు."


– పఠాభి

* * *

# దాడి

"గిడుగు వారు గ్రాంథికులు అందరి మీద, ముఖ్యంగా ప్రశస్తులైన వారి మీద దాడి సాగించారు. ఇంగ్లీషు రాని వారి మీద మరీ దూకుడుగా వచ్చారు. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి మీదికి ఘాటుగా దూకారు. శ్రీపాదకు, చెళ్లపిళ్లకు వివాదం రేగి, చాలా దూరం వెళ్ళింది. ఆ వివరాలు ప్రస్తుతాలు కావు. కాని ఒక విషయం చెప్పక తప్పదు. శ్రీపాద వారి కావ్యస వ్యాకరణాది దోషాలను చెళ్ళపిళ్ళవారు యెత్తి, సేకరించి గిడుగు వారికి అందజేయడం, అవి

గిడుగువారు వారి విమర్శల్లో వాడటం జరిగిందని పండితలోకం యెరుగును. అంతేకాక వ్యావహారికముపై తమకు వ్యతిరేకత లేదని చెళ్ళపిళ్ళవారు చాటుటకై కొన్నివ్యాసములను వ్యావహారిక భాషలో వ్రాసిరి. ఈ రాజీ, శ్రీపాద వారి మీద గల వ్యతిరేకతను పురస్కరించుకొని, గిడుగువారికి, చెళ్ళపిళ్ళవారికి కుదిరినది. ఇది సాహిత్య వీధుల్లో రాజీ. రాజకీయాల్లోని రాజీనే ఎరుగుదుంగాని, సాహిత్య రంగంలో వీటిని ఎరగము! కాని జరిగే కుట్రలకు సాహిత్యం మాత్రం అడ్డు తగులుతుందా ?



గిడుగు

అట్టి గిడుగును గూర్చి శాస్త్రిగారు తమ 'ఆంధ్రాభ్యుదయం'లో "గిడుగు రామమూర్తి వడిగల పిండంబు" అని "తెల్గు గ్రంథముల బఠించి సాహితి విధంబది యెంతయు సంగ్రహించి" అని "అచ్చు పడియున్న గ్రంథములన్నియు గొని చదివి యందలి దోషములే సంగ్రహించి యున్న వాడుగా వున్ననవిన్నన్ని యనుచు జెప్పు నా రామమూర్తి విశేషధిషణ" అని వ్రాశారు.

వాదోపవాదములు చాలాకాలం రేగి, చాలా దూరం సాగినవి. 'కళాప్రపూర్ణ' త్రిపురాన సూర్య ప్రసాదరాయ కవి, తమ మాతృభాషా సందేశంలో, శ్రీపాదవారిని వారిస్తూ, తమ బృహద్గ్రంథ నిర్మాణానికి ఈ అవరోధాన్ని కల్పించుకోవద్దు అంటూ, "గ్రామ్య పిచ్చుక గొంతుగోయ వజ్రాయుధమేల యెత్తితివయ్యా" అని సర్దుబాటు చేశారు."

**– ఆవుల గోపాలకృష్ణమూర్తి.**

* * *

# స్రవంతి

"ఆ రోజుల్లో హైదరాబాదు రాష్ట్రంలోని భాషలన్నింటికీ హిందీ సంఘం ఒక వేదికగా రూపొందింది. ఏ కార్యక్రమం జరిగినా హైదరాబాదులోని వివిధ భాషలకు చెందిన ప్రముఖ రచయితలంతా దానిలో పాల్గొనేవారు. వివిధ భాషల కవి సమ్మేళనాలు, సాహిత్య గోష్ఠులు తెలంగాణాతోపాటు మరాఠ్ వాడా, కన్నడ భాషా భాగాలలో గూడా జరుగుతూ వుండేవి. ఏ భాషా క్షేత్రంలో సమ్మేళనం జరిగినా, దానిలో పాల్గొనడానికి ఏ మోటారు వ్యానులోనో కవులు బయలుదేరేవారు. ఆ వ్యాన్‌లోనే కవి సమ్మేళనం ప్రారంభమయ్యేది. శ్రీ దాశరథి, నారాయణరెడ్డి, కాళోజీ, కన్నడ కవి సిద్ధయ్య పురాణిక్, జోషీ మాన్వీ వంటి కవులు గళమెత్తి కవితలు వినిపిస్తుంటే అన్ని భాషలవారూ భాషాభేదాలు మరచి, కవితా రసాస్వాదన చేస్తుండేవారు. జాతీయ సమైక్యత మూర్తీభవించినట్లుండేది. గమ్యస్థానం చేరేవరకూ అంతా మైమరచినట్లుండేవారు.


ఈ సాహిత్య కార్యకలాపాలను ప్రచురించడానికి హిందీ ప్రచార సంఘం ఒక బులెటెన్‌ను ప్రారంభించింది. అప్పటికే తెలంగాణా రచయితల సంఘం ఒక పత్రికను స్థాపించవలెనని

నిర్ణయించినా ఆర్థికస్తోమత లేక వెనక ముందాడుతూ వుండేది. ఆర్థిక బలం ఏ మాత్రం లేకపోయినా, పత్రికా ప్రచురణ భారాన్ని వహించడానికి హిందీ ప్రచార సంఘం ముందంజ వేసింది. స్వామిజీ, రామకృష్ణారావుల ఆశీర్వాదబలం దానికి లభించింది. వై.ఎం.సి.ఎ. ఆవరణలోని మైదానంలో కూర్చుని నలుగురు మిత్రులు 'స్రవంతి'కి రూపకల్పన చేశాము. ఆ మిత్రులలో ప్రముఖులు డాక్టర్ బి. రామరాజుగారు. జయనామ సంవత్సర చైత్రశుద్ధ పాడ్యమినాడు ఉగాది దినాన స్రవంతి మొదటి సంచిక వెలువడింది. శ్రీ దాశరథిగారూ, నేను మొదటి సంపాదకులం. ఆరేడు సంచికలు వెలువడిన తరువాత శ్రీ దాశరథి గారికి ఏదో ఉద్యోగ సంబంధమైన చిన్న చిక్కు రావడం వలన, వారి స్థానే శ్రీ నారాయణ రెడ్డిగారు సంపాదకులైనారు. ఆనాటి నుండి ఈనాటి వరకు 27 సంవత్సరాలు స్రవంతి అవిచ్ఛిన్నంగా నడిచింది. ఈ రోజున కొంచెం ఆలస్యంగా రజత జయంతి పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషదాయకం."

**– వేమూరి ఆంజనేయశాస్త్రి.** (1981)

❋ ❋ ❋

# కమ్మదనం



బైరాగి

"హిందీ 'చందమామ' సంపాదకత్వ బాధ్యత వహించమని మా పినతండ్రి గారైన చక్రపాణి గారి నుంచి ఆలూరి బైరాగికి పిలుపు వచ్చింది. బైరాగి మకాం మద్రాసుకు మారింది. తెలుగు, హిందీ చందమామలలో పిల్లలకు కమ్మని నీతి కథలు గేయ రూపంలో అందిస్తూ వుండేవాడు. ఇక్కడ పని చేస్తుండగానే తన హిందీ కవితా సంకలనం 'పలాయన్' వెలువరించాడు. స్వేచ్ఛాప్రియుడైనందున బైరాగి చందమామ నుండి బయటకు వచ్చాడు. శరపరంపరలుగా అతని గేయాలు 'తెలుగు స్వతంత్ర'లో వస్తుండేవి. 'నూతిలో గొంతుకలు', 'దివ్యభవనం' (కథల సంపుటి) ప్రచురించాడు. తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించాడు. బైరాగికి ధనార్జన పట్ల ఎప్పుడూ ఆసక్తి లేదు.


1949 లో ఓ చిన్న సంఘటన జరిగింది. నేను విజయవాడలో హిందీ ప్రచార శిక్షణా కేంద్రంలో చదువుతున్నాను. ఒకరోజున కృష్ణశాస్త్రిగారిని, శ్రీరంగం నారాయణబాబును ఉపన్యాసకులుగా ఆహ్వానించాము. నా దగ్గర ఉన్న 'చీకటి నీడలు' కృష్ణశాస్త్రిగారికి ఇచ్చాను. శాస్త్రిగారి గంభీరోపన్యాసము మమ్ములను మంత్రముగ్ధులను చేసింది. తెలుగు నుడికారము, తెలుగు కమ్మదనం నా జీవితంలో మొదటిసారిగా చవిచూశాను. 'కొన్ని కొన్ని తెలుగు మాటలు ఉపయోగించాలని అభిలాష ఉన్నా అనుకూలమైన అవకాశం కలగటం లేదని' శాస్త్రిగారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఉదాహరణకు 'చిక్కణ' అనే మాటను చెప్పారు. తరువాత నారాయణబాబు ఉపన్యసిస్తుండగా శాస్త్రిగారు 'చీకటి నీడలు' అక్కడక్కడ చదివారు. నాల్గవ కవరు పేజీలో

లైఫ్‌స్కెచ్ చదివారు. తరువాత ఫలహారం చేస్తూ నారాయణబాబుతో “ఈ బైరాగి ఇంత పిన్న వయస్సులో కమ్మని కవిత్వం వ్రాశాడు. ఒకనాటికి వీడికి కవిగా మంచి స్థానం లభిస్తుంది' అన్న మాటలు తడిక అవతల ఉన్న మా చెవుల పడ్డాయి. శాస్త్రిగారి వాక్కు అక్షరాల యదార్థమైంది.”

**– నన్నపనేని సుబ్బారావు.**

❋ ❋ ❋

# రచయితగానే మిగిలాను



శరత్

“నా ప్రాథమిక విద్యాభ్యాసం, అనగా అక్షరాలు నేర్చుకొనినది గొర్తి నారాయణ మూర్తిగారి దగ్గర. నా జీవనానికి తొలి పునాదిరాయి వారే వేశారు. విద్యలో ఆసక్తి కలిగించింది వారే. జోస్యుల రామస్వామి గారి దగ్గర చిన్ననాడే ఆంధ్రనామ సంగ్రహం, మనుచరిత్ర, ఆంగ్ల భాష అధ్యయనం కూడా చేశాను. నాకు మొదటి నుండి మహా పురుషుల చరిత్ర తెలుసుకోవాలని, వ్రాయాలని కుతూహలం ఉండేది. అందువల్ల మహా పురుషుల చరిత్రలు చాలా వరకు చదివాను. నేను 1915 లో కౌతా శ్రీరామశాస్త్రిగారి వద్ద బెంగాలీ భాష నేర్చుకొన్నాను. ఆ భాష నేర్చుకున్న దగ్గర నుండి అందులో ఉండే మాధుర్యాన్ని చవిచూడాలని ఆతురత అధికమై శరత్ వ్రాసిన పుస్తకాలు తెప్పించి చదివాను. ఇతరులు వారిని గురించి వ్రాసిన గ్రంథాలు కూడా చదివాను. ఆ తరువాత శరత్ గూర్చి తెలుగువారికి అందించాలనే ఆసక్తి వల్ల శరద్దర్శనం వ్రాశాను. ఇంత మంచి రచయితను చదవాలంటే ఆ భాషతో సంబంధబాంధవ్యాలు ఉండాలి గదా, నిజంగా ఇదంతా చేయడానికి మా శాస్త్రిగారి గురుత్వమే ప్రధాన కారణం.

నాకు సాహిత్య ప్రీతి ఎక్కువ, వ్యవసాయ ప్రీతి తక్కువ. నా సాహిత్యం ప్రతి తెలుగు వారి ఇంట పౌరోహిత్యం చేస్తుంది. నా వ్యవసాయం ఏరికోరి చేస్తే కాడి – మేడి దొంగలు ఎత్తుకుపోయినట్లుగా వుంటుంది. ఉదయం, సాయంత్రం పొలం వెళ్ళడం యాంత్రికంగా ఉండేది. రచయితతోపాటు రైతుననిపించుకోవాలని తపన వుండేది కాని అది నా వ్యవసాయాన్ని బట్టి సాధ్యం కాలేదు. చివరకు నేను రచయితగానే మిగిలిపోయాను. నా వృత్తి వ్యవసాయమే అయినా ప్రవృత్తి కలం పట్టడమే!”

**– గొర్రెపాటి వెంకట సుబ్బయ్య**

❋ ❋ ❋

# పురుషార్థప్రదాయని

“మచిలీపట్నంలో ‘పురుషార్థ ప్రదాయని’ పత్రికలను 1872 లో శ్రీ ఉమా రంగనాయకులు నాయుడు గారు జైన సమాజం సంస్థ పక్షాన నడిపారు. ఉమా రంగనాయకులు నాయుడుగారు

దాదాబాయి నౌరోజీ శిష్యులు. ఈ పత్రిక సంస్కరణ పత్రికలలో తలమానికమే కాదు ఆంధ్రదేశములో ప్రథమ సంస్కరణ పత్రిక. వార్తలకు, వ్యాఖ్యలకు, సాహిత్యానికి, జానపద వాఙ్మయానికి, చేతి పరిశ్రమలు, దేశ చరిత్రకు, జీవిత చరిత్రలకు, న్యాయశాస్త్రములకు, శాస్త్ర విషయాలకు – ఇంకా అనేక విషయాలకు ఈ పత్రికలో ప్రాధాన్యత ఈయబడేది. గొప్ప ఆదర్శాలకు, సంఘసంస్కరణలకు, అవినీతి నిర్మూలనకు అనేక విషయాలకు ఈ పత్రిక ప్రాధాన్యత నిచ్చేది. మహాశక్తివంతమైన అఖిల భారత కాంగ్రెసు పార్టీ ఆవిర్భవించక పూర్వమే, దాదాబాయి నౌరోజీ వంటి మహోన్నత నాయకుల శక్తివంతమైన ఉపన్యాసాలను ప్రచురించి జాతీయభావాల ప్రచారానికి ఎంతో తోడ్పడింది.

ఆ రోజుల్లో రెవెన్యూ, జ్యుడీషియల్ మొదలగు అధికార్లంతా ఆంగ్లేయులే. వాళ్ళకు స్థానిక వృత్తాంతాలు, ప్రజల కష్టనిష్ఠూరాలు తెలిపేందుకు ఇంగ్లీషులో కూడా కొన్ని ముఖ్యమైన సంగతులు వ్రాస్తు ఉండేది. తెలుగులో పారిభాషిక పదాలు సృష్టిస్తూ శాస్త్ర విషయాలు ఇందు ప్రచురించేవారు. సంఘసంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగంగారి వ్యాసాలు ప్రారంభ దినాలలో ఈ పత్రికలలో వస్తూ ఉండేవి. ఆనాటికి వీరేశలింగంగారు వారి పత్రిక వివేకవర్ధని ప్రారంభించ లేదు. (వివేకవర్ధని 1874 లో ప్రారంభం.)"

**– మారంరాజు సత్యనారాయణ**

* * *

# విన్నపము


**కందుకూరి**

"మన దేశాభివృద్ధికిప్పుడు పని కావలెను గాని, అది లేని పొడిమాటలు, కావలసి యుండలేదు. మన ఆంధ్రదేశమునందు సాంఘిక, ధార్మిక విషయములలో పని చేయుటకయి, ఏర్పడియున్న సమాజములలో హితకారిణీ సమాజము ముఖ్యమైనదని చెప్పవచ్చును. దాని భరణమునకయి నాకున్న అర్థము నిచ్చితిని గాని అది దాని వ్యయములలో అర్ధమునకయిన చాలదు. ధనాభావము చేత హితకారిణీ సమాజము నూతనారంభమునకు పూనలేకపోవుటయే గాక, ఉన్న వితంతు శరణాలయాదులను నిర్వహించుటకు త్రొక్కట పడుచున్నది. మీ దేశ సేవ యందు కాలము పుచ్చి దయనీయుడనై ఉన్న నేను చేతులు జోడించి వినయపూర్వకముగా మీకు నా కడపటి ప్రార్ధనను చెల్లించి హితకారిణీ సమాజములో సామాజికులుగా చేరి దాని నుద్ధరించి నిరంతరాయముగా నెగడునట్లు చేయుడు. ఈశ్వరుడు మీకు నిరంతర శ్రేయస్సును కలిగించునుగాక! ఓ భక్త వరదా! ఓ దీన రక్షకా దీనుడనైన నేను ఆంధ్రదేశమును సంతతాభివృద్ధి నొందుచుండుదానినిగా చేయ ప్రార్థించుచున్నాను. నా ప్రార్ధనను సఫలం చేయుదువు గాక!

ఇట్లు విన్నవించు విధేయ సేవకుడు

**– కందుకూరి వీరేశలింగము.**

* * *


# చారిత్రక కావ్యాలు

"ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణములో చారిత్రక కావ్యములు పెక్కులు వెలసినవి. ఆర్వేటి కోదండరామరాయల యాశ్రితుడుగు అందుగుల వెంకయ్య రచించిన రామరాజీయము, నరసరావుపేట సంస్థాన కవి దిట్టకవి నారాయణకవి కృతమగు రంగరాయ కదనరంగ చరిత్రము, వల్లూరు సంస్థాన కవి మతుకుమల్లి నరసింహశాస్త్రి ప్రణీతమగు చెన్నపురీవిలాసము, చత్రాతి లక్ష్మీనరస కవి పద్మనాభ యుద్ధము, సంగమ వలస సంస్థాన సన్మానితులు పరవస్తు వెంకట రంగాచార్యుల వారి శ్రీ మన్నిశ్శంక చరితము, వెంకటగిరి సంస్థాన విభూషితులు మండపాక పార్వతీశ్వర శాస్త్రి సంధానించిన రాధాకృష్ణ సంవాదము, పిఠాపురం సంస్థానాస్థాన కవి దేవులపల్లి తమ్మన్న శాస్త్రి సంతరించిన రావు వంశ ముక్తావళి, అమరావతి సంస్థాన కవి అమరవాది రామకవి కైసేసిన వాసిరెడ్డీయము, బొబ్బిలి పండితులు మండలేముల సీతారామశాస్త్రి సంధానించిన బొబ్బిలి వారి వంశావళి, గొడే వారి సమాదరణమున వెలసిన దైవజ్ఞ సార్వభౌమ విజయము, చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి బొబ్బిలి పట్టాభిషేకము పరిగణింపదగినవి."

**– తూమాటి దొణప్ప.**

* * *

# ఎన్నిక


పానుగంటి

"నేను పండితుడనుగానని యీ యూరివారెరుగుదురు. పై గ్రామముల వారెరుగుదురు. నన్నెరిగినంతవర కాంధ్ర దేశమంతయు నెఱుగును. సాహిత్యహీనతలో జగమెఱిగిన వాడను గాని సాధారణుడను గాను. ఇట్టి నన్ను బరిషత్తువా రేల యెన్నుకొన వలయునో నాకు దెలియదు. వెనుక జరిగిన పది పరిషత్సభలకు బండితుల నెన్నుకొంటిమి కదా, యీ సారి యపండితు నెన్ను కొందము. ఇంతలో జెడిపోవునదేమున్నదని యూహించి మార్పు కొఱకై నన్నెన్నుకొనియుందురేమో ? ఎటులైననేమి అవిలంఘ్యమైన మహాజనుల యాజ్ఞ తులసీదళము వలె శిరమున ధరించి యిట నిలువబడితిని..."

**– పానుగంటి లక్ష్మీనరసింహారావు**

(ఆంధ్ర సాహిత్య పరిషత్తు 11 వ వార్షికోత్సవం అధ్యక్షోపన్యాసం, పిఠాపురం మహారాజా భవనంలో)

* * *

# కవిబ్రహ్మ



ఏటుకూరి


"శ్రీ ఏటుకూరి వెంకట నరసయ్యగారు 1935 నుండి పూర్తిగా కవితా వ్యాసంగమున నుపక్రమించిరి. బహుముఖముగా రాణింపగల యుపజ్ఞ వీరి సొత్తు. సంస్కృతమున కాళిదాసున కన్న భవభూతి, వ్యాసుని కన్న వాల్మీకి వీరికభిమాన పాత్రులు. తెలుగున తిక్కన, శ్రీనాధులనిన పంచప్రాణములు. సహజ కవితా ధోరణికి అసాధారణ పాండిత్యము తోడైనది. ఇంకేమి ? రసజ్ఞుల తలలూపించగల శైలి యపూర్వముగా నలవడినది. పూర్వ కవుల పోకడలు వీరి చేతిలో క్రొత్త చెలువము సంతరించుకొన్నవి. వీర భారతము (అలుగురాజు), మగువమాంచాల, నాయకురాలు, అలరాజు రాయబారము, రుద్రమదేవి, క్షేత్రలక్ష్మి, ప్రేమాలోకము, సిద్ధాశ్రమము మున్నగు కావ్యములే కాక ఖండకృతులు, నవలలు, నాటకములు, శతకములు, గేయ కథలు, హరికథలు, సమీక్షలు, అవియివి యననేల ? వీరు స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు.

పెదకూరపాడులో నంకురించి, అమృతలూరిలో నల్లిబిల్లిగ నల్లుకొని, కవిరాజుగారి సూత్రాశ్రమములో గ్రొన్నలల దొడంగి, చిట్టి గూడూరులో పల్లవించి, పుష్పించిన వీర కవితాలత గోవాడలో ఫలప్రాప్తి నొందింది. గుంటూరు సీమ రైతు సంఘము వారు రైతు హరికథా రచనల పోటీ నిర్వహించారు. అందులో వీరి 'రైతు' హరికథకు ప్రథమ బహుమతి లభించింది. ఆ సందర్భమున గోవాడలో జరిగిన సన్మాన సభలో 'కవిబ్రహ్మ' బిరుదాంకితమైన స్వర్ణముద్ర ఇచ్చి నూరారులతో సత్కరించిరి. అప్పుడు శ్రీ ఏటుకూరి వారు – "ఎన్ని పూలదండలైన ధరించెదగాని ఈ నాలుగక్షరములు భరించుటకు నా హృదయము జంకుచున్నది" అని వినమ్రులై పేర్కొనిరి. తదాదిగా వీరభారత రచన కొనసాగినది."

**– కొల్లా శ్రీకృష్ణారావు**

* * *

# యువ ప్రచురణలు




కొడవటిగంటి

"రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు కాలంలో జాతీయోద్యమం, దేశభక్తి భావాల ప్రచారానికీ, సాంఘికాచార సంస్కరణలకూ, ఆధునిక సాహిత్య విధానాలు, చరిత్రపరమూ, సాహిత్యపరమూ అయిన పరిశోధనాంశాల వివరణలకు పత్రికలు కృషి చేసే రోజుల్లో – సంపాదకులు, యాజమానులు అనేక కష్టనష్టాలకు ఓర్చి పత్రికలు నడిపేవారు. అంతటి ఉన్నతాశయాలు లేకపోయినా, ప్రజలలో పఠనాశక్తిని పెంచి, అంతంత మాత్రమే

చదువు నేర్చుకున్న వారు కూడా చదువుకునే విధంగా మరికొన్ని పత్రికలు – చిత్రగుప్త, వినోదిని, రూపవాణి, ఢంకా మొదలైనవి – ప్రచారంలోకి వచ్చాయి. వాటికి కథలు, హాస్యం, సినిమా ప్రధానాంశంగా ఉండేవి.

ఆ రోజుల్లోనే చక్రపాణి, కొడవటిగంటి కుటుంబరావు కలిసి మొట్టమొదటిసారిగా యువతరం కోసం కొత్త తరహా సాహిత్యం – ముఖ్యంగా కథలు, నవలలు – అందించాలనే ఉద్దేశంతో 'ఆంధ్రజ్యోతి' తరువాత 'యువ' అనే మాసపత్రికను, 'యువ ప్రచురణలు' అనే పుస్తక ప్రచురణ సంస్థను నెలకొల్పారు. ఆ రోజుల్లో చిత్రగుప్త, వినోదిని, ఆనందవాణి వంటి పత్రికలలో కథాసాహిత్యస్థాయి నానాటికి దిగజారసాగింది. దానితో వారు సరిపెట్టుకోలేక పోయారు. మరొకవైపు సామాజిక స్పృహ, హేతువాదం, మానవ స్వభావ పరిశీలన గల కథా, నవలా సాహిత్యానికి అప్పుడు 'కృష్ణాపత్రిక' 'ఆంధ్రవారపత్రిక' 'భారతి' 'గృహలక్ష్మి' వంటి పత్రికలలో స్థానం లభించేది కాదు. అందువల్ల అట్టి సాహిత్యాన్ని ప్రజలకు అందచెయ్యడం కోసం వారిద్దరు పూసుకొని, తమ పత్రికలు, ప్రచురణ సంస్థ ద్వారా కృషి చేశారు."

❋ ❋ ❋

# మా ఇల్లు

"వరంగల్‌కు వచ్చిన కవి పండితులు అందరు మా ఇంటికి తప్పక వస్తుండేవారు. మా నాయన గారికి (దేవులపల్లి వెంకటాచలపతిరావుగారు) తెలుగు భాషా సాహిత్యాలు అంటే ఇష్టం. కవి పండితులను ఆదరించేవారు, స్వయంగా కవిత్వం చెప్పేవారు. ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు సోదరులు అప్పుడు తెలుగు పత్రికను మానుకోట తాలూక ఇనుగుర్తి నుండి నడుపుతుండేవారు. కొంతకాలం ఈ పత్రికను వరంగల్ నుండి కూడా నడిపినారు. వరంగల్‌లో వీరు మా ఇంటిలోనే దిగేవారు. శేషాద్రి రమణ కవులలో ఒకరైన దుపాటి వెంకట రమణాచార్యుల వారు కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రతినిధులుగా, జయంతి రామయ్యపంతులుగారి ఆదేశం మీద వరంగల్, కరీమ్‌నగర్ ప్రాంతాల్లోని శాసనాలను, తాళపత్ర గ్రంథాలను సేకరించే నిమిత్తం వస్తుండేవారు. ఎడ్లబండి మీద శాసనాలను, తాళపత్ర గ్రంథాలను వరంగల్ ప్రాంత గ్రామాల నుండి తీసుకొని వచ్చేవారు. మా ఇంటిలోనే వసతి గనుక తీరిక సమయాలలో ఒద్దిరాజు సోదరుల వలెనే, వీరు కూడా నాకు తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేస్తూ, పద్యాలు చదివి వినిపిస్తుండేవారు. సం. సింగరాచార్యులవారు అనే పండితులు జగ్గయ్యపేట వాస్తవ్యులు. వారు కూడా ఎక్కుగా కొన్నాళ్లు వరంగల్ వస్తుండేవారు. భాగవతం ప్రథమ, ద్వితీయ స్కంధాలను, ఏకాదశ ద్వాదశ స్కంధాలను వీరు తెనిగించారు. పోతన వరంగల్ వాస్తవ్యుడై నందున యీ స్కంధాల ప్రచురణ కొరకు ఆర్థిక సహాయం నిమిత్తం వీరు వరంగల్ వస్తుండేవారు అనుకుంటాను. నాలుగు స్కంధాలు పోతన వ్రాసినవి శిథిలములై పోయినందు

వలన, తాము ఈ స్కంధాలను మాత్రమే తెనిగించడానికి పూనుకున్నామని వారు చెపుతుండేవారు. ఆచార్యుల వారు గొప్ప పండితులు, కవులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి సన్నిహితులు. వారి భారతాంధ్రీకరణములో ఆచార్యులవారు తోడ్పడినారని చెప్పేవారు. భీష్మపర్వానికి కాబోలు ఆచార్యుల వారు పీఠిక కూడా వ్రాశారు.”

**– దేవులపల్లి రామానుజరావు.**

❋ ❋ ❋

# శక్తి

“నాటకం మహత్తర శక్తివంతమైనది. పూర్వం గ్రీకులు పర్షియాతో యుద్ధంలో ఓడిపోయి నిస్పృహ చెంది రణరంగం నుంచి పారిపోయి వస్తే, ఒక గ్రీకు నాటక కర్త వీరరస ప్రధానమైన నాటకం రచించి వారి ముందు ప్రదర్శించే సరికి గ్రీకు సైనికులు వీరావేశంతో తిరిగి రణరంగానికి వెళ్ళి పర్షియన్లను ఓడించి తమ దేశ గౌరవాన్ని నిలబెట్టారు.

కూచిపూడి వీధి భాగవతులు, సంబెట గురవరాజు ప్రజలకు పెడుతున్న బాధలను నాటక రూపంలో విజయనగరరాజు వీర నరసింహరాయల ముందు ప్రదర్శించి, గురవరాజును శిక్షింపజేసి, ఆ ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొల్పారు. ఇటువంటి సంఘటనలు పూర్వ చరిత్రలో అనేకం”.

❋ ❋ ❋

# దేశభక్తి

“జాతీయోద్యమ ప్రభావం గుంటూరు నటుల మీద కూడా ప్రసరించింది. శ్రీపతి శీనప్ప జాతీయోద్యమ స్ఫూర్తితో ‘స్వరాజ్యసోపానం’ ప్రదర్శించడానికి పూనుకున్నాడు. శీనప్ప గాంధీ వేషం వేసేవారు. తలపాగా చుట్టుకుని, లాల్చీ వేసుకుని రంగస్థలం మీదికి వస్తే, ముమ్మూర్తులా గాంధీజీలాగా ఉండేవారు. గాంధీజీ వేషం వేయడంలో ప్రసిద్ధి గాంచిన ప్రొఫెసర్ చంద్రశేఖరం వీరి గాంధీవేషం చూసి చకితులైపోయారట! శీనప్పగారు నటిస్తుంటే, గాంధీజీయే ప్రేక్షకుల ముందుకు వచ్చి మాట్లాడుతున్నారా అనేంత సహజంగా ఉండేదట వారి వేషం. సుప్రసిద్ధ స్త్రీ పాత్రధారి శ్రీ జాగర్లపూడి లక్ష్మీనరసింహారావు భారతమాత, సరళాదేవి, ఛౌదురాణి వేషాలు వేసేవారు. గుంటూరు ప్రముఖులు శ్రీ ఏకా ఆంజనేయులుగారు దేశభక్తుడి వేషం, శ్రీ ఇటికాల రామశాస్త్రి దేశ సేవకుడి వేషం, శ్రీ నల్లపాటి జానకిరామయ్య షాకతాలి వేషం వేసేవారు. తర్వాత తర్వాత రాజమండ్రి శ్రీ బ్రహ్మజోస్యుల సుబ్బారావు, బెజవాడ శ్రీ బసవరాజు సుబ్బారావు షాకతాలి వేషం వేసి పేరు తెచ్చుకున్నారు. సుప్రసిద్ధ వేణు విద్వాంసులు శ్రీ వింజమూరి శ్రీనివాసాచార్యులు అనీబిసెంటమ్మ వేషం వేసేవారు. శ్రీ సింగు అనే ఆయన డయ్యరు వేషం వేసి పేరు తెచ్చుకున్నారు. ఈ నటులంతా ఆంధ్రదేశమంతా ఈ నాటకం ప్రదర్శించి, ఎందరినో ఉత్తేజితులను చేశారు. ప్రజలలో దేశభక్తి ఇనుమడింపజేశారు. దాంతో బ్రిటీష్ ప్రభుత్వం

నిషేధాజ్ఞలు జారీ చేసింది. హోస్పేటలో 'స్వరాజ్య సోపానం' ప్రదర్శించబోతుండగా పోలీసులు ప్రదర్శన ఆపివేశారు. ఇంత దూరం వచ్చాం కదా అని నటులంతా నడిబజారులో నిలబడి వేషాలు వేసుకోకుండా ఎవరి పోర్షన్లు వారు చదివి వెళ్లిపోయారు. నిషేధాజ్ఞలు జారీ అయినా, నాటకం ద్వారా దేశసేవ చేయాలనే పట్టుదల మాత్రం సడలలేదు. ఏ హరిశ్చంద్ర నాటకమనో ప్రకటించడం, ఒకటి, రెండు అంకాలు ఆడటం, పోలీసులను అటు వెళ్లనిచ్చి స్వరాజ్య సోపానంలోని రంగాలు ఆడడం ప్రారంభించేవారు."

**– మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి**

*　　*　　*

# మీజాన్



**బాపిరాజు**

"1944 లో నిజాం నవాబు స్నేహితుని అల్లుడైన జి.ఎం.ఎ. కలకత్తావాలా 'మీజాన్' పత్రిక స్థాపించాడు. మీజాన్ పత్రిక ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగు – మూడు ఎడిషన్లు వచ్చేది. మీజాన్ లోగో క్రింద 'స్వాతంత్ర్యము – సమత్వము – సౌభ్రాతృత్వము' అనే ఫ్రెంచి విప్లవం కాలం నాటి ఆశయాలు ఉండేవి. ఉర్దూ ఎడిషన్ హైదరాబాదు నవాబుని, ఇంగ్లీష్ ఎడిషన్ బ్రిటీష్‌వారిని పొగిడేవిగా వుండేవి. ఒక్క తెలుగు ఎడిషన్ మాత్రం తెలంగాణా ప్రజల న్యాయమైన పోరాటాలకు మద్దతు నిచ్చేది. తెలుగు మీజాన్ పత్రికలో వచ్చే వార్తలపైన, సంపాదకుని దృక్పథంపైనా పై నుంచి అదుపు వుండేది కాదు. పత్రిక అమ్ముడుపోవడం, లాభాలు రావడం సంస్థాపకుల దృష్టిలో వుండేది. ఈ వెసులుబాటును చక్కగా ఉపయోగించుకున్నారు అడివి బాపిరాజుగారు తన సంపాదకవర్గ బృందంతో సహా. అడవి బాపిరాజుకు సహాయకులుగా విద్వాన్ విశ్వం, శ్రీనివాసచక్రవర్తి, తిరుమల రామచంద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, బొమ్మకంటి సుబ్బారావు, బి.సి. కామరాజు మొదలగువారు పని చేశారు. వివిధ ఫీచర్లు – 'ధూపదీపాలు' (అడివి బాపిరాజు వ్యంగ్య రచనలు), 'మిర్చి మసాలా' (రాంభట్ల), నర్తనశాల (శ్రీనివాస చక్రవర్తి) 'కలంపోటు' (బి.సి. కామరాజు) 'టైంబాంబు' (బొమ్మకంటి సుబ్బారావు) ఇలా ఎన్నో నిర్వహించారు. సంపాదకునికి లేఖలు, రేడియో కార్యక్రమాలు, 'శృంగాటకం' శీర్షికతో పుస్తక సమీక్ష, సాహిత్య వ్యాసాలు, సీరియల్ నవల, కథలు, టాటా ఎయిర్ లైన్స్ వారి సమయాలు, స్టాక్ మార్కెట్ వివరాలు వుండేవి నాలుగు పేజీలలో. మొదటి పేజీ – జాతీయ, అంతర్జాతీయ వార్తలు, రెండో పేజీలో – సంపాదకీయం, వివిధ ఫీచర్లు, మూడో పేజీలో – సీరియల్ నవల, జాతీయ వార్తలు, నాలుగవ పేజీ – తెలంగాణా వార్తలు వుండేవి. కోస్తా జిల్లాల వార్తలు అక్కడక్కడ వుండేవి."

**– దివి కుమార్**

*　　*　　*

# తుకోవ్‌స్కీ అవార్డు



తస్లీమ నస్రీన్

"మత ఛాందసవాదుల ఫత్వాకు గురైన వారిలో ప్రముఖంగా 1989 లో సాల్మన్ రష్దీ పేరు, 1994 లో తస్లీమా నస్రీన్ పేరూ వినబడుతున్నాయి. మతోన్మాదులు విధించిన మరణ శిక్షలు వీరిద్దరికే కాదు. ముస్లిం దేశాలకు చెందిన రచయితలూ, కళాకారులూ తమ తమ దేశాలు వదిలి విదేశాలలో ప్రవాస జీవితం గడుపుతున్నారు వందలాది మంది. ఇరాన్, సౌదీ అరేబియా, ఇరాక్, సూడాన్ దేశాలకు చెందిన రచయితలెందరికో 'బ్రిటన్' ఆశ్రయం కల్పించింది.

తమ దేశం వదిలి ప్రవాసంలో జీవిస్తున్న రచయతలు తమ దేశ సంస్కృతి, నాగరికత, సమకాలీన పరిస్థితులతో సంబంధాలు పోగొట్టుకుంటున్నారు. అరబ్బు రచయితలు ఇంగ్లీషులో రాస్తున్నారు. వారి లౌకిక సందేశం అరబ్బులకు అందదు. సిరియా రచయత రానాకబ్బాని లండన్‌లో వుంటున్నారు. గొప్ప అరబ్బు రచయిత అబ్దుల్ రహమాన్ జిదావి జర్మన్‌లో రాస్తున్నారు. అమీన్ మౌలవ్ ఫ్రెంచిలోనూ, రన్‌క్ బినా ఇంగ్లీష్‌లోనూ రాస్తున్నారు. ఇరాకీ రచయిత్రి లహీబ్ జడ్డో – అమెరికాలోని టెక్సాస్‌లో కళాకారిణిగా పేరు తెచ్చుకున్నా, ఛాందస ముస్లింలు ఆమె చిత్రాలను బహిష్కరిస్తున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో జర్మన్ రచయిత తుకోవ్‌స్కీ, స్వీడన్‌లో ఆశ్రయం కోరాడు. తుకోవ్‌స్కీకి ఆనాడు స్వీడన్‌లో ఆశ్రయం ఇవ్వలేదు. జర్మనీలో నాజీలు ఆయన్ను చంపేశారు. ఒక రకంగా తాము చేసిన తప్పుకు పరిహారంగా తుకోవ్‌స్కీ పేర సాహిత్య బహుమతి (తుకోవ్‌స్కీ అవార్డు) ఏర్పాటు చేశారు స్వీడన్‌లో. స్వదేశాన్ని బలవంతంగా వదలాల్సి వచ్చిన రచయితలకీ బహుమతి ఇస్తారు. ఈ బహుమతి విలువ 1,50,000 కోనార్లు. అంటే ఆరు లక్షల రూపాయిలు."

* * *

# గ్రంథాలయం

"పండితులు విశ్వవిద్యాలయాలలో తయారైన వాళ్లున్నారు. గ్రంథాలయాలలో తయారైన వాళ్ళున్నారు. రెండోదాంట్లో తయారైనవాళ్ళు – కేశవచంద్ర సేను, ప్రతాప్‌చంద్ర మజుందారు, బిపిన్ చంద్రపాల్, గిరీశ చంద్రఘోష్, రవీంద్రుడు, రాహుల్ సాంకృత్యాయన్, దువ్వూరి రామిరెడ్డి, సంజీవదేవ్ మొదలైన వాళ్లు. మెకాలే హిందూ దేశానికి వస్తూ స్టీమరులో చాలా పుస్తకాలు చదివాడట! అప్పటికి సూయజ్‌కాలువ లేదు. కేఫ్ ఆఫ్ గుడ్‌హోప్ తిరిగి రావలసి వుండేది. కాబట్టి ప్రయాణం ఆలస్యమయ్యేది. ఆ కాలంలో చాలా పుస్తకాలు చదివాడట. గిబ్బన్ ఆక్సుఫర్డు

నుంచి తిరిగి వచ్చేశాడు. అతడు ఏ విశ్వవిద్యాలయంలో చదవలేదు. కాని అతనిని పోలిన వారెందరు ? అతడు గ్రంథాలయంలో కూర్చుని జ్ఞానాన్ని ఆర్జించాడు. ఆ జ్ఞాన ఫలంగా మనకు 'రోమక సామ్రాజ్య పతనమ' అనే అపూర్వ రచన ఇచ్చాడు. ప్రపంచం అంతా ఎరిగిన జాన్సన్ అతి దరిద్రుడు. ఒక పూట వుంటే, రెండోపూట తిండి వుండేది కాదు అతనికి. తన పుస్తకాలు అచ్చు వేయడానికి కాపీరైటుకి కొన్న షావుకారు దగ్గర కొంత డబ్బు అప్పు తెచ్చుకోడానికి అతడు చీటి రాసి క్రింద 'తిండికి లేనివాడు' అని సంతకం చేశాడు. అంత కటిక దరిద్రుడు జాన్సన్ ఏ విశ్వవిద్యాలంలోనూ హాజరు వేయించుకోలేదు, గ్రంథాలయంలో హాజరు మాత్రమే.

మహాపండితుడు కార్లైలు ఇల్లు స్కాట్లండులో, తండ్రి మేస్త్రీ. 'దైవకృప వల్ల నేను జమిందారుల ఇంట్లో పడలేదు కాబట్టి మనిషినయినా'నని కార్లయిలు చెప్పేవాడట! చదువు కోసం ఇతన్ని ఎడింబరో పంపాడు తండ్రి. అతడందులో ప్రవేశించాక అక్కడి మేస్టర్ల మూకలో లెక్కల మాస్టారొకడు, ప్రకృతి శాస్త్ర మాస్టారొకడు తప్ప ఇక మనుషులే లేరని అన్నాడు. అతడు ఎడింబరులో వుండటానికి కారణం అక్కడ గొప్ప గ్రంథాలయం ఉంది. అందులో అతడు సొంతగా ఇటాలియను, ఫ్రెంచి, జర్మను భాషలను నేర్చుకున్నాడు."


* * *

# రక్తాన్ని సిరాగా...

"నవీనులలో నవీనుడని పేరు పొందిన హిందీ మహాకవి 'నిరాలా' (సూర్యకాంత త్రిపాఠి). బడికి వెళ్ళి చదవకపోయినా సంస్కృతం, బెంగాలీ, ఇంగ్లీషు భాషల మీద, కవిత్వ సంగీతల మీద ప్రభుత ఆర్జించుకోగలిగాడు. పుట్టింది ఉత్తరప్రదేశ్‌లోని బైస్వారాలో, పెరిగింది బెంగాలులోని మహిషాదల్‌లో. కటిక బీదరికంతో చెలిమి చేశాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే దూరమయ్యారు. ఒక గుడిలో అమ్మవారి నగలు అపహరించాడనే నిందమోశాడు. ఇరవై రెండేళ్ల వయస్సులో మహమ్మారికి భార్యనూ, ముగ్గురు పిల్లలనూ బలి పెట్టుకున్నాడు. శవ దహనానికి కూడా చాలినంత డబ్బు లేదు. మిగిలింది సరోజ్ అనే కూతురు ఎదిగి వచ్చింది. రెక్కలు విరుచుకుని డబ్బు కూడబెట్టాడు. హఠాత్తుగా మృత్యువు పైబడి సరోజ్ ప్రాణం రాబట్టుకుంది. దీనిని బట్టి 'నిరాలా' బ్రతుకులో ఎన్ని సుడిగుండాలు గిరిగిరలాడాయో తెలుసుకోగలం. రక్తాన్ని సిరా చేసుకొని రాసిన కవి ఎవరంటే, నిజంగా 'నిరాలా' అనవచ్చు. పేజీకి ఆరు లేక ఎనిమిదణాల చొప్పున బెంగాలీ గ్రంథాలు అనువదించి, ప్రచురణకర్తల దయాదాక్షిణ్యం మీద బతకవలసి వచ్చింది. అనామికా, పరిమళ్, తుమ్ ఔర్ మై, రామ్‌కి శక్తి పూజ, మీరాబాయి, తులసీదాసు, సూరదాసు, రవీంద్రకథాకానన్ మొదలైన రచనలు, అనువాదాలు హిందీ పాఠకులకు అందించిన మహనీయుడు 'నిరాలా'."

* * *

# ఏమి దుస్థితి!



గరిమెళ్ళ

"బ్రిటీషు ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ అసహాయోద్యమ తీర్మానపు పిలుపునందుకుని గరిమెళ్ల సత్యనారాయణగారు ట్రయినింగు కళాశాల వీడి 'మాకొద్దీ తెల్ల దొరతనము' అంటూ ప్రభోదగీతం పాడారు. 'దండాలండోయి, మేముండలేమండోయ్ బాబు, నూలుపోగు మీద రాజ్యం ఊగుతున్నదండీ బాబు, సీమనూలు తెంచితేను – సితికి పోవునండి బాబు' అనే పాటలు ఆంధ్రావనిని ఉగ్రూత లూగించినవి. దీంతో ప్రభుత్వం ఒక సంవత్సరం జైలు శిక్ష వేసింది. అక్కడ గేయాలు వ్రాసి, కంఠస్తం చేసుకుని, బయటకు రాగానే ప్రచారానికి పూనుకున్నారు. మరల వారికి రెండున్నర సంవత్సరాలు శిక్ష విధించింది ప్రభుత్వం. స్థైర్యం, ధైర్యం కలిగిన సహధర్మచారిణి సకలావస్థలు పడుతూ, గరిమెళ్లవారు జైలులో ఉండగానే కన్నుమూశారు. చిన్నతనంలోనే భార్య పోవడంతో మరలా వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు ఇద్దరు ఆడపిల్లలు. రెండవ భార్యకు ఇద్దరాడపిల్లలు.

తెలుగునాట జాతీయ కవిత్వమునకు ఒరవడి పెట్టిన కవులలో గరిమెళ్ళ మణిపూస. వారిదొక నూతన పంథా. ఎంతోమంది యువకులు ఆయన ఒరవడిలో గేయకవులు కాగలిగారు. గరిమెళ్ళ జానపద గేయ ప్రభోద నాయకమణి. భావమునకు తగిన ఫణతి – ఫణతికి తగిన శబ్దం, తీర్చిన తెలుగు నుడికారంలో గేయ ప్రవాహం స్రవింపజేశారు. ఆ జాతీయ వీరరస వాహినిలో ముగ్ధులై ఉత్తేజితులైనది ఆంధ్రులే కాదు, ఆంధ్రేతరులు కూడా ఉన్నారు. ఓసారి గాంధీ మహాత్ముడు తన్మయుడై 'భలేకవి' అన్నారు. గరిమెళ్ల గళమెత్తి 'రారా పోదాము రాజ్యమేలుదాము కొయ్యడ, కొయ్యడ ఇలాగు రారా కోటి యింతలు సబుతానో రాయ్యో కొయ్యడ' అని పాడేసరికి జనం రాకపోకలు ఆగి, జన ప్రవాహం నిలిచి ఒడలు మరచి ఉప్పొంగిపోయేది. ఆయన గేయ సరస్వతీ చరణచారణ చక్రవర్తి. పెద్దలు ఈయనను గేయ వాఙ్మయ చక్రవర్తి అన్నారు. తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి వలె జీవితంలో దుర్భర దారిద్ర్యం అనుభవించారు.

అరవైయేండ్లు నిండాయి. చూపు కనబడదు. పిల్లలందరూ పెళ్లికానివారు. ఓ కూతురు మాత్రం ఆయన పోషణ భారం వహించింది. వావిళ్లవారు ప్రతినెలా ఇచ్చే పది రూపాయలతో జీవనోపాధి సరిపోదు కూడా. చివరకు ఉపనయనము నాటి పెన్నిధి విద్య, భిక్షాటనం ఆరంభమైంది. అదే చరమదశలో వారికాధారమైంది. ఏమి 'లీలా' తల్లి నీ ఈ దీవెన!"

❋ ❋ ❋


## వాడుక భాష

"వాడుక భాషలో అందెవేసిన శ్రీ గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కంలోని సీసపద్యం ఒకటి సదరు 'అముద్రిత గ్రంథ చింతామణి'లో చూచి నేనాశ్చర్యపోయి 1913 లోనో, 194 లోనో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో జరిగిన ఒక సభలో దానిని గురించి అప్పారావుగారి నడిగాను. మొదట ప్రబంధ భాషలోనే కన్యాశుల్కం వ్రాసి, అది రుచింపకపోవడం చేత గ్రామ్యంలో తిరిగి వ్రాశానని వారప్పుడు చెప్పారు. శ్రీ రెంటాల వెంకట సుబ్బారావు గారు కన్యాశుల్కానికి పోటీగా వరశుల్కం వ్రాశారు గాని దానికి పాఠకశుల్కం దొరకలేదు. అప్పుడే శ్రీ సోమంచి భీమశంకరం గారు రఘువంశం కొన్ని సర్గలు వాడుక భాషలో పద్యాలు వ్రాశారు. అవేమయనవో తెలియదు."

**– వేలూరి శివరామశాస్త్రి.**

* * *

## వాడపల్లి



**రామకృష్ణ శాస్త్రి**

"బందరులో మల్లాది వారిది మంచి సంపన్న కుటుంబం. సదాచారవంతులైన మల్లాది నరసింహశాస్త్రిగారు సరసులనిపించు కోవడానికి పెట్టి పుట్టారు. వీరి ఏకైక పుత్రుడు మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు తండ్రి గారి దృక్పథానికి ఏకైక వారసులు. వేదం నేర్చుకున్న నోటితోనే శృంగార కావ్యాలు ఆలపించడం, సంధ్య వార్చిన చేతులతోనే సరదాగా హార్మోనియం వాయించడం, ఒక వంక బ్రహ్మసూత్రాలు చెప్పుకుంటూ మరో వంక యెంకి పాటలు పాడుకొనడం రామకృష్ణశాస్త్రిగారికి ప్రథమ పాఠాలు. అందం, అనుభవం అందుబాటులోనికి తెచ్చుకోవాలన్న లక్ష్యం నూనూగుమీసాల నూత్న యవ్వనం నుండే రామకృష్ణశాస్త్రిగారికున్నది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రక్షాబంధనమనే నవల వ్రాశారు. అందులో వాడపల్లి 'సానివాడ'ను కళ్లకు కట్టినట్లు వర్ణించి, ఆకాశానికి ఎత్తారు. అతిశయోక్తో, స్వభావోక్తో తెలుసుకోవడానికి రామకృష్ణశాస్త్రిగారు పుస్తకం చదివిన మరునాడు తనిఖీ చేయడానికి ఆ పైలాపచ్చీసులో ఆ వూరు యకాయకిని వెళ్లారు."

**– ఆరుద్ర**

* * *

## దివ్యానుభూతి

వారణాసిలో త్రైలింగస్వామి అనే పరమ యోగి 1887 వ సంవత్సరం వరకూ ఉండేవాడు. ఈ పరమయోగి యోగలీలా వైభవం భారతదేశంలో ముఖ్యంగా వంగదేశంలో సువిఖ్యాతం.

కాశీలో త్రైలింగస్వామి వారి అర్చా విగ్రహం కూడా పూజింపబడుతూ ఉన్నది నేటికీ. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు త్రైలింగ స్వామి మందిరాన్ని దర్శించామని, అప్పుడేవో తమకు దివ్యానుభూతులు కలిగాయనీ ప్రసక్తం చేస్తూ, త్రైలింగ స్వామిని గూర్చి కొన్ని గాథలు కూడా తమ స్వీయ చరిత్ర 'శ్రీకృష్ణ స్వీయ చరిత్రం"లో వ్రాశారు.

❋ ❋ ❋

# భరద్వాజ



రావూరి భరద్వాజ

"పాలడబ్బాడు బియ్యాన్ని కుండలో వొండుకొని, బాదం ఆకుల్లో ఒక్కో ముద్ద పెట్టుకుని, పచ్చిమిరపకాయ ఆదరువుగా నంజుకొని, అందరం కడుపునిండా నీళ్ళు తాగాక, కమ్మని కథలు చెప్పేవాడు రావూరి భరద్వాజ. ఆకలి, దరిద్రం, డబ్బు కోసం గింజులాట, వీటి కోసం దిగులు – మరేవీ అతని కుండేవి కావు. ఉన్నదంతా అందరికి పంచేసి – కడుపులో కాళ్ళెట్టుకుని భరద్వాజ పడుకొన్న రోజులు నాకింకా గుర్తున్నాయి" అంటాడు శార్వరి.


"దరిద్రం చాలామందికి పిరికిపాలు పోసింది. కానీ ఆ పిరికిపాలు తాగి నేను రాటు తేలాను. నా చిన్నతనంలో అన్ని బాధలు, కష్టాలు, అవమానాలు, ఈసడింపులు అనుభవించకపోతే, నేను రచయితను అయ్యేవాణ్ణే కాదు" అంటాడు భరద్వాజ.

సాహిత్య క్షేత్రంలోకి, ఎన్నో భయాలతో కాలు మోపాడు భరద్వాజ. ఒక్కో మెట్టు ఎక్కుతూ 1950 కి ముందు 'ఒక్క పుస్తకం అచ్చయినా చాలు' అనుకొన్న భరద్వాజ 125 పుస్తకాలు ప్రకటించాడు. భరద్వాజ ఉత్తమ కథకుడు, నవలాకారుడు, సుగమ విజ్ఞాన శాస్త్ర రచయిత. జీవితంలో కష్టాలనూ, కన్నీటినీ కడమట్టా చూచినవాడు. ఆడంబరాన్నీ అహంకారాన్ని జయించిన వినయశీలి. సంఘంలోని అన్ని వర్గాలవారితోను ఇట్టే కలసిపోయి, వారి అనుభవాలనూ, అనుభూతులనూ అవగాహన చేసుకోగల సహృదయుడు.

'ప్రపంచ ప్రఖ్యాత రచయిత క్వాజా అహ్మద్ అబ్బాస్ భరద్వాజను మాక్సింగోర్కీతో పోల్చినప్పుడూ; సుప్రసిద్ధ పత్రికా రచయిత యం. చలపతిరావు (నేషనల్ హెరాల్డ్ సంపాదకులు) అతన్ని బాల్జాక్ సరసన నిలబెట్టినప్పుడూ, మహాకవి శ్రీ శ్రీ అతని రచనలు ఆంటన్ చెకోవ్ రచనలతో తులతూగగలవన్నప్పుడూ, మరో సాహితీవేత్త అతన్ని జార్జి వాషింగ్టన్ కార్వర్ ప్రక్కన నిలబెట్టినప్పుడూ, భరద్వాజ ఉత్తుంగ తరంగంలా ఎగసిపడడానికి బదులు, తనలోకి తను కుంచించుకుపోయాడు. ' ఒక్క కష్టాలు అనుభవించడంలో తప్ప వారికీ నాకూ పోలికలు ఎక్కడున్నాయి గనక' అన్నాడతను వినయంగా".

❋ ❋ ❋

# బ్రౌన్‌దొర


సి.పి. బ్రౌన్


"ఫ్రెంచి ఫాదర్ అబే జె.ఎ. దుబాయి ముప్పయి యేండ్లు (1793-1823) ఆంధ్రదేశం పర్యటించి యాత్రా విశేషాలను గ్రంథస్థం చేశారు. 1816 లో వ్రాసిన 'హిందువుల ఆచారాలు' అనే పుస్తకం సి.పి. బ్రౌన్ చదవడం జరిగింది. అందులో కడప జిల్లాలో వేమన అనే ప్రఖ్యాత కవి ఉన్నట్లు ఉంది.

మచిలీపట్నం కోర్టులో పనిచేసే తిప్పాభట్ల వెంకటశివశాస్త్రి - ఫాదర్ అమీనుగారు వేమనశతకం ఒక ప్రతిని బ్రౌన్‌కిచ్చారు. మామిడి వెంకయ్యగారితో బ్రౌన్ పరిచయం పెంచుకుని 'ఆంధ్రదీపిక' అనే నిఘంటువు సాయంతో వేమన శతకమును ఇంగ్లీషులోకి 'ది వర్సెస్ ఆఫ్ వేమన' (1829) అనువదించారు.

తిప్పాభట్ల వెంకటశివశాస్త్రిగారితోపాటు పర్యం సోదరులు - అద్వైత బ్రహ్మశాస్త్రి, సీతారామశాస్త్రి, రామలింగశాస్త్రిలతో బ్రౌన్‌కి పరిచయం కలిగింది. 1830 లో బందరులో కోటిలింగన్న గారి భార్య వద్ద 13 పురాణాలు, 130 ఉపనిషత్తులు, వేదాంత, పౌరాణిక, తాంత్రిక గ్రంథాలు రు. 370/-లకు బ్రౌన్ కొన్నారు. పాతరామన్నపేటలో ఉండేవారు. సదాబత్తుల ఆదినారాయణ బ్రౌన్ బొట్లేరుగా ఉండేవారు. తెలుగు కావ్యాలను పరిష్కరించి ప్రకటించడంలో బ్రౌన్ ఆద్యుడు. ఆనాటి విద్వాంసులు పర్యం అద్వైత బ్రహ్మశాస్త్రి, జూలూరి అప్పయ్య పండితులు, రావిపాటి గురుమూర్తి శాస్త్రి మొదలైన పండితులు ఆ మహాయజ్ఞంలో తోడ్పడ్డారు."

❋ ❋ ❋

# కాశీనాధుని ఆదరము



కాశీనాధుని

"శ్రీ గిడుగు రామమూర్తిగారు చెన్నపట్నము ఎప్పుడు వచ్చినా నగరంలోని పెద్దలను ఆహ్వానించి ఆంధ్రపత్రిక ఆఫీసులో వారిచేత ఉపన్యాసం చేయించేవారు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు. అటువంటి సభకొకదానికి నేను బి.ఎ. విద్యార్థిగా ఉండగా, వెళ్ళిన భాగ్యం పొందినాను 1919 లో. దానికి శ్రీ వేపా రామేశము అధ్యక్షులు, శ్రీ వేమవరపు రామదాసు, శ్రీ అక్కిరాజు ఉమాకాంతం ఇత్యాదులు సభాసదులు.


ఆ ప్రాంతాలలోనే సాహితీ సమితి వారి 'సాహితి' మొదటి సంచిక వచ్చినది. దానిని ఆంధ్రపత్రికలో రెవ్యూ చేయించడానికి శ్రీ నాగేశ్వరులను దర్శించాను. అందులో రచనలు ఎక్కువ భాగం వ్యావహారిక భాషలో ఉన్నవి. నాతో మా మిత్రులు

శ్రీ వీరరాఘవస్వామి కూడా ఉన్నారు. వారెంతో ఆదరముతో మాతో మా పత్రిక కష్టసుఖాలు ప్రస్తావించారు. అట్టమీద ప్రకటన రేట్లు తక్కువగా ఉన్నవనీ, లోపలి రేట్లు ఎక్కువ అనీ సూచించి, మేమడగకపోయినా, అమృతాంజనము ప్రకటన సాహితి అట్టమీదికి ఇచ్చి, శ్రీ పండిత గోపాలాచార్యులు కూడా ప్రకటన ఇచ్చెదరని సూచించారు. ముందు చూడగా దూరోన్నతంగా ఉండే శ్రీ నాగేశ్వరులు యువకులను అంత ఆప్యాయతతో ఆదరించడము మమ్ములను ముగ్ధులను చేసినది. నవ్యాంధ్ర సాహిత్య రంగంలో 'సాహితి' అవతరణ ప్రధాన ఘట్టమని గుర్తుంచుకోవలె."

**– నోరి నరసింహశాస్త్రి**

❋ ❋ ❋

# కవి



**కాటూరి**

"కాటూరి వెంకటేశ్వరరావు ఒక తెల్లటి శాలువ వేసుకుని, కఱ్ఱ ఒకటి పుచ్చుకొని తిరుగుతుండేవాడు. చాలామందికి గుర్తుండే వాడనుకుంటాను. నాకెవరో పెట్టిన శాలువ అతనికిస్తే, ఆ శాలువ అది. ఆ కఱ్ఱ కూడా నేనే ఇచ్చాను. ఆ శాలువ వేసుకుని, ఆ కఱ్ఱ పుచ్చుకుని తిరుగుతూ ఉండేవాడు. ఎందుకు చెపుతున్నానంటే, నేనంటే అతనికి అంతరాంతరాలలో ఎంత ఆర్ద్రత, మార్దవం ఉన్నవో దాన్ని బట్టి తెలుస్తుంది.

మొన్న వెళ్ళినప్పుడు అతను పోతాడని నేను అనుకోలేదు. ఏదో జాతకం – అదీ చెప్పాడు. జాతకం అంటే నాకంతగా తెలియదు కాని ఏదో శని చాలా ఉచ్ఛలో ఉన్నాడని మాధవపెద్ది బుచ్చి సుందరరామయ్య ఆయనతో అన్నాట్ట – బాబుగారు – అనేవాడాయన వెంకటేశ్వరరావుగారిని. బాబుగారూ మీకు చాలా మంచి రోజులున్నాయి. శని మహర్దశ వస్తున్నది. ఏదో పెద్ద సంస్థకు అధిపతిగా ఉండాలి – అని.... ఇట్లా అన్నాడోయ్ అన్నాడు నాతో. నీకు కూడా అలాగే ఉందోయ్, నీవు ఏదో పైకిరావాలి నీకున్న కవితాశక్తికి తగిన ఆధిక్యం నీకు రాలేదు – అన్నాను. వస్తుందనే అనుకున్నాను. తప్పకుండా నిమ్మళిస్తుందనుకున్నాను. ఇవాళ ప్రొద్దున్న యీ వార్త పెద్ద పిడుగులా వచ్చింది.

చెపితిని కదా – ఇద్దరం ఒకటే వయస్సువాళ్ళం. బాపిరాజు కూడా మా ఈడువాడే. అతను మాకన్న ముందర పోయాడు. ఇది ఏమిటో – ఈ అష్ట గ్రహకూటం ఫలితమేమో – రెండు నెలలు కాలేదు గోపీచంద్ పోయి. ఇవాళ మళ్ళీ ఈయన పోయాడు.

స్నేహితుడు పోతే పడే కష్టం ఎవడికి వాడు గ్రహించాల్సిందే తప్ప, చెపితే తెలిసేది కాదు. ఒక్కసారిగా యీ పిడుగు వార్త వస్తే మరి – ఎప్పటికప్పుడు బ్రతుకుతాడు బ్రతుకుతాడు

– అనే నా తాత్పర్యం తప్ప ఇట్లా అవుతుందని అనుకోలేను పైగా. నేనూ, నా తమ్ముడూ ఇద్దరం కలిసి వెళ్ళాం. మా వెంకటేశ్వర్లు కూడా చెప్పాడు – ఫర్వాలేదు వెంకటేశ్వరరావు – ఏదో – అని.

ఎంత ఏడ్చినా దీని తల్లి కడుపుకాల ఎవరైన ఆప్తులు పోతే ఇంతకన్నా చేసేదేమీ కనపడలేదు. అసలు ఇవాళ నేను మాట్లాడడం రేడియో వాళ్ళు మాట్లాడమంటుంటే మాట్లాడకపోతే అతనికేదో ద్రోహం చేసిన వాడనవుతానేమోనని తప్ప, అతన్ని గురించి మాట్లాడదలచుకుంటే ఇవా మాట్లాడవలసింది ? ఇవి కాదేమరి. అతను ఎంత కవో చెప్పాలి. ఒక మహావైశిష్ట్యం కల కవి అతను. అంతటి మహా వైశిష్ట్యం కల కవి అని – ఇవాళ అతను పోయాడు గదా అని నేను అనడం లేదు. అతను బ్రతికుండగానే చాలాసార్లు అన్నాను. ఒక విధమైన రచనా వైశిష్ట్యం ఉండేది అతనికి. అలా ఒక ప్రబంధం వ్రాయమని అనేకసార్లు చెప్పాను – ఏమిటోయ్, నాకు సమాధి కుదరదు – అంటూ ఉండేవాడు. అతని శైలి అట్లాంటిది. దాన్ని గురించి, ఇప్పుడు కవిత్వాన్ని గురించి మాట్లాడటానికి లేదు. ఎప్పుడన్నా పరమేశ్వరుడు అనుగ్రహిస్తే ఎప్పుడన్నా ఇతరత్రా మాట్లాడవలసిన సమయమది – అటువంటి చమత్కారమైన కూర్పు, అదొక పరమ రమణీయత – ఇప్పుడు కాదు.

ఎప్పుడో నలభైఏండ్ల క్రిందట ఒకప్పుడు ఏదో మయూరం కోకిలం అనో ఏవో వ్రాశాడు కొన్ని పద్యాలు. ప్రకటించలేదు. ఆ పద్యాలు వ్రాసినప్పుడే ఓరిబాబో ఇదేమి శైలి ఎట్లా కుదిరిది ? – ఆశ్చర్యం వేసింది నాకు.

తరువాత మా గురువుగారు చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రిగారు బందరు నుంచి ఉపాధ్యాయత్వం విరమించి కడియం వెడుతుంటే అప్పుడు వ్రాశాడు పద్యాలు – ఆ రోజున సభ సభంతా దద్దరిల్లిపోయింది అవి చదివితే, నమ్మండి మీరు. "యీ ముదిపాయపొంగు ముద్దులే కడియంబుకు దక్కనిమ్ము...." – అదేమిటో ఆ పద్ధతి – "ఆంధ్రదేశస్థ సర్వాంగ్ల భాషా కళాశాలలకున్ కనులు చల్లబడెనె ?' – అని వ్రాశాడు.

అంతటి మహాకవి బందరు పట్టణంలో హైస్కూలులో ఉండి అంతవాడు మనకు లేడని తక్కిన కళాశాలలన్నీ చుప్పనాతితనం పడుతున్నాయట, చుప్పనాతి తనం. ఆ చుప్పనాతి తనం పడడాన్ని గురించి వ్రాశాడు – 'ఆంధ్రదేశస్థ సర్వాంగ్ల భాషా కళాశాలలకున్ కనులు చల్లబడెనె."

ఎందుకు చెబుతున్నానంటే అంత చిన్నప్పుడు నలభై ఏళ్ల క్రితం వ్రాసిన తెలుగుకవి, ఆ కవి – ఇంత కవి అని చెప్పడానికి వీలు కాదు. ఆంధ్రభాషకు ఆయన ఒక మహాప్రబంధం వ్రాసిపెట్టకపోవడం ఆంధ్రభాష దుర్దశ అని నా తాత్పర్యం. ఆయన ప్రత్యేకంగా వ్రాసిన గుడిగంటలుగాని, రావణాసురుణ్ణి గురించి వ్రాసిన పద్యాలుగాని, మా వూరు అని వ్రాసిన పద్యాలుగాని శైలీలో వాటికవే సాటి. అంత రమణీయమైన శైలి పరమేశ్వరుని యొక్క అనుగ్రహం లేకుండా రాదు."

**– విశ్వనాథ సత్యనారాయణ.** (1963–ఫిబ్రవరి 'భారతి')

❋ ❋ ❋

# చాటు పద్యాలు

"అవధానాలు చేస్తున్నప్పుడు అనివార్యంగా ఆశుకవిత, సమస్యాపూరణ వర్ణనం, దత్తపది, నిషేధాక్షరి వంటి సందర్భాలు వస్తాయి. ఆ వేళలో అప్పటికప్పుడు ఆయా కవులు చెప్పిన పద్యాలు కూడా చాటు పద్యాలుగా నిలిచిపోయినవి. అవధానాలు చేస్తున్నప్పుడు కవులు ప్రదర్శించే పాండితీగరిమ, కవితాప్రభ సహస్రదళ పద్మంలా విచ్చుకుంటుంది. సదస్యులకు అబ్బురపాటు కలిగిస్తుంది. తిరుపతి వేంకటకవుల 'జగదాశ్చర్యకరావధాన కవితా సంపత్తి'ని రసప్రలుబులింకా కొల్లగొట్టుకుంటూనే ఉన్నారు. గొడేపల్లి ప్రకాశరావు, పిశుపాటి చిదంబర శాస్త్రి, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి, పోకూరి కాశీపతవధాని, వేలూరి శివరామశాస్త్రి, దుబ్బాక రాజశేఖర శతావధాని, కొప్పరపు కవులు, రామకృష్ణ కవులు, గడియారం వెంకటశేషశాస్త్రి నిన్నటి తరాన్ని ఉర్రూతలూగించి ఎన్నో చాటు పద్యాలనందించిన కావ్య కళాపారీణులు."

**– ఇరివెంటి కృష్ణమూర్తి**

❋ ❋ ❋

# మొట్టమొదటి వ్యాస రచయిత్రి

"కొక్కొండ వెంకటరత్నం గారు సుప్రసిద్ధ గ్రాంథిక భాషాభిమాని. ఈయన కలశపాకము విజయరాఘవనాయుడు అనే వదాన్యుడి సహాయంతో 1871 నవంబరు 28 న 'ఆంధ్ర భాషా సంజీవని' ప్రారంభించారు. ఇది మాసపత్రిక, ప్రతి పూర్ణిమ సాయంత్రం వెలువడేది. 1883 వరకు సాగి ఆగిపోయింది. మళ్ళీ 1892 లో పునరుద్ధరించి 1899 వరకు నడిపారు.

పోతం జానకమ్మ అనే విదుషీమణి తన భర్తతో ఇంగ్లాండు వెళ్ళి వచ్చి 1874 ఫిబ్రవరి ఆంధ్ర భాషా సంజీవనిలో విదేశయాత్ర గురించి ఒక వ్యాసం ప్రచురించిందని కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి గారు ఆర్యమత బోధిని 1913 సెప్టెంబరు సంచికలో రాశారు. బహుశా ప్రథమాంధ్ర వ్యాస రచయిత్రి ఈమె కావచ్చు!"

**– వి. లక్ష్మణరెడ్డి.**

❋ ❋ ❋

# వైతాళికులు

"సామినేని ముద్దుకృష్ణ విశాఖపట్నం వచ్చినప్పుడు కవితా సమితి సభ్యులు – శ్రీశ్రీ, పురిపండా, కాళూరి నరసింగరావు, శ్రీరంగం నారాయణబాబులను కలుసుకున్నాడు. వైతాళికుల కోసం వారిని పద్యాలు అడిగాడు. కాళూరి నరసింగరావును మిత్రులు 'ఉగ్రం' అని పిలిచేవారు. ముద్దుకృష్ణ ఉగ్రంతో పేచీ పెట్టుకున్నాడు. ఆ తగాదా ఎక్కువైంది. కవితా సమితి సభ్యులెవరూ

ముద్దుకృష్ణకు పద్యాలు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు. అందుకే వాళ్ళ పద్యాలు వైతాళికులలో లేవు. అయితే సమితి నిర్ణయానికి కట్టుబడక శ్రీశ్రీ ఒక్కడే తన పద్యాలను ముందుగా ముద్దుకృష్ణకు ఇచ్చాడు – అని ఓసారి పురిపండా నాతో అన్నాడు.”

**– ఆరుద్ర**

❋ ❋ ❋

# మా బసవరాజు



**బసవరాజు**

“నేను మదరాసు నుండి పిఠాపురం వస్తున్నాను. ప్యాసింజరు తెల్లవారగట్ల కొవ్వూరు దాటి గోదావరి మీద పోతున్నది. నాకు మెలకువ కాదు నిద్దుర కాదు. వంతెన మీద నడిచే ట్రెయిన్ హోరులో కలసి ప్రక్క కంపార్టుమెంటులో నుంచీ ఒక పాట వినబడినది –

“ఈ మహా గహనాంతర సీమలోన
ఈవు శ్రీగిరి భ్రమరాంబవేను మల్లికార్జునుండ”

ఆ పాట పాడినవారెవరు ? మా బసవరాజా! అని సందేహం కలిగి గోదావరి స్టేషనులో దిగి ప్రక్క కంపార్టుమెంటులో తిలకించగా మా బసవరాజూ, అతని అర్ధాంగి రాజ్యలక్ష్మమ్మా – కవయిత్రి సౌదామినీదేవీ కూర్చున్నారు. ఎక్కడికి వెడుతున్నారన్నాను. ఉత్తర దేశయాత్రకు అన్నాడు. అతనిదెప్పుడూ మజిలీ లేని యాత్రే ఆయెను. అతని తత్వాన్ని బట్టి అతన్ని జిప్సీ అనేవాళ్ళం. ఒక పాట పాడమన్నాను.

“బ్రతుకు బరువు మోయలేక
చితికి చివికి డస్సివాడి
పికరుపుట్టి పారిపోయి
ఒకడనె ఏ తోటలోనొ
పాట పాడుతుండగ నా ప్రాణిదాటి యేగేనా ?
ప్రాణిదాటి యేగుచుండ పాటనోట మ్రోగేనా ?”

తరువాత మరి అతన్ని చూడలేదు. పాట పాడుతూ పోయాడు మా బసవరాజు. పోతూ పాట పాడాడు. రాగద్వేషాలు దాటి శ్రీశైల మల్లికార్జునస్వామి చరణ సన్నిధిన చివరకు మజిలీ దొరికింది. తానూ, మంగళప్రదమ్మ్మ పాపాయీ ఉన్నారు అక్కడ. ఇక్కడ అతని ప్రాణానికి ప్రాణమైన రాజ్యలక్ష్మి, ప్రాణమిత్రులమైన నండూరీ, నేనూ ఉన్నాము.”

**– దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి.**

❋ ❋ ❋

# ఎడిటరు



గోరా శాస్త్రి

"ఎడిటరనే వాణ్ణి గురించి నాకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలుండేవి. రచయితలు పంపే వ్యాసాలు, ఇతర రచనలూ చూసి వాటిల్లోంచి కొన్ని ఏరి ప్రచురించిన మాత్రాన ఎడిటరైపోడు. పాలసీసా బిడ్డ నోటికందించిన మనిషల్లా తల్లి అవుతుందా ? నిజమైన ఎడిటరు పత్రికకు ఒక వ్యక్తిత్వాన్నిస్తాడు. ప్రాణం పోస్తాడు. పత్రిక యొక్క ఘనత పరోక్షంగా ఎడిటరు ఘనతే. గన్నవరపు సుబ్బరామయ్య గారు, ఆంద్ర శేషగిరిరావుగారు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు లాంటి ఎడిటర్లు తాము నిర్వహించే పత్రికలకు ఎలా ప్రాణప్రతిష్ట చేశారో నాకు తెలుసును.

గోరా శాస్త్రి అలాంటి ఎడిటర్ల శ్రేణిలోకి వస్తాడా ? లేక ఖాసా సుబ్బారావుగారి నీడన దాక్కుంటాడా ? నా అనుమానం త్వరలోనే తీరిపోయింది. గోరాశాస్త్రి 'తెలుగు స్వతంత్ర' ను తన సొంతం చేసుకున్నాడు.

అది చాలా ముఖ్యం. ఎడిటరుగా చలామణీ అయ్యేవాడికి పత్రిక పట్టినా, పట్టకపోయినా, ఎడిటింగు పని చేసేవాడికి ఆ పత్రిక గురించి ఉత్సాహము, బెంగా, శ్రద్ధా, తాపత్రయమూ, ఆనందమూ మొదలైన వ్యాధులన్నీ వుండాలి. గోరాశాస్త్రిలో ఈ జబ్బులన్నీ కనిపించాయి."

**– కొడవటిగంటి కుటుంబరావు**

* * *

# మహనీయులు



చిర్రావూరి

"చీరాలలో పుట్టిన కోటంరాజు పున్నయ్యగారు మొదట బొంబాయిలో స్థిరపడ్డారు. కాశీనాధుని నాగేశ్వరరావు గారి పరిచయంతో అమృతాంజనం కంపెనీలో ప్రవేశించి 'ఆంధ్రపత్రిక' ప్రారంభం నుంచే అందులో పని చేశారు. 'ఆంధ్రపత్రిక' బొంబాయి నుంచి మద్రాసుకు రాగానే పున్నయ్యగారు కూడా వచ్చారు. తెలుగు జర్నలిజంతోపాటు ఇంగ్లీషు జర్నలిజం కొనసాగించేవారు. 'హ్యూమానిటీ' అనే పత్రికను నడిపారు. 1918 ప్రాంతంలో ఆయన కరాచీ వెళ్ళి స్థిరపడ్డారు. 'న్యూటైమ్స్' అనే పత్రికకు సంపాదకులయ్యారు. తర్వాత 'సింధ్ అబ్జర్వర్' అనే దినపత్రికకు సంపాదకులయ్యారు.

సంయుక్త రాష్ట్రాలలో చిత్రావూరి యజ్ఞేశ్వర చింతామణి గారికి ఎంత పేరూ ప్రతిష్ఠా వున్నాయో, సింధు రాష్ట్రంలో పున్నయ్యగారికి అంతటి ప్రజాభిమానం వుండేది. ఆయన నివసించే పేటకు 'పున్నయ్యపూర్' అని పేరు పెట్టారంటే ఆ ప్రజల అభిమానాలు ఎంతటివో తెలుస్తాయి. 1947 లో దేశవిభజన జరిగేదాకా పున్నయ్యగారు కరాచీలోనే వుంటూ పత్రికా వ్యాసాంగం నడిపారు. తర్వాత బొంబాయిలో స్థిరపడి అక్కడే కన్నుమూశారు.

పున్నయ్యగారి తర్వాత చెప్పుకోదగ్గ ఇంగ్లీషు జర్నలిజంలోని తెలుగువెలుగు వారి సోదరుడు కోటంరాజు రామారావు గారు. ఈయన అంచెలంచెలుగా సాగి జవహర్‌లాల్ నెహ్రూగారి 'నేషనల్ హెరాల్డు'కు ప్రధాన సంపాదకులుగా ప్రఖ్యాతులయ్యారు. జాతీయ సమస్యలన్నింటి మీద నిశితంగా, నిర్భయంగా, నిర్ద్వంద్వంగా సంపాదకీయాలు, వ్యాఖ్యానాలు కురిపించేవారు. కోటంరాజు రామారావు గారి సాధనానికి ఎం. చలపతిరావుగారు వారసులయ్యారు. నేషనల్ హెరాల్డుకు చలపతిరావుగారి పేరు పర్యాయపదమైంది.


ఇంగ్లీషు జర్నలిజంలో చెయ్యి తిరిగిన సిద్ధహస్తులు తెలుగువాళ్ళలో ఇంకా ఉన్నారు. స్వరాష్ట్రం దాటని దంపూరు నరసయ్య, స్వరాష్ట్రంలో వుంటూనే దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న ఖాసా సుబ్బారావు మొదలైన కీర్తిశేషులున్నారు.

విధి చేసిన వేళాకోళం ఏమంటే కోటంరాజు రామారావు గారు, చలపతిరావుగారు ఒకలాగే దుర్మరణం చెందారు. రామారావుగారు రైల్లోంచి క్రిందపడి ప్రమాదవశాత్తూ మరణించారు. చలపతిరావుగారు ముక్కు మోహం ఎరుగని టీ దుకాణంలో దిక్కులేని చావు పొందారు. అయితే, మహనీయులు మరణిస్తేనేం! చనిపోయిన క్షణం నుంచే మళ్ళీ బతుకుతారు."

– ఆరుద్ర

* * *

# గాలిబు



దాశరథి


''నేను చిన్ననాడు ఖమ్మంమెట్టులోని ఉస్మానియా హైస్కూలులో చదువుకునేటప్పుడు మాకు ఉర్దూ, ఫార్సీ చెప్పే మాస్టారు 'జక్కీ' సాహెబ్ మా పాఠ్యక్రమంలోని విషయాలను కొంచెం పక్కకు నెట్టి మహాకవి 'మీర్జాగాలిబు' పద్యపాదాలు – ఫార్సీవి, ఉర్దూవి చదివి, తాను తన్మయమవుతూ మమ్మల్నీ తన్మయపరిచేవాడు. గాలిబు పద్యాల విమానాల మీద ఎక్కి మేము సుందర నందనారామాలవైపు ఉడాయించేవాళ్లం. నా ఆ బాల్యమిత్రము శ్రీ డి. రామలింగం, నేనూ సాహితీవాసనా విలసితమైన మనస్సులతో ఏదో ఊహలు ఊహించుకుంటూ క్లాసురూమ్‌లో అసలు పాఠాలవైపు పోలేకపోయేవాళ్ళం.

నాకు అలనాడు గాలిబు పట్ల ఏర్పడిన ఆ మక్కువ ఈనాటికి ఆయన రచనల అనువాదం ద్వారా రూపం దిద్దుకున్నది. మతోన్మాదులు విహరించిన నేలన మతాతీతుడుగాను, సంప్రదాయ భేదకుడుగాను, పురాతనత్వమే ఆదర్శమని నమ్మినచోట అతినవ్యుడుగాను వెలసిన మహాకవి గాలిబు నా హృదయంలో ఇమిడిపోయినాడు. ఆయనలోని ఆ క్లుప్తత, ఆ ఆప్తత, ఆ గుప్తత నన్ను ముగ్ధుణ్ణి చేసినవి. కాళిదాసాదులవలె మానవతాగిరి శిఖరం మీద తేజోమూర్తిగా శాశ్వతస్థానం ఏర్పరచుకున్న గాలిబు అన్ని భాషలవారికీ ఆరాధ్యుడు".

**– దాశరథి కృష్ణమాచార్య**

* * *

# మావాడే – మహాగట్టివాడు



తిలక్

"ఆధునిక కవితారంగంలో – అంటే శ్రీశ్రీ యుగంలో – తమ రచనలు గ్రంథ రూపంలో రాక పూర్వమే యావదాంధ్ర దేశంలో ఉత్తమ కవులుగా లబ్ధి ప్రతిష్ఠులైనవారు ముగ్గురున్నారు. వారిలో తిలక్ ఒకడు, మిగిలిన ఇద్దరు శ్రీశ్రీ, అజంతాలు. తిలక్ సర్వ పాఠకులకు ఆకర్షణీయమైన శైలీవిన్యాసం చేశాడు. తిలక్ ఖచ్చితమైన మానవతావాది. అభ్యుదయ కవితాయుగపు ప్రధాన లక్షణమైన అంతర్జాతీయ భావనా, "సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరిపివేసి" "అకుంఠిత మానవీయ పతాకను ఎగురవేసే" తత్వముగల అభ్యుదయ కవి కంఠమతనిది. "నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు, నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అని తిలక్ చెప్పుకున్నాడు.

తిలక్ నాకు చిరకాల మిత్రుడు. మా పరిచయం దాదాపు పాతికేండ్ల నాటిది. ఆ రోజుల్లో మేము నరసరావుపేటలోస్థాపించిన "నవ్యకళాపరిషత్"లో అతను ప్రముఖ సభ్యుడు. అతని అనారోగ్యం వల్ల మధ్యలో చాలాకాలం మా పరిచయ బంధం దాదాపు తెగిపోయినంత అయింది. చివరి దశలో మళ్ళీ కలిశాం. అతనికి ఆ అనారోగ్యం లేకపోతే ఇంకా ఎంతగా రాసేవాడో అనేది, కేవలం ఊహకు మాత్రమే మిగిలింది. మరి అకాల మరణానికి గురికాకుండా వుంటేనో ? అదీ అంతే... ఇంతకూ అతను మనకు మిగిల్చి వెళ్ళిన ఆస్తి 'అమృతం కురిసిన రాత్రి'.

తిలక్ శారీరకంగా మంచి రూపసి. అలాగే మానసికంగా కూడా మంచివాడు. మెత్తనివాడు. స్నేహశీలి, కవి, రసజ్ఞుడు.... ఇన్ని మాటలెందుకు, అతనే ఒకచోట అన్నట్టు "మావాడే – మహాగట్టివాడు."

**– కుందుర్తి**

* * *

# పాండిత్యం



రాహుల్

"రాహుల్ సాంకృత్యాయన్ తన చిన్నతనంలో "ఓ మూర్ఖుడా! ప్రపంచ పర్యటన చేయి" అనే పద్యభాగం చదివి, ఒక మహా యాత్రికుడైనాడు. తనతోబాటు ఇంకెందరో యాత్రికులను తయారుచేసే ఉద్దేశంతో "ముమక్కడ్ శాస్త్రం" (యాత్రా విజ్ఞానశాస్త్రం) కూడా రచించారు. ప్రపంచంలో మొట్టమొదట ఇలాంటి గ్రంథం రచించిన ఖ్యాతి రాహుల్‌జీకే దక్కింది.

రాహుల్జీ బౌద్ధ సన్యాసి వేషంలో ఉంటున్నందున ఆయనకు ఈ ప్రపంచంతో సంబంధం లేదని కొందరు భావించారు కాని ఈ వేషంలో ఉంటూనే కాంగ్రెస్‌వాదిగా, కమ్యూనిస్టుగా ప్రజలకు సేవ చేశారు. ఆయనకు సైన్సు తెలియదనుకొని ఆచార్య కృపలానీ ఒకసారి ఏదో బోధించడానికి తయారైనారు. కృపలానీని కలుసుకోవడం అదే మొదలు అయినందువలన రాహుల్‌జీ ఆయనను వదిలిపెట్టారు. కాని ఆ తర్వాత "విశ్వకి రూప్‌రేఖ" అనే గొప్ప శాస్త్రీయ గ్రంథాన్ని రచించి, కృపలానీ లాంటివారిని ఆశ్చర్యచకితుల్ని చేశారు. పాండిత్యంలో నాగార్జున, అశ్వఘోష్‌లతో సమానస్థాయిని రాహుల్జీ సంపాదించగలిగారని మహాబోధి సొసైటీ ఆయనకు జోహార్లర్పించింది. సంస్కృతం, పాలీ, టిబెటన్ మొదలైన భాషలు ఒక మహా పండితుణ్ని కోల్పోయాయి. ఆయన మృతితో భారత కమ్యూనిష్టుపార్టీ తనకు గల ఒక గొప్ప పరిశోధకుణ్ణి, ఒక మహాపండితుడ్ని నష్టపోయింది.

రాహుల్జీ రచించిన ప్రధాన గ్రంథాలే 150 దాకా వున్నాయి. అవికాక చిన్న చిన్న గ్రంథాలు, వ్యాసాలు అనేకం ఆయన రచించారు. ఆయన రచనలు అనేకం ఇంగ్లీషులోకి తదితర భాషల్లోకి అనువదించబడ్డాయి. "ఓల్గాసేగంగా" 14 భాషల్లోకి అనువదించబడింది. "దర్శన్ దిగ్దర్శన్" అనే మహాగ్రంథం ఒక్క చీనా, జపాన్‌దేశాల తత్వచింతనను గురించి తప్ప అన్ని ప్రపంచ తత్వ శాస్త్రాలను గురించి సవిమర్శకంగా వివరిస్తుంది. అదొక అపూర్వ గ్రంథం. ఏ దేశంలో ఏ కాలంలో జ్ఞానవికాసం కలిగినా అది మానవజాతి అంతటి సొత్తని చాటుతుంది.

గొప్ప దేశభక్తుడు, విస్తృత యాత్రికుడు, మానవత కలిగిన మహామనీషి, మహాపండితుడు, బహుభాషావేత్త అయిన రాహుల్ సాంకృత్యాయన్ ధన్యజీవి, ఆదర్శజీవి, అమరజీవి."

**– వి.ఆర్. బొమ్మారెడ్డి.**

* * *

# తెలుగువాళ్ళు

"ఓసారి తారానాధ్‌గారు అడిగారు నన్ను – "నువ్వీ విధంగా రాస్తో వుంటే, నిన్ను గొప్ప ఊరేగింపులన్నా చెయ్యవలసింది; అంతకన్నా సహజం, నీ ఇల్లు తగులబెట్టి, నిన్ను దేశానికి అవతలగాన్నన్నా తరమవలసింది. ఎట్లా భరిస్తున్నారు నిన్ను ?" అనీ.



చెలం

"కానీ మా వాళ్ళు తెలుగువాళ్ళు" అన్నాను. నా కథలు సరిపడని నా దగ్గరి మిత్రులు – నన్నూ నా గొడవనీ చూసి, హాయిగా నవ్వుతారు. ఏమంటారు సుబ్బారావుగారు, 'కేర్ ఆఫ్' గంగానమ్మ, తెనాలి!

ఓసారి "వెంకటరమణయ్యగారు కనపట్టం లేదేం ?" అని అడిగాను, చచ్చిపోయిన సూరి వెంకటేశ్వర్లు గారిని. "గ్రంథాలయ యాత్రకు బైలుదేరాడు" అన్నారు ఆయన నవ్వుతూ. "ఎందుకండీ! ఇంత పని పెట్టుకుని!" అన్నాను. "అది ఓటిపెట్టుకున్నాడు వాడు. అట్లా తిరుగుతూ వుండి ఓ ఘనకార్యం చేస్తున్నట్టు, కానీండి, వొస్తాడు" అన్నారు తేలికగా. తక్కిన దేశాల వాళ్ళు అట్లాంటి పనులు చేస్తున్నారని – ఈ గౌరవాలు, స్తుతులూ, ఊరేగింపులూ బలవంతపరుచుకుని చేస్తారుగాని తెలుగువాళ్ళు – వాళ్ళ స్వభావంలో లేదు.

నేను మొదట రాతరోజుల్లో 'సుశీల' అనే కథ రాసినప్పుడు – వెంటనే మండిపడ్డాయి పత్రికలు, "ఇట్లాంటి కథలు రాయనిస్తారా ? ఏం చేస్తున్నారు – కాళేశ్వరరావుగారూ, ప్రకాశంగారూ" అని. కాని కాళేశ్వరరావుగారు నాతో "నేనూ ఓ పుస్తకం రాస్తున్నాను. అయితే మీ లైను వేరులెండి" అన్నారు కులాసాగా.


అదీ తెలుగువాళ్ళ లక్షణం. గట్టిగా కోపం తెప్పించుకుని ఆపించవలసినంత ప్రాముఖ్యంగా వాళ్ళకి ఏదీ కనబడదు– చెలమైనా సరే."

– చెలం

* * *

# వ్యంగ్యం

"చక్రపాణి (ఆలూరి వెంకట సుబ్బారావు) గారికి వ్యంగ్య రచనలంటే చాలా ఇష్టం. అందుకే వారు యం.యస్. మూర్తిగారి "రాజూ–మంత్రి", "చుక్కలు–గీతలూ" మొదలైన రచనలు యువ ప్రచురణల తరఫున వెలువరించారు. "ఆంధ్రజ్యోతి" మాసపత్రికలో 'పనిలేని మంగలి' శీర్షిక క్రింద వారు రాసిన రచనలు ఈ కోవకు చెందినవే. 1945 లో ఒక మహాకవి షష్టిపూర్తి జరిగితే 'ఆంధ్రపత్రిక'లో ముష్టిపూర్తి అనే వ్యంగ్య రచన చేశారు. జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి గారిపై "మలమూత్రం" అనే పేర పేరడీ రాస్తే జనం నవ్వుకుని చచ్చారు. ఈ రచన కవి కిశోర్ పేర అచ్చయింది."



చక్రపాణి

– ఈదర లక్ష్మీనారాయణ

* * *

# విచిత్రమైన వ్యక్తి


విశ్వనాథ

"విశ్వనాథ సత్యనారాయణగారు ఒకసారి మా ఇంట వున్నప్పటి సంగతి. ఆయన మంచం మీద పడుకుని వున్నారు. ముందటి సోఫాలో నేను కూర్చుని మాట్లాడుతున్న. ఇంతలో గార్లపాటి రాఘవరెడ్డి గారు వచ్చిన్రు. నేను పరిచయం చేసిన – మా గురువుగారు, సంస్కృతం వచ్చును, తెలుగులో కవిత్వం రాస్తరు అని. విశ్వనాథ అట్నే పడుకుని "రెడ్డిగారూ, ఏవన్నా రెండు పద్యాలు వినిపించండి" అన్నడు. ఆయన నోటికి వేనవేల పద్యాలు వచ్చేటివి – తనవీ వేరేవాళ్ళవి కూడా. మంచి పద్యం లక్షణం – అది వినగానే జ్ఞాపకం వుండిపోవాలె – అదే మంచి పద్యానికి గీటురాయి అనేటోడాయన. తన వేణుగోపాల శతకంలోంచి ఒక పద్యం వినిపిచ్చిండు. వింటున్న విశ్వనాథ లేచి కూచున్నడు. రెండో పద్యం విని మంచం దిగిండు. సోఫాలో వున్న మా దగ్గరికి వచ్చి రాఘవరెడ్డిగారి పక్కన కూచుని రెండు చేతులూ పట్టుకున్నడు – సంతోషంతో కన్నీళ్లు! విశ్వనాథ ఎంతో ఆనందపడ్డడు.

విశ్వనాథ వానమామలై వరదాచార్యులవారి 'మణిమాల' కావ్యానికి పీఠిక రాస్తూ "ఈసారి వరంగల్ పోయి వచ్చినప్పుడు రాఘవరెడ్డిగారనే మంచి కవి పరిచయం కావడం, కాళోజిగారి ఆతిథ్యం మర్చిపోలేని విషయాలు" అన్నడు. విశ్వనాథ విచిత్రమైన వ్యక్తి. ప్రైవేటుగా మాట్లాడుతున్నప్పుడు ఎవరి కవిత్వమైనా బాగుంటే మెచ్చుకునేటోడు. ప్రభావితుడయెటోడు. మంచి రసికుడనిపించేటిది. మరి వేదిక ఎక్కినప్పుడు ఏమయ్యేదో ఏమిటో, తానే తప్ప ప్రపంచంల కవి లేడన్నట్టు విచిత్రంగ మాట్లాడెటోడు. ఈ భేదం అంచనాకి అందదు."

– కాళోజీ

* * *

# మార్క్సిస్టు గ్రంథాలు


గోర్కీ

"1934 జులైలో గోర్కి 'మదర్'ని 'మాతృహృదయం' పేరుతో తుమ్మల వెంకట్రామయ్య సంక్షిప్తానువాదం చేశారు. కార్మిక సంఘ ప్రచురణలుగా అది అచ్చయింది. పూర్తి నవలను కాంగ్రెస్ సత్యాగ్రహి క్రొవ్విడి లింగరాజు జైల్లో అనువదించారు. 1934 చివర్లో (గోర్కి 'అమ్మ'కు చార్లెస్ ఎడ్వర్డ్ రస్సెల్ చేసిన ఇంగ్లీషు అనువాదాన్ని లింగరాజుగారు తెలుగు చేశారు) ఆదర్శ గ్రంథమండలి తరఫున గద్దె లింగయ్య అచ్చు వేశారు. 1935 లో ప్రభుత్వం దాన్ని నిషేధించింది. అయితే దాని ప్రతులను ఎందరో రహస్యంగా చదివి

ఉత్తేజితులయ్యారు. ఉద్యమములోకి వచ్చారు. రష్యా విప్లవంలో 'అమ్మ' నిర్వహించిన పాత్రనే మన రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో 'అమ్మ' నిర్వహించింది. ఇదే కాలంలో గోర్కి కథలను కూర్మా వేణుగోపాలస్వామి దంపతులు అనువదించారు. అనేక మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలకు అనువాదాలు ఇదే కాలంలో వెలువడ్డాయి. ముంగండ నుంచి విశ్వసాహిత్యమాల, నిడమర్రు నుంచి ప్రగతి ప్రచురణాలయం, ఎలమర్రు నుంచి ఆదర్శ గ్రంథమండలి, అనంతవరం నుంచి కార్మికసంఘ ప్రచురణలు వీటిని ప్రకటించాయి. కమ్యూనిస్టు ప్రణాళిక 1934 లోనే రెండు ముద్రణలు పొందింది. లండన్ గ్రంథాలయానికి పంపడానికి కృష్ణాజిల్లా కలెక్టర్‌కి ఒక్క ప్రతి కూడా దొరకలేదట! అంటే అంత త్వరగా అమ్ముడు కావడమూ, అజ్ఞాతవాసానికి వెళ్ళడం కూడా జరిగింది.

1934 లో ప్రభుత్వం అభ్యంతర గ్రంథాల జాబితా క్రింద నిషేధించిన పుస్తకాల జాబితాలో (మాలపల్లి కూడా ఉన్నది) మార్క్సిస్టు గ్రంథాలే అధికం – నేటి రష్యా (నార్ల రచన) గారిబాల్డీ జీవితం, సామ్యవాద సిద్ధాంతాలు, సామ్రాజ్యవాదం, కమ్యూనిస్టు ప్రణాళిక (గద్దె లింగయ్య అనువాదం), ధన ప్రభావం, ట్రాట్స్కీ జీవితం, కార్మిక భజనావళి మొదలైనవి."

**– బోడేపూడి చిరంజీవిరావు**

❋ ❋ ❋

# తిరగబడ్డ కవులు

"1969 లో మార్క్సిస్టు పార్టీ లోంచి చీలిపోయిన తీవ్రవాదులతో విప్లవ రాజకీయ పార్టీ ఏర్పడింది. అదే భారత కమ్యూనిస్టు పార్టీ యం.యల్. (మార్క్సిస్టు – లెనినిస్టు). దానితో సాయుధ పోరాటానికి తెలుగు కవులు వెంటనే స్పందించారు. 'సహనం సంస్కృతీ చిహ్నం కాదు, గాడిద లక్షణం'. 'జీవితమంటే సమిష్టి మనుగడ – బతుకొక స్వేచ్ఛ, ఆనందం, హక్కు, ఆకాంక్ష, దాన్ని సాధించడానికి ఆయుధం కావాలి' అంటూ ప్రకటించారు వరంగల్ నుంచి తిరగబడు కవులు. వారు – వరవరరావు, అశోక్, లోచన్, కిషన్, ఎక్స్‌రే ఐ, సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావు. 1969 డిసెంబరులో "విషం కలిపిన పాయసం మన స్వరాజ్యం, డబ్బున్న భడవా పోషించే ఉంపుడుగత్తె మన ప్రజాస్వామ్యం, మన ప్రణాళికలూ, తీర్మానాలు, వాగ్దానాలు, రేడియోలు, పత్రికలు, సినిమాలు, సాహిత్యం – ఒకటేమిటి, అన్ని రంగాలూ ఇరవయేళ్ళకే పడుపు కూడు తిని రాగూడని రోగాలు తెచ్చుకుని ముసలిదైన దీని విలాసాన్ని వర్ణించటానికే ఖర్చయిపోతున్నాయి... శాంతియుత పోరాటం అసంభవం, పోరాటం లేకుండా నిజమైన శాంతి రాదు... ... సామ్యవాద సమాజాన్ని నిర్మించాలి. ఈ వ్యవస్థకు శస్త్ర చికిత్స చేసి కొత్త వ్యవస్థను నిర్మించడానికి త్యాగాలు, బలిదానాలు తప్పవు" అంటూ "తిరగబడు" కవితా సంకలనం వెలువరించారు."

❋ ❋ ❋

# పరిచయం

"ఒకనాడు చెళ్ళపిళ్ళకి నన్ను విశ్వనాధవారు పరిచయం చేశారు – "వీడు మనవాడు" అంటూ. నన్నేదేనా పద్యం చదవమన్నారు చెళ్ళపిళ్ళ. ఆ రోజుల్లో నేను "సిరిసిరి మువ్వ" శతకం రాస్తుండేవాణ్ణి. అందులోని "ఇష్టదేవతా ప్రార్ధన"లోని కవి చౌడప్ప మీద పద్యం చదివేను.

"ఏడి కవిగాడీ భువి
గాడిద యేడుపును పాడగలిగిన వాడౌ
చౌడప్ప కీడు ? కరని
ష్ఫోడన కర్త్వుడు లేడు, సిరిసిరిమువ్వా!"

ఇది చెళ్ళపిళ్ళవారికి నచ్చింది. కాని పద్యం బాగున్నా కవి చౌడప్పను పొగడడం బాగులేదన్నారాయన. "బూతు కవిత్వం మీకిష్టం లేదా ?" అని అడిగేను. "నీతి బాహ్యం కాని బూతు నా కిష్టమే" అన్నారాయన. నీతి ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుందనీ, నిన్నటి అవినీతి రేపటి నీతి అవుతుందనీ ఇలా ఎన్నో విధాల వాదించాలనుకున్నాను. విశ్వనాధవారు సంభాషణను మరో మార్గానికి మళ్ళించారు."

– శ్రీశ్రీ

* * *

# రచన



ఉప్పల లక్ష్మణరావు

"1949–50 లో నా నవల "అతడు–ఆమె" పూర్తి చేశాను. అప్పుడే అభ్యుదయ రచయితల సంఘంలో చేరాను. వొక ప్రఖ్యాత సాహితీపరునిచే నా నవలకు పీఠిక రాయించాలని అభ్యుదయ రచయితల సంఘం నిశ్చయించుకుంది. కాని ఆ సాహితీపరునికి యితర పనుల వొత్తిడి చేత పీఠిక రాయలేక, ఆ పనిని వెనక్కి పెట్టేశారు. నవలలకు పీఠిక అవసరం లేదు, పాఠకులకు కుతూహలంగా వుంటే నవల నాలుగు కాలాలపాటు పాఠకులను ఆకర్షించగల్గుతుంది అని నేను వాదించాను. ఈలోపున నవల అచ్చు అయింది. దానిని బైండు చేసి, ప్రచురించడానికి పీఠిక కోసం కాచుకుని కూచున్నారు. అప్పట్లో చదలవాడ పిచ్చయ్యగారు అభ్యుదయ రచయితల సంఘానికి కార్యదర్శిగా వుండి నవల పూర్తి చేయడానికి నన్ను చాలా ప్రోత్సహించారు. వారు యెంతో శ్రమ తీసుకుని కాగితం కోసం లైసెన్సు పొంది నవలను అచ్చు వేయించారు. నాకు ముందుగా వొక ప్రతిని స్టేపిల్సు కొట్టి ఇచ్చారు. నవల ధారావాహికంగా మా కుటుంబ లిఖిత మాసపత్రికలో చదివి మా కుటుంబంవారు చాలా ఆనందించారు. అయినా పుస్తక రూపంలో అచ్చుపడిన ప్రతిని చదివి ఆనందిస్తారనే భావంతో మా అమ్మగారితోనూ, మా పినతల్లిగారితోనూ అన్నాను – "ఇదిగో నవల పూర్తి

పాఠం. ఇప్పుడు సొంతం చదివి మీ అభిప్రాయం చెప్పండి" అని గొప్పగా అన్నాను. వారందరూ చదివారు. మా అమ్మగారు చదివి పెదవి విరిచేసి "మొగుడూ పెళ్ళామూ కీచులాట ఏమంత బాగాలేదు. దేశంలో స్వాతంత్ర్య యగ్యం జరుగుతూంటే, యీ మహా సంగ్రామాన్ని పూర్వరంగంగా మంచి నవల చిత్రించి వుంటే బాగుండేది, నవలకు కొంత విలువ వుణ్ణు. ఇప్పటి రూపంలో నవల అతిసామాన్యంగా వుంది" అనేశారు. మా పినతల్లులు అందరూ ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. నాకు చాలా ఆశాభంగం కల్గింది. రెండ్రోజులు అన్నం కూడా తినలేకపోయాను. బాగా ఆలోచించుకునేసరికి అమ్మగారి విమర్శలో న్యాయం వుందనే తోచింది. వెంటనే బెజవాడ రాసేశాను – నవల ప్రచురణ ఆపివేయవలసిందని, నేను బెజవాడ వెళ్ళి అన్ని సంగతులూ పిచ్చయ్యగారితో వివరించాను. నవల కొత్తగా రాస్తాను అన్నాను.

అప్పటికే ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం, దమనకాండ ప్రారంభించింది. అభ్యుదయ రచయిత సంఘం పని పూర్తిగా స్తంభించిపోయింది. మా అమ్మగారి విమర్శ మనస్సులో పెట్టుకుని నవల తిరిగి రూపొందించడం మొదలుపెట్టాను. ఆ సంవత్సరం (1950) అంతా నవల తిరిగి రాయడంలోనే మునిగిపోయాను. కొన్ని ప్రకరణాలు వుంచి, అనేక క్రొత్త ప్రకరణాలు చేర్చి, కథ మలచవలసి వచ్చింది. కొంత భాగం చెన్నపట్నంలోనూ, కొంత భాగం బెజవాడలోనూ అచ్చు వేయించాను. కొమర్రాజు వినాయకరావు ప్రకాశకులుగా వుంటామన్నారు. పుస్తకం ప్రచురించి విడుదల చేశాను. కాని నవలను సమీక్షించేవారే లేకపోయారు. నవలలో చేవ అంటూ వుంటే పుస్తకానికి యెప్పటికైనా పాఠకులంటూ వుండకపోరు అనుకున్నాను."

**– వుప్పల లక్ష్మణరావు**

* * *

# ఋణం


రావూరి భరద్వాజ

"రావూరి భరద్వాజ రూపకం 'నికషం' 1950–51 ఆకాశవాణిలో ప్రసారమైంది. రేడియో వారితో పరిచయాలు రేడియోకి మాత్రమే పరిమితమయి ఉండలేదు. పని ఉన్నా, లేకపోయినా ప్రతి ఆదివారం విజయవాడ పోతూ వుండేవాడు. శ్రీయుతులు చలం, బుచ్చిబాబు, ఆరవి, సదాశివరావు, కొప్పరపు సుబ్బారావు, గద్దె లింగయ్య, బొందలపాటి శివరామకృష్ణయ్య, కాశీవిశ్వనాథం ఇలాగా – అతనికి తెలిసినవారు, అతనంటే అభిమానమున్న వారూ విజయవాడలో చాలామంది ఉండేవారు ఆ రోజుల్లో.

ఓసారి డ్రామా ఆర్టిస్టునవుదామని ఆడిషన్‌కు హాజరయ్యాడు భరద్వాజ. బుచ్చిబాబుగారంటే పడని ఒక ఆఫీసరు అతని మీద ఉన్న అక్కసును, కోపాన్ని భరద్వాజ

మీదకు మళ్ళించి, భరద్వాజ గొంతు 'మైక్'కు అనుకూలం కాదని తీర్పు చెప్పాడు. ఆ కాగితం చూసుకొని, తనలో తానే నవ్వుకున్నాడు భరద్వాజ.

ఆ రోజుల్లోనే విజయవాడ కేంద్రంలో ఎనౌన్సర్ ఉద్యోగం ఒకటి ఖాళీ వచ్చింది. బుచ్చిబాబుగారు భరద్వాజ కోసం ప్రయత్నించారు. కానీ పింగళి లక్ష్మీకాంతం గారు మధ్యలో అడ్డుపడి ఆ ఉద్యోగం ఇంకెవరికో ఇప్పించారు. 1956 లో మద్రాసు వెళ్ళాడు భరద్వాజ. మరోసారి మద్రాసు రేడియో కేంద్రంలో డ్రామా ఆడిషన్‌కు హాజరయ్యాడు. ఇప్పుడతని గొంతు"అద్భుతంగా వుంది." అలా అన్నవారు – నాటకశాఖ ప్రయోక్త శ్రీ అమంచర్ల గోపాలరావు. మద్రాసు రేడియో కేంద్రం నుండి చాలా నాటకాలు, ప్రసంగాలు ప్రసారం చేశాడు భరద్వాజ. ఎన్నో నాటకాల్లో పాల్గొన్నాడు కూడా.

1959 ఏప్రియల్లో హైదరాబాదు వచ్చాక – హైదరాబాదు రేడియో కేంద్రంలో అతను తొలిసారిగా ప్రసారం చేసిన ప్రసంగ శీర్షిక "నా పుస్తకాల బీరువా" అని. శ్రీ నండూరి విఠల్ ఆ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రేడియోలో స్క్రిప్టు రైటరు ఉద్యోగం ఉన్నదన్న సమాచారం అప్పుడే తెలిసింది. భరద్వాజ దరఖాస్తును ఇంగ్లీషులోకి అనువదించారు శ్రీ బాలగురుమూర్తి. శ్రీయుతులు ఆరవి, బుచ్చిబాబు భరద్వాజకు వత్తాసుగా నిలిచారు. శ్రీ గోపీచంద్ పూర్తి భారాన్ని తన భుజాలకెత్తుకున్నాడు. అతనికి రేడియో ఉద్యోగం వచ్చింది – 1959 నవంబరు 25 న. అప్పట్నించీ 1969 వరకు అతను గ్రామస్తుల కార్యక్రమ విభాగంలో పని చేశాడు.

1969 నుండి 1975 వరకు చిన్నపిల్లల కార్యక్రమాలను నిర్వహించాడు. తనను ప్రొడ్యూసర్‌గా నియమించమని అడిగితే, విద్యార్హతలు చాలవని, సాకు చెప్పారు అధికార్లు. 1975 లో శ్రీ పెండేకంటి వారి చొరవతో అప్పటి సమాచార ప్రచార శాఖ కార్యదర్శి శ్రీ ఎ.జె. కిద్వాయ్ – భరద్వాజ కేసునంతా క్షుణ్ణంగా పరిశీలించి జరిగిన అన్యాయాన్ని సవరిస్తూ, భరద్వాజను ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.


"ఆ పార్లమెంటు సభ్యుని రుణమూ, ఎ.జె. కిద్వాయ్ గారి రుణమూ నేను జన్మజన్మలకూ తీర్చుకోలేను. ఈ సందర్భంలో నాకు అన్ని విధాలా అండదండలుగా నిలిచిన మంచాల జగన్నాధరావు, వాడ్రేవు పురుషోత్తం గార్ల రుణం ఏవిధంగానూ తీరదు" అంటుంటాడు భరద్వాజ ఇప్పటికీ!"

**– త్రిపురనేని సుబ్బారావు.**

* * *

# వారసత్వం

"శ్రీరంగం శ్రీనివాసరావు విశాఖపట్నంలో నెలరోజులపాటు మంచం పట్టి టైఫాయిడ్ జ్వరం నుండి పునర్జన్మను సాధించుకొంటున్న రోజుల్లో (1930), జ్వరంతోపాటు మనసుకు పట్టిన మకిలి పెచ్చులు, పెచ్చులుగా ఊడి వచ్చింది. "పులుగడిగిన ముత్యం"లాగా మారింది.



శ్రీశ్రీ

మది బూజు తుడిచిన గది. దృష్టి, 'గుష్టి' (గురి అని మా పల్లె ప్రాంతాల్లో అర్థం) గురజాడ అప్పారావు ఆకట్టుకొన్నారు. తనకు ఐదేళ్ళ వయస్సున్నప్పుడు ఆయనకు నేలమీద నూకలు చెల్లుకున్నాయి. బసవరాజు అప్పారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, చింతాదీక్షితులు గురజాడను మెచ్చారు. బసవరాజైతే గురజాడ బాణీలో తన వాణిని మలచుకున్నాడు. అది గేయభణితి వరకే. గురజాడ నవ్యభావనల జ్వాల వారి మనస్సులను వెలిగించలేదు. శ్రీశ్రీ పట్ల అంత పనీ చేసింది. మొదట శ్రీశ్రీ అనే కృష్ణ సర్పపు కుబుసాన్ని అవలీగా కరిగించి వేసింది. ఒక మహారచయితకు దారి సుగమం చెయ్యడం కోసం తాను వ్యావహారికాంధ్రాన్ని చేబూని గ్రాంథిక భాషారణ్యాన్ని కొట్టివేయబూనినట్లు గురజాడ రాసుకున్నాడు. మరి ఆ మహారచయిత ఈ శ్రీశ్రీ యేనా ? అవును కాబోలు!

ఒక్క గురజాడ మాత్రమే ఏకాంగి వీరుడై, పనిపోగొట్టుకొని పనికిమాలిన పత్రికలో అక్షరాలా అణా బేడా రచనలు రాసి ప్రకటించి కాఫీనో, టీనో త్రాగి, చార్మినారో మరోటో నుసిచేసి, వీధులవెంట ఉల్ఫాగా తిరుగుతూ ప్రతిభావంతుడై కూడా అరాచకజీవిగా దినాలు వెళ్ళబుచ్చే ఒక కుర్రవాణ్ణి అమాంతం యుగకవిగా మార్చి వేయగలడా ? అలా అని నేననుకోను. ఎంత అరాచక జీవో అంతకంతటి సమన్వయ బుద్ధి కాబట్టి ఒక గొప్ప వారసత్వాన్ని తన మూపున వేసుకున్నాడు శ్రీశ్రీ. అందులో ఒక్క గురజాడ మాత్రమే కాదు, ప్రపంచ రాజకీయ జీవితంలో భూకంపం కలిగించిన సోవియట్ రష్యా దేశపు కవులైన అలెగ్జాండర్ బ్లాక్, వ్లాడిమిర్ మాయాకోవస్కీ, బోరిస్ పాస్టర్నాక్ ప్రభుతులు ఉన్నారు. అలాగే ఫ్రాన్స్ దేశపు సింబాలిస్టులైన బోదలేర్, రాంబోలున్నారు. మరి వారికి ఇంగ్లాండ్‌లో సన్నిహితుడైన స్విన్‌బర్న్ ఉన్నాడు. ఫ్రెంచ్ సింబాలిజానికి ప్రాణభిక్ష పెట్టిన అమెరికన్ కవి ఎడ్గార్ అలన్ పో ఉన్నాడు. ఒకరితో ఒకరికి పొంతనే లేదనిపించేంతగా వేరువేరు భావజాలాలకు వేర్వేరు పరిస్థితులకూ సంబంధించిన ఈ రష్యన్, ఫ్రెంచి ప్రభావాలు శ్రీశ్రీలో సంఘమించాయి. వింత అంతటితో ముగిసిపోలేదు. దేశి సరస్వతి అంతర్వాహినిగా ఉంటే దాన్ని మళ్ళీ తెలుగువారి కళ్ళకు కన్పరచిన గురజాడ ఆదేశం ప్రత్యక్షంగానూ ఉంది. ఈ మూడు పాయల కలయికతో శ్రీశ్రీ ప్రయాగ క్షేత్రమయ్యాడు. వింత అంటే ఇదే! కనుకనే శ్రీశ్రీ కొత్త యుగంలో పుట్టిన INFANT TERRIBLE కాగలిగాడు."

**– కె.వి. రమణారెడ్డి**

* * *

# జీవన పోరాటం

"మహాదేవశాస్త్రిగారు వైద్యశాస్త్రం తెలిసినవారు. వారి వద్ద కొంత వరకు శాస్త్ర రీత్యా విద్య నేర్చినాను. వైద్య గ్రంథములు చదివి వైద్య రహస్యములు బోధపరచుకున్నాను. కొన్ని మందులను తయారుచేసి కోమట్ల ఇండ్లలో వైద్యం చేసేవాడను. శ్రీ పాలూరి రాజంశెట్టిగారు

నీలిమందు వర్తకం చేసేవారు. వర్తకులలో ప్రముఖులు, కన్యకా పరమేశ్వరీ దేవాలయపు ఆస్తికి ట్రస్టీలలో ముఖ్యులు. సరిగా ఆ కాలమందే వారు కన్యకా పరమేశ్వరీ ధర్మ ఆయుర్వేద వైద్యశాల అని యొకటి స్థాపించినారు. దానిలో శ్రీ పండిత డి. గోపాలా చార్యులు గారిని వైద్యులుగా నియమించినారు. శ్రీ రాజంశెట్టి గారికి నేను తరచుగా పుల్లటి మందులు పెడుతూ వుండేవాడిని. వారు దానికని నా యందెంతో దయగా ఉండేవారు. ఆ పరిచయం చేత వారు మిగతా ట్రస్టీలకు సిఫారసు చేసి, నన్ను కూడా ఆ కన్యకా పరమేశ్వరీ ట్రస్టు ధర్మాయుర్వేద వైద్యశాలలో నాలుగు సంవత్సరాలు పని చేయించారు. పిదప వారికీ నాకూ సరిపడలేదు. నేను ఆ ఉద్యోగానికి రాజీనామా నిచ్చినాను. స్వయంగా, స్వతంత్రముగా 'వైద్యాలయం' ఏర్పాటు చేసుకుని పొట్ట పోసుకోదలచినాను. ఆ ధర్మశాల యుండిన నారాయణ మొదలి వీధిలోనే, ఒక ఇల్లు నెలకి 1కి రూ. 1-6-0 కి బాడుగకు తీసుకుని, వైద్యమారంభించాను. మందులు చేసుకోడానికీ, కాపురముండటానికీ అదే ఇల్లు. ఈ నూతన యత్నారంభం చేసిన రోజుననే – ఆ యింటి వీధి గోడమీద బొగ్గుతో పెద్ద అక్షరాలలో "కేసరి కుటీరం – ఆయుర్వేద ఔషధశాల" అని వ్రాశాను. అదే నా అదృష్టరేఖ ధరించిన మొదటి సైన్‌బోర్డు.



కె.ఎన్. కేసరి

అప్పటి నుండీ ఇప్పటి వరకు ఈ వృత్తిలో కూడా నాకు చాలా కష్టములు కలిగినప్పటికి వాటినన్నింటినీ జయించుకొని కొన్ని సంవత్సరములుగా ఏ ఇబ్బందియు లేక స్థిరపడినాను. ఇది నా నిజవృత్తాంతం.

ఇన్ని కష్టములు పడిన్నీ చేసిన ఘనకార్యములేమిటి ? అని మీరు నన్ను అడుగవచ్చును. చెప్పెదను –

చిన్నతనంలో, ఇల్లువాకిలి లేనివానినిగా చేసి నన్ను రావిచెట్టు క్రింద కాపురముంచి నందుకు – దేవుని మీద కోపం వచ్చి – నివసించడానికి మంచి భవనం నిర్మించుకున్నాను.

చిన్ననాడు విద్యకై పడిన కష్టములు మరువజాలక, ఈ విద్యాలయం స్థాపించినాను.

చదువుకొనునప్పుడు నన్నాదరించి, నాకు అన్నం పెట్టిన అమ్మల అమృతహస్తములను ఏటేటా 'గృహలక్ష్మి స్వర్ణ కంకణము' అనే పేరుతో బంగారు తోడాలను తొడుగుతున్నాను.

ఇప్పుడు మరొక కార్యము చేయదలచుకున్నాను. నన్ను ఈ స్థితికి తెచ్చినది స్త్రీల ఆరోగ్యమునకై తయారు చేయబడుచుండిన "లోధ్రా" అనే ఔషధరాజము. ఈ ఔషధము వల్ల నాకింత సంపాదనము చేకూరినది. ఈ దినం స్త్రీల విద్యాభివృద్ధికై – లక్ష రూపాయలను

స్కూలు కమిటీ పరముగా ఇచ్చుచున్నాను. ఈ ధనము వెచ్చించి "కేసరి కన్యా విద్యాలయం" అనే పేరుతో ఆడబిడ్డలకు ప్రత్యేకముగా ఒక విద్యాలయం నెలకొల్పండి – అని ఈ కమిటీ వారిని కోరుచున్నాను."

**– కె. ఎన్. కేసరి.**

(26–4–1948 న 73 వ జన్మదిన ఉపన్యాసము నుండి)

❋ ❋ ❋

# వియోగం

"రష్యాలో, ఆనాడు 1965 జులై ఆదివారం. మా మామూలు ప్రకారం ఉదయమే లెనిన్‌పార్కుకి షికారు వెళ్ళి యింటికి వచ్చి యిద్దరం కసరత్తు చేసి, మా ఆవిడ మెల్లీ ఈతకు వెళ్ళి వచ్చింది. ఆనాడు మా ప్రచురణాలయం ప్రధాన సంపాదకురాలు స్వెత్లానాగారు ఫోను చేసి నన్ను 11 గంటలకే ప్రచురణాలయానికి రావలసింది, తొందర పని వుందని చెప్పింది. ఆ ప్రకారమే తొందరగా వంట చేసి, యింట్లో పెరుగు బిళ్ళ లేదని మా ఆవిడ బజారుకెళ్తానంది. "ఈ వేళ వేగిరం రమ్మని స్వెత్లానా ఫోను చేసింది. పెరుగు లేకపోతేనేం, యీ రోజు పెరుగు లేకుండానే భోంచేద్దాం" అన్నాను. "నీ వంటి తత్వం నాకు తెలుసు. నీకు పెరుగు లేకపోతే వంటికి కాక చేస్తుంది. నేను వీధి చివర షాపులో పెరుగు కొనుక్కొని యిట్టే వచ్చేస్తాను" అని వెళ్ళింది. మరి ఆమె ఇంటికి రాలేదు.

ఒక అరగంట తరువాత నాకు టెలిఫోను – "మీ భార్యగారు మెల్లీషోయంగరు గారికి రోడ్డు ప్రమాదంలో గట్టి దెబ్బలు తగిలాయి, మీ ఇంటి ఎదుటనే. మీరు వెంటనే రండి" అని పోలీసువారు ఫోనులో చెప్పారు. నేను మొదట నమ్మలేదు. కాని మళ్ళీ టెలిఫోనులో ఆ సంగతి పోలీసువారు చెప్పారు. నేనప్పుడు కిందికి ఆదరాబాదరా వెళ్ళాను. మా పక్కయింటి శ్రీమతి శ్రీపాద గోపాలకృష్ణమ్మ గారు కూడా పరిగెత్తుతూ రోడ్డుమీదకి వచ్చి, నన్ను చూచి చెప్పారు. "మా లిఫ్టు మనిషి కూడా ఇప్పుడే చెప్పిందండీ, ఆంటీ గారికి రోడ్డు ప్రమాదంలో ప్రమాదకర దెబ్బలు తగిలాయని, నేనూ అక్కడికే వెళ్తున్నాను" అన్నారు. మా ఇంటికి నూరుగజాల దూరంలోనే ఈ ప్రమాదం జరిగింది. కాబట్టి మేం వెంటనే అక్కడికి చేరుకున్నాం. మేం వెళ్లేసరికి అప్పుడే అంబులెన్సు వచ్చి మా ఆవిడను ఆస్పత్రికి తీసుకువెళ్ళిపోయింది. "ఆమెకు చాలా గట్టి దెబ్బలే తగిలాయి. వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఆమెను ఢీకొనగా ఆమె పడిపోవడంతో తలకి పేవుమెంటు అంచు తగిలి కపాలం బద్దలైపోయింది. బతకడం కష్టం. వచ్చే ప్రాణం పోయే ప్రాణం స్థితిలో వుంది. మీరు ఒక మాటు వచ్చి చూడండి" అన్నారు ఆస్పత్రి డాక్టరు గారు.

నేను వెళ్ళి చూసేటప్పటికి ఆమెకు స్పృహ లేదు. ఈ కబురు తెలిసి మా స్నేహితులందరూ ఆస్పత్రికి వచ్చారు. కాస్సేపు నేను ధైర్యంగానే వున్నాను. కానీ మా స్నేహితుడు హబీబూ, ఆయన భార్య మీరాను చూసి యిక దుఃఖం ఆపుకోలేక కళ్ళ వెంట నీళ్ళు ధారలుగా కారాయి.

ఇక లాభం లేదని తెలిసి అందరం ఇంటికి వెళ్ళిపోయాం. మరునాడు ఉదయం 4 గంటలకు ఆమె చనిపోయిందని ఫోను వచ్చింది. నలభై మూడేళ్ళ సాహచర్యం, సమిష్టి జీవితం ఒక్కసారి దారప్పోగు తెగిపోయినట్టు పుటుక్కున తెగిపోయింది.

నాకు భార్యా వియోగం కలిగిన మొదటి మూడ్రోజులూ నన్ను విడవకుండా తన సాంగత్యాన్ని అందించి, నాకు ధైర్యం చెబుతూ నాకు అన్ని విధాలా సహాయం చేసిన వోలేటి బంగారేశ్వర శర్మగారికి నేను సర్వదా కృతజ్ఞుణ్ణి."

**– వుప్పల లక్ష్మణరావు.**

* * *

# గీటురాయి

"బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారు వేదాలన్నింటినీ తెలుగు వచనంలోకి అనువదించారు. వాటిని అచ్చు వేయడానికి గుంటూరు వదాన్యులు సిద్ధపడ్డారు. ఋగ్వేదం ప్రథమ మండలంలో కొంతభాగం గ్రంథరూపాన వెలువడింది. మరికొంత అచ్చు అయి బైండింగు దశకు వచ్చింది. కాని ఏ కుట్ర ఫలితమో యేమో! అనధికార సెన్సారు రంగంలోకి దిగింది. అచ్చు అయిన ఫారాలు తగలేశారు. అచ్చుకాని వ్రాత ప్రతులేమయ్యాయో ఎవరికీ తెలీదు. వేదాలను తెలుగు చేసిన పాపానికి స్థితిమంతులు వెలివేశారు. కూతురికి పునర్వివాహం చేసినందుకు కులస్వాములు వెలివేశారు. ఈ రెండు వెలులనూ తలదాల్చిన ఆ పండితుడు కొసకు అనాధ ప్రేతంగా పూరీ సముద్రతీరాన జనం కంటపడ్డాడు.


సంస్కృత, ప్రాకృత, ఆంధ్ర సాహిత్యాల్లో పండితుడు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు. ఆయన ప్రాకృత – ఆంధ్ర సాహిత్య చరిత్రలు రాసినట్లు ప్రతీతి. కాని వాటి లిఖిత ప్రతులు కూడా కానరావు. వాత్సాయన కామసూత్రాలు, వాటికి పలువురు పండితులు రాసిన వ్యాఖ్యానాలు తెలుగు చేశారు. సొంతగా అచ్చు వేయించాలని నిర్ణయించారు. బరంపురంలో ఒక ఫారం అచ్చు వేసేసరికి పండిత మందేహులు అడ్డుపడ్డారు. ప్రెస్ యజమాని మెడలు వంచి అచ్చు మాన్పించారు. బరంపురం నుంచి బయలుదేరిన తర్వాత ప్రతిచోటా ఇదే పద్ధతి. ఆ పద్ధతిని ఎదుర్కొంటూ ఊరికో ఫారం అచ్చు వేయించాలనుకుంటూ మద్రాసు వరకు అంచె అచ్చుల మీద పుస్తకం పూర్తి చేయగలిగారు. వాత్సాయన సూత్రాలను గురించి యెరిగిన వారు తక్కువ. దానిమీద దుర్భ్రమగలవారి సంఖ్య చాలా ఎక్కువ. అందులో దేశచరిత్ర ఎంతో ఉంది. ఆ కాలం నాటి ఆచార వ్యవహారాల సమాచారం చాలా ఉంది. అదో శాస్త్రీయ గ్రంథం. సమాజ చరిత్రకెంతో తోడ్పడగల గ్రంథం. అందుచేత అనధికార నిషేధాలకూ, సెన్సారుకు గురికావడంలో ఆశ్చర్యం అనిపించదు. అంతెందుకు, రామదాసు అసలు చరిత్రను తవ్వితీసిన చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ గారి పుస్తకం తిరిగి అచ్చు కాలేదు. పాత గ్రంథాలయాలలో ఆ పాత పుస్తకం కూడా కనిపించలేదు.

ఈ అనధికార నిషేధాలకూ, సెన్సారుకు ముందు ఆందోళన పుట్టదు. ఉపన్యాసాలుండవు. ఉద్యమాలు లేవు. అంతా చాపకింద నీరులా చల్లగా సాగిపోతూ ఉంటుంది. అదే ఆ పుస్తకాల గొప్పదనానికి గీటురాయి."

**– రాంభట్ల కృష్ణమూర్తి**

❋ ❋ ❋

# అనువాదాలు



టాల్‌స్టాయ్

"సుప్రసిద్ధ రష్యన్ నాటక రచయితలైన మాక్సింగోర్కీ – గొగోల్ – చెకోవ్ – పుష్కిన్ సిమొసేవ్ – ఇల్యాఎహ్రెన్‌బర్గ్ నాటకాలను – శ్రీనివాసచక్రవర్తి – విద్వాన్ విశ్వం – శ్రీశ్రీ – ఉన్నవ లక్ష్మీనారాయణ – నిడమర్తి అశ్వనికుమారదత్తు – రెంటాల గోపాలకృష్ణ – మానేపల్లి తాతాచార్య – బెల్లంకొండ రామదాసు – సోమంచి యజ్ఞన్నశాస్త్రి – గిడుతూరి సూర్యం మొదలైనవారు అనువదించారు.

మూడు చెకోవ్ నాటకాలు, మూడు గోర్కీ నాటకాలు, ఒక గొగోల్ నాటకం – ఒక టాల్‌స్టాయ్ నాటిక, ఒక పుష్కిన్ నాటిక – ఇతర రచయితలవి పది; మొత్తం పంతొమ్మిది నాటికా, నాటకాలు తెలుగులో అనువాదాలుగా వెలువడ్డాయి.

టాల్‌స్టాయ్ లివింగ్‌కార్డ్‌ను, బెల్లంకొండ రామదాసు "జీవచ్ఛవం" అను పేరుతో అనువదించారు. కాని ఇది అచ్చు కాలేదు.


గొగోల్ 'ఇన్‌స్పెక్టర్' నాటకాన్ని నలుగురు అనువదించారు. వారు రెంటాల – బెల్లంకొండ రామదాసు – గిడుతూరి సూర్యం – సోమంచి యజ్ఞన్నశాస్త్రి. మొదటి మూడు అనువాదాలు ఆంధ్రనాటక రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శించబడినవి, ప్రేక్షకుల మన్ననను పొందాయి. క్రెమ్లిన్ – బెల్స్, క్రెమ్లిన్ గంటలు నాటకాన్ని కొండేపూడి వ్రాయగా మద్రాసులో ఇస్కస్ తరఫున ప్రదర్శించారు. చక్రవర్తిగారు గోర్కీ – పతిత జీవులు, చెకోవ్ – నీటికాకి, పుష్కిన్ – లోభి, అతిథి, కిలాడి మొదలైన రష్యన్ నాటకాలను అనువాదం చేశారు. పుష్కిన్ నాటకం – నొవటస్‌నైట్‌ను శ్రీనివాస చక్రవర్తి అనువదించగా విజయవాడ రేడియో కేంద్రం ప్రసారం చేసింది.

రష్యన్ కథలనూ, నవలలలోని చిన్న చిన్న సంఘటనలను ఇతివృత్తాలను ఆధారంగా చేసుకుని అనేకమంది నాటికలను, నాటకాలను వ్రాశారు. పి.వి. రాజమన్నారుగారి 'నిష్ఫలం' అనే నాటికకు చెకోవ్ కథ 'కోరస్ గరల్' ఆధారం. అలాగే ఆచార్య ఆత్రేయ భయంలోనూ, బెల్లంకొండ రామదాసు 'పునర్జన్మ'లోనూ టాల్‌స్టాయ్ 'రిసరెక్షన్' 'ఫియర్'ల ప్రభావం గోచరిస్తుంది.'

**– లంకా సూర్యనారాయణ**

❋ ❋ ❋

# మార్క్స రచనలు



కారల్‌మార్క్స్

"మేము ముగ్గురన్నదమ్ములము – మహీధర రామమోహన రావు, జగన్మోహనరావు, కృష్ణమోహనరావులం. 1935 లో సోషలిస్టు సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అందించే లక్ష్యంతో "ముంగండ" అనే మారుమూల గ్రామం నుంచి 'విశ్వసాహిత్యమాల' ప్రచురణ సంస్థను ప్రారంభించాము. మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాల ప్రచురణకు అది, దానికి అనుబంధంగా STORIES, FICTION వంటి వానిని ప్రచురించేందుకు 'అవంతీ ప్రచురణ'లు పెట్టాం. 'అవంతి' నాPEN NAME. నా నవలలో అధికభాగం అవంతీ ప్రచురణలలోనే వచ్చాయి. ప్రజాశక్తి ప్రచురణాలయం వచ్చాక విశ్వసాహిత్య మాల తాత్త్విక గ్రంథాలు, శాస్త్ర గ్రంథాల మీద దృష్టి పెట్టింది. 1978 లో జగన్మోహనరావు మరణించే వరకూ విశ్వసాహిత్యమాల రమారమి 100 పుస్తకాలకు పైగా తెచ్చింది. నా రచనలకే పరిమితమయిన అవంతీ ప్రచురణలు ఇంకా సజీవంగానే వుంది. మాకు ముందూ, తర్వాత సోషలిస్టు సాహిత్య ప్రచురణకు ఎన్నో గ్రంథాలు వచ్చాయి. సోషలిజాన్ని ప్రజానీకానికి అందించడం కోసం విశ్వసాహిత్యమాల చేసిన కృషి ఈనాటికీ మరువలేరు. అయితే సిద్ధాంత గ్రంథాలుగా వేసినవీ, తాత్త్విక, శాస్త్రీయ గ్రంథాలుగా వేసినవి ముఖ్యంగా లెనిన్ రచనలూ, సోవియట్ రచనలూనే. ప్రథమ దినాలలో మార్క్సువిగా మేము వేసినవి మూడేమూడు చిన్న పుస్తకాలు VALUE - PRICE - PROFIT, WAGE-LABOUR AND CAPITAL, ADDREN TO THE COMMUNIST కి అనువాదాలు. ఆ మూడు నేనే అనువదించాను. ఇదిగాక శ్రీమతి దర్శి సుభద్రమ్మగారు అనువదించిన SOCIALISM UTOPIN AND SCIEHNTIJFEN ఇది ఏంజిల్సుది. 1940 నాటికి తెలుగునాట లభించిన మార్క్సు రచనలు ఇంతేనంటే తప్పుపట్టనక్కరలేదు. ఆనాటికీ ఈనాటికీ పెద్దగా మారలేదు. ఇటీవలనే మార్క్సు 'కాపిటలు' తెలుగులోకి వచ్చింది. అందులో ఒకటి పరిచయం మాత్రమే, అనువాదం కాదు. రాసిన యామె రచయిత్రి రంగనాయకమ్మగారు. రెండోది కాపిటలు ప్రథమభాగం. ఈ మాత్రపు సమాచారం చాలు తెలుగు సమాజంలోకి మార్క్సు రచనలు అందనే లేదనడానికి.

**– మహీధర రామమోహనరావు**

* * *

# వాత్సల్యం

"శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రులుగారు రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో పండిత పదవి సంపాదించడం కోసం పనిగట్టుకొని చెన్నపట్నం వెళ్లారు. నేనూ అప్పుడు వారి వెనుక ఉన్నాను. ఒకనాడు సైదాపేట, ఇంకోనాడు ఎగ్మూరు. మరోనాడు మైలాపూరూ ఇలా తిరగడంలో ఒకనాడు



వేలూరి

ఆచారప్పన్ వీధికి వెళ్ళాం. అక్కడ గోపాలాచార్లుగారు! ఆ గెడ్డమూ – దానికి తోడు గడగడా సంస్కృతం మాటాడటమూ – నాకిప్పుడు కళ్ళకు కట్టినట్లున్నాయి! వారింటికి ఆత్మకూరు నుంచి శ్రీనివాస విలాసచంపు వ్రాసిన కృష్ణగారి బందుగులున్నూ, కొందరు కవులున్నూ వచ్చి వున్నారు. అప్పుడు శ్రీ గోపాలాచార్లుగారు 'జీవానందం' అనే సంస్కృత నాటకం ఒకటి తీసి 'దీన్ని నాకు కృతిగా తెలుగు చేయండి' అని శ్రీ వేంకట శాస్త్రులుగారి చేతిలో పెట్టారు. తరువాత శ్రీ వేంకటశాస్త్రులుగారు సదరు నాటకాన్ని తీసుకొచ్చి కాకినాడలో తిరుపతి శాస్త్రులు గారికిచ్చి, దాన్ని తెలిగించే భారాన్ని తను దింపుకొన్నారు. కొన్నాళ్లది మూలనే పడి ఉండేది. శ్రీ తిరుపతి శాస్త్రిగారు కొన్నాళ్లకు దాని దుమ్ము దులిపారు గాని అది సాగిపోలేదు. నన్ను అప్పుడు సాయం కలుపుకున్నారు. నాలుగురోజులకల్లా ఎక్కడ నుంచో ఆహ్వానం వచ్చింది. దాంతో అది వెనక్కి వెళ్ళింది. ఈలాగే సువర్ణ పాత్రికమూనూ – అందులోనూ నన్ను భాగస్వామిని చేశారు గాని అదీనిన్నీ ఒక అంకంతో చెల్లు. ఎందుకు చెప్పవచ్చానంటే ఏ గురువు ఏ శిష్యుణ్ణి తనలో కలుపుకొన్నాడు ? వారిదంత వాత్సల్యం!"

**– వేలూరి శివరామశాస్త్రి**

❋ ❋ ❋

# తొలికథ

"తెలుగులో తొలి కథానిక ఏది ? గురజాడ అప్పారావుగారి "దిద్దుబాటు" (1910) కు పూర్వమే ఆచంట వెంకటరాయ సాంఖ్యాయనశర్మగారు 'కల్పలత' పత్రికలో ప్రచురించిన 'లలిత' (1903) అన్న కథ తెలుగులో తొలి కథానిక అని పురిపండా వారి అభిప్రాయం. సుమారు ఏడున్నర దశాబ్దాలుగా ఎవరికంటికీ ఆనని ఆ కథను భాస్కరస్వర్ణాంబగారు సేకరించి 'ఆంధ్రజ్యోతి' (నవంబరు 20, 1977) దినపత్రికలో ప్రచురించారు. తీరా చూస్తే, దాంట్లో ఆధునిక కథానికా లక్షణాలు బొత్తిగా లేవు. కథా వస్తువు చాలా 'సిల్లీ'గా కనిపించింది. భాష కూడా ఆధునికం కాదు. శిల్పం అసలే లేదు."

**– పోరంకి దక్షిణామూర్తి.**

❋ ❋ ❋

# విమర్శ

"1972 డిసెంబరులో ప్రసిద్ధ పాశ్చాత్య సాహిత్య విమర్శకుడు రెనెవెలక్ వ్రాసిన 'సాహిత్యం మీద దాడి' (ది ఎటాక్ ఆన్ లిటరేచర్) అనే వ్యాసం. 'ది అమెరికన్ స్కాలర్' అనే పత్రికలో ప్రచురించబడింది. ఆ తరువాత 1982 లో అదే పేరుతో పదకొండు సాహిత్య విమర్శన

వ్యాసాలు గల సంపుటిగా వెలువడింది. రెనెవెలక్ సాహిత్య విమర్శ ప్రపంచదేశాల్లో చాలా వరకు ప్రామాణిక గౌరవాన్ని సంపాదించుకొన్నది. ఆధునిక సాహిత్య రంగాల్లో వివిధ సాహిత్య సిద్ధాంతాల రాద్ధాంతాలను ప్రక్రియా ప్రయోగాల విలువల వివేచనలలో వెలువడిన వివాదాలను సమీక్షించి సాధికారికంగా సాహిత్య స్వరూప స్వభావాలను నిర్ధారణ చేయగల విద్వద్విమర్శకుడుగా ఆయన సాహితీ జగత్తులో ఒక సమున్నత స్థానాన్ని సముపార్జించగలిగాడు."

**– జి.వి. సుబ్రహ్మణ్యం**

❋ ❋ ❋

# ఈ శతాబ్దం నాది

"ఇప్పుడు మనం ఇరవైవ శతాబ్దంలో ఉన్నాం. ఈ శతాబ్దం నాది (తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు). నేను 1910 లో పుట్టాను (తోకచుక్కలాగా). మూడుసార్లు మృత్యువుతో పోరాడి గెలిచాను. 1918 లో మొదటి గీతం వ్రాశాను (గణ యతి ప్రాసలంటే ఏమిటో తెలియకుండా). 1920 లో మొదటి నవల (వీరసింహ విజయ సింహులు) రాసిపారేశాను. 1925 లో మొదటి నవలిక (పరమాణు రహస్యం) అచ్చయింది. 1928 లో మొదటి ఖండకావ్య సంపుటి (ప్రభవ).... అచ్చు వేయించాను. 1930 లో నేను 63 రోజులు టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డాను. జీవితం మృత్యువుతో ఎలా పోరాడుతుందో స్వయంగా తెలుసుకున్నాను.... 1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నాను. అప్పటి నుంచీ తెలుగు సాహిత్య చరిత్ర శ్రీశ్రీ స్వీయ చరిత్ర."

**– శ్రీశ్రీ**

❋ ❋ ❋

# బ్రౌన్‌యుగం

"1850 ప్రాంతం వరకు పరవస్తు చిన్నయసూరిగారు మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఆంధ్రపండితుడుగా ప్రవేశించే వరకు దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలన్నీ వ్యావహారిక ఆంధ్రమందే వుండేవి. సూరిగారు బాలవ్యాకరణము, నీతిచంద్రిక ప్రకటించు వరకు వ్యవహారికాంధ్రము 'నిరాటంకముగా' వ్యాప్తిలో వుండేది. ఆ కాలంలో వెలువడ్డ జూలూరి అప్పయ్య కావ్యాలకు రాసిన టీకలు, రావిపాటి గురుమూర్తిశాస్త్రి రచించిన పంచతంత్ర కథలు లాంటివి, ఏనుగుల వీరాస్వామయ్యగారి 'కాశీయాత్ర చరిత్ర' (దీన్ని వీరాస్వామయ్యగారు 'జర్నల్' అనే పేరుతో పిలిచారు), బేతపూడి సుందరరాయుడుగారి 'నీలగిరి చరిత్ర' (దీన్ని సుందరరాయుడు 'సమాచార పత్రిక' అన్నారు), తాతాచార్ల కథలు మొదలైనవన్నీ వ్యావహార భాషలోనే వున్నాయి. పుదూరి సీతారామశాస్త్రిగారు చిన్నయసూరికి పూర్వం రాజధానీ కళాశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. ఆయన 1847 లో కూర్చిన పెద్దబాలశిక్ష, 1834 లో రచించిన ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణం వాడుక భాషలోనే వున్నాయి. 1836 లో వెలువడ్డ రావిపాటి గురుమూర్తి శాస్త్రి

వ్యాకరణం, 1857 లో గ్రంథకరణ సభవారు అచ్చువేసిన శేషయ్య వ్యాకరణం వాడుక భాషలోనే ఉన్నాయి.

1830–57 మధ్యకాలంలో వున్న పండితులకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సి.పి. బ్రౌన్‌తో సంబంధాలు వుండేవి. ఆయన స్వయంగా వ్యావహారిక భాషాభిమాని. భాషాదృష్టితో ఈ కాలాన్ని బ్రౌన్‌యుగం అన్నా సరిపోతుంది. ఇది వ్యావహారిక భాషా దశ."

**– వి. లక్ష్మణరెడ్డి.**

* * *

# సమీక్ష




కన్యాశుల్కం

"ఈ నరమాంస విక్రయమను కన్యాశుల్కము ముఖ్యముగా నింగ్లీషు వాసన తెలియని వారిలో నిపుడు జరుగుచున్నది. దాని నాపవలయునని గ్రంథకర్తగారి యుద్దేశము. అట్టివారికి స్పష్టముగా దెలియుటకై గ్రావ్యాక్తులిందు జేర్పబడనందులకై వేం మామోదించితిమి. ఇట్టి గ్రంథములకు సలక్షణమగు గ్రాంథికభాష నిరుపయోగము గాన 'శశిరేఖ' అభిప్రాయముతో మేమేకీభవింపముగాని యింగ్లీషు పదములు విశేషముగా జేర్చినందులకై మాత్రము కొంచెమా లోచించుచున్నారము. గ్రంథకర్త యభిప్రాయానుసారముగ నీ కాలమునందలి తెలుగు సంభాషణలలో నింగ్లీషు పదములు జేరుచున్న వనుట నిజమే. అయిననది యందరకు వాడుకగా నుండు సైడ్డు కాలువ, మిటికిలేషన్.... అనునట్టి సర్వసాధారణ పదమువలె గాక సింప్లిసిటీ, లవ్ సిగ్నల్స్, ఇన్సిన్సియారిటీ, కంపారిజన్, డ్రెడ్‌ఫుల్లీ ఇన్ లవ్ – లోనగు నపూర్వ పదము లింగిలీషు రానివారి కెట్లు బోధపడునో తెలియదు. సర్వసాధరణమగు సంభాషణ కానందున గ్రంథకర్త గారి యుద్దేశమునకు భంగము కలిగినదని సంశయించుచున్నారము. నాటక రంగమున నిట్టి మాట లుచ్చరించుటయు నందులకై లోకము నవ్వుటయు, నొక ముఖ్యోద్దేశము కాదు గదా! అర్థముగానినాడిది బధిర శంఖారావమేగాని వేరుగాదు... ఇంగ్లీషు పదములలో వాడుకలో నుండువానిని ప్రయోగించినచో నా భాషా జ్ఞానము లేనివారికి తెలియదని మా వాదముగాని, వాని బొత్తుగా ప్రయోగింప గూడదని కాదు. ప్రాకృతమునకు ఛాయ వ్రాసినట్లుగా నట్టివాడుక లేని ఇంగ్లీషు మాటలకు నొక తెలుగర్థముగల ఛాయ సంపూర్ణముగా నున్నను గొంత మేలని తోచెడిది. అది నాటకరంగమునకు నిష్ప్రయోజనమైనను జనులకు గ్రంథము జదువునపుడుపయోగపడునని నమ్ముచున్నాము...."

("అముద్రిత గ్రంథ చింతామణి" గురజాడ వారి కన్యాశుల్కాన్ని
1899 మార్చి సంపుటి – 10, సంచిక – 3 లో విమర్శించింది)

* * *

# అనుసరణలు


యడ్గర్ అలన్ పో

"అనువాదాలంత స్పష్టంగా అనుసరణలను గురించి చెప్పడం కష్టం. చిత్తశుద్ధి గల రచయితలైతే ఫలానా కవిని అనుసరించాను అని చెప్పుకుంటారు. అలాంటి వారు కానప్పుడు పాఠకుడైనా, విమర్శకుడైనా అనుసరణని కనుగొనడం కష్టం.

అమెరికన్ రచయతల అనుసరణ విషయంలో... ఎడ్గర్ ఎలెన్ పో కవిత ఆధునిక ఆంధ్ర కవులలో – ముఖ్యంగా అభ్యుదయ కవులలో – పలువురిని ప్రేరేపించింది. ఎలెన్ పో "బాడీలేన్" అనే ఫ్రెంచి కవికి వరవడి పెట్టడం ద్వారా 'సింబాలిజం' అనే ఉద్యమానికి ప్రథమస్థానం మరుగున ఉన్నాడు. సింబాలిజంను అంతో ఇంతో ఆపోశన పట్టిన శ్రీరంగం శ్రీనివాసరావు గారికి ఎడ్గర్ ఎలెన్ పో ఇష్టుడు కావడంలో ఆశ్చర్యం లేదు. ఆయన 'మహాప్రస్థానం'లోని గేయాలలో ఒకటైన 'గంటలు', ఎలెన్ పో 'ది బెల్స్' అనే దానికి అనుసరణ.

ఈ 'గంటలు'కు ప్రకాశవంతమైన అనుసరణ శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారి 'మంటలు! మంటలు!' అనే గేయం. మార్క్ ట్వైన్ వ్రాసిన 'ఇండియన్ క్రొ' అనుసరణ శ్రీ నార్ల వెంకటేశ్వరరావు గారి 'కాకి'. ఇది 'మాటామంతీ'లో ఒకటి. "దారిన పోయే దానయ్య" అనే రూపకం "మిస్టర్ ఎక్స్ పాసస్ బై" అనే దాని అనుసరణ. దీనిని శ్రీ గోకుల్‌చంద్ రచించారు.

ఇక అమెరికా రచయితల ప్రభావం గురించి – ఓ హెన్రీ ప్రభావం ఆధునికాంధ్ర కథకులపై విశేషంగా ఉంది. పాత రచయితలలో శ్రీ గుడిపాటి వెంకటచలం గారి "సరస్వతీ ప్రసన్నం", "వేదాంతం" మొదలైన కథలలో చివరి మలుపు ఓ హెన్రీ ప్రభావమనడానికి సాహసిస్తున్నాను. యువ రచయితలలో శ్రీ వాకాటి పాండురంగారావు గారి 'అపరాజిత' మొదలైన కథలలో చివరి మలుపులూ ఓ హెన్రీ ప్రభావమే. శ్రీ రాచకొండ విశ్వనాధ శాస్త్రిగారి రచనా విధానంలోనూ, శ్రీ బుచ్చిబాబుగారి 'చివరికి మిగిలేది' మొదలైన నవలలోనూ హేమింగ్వే ప్రభావం – కథనరీతి, వాక్యాలు మధ్య ఆపడం, సగమే పలకడం వంటివి నామటుకు నాకు కనిపిస్తున్నవి. పెరల్ బక్ ప్రభావం తన రచనలలో ఉన్నట్టు ఇటీవల శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి గారు తెలిపారు.

ఇటీవల రోజులకు వస్తే శ్రీ ఆరుద్రగారు 'ఇంటింటి పద్యాలు' పేరిట వ్రాసిన లఘు రచనలకు ప్రేరణ అమెరికన్ కవి ఆగ్డన్ కాష్ అయినట్లు ఆయనే వ్రాసుకున్నారు. అలాగే ఇ.ఇ. కమ్మింగ్స్ అనే అమెరికన్ కవి ప్రభావం శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీ ఆరుద్ర గార్ల వంటి విచిత్ర కవితావాదుల వైచిత్రిపై ఉంది."

– **తిరుమల రామచంద్ర**

*  *  *

# విద్యాదానం



గిడుగు

"నేను సంపాదించిన విద్యకు మూల ద్రవ్య మనదగిన భాషాజ్ఞానము, భాషాభిమానము నాకు కలుగజేసినవారు బొంతలకోడూరు 'శిష్టి' కరణాలు, (బెహరా) బైరాగి పట్నాయకులు గారు. శ్రీకూర్మం కాణా హీరమండలము ముకాసముద్దారుగా మా తండ్రిగారు పర్వతాల పేట అనే గ్రామములో ఉండగా దుందుభి సంవత్సరంలో నేను పుట్టినాను. ఒక బ్రాహ్మడు నాకు అక్షరాలు గుణింతము నేర్పినాడు. అప్పటికి నేను ఆరేళ్ళవాణ్ణి. పేర్లయినా సరిగా వ్రాయలేకపోయినందున, బ్రాహ్మణ గురు స్థానమందు పట్నాయకులు గారిని మా నాయనగారు నియోగించి ఆయన చేత నాకు చదువు చెప్పించినారు. ఆయన వద్ద నేను చదువుకొన్న కాలము రెండు సంవత్సరాలే. ఈ స్వల్ప కాలంలో రెండు శతకాలు, ఆంధ్రనామ సంగ్రహము, అమరము ప్రథమకాండము నాకు కంఠస్థముగా చేసినారు; పెద్దబాలశిక్షలోనివి చిల్లర విషయములు అనేకముగా చెప్పినారు. పంచరాశికము దాకా లెక్కలు కట్టడము నేర్పినారు. వ్యావహారిక భాషలో వ్రాసిన కథలు, ఉత్తరాలు చదవడము అలవాటు చేసినారు. అప్పుడు వల్లించిన శ్లోకాలు, పద్యాలు కొన్ని ఇప్పటికిన్ని జ్ఞప్తియందున్నవి."

**– గిడుగు వేంకట రామమూర్తి**

* * *

# కలుపుగోలు




అయ్యదేవర

"నేను విద్యార్థిగా నున్నప్పుడు ఆదిపూడి సోమనాధరావు గారు బందరు వచ్చి ఆర్య సమాజమును గూర్చి యుపన్యాసములు నిచ్చుచుండిరి. ఆయన వితంతూద్వాహమును చేసికొనెను. కుల బేధములను పాటించలేదు. హృద్యముగా రామమోహనరాయ్, శ్రీరామ, దయాకర విజయము, హరిశ్చంద్ర మొదలైన హరికథలను జెప్పుచుండెను. మాతో హవలాకు హాస్టలులో నివసించి భోజనము చేయుచుండెను. మేము వారి యుపన్యాసములకు, హరికథలకు కూడా వెళ్లేవారము."

**– అయ్యదేవర కాళేశ్వరరావు**

* * *


# తెగతెంపులు



పింగళి

"ఆంధ్ర విశ్వవిద్యాలయము గుంటూరులో ఉన్న సమయంలో ఒక రోజున కాటూరి వేంకటేశ్వరరావుగారు గుంటూరు వెళ్ళి పింగళి లక్ష్మీకాంతంగారిని కలుసుకొని భాసనాటకానువాదములు ప్రతిజ్ఞాయౌగంధరాయణం, స్వప్న వాసవదత్తలను ప్రకటిస్తున్నాను. నీ పేరు కూడా చేర్చి ప్రకటిస్తానని చెప్పారు. లక్ష్మీకాంతం గారు "భాసనాటకాలు నీ పేరుతోనే ప్రకటించు, నా పేరు చేర్చవద్దు. నీవు వ్రాసినవి నీ పేర, నేను వ్రాసినవి నా పేర ప్రకటించుకొందాము" అని చెప్పారు. "ఇప్పటికే నీవు వ్రాసి నా పేర పెడుతున్నావనే అపప్రధ భరించలేకపోతున్నాను. ఇక వద్దు" అని స్పష్టంగా చెప్పారు.

తరువాత కొంతకాలానికి పౌలస్త్య హృదయము, గుడిగంటలు, మధుర పండితరాజము, గంగాలహరి, ఈ ఖండ కావ్యాలను కలిపి ఒకే సంపుటిగా ఇరువురి పేర్లతో ప్రకటించవలెనని వారిద్దరు కలిసి నిర్ధారించుకొన్నారు. కొంతకాలము గడిచిపోయింది. ఆ పుస్తకము ప్రకటించలేదు. తరువాత వేంకటేశ్వరరావుగారి అన్నగారు శ్రీ రామకృష్ణయ్య దివంగతులైనారు. అప్పుడు అన్నగారిపేర ఒక పుస్తకం రాసి కృతి ఇమ్మని మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రిగారికి నూటపదార్లు పెట్టి తాంబూలమిచ్చారు. ఆయన ఆ పని చేయనందున, తరువాత వేదుల సత్యనారాయణ శాస్త్రి గారికి కూడా నూటపదార్లతో తాంబూలమిచ్చారు. వారూ ఆ పని చేయలేదు. తానే ఒక పుస్తకం అన్నగారికి అంకితమివ్వాలనుకున్నారు. ఈ సంకల్పం లక్ష్మీకాంతం గారికి తెలియజెప్పాడు. పౌలస్త్య హృదయం, గుడిగంటలు కృతి అన్నగారికి ఇవ్వదలచానని చెప్పారు. అప్పుడు లక్ష్మీకాంతంగారు "మంచిదే! అయితే ఆ పుస్తకాన్ని నీ పేరుతోనే ప్రకటించుకో, మధుర పండిత రాజము, గంగాలహరి నా పేరుతో ప్రకటించుకుంటా"నన్నారు. బందరు త్రివేణి ప్రెస్‌లో పౌలస్త్య హృదయం, గుడిగంటలు అచ్చుకిచ్చారు. నేను, నా కుటుంబము అంటూ పీఠిక పద్యాలు ఇరవై వ్రాశారు. అంతటితో ఆగిపోయాయి. రెండున్నర సంవత్సరాలు గడిచిపోయింది. ప్రెస్‌లో ఫారాలు నల్లబడి పురుగులు కొట్టివేస్తున్నాయని భావరాజు నరసింహారావుగారు గోల పెట్టసాగారు. కొంతకాలానికి భావరాజుగారి గోల పడలేక ఎట్లానో పూర్తి చేయగలిగారు. అన్నగారికిచ్చిన కృతి పద్యాలు కూడా వ్రాసి ఇచ్చి పుస్తకం పూర్తి చేయగలిగారు. 1937 లో ప్రారంభించిన ఈ గ్రంథం 1955 లో పూర్ణరూపం దాల్చింది. ఏమైనను జంట కవులలో వేంకటేశ్వరరావుగారే మొదట విడిపోయిన వారైనారు."




కాటూరి

**– గూడూరి నమశ్శివాయ**

* * *

# పొరపాటు




కరుణశ్రీ

"ఒక మాటు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారికి బందరులో షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. వేటూరి, వేలూరి, కాటూరి, పింగళి, విశ్వనాథ మొదలయిన హేమాహేమీలంతా గురువుగారి షష్టి పూర్తికి వచ్చారు. నేను మూడు సీస పద్యాలు చదివాను. శాస్త్రిగారు "ఏ ఊరు నాయనా! నీది ?" అన్నారు. "గుంటూరండీ" అన్నాను. "పద్యాలు సరిగా వినబడలేదు. సాయంత్రం నా గదికి వచ్చి వినిపించు" అన్నారు.

సాయంకాలం నేను వెళ్ళేసరికి కాటూరివారు శాస్త్రి గారి తల వత్తుతున్నారు. నేను నమస్కరించాను. "వచ్చావా నాయనా! ఏవీ ఆ పద్యాలు!" అన్నారు శాస్త్రి గారు. నేను – "దండంబు చండ ప్రచండ పాండిత్య విఖండితారి వచః ప్రకాండ! నీకు" అని ఇట్లా చదువుతూ మూడవ సీసపద్యంలో చివర గీతపాదంలో "షష్ఠి పూర్తి మహోత్సవ సార్వభౌమ!" అనే సంబోధనతో ముగించాను. అది విన్న శాస్త్రి గారు "మరీ అంత గట్టిగా నొక్కబోకోయి" అన్నారు కాటూరి వారిని చూస్తూ. కాటూరి వారు నా వైపు చూచి ఒక చిరునవ్వు నవ్వారు. నాకేమీ అర్థం కాలేదు. తర్వాత కాటూరి వారు రహస్యంగా నాతో అన్నారు – "మరీ అంత నొక్కబోకోయ్ అన్నది నన్ను కాదు "నిన్నే" అని, ఇదిగో చూడు! నీ పద్యంలో అరవైఏండ్ల శాస్త్రిగారిని ఆరేళ్ళ పిల్లవాడిని చేశావు" అన్నారు. నేను చాలా ఆశ్చర్యపడ్డాను. "మరేమి లేదు షష్టి అంటే అరవై, షష్ఠి అంటే ఆరు. అర్థమైందిగా" అన్నారు కాటూరి. అప్పుడు నా పొరపాటు గ్రహించాను."

**– జంధ్యాల పాపయ్యశాస్త్రి**

* * *

# సేవానిరతి

"బండారు అచ్చమాంబ కొమర్రాజు లక్ష్మణరావు గారి అక్కగారు. అనేక గ్రంథాలను పరిశోధించి వేయి సంవత్సరాల స్త్రీల చరిత్రను 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కందుకూరి వీరేశలింగం గారు తమ చింతామణి ముద్రణాలయంలో ప్రచురించారు. ఈ గ్రంథాన్ని అచ్చమాంబగారు తన భర్త మాధవరావు గారికే అంకితమిచ్చారు. తెలుగులో మొట్టమొదటి స్త్రీల చరిత్రను రచించిన మహిళగా చరితార్థులైనారు. భార్యాభర్తలిరువురూ ఆంధ్రదేశంలో స్త్రీ సమాజములను స్థాపించాలని పూనుకున్నారు. కాకినాడలో విద్యార్థినీ సమాజము, రాజమహేంద్రవరము, బెజవాడ, గుంటూరు, విశాఖపట్నం, అనంతపురములలో స్త్రీ సమాజములను స్థాపించారు. 1905 లో మధ్యప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో ప్లేగు వ్యాధి

వచ్చింది. ఆ ప్లేగు వ్యాధి నివారణ ఉపశమన కార్యక్రమాలలో ముమ్మరంగా పాల్గొనిన అచ్చమాంబగారు ఆ వ్యాధికి బలి అయి 1905 లో మరణించారు. అక్కగారి జ్ఞాపకార్థం లక్ష్మణరావుగారు తమ కూతురుకి ఆమె పేరు పెట్టుకున్నారు."

**– మండవ శ్రీరామమూర్తి**

*　　　*　　　*

## గౌతమీ గ్రంథాలయం

"నాళం కృష్ణారావుగారు వీరేశలింగం గారి వల్ల ప్రభావితులై, వారి శిష్యుడై, కుడిభుజమై సంఘ సంస్కరణోద్యమాలలో పాల్గొన్నారు. వీరేశలింగంగారు కట్టించిన పురమందిరంలో కృష్ణారావుగారు "వీరేశలింగ గ్రంథ భాండాగారము" అనే లైబ్రరీ స్థాపించారు. కృష్ణారావుగారికి సంఘ సంస్కరణతోపాటు రాజకీయాలు కూడా అభిమాన వ్యాపకం. బెంగాలు విప్లవకారుడు కుదీరాం బోసు చిత్రపటాన్ని తెచ్చి లైబ్రరీలో పెట్టారు. వీరేశలింగం గారు "కుదీరాం ఒక నరహంతకుడు. రాజద్రోహి. ఇతని పటం నా పేరు ఉన్న గ్రంథాలయంలో ఉంచడానికి వీల్లేదు" అన్నారు. జిల్లా కలెక్టరుకు క్షమాపణలు చెప్పమన్నారు. నాళంవారు వీరేశలింగంగారి మాట వినలేదు. పటం తీయడానికి బదులు గ్రంథాలయాన్నే అక్కడ నుండి తీసి, గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు. నాళం వారికి 'మధుర కవి' అని బిరుదు."

*　　　*　　　*

## బ్రతికుండగానే సంతాప సభ!

"కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు (అడుగడుగునా వీరేశలింగం గారిని విమర్శించటమే వీరి పని) 1930 సెప్టెంబరులో మరణించినట్లు హిందూ పత్రిక విలేఖరి రిపోర్టు పంపాడు. దానిని చూచి ఆంధ్రపత్రిక కూడా. సంతాప సభలు, సానుభూతి తీర్మానాలు, సంపాదక లేఖలు వెలువడ్డాయి. తాను చనిపోయిన తర్వాత లోకం ఏమనుకుంటుందో బ్రహ్మయ్యశాస్త్రి గారికి తెలిసింది. ఎందుకంటే అప్పటికి ఆయన హాయిగా బ్రతికే ఉన్నారు. మరో పదేళ్ళు జీవించారు."

**– ఆరుద్ర.**

*　　　*　　　*

## అలవాటు

"పెద్దవాళ్ళంతా నన్ను సుబ్బారాయుడి గారి తమ్ముడు అంటారు. మా ఊరి వాళ్ళంతా నన్ను కామమ్మగారి తమ్ముడు అంటారు. మరోచోట శివశంకర శాస్త్రిగారి వియ్యంకులనీ, తీర్థుల వారి మామగారనీ అనిపించుకోవడం నాకు బాగా అలవాటయింది."

**– మొక్కపాటి నరసింహశాస్త్రి**

*　　　*　　　*

# విన్నపం



పురిపండ

"పురిపండ అప్పలస్వామి గారికి!

ఇవాళ తెల్లవారేటప్పటికి నాకివాళ పక్షవాతం సందేహం కలిగింది. మీరు హైదరాబాదు నుంచి ఎప్పుడు వస్తారు ?

నాగేశ్వరరావుగారికి కథలు పుస్తకాలు ఇచ్చెయ్యదలచు కున్నాను. వెనక ఒక మాటు వారు పేజీకి మూడు రూపాయల చొప్పున బేరం చేసి స్థిరపరచుకున్నారు. నేను కథలు పట్టుకువెళ్ళి యివ్వబోతే, డబ్బు లేదు ఇప్పుడు వద్దన్నారు. ఆ బేరం మొన్న జ్ఞాపకం చేశాను. నిజమే అప్పుడు డబ్బులేకపోయిందన్నారు. ఇప్పుడు ఆ రేటున పైసలు చెయ్యండి. కుదరకపోతే మీ యిష్టం వచ్చినట్లు పైసలు చేయండి. తక్కిన పుస్తకాలున్నూ యిప్పించేయండి. వారికి నాలుగువేల చిల్లర నేను బాకీ. నవలలూ, నాటకాలు వగైరా కాపీరైట్లూ, స్టాకు అంతా యిప్పించండి. మీకు సాధ్యమైన ధరకు యిప్పించి రుణం లేదనిపించి అదనంగా యిస్తే, అది నా భార్య చేతికి యివ్వండి. నా కుటుంబానికి మీరే సాయం చెయ్యగలరు. కథలు సాపు రాసివున్నాయి, పేపరు కటింగులున్నాయి. ముందు చికిత్సకూ, తిండికి డబ్బు కావాలి. ఇప్పించండి. ఈ నెల ఇంకా అద్దె యివ్వలేదు.

పుస్తకాల వ్యవహారం పూర్తిగా పరిష్కరించి మరీ వెళ్ళాలి మీరు. అనుభవాలు – రెండు విశాఖపట్నం పంపాలి. పోషకులకూ తక్కినవారికీ, రాజమండ్రిలో మైలవరపూ, వింజమూరీ, రామచంద్రాపురంలో దువ్వూరీ, చావలీ, వేపా మాత్రమే యిచ్చాను. వేపావారు రు. 116/–లు ఇస్తానన్నారు. ఇప్పుడే కొంత ఇవ్వవచ్చు. కాకినాడ సాహిత్యవేత్త గారంటే శ్రీ పార్థసారథిగారు. వారికి నా యెడ చాలా దయ. మీరు చెపితే నాకుగాని, నా కుటుంబానికి గాని వారేమైనా సాయం చేసి చేయించవచ్చు.

నా కుటుంబం చెట్టు క్రింద వుంది. మీరు సాయం చెయ్యండి. విశాఖలో కూడా ఏమైనా వీలవుతుందేమో చూడండి.

గుంటూరులో చావలి సూర్యనారాయణగారు (ILTD లేబరు ఆఫీసరు) రు. 66/–లు ఇవ్వాలి. ప్రయత్నం చెయ్యండి. వారు రామచంద్రాపురం గాంధీ డాక్టరు గారి అన్నగారు. డాక్టరు గారి ద్వారా ప్రయత్నించండి. డాక్టరుగారున్నూ రామచంద్రాపురం మిత్రులచేత యేమైనా చేయించవచ్చు. నెల్లూరి శివరామయ్య గారేమైనా పంపవచ్చు. డాక్టరు కనకరాజుగారున్నూ చెయ్యవచ్చు.

శ్రీ నాగేశ్వరరావుగారి విషయం – వారికి అభ్యుదయం నా చేతనైనంతా కలిగించాలను కున్నాను. భగవంతుడిలా చేశాడు. నేను వ్యర్థుణ్ణయిపోయాను. స్నేహితులైనందున మీకీ శ్రమ మాత్రం కలిగిస్తున్నాను.

నాగేశ్వరరావు గారి వ్యవహారం మీరే పరిష్కరించడం నా ఆశ. మీరు మిక్కిలీ ఘనంగా సన్మానించారు. మీకు శ్రమ మాత్రమే కలిగించాన్నేను. శ్రీ సింహాచలంగారి స్నేహం నాకు మహామేరువు. వారికి నా కృతజ్ఞత సరిగా చూపించలేకపోయాను.

మీకు నేను బరువైనట్టే నిశ్చయం. మీలాగ మనసిచ్చినవారు నాకు మరొకరు లేరు. మీ రుణం తీర్చుకోలేను. అది తీర్చుకోడానికయినా మరో జన్మం యెత్తుతాను. ఒకటి కాదు, పది వంద ఎత్తుతాను. ఒక సామన్యుడికి మీరూ, సింహాచలంగారూ కనకాభిషేకం చేయించారు. ఇది నాకు పరమేశ్వరుడు చేయించలేనిది.

ఇలాంటి స్థితిలో నేను భారం అయిపోతున్నాను. విచారించను. అది తీర్చుకోవడాని కయినా మరో జన్మ యెత్తుతాను కనుక నాకేమీ విచారం లేదు. నా భార్య నన్నెనేక విధాల కాపాడింది. చిన్నప్పణ్ణుంచి దాన్ని కష్టపెట్టానుగాని సుఖపెట్టలేకపోయాను. ఇప్పుడు ఇక ఆ వూసేలేదు కదా ?

నిరర్ధక జన్మ అయిపోయింది నాది. రచనలయినా సమర్పించుకో లేకపోయాను. పరమేశ్వరుడు మీకు సకల సుఖాలూ కలిగించాలి. సారస్వత సేవలో మీకు సాపురాసి అన్నీ జాతికి సాఫల్యం పూర్తిగా కలిగించాలి. మీ కలం జాతిని ఉద్ధరిస్తుంది."

**– (సం) శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి**

(అనుభవాలు – జ్ఞాపకాలు నుండి)

❋ ❋ ❋

## కథలు - కబుర్లు

"ఈ శతాబ్దంలో వచన రచనకు పెట్టింది పేరు ఒక్క ఇద్దరికే. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. వేంకటశాస్త్రిగారు కబుర్లలో ఎన్నో కథలు చెప్పారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కథలుగా ఎన్నో కబుర్లు చెప్పారు."

**– మల్లాది రామకృష్ణశాస్త్రి**

❋ ❋ ❋

## పుస్తకాలు

"ఆ రోజుల్లో బుక్కా వర్తకులు పుస్తకాలు పట్టుకొచ్చి తిరునాళ్ళలో అమ్ముతూ ఉండేవారు. శతకాలు, పాటలు, వీధి నాటకాలు మొదలైన పుస్తకాలు బేడకు, బేడా అర్ధణాకు అమ్ముతుండేవారు. తిరునాళ్ళలో మిఠాయిలు కొనుక్కోవడానికి మా అమ్మ, నాన్న ఇచ్చిన డబ్బులు మిగుల్చుకుని పుస్తకాలు కొనుక్కొని తెచ్చుకునేవాణ్ణి. నా మటుకు నేను కూచిపూడి వారు ఆడే ప్రహ్లాద నాటకం, రామనాటకం మొదలైనవి ఆ తిరునాళ్ళలోనే కొని చదువుకున్నాను."

**– పింగళి లక్ష్మీకాంతం**

❋ ❋ ❋

# కథ

"నేనూ వ్రాశాను కొన్ని మంచి కథలు. 'పడవ ప్రయాణం' అంటే నాకెంతో ఇష్టం. ఒకసారి వ్రాసి పారేసిన తర్వాత ఆ కథమీద అంత అభిలాష ఉండదు నాకు సామాన్యంగా. అచ్చుపడ్డప్పుడు తిరిగి చదివితే – చదువరిలాగే చదువగలుగుతాను, రచయితలాగ కాదు – ఆ కథ ఎవరో మరొక వ్యక్తి వ్రాసినట్టు అనిపిస్తుంది. ఒక కథ వ్రాసి పారేశాక, నేను 'నేను'గా మిగలను, చిత్రంగా మారిపోతాను. పాత వ్యక్తి నాకు అప్తుడే. కాని ఆ వ్యక్తిని గురించిన విచక్షణ నాలో ఒక అంగంగా, నాతోపాటు పెరుగుతుంది; ఆ వ్యక్తి వ్రాసిన కథలను గురించి కూడా."

**– పాలగుమ్మి పద్మరాజు.**

❋ ❋ ❋

# ప్రార్థన

"అమ్మా నవ్యభారతి! అందరిచేత విడివిడిగా స్వతంత్రంగా పాడించు! దానికి సంయమనం జోడించు! భావంలో పడుకో! రూపంలో మేలుకో! రసంలో ముంచు! వశంలో వుంచు! ఎందుకంటే నీవు రసోవైసః! నానా భావాలతో నానా రూపాలతో నీ రసం అందరికీ పంచు!!"

**– వేలూరి శివరామశాస్త్రి**

❋ ❋ ❋

# రచన

"లండన్‌లోని క్రౌన్ పెర్‌ఫ్యూమరీ కంపెనీ 1876 లో నిర్వహించిన పోటీకి మన దేశం మొత్తం మీద వివిధ భాషలలోని 108 మంది కవులు తమ రచనలను పంపించారట. ఇంగ్లీషు అనువాదాలను పరిశీలించిన న్యాయనిర్ణేతలు కొక్కొండ వెంకటరత్నంగారి 'ప్రిన్సాపు వేల్సు తారావళి' అనే రచనకు ప్రథమ బహుమతి, ఆదిభట్ల నారాయణదాసుగారి 'తారకం' అనే రచనకు రెండో బహుమతి ఇచ్చారట.!"

❋ ❋ ❋

# కొ.కు.

"కొడవటిగంటి కుటుంబరావు గారి అన్నగారైన వెంకట సుబ్బయ్య కథకులు, సాహితీసమితి ముఖ్యులు. తమ్ముడు కృష్ణమూర్తి కూడా కథకుడే. కొ.కు. ప్రేరణతో కథలు వ్రాసినవారు. వెంకట సుబ్బయ్యగారి కోసం వచ్చిపోయే సాహితీ సమితి సభ్యులు, కాల్పానిక యుగకవుల పరిచయం కూడా కొ.కు.కు ఈ దశలో ఏర్పడింది. ఈ పరిచయాలు వారి కవిత్వారాధనతో ముగిసిపోలేదు. వారి దృక్పథ పరిశీలనలో సాగడం వల్లనే కుటుంబరావుగారు

కాల్పనిక యుగవాదిగా మిగలలేదు. 'పీడకథ'లో కథానాయకుడు "ఆ ముహూర్తాన ఒక సామాన్య వ్యక్తి. ఒక అనామకుడు. ఆఖరుకు నవ్యసాహిత్య పరిషత్తు సభ్యత్వం కూడా ఎరుగని ఓ 'కోన్‌కిస్కా హై' గాడు. నవ్య సాహిత్య పరిషత్తు కూడా శీతకన్నేసిన కథాసాహిత్యం మీద విప్లవం చేశాడు" అంటారు. ఈ కథలోనే 'నీ ప్రణయంలో నీ సంస్కారానికీ, ఆస్తికీ, నీ ఉద్యోగానికీ ఏమి సంబంధం లేదా ఏమిటి ?" అని ఒక పాత్ర అడుగుతుంది. సరిగ్గా సాహితీసమితి, నవ్యసాహిత్య పరిషత్తుకు కుటుంబరావు దూరమైంది ఇక్కడే."

– కేతు విశ్వనాథరెడ్డి

❋ ❋ ❋

# ఆంధ్రపత్రిక

"శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మొట్టమొదటి కథ 'ఇరువురమొక్కచోటకే పోదము'. కోటంరాజు పున్నయ్యగారు ఆంధ్రపత్రికలో పనిచేస్తున్న రోజుల్లో వారపత్రికలో ప్రచురించేందుకు శాస్త్రిగారిని ప్రోత్సహించి, ఒక గంట వ్యవధిలో ఈ కథను పత్రిక ఆఫీసులోనే వ్రాయించి, వెంటనే ప్రకటించారు. ఈ కథ 1915 నవంబరు 17 ఆంధ్రపత్రిక వారపత్రికలో ప్రచురింపబడింది. చిత్రమేమంటే శాస్త్రిగారి ఆఖరి కథ 'చలిచీమలు' కూడా వారి మరణానంతరం ఆంధ్రపత్రిక ప్లవ సంవత్సరాది సంచికలోనే ప్రచురింపబడటం విశేషం."

– కనక్ ప్రవాసి.

❋ ❋ ❋

# కారాగారవాసం

(తిరుపతి వాస్తవ్యులు శ్రీనివాసాచార్యులుగారు బెజవాడలో 'శ్రీ వెంకటేశ' అనే వారపత్రిక నడుపుతుండేవారు. బిపిన్‌చంద్రపాల్‌గారి ఉపన్యాసాలు విని, ఆనాటి ఉద్యమ ప్రభావానికి ఆ వారపత్రిక పేరును 'స్వరాజ్య' అని మార్చారు. అది ఆగిపోయే దశలో 1907 లో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు తమ స్నేహితులను కలుపుకుని దానిని నడపసాగారు. ఆ పత్రికలో హరిసర్వోత్తమరావుగారు రాసిన ఒక వ్యాసాన్ని రాజద్రోహం క్రింది బ్రిటీష్ ప్రభుత్వం అభియోగం తెచ్చి కేసు పెట్టింది – హరిసర్వోత్తమరావుగారు మూడేళ్ళ కఠిన కారాగారవాసం అనుభవించారు.)

"ఎం.ఎ. పట్టభద్రులైన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావును నెల్లూరు సెంట్రల్ జైలులో బందిపోటు దొంగలు, హంతకులున్న గదిలో వేశారు. మానరక్షణకు రెండు గోచీలిచ్చారు. మూరెడు చదరం గల రెండు తువ్వాళ్ళు, పడుకునేందుకు చిన్న ఈతచాప, అన్నం తినడానికి మట్టిచట్టి, నీళ్ళు త్రాగడానికి మట్టిముంత, మలమూత్ర విసర్జనకు మరొక మట్టి చట్టి ఇచ్చారు. కాలికి లావాటి కడియం, మెడకు మరొక కడియం వేసి ఒక కొయ్యముక్కను వీటిలో దూర్చారు. మొలత్రాడు, జందెం తీసివేశారు. తల బోడి చేయించారు – రాగి సంకటిముద్ద, దానిలో రాళ్ళు, పుల్లలు, పురుగులు తేలుతుండేవి. ఈ తిండితో మూడేళ్ళు జీవించారు – గవర్నర్

జైలును చూచుటకు వచ్చినప్పుడు, తనను మానవమాత్రునిగా చూడమని కోరగా, ఆ దుర్మార్గుడు రావుగారిని దుర్భాషలాడి వెళ్ళిపోయారు. ఈ విధంగా అష్టకష్టాలను స్థిరచిత్తంతో ఎదుర్కొన్న స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ గాడిచర్ల.”

**– దర్శి చెంచయ్య**

('నేనూ – నా దేశం' నుంచి)

* * *

# రచయిత్రుల సమావేశం



భానుమతి

“ఆల్ ఇండియా ఉమెన్ రైటర్స్ వింగ్ సమావేశం హైదరాబాదులో జరిగింది. ఈ సమావేశానికి విజయలక్ష్మీ పండిట్ అధ్యక్షత వహించారు. వూటుకూరు లక్ష్మీకాంతమ్మ, నాయని కృష్ణకుమారి, కనుపర్తి వరలక్ష్మమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, తెన్నేటి హేమలత, ద్వివేదుల విశాలాక్షి, సి. ఆనందరామం, తురగా జానకీరాణి మొదలైన ప్రముఖులతోపాటు లీలావతి మున్షీ, ప్రభుజిత్‌కౌర్ వంటి ప్రసిద్ధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. మద్రాసు నుంచి కె. రామలక్ష్మీ గారు, నేనూ వెళ్ళాము. మూడు కొప్పులు ఒకచోట సమావేశమైతే, చిన్నసైజు యుద్ధం ఆరంభమవుతుందంటారు. కానీ అప్పుడు అక్కడ కనిపించిన వాతావరణం గాలివానకే దారితీస్తుందమోననిపించింది.

తరాల అంతరాలు, సంప్రదాయవాదాలు, ఆధునిక ధోరణుల మధ్య ఏర్పడే అభిప్రాయభేదాలు వంటి కారణాల వల్ల కొందరు రచయిత్రులు ఇతరుల పట్ల ముభావంగా వుండటం, చర్చల్లో పేచీలు పెట్టుకోవటం వంటివి చేస్తుంటే, వాతావరణాన్ని చల్లబరచడానికి తక్కినవారితోపాటు నేనూ శాయశక్తులా ప్రయత్నించేదాన్ని. కార్యవర్గ కమిటీలో ప్రధాన పాత్ర వహించడం వల్ల కార్యక్రమాలు ప్రశాంతంగా జరగడానికి అలా అన్ని కోణాల్లోను 'మాన్ ఆఫ్ ది మ్యాచ్'లా వ్యవహరించవలసి వచ్చింది.”


**– భానుమతీ రామకృష్ణ.**

* * *

# త్రిమూర్తులు

“ఒరవడి దిద్దిన త్రిమూర్తులు – తెలుగు పత్రికా రంగంలో ఆద్యులు అనదగిన వారు ముగ్గురున్నారు. మొదట తెలుగు దినపత్రికను నెలకొల్పిన దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు, తెలుగు ముద్రణ అచ్చులను ఆధునికపరచడంలో అనన్యమైన కృషి సలిపిన ఎన్.జి. ఆచార్య, తెలుగు దినపత్రికకు ఆధునిక కాలానికి అనుగుణమైన రూపురేఖలు తీర్చిదిద్ది, తనదైన ఒక ఒరవడి పెట్టిన నార్ల వెంకటేశ్వరరావు – ఈ ముగ్గురికీ పై మాట వర్తిస్తుంది.

పత్రికా రచనలో 'వడగండ్ల' వానలు కురిపించిన ముట్నూరి కృష్ణారావు, పత్రికా రచనను విప్లవ ఆయుధంగా వినియోగించిన నెల్లూరి వెంకట్రామానాయుడు, నైజాం ప్రజలకు 'గోలకొండ' వంటి పత్రికను ఇచ్చిన సురవరం ప్రతాపరెడ్డిగార్లను విస్మరించి పై మాట అనడం లేదు. ఈ ముగ్గురి వలెనే తెలుగు పత్రికా రచనకు ఎంతెంతో దోహదం చేసినవారు మరెందరో కూడా లేకపోలేదు. అయితే వీరందరి కృషి ఒక ఎత్తు కాగా, మొదటి ముగ్గురి కృషి మరొక ఎత్తు. కాశీనాధునివారు, ఆచార్యగారు, నార్లవారు చేసింది మార్గదర్శకమైన కృషి. వీరు ముప్వురు మరణించడంతో తెలుగు జర్నలిజంలో ఒక శకం అంతమయింది."



నార్ల

**– బి.ఎస్.ఆర్. కృష్ణ.**
(సీనియర్ పాత్రికేయులు)

❋ ❋ ❋

# వేదన

"శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రికీ, మధిర సుబ్బన్న దీక్షితులుకీ ఛందస్సు నేనే నేర్పాను. వారు మహామహులై ఒహో అనిపించుకున్నారు. నేను యిలా ఉండిపోయాను."

**– కొత్తపల్లి సూర్యనారాయణ**

❋ ❋ ❋

# స్త్రీల రచనలు

"స్త్రీలు రాసిన నవలలో మొట్టమొదటిది జయంతి సూరమ్మగారి సుదక్షణా చరిత్రము (1906), తరువాత మల్లవరపు సుబ్బమ్మగారి కళావతి చరిత్ర; గోపిశెట్టి లక్ష్మీనరసమ్మగారి సుకేశి, సుగుణావళి; అన్నపూర్ణాదేవీగారి నవవర్ష స్వప్నము; ఓలేటి సూర్యప్రభాదేవి గారి ఇందుమతి; దేశిరాజు లక్ష్మీనరసమాంబగారి కమలావతి; పులవర్తి కమలాదేవిగారి కుముద్వతీ, రాధికా చంద్రావళులు; మల్లాది బుచ్చమ్మగారి లంకాపతి; కనుపర్తి వరలక్ష్మమ్మగారి వసుమతి; ఆచంట సతీదేవిగారి సునందిని; కూచి రామలక్ష్మమ్మగారి అమల; పి. రాజ్యలక్ష్మమ్మగారి మదవతి; అట్లూరి వెంకట సీతమ్మగారి రూపవతి మొదలైనవి ఆనాటి స్త్రీలు వ్రాసిన నవలలు."

**– ముప్వల మైత్రి.**

❋ ❋ ❋

# కమ్యూనిస్టులు



తాపీ ధర్మారావు

"అప్పట్లో తాపీ ధర్మారావుగారు చల్లపల్లిలో ఉంటుండేవారు. అప్పుడప్పుడు విజయవాడ వచ్చి వారబ్బాయి తాపీ మోహనరావును చూచి వెళ్తుండేవారు. ఒకసారి విజయవాడలో తాను బసచేసిన చల్లపల్లి జమీందారు బంగళాకు మోహనరావుని రప్పించి కలుసుకున్నారు. ప్రజాశక్తి పత్రిక ఉపసంపాదకుడుగా ఉన్న ఆయనను జీతమెంత అని అడిగారు. మోహనరావు సూటిగా జవాబు చెప్పడం తప్పించుకోడానికి ఏమేమో చెప్పసాగారు. వారు వదలలేదు. మళ్ళా, మళ్ళా అడిగారు. ఇక తప్పదని మోహరావు పదిహేను రూపాయలని చెప్పి, వెనువెంటనే తమవి జీతాలు కావనీ, అలవెన్సులనీ అందులోనే కొంత మిగులుతుందనీ, బ్రహ్మచారికి పదిహేను, భార్య మాత్రమే గల కుటుంబానికి తనపై ఆధారపడినవారు ఇంకా ఎక్కువమంది ఉన్న వారికి నలభై రూపాయలు ఇస్తారని వివరించారు. ఆనాడు ప్రజాశక్తి ప్రధాన సంపాదకులుగా ఉన్న మద్దుకూరి చంద్రశేఖరరావుగారు బ్రహ్మచారులు కాబట్టి వారికిచ్చేది పదిహేను రూపాయలే అనీ, అటెండర్‌గా ఉన్న అతనికి భార్యా, తల్లీ ఉన్నారు కనుక నలభై రూపాయలిస్తారనీ మరికొంత వివరణ యిచ్చారు.

ఇది విని ధర్మారావుగారు దిగ్భ్రాంతి చెందారు. అప్పుడు కమ్యూనిస్టుల పట్ల బద్ధవైరం పూనిని చల్లపల్లి దివాను వెంకట నరసయ్య ప్రక్కనే ఉన్నారు. "రాజకీయంగా కమ్యూనిస్టులతో ఎంత భేదించినా దేశభక్తి, త్యాగమూ మాటకొస్తే ముందు వాళ్ళను చెప్పుకొని తరువాతనే ఇతరులను చెప్పుకోవాలండి" అని ధర్మారావు గారితో అన్నారు. బద్ధశత్రువు నుండి కూడా అంతటి మెప్పు పొందిన కమ్యూనిస్టుల పట్ల, వారి విధానాల పట్ల ప్రశంసాభావం ధర్మారావుగారి మనసులో ఆనాడు మరింత బలంగా నాటుకుంది.

కోడలుగా తమ కుటుంబంలో చేరిన రాజమ్మ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు, మహిళా సంఘ, ప్రజానాట్యమండలి సభ్యురాలు.

జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల పోకడలూ, కమ్యూనిస్టులతో ఈ ప్రత్యక్ష సంపర్కమూ ధర్మారావుగారిని కమ్యూనిస్టు ఉద్యమ అభిమానిగా మార్చాయి."

* * *

# మహనీయుడే!

"ప్రపంచాన్ని కుదిపివేసిన పదిరోజులు అనే పుస్తకాన్నీ, క్రొపోట్కిల్ రచనల్నీ నా చేత చదివించింది అబ్బూరి రామకృష్ణారావుగారు. వారి సహచర్యం వల్లనే చాలాకాలం నేను రాయిస్టుగా

చెలామణి అయ్యాను. కాని, విచిత్రం ఏమిటంటే M.N. Roy గ్రంథాలేవీ చదవమని అబ్బూరివారు నాకివ్వలేదు. నేను స్వయంగా కొనిగాని, సంపాదించిగాని చదవనూ లేదు. లెనిన్‌తో భుజం, భుజం రాసుకొని తిరిగిన వ్యక్తిగా మానవేంద్రనాథ్‌రాయ్ నాకెప్పుడూ మహనీయుడే!"

**- శ్రీశ్రీ**

❋ ❋ ❋

# నిజం

"రావిశాస్త్రిగారి 'నిజం' నాటకం STORY WRITER'S STUFF అనీ, DRAMATISTI'S STUFF లేదనీ చెప్పాను. చదువుకున్న వాళ్ళ నాటకం PURPOSE MISS గా అయ్యి, తిలాపాపం తలా పిడికెడు అన్న నీతి అందులో వుందనుకుంటున్నారు. వాళ్లు అలా పొరపాటు పడటానికి కారణం శాస్త్రిగారిది కాదు. వాళ్ళు సినిమా విలెనుల్ని చూసి చూసి SELF JUSTIFICATION చేతనయిన VILLAIN మాటలకు బుట్టలో పడ్డారు. శాస్త్రిగారి నాటకంలో వున్న GENIUS అంతా అక్కడే ఉంది. సార్వభౌమారావు స్టేజి మీద పాత్రల్నే కాదు, ఆడియన్స్‌లో చాలామందిని అంత తేలిగ్గా F0OL చేయగలిగాడు. నాటకం చదివినప్పుడు GOOD DRAMA అనుకున్నానుగాని PERFORMANCE ద్వారా ఆడియన్స్ REACTION చూసిన దాకా ఇంత AMAZIOGLY GOOD DRAMA అన్నది నాకు తట్టనేలేదు."

**- కొడవటిగంటి కుటుంబరావు**

❋ ❋ ❋

# కవితావేశం



శ్రీపాద

"దారిద్ర్యమూ, ఐశ్వర్యమూ కూడా ప్రేరకాలు కాలేవు, భంజకాలు కాలేవు కవిత్వానికి. ఠాగూరు జమీందారు కనకనే – సంసారికాలైన ఒడుదుడుకులెరగనివాడు కాబట్టే అలాంటి ఉద్గ్రంధాలు రచించగలిగాడనీ, నోబిలు బహుమానమున్నూ గడించుకోగలిగాడనీ అనుకుంటా డనుకర్త.

కవితా సమాధిలో కూచున్నాడా – సరి అయిన తాదాత్మ్యం సిద్ధించిందా, ఇక అతనికి భోగాల మీదికి దృష్టిపోదు, కష్టాలూ కనపడవు. నీరసం వచ్చి చెయ్యి ముడుచుకుపోగూడదు, పేగులు మాడి దృష్టి చెదరిపోగూడదు, ఈ ప్రతి బంధకాలు కలక్కుండా వుండడానికే కవికాహారం. ధనికుడైన వాడికయినా కవితావేశం కలిగినప్పుడిదే ప్రవృత్తి.

పర్సులో (బహుమితంగానే) డబ్బుండినా, దృష్టి రచనా వ్యగ్రమై కదలలేక కలమూ, కాగితాలు కిందబెట్టలేక, కూరల కోసం బజారుకి వెళ్ళాలన్న స్ఫురణే కలక్క, 'కూరగాయలేవీ

లేవు మరి' అంటూ వంటింట్లో నుంచి కేక వినవచ్చినా ప్రకృతిలో పడలేక, వేళకి మాత్రం పీటమీదికి వెళ్ళి – ఆ పూటకు వూరగాయలతోనూ, చారు, మజ్జిగలతోనూ భోజనం అయిందనిపించుకుని చెయ్యి ఆరడం తడవుగా మళ్ళీ కలం పట్టి, దాంతో ప్రపంచం మరిచిపోయిన సందర్భాలెన్నో వున్నాయి నా జీవితంలో."

**– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి**

* * *

# పేరు

"బుచ్చిబాబు (శివరాజు వేంకట సుబ్బారావు) రచనలలో తరచు అంతరంగం, ఏకాంతం అనే మాటలు కనిపిస్తాయి. ఆయన వ్రాసిన ఒకే ఒక నవలకు 'ఏకాంతం' అనే పేరు పెట్టారు. కాని ఆచంట జానకీరామ్ దానికి 'చివరకు మిగిలేది' అనే పేరు సూచించారు."

* * *

# బహుమతి

"హఠాత్తుగా ఆంధ్రా యూనివర్శిటీ ఒక ప్రకటన వేసింది. వేయి పేజీల నవల వ్రాస్తే వేయి రూపాయల బహుమతి ఇస్తామని అని. మా అన్నగారు దానికి సిద్ధమయినాడు. అప్పట్లో ఆయన తెనాలి, బందరు మధ్య తిరుగుతూ ఉండేవాడు. వేయి పడగలు నవల మొదలుపెట్టడం తెనాలిలో జరిగింది. వేయి పుటలు వ్రాయాలి. రెండువందల యాభై పుటలు మాత్రమే తెనాలిలో పూర్తి అయింది. కాలం సమీపించి యూనివర్శిటీ పెట్టిన గడువు దరిదాపులకొస్తున్నది. నెలదినాల కంటే ఎక్కువ లేదు. 'ఏరా! ఈ నెల రోజుల్లో పుస్తకం పంపించాలి. ఎట్లా ?' అన్నాడు. 'చెప్పు, రాద్దాం' అన్నాను. రోజుకు మూడు సల్లీలు–భోజనాత్పూర్వం, భోజనాత్పరం, నిద్రాంతం, పద్దెనిమిది దినాల్లో 750 పేజీలు పూర్తి చేశాము. మిత్రకోటి అంతా నిజంగా ఆశ్చర్యపడ్డారు. ఏదో ఆవేశం పూనినట్టు చెప్పాడు. మంచి వయసులో ఉన్నాను కాబట్టి నేనూ తట్టుకొని వ్రాశాను. ఆ వక్కాణంలో యూనివర్శిటీ పండితులు ఒక సౌఖలిత్యాన్ని చూపించారు. కానీ వేయిపడగలకి బహుమతి రాలేదు. అడవి బాపిరాజు వ్రాసిన 'నారాయణరావు'కు 'వేయిపడగల'కి బహుమతి చెరి సగం చేశారు. పదల్లా పదిహేను వందలు చేసి, చెరిసగం ఏడువందల యాభై రూపాయల చొప్పున ఇచ్చారు. కడుపు కాలినమ్మకి గంజే పానకం. అంతే శానా అనుకొని మా అన్నగారు ఆ ఏడువందల యాభైతో అప్పులు తీర్చుకొని బయటపడ్డాడు."


**– విశ్వనాథ వెంకటేశ్వర్లు**

* * *

# చిరస్మరణీయుడు

"ఆంధ్రులకు చిరస్మరణీయుడైన ఆంగ్లేయుడు సి.పి. బ్రౌన్. తెలుగు భాష కోసం విశ్రాంతి లేకుండా శ్రమించారు. 1835–38 మధ్య సెలవుపై లండన్ వెళ్ళి 'ఇండియ హౌస్ లైబ్రరీ'లో

గుట్టలుగా పడి వుండిన దక్షిణభారత భాషల గ్రంథాలు (లిఖిత ప్రతులు) 2106 ను మద్రాసు గ్రంథాలయానికి పంపారు. తిరిగి వచ్చిన తరువాత మనుచరిత్ర – వసుచరిత్రలకు వ్యాఖ్యలు వ్రాయించాడు. కళాపూర్ణోదయం, పల్నాటి వీరచరిత్ర మొదలైన 25 ప్రబంధాలను పరిష్కరింపజేశారు. సంస్కృత గ్రంథాల సేకరణ, పరిష్కరణ చేశారు. దాదాపు రెండు వేల వేమన పద్యాలను సేకరించి వాటిలో 693 పద్యాలను ఇంగ్లీషులోకి అనువాదం చేసి అచ్చు వేయించారు. అలా వేమన పద్యాలకు ప్రపంచంలో విస్తృత ప్రచారం కావించారు – ఇదంతా పండిత భాషకు సంబంధించిన కృషి.



సి.పి. బ్రౌన్

ప్రజల భాషకు మరింత ఎక్కువ కృషి చేశారు. ప్రజల నోళ్లలో నానుతూ వచ్చిన చాటువులను, సామెతలను, కథలు, గాథలు, పలుకుబడులను సేకరించారు. తెలుగు నేర్చుకోదలచిన ఆంగ్లేయుల కోసం ఎన్నో వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు వ్రాశారు. అన్నింటికన్న మిన్నగా చెప్పవలసిన పని, నిఘంటు నిర్మాణం. తెలుగు–ఇంగ్లీషు, ఇంగ్లీషు–తెలుగు నిఘంటువులు వ్రాశారు. ఈ రోజుకీ అవి ప్రామాణికంగా వున్నాయి. జిల్లా నిఘంటువు వ్రాశారు. తెలుగు సాహిత్యం గురించి, శిల్పము, జ్యోతిష్యము, కవిశకం, హిజరి మొదలైన వాటిపై చాలా వ్యాసాలు వ్రాశారు. రాజుల యుద్ధము అను అనంతపురం చరిత్ర, తాతాచారి కథలు, పంచతంత్ర కథలు యిలా ఎన్నో రచనలు చేశారు.”

**– జానమద్ది హనుమచ్ఛాస్త్రి.**

* * *

# కరుణశ్రీ

“బుద్ధ చరిత్రాన్ని ‘కరుణశ్రీ’ పేరిట రచించాడు జంధ్యాల పాపయ్య శాస్త్రి. మొదటి భాగం వేశాక నలభై ఏళ్లపాటు దానిని ముట్టుకోలేదాయన. నలభై ఏళ్ళ తరువాత మిగతా భాగాలు పూర్తి చేసి నాకు కబురు పెట్టాడు. పీఠిక వ్రాయడానికి గుంటూరు వెళ్ళాను. మధ్యాహ్నం వేళ – పీఠిక రచించి వినిపించాను. మంచం మీద కూర్చున్న ఆయన ఒడిలో దిండు పెట్టుకుని వింటున్నాడు. అంతా విన్నాక ఆనంద పారవశ్యంలో తేలాడు. ఆ ఊరి ఎమ్మెల్యే వచ్చి ‘కరుణశ్రీ చాలా ఆనందంగా ఉన్నారే!’ అన్నాడు. నా పీఠికను గురించి చెప్పి, ‘కరుణశ్రీ’ కావ్యాన్ని పూర్తి చేశాను. నా జన్మ ధన్యం అన్నాడు. రాత్రి వద్దంటున్నా, నన్ను పట్టెమంచం మీద పడుకొమ్మని పక్కనే మడత మంచం వేసుకుని తాను పడుకున్నాడు. ఒక రాత్రివేళ లేచి చూస్తే, మధ్యాహ్నం లాగే ఒడిలో దిండు పెట్టుకుని కూర్చుని ఉన్నాడు. “ఏమిటి శాస్త్రిగారు! ఏమైనా బాధగా ఉందా ?” అన్నాను నేను. ఏమీ లేదన్నట్టు అడ్డంగా తల ఊపాడు. ‘మరేమిటి ?” అంటూ దగ్గరకు వెళ్ళి పట్టుకున్నాను. అంతే! నా ఒడిలో కరుణశ్రీ ప్రాణం విడిచాడు. నేను హేతువాదిని. కాని నాతో ఇంతటి ఆత్మీయతానుబంధం గల కరుణశ్రీ నా ఒడిలోనే ప్రాణం వదలడం హేతువాదానికి అతీతమైన సంఘటనగా నేను నమ్ముతున్నాను.”

**– నండూరి రామకృష్ణమాచార్య**

* * *

# కృష్ణా పత్రిక కృష్ణారావుగారు



ముట్నూరి

"నేను శాంతినికేతనము నుండి 1924 లో వ్రాసిన తొలి వ్యాసము కృష్ణా పత్రికలో ప్రచురింపబడెను. 1933-34 ప్రాంతములలో నేను వ్రాసి పంపిన వ్యాసమొకటి సంపాదకీయముగా ప్రచురింపబడినపుడు నాకెంతో ఆశ్చర్యము, ఆనందము కలిగెను.

ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక సంపాదకులను సన్మానించుటకై 1929 లో బెజవాడలో జరిగిన మహాసభకు నేను హాజరై, నా జోహార్లను శ్రీ నాగేశ్వరరావు, శ్రీ కృష్ణారావుగారలకు వినమ్రముగా, నీరవముగా అర్పించితిని. పై వాక్యములలో కృష్ణాపత్రిక అన్నప్పుడు దాని పుటల తెరచాటున నిల్చిన గంభీరవ్యక్తి ఆకారమును సంస్మరించి వారి బాహ్యరూపమైన కృష్ణాపత్రిక అని వాడితిని. కృష్ణా పత్రిక దేహము, కృష్ణారావుగారు దాని ఆత్మ. నేను ఆంధ్ర జాతీయ కళాశాలలో విద్యార్థిగా నుండిన రోజులలో అప్పుడప్పుడు, అటనట వారిని దర్శించుచుంటిని గాని వారు ఎవరితోనైనా మాటాడగ నేను వినలేదు. మూగవారా అను శంక కలిగించెడి మౌనము వారిది. అనుదినము వారి ఇంటి మీదుగానే మేము పోవుచుండెడివారము. ఆ ఇల్లు వచ్చేసరికి ఇది కృష్ణాపత్రిక మాన్య సంపాదకులగు కృష్ణారావుగారి ఇల్లు అన్న సంగతి జ్ఞప్తికి వచ్చుచుండెడిది. ఆ దినములలో ఎన్నడూ వారిని తలగుడ్డ లేకుండా చూడలేదు. తర్వాత జైలులో రెండుమార్లు వారితో నుండగల్గుట వారి పరిచయము కలుగుట, వారి వద్ద అభిజ్ఞాన శాకుంతలము, నాగానందము మున్నగునవి వినగల్గుట నా జైలు జీవితములోని చిరస్మరణీయ ములైన విషయములు. 1938 లో మద్రాసులో జరిగిన నా వివాహమునకు వారు హాజరగుట, తిరిగి బందరుకు పోవుచు నెల్లూరులో ఆగి పెండ్లి విందుకు వారు రాగల్గుట నాకు గర్వకారణములు. 1944 లో బందరులో (వారి దర్బారులో) 'చిత్రాంగద-దేవయాని' అను నా ప్రథమ రవీంద్రానువాదమును పఠించుటకు అవకాశము కలిగించుటలో, తమ ఉదాత్త శైలిలో దానికి పరిచయ వాక్యములు వ్రాయుటలో నా హోదాకు మించిన ఔదార్యము, వాత్సల్యము వారు చూపిరని నేను ఆనందించుట జరిగింది. నాకు తెలిసినంతవరకు మరి ఏ గ్రంథమునకు వారు పరిచయ వాక్యములు వ్రాయలేదు."

**– బెజవాడ గోపాలరెడ్డి.** (కృష్ణాపత్రిక వజ్రోత్సవ సంచిక)

* * *

# విషాద కావ్యం

"మా తమ్ముడు మోహనరావు బ్యాంకు ఉద్యోగి. ముప్పైమూడు ఏళ్ళ వయస్సులో 'మయోవతి' అన్న జబ్బుతో మరణించారు. అంతకుముందు కొన్నిరోజుల క్రితం నాన్నగారు

రిక్షాలో నుండి పడి గాయపడ్డారు. కూర్చోవడం కూడా సాధ్యపడేది కాదు. అయినా తమ్ముని శవం ముందు అతికష్టంతో కూర్చుని 'నీ నామం సాహిత్య జగత్తులో సుస్థిరం చేస్తా'నని ప్రతిజ్ఞ చేశారు. రెండు, మూడు నెలల్లో 'విషాదమోహనం' కావ్యాన్ని పూర్తి చేశారు. ఆ కావ్యాన్ని చదివి కంట తడిపెట్టని పాఠకుణ్ణి నేను చూడలేదు. కృష్ణశాస్త్రి గారి అమ్మాయి మశూచి వ్యాధితో మరణించినది. ఆయన నాన్నగారి 'విషాదమోహనం' చదివి 'నేను చెప్పాలనుకున్నది, చెప్పలేకపోయింది మా తమ్ముడు సుబ్బారావు చెప్పాడు' అన్నారు."

**– నాయని కృష్ణకుమారి.**

*　　*　　*

# త్రివేణి

"1927 డిసెంబరు 25 న మద్రాసులో శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు త్రివేణి (ఆంగ్ల త్రైమాసిక పత్రిక) ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలలో, వివిధ భాషలలో జరిగే సాహిత్య సాంస్కృతిక ప్రగతిని పరభాషలు తెలియని భారతీయులకు పరస్పరం ఇంగ్లీషు భాషలో తెలియజేసి తద్వారా జాతీయ సమైక్యతను సాధించడం త్రివేణి ఆదర్శం. కళ, సాహిత్యం, చరిత్ర – ఈ మూడింటి సంగమం త్రివేణి. త్రివేణి పత్రిక చిహ్నం (ఎంబ్లమ్)లో ఉన్న పద్మం స్వచ్ఛమైన ప్రేమకు, జ్యోతి విజ్ఞానానికి, వజ్రాయుధం శక్తికి చిహ్నాలు. త్రివేణి ప్రారంభమైన రెండేళ్లలోనే భారతదేశములో మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రముఖ పత్రికలలో ఒకటిగా పేరు గాంచింది. ఆనాటి ప్రముఖులు శ్రీ అరవిందులు, రాజాజీ, రాధాకృష్ణన్ పండితులు, జిడ్డు కృష్ణమూర్తి, సర్ సి.పి. రామస్వామి అయ్యర్, డాక్టర్ పట్టాభి, కె.యం. మున్షీ, నెహ్రూ లాంటి ఎందరో మహాత్ములు త్రివేణికి వ్యాసాలు వ్రాసేవాళ్లు.

రామకోటేశ్వరరావుగారు జైలుకు వెళ్లటంతో ఈ పత్రిక ఆగిపోకుండా ఆయన మిత్రులు శ్రీ చిట్టూరి శ్రీనివాసరావు (ఆ తర్వాత వీరు హైకోర్టు చీఫ్ జస్టిస్ గా పదవీ విరమణ చేశారు), కె. సంపత్‌గిరిరావుగారు, మాస్తి వెంకటేశం అయ్యంగారు (జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత) పత్రికను బెంగుళూరు నుండి నడిపారు. జైలు నుండి వచ్చిన తరువాత బెంగుళూరు నుండి రామకోటేశ్వరరావుగారు త్రివేణిని నడిపారు. 1948 లో మరల మద్రాసు చేరింది. 1949 లో పత్రిక ఆగిపోయే తరుణంలో కాటూరి వెంకటేశ్వరరావుగారికి అప్పగించారు. 1950 ఏప్రియల్‌లో భావరాజు నరసింహారావుగారి అభ్యర్థన మేరకు త్రివేణిని వారికి అప్పగించారు. ఈ పత్రికను మహోన్నతంగా నడిపినందుకు నాగార్జున యూనివర్శిటీవారు నరసింహారావుగారికి డి. లిట్ యిచ్చి గౌరవించారు. ప్రస్తుతం త్రివేణి పత్రికను ఫౌండేషన్ తరపున హైదరాబాదు నుండి శ్రీ ఐ.వి. చలపతిరావుగారు నడుపుచున్నారు. వేమరాజు నరసింహారావుగారు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు."

**– భోగినేని జనార్దనరావు**

*　　*　　*


# సమయస్ఫూర్తి

"డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు విజయవాడలో ఆంగ్ల పత్రికను స్థాపించవలెనని ప్రయత్నం చేశారు. అందుకు WANTED ENGLISH ORGAN FOR ANDHRA'S అని కరపత్రమును ప్రకటించారు. అందుకుగాను ఒక సభ జరిగింది. ఆ సభలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని మాట్లాడవలసినదిగా కోరారు. మొదట వారంగీకరించలేదు. కాని బలవంతము చేయగా – "మాట్లాడటానికేముంది ? డాక్టరుగారే శలవిచ్చారు. ఇప్పుడాంధ్రులకు ORGAN (NEW INDIA) పత్రికతోనే కాలక్షేపం చేస్తున్నారు" అన్నారు. సభ అంతా గొల్లుమన్నారు."

**– కార్యంపూడి నాగేంద్రుడు**

* * *

# పండుగలు


సురవరం ప్రతాపరెడ్డి

"నిజాం ప్రభువు విజయదశమినాడు రాజాబహద్దర్ వెంకటరామారెడ్డి గారితో దసరా ఉత్సవాలు చేసికొనుటకు ధార్మిక కారణము ఏమని అడిగినారట. అందుకు ప్రత్యుత్తరంగా కొత్వాల్‌గారు ఉత్తర గోగ్రహణకాలమున పాండవుల విజయ సూచకంగా విజయదశమిని జరుపుకుంటారని చెప్పిన మీదట, నిజాం ప్రభువు అంతకు ముందుగా మరి యొకరిని విచారించగా వారు శ్రీరాముడు రావణునిపై విజయం సాధించిన సందర్భమును పురస్కరించుకొని వేడుకలు జరుపుకుంటారని తెలియజేసినారట. పై రెండు కారణాలలో ఏది నిజమని నిజామువారు కొత్వాల్‌గారి నడుగగా వారు నిరుత్తరులై రాజా ధనరాజగిర్జీని విచారించగా వారును హైందవులకు హిందువుల పండుగల ప్రాశస్త్యము గురించి ఏమియు తెలియదని తమ విచారము వెల్లడిస్తూ, హిందువుల పండుగలను హేతుబద్ధముగా తెలియజేయు పుస్తకము వ్రాసిన బాగుండునని సలహా ఇచ్చినారట. అంతట కొత్వాల్‌గారు సురవరం ప్రతాపరెడ్డిగారిని కలిసి 'హిందువుల పండుగలు' అను పుస్తకమును వ్రాయవలసిందిగా ఆదేశించినారట. అందుకు శక్తి చాలని వారయ్యును రెడ్డిగారు కొత్వాల్‌గారి ఆజ్ఞానుసారం 1930 లో 'హిందువుల పండుగలు' అను గ్రంథాన్ని రచించారు."

**– ముద్దసాని రామిరెడ్డి**

* * *

# కవితావేశం

"తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తిగారు ఒకనాడు 'గెడ్డం' గొరిగించుకొంటానికి మంగలికి కబురు పెట్టారు. ఇంతలో ఆయనకు 'తెనుగు తీపి' విషయంపై కవితావేశం వచ్చింది.

మూడు, నాలుగు పద్యాలు రాశారు. అంతలో మంగలి వచ్చాడు. కవిగారు కవిత వ్రాయడం ఆపేశారు. మంగలి కవిగారి గెడ్డం సగం గొరిగేసరికి కవిగారికి మరలా 'కవితావేశం' ముప్పేట ఆవహించింది. ఆవేశాన్ని ఆపుకోలేకపోయారు. మంగలిని గీయడం ఆపమన్నారు. కలం పట్టుకుని పద్యాలు రాయడం మొదలెట్టారు. ఐదు, పది నిమిషాలు కాదు – పావుగంట, అరగంట కాదు, ఏకబిగిన ఓ గంట సమయంలో నలుబది పద్యాలు రాశారు. కవితావేశం తగ్గింది. మంగలిని పిలిచారు. గెడ్డం పూర్తిగా గీయించుకున్నారు. మంగలిని ఆపు చేసినందుకు – పావలాకు బదులు రూపాయి ఇచ్చి, తిండి పెట్టి వానిని తృప్తిపరచి, తాను తృప్తి చెందారు."

**– అమూల్యశ్రీ**

* * *

# ప్రజామిత్ర

"ఆనాడు జార్జిటౌన్‌లోని ఆచారప్పన్ వీధిలో ఒక చిన్న ఇంటిలో బి.ఎన్.కె. ప్రెస్ ఉండేది. ఈనాడు ఆసియాలోకెల్లా అతిపెద్ద ముద్రణాలయాల్లో ఒకటిగా పేరెన్నికగన్న బి.ఎన్.కె. ప్రెస్‌కి బీజం అదే. ఆ ఇంటి మేడమీదే 'ప్రజామిత్ర' కార్యాలయం ఉండేది. ఆ ఇంటికి అయిదారిళ్ళ అవతల ఆ ప్రెస్ యజమాని బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి గారి సొంత ఇల్లు మూడంతస్థుల మేడ ఉండేది. సుప్రసిద్ధ చలనచిత్ర నిర్మాతలూ, దర్శకులూ అయిన బి.ఎన్.రెడ్డి, బి. నాగిరెడ్డి గార్ల తండ్రి ఆయన.

ప్రజామిత్ర కార్యాలయంలో తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచారి, కొసరాజు రాఘవయ్య, గోపీచంద్, శ్రీనివాస శిరోమణి, నార్ల వెంకటేశ్వరరావు మొదలైనవారు కలవడం, వివిధ విషయాలపై చర్చలు సాగించడం తరచుగా జరుగుతుండేది. ఆ చర్చలను వ్యాసాలుగా ఆ పత్రికలో ప్రచురిస్తూ ఉండేవారు. అందరూ ఒకరిని ఒకరు 'బ్రదర్' అని పిలుచుకునేవారు. రామబ్రహ్మంగారు ధర్మారావుని 'గురూజీ' అని పిలిచేవారు. వ్యాసాలు రాసో, సంచికల ప్రణాళికలను తయారు చేయడంలో పాల్గొనో, ఏదో ఒక రూపంలో ఆ పత్రికా నిర్వహణలో వారు తోడ్పడుతుండే వారు. ఆ రోజుల్లో మద్రాసుకి కవులూ, పండితులూ, కళాకారులూ ఎవరు వచ్చినా ప్రజామిత్ర కార్యాలయంలో సభ ఏర్పాటు చేసేవారు. 1940 జనవరిలో గిడుగు రామమూర్తిగారు, అలా జరిగిన ఒక సభలోనే 'తెలుగు ప్రజలకు తుది విన్నపం' చేశారు."

* * *

# ఉన్నవ స్వీయచరిత్ర

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ వ్యవహారికభాషలో పల్నాటిసీమలోని మాండలిక పదాలను విరివిగా ఉపయోగించి, రాయవెల్లూరు జైలులో 1921 లో రచించిన 'మాలపల్లి' నవల ఆంధ్ర



ఉన్నవ

సాహిత్యంలో ఒక మణిపూస. దీనిలో గ్రామీణ జీవితంలోని లోతుపాతులను తరచి, తద్వారా సాంఘిక విప్లవాన్ని ప్రబోధించారు. క్రీ.శ. 1180 ప్రాంతంలో జరిగిన పల్నాటి వీరగాథను 'నాయకురాలు' అను నాటకం వెలువరించారు. స్వరాజ్య సోదె, సంగీతనాపసాని, బుడబుక్కల జోస్యం, స్త్రీలపాటలు మొదలైన అనేక జానపదగేయాలు ప్రకటించారు. వాటిని శారదానికేతనం విద్యార్థినులచే ప్రదర్శింపజేసి, ఆయన ఆనందించేవారు. వున్నవవారి అపార పరిశోధనా కృషికి తిక్కనపై వీరు గావించిన రచన తార్కాణంగా వుంది. (ఇందులోని రెండు భాగాలు మాత్రమే ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రచురింపబడినవి లభ్యమైనవి.) ఇవి సమగ్ర గ్రంథ రూపంలో వెలుగు చూడలేకపోవం ఆంధ్రుల దురదృష్టమని చెప్పాలి. ప్రసిద్ధ రష్యా రచయిత మాక్సింగోర్కీ రచించిన 'తుది ఘడియలు' అను గ్రంథాన్ని వీరు అనువదించారు. అన్నింటికంటే ముఖ్యంగా వున్నవ వారు తమ 'స్వీయచరిత్ర' ను రచించినట్టు తెలిసింది. కాని ఎంత ప్రయత్నించినా అది లభ్యం కాలేదు. ఆ గ్రంథం ప్రచురణ అయితే – ఆంధ్ర సాహిత్య, రాజకీయోద్యమాలకు సంబంధించిన ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి రాగలవనుటకు సందియం లేదు. ఇప్పటికైనా వారి అముద్రిత గ్రంథాలను, వ్యాసాలను, పీఠికలను, జానపద వాఙ్మయాన్ని సేకరించి, ముద్రించే ప్రయత్నం చేయడం అవసరం."

– మాదల వీరభద్రరావు.

*　　*　　*

## తుది విన్నపం



గిడుగు

"నేడు సుదినం.

మీవంటివారి దర్శనం కలిగింది. 'ప్రజామిత్ర' పత్రికా సంపాదకులయిన శ్రీరామబ్రహ్మంగారు నా యెడల దయగలవారు గనుక నేటి సాయంకాలం ఈ సభ ఏర్పరిచారు. తెలుగు సారస్వతమందూ, తెలుగువారి విద్యాభివృద్ధి యందూ అభిమానముగ పండితులకున్ను కవులకున్ను పత్రికా సంపాదకులకున్ను నా కట్టకడపటి విన్నపము తెలియజేయడానికి అవకాశం కలుగజేశారు.

నా ఆరోగ్యం చెడిపోయినది. కాలేయంలో గుల్మ పుట్టినది. చికిత్స కోసం చెన్నపట్నం వచ్చాను. అట్టేకాలం జీవించగలనని తోచదు. జీవించి ఉన్నా చాలా కృశించిపోయి ఉన్నాను. గనుక మునుపటిలాగున మరి ఉపన్యాసాలు చేయలేను. అందుచేత ఇదే నా కట్టకడపటి విన్నపమంటున్నాను. ఇంకా జరుగవలసిన పని మీకే అప్పగిస్తున్నాను. మీరే సాగించవలెను.

గ్రాంధిక భాష యెడల నాకు ఆదరము లేకపోలేదు. ప్రాచీన కావ్యాలు చదువవద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేనననుగాని, ఆ భాషలో నేడు రచన సాగించడానికి పూనుకోవడం వృథా అంటున్నాను. నిర్దుష్టంగా ఎవరున్ను వ్రాయలేరు. వ్రాయ గలిగినా వ్రాసేవారికీ కష్టమే, వినేవారికీ కష్టమే. వ్రాసేవాండ్లేమి చేస్తున్నారు ? భావం తమ సొంత (వాడుక) భాషలో రచించుకొని గ్రాంధికీకరణం చేస్తున్నారు. అది చదివేవాండ్లు వినేవాండ్లు తమ సొంత వాడుక మాటలలోకి మార్చుకొని అర్థం చేసుకుంటున్నారు. ఎందుకీ వృథా ప్రయాస ?

స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రము కోసం చిక్కుపడుతున్నాము. ప్రజాస్వామిక పరిపాలనం కోరుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్య జనులకు ఏ భాష ద్వారా జ్ఞానం కలుగజేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి. మీ చేతులలో పత్రికలున్నవి. పత్రికల ద్వారా మీరు ఎంతైనా చేయగలరు."

**- గిడుగు వేంకట రామమూర్తి.**

(15-1-1940 ప్రజామిత్ర కార్యాలయములో చేసిన ఉపన్యాసం నుండి)

❋ ❋ ❋

# విప్లవ కవిత్వం

"1927 వరకు శ్రీశ్రీ ప్రభవాది కావ్యాలలో కాని, పురిపండా సౌదామినిలో కాని, నారాయణబాబు 'మిణుగురు'లో కాని తత్పూర్వ ప్రేమకవితాయుగ ప్రతిధ్వనులే నెలకొల్పేరు తప్ప స్వీయ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకోలేదు. సరిగ్గా ఆ సమయంలోనే బెంగాల్ నుంచి ఒక కొత్త వాయువు వీచనారంభించింది. 'నజ్రుల్ ఇస్లామ్' విప్లవ కవిత్వంతో, వంగిపోయిన జాతి వెన్నెముకను నిటారుగా నిల్పుతున్నాడు. 'హరీన్' ఛటోపాధ్యాయ కొత్త జండాలు ఆకాశం అంతా పరుస్తున్నాడు. వీరిరువురి ప్రభావం పురిపండా, శ్రీశ్రీ, నారాయణబాబులపై నిస్పష్టంగా చైతన్యాన్ని కలిగించింది. అతని కవితల ప్రభావంతోనే శ్రీశ్రీ మరో ప్రపంచం కాని, పురిపండా పులిపంజా అనే గేయం కాని, నారాయణబాబు కపాలమోక్షం కాని ఆవిర్భవించేయి. పురిపండా ఒరియా, బెంగాలీ భాషల్లో గాఢ పరిచయం అలవర్చుకొని ఆయా భాషల ఆధునిక విప్లవాత్మక కవితలను స్వయంగా అధ్యయనం చేసి, సోదర కవులకు గానం చేసి వినిపించేవారు. ఒరియా భాషలో అప్పటికి ఆధునిక విప్లవాత్మక కవిత చెప్పుకోతగిన స్థాయి నందకపోయినా, వంగ భాషలో మాత్రం 1920 నుంచీ నజ్రుల్ ఇస్లామ్ అంతర్జాతీయ శాస్త్రీయ సామ్యవాద దృక్పథాన్ని అలవర్చుకొని తీవ్రావేశంతో విప్లవ కవితా కంఠీరవంగా గర్జా ఘోషలు వినిపిస్తూనే ఉన్నాడు. విశ్వకవి రవీంద్రుని వంటి వారి ఆమోదాలనందుకున్నాడు."

**- గొర్రెపాటి వెంకట సుబ్బయ్య**

❋ ❋ ❋


# మనోభావం

"ఉపేక్షిత మానవుల యెడ సానుభూతులు చూపెడుతూ గంభీరంగా వ్రాసిన ఆంధ్ర రచయితల్లో ముగ్గురే ముగ్గురు ప్రత్యక్షంగా కనిపిస్తారు. శ్రీశ్రీ – గోపీచంద్ – జాషువా. కరుణ– ప్రేమలు ఉన్న రచయితలే ఉపేక్షిత మానవుల్ని వస్తువుగా చేసుకోగలిగారు. వారు ముగ్గురూ ప్రతిచోటా రచనల్లో పేదవాని పక్షమే నిలబడ్డారు. ముఖ్యంగా గోపీచంద్, శ్రీశ్రీలు ఏనాటికానాడు ఫీలయినట్టుగా వ్రాశారు. మనసు పడ్డ ఘర్షణను కాగితం మీద కుదించారు. మనోభావాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. ఎక్కడా మనోభావాన్ని అణచుకోవడం జరగలేదు. వ్రాతనే తపస్సుగా చేసుకున్నారు.

– దోనేపూడి రాజారావు

* * *

# ప్రణయగీతాలు



దేవులపల్లి

"ఇటాలియన్ కవి డాంటే (DANTE) తనను ప్రేమించి పెళ్ళాడి యుక్త వయస్సులోనే మరణించిన బ్యాట్రిస్ పోర్టీనారీ (BEATRICE PORTINARI) ని తన డివైన్ కామెడీ (DIVINE COMEDY) లో తనివితీరా వర్ణించాడు. పెట్రార్క్ అనే ఇటలీ కవి లారా (LAURA) అనే వివాహిత స్త్రీని ప్రేమించి, ఫలించని ప్రేమకోసం, లారా కోసం 366 ప్రేమగీతాలు రాశాడు. అలాగే ఇంగ్లీష్ కవి 'సిడ్నీ' ప్రేయసి 'స్టెల్లా' కోసం 'అస్ట్రోఫెల్ అండ్ స్టెల్లా' అనే ప్రణయకావ్యం రాశాడు. షేక్స్పియర్ 'డార్క్‌లేడీ' నుద్దేశించి రాసిన సానెట్లు అట్లాంటివే! 'ప్యానీబ్రౌన్'ని ప్రేమించి ఆమె తృణీకారానికి గురై 'కాట్స్' ప్రణయగీతాలాలపించాడు. 'షెల్లీ' తాను ప్రేమించిన 'హారియట్‌గ్రోవ్, 'ఏమీలియా విపియాసి', 'మిసెస్ విలియమ్స్' యువతుల ప్రేమలోనే ప్రణయకావ్యాలు రాశాడు. అలాంటివారే 'భైరన్', 'బ్రౌనింగ్', 'స్విన్‌బర్న్' మొదలైనవారు.

ఈ కవుల కవితల ప్రభావంతోనే మన భావకవులు కూడా ప్రణయ కావ్యరచనకు ఉపక్రమించారు. కొందరు జీవిత భాగస్వాములను కావ్య నాయికలుగా పాడుకున్నారు. అలాంటివారిలో శివశంకరశాస్త్రిగారి 'హృదయేశ్వరి', నాయని సుబ్బారావుగారి 'వత్సల' ముఖ్యమైనవారు. మరికొందరు కవులు ఊహానాయికలను కావ్య నాయికలుగా మలచుకున్నారు. అటువంటి వారిలో కృష్ణశాస్త్రి గారి 'ఊర్వశి', అడివిబాపిరాజుగారి 'శశికళ', విశ్వనాధగారి 'కిన్నెర', నండూరి సుబ్బారావుగారి 'ఎంకి' ముఖ్యులు."

– భూసురపల్లి వేంకటేశ్వర్లు

* * *

# సార్థకమైన పద్యం

"తన దేహము తన గేహము
తన కాలము తన భవమ్ము తన విద్య జగ
జ్జనులకు వినియోగించిన
ఘనుడీ వీరేశలింగ కవి జనులారా!"

1919 లో వీరేశలింగం గారు మరణించినప్పుడు చిలకమర్తివారు చెప్పిన పద్యమిది. ఈ పద్యం సార్ధకమైనది. ఇది వీరేశలింగంగారి హితకారిణీ పాఠశాలలో రాతి ఫలకంపై శాశ్వతంగా నిలిచిపోయింది. అశేష ఆంధ్రప్రజానీక హృదయాల్లో చోటు చేసుకున్న గొప్ప వ్యక్తి, మనీషి కందుకూరి. ఆయన మరణం చిలకమర్తిని చాలా కలచివేసింది."

❋ ❋ ❋

# కష్టము

"తెలుగులో మొదటి వచన ప్రబంధము నేనే రచించితిని. మొదటి ప్రహసనమును నేను వ్రాసితిని. మొదటి చారిత్రికమును నేనే విరచించితిని. స్త్రీలకై మొదటి వచన పుస్తకము నేనే కావించితిని. అయినను ప్రథమ ప్రయత్నము లెప్పుడును ప్రథమ ప్రయత్నములే. అవి దోష బహుళములయి యుండుట స్వాభావికము. మనము వృద్ధి పొందగలుగుట, చేసిన తప్పులను బట్టియే కాబట్టి మొదట చేయబడిన నా పుస్తకములను తరువాతి వారి గురుతర పుస్తక రచనకు కొంత తోడుపడవచ్చును.

నేనిట్లు కొత్త పుస్తకములను రచించుటయే కాక, పాత పుస్తకములను ప్రకటించుటకు కూడా శ్రమ పడితిని. 'శబ్దరత్నాకర' కర్తయైన బహుజనపల్లి సీతారామాచార్యుల వారు తమ నిఘంటువు యొక్క అవతారికలో కొన్ని పూర్వ పుస్తకముల పేర్లు చెప్పి, వాని పేరులు వినబడుటయేగాని పుస్తకము లెక్కడను కానరావని వ్రాసియున్నారు. వారట్లు వ్రాసిన పుస్తకములలో పదింటికంటే హెచ్చుగా నేను సంపాదించి, సంశోధించి, ముద్రించి ప్రకటించితిని. అపురూపములైన పుస్తకములను ప్రకటించుటలో గల కష్టము పనిచేసిన వారికేగాని, ఇతరులకు దురవగాహముగా నుండును."

**– కందుకూరి వీరేశలింగము**

❋ ❋ ❋

# రామిరెడ్డిగారు

"శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారితో నా ప్రథమ సమావేశం – శ్రీమతి పాణా కనకమ్మగారి పిలుపు మీద పొట్లపూడి (పేరు సరిగా ఉన్నదా ?) వెళ్ళాము. సంవత్సరం జ్ఞాపకం లేదు.

కీ॥శే॥ ఉన్నవ లక్ష్మీనారాయణగారు, నేనూ, నెల్లూరి వెంకట్రామానాయుడు ఒక జట్కా ఎక్కాము. ఊరిసీమలు దాటేసరికి – రామానాయుడు దిగాడు. రామిరెడ్డిగారు ఎక్కారు. ఆ బండిలో ఆనాడు మా పరిచయం – శకటం వెళ్లుతున్నది రివ్వున. లోపల రామిరెడ్డిగారి తొలకరి పద్యాలు చదవనారంభించారు. అప్పుడప్పుడే కవిత్వమారంభించారు. శ్రీమతి కనకమ్మగారి ఆతిథ్యంతో, రామానాయుడి విప్లవ విక్రాంతితో ఆ రోజులు గడిచినవి –

తరువాత – ఒకమారో రెండుమార్లో నాకు కొన్ని వ్రాతలో వున్న పద్యాలు పంపారు. సమావేశానికి అవకాశం కలుగలేదు."

**– రాయప్రోలు సుబ్బారావు.**

(కె.వి. రమణారెడ్డి గారికి వ్రాసిన ఉత్తరం నుండి)

❋ ❋ ❋

# ప్రోత్సాహం

"గోరాశాస్త్రి (గోవిందు రామశాస్త్రి) గారిని రచయితగా, పాత్రికేయులుగా మాత్రమే తెలిసిన రోజుల్లో ఆయనను గురించి ఎక్కువగా కె.ఎల్. నరసింగరావుగారి ద్వారా వింటూ వుండేదాన్ని. ఆ తరువాత మా అన్నయ్య దయానందం ద్వారా వింటూ వుండేదాన్ని. వీళ్ళిద్దరూ గోరాశాస్త్రిగారంటే చాలా ఇష్టపడేవారు కనుక, ఆయనను గురించి అన్నీ మంచి మంచి మాటలే వినేదాన్ని. అయితే వాదానికి రెండు వైపులు ఉంటాయి కదా! "అమ్మబాబోయ్! గోరాశాస్త్రిగారే, నోటితో, కలంతో మనుషుల్ని చీల్చి చెండాడగలరండీ ఆయన... దేనికదే చెప్పుకోవాలి, మనిషి దగ్గర అద్భుతమైన తెలివి, అతి సమర్థులు" అన్న మాటలూ విన్నాను. మహాగర్విష్టి అనే బిరుదు కూడా వుంది ఆయనకు.

ఇదంతా మాకు వ్యక్తిగతంగా పరిచయం లేనప్పటిమాట. అనుకోకుండా మేమిద్దరం వీరేశలింగం పంతులు గారిని గురించి ధర్మారావుగారు ఏర్పాటు చేసిన సభలో మాట్లాడవలసి వచ్చింది. అప్పుడే ఆయన నన్ను ఆంధ్రభూమిలో ఏదైనా వ్రాయమని అడగడం జరిగింది. ఆరు నెలల పాటు ఆయనతో కలిసి కూర్చుని పనిచేశాను. ఆయన పనిచేసే విధానం, ఆలోచన రేకెత్తించే రచనల్ని ఇతరుల దగ్గర నుంచి ఎలా రాబట్టగలిగేవారో చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేసేది. ఒకచోట కూర్చుని ఒక కావ్యం వ్రాయడం మాట సరే. ఆయన పదిమందితో పది కావ్యాలు వ్రాయించగలరు. ఎవరిలోనైనా ఏ కొంచెం శక్తి వుందని పసిగట్టినా వాళ్లని ప్రోత్సాహపరిచి వాళ్ళ చేత ఎన్నెన్నో వ్రాయిస్తూ వుంటారు. ఆయనలో ముఖ్యంగా చెప్పుకోతగ్గ విషయం ఇది. ఈనాటి యువతరపు రచయితల్లో చాలామంది ఆయన ప్రోత్సాహంతో రచయితలైనవారే. ఆయనను కలవడానికి ఎవరైనా ఆయన దగ్గరకు వెళితే, ఏదో ఒక వ్యక్తిని చూడటానికి వెళ్ళి నట్టుండదు. ఒక సంస్థను పరిశీలించడానికో, ఒక సాహిత్య గోష్ఠిలో పాల్గొనడానికో వెళ్లినట్లుంటుంది."

**– వి.యస్. రమాదేవి.** (మాజీ గవర్నర్)

❋ ❋ ❋

# బసవరాజు



బసవరాజు

" 'తృణకంకణం' అచ్చయి బయటకు వచ్చింది. బసవరాజు అప్పారావుకు కూడా ఒక కాపీ ఇయ్యడానికి తెచ్చాను. ఆ సాయంత్రానికే ఆయన అప్పటికే తృణకంకణం కొని, చదివి చేత పట్టుకుని మా బసకు వచ్చాడు. ఆనాడు అప్పారావు ముఖంలో కొంత విశేషం చాయలు దేరుతూ కనిపించింది. ఆనాడు సముద్రం ఒడ్డున అందులో గీతలు పెట్టుకొన్న పద్యాలన్నీ ఆయనే చదివాడు.


మరునాడు సూటిగా నా గదికి వచ్చాడు. ఏవో కొన్ని సంగతులు వెల్లడించారు. ఆ ధోరణిలో మనసు విచ్చి స్వచ్ఛందంగా ప్రసరించే వాలకం కనపడ్డది. అప్పటి నుండి మా పరిచయం స్నేహంగా చిగురు వోసి, మైత్రిగా కొమ్మలు సాగింది. అప్పారావులో ప్రధానంగా – ప్రస్ఫుటంగా ఒక గుణం కనిపించేది. విడుపు విరామమూలేని ఒక చురుకుతనం ఆయనను ఆవహించి ఉండేది. పట్టుమని పది నిమిషాలు కూర్చోలేడు. పెదవి కదిపితే ఆ ధార అలా వెళుతూ బిరబిరలాడవలసిందే.

అప్పారావు చామనఛాయ మనిషి. పలచని చెక్కిళ్ళు, కోలముఖం, కోణం వలె తీర్చిన నాసిక – కండ్లు కొంచెం లోతుగా ఉండేవి. కాని చూపులో ఒక వాడి – ఒక నిశిత వర్చస్సూ కనబడేది. ఆయన బుద్ధి అతిసూక్ష్మము. చదువులో కూడా పాదరసం వలె ప్రవహించేదట. పాఠ్య పుస్తకాలే చదివితే, ఆయన ఏ ఫస్టుక్లాసులోనో రాక తప్పుతుందా అనేవారు మిత్రులు. ఎప్పుడూ ఏదో ఒక కూనిరాగం గొంతులో మెదలుతూనే ఉండేది. పద్యమైనా పాటైనా చదివితే చక్కగా వినిపించేది. పదాలలో ఉన్న పరుష సరళ స్వభావం గమనించేవాడు. సంధులు త్రెంచేవాడు."

**– రాయప్రోలు సుబ్బారావు**

*　　　*　　　*

# ఉదయశ్రీ





కరుణశ్రీ

"ఆనాడు నా శిథిల జీవితానికి ఒక మధుర ప్రభాతం. నా హృదయంలో ఒక ఉదయశ్రీ. కన్నులు విప్పి చూచాను. శ్రీమతినీ, చిరంజీవినీ విడిచి బరువు గుండెతో మేడ మెట్లు దిగే గౌతమ బుద్ధుని కారుణ్యమూర్తి కనిపించింది. ఆయన ఆర్ద్ర నేత్రాంచలాల్లో కరుణకుమారి తొంగి చూచింది.

ఆమె వదనంలో అయోధ్యానగరం అంతఃపురాల్లోంచి దండకారణ్య పర్ణకుటిలో తన జీవిత సౌభాగ్యం వెతుక్కుండే ఊర్మిళా

కుమారి ఉత్కంఠ తొణుకులాడుతూ వుంది. ఆమె కంఠంలో పాషాణ హృదయాల ప్రక్కల కింద రెక్కలు వీడి నలిగి నశించిపొయ్యే పూలబాల జాలిపాట మ్రోగుతూ వుంది. ఆమె నిట్టూర్పులో గంగానది గట్టుమీద నిలిచి నిర్ఘాంతపోయి ఏటి కెరటాలలో ఎక్కడెక్కడికో కొట్టుకుపొయ్యే కొడుకు వైపు నిశ్చల నిరీహనేత్రాలతో చూచే కుంతీకుమారి గుండెల చప్పుడు వినిపిస్తూ ఉంది. ఆమె చల్లని చేతుల్లో కరుణామయి రాధిక హృదయ విపంచి అమృతరాగాలు ఆలపిస్తూ వుంది. ఆమె ఆర్ద్ర నేత్రాల్లో మృత్యుదేవత వెంట ఒంటిగా పతి కోసం పరుగెత్తే సతీమణి సావిత్రి ప్రణయ స్వరూపం ప్రతిబింబిస్తూ వుంది. ఆమె కన్నీటి కెరటాలలో పరాధీన భారతమాత భాష్పధారలు ప్రవహిస్తూ వున్నాయి. ఆమె నిట్టూర్పులు నన్ను మానవుణ్ణి చేశాయి. ఆమె కన్నీళ్ళే నాలోని కవిత్వం. ఆమె నా కరుణామయి, నా జీవిత సహచరి. నా ఆరాధ్యదేవి.

భగవంతుడు కరుణామయుడు – సృష్టి కరుణామయం – జీవితం కరుణామయం. ప్రపంచం కరుణలో పుట్టి పెరిగి కరుణలోనే విలీనమౌతుంది. కరుణకూ కవికీ అవినాభావ సంబంధం వుంది. కరుణ లేకపోతే కవికి వ్యక్తిత్వం లేదు. కవి లేకపోతే కరుణకు అస్తిత్వం లేదు.

ఈనాడు నా శిథిల జీవితానికి ఒక మధుర ప్రభాతం – నా హృదయంలో ఒక ఉదయశ్రీ".

**– కరుణశ్రీ**

* * *

# అపోహ


"ప్రాసక్రీడలు"లో "కవికోకిల గబ్బిలం" అని శ్రీశ్రీ రాసినప్పుడు, జాషువా కవికృతమైన "గబ్బిలం" కావ్యాన్ని పేర్కొని తత్కర్తను సూచించదలచుకొన్నాడేగాని, దువ్వూరి రామిరెడ్డిని గబ్బిలంగా వర్ణించబూనుకోలేదు. అయితే పాఠకులనేకులలో ఆ అనుమానం కలిగింది. అది దురదృష్టకరం. నిజానికి రామిరెడ్డి రచనల పట్ల శ్రీశ్రీకి గౌరవభావమే ఉంది. రామిరెడ్డి గురించి ఇలాంటి అల్పిష్టి అభిప్రాయం మరెవరికైనా ఉంటే, వారి 'అద్వైత' వైఖరికి జాలి పడవలసిందే. రాయప్రోలు సుబ్బారావు రచించినట్లు,

"కోకిలలను వేటాడిన కాకులెల్ల
భూపిశాచ దుష్కంఠులై పుట్టిరేమో ?
పాటల ప్రవాహములలోన బడిన రాళ్ళు
మృదుల కలభాషిణులుగ జన్మింపనోవు."

**– కె.వి. రమణారెడ్డి.**

* * *

# జీవన నౌక



గొట్టిపాటి బ్రహ్మయ్య

"శ్రీ పండిత వెంకట సుబ్బయ్య, నేను విద్యార్థి దశ నుండి మిత్రులము. ఆయన 'రైతుపెద్ద' అని నా జీవిత చరిత్ర వ్రాశారు. నా జ్ఞాపకాలను స్వీయచరిత్రగా వ్రాయమని నన్ను ఆయన తరచూ కోరుతూ వచ్చారు. ప్రియమిత్రులు నార్ల వెంకటేశ్వరరావుగారు పలుమార్లు హెచ్చరించారు. నేను విజయవాడ వెళ్ళినప్పుడు దిగవల్లి వెంకటశివరావుగారితో రాజకీయ చర్చలు సాగించేవాడను. వారున్ను భవిష్యత్ సంతతికి లాభదాయకముగా నుండుటకుగాను నా స్వీయచరిత్ర వ్రాయుట అవసరమని నొక్కి చెప్పారు. 1953 లో నేను రాజకీయ కలాపములను చాలవరకు తగ్గించుకొని వ్యవసాయం మీద ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఘంటసాలలో ఇంటిపట్టున ఉండే సమయంలో మా కుటుంబ చరిత్రను, నన్ను పెంచి పెద్దచేసిన నా మేనమామల కుటుంబ చరిత్రను, నా విద్యార్థి జీవితం వరకు వ్రాశాను. నేను శాసన పరిషత్తు సభాపతినైన రోజున నన్ను అభినందిస్తూ నా మిత్రులు యం.ఆర్. అప్పారావుగారున్ను కీ॥ శే॥ శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగార్లు నా స్వీయచరిత్ర వ్రాయమని కోరుతూ, అది ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమ చరిత్రగా వన్నెకెక్కగలదని ఆశీర్వదించారు.

తరువాత ప్రముఖ రచయిత రావూరి భరద్వాజగారితో పరిచయమేర్పడినది. ఆయన వత్తిడి ప్రభావం వలన నా స్వీయ చరిత్రను 1968 జూన్ 30 వరకు మాత్రం వ్రాసితిని. శ్రీ భరద్వాజగారు మా ఇంటికి వచ్చినప్పుడెల్ల నేను వ్రాసినది చూచి, భాషా విషయమున సరిదిద్ది నాకు అమూల్యమైన సహాయమును చేశారు. నా 71వ జన్మదినోత్సవమును గూర్చియు, మరి కొంతయు తరువాత చేర్చితిని. 1968 తరువాత రాజకీయ సంఘటనలను గూర్చి వ్రాయలేదు. శ్రీ నార్లగారు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రతి ఆదివారం 1969 ఏప్రియల్ నుండి 75 వ్యాసాలుగా కొంతవరకు ప్రకటించి హెచ్చుమంది చదువుటకు అవకాశము కలుగజేసిరి.

మిత్రుడు వెంకట సుబ్బయ్యగారి ద్వారా కళాతపస్వి, సాహిత్యమూర్తి సంజీవదేవ్‌గారితో పరిచయమేర్పడినది. వారింట రెండురోజులుండి వారి యెడ గౌరవ మర్యాదలు పెంచుకున్నాను. ఆయన కవి, విమర్శకుడు, చిత్రకారుడు, తత్వవేత్త, స్వయంకృషి వల్ల సంస్కృతాంధ్ర, వంగ, హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషలను నేర్చిన ప్రతిభావంతుడు. మంచి మిత్రుడు. ఆయనకు నా వ్రాత ప్రతిని పంపి పరిచయం వ్రాయమని కోరగా, 'కాంతిరేఖ' వ్రాసిరి. దీని పేరు 'జీవననౌక'గా వారే ఉంచిరి."

– గొట్టిపాటి బ్రహ్మయ్య

* * *

# రచన



రావిశాస్త్రి

"1952 వ సంవత్సరంలో అదివరకులా మారుపేరుతో కాకుండా నా పేరుతో 'అల్పజీవి' అనే నవల రాశాను. అది 1953 వ సంవత్సరం జనవరి నెల నుండి భారతిలో ప్రచురించబడింది. అంతకు ముందు నా పేరు తెలియని చాలామందికి నా పేరు వెల్లడి అయింది. శ్రీశ్రీ గారికి, కొడవటిగంటి కుటుంబరావు గారికి కూడా నా పేరు తెలిసింది. 'అల్పజీవి'ని వారు కూడా గమనించేరు అనే సరికి నాకు గాబరా వేసింది. భయం వేసింది. అప్పుడు మనం ఎందుకు రాస్తున్నాము అనే విషయం గురించి కొంత ఆలోచించక తప్పింది కాదు. అంతవరకు నేను ఏదో తమాషాకి ఇష్టం వచ్చినట్టు, బాధ్యతారహితంగా రాసేవాడిని. నా సరదాలే నేను చూచుకున్నాను కానీ 'ఈ రచన వల్ల చదివేవారు ఏమౌతారు ? వారికి ఇది మంచి అవుతుందా? లేక చెడ్డ అవుతుందా ?' అని నేను ప్రశ్నించుకోలేదు కాని 'అల్పజీవి' గురించి అంతమంది అడిగేసరికి ఆ తరువాత రాసిన ప్రతి విషయం గురించి నా మటకు నేను ప్రశ్నించుకుని, నా మటుకు నాకు ఇది మంచిది అవుతుంది అని తోస్తేనే రాస్తూ వచ్చాను. ఇది ప్రతి రచయితకి ఎప్పుడో ఒకప్పుడు తప్పదు అని భావిస్తాను."

**– రాచకొండ విశ్వనాథశాస్త్రి**

* * *

# గురజాడ

"ఎలాగ ఉన్నాడో చూచి వద్దామని విశాఖపట్నం వెళ్లాను. అదే ఆఖరుసారి అతన్ని చూడటం. నేనతన్ని చూడడానికి వెళ్ళినప్పుడు డాక్టరు నాకిలా సలహా యిచ్చారు. 'మీరు యెదట కనిపించేసరికల్లా ఆయన ఉద్రేకం పట్టలేకపోతున్నారు. అదే పనిగా జబ్బు మాటే మరచి మీతో సాహిత్యగోష్ఠి జరుపుతున్నారు. చారిత్రక విషయాల గురించీ, సారస్వతాన్ని గురించి చర్చలు చేస్తున్నారు. విపరీతమైన అలసట కలుగుతున్నా లెక్క చేయడం లేదు. ఇలా అయితే ఆయన ఆరోగ్యం మరీ పాడవుతుంది కదా!" ని.

డాక్టరు అతనికి ఉత్తరాలు వ్రాయవద్దని నాకు చెప్పారు. నాటినుంచి అతనికి ఉత్తరాలు వ్రాయడం మానుకున్నాను. జబ్బు నిమ్మదిస్తుంది కదా, ఆరోగ్యం తిన్నబడుతుంది కదా అని ఆశిస్తూ వుంటిని...."

**– గిడుగు రామమూర్తి.**

(5-12-1915 న గురజాడ కుమారుడు రామదాసుకు రాసిన లేఖ నుండి)

* * *

# దాడి



సోమసుందర్

"విశాఖపట్నంలో మహాకవి శ్రీశ్రీకి 1970 ఫిబ్రవరి 1, 2 తేదీలలో షష్టిపూర్తి సన్మానం జరిగింది. సన్మాన సభా వేదికపై నుంచి దిగంబర కవి జ్వాలాముఖి, సోమసుందర్‌ని 'బృహన్నల' అని సంబోధించడం పొరపాటు. ఆయన్ని కొజ్జా అని నిందించడం బాధాకరమైన విషయమే. అప్పటి నుంచి సోమసుందర్ నాగుబాములా పగబట్టి సహనాన్ని కోల్పోయి బరితెగించి వారిని 'విప్లవ కవిత్వ వికృత శిశువులనీ' యింకా యింకా తిట్టడం ప్రారంభించాడు. సోమసుందర్ శాపనార్థాలు చూడండి!

'1940' లో విజృంభించిన విప్లవ కవిత్వానికీ, 1950 లో విజృంభించిన లైంగిక సాహిత్యానికీ కలిపి పుట్టిన వికృత శిశువులుగా 1964 నాటికి దిగంబర కవులు తమ ఉద్యమాన్ని ప్రారంభించారు.

ఈ దిగంబరులు ఈ నక్సలైటు 'విప్లవకారులు' శ్రీశ్రీ నడుం పట్టుకొని తమకు కావలసిన ధోరణిలో పిల్లికూతలు పెట్టిస్తున్నారు.

'సాహిత్యంలో తమ విస్పష్టమైన అస్తిత్వాన్ని రుజువు చేసుకోవాలనే సంకల్పంతో, ఆరుగురు కవులు పూర్వనామాలు మార్చుకొని 'దిగంబరు'లయ్యారు.'

'ఏమిటి! పూర్వనామాలు మార్చుకోవడం నేరమా ? ఘోరమా ? ద్రోహమా ? సోమసుందర్‌కి అత్యంత ఆప్తమిత్రులు శ్రీ భాగవతుల శంకరశాస్త్రిగారు 'ఆరుద్ర' అని, తన పూర్వ నామం మార్చుకోలేదా ?! ఏమిటీ తర్కం ? అసహనానికీ ద్వేషానికీ హద్దులుంటాయి.'

'నోటికి వచ్చిన బూతులన్నీ కాగితాలపై యెక్కించి అదే విప్లవ కవిత్వమని దబాయించే స్థితి ఏర్పడింది' అని సోమసుందర్ అంటున్నాడు.

'ప్రేమ పేరుతో పచ్చికాముకతనూ, మధుర భక్తి పేరిట విశృంఖల ప్రవర్తననూ, శృంగారం పేరుతో కవి చౌడప్పతత్వాన్ని, తన కావ్యాల్నిండా టన్నులకొద్దీ ఉత్పత్తి చేసిన ఈ సోమసుందర్ కూడా ఒక అభ్యుదయ కవియేనా అని మేం సూటిగా ప్రశ్నిస్తోన్నాం ?"

**– అభ్యుదయ సాహితీ మిత్రులు.** (గురజాడ – శ్రీశ్రీలపై సోమసుందర్ దాడి నుండి)

*　　*　　*

# బ్రిలియంట్

"నా జీవితంలో తారసపడ్డ ముగ్గురు మిత్రులను తల్చుకుంటే అపరాధ భావంతో కుంగిపోతాను. వాళ్ళు ముగ్గురూ నాకన్నా తెలివికల వాళ్ళనీ, సమర్థులనీ, సరి అయిన అవకాశాలు



చేకూరి రామారావు

వస్తే అద్భుతంగా రాణించే వారని నాకు నమ్మకం. అవి లేకపోవటం వల్లనే అణగారిపోయారని నా బాధ. ఇందులో మొదటివాడు సరిపల్లి ద్వారకనాథ్. ఎన్ని కలలు కన్నాడో! ముల్క్‌రాజ్ ఆనంద్ నవలలను మేమిద్దరం తెలుగు చేద్దామనుకునేవాళ్ళం. ఆ పాటికే తాను చేశానని ఒక స్నేహితుడు చెబితే మానేశాం. ఒట్టిదే! అతను చెయ్యలేదు. ద్వారకనాథ్ తండ్రి, అన్న వరసగా చనిపోవడంతో అతని మీద విపరీతమైన బాధ్యత మోపారు. అతను గొప్ప కవి అయివుండొచ్చు. (నాకంటే ముందు కవిత్వం చెప్పాడు), గొప్ప విమర్శకుడయి వుండొచ్చు (ఇంగ్లీషు బాగా చదువుకున్నాడు) ఇంకా ఎన్నో అయి వుండొచ్చు. రైల్వే T.C. అయ్యాడు.

రెండోవాడు – నారుకొండ నాగేశ్వరరావు. వీరులపాడు వాస్తవ్యుడు. లెక్కలు బాగా వచ్చు. మంచి ఇంజనీరు అయివుండేవాడు. ద్వారకనాథ్ లాగానే తండ్రి మరణంతో కుటుంబ బాధ్యత మీద పడి కుంగిపోయాడు. నాకు తరచు కనబడుతూ నన్ను అపరాధుని చేస్తుంటాడు. వీడు సాహిత్యవేత్త కాడు. కాని ఒకనాడు మంచి కమ్యూనిస్టు (ఇప్పుడేమిటో!).

మూడోవాడు – మా బక్కోడు అని తరచుగా రిఫర్ చేసే జగడం లక్ష్మీనారాయణ. వాళ్ళన్నయ్య రెక్కల కష్టంతో బి.ఎ., వరకు చదివాడు. ఎం.ఎ., మధ్యలో మానేశాడు. నేను ముత్యాలసరాల్లో కూనిరాగాలు తీసే రోజుల్లో తాను అత్యాధునికమైన వచన కవిత్వం రాసి అజంతా, వరదలను మెప్పించాడు. ఆ రోజుల్లో (1957) శ్రీశ్రీ ముఖచిత్రంతో వచ్చిన నిజాం కాలేజీ వార్షిక పత్రికలో ఆధునిక కవిత్వంపై అద్భుత వ్యాసం రాసి, కె.వి. రమణారెడ్డి గారితో సాహిత్యపేచీ పెట్టుకున్నాడు. ఈ సంచికను కె.వి.ఆర్.గారు అప్పటి అభ్యుదయ మాసపత్రికలో సుదీర్ఘంగా సమీక్షించారు. అజంతా సరసన నిలబడే గొప్పకవో, కె.వి. ఆర్ గారి సమ ఉజ్జీగా విమర్శకుడో (రెండూనో) కావలసినవాడు. కొత్తగూడెం గనుల్లో పర్సనల్ ఆఫీసర్‌గా మిణుకుతున్నాడు. ఇంగ్లీషులో 'బ్రిలియంట్' అనే మాటకు తగిన ఉదాహరణలు వీళ్ళు. జీవితం వీళ్ళపట్ల కఠినంగా వ్యవహరించింది. అందుకే వీళ్ళను చూచినప్పుడల్లా, తలచుకున్నప్పుడల్లా నేరస్తుడిలా బాధపడిపోతాను."

– చేకూరి రామారావు

* * *

# మహాదేవి వర్మ అదృష్టం

"మరో నలభైరోజులు శ్రీరంగం శ్రీనివాసరావు జీవించి వుంటే, 1982 వ సంవత్సరపు జ్ఞానపీఠ్ బహుమతి లభించి ఉండేది. 1982 వ సంవత్సరపు జ్ఞానపీఠ్ బహుమతి శ్రీశ్రీకి ఇవ్వాలని జ్ఞానపీఠ్ కమిటీ తుది సమావేశంలో నిర్ణయించినదని అత్యంత విశ్వసనీయ వర్గాల

ద్వారా విన్న ఘట్టమరాజు మిత్రులు – మంచం పట్టిన మహాకవి శ్రీశ్రీని టేప్ రికార్డర్ సహాయంతో ఇంటర్వ్యూ చేశారు. ఇంతలో శ్రీశ్రీ మరణించడం – సజీవులకే జ్ఞానపీఠ్ బహుమతి ఇవ్వాలన్న నిబంధన కారణంగా ఆ జాతీయ బహుమతి హిందీ కన్నీటి కవయిత్రి మహాదేవి వర్మ 'యామా' (జాము) కవితకి దక్కింది."

**– భమిడిపాటి అనంతనారాయణ**

* * *

# హాస్యం

"వీరేశలింగం గారి ప్రహసనం, చిలకమర్తి వారి చతురోక్తి, పానుగంటి వారి ప్రౌఢోక్తి, భమిడిపాటి వారి హాస్యోక్తి, మొక్కపాటివారి ఛలోక్తి, మునిమాణిక్యం వారి రసోక్తి తెలుగువారి జీవితంలో చిమ్మచీకటులను చిమ్మివేసి, వెన్నెల మొలకల్లా పని చేశాయి. గురజాడ వారి సరసోక్తి జాతి ప్రవృత్తి మీద చెరగని ముద్రలు వేసింది. బురదనీరులా వరదలు పారుతున్న మూఢాచార ప్రవృత్తికి చిల్లగింజల్లాగా పని చేసిన హాస్యరచనలు తెలుగువారి జీవితంలోనూ, సాహిత్యంలోనూ హాస్యరసానికి ఉన్న ప్రతాపాన్నీ, ప్రభావాన్నీ ప్రకటించి నిరూపించాయి. జాతి పునరుజ్జీవన వికాసంలో హాస్యం నిర్వహించిన పాత్ర అపూర్వం. జాతిని నొప్పించకుండా కవ్వించిన కళాకౌశలం ఇరవైవ శతాబ్ధి పూర్వార్థంలో ఆంధ్రదేశంలో ప్రదర్శించింది హాస్యం."

**– జి.వి. సుబ్రహ్మణ్యం**

* * *

# బాకీ రచనలు

"కొన్ని అప్పులు తీరేవికావు. తల్లికి, తండ్రికి, గురువుకి, దేశానికి ప్రతి మనిషీ ఋణపడే ఉంటాడు. అసలుకన్నా వడ్డీ ప్రియం. అసలు తీరుద్దామనుకుంటే వడ్డీ మిగిలిపోతుంది. వడ్డీకి చెల్లు వేస్తే అసలు ఎప్పటికీ తీరదు. జీవితం కూడా ఇంతే.

ఇంటి బాడుగ చెల్లించలేక ఇబ్బందిలో వున్నప్పుడు 'వికారాఫ్ వేక్ ఫీల్డు' నవల గోల్డ్‌స్మిత్‌ను కాపాడింది. డాస్టోవిస్కీ అప్పులపాలై అప్పులు తీర్చడం కోసం పుంఖాను పుంఖంగా నవలలు రాశాడు. ఓ హెన్రీ అందరి వద్దా ముందు డబ్బు తీసుకోవడం వలన, బాకీ కథలు రాయించుకునేందుకు అతని చుట్టూ చేరేవారట ప్రచురణకర్తలు, పత్రికలవారు. భారతి కార్యాలయం నుంచి ఎందరో కవులు, పండితులు, రచయితలు అడ్వాన్సులు తీసుకుని చెల్లు బెట్టడం కోసం బాకీ రచనలు చేశారు. భారవి ఇల్లరికం వెళ్ళాడు. 'అత్తవారింట్లో నిరాదరించబడిన వేళ తన అనుంగు సఖి ముచ్చట తీర్చటం కోసం ఒక షావుకారు వద్ద తన కిరాతార్జునీయం కావ్యంలోని

" సహసా విచధీతన క్రియా
మవివేకః పరమా పదాం పదం
వృణుతేహి విమృశ్య కారిణాః
గుణలుబ్ధాః స్వయమేవ సంపదాః "

అనే శ్లోకాన్ని రాసిన తాటాకును తాకట్టు పెట్టి, తరువాత ప్రసిద్ధుడై తిరిగి వచ్చి (ఆ శ్లోకమే తన్ను కాపాడగా) విడిపించుకుని కావ్యాన్ని ప్రచురించినట్లు కథ ఉంది."

**– పురాణం సుబ్రహ్మణ్యశర్మ**

* * *

# మౌనం

" 'లోకో భిన్న రుచిః' అన్నారు పెద్దలు. కొందరు బాగున్నదన్నందు వల్ల రచయిత పొంగిపోడు. మరి కొందరు బాగాలేదన్నందువల్ల రచయిత కుంగిపోడు. 'నవ్విపోదురుగాక నాకేటి వెరపు' అని మా దేవులపల్లి కృష్ణశాస్త్రిగారన్నారు.

OSCOR WILDE అనే ఆంగ్ల రచయిత రచించిన 'PICTURE OF DORIAN GREY' అనే నవలపైన గాలిదుమారం రేగింది. ఎన్నో కోట్ల గొంతుకలో దీన్ని గురించి కొట్లాడుకున్నాయి. ఈ దుమారం చూసి ఒక మిత్రుడు WILDE ని 'ఏం మహానుభావా! ఇంత గాలిదుమారం రేగితే, ఇన్ని ఉరుములు, మెరుపులు మమ్మల్ని హడలగొడుతుంటే మీరేమీ మాట్లాడరెందుచేతను' అన్నాడు. దానికి WILDE నవ్వుతూ కొంత సమాధానం చెబుతూ మధ్య నొక్కమాట అన్నాడు. "WHEN CRITICS DISAGREE THE ARTIST IS IN ACCORD WITH HIM SELF". అనగా వాళ్లని కొట్టుకు చావనీయవయ్యా మనకెందుకు అన్నమాట."

**– మొక్కపాటి నరసింహశాస్త్రి**

* * *

# నార్ల

"తెలుగులో సంపాదకీయ వ్యాఖ్య – సంపాదకీయం ఉండాలనే సంప్రదాయాన్ని ప్రవర్తింప జేసిన వ్యక్తి కొక్కొండ వెంకటరత్నం పంతులుగారేనని పండిత పాత్రికీయుడైన (పాత్రికేయుడు అనవద్దనీ, పాత్రికీయుడు అని మాత్రమే అనాలని) తిరుమల రామచంద్ర తరచూ పేర్కొంటూ వుండేవారు. అలాగే కొక్కొండ చెప్పిన నవ లక్షణాలు – పాండిత్యం, సత్ప్రవర్తన, జగద్వ్యాపార విజ్ఞత్వం, స్థైర్యం, ధైర్యం, ఉచితజ్ఞత్వం, శక్తిత్రయం, సూక్తి చాతుర్యం ఉన్న తెలుగు సంపాదకులలో నార్ల వెంకటేశ్వరరావు అగ్రశ్రేణిలో నిలుస్తారు. అయితే ఆ నవ లక్షణాలలో ఒకటైన ధనం ఆయనకు వొంటబట్టలేదు చివరిదాకా. అందువల్ల ప్రధానంగా అష్టలక్షణాలతోనే నార్ల సరిపెట్టుకోవల్సి వచ్చింది. అయితే అంతకు మించిన మరికొన్ని గుణాలు కూడా ఆయనకు

ఉన్నాయి. హేతువాద దృష్టి, వైజ్ఞానిక దృష్టి, రాజీలేని తత్వం, భావ ప్రకటనలో నైశిత్యం, భాషా ప్రయోగంలో సూటిదనం. సుమారు రెండుతరాల యువ రచయితలూ, పాత్రికేయులూ నార్ల ప్రభావంలో తమ బాటను దిద్ది తీర్చుకున్నారు."

**– ఎ.బి.కె. ప్రసాద్.**

❋ ❋ ❋

# అభ్యుదయం

"1930–40 మధ్యకాలంలో తెలుగు యువసాహితీవేత్తలలో అభ్యుదయ భావాలు గలవారికి "కమ్యూనిస్టు మేనిఫెస్టో" పారాయణ గ్రంథమైనదంటే అది అతిశయోక్తి కాదు. దాన్ని మించిన మహాకావ్యమేదీ లేదని వాదించిన కవి కిశోరాలు కూడా ఉండేవారు – ఈ కాలంలోనే బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన రజినీపామీదత్తు, బెన్‌బ్రోస్లేలు తయారు చేసిన 'థీసిస్' ఆంధ్ర కమ్యూనిస్టులకు అధ్యయన గ్రంథమైంది.

ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తొలిదశలో మార్క్సిస్టు భావాలను వ్యాప్తి చేయడానికి 'నవశక్తి, ప్రజాశక్తి, ప్రభ, స్వతంత్రభారత్' పత్రికలు; గద్దె లింగయ్యగారి 'ఆదర్శ గ్రంథమండలి'; మహీధర సోదరుల 'విశ్వసాహిత్యమాల', అశ్వినీకుమారదత్తుగారి 'ప్రగతి' ప్రచురణలు, అన్నాప్రగడ కామేశ్వరరావుగారి 'అతివాద గ్రంథమండలి', విద్వాన్ విశ్వంగారి 'నవ్యసాహిత్యమాల' విశేషమైన సేవ చేశాయి.

1930–40 సంవత్సరాల మధ్యకాలంలో శ్రీరంగం శ్రీనివాసరావుగారి మహాప్రస్థాన గీతాలు వివిధ పత్రికలలో వచ్చి తెలుగు కవిత్వ స్వరూపాన్ని పూర్తిగా మార్చివేశాయి. అప్పటిదాకా కవులుగా ప్రఖ్యాతులైనవాళ్ళంతా చలంగారు చెప్పినట్లు శ్రీశ్రీ వెనక నిలిచి తమ ఉనికి సమర్థించుకోవలసి వచ్చింది. మార్క్స రచించిన 'దాస్ కేపిటల్' వంటి సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా గాక, శ్రీశ్రీ మార్క్సిజాన్ని జీర్ణించుకున్న సాహిత్యవేత్తల రచనల నుండి ప్రేరణ పొందారు. అభ్యుదయ భావాలున్న వారందరికీ శ్రీశ్రీ ఆరాధ్యుడైనాడు.

కొడవటిగంటి కుటుంబరావు, మా గోఖలే, కరుణకుమార మొదలైన కథా రచయితలు; మహీధర రామమోహనరావు, ఉప్పల లక్ష్మణరావు, ఆళ్వారుస్వామి లక్ష్మీకాంతమోహన్, బొల్లిముంత శివరామకృష్ణ మొదలైన నవలా రచయితలు; సుంకర, వాసిరెడ్డి, ఆచార్య ఆత్రేయ మొదలైనవారి నాటకాలు; శ్రీశ్రీ, ఆరుద్ర, సోమసుందర్, అనిసెట్టి, కుందుర్తి, కె.వి. రమణారెడ్డి, రెంటాల, కాళోజీ, దాశరధి, విద్వాన్‌విశ్వం మొదలైన కవుల కవితలూ అభ్యుదయోద్యమానికి పుష్టిని చేకూర్చాయి."

**– అట్లూరి రామమోహనరావు**

❋ ❋ ❋

# కవితాసమితి



శ్రీశ్రీ

"పేరుకు విశాఖపట్నం కేంద్ర కార్యస్థానమే అయినా, కవితా సమితి విజయనగరం, బరంపురం వగైరా దాకా వ్యాపించింది. ముఖ్యంగా విజయనగరానికీ, విశాఖపట్నానికీ సంబంధ బాంధవ్యాలెక్కువ. కాళూరి నరసింగరావు, తురగా వెంకటరామయ్య, పూడిపెద్ది వెంకటరమణ్య వంటి యువకవులేకాక, తాపీ ధర్మారావు వంటి పెద్దలు (అప్పటికింకా 'తాతాజీ' కాలేదు, వయసులో పెద్ద) ఈ సంఘంలో కలిసేవాళ్ళు. శ్రీశ్రీతో శ్రీరంగం నారాయణబాబుకి గల అగస్త్యభ్రాత సంబంధం స్నేహంగా మారేందుకు ఇది పనికి వచ్చింది. ఈ రోజులలోనే హరీన్‌ఛట్టో భీమునిపట్నం వరకు ఆంధ్రదేశం వివిధ కేంద్రాలను చుట్టిరావడం, రవీంద్రనాథ్‌ఠాగూర్ విశాఖపట్నానికి వచ్చిపోవడం కంటే, సాహిత్యపరంగా నవ్యతను కొత్తతెన్ను పట్టించడానికి కొంతైనా పనికి వచ్చింది. హరీన్‌ఛట్టో దంపతుల వెంట వచ్చిన ముద్దుకృష్ణ కూడా ఈ మార్పుకి తోడ్పడ్డారు. 'వైతాళికులు' సంకలనం కవితాసమితి సభ్యులలో పరస్పరం అనుమానాలకూ, ఆరోపణలకు తోడు పడింది. తమ అందరి ఒప్పందాన్ని తుంగలో దొక్కి కీర్తి ప్రలోభం కొద్దీ తన కవితలను చేర్చడానికి ముద్దుకృష్ణకు లొంగిపోయినట్లుగా నారాయణబాబు తదితరులూ శ్రీశ్రీ మీద దుమ్ము చల్లేందుకు అదే నాంది. పైగా ప్రతిభ విషయంలో శ్రీశ్రీతో సరితూగలేని వాళ్లు, వాంతి చేసుకునో, కడుపులో దాచుకునో తమ ఓర్వలేనితనం ప్రదర్శించుకుంటూనే వచ్చారు. శివ 'శంకల' శాస్త్రుర్లవంటి 'పీఠాధిపతులు' సైతం 'నారిబాబు' భుజం తట్టారు. విజయనగరం బృందం వెన్ను చరిచింది. కృష్ణశాస్త్రికి నారాయణబాబు తోడునీడ అయ్యాడో లేదోగాని ఛాయగ్రహం మాత్రం అయ్యాడు. శ్రీశ్రీని సాహిత్య ప్రపంచానికి 'దివ్యలోచనములు' తో పరిచయం చేసిన పురిపండా కూడా శ్రీశ్రీని అభిమానిస్తూ ప్రశంసించే సందర్భాలలో స్థూల దృష్టికి కనిపించని అసూయ (JEALOUSY కాకపోవచ్చు, ENVY యే కావచ్చు. మొదటిది చెడ్డది.) ను చూపెట్టాడనడం సత్యదూరం కాదంటే, ఇతరుల ఊసెత్తడంగానీ, ఈసును ప్రస్తావించడంగానీ పూర్తిగా అనవసరం. సాహితీసమితి సభాపతి శివశంకరశాస్త్రికీ, విశ్వనాథ సత్యనారాయణకూ మధ్య వచ్చిన విరోధం వల్ల విశ్వనాథ ఆ సంస్థ నుంచి నిష్క్రమించాడు. అలాంటి సంస్థల్లో తాను సభ్యుడు కావడమెందుకని శ్రీశ్రీ ఊరకుండిపోయాడు."

**– కె.వి. రమణారెడ్డి**

* * *

# రెంటాల

"నరసరావుపేటలో యువకులు నవ్యకళాపరిషత్తును స్థాపించుకొన్నారు. దానికి ఏల్చూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షుడు. అనిసెట్టి సుబ్బారావు కార్యదర్శి. బెల్లంకొండ రామదాసు (బెల్లంకొండ

రాఘవరావు గారి కుమారుడు), దండమూడి కేశవరావు (తరువాత సన్యాసాశ్రమం స్వీకరించి కేశవతీర్థస్వామి అయ్యారు), కుందుర్తి ఆంజనేయులు, దేవరకొండ బాలగంగాధర తిలక్, సి.వి. కృష్ణారావు, పోలూరి ఆంజనేయ ప్రసాద్, సముద్రాల రామానుజం (జూనియర్ సముద్రాల), దేశిరాజు కృష్ణశర్మ, గంగినేని వెంకటేశ్వరరావు మొదలైన వాళ్ళతోబాటు రెంటాల గోపాలకృష్ణ సాహితీ వ్యవసాయం చేసినవాడు. వీళ్ళంతా హైస్కూలులో నాయని సుబ్బారావుగారి స్టూడెంట్స్. యవ్వనంలో పులుపుల వెంకట శివయ్యగారి రహస్య కమ్యూనిస్టు పాఠాల బోధనల వల్ల ప్రభావితులు. మిగతావాళ్ళందరి కన్నా రెంటాలే అనిసెట్టి సుబ్బారావుకు అత్యంత సన్నిహితుడు. ఇద్దరి అభిరుచులూ ఒకటే. ఇద్దరిలోనూ స్పందనలూ, ప్రతిస్పందనలు రమారమి పరస్పర ప్రతిధ్వనులలాగ ఉండేవి. వారిద్దరిలో ఆవేశం వెయ్యి జలపాతాల పెట్టుగా ఉరుకుతూ ఉండేది.



రెంటాల

రెంటాలకు తాను రాసినవిగానీ, తెలుగు చేసినవిగానీ, అచ్చువేసినవిగానీ లెక్కపెట్టుకొనే తీరికా, కోరికా లేదు. ఒక రచన ముగించిన వెంటనే ఇంకొక రచన ప్రారంభించడమే అతని ఉద్దేశ్యం, ఉద్వేగం, ఉద్యోగం. పది పన్నెండు పేరుపడ్డ ప్రచురణ సంస్థలు (జయంతి, నవోదయ, విశాలాంధ్ర, ఆదర్శ, దేశికవితా, నవభారత్, క్వాలిటీ, నవసాహితి, నవరత్న వగైరా) అతని రచనల కోసం ఎగబడేవారు. అతని జీవిత కాలంలో అతని శతాధిక గ్రంథాలను (అక్షరాల నూటనలభై నాలుగు పుస్తకాలు) అచ్చు వేశారు. ఇది నిజంగా ఒక రికార్డు."

**– జె.వి. సుబ్బారావు.**

* * *

# సాహసం

"వెలుగులోనికి రాని మహనీయుడు గాజుల లక్ష్మీనర్సుసెట్టి – మద్రాసులో స్థిరపడిన ఆంధ్ర సంపన్న కుటుంబంలో 1806 లో జన్మించారు. 'నేటివ్ సర్క్యులేటర్' అనే పత్రికను కొని, దాని పేరు 'క్రెసెంట్'గా మార్చారు. హార్లే అనే ఆంగ్లేయుని ఎడిటర్‌గా నియమించి 1844 అక్టోబరు 2 నుంచి ఆ వారపత్రికను వెలువరించారు. మతమార్పిడులను, న్యాయస్థానాల్లో ఉన్న అక్రమాలను బట్టబయలు చేసేందుకు లక్ష్మీనర్సుసెట్టి సాహసించారు. ఆ విధంగా ఆయన మద్రాసులో స్వేచ్ఛాప్రియులకు నాయకత్వం వహించి 'మద్రాస్ నేటివ్ అసోసియేషన్'ను స్థాపించారు. మద్రాసు ప్రభుత్వం 'క్రెసెంట్' పత్రికకు ఎలాంటి సహకారాన్ని అందించేందుకు ఒప్పుకోలేదు. అయినా వెనుదీయక భారీ వ్యయాన్ని భరిస్తూ లక్ష్మీనర్సుసెట్టి 1864 వ సంవత్సరం వరకు క్రెసెంట్‌ను దిగ్విజయంగా నిర్వహించారు. తన తండ్రి కూడబెట్టిన సంపద సర్వం హరించి పోవడంతో క్రెసెంట్‌ను మూసివేయడం మినహా సెట్టిగారికి గత్యంతరం లేకపోయింది.

ఆయన 1868 లో మరణించారు. ఆ కాలంలోనే ఆయన చూపిన సాహసం క్రమంగా మద్రాసు పౌరులలో స్వేచ్ఛాకాంక్షను పెంచింది. నోరు మెదపడానికి సాహించలేని ఆ రోజుల్లో ఇంతటి సాహసం చేసిన గాజుల లక్ష్మీనర్సుసెట్టి తెలుగువాడు కావడం తెలుగువారి అదృష్టం."

**– జి.వి.వి. సత్యనారాయణ.**

* * *

# సాహిత్యగోష్ఠి

"సజ్జన సాంగత్యమూ, పండితులు ప్రాపూ, ఉత్తముల నిరంతర సంభాషణ శ్రవణమూ, సద్గ్రంథ పఠనమూ మొదలగువాని వలన రమణీయమైన వాగ్రచనా నైపుణిని పొందవచ్చు.

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కూడా ఆ మాటే అంటారు. "గ్రంథాలు చదివే నేను భాష నేర్చుకున్నాను. స్త్రీలను ఆశ్రయించిన్నీ నేర్చుకొన్నాను."

ఆయన అంటారు – "స్త్రీల భాషలో మాధుర్యమూ, హృదయాలను పట్టివేసే జాతీయత కనపడింది నాకు" అని. సౌకుమార్యము కూడా కోమలుల సంభాషణలోనే పుష్కలంగా దొరుకుతుంది అని అంటాను నేను.

స్త్రీల సంభాషణను గురించి చెబుతూ శాస్త్రిగారు అంటారు "ఇరుగుపొరుగు స్త్రీలు వచ్చి మా అమ్మగారితో గోష్ఠి జరిపేవారు. వారి దృష్టిలో అది కాలక్షేపం. కాని నా దృష్టిలో అది రసమహితమయిన సాహిత్యగోష్ఠి."

సౌకుమార్యము స్త్రీల సొమ్ము అని నేననగలను కాబట్టి ఈ రకమయిన వాగ్రచనా నైపుణి ప్రతి యువకుడు సంపాదిస్తే, వాక్ ప్రపంచం రమణీయము అవుతుందని నా నమ్మకం."

**– మునిమాణిక్యం నరసింహారావు**

* * *

# పంతులుగారు



కందుకూరి

"వీరేశలింగంగారు మొదటి నుంచీ జబ్బు మనిషి. బలహీనుడు. ఆహారం మొదలైన విషయాలలో జాగ్రత్తగా ఉండేవాడు. ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మగారు ఎంతో అనువొద్దిగా ఉపచారాలు చేసేది. 1910 లో ఆమె చనిపోయిన తరువాత పంతులుగారు మంగమ్మ అని ఒక అమ్మాయిని దగ్గరకి తీశారు. అన్నం, బట్టా ఇచ్చి, చదువు చెప్పించి కూతురులాగా చూచుకుండేవారు. తరువాత ఆ అమ్మాయికి పెండ్లి కూడా చేసి భార్యాభర్తలను తమతోనే

ఉంచుకున్నారు. ఏ ఊరు బోయినా వెంట తీసుకెళ్ళేవారు. స్వాదుగా, ఆరోగ్యంగా భోజనం కావాలి. పెద్దతనం గాబట్టి ఎక్కువ ఉపచారాన్ని ఆపేక్షించేవారు.

అప్పటికాయనకు 60 ఏళ్లపైన ఉంటాయి. ఆ ముసలివాడికీ, ఆ అమ్మాయికీ ముడిబెట్టి అపవాదులు కల్పించి ఆయనపైన వ్యంగ్యంగా ఏవేవో పత్రికల్లో రాశారు ఈ ఊళ్ళో టంగుటూరి శ్రీరాములు, నాళం కృష్ణారావు. పంతులుగారు స్పిరిట్ ఉన్న మనిషి, వాళ్ళపైన ఏవేవో మళ్ళీ రాశారు. పరస్పరం కోర్టుకెక్కారు. 'మాన నష్టం' దావాలో పంతులుగారి తరఫున నేనే వకీలును. వాళ్ళ తరఫున టంగుటూరి ప్రకాశం పంతులు. క్రింది కోర్టులో పంతులుగారే గెలిచారు. జిల్లా కోర్టులో కేసు ఉండగా – జడ్జి చాలా మంచివాడులెండి. "మీరంతా పెద్దలు, సంఘ సంస్కర్తలూ, ఆదర్శ పురుషులూ. ఇలా కొట్లాడుకోవడం మంచిదికాదని" నచ్చచెప్పాడు. రాజీ చేశారు. పరస్పరం కేసులు ఎత్తేసుకునేట్లు పంతులుగారిపై అపవాదు లేపినందుకు పశ్చాత్తాపం ప్రకటించేట్లూను. సరే అంటే సరే అనుకున్నారు.

ఇంతలో ఆ జడ్జీ బదిలీ అయి, కొత్తవాడు వచ్చాడు. జడ్జీ కుర్రవాడు. అదురుపిండం. పంతులుగారి కేసు కొట్టివేశాడు. తీర్పు ఎదిరివాళ్ళ పక్షం చెప్పాడు. వీరేశలింగం అంతటితో ఊరుకున్నా మానె, ఎక్కడలేని పట్టుదల. ఎందుకూరుకుంటాడు. హైకోర్టు కప్పీలు చేశాడు. కేసు హైకోర్టులో ఉండగానే చనిపోయాడు.

వృద్ధాప్యం, వ్యాధి, కోర్టులకు ఊరికే తిరగవలసిన మనఃక్లేశం, ఎదుట పార్టీ వాళ్ళకు పాఠం నేర్పాలనే పట్టుదలా – మనిషి కుంగిపోయాడు. చాలా కష్టపడ్డాడులెండి.

ఆయన స్నేహితులేనండి, స్నేహితులమని చెప్పుకుంటున్నవాళ్ళేనండి ఆయన్నింత కష్టపెట్టారు. అరవై ఏండ్లు దాటిన ముసలివాడికి అపవాదు అంటగట్టడానికి వెనుకాడలేదండి. (దోవతి చెంగుతో చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ) ఏం పట్టుదలండీ! ఎంత శరీర బాధ, మనస్సు బాధపడుతూనే, చేతబూనుకొన్న మహత్కార్యాలేమన్నా కట్టిపెట్టాడా యీ కేసుల రోజుల్లో. ఇంత కష్టపడుతూనే కవుల చరిత్ర పరిష్కరించి వ్రాశారు. చివరకు అచ్చుప్రూఫ్‌లు దిద్దుతూనే చనిపోయాడు."

**– కనుమర్తి శ్రీరాములు**

(వీరేశలింగం పంతులుగారి వర్ధంతి జరప తలపెట్టి రాజమండ్రి వెళ్లిన పులుపుల వెంకట శివయ్యగారితో జరిగిన సంభాషణ)

* * *

# స్వతంత్రం వచ్చినా...

"నాకు అనిపిస్తుంది అప్పుడప్పుడు ఈ చాకిరీ చేస్తూ ఇట్లా ఆలోచనలు చేస్తే త్వరగా చచ్చిపోతానని. కానీ హోటల్ చాకిరీకి తగినంత ఫలితమూ దక్కదు. పోనీ ఈ కథలు వ్రాయటం



శారద

మానేద్దామా అనుకుంటాను. అదీ సాధ్యం కావటం లేదు. తెలుగు మాతృభాష కాకపోవడం వల్ల ఎంతో చదివితేగాని, రచనా వ్యాసంగం సవ్యంగా సాగదు. అట్లా చదివేందుకు పుస్తకాలు కొనే ఓపిక లేదు. ఏ పుణ్యాత్ముడన్నా ఇస్తాడనుకుందాం. తీరిక గుర్రం కొమ్ములుగా ఉంది. ఇటీవల హోటల్ పనివాళ్ళకి తెనాలిలో ఎనిమిది గంటల పని వచ్చిందన్నారు. ఏ దారిన వచ్చినదో తెలియదు గానీ, నాతో సహా నూటికి తొంభై అయిదు మందిమీ పది పన్నెండు గంటల ఎద్దుచాకిరీ చేస్తూనే వున్నాం. ఈ లక్షణంలో చదువెక్కడ, రాత ఎక్కడ ? ప్రభుత్వం శాసనాలు చెయ్యడం కనిపిస్తుందిగానీ, అవి అమలు జరగటం కనిపించదు. పేరుకు లేబర్ ఆఫీసూ ఉంది. ఓ లేబర్ ఆఫీసరూ ఉన్నాడు.


హోటల్ సర్వరుకి చదువెందుకూ అనే పెద్దమనుషులు చాలామంది ఎదురుపడ్డారు. సరైన గుడ్డలు నేను పుట్టిన తరువాత తొడిగి ఎరుగను. ఈ హోటల్ పనికి గ్యారంటీ ఏమీ లేదు. ఇప్పటికి పాతికసార్లకిపైగా ఈ ఉద్యోగం ఊడిపోవడం, రోజుల తరబడి పస్తులుండటం జరిగింది. ఇకముందు కూడా నా జీవితం ఇలా ఉండబోతుందనడంలో సంశయమే లేనప్పుడు మిగిలి ఉన్న జీవితకాలం ఎలా గడవబోతుందా అని తగని భయమేస్తోంది. స్వతంత్రం వచ్చాక ఇట్లా ఉండదనుకున్నాను. కనీసం ఈ జీవిత ప్రయాణం వెనకటికన్నా నూటికి ఇరవై పాళ్ళన్నా పెరుగుతుందనుకున్నాను.

పత్రికలవారు కథలు వ్రాస్తే ఇచ్చే డబ్బులు నా మూర్ఛల రోగాన్ని నయం చేసుకోడానికన్నా సరిపోతయ్యేమో అని సంతోషించాను. అది వట్టిదై పోయింది. ఈ పద్ధతిలో నేను స్వతంత్ర భారత పౌరుణ్ణని భావించలేకపోవడంలో తప్పేమీ లేదనుకుంటాను."

**– ఎస్. నటరాజన్.** (సాహిత్య బాటసారి 'శారద' 18-2-1949)

*　　　*　　　*

## ఆదరణ



నేదునూరి

"నేను పాఠశాలలో చదువుకొను కాలమున పితామహుడగు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు నన్ను నా తెలుగు పలుకుల తెరవెంచి అంచిత కరుణార్ద్ర దృష్టితో ఆశీర్వదించి "ఆంధ్ర కవుల చరిత్ర, శ్రీ రాజశేఖర చరిత్రము" నాకు బహూకరించిరి. శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారు నా ఉపాధ్యాయ తరిఫీజు తరుణమున శ్రీ కందుకూరి వారి కరుణబడసిన వాడనని తెలిసికొని బహు ప్రీతితో నాకు కవితా సతికవసరమగు అందచందములు నేర్పి ఆనాటి

నుండి వారి యంత్యము వరకు ఆదరణతో జూస్తూ తనుగన్న సంతానము వలె గాంచి నన్నింత వానిని జేసిరి.

జానపద వాఙ్మయ సేకరణ సంచారిగా మద్రాసు మా గురు దర్శనార్థమై నేను వెళ్ళినప్పుడు ఆంధ్ర విశారదులగు శ్రీ తాపీధర్మారావుగారూ, శ్రీ గూడవల్లి రామబ్రహ్మముగారు, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగార్ల పరిచయము కలిగినది. మద్గురువర్యులు అముద్రిత వాఙ్మయ సేకరణ నేను చేయుచున్నానని పై ముగ్గురకు తెలియజేయగా అందు శ్రీ తాపీవారు వేమన వేదసారమును కూర్పమనియూ, కూర్చునపుడు మా యింట నిరాఘాటంగా కుడువ వచ్చుననీయ శ్రీ గూడవల్లి వారు, అట్లయిన మా ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములో నున్న బ్రౌనుదొర వారి సేకరణ వాఙ్మయము నిచ్చెదననియూ శ్రీ వేటూరివారూ బాసలు గావించిరి. ఈ మహామహుల దయ చేతను, నేను తెలుగునేల నాలుగు చెరగుల తిరిగి ప్రోవు చేసి అకారాదిగా ఐదువేల వేమన పద్యాలు కూర్చితిని. యీ నా సంకలన సవిత్రి అనాదరణ అంధకారాడవిలో చిక్కుకొని యుండ 'వాఙ్మయ మహాధ్యక్ష శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు' విని గని విచారించి శ్రీ అద్దేపల్లి దంపతుల ఆదరణ కాంతిని గల్పించారు".

**– నేదునూరి గంగాధరం**

* * *

# తాజ్‌మహల్

"ఆల్డస్ హక్సులే' ఓ పుస్తకంలో తాజ్‌మహల్ శిల్పం చాలా తక్కువ రకం. ఆ మందిరానికి అంత ఖ్యాతి రావడం ఏమీ అర్థం లేని సంగతి అని రాశారు. నేను తాజ్‌మహల్‌ను చూడనూ లేదు. నాకు శిల్పం సంగతి ఏమి తెలీనూ తెలీదు. కాని 'ఎంత సాహసం' ? అనిపించింది. కాని అతను శిల్పపరంగా చాలా కారణాలు చూపించి వాదించాడు. అవి నిజమైనా తాజ్‌మహల్‌కి, శిల్పాన్ని మించిన సౌందర్యపు విలువ వుండవచ్చు. ఠాగూర్ తాజ్‌మహల్‌ని 'కాలం చెక్కిలి మీద ఘనీభవించిన కన్నీటి చుక్క' అని పాడారు చాలా అందంగా, గొప్పగా. కాని శరత్‌చంద్ర కథానాయకి కమల తాజ్‌మహల్ మీది సెన్టిమెంటునంతా, రెండు మాటలతో కొట్టేసింది. "తాజ్‌మహల్ మూలంగా పాపం అనేక భార్యావ్రతుడు షాజహాన్ పాదుషాని ఏకపత్నీ వ్రతుణ్ణి చేస్తారు. అతని విలాసం కోసం అతనో మందిరం నిర్మించాడు. అంతేకాని ఏదో శాశ్వత ప్రేమ ఫలితం అనడమెందుకు ?" అని. అట్లానే వాల్మీకి రామాయణం ప్రమాణంగా శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు కాదని పండిత తారానాథ్‌గారు వాదిస్తే ఎదురు చెప్పేందుకేం లేక గొప్ప పండితులందరూ తిట్టుకుంటోపోయేవారు. సెన్టిమెంట్‌ని తప్ప 'రీజనింగ్'ని ఎదుర్కొని వాదించగలం, ఎక్కిరించగలం. కాని ఒక అనుభవాన్ని ఏం చేసీ మనం తీసెయ్యలేము."

**– చలం**

* * *

# అంకితం

మహాకవి శ్రీశ్రీ, మహాప్రస్థానాన్ని కొంపెల్ల జనార్ధనరావుకి అంకితం చేస్తూ వచన కవితా రచనలో, మూర్తీభవించిన ఆగ్రహంలో "దొంగలంజకొడుకు లసలే మెసలే ఈ ధూర్తలోకంలో నిలబడజాలక తలవంచుకునే వెళ్ళిపోయావా, నేస్తం" అని అన్నాడు.

*　　　*　　　*

# గద్దె లింగయ్య



గద్దె లింగయ్య

"ఈ రచనా శిల్పంలోని అద్భుతమైన ఆనందం వెయ్యి విస్కీల పెట్టు. నిజానికి కాగితం మీద పెట్టలేని లక్ష ఆవేశాలు నాలో వున్నాయి. వాటికి వాక్య నిర్మాణం కుదరదు. అందుకే అందీ అందని వాక్యాలంటే నాకంత మోజు. ఒకప్పుడిదే వాక్యం అద్భుతమైన ఆకారం దాల్చి.... దేవకన్యలా నిలబడుతుంది. జీవితంలా భయపెడుతుంది. చిత్రంలా – కాలంలా --- కాలసర్పంలా – అగ్నిలా – ఈ సర్వసృష్టినీ తనలో పొదుపుకుని ఈశ్వరుడి పాదయుగళంలో నా హృదయపీఠాన్ని అలకరిస్తుంది. ఈ సరస్వతీ విన్యాసమే లేకపోతే నా జీవితం ఉత్త సారరహితం.

మొట్టమొదట 'గాలిపడగలూ – నీటి బుడగలూ', వ్రాసిన తరువాత ఆదర్శ గ్రంథమండలి అధినేత శ్రీ గద్దె లింగయ్యగారు – నీలినీడలు, మిగిలిందేమిటి, జీవన స్రవంతి, ఎడారిపువ్వులు, రాగజలధి ప్రచురించారు. ఆయన తరచు నా కావ్య నిర్మాణాన్ని మెచ్చుకుంటూ వుండేవారు.... కాని ఇంకా నాకా వాక్యం కుదిరిరాలేదు పూర్తిగా.

లింగయ్యగారి మాట కటువుగా వున్నా మనసు మెత్తగా వుండేది. రచయితల్లో చాలామందికి లింగయ్యగారంటే దురభిప్రాయం, సదభిప్రాయం వుండేది. ఆయన గౌరవించడని దురభిప్రాయం – డబ్బు సరిగ్గా ఇస్తారని సదభిప్రాయమూను. ఏది ఏమయినా ఆయన నెల్లూరు హోటలు గదిలో చనిపోవడానికి నాలుగురోజుల ముందర కనిపించి పలకరించినప్పుడు అదే చివరి చూపని నేను అనుకోలేదు."

**– తెన్నేటి హేమలత** (లత)

*　　　*　　　*

# కోగంటి

"అది 1943 వ సంవత్సరం. బొంబాయిలో భారత ప్రజానాట్యమండలి ప్రథమ మహాసభ జరిగింది. ఆ సందర్భంలో ఆంధ్ర ప్రజానాట్యమండలి దళంతోపాటు అన్ని రాష్ట్ర దళాలు ప్రదర్శనలిచ్చాయి. ఆ ప్రదర్శనలో ఆంధ్రదళం తెలుగు జాతీయ జానపద కళారూపాలను

ప్రదర్శించి ప్రథమ బహుమతి అందుకుంది. ఆంధ్రదళం ప్రదర్శనల్ని తిలకించిన పృధ్వీరాజ్‌కపూర్, కె. ఎ. అబ్బాస్, హరీంద్రనాద్ ఛటోపాధ్యాయ, బలరాజ్‌సహానీ, రవిశంకర్, ఎస్.ఎ. డాంగే, పి.సి. జోషి తదితర ప్రసిద్ధ కళావేత్తలనూ, రాజకీయ నాయకులను తన కోయవేష ప్రతిభతో ఆశ్చర్యచకితుల్ని చేశాడొక యువకుడు. ఆయనే కోగంటి గోపాలకృష్ణయ్యగారు. ఆయన ముచ్చటైన కోయవేషంతో కోయభాషలో నాటి రాజకీయాలు చెప్పి దేశభక్తిని పురికొల్పాడు. ఆ భాషలో, ఆ యాసలో యుద్ధ భీభత్సాన్ని కళ్లముందుంచాడు.



కోగంటి

నాడు ఆయన చూపిన ప్రతిభకు ముగ్ధులైన పై ప్రముఖులందరూ ఎంతగానో ప్రశంసించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా, బాంబే క్రానికల్, బ్లిట్జ్, పీపుల్స్‌వార్ మొదలైన పత్రికలు ఆయన చిత్రాలను ప్రముఖంగా వేశాయి.

ప్రజానాట్యమండలి నిర్మాతల్లో ప్రముఖుడు జానపద కళాస్రష్ట. కవీ, ప్రయోక్త, నటుడు, గాయకుడు అయిన కోగంటి గోపాలకృష్ణయ్యగారిని అందరూ ఆప్యాయతతో 'కోగంటి' అని పిలవడం పరిపాటి. ఆయన కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా బొమ్ములూరులో జన్మించారు. తండ్రి అచ్యుతరామయ్య, తల్లి వెంకమ్మ."

**– మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి**

❋ ❋ ❋

# వృత్తిపుస్తకాలు

"గ్రంథాలయంలో వట్టి పుస్తకాలను పెట్టడం మాత్రమే కాదు – పురాణాలు చెప్పించడం, ప్రత్యేక సంచికలు ప్రచురించడం, ఉత్సవాలు, పండుగలు చేయడంతో సరికాదు. గ్రంథాలు ఎక్కువ ఉత్పత్తి కావలెనంటే చాలా జాగ్రత్తగా మనము పని చేసుకోవాలి. విజ్ఞానము ప్రజలందరికీ వ్యాపింపజేయవలసి యున్నది. దీనికి వయోజన విద్య ప్రథమ సోపానము. అనగా అక్షరాస్యత. అక్షరం నేర్చుకొననిదే ఒక్క అడుగుకూడా ముందు పెట్టుటకు వీలులేదు. ఏ వృత్తికి చెందిన వారైనప్పటికీ సరస్వతిని ఆరాధించడానికి ఏమీ ఆటంకాలు లేవు. ఇంగ్లీషులో వేలకొలది పుస్తకాలు – తట్టలు బుట్టలు అల్లికకు సంబంధించిన చేతి పనులకు కూడా పుస్తకాలున్నాయి. మనలో ఉద్యోగాలు చేసేవారు చాలామంది ఉన్నారు. పారిశ్రామిక శాఖకు అధ్యక్షులు, శ్రామికులు, గొల్ల, మంగలి శాఖలకు పోర్టుపోలియోలు చాలా ఉన్నవి. వారందరికీ తమ శాఖలకు సంబంధించిన విషయాలే తెలియవు. చదువుకొన్నవారు ఈ వృత్తులకు సంబంధించిన పుస్తకాలు వ్రాయాలి. మనదేశంలో సుమారు ఇరవై ఆరు కోట్ల మంది వ్యవసాయ వృత్తిలో ఉన్నారు. (ఆనాటి మాట) ఈ వ్యవసాయాన్ని వృద్ధి చేయడానికి పుస్తకాలు కావాలి. శ్రీ గోటేటి జోగిరాజగారు వ్రాసిన వ్యవసాయ గ్రంథాలు ఇరవైకిపైగా ఉన్నాయి."

**– గాడిచర్ల హరిసర్వోత్తమరావు**

❋ ❋ ❋

# జి.వి.కె.



జి.వి. కృష్ణారావు

"గవిని వెంకట కృష్ణారావు (జి.వి. కృష్ణారావు) డిగ్రీ పాసై, మహాపండితులు పళ్లె పూర్ణ ప్రజ్ఞాచార్యులు (గుంటూరు) వారి వద్ద సంస్కృతం నేర్చుకున్నారు. ఆనాటి చాలామంది విద్యావంతులులాగే కృష్ణారావుగారికి నిరుద్యోగ సమస్య ఎదురైంది. అప్పటి నిరాశా నిస్పృహలలో – మహావిజ్ఞాని వ్యాసమహర్షికి కాశీపట్టణంలో ఏడు రోజుల నుండి భిక్ష దొరకడం లేదు. భిక్ష దొరకని వ్యాసుడు శాపజలాన్ని అందుకుని చలితాధారుడై కంపిత స్వరంతో 'మా భూత్రైపూరిషి విద్యా, మా భూత్రైపూరుషకుధానమ్, మా భూత్రైపూరుషీ భక్తిః' అని శపించబోతున్న మూర్తి ఆ మసక కన్నులముందు నిలువెత్తున నిలబడింది. రెండురోజులు అదే మూర్తి కన్ను తెరిచినా, కన్ను మూసినా ఆ సాక్షాత్కారమే 'భిక్షాపాత్ర' నాటిక. మార్క్సిస్టు దృక్పథంలో రాసిన ఈ నాటికను 1953 లో ఆంధ్ర విశ్వవిద్యాలయ రంగస్థలి మీద, ప్రయోక్త కూర్మా వేణుగోపాలస్వామి (అప్పటి రిజిస్ట్రారు) నేతృత్వంలో ప్రదర్శితమైంది. అయిదు వేలమంది దానిని తిలకించారు. ఆ తరువాత ఆకాశవాణి పదిహేను భారతీయ భాషలలోకి అనువదించి ప్రసారం చేసింది.

తరువాత జి.వి. కృష్ణారావుగారు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ., ఇంగ్లీషు లిటరేచర్‌లో చేరారు. ఎం.ఎ., చదువుతున్న రోజుల్లోనే 'కావ్య జగత్తు' సాహిత్య విమర్శనా గ్రంథం రచించారు. దేశకాల పరిస్థితుల్ని అనుసరించి కావ్యాల్లో వస్తువు రూపం ఎలా మార్పు చెందుతుందో ఇందులో మార్క్సిస్టు దృక్పథంతో వివరించారు. ఇది చాలా ప్రసిద్ధమై విశ్వవిద్యాలయాల్లో తెలుగు ఎం.ఎ., చదివేవారికి పాఠ్యపుస్తకమైంది. కాని పరిస్థితులు అనుకూలించక ఎం.ఎ., పూర్తి చేయకుండానే ఇంటిముఖం పట్టారు కృష్ణారావుగారు. తరువాత జర్నలిజంలోకి అడుగుపెట్టారు."

**– పరుచూరి శ్రీనివాసరావు**

* * *

# ప్రజ్ఞ

"కన్యాశుల్కం చదివినప్పుడల్లా ఎంత ఆనందం కలుగుతోందో ఆ అసంపూర్ణ బిల్హణీయం జ్ఞాపకం వచ్చి వెంటనే నాకంత దుఃఖము కలుగుతూ ఉంటుంది. ఒక్క బిల్హణీయం చాలు, అప్పారావు గారెంతటి మహాకవో తెలుసుకోవాలంటే. అయితే, వారెంతటి మహాకవి అంటే, ఆ బిల్హణీయం మరెవరూ పూర్తి చేయలేనంతటి – దాని కథాక్రమమే యెవరూ గుర్తించలేనంతటి – మహాకవి."

**– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి**

* * *

# పెద్దమనుషులు



బంగోరె

"పురాణం సుబ్రహ్మణ్య శర్మకు –

బంగోరె (బండి గోపాలరెడ్డి) మరణానికి దారితీసిన పరిస్థితుల పూర్వరంగంలో మీ హస్తమూ వుందని మీ వాక్యాలబట్టి ఊహించుకోగలుగుతున్నాను. వేమనకంటే ముందు, బ్రౌన్ గురించి రీసెర్చి చేసే రోజుల్లో (S.V. UNIVERSITY) అతను పాతకాలపు పాండిత్యం డొల్లతనాన్నీ గ్రంథచౌర్యాన్నీ నిరసిస్తూ పరుషంగానే రాసినందుకు నిజంగానే బాధితులు కొందరు, బ్రాహ్మణ కులాభిమానం ముదిరిన వాళ్ళు మరికొందరూ తెలుగు ప్రొఫెసర్ జి.ఎన్. రెడ్డికీ, వి.సి.కీ (కొత్త సచ్చిదానందమూర్తి) ఉత్తరాల మీద ఉత్తరాలు కుప్పించి, ఆ పని నుంచి అతన్ని తప్పించడంలో కృతార్థులయ్యారు. అది కుట్ర. మళ్లీ మేఘన మీద పని చేస్తూ వచ్చిన కాలంలో అధికార దర్పంతో వ్యవహరించసాగిన ENDOWMENTS COMMISSION కుమారస్వామి రెడ్డికీ, అప్పటికి గూడా కులోన్మాదం లేని బంగోరెకి మధ్య సరిపడకుండా వచ్చింది. అలా 'నువ్వా ? – నేనా ?' అన్నంతగా వెళ్ళింది. 'నీచపు దాస్యవృత్తి'ని సహించని 'స్వైర్య విహారధీరుడు' బంగోరె. మీ జాబు సదరు హోమాగ్ని గుండంలో మరో సమిధగా ఉపకరించి ఉంటుంది. అంచేత ఈ మహోపకారాన్ని ధృవీకరించే మీ ఉత్తరానికి 'చారిత్రక ప్రాముఖ్యం' వుంది. (మీ దస్తూరీలోనే గనుక దాన్ని భద్రపరుస్తున్నాను. ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి ?) మీ రచన బాగులేదని నేనంటాననుకోండి, నా రచనను మీరు తిప్పి కొడతారనుకోండి, నా రచనను మీరు తిప్పికొడితే నేను మిమ్మల్ని దూషిస్తూ రాశాననుకోండి. అది నాకూ మీకూ మధ్య గల కేవలం వ్యక్తిగల సంబంధం అయినప్పుడు, ఆ ఉద్యోగం నుండి మిమ్మల్ని తొలగించమని మీ యజమానికి నేను రాయడం సబబేనా ? ఇది నేరచర్య కాదూ ? ఆలోచించండి. 'ఒరులేయని యొనరించిన నరవర తన కప్రియలంబులగు నవి తానొరుల కొనరింపకునికి పరాయణము' అని ధర్మాన్ని నిర్వచించి వల్లించే మనలాంటి పెద్దమనుషులు యింతలేసి చిన్న చిన్న అడ్డమైన నానా అకార్యాలకు పూనుకోవడం ఏం న్యాయం ?

'మరణాంతాని వైరాణి' అనేదేనా మన విధానం ? ఆ మరణాంతవైరం ఆలోచనా సీమనే అతిక్రమించి మనస్సులను వికృతం చేస్తే మనిషి పశువు కాదూ, మానవ సంబంధాలు రాక్షస కక్షలు కావూ ? ఇంత జరిగినా మరెంత జరిగినా నాకలాంటి వైఖరి చచ్చినా అలవడదు. మరొకరికి అలవడిందని వినటానికి కూడా నా మనస్సు ఒప్పదు. అందుకే మీ పట్ల నాకు ద్వేషం, బద్ధవిరోధం వుండవు. LET US DIFFER BUT AGREE TO DIFFER HONESTLY AND COURAGEOUSLY. ముసుగులో గుద్దులాటగాని, కక్షలు సాధించే కుత్సిత బుద్ధితో ఘోరకృత్యాలు గానీ మన దరిదాపులకే రాగూడదు.

ధర్మోపదేశం చేస్తున్నానా ? లేదు, మిత్రధర్మం నా దృష్టిలో ఎలాంటిదో నివేదించుకుంటున్నాను."

**– కె.వి. రమణారెడ్డి.** (1-3-1985. కావలి)

(బంగోరె భాక్రా నంగల్ డామ్ వద్ద నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు)

❋ ❋ ❋


# నిజాయితీ గల రచయిత

"మన ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూరాజేంద్రప్రసాద్ తన గ్రంథాలలో ఎక్కువగా గాంధేయవాదాన్ని విశ్లేషించారు. నిజాయితీ గల రచయిత, హిందీ, ఇంగ్లీషు భాషలలో నిష్ణాతుడు. చంపారన్ సత్యాగ్రహ చరిత్ర, స్వీయచరిత్ర, విభక్త భారతము అనేవి ఆయన రచనలలో బాగా ప్రచారమయినవి. 'మహాత్ముని పాద సన్నిధిలో' అనే మరో రచనలో గాంధీజీతో ఆయనకు గల సాన్నిహిత్యం, గాంధీజీ అహింసావాదాన్ని చక్కగా నిరూపణ చేశారు. 'విభక్త భారతము' పాకిస్తాన్ అవతరణవాదమును ఖండించే రచన. హిందూ, మహమ్మదీయ సమస్యలను ఎంతో చక్కగా ఎత్తిచూపిన మొట్టమొదటి ఉత్తమ రచన. రాజేంద్రబాబు 'స్వీయచరిత్ర' ఆయన పుట్టినది మొదలు 1946 వరకు భారతదేశంలో జరిగిన వివిధ మత, రాజకీయ, సాంఘిక సంఘటనలు, వాటితో రాజేంద్రబాబుకు గల సంబంధమును కళ్లకు కట్టినట్లు చిత్రించారు. గాంధీపదము నుండి ఆయన తప్పటడుగు వేయలేదు. ఆయన అన్నింటియందును ప్రథముడు."

**– మువ్వల స్నేహ**

❋ ❋ ❋

# ప్రేమ్‌చంద్



ప్రేమ్‌చంద్

"ప్రేమ్‌చంద్ అసలు పేరు నవాబ్‌రాయ్ లేక ధనపతిరాయ్. ఆయన రచించిన 'సోజేవతన్' అనే పుస్తకాన్ని ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం నిషేధించి, కాపీలన్నింటినీ తగులబెట్టింది. అందుచేత 1910 నుంచి 'ప్రేమ్‌చంద్' అనే కలం పేరుతో రచనలు కొనసాగించారు. 'శివరాణీదేవి' అనే వితంతు బాలికను వివాహం చేసుకున్న గొప్ప సంస్కర్త ప్రేమ్‌చంద్. 1921 లో గాంధీజీ పిలుపునందుకుని ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రజలలో దేశభక్తిని, జాతీయభావాలను ప్రేరేపించేవారు. 'మర్యాదా' అనే పత్రిక సంపాదకులు సంపూర్ణానంద్‌గారు జాతీయోద్యమంలో జైలుకు వెళ్ళగా, కొంతకాలం ఆ పత్రిక సంపాదకులుగా పని చేశారు. ఆ తరువాత కొంతకాలం కాశీవిద్యాపీఠంలో ఒక స్కూలుకు ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు.

ఉద్యోగరీత్యా గ్రామ గ్రామాలు, పల్లెపల్లెలు తిరుగుతూ ప్రజల జీవితాలను తరచి అనేక నవలలు, కథలు, వ్యాసాలు రచించారు. ఆయన రచనలలోని పాత్రలన్నీ సజీవమైన సామాన్య ప్రజల పాత్రలే. ఎవరైనా మిమ్మల్ని గురించి ఏమీ వ్రాసుకోరా అని అడిగితే' "ఒకరికి వినిపించదగిన విశేషం నాలో ఏమి ఉంది ? దేశంలోని కోట్లాది ప్రజలు జీవిస్తున్నట్లే జీవిస్తున్నవాణ్ణి, సామాన్యుణ్ణి. నా జీవితం కూడా సామాన్యమైనది. కుటుంబ బాధలను అనుభవిస్తున్న ఒక బీద బడిపంతుల్ని. బాధల నుంచి విముక్తి కలుగుతుందేమోననే ఆశతో జీవితమంతా కాలం అరగదీసుకుంటూ ఉన్నవాణ్ణి. కాని బాధల నుంచి విముక్తుణ్ణి కాలేకపోయాను" అనేవారు.

ప్రేమ్‌చంద్ రచనలు అన్ని భారతీయ భాషలలోనే గాక, రష్యన్, చైనీస్ మరియు ఎన్నో విదేశ భాషలలోకి అనువదించబడి ప్రచురించబడ్డాయి."

**– పి. లలితాజోషి.**

❋ ❋ ❋

## గ్రంథమాలలు


"విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి అనేక ఇతర గ్రంథమాలల అవతరణకు కారణభూతమైంది. గోలకొండ, కిన్నెర, దివ్యవాణి, సుకృతి, ప్రసాదము, మాతృభారతి, ఆంధ్రశ్రీ, కాకతీయ, పూలతోట, వీరేశలింగ కవికంఠాభరణ, కృషిప్రచారిణి, శివధర్మ, విజ్ఞాన ప్రచారిణి, వెంకటేశ్వర కావ్యమాల గ్రంథమాలలను పేర్కొనవలసినది. అణా, దేశోద్ధారక, ఆంధ్రకేసరి గ్రంథమాలలు కొద్ది వెలలో ప్రజలకు అవసరమైన విజ్ఞానం అందించడానికి ఉత్తమ వచన గ్రంథాలను ప్రచురించాయి. సాధన సమితి ఆంగ్ల విద్యాభూషితులయిన యువకులు స్థాపించిన సంస్థ. ఇందులో కథకులు అధిక సంఖ్యాకులు. ఈ సమితి తెలంగాణా రచయితల ఖండ కావ్యములను, కథానికలను విరివిగా ప్రకటించి ప్రశంసనీయముగా భాషా సేవ చేసింది. యువకులు నిర్వహించిన మరొక సంస్థ సాహితీ మేఖల ఆశయం కవితా రచన, కావ్య ప్రచారము. ఇందులో కవులు ఎక్కువమంది. నూతన భావాలతోపాటు ఈ కవులు ప్రబంధముల పక్వతతో కూడిన శైలిని అలవరచుకున్నారు. ఈ దశాబ్దములోనే అవతరించిన ఆంధ్ర చంద్రికా గ్రంథమాల, విజ్ఞానవర్ధనీ పరిషత్తులు సరిగ్గా విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ఆశయాలతోనే కృషి చేస్తూ మంచి మంచి గ్రంథాలను ప్రకటించాయి."

**– దేవులపల్లి రామానుజరావు.**

❋ ❋ ❋

## ఎ.జి.కె.

"రచయితగా, రాజకీయ వ్యాఖ్యాతగా హేతుబద్ధ పరిశీలకుడుగా ఆవుల గోపాలకృష్ణమూర్తి గారి ప్రత్యేకతను గుర్తించని ఆధునిక తెలుగు పత్రిక లేదు. బాధ్యత గల పత్రికా సంపాదకుల్లో



ఎ.జి.కె.

విశేషానుభవం గల వ్యక్తిగా నేనొక్క విషయం ఘంటాపథంగా చెప్పగలను. ఎ.జి.కె. వ్యాఖ్యలు సమకాలికుల్లో ఎక్కువమందికి నచ్చనిమాట నిజమేగాని భావితరాలవారు వేనోళ్ళ పొగిడే సహేతుక మార్గదర్శకాలు. ఆయన అమెరికా ప్రభుత్వ ఆహ్వానం మీద ఆ దేశానికి వెళుతూ చేసిన హేతుబద్ధ విమర్శలు ఛాందసులైన హిందూమత 'వీరుల' కోపాగ్నికి తావలమై ఆయన మళ్ళీ అమెరికా నుంచి తిరిగి వచ్చే వరకూ చల్లారలేదంటే ఎ.జి.కె. విశిష్ట వ్యక్తిత్వానికి, సార్ధక జీవితానికి వేరే తార్కాణం అక్కరలేదు. ఈ సత్యాన్నే గోపీచంద్‌గారు "పరస్పర విరుద్ధ చర్చలకు గురియైన అంశం. విశేషం, వాదనలే ఒక వ్యక్తి విశిష్ట వ్యక్తిత్వం గల వాడని అతడు చావలేదనీ, అతని చేవ చావలేదనీ నిరూపిస్తాయి" అనేవారు.

**– పోలవరపు శ్రీహరిరావు**

❋ ❋ ❋

గిడుగు రామమూర్తి పంతులుగారితో వ్యవహారిక భాషను గురించి శ్రీపాదగారు తలపడి హోరాహోరీగా పోరాడారు.

ఒక కంపోజిటరు వచ్చి శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారిని 'అరసున్నాలు ఎక్కడెక్కడ వుంచమన్నారండి అయ్యా' అని అడిగాడట. 'నాకు మటుకు తెలుసా, అక్కడక్కడుంచు' అన్నారట ఆయన. వ్యవహార రచనకు ఆ ఇబ్బంది లేదుకదా!

❋ ❋ ❋

తెలుగులో మొట్టమొదటి నవల (స్వంత రచన) నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి 'శ్రీరంగరాజు చరిత్ర' (1872) అచ్చయినది.

❋ ❋ ❋

తెలుగులో మొట్టమొదటి నవలా రచయిత్రి జయంతి సూరమ్మ. రచన 'సుదక్షిణా చరిత్రము.'

❋ ❋ ❋

# చక్కటి రచన

"బందరులో అయ్యంకి వెంకటరమణయ్యగారు 'ఆంధ్రభారతి' పత్రికను ప్రారంభించబోతూ గురజాడ అప్పారావుగారికి వ్యాసాల కోసం జాబు వ్రాయగా, తను వ్రాసేవి వ్యవహారిక భాషలో ఉంటాయి. అని ఆయన బదులు వ్రాయగా, దాని విషయమై అయ్యంకి

వారు ముట్నూరి కృష్ణారావుగారితో ముచ్చటించారు. కృష్ణారావుగారు చక్కటి రచనను ఎట్టి భాషలో వ్రాస్తేనేమి ? కాబట్టి అటువంటి అభ్యంతరాన్ని పెట్టుకోవద్దని సలహా యిచ్చారు. అప్పారావుగారిని కోరగా, ఆయన 'దిద్దుబాటు' అనే కథను పంపారు. ఆ తరువాత కొన్ని గేయరచనలు కూడా పంపారు."

❋ ❋ ❋

# గురజాడ

గుత్తునా యని జాతి ముత్యాల్
గుచ్చినాడే మేలి సరముల
ఇత్తునా యని తెలుగు తల్లికి
ఇచ్చినాడే భక్తితో

**– దేవులపల్లి కృష్ణశాస్త్రి**

❋ ❋ ❋

"నువ్వు పంపిన పుస్తకం అందినది. కళ్ళకద్దుకున్నాను. ముద్దు పెట్టుకున్నాను. మీ నాన్నను చూసినట్టయింది – నేనూ, వాడూ కలుసుకుని ఎన్నాళ్ళయిందో".

**– గిడుగు,** (గురజాడ కావ్య సంపుటి పంపిన రామదాసుతో)

❋ ❋ ❋

"మన దేశంలో ముందు ఏది ప్రచారంలోకి వస్తే అదే ప్రశస్తం అని ప్రజల విశ్వాసం. మొదట నమ్మకానికి విరుద్ధంగా న్యాయమైన సంగతులు విద్వాంసులు వివరించి చూపినప్పటికి, అంగీకారం కాదు. పైగా అటువంటి విద్వాంసుణ్ణి బహువిధాల దూషిస్తారు. మతానికి, ధర్మానికి, వాఙ్మయానికి అనర్థం వచ్చినట్లు ఆందోళన చేస్తారు.. సక్రమమైన విమర్శ లేకుండా వేళ్లు పాతుకుపోయిన వెర్రి భావాలను పెకలించడం మహాకష్టం."

**– పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి**

(మహాభారత చారిత్రక విమర్శకాగ్రగణ్యులు)

❋ ❋ ❋

# భాగ్యం

"తోకచుక్క విచ్ఛిత్తికి సూచకం. వేగుచుక్క మహోదయానికి సూచకం. నిజమే కాని ఈ తోకచుక్క ఏమిటి ? ఇది చేసిన వినాశం ఏమిటీ ? ఈ వేగుచుక్క ఏమిటి ? దీని తరువాత జరిగిన మహోదయం ఏమిటి ? అంటే – వశ్యవాక్కులు శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు

గిడుగు రామమూర్తి పంతులుగారే తోకచుక్క అనీ, గురజాడ అప్పారావుగారే వేగుచుక్క అనీ వ్యాఖ్యానం చేశారు.

రామమూర్తి పంతులుగారు చేసింది కృతకభాషా విధ్వంసనమేగా ? అప్పారావుగారు చేసింది కవికుమారుల కళ్ళకు వెలుగు కలిగించడమేగా ?

అంచేతనే మిత్రులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రులవారు, అప్పారావుగారిని "గురజాడ వాల్మీకి" అని వ్యవహరించారు.

నేస్తం భమిడిపాటి కామేశ్వరరావు గారు "స్వయంజ్యోతి" అనీ, "ప్రథమాంధ్ర రచనా బ్రహ్మ" అని కీర్తించారు.

అయితే యీ మిత్రులిద్దరూ ఆ మహాకవిని ప్రత్యక్షంగా చూచి యెరుగరు. నాకు మాత్రం ఆ మహాభాగ్యం పట్టింది."

**– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి**

❋ ❋ ❋

"తెలుగువాడి జాతీయగుణం ఓర్వలేని తనం. తెలుగువాడి జాతీయ కార్యక్రమం కోడిగుడ్డు మీద వెంట్రుకలు లెక్కపెట్టడం. కానీ తెలుగుదేశంలో ఒక గొప్పతనం కూడా ఉంది. అదేమిటంటే, తెలుగుదేశంలో అందరూ కవులే!"

**– శ్రీశ్రీ**

❋ ❋ ❋

"విశేశ్వరరావు నిజంగా కవి. అసలు ఇతనికి కవిత్వం రాయడం తప్ప ఇంకేమీ రాదని నా నమ్మకం. నాకూ అంతే!...

**– దేవులపల్లి కృష్ణశాస్త్రి**

(మల్లవరపు విశ్వేశ్వరరావు 'మధుకీల' పురూరవ పరిచయవాక్యాలలో)

❋ ❋ ❋

# రుక్కాయి

"మల్లవరపు విశ్వేశ్వరరావు 'మధుకీల'కు వ్రాసిన పీఠికలో కృష్ణశాస్త్రి "విశ్వేశ్వరరావూ నువ్వు కవిత్వం బాగా రాస్తావయ్యా. వాటన్నింటినీ ఒక సంపుటిగా వెయ్యాలి" అంటూ ఆ వెంటనే "పేరడీ" పద్యాలు రాసే వారందరి గురించీ నేనీ మాట అనను! విశ్వేశ్వరరావు కవి. నిజంగా కవి" అని రాసిన సందర్భంలో పేరడీలకు పేరొందిన జరుక్ "నారాయణబాబూ! నువ్వు క్షవరం చేయించుకోవాలయ్యా" అని "తలమాసిన వాళ్ళందరితోనూ నేనీ మాట అనను. నారాయణబాబు తల మాసినవాడు! నిజంగా తలమాసినవాడు" అంటూ ఆశువుగా పేరడీ చేశాడు. జరుక్ వాగుడులో ఒక వైభవం ఉండేది. శివశంకరశాస్త్రికి పీఠికా పరమేశ్వరుడన్న బిరుదిచ్చింది ఇతనే. కవిత్వాన్నే కాదు వచనాన్ని కూడా అవలీలగా తిరగేసి తొడిగి సేకునేవాడు.

ఆనాటి హేమాహేమీలంతా రుక్కాయి నోటి దురుసుతనానికి జడిసేవారు. విశ్వనాధ వారినే 'పాషాణపాక ప్రభు' అనగలిగిన పాటి దమ్ములు రుక్కాయికి తప్ప మరెవరికీ లేవు."

**– శ్రీశ్రీ,** (అనంతం).

❋ ❋ ❋

# అభిప్రాయం

"కొన్ని దినాలబాటే శిష్యరికం చేసినా శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారిని నా గురువుగా మన్నిక చేస్తాను. ముగ్గురు మహాకవులు చేసిన భారతాంధ్రీకరణాన్ని మా గురువుగారొక్క చేతితో చేశారు. గురువుగారు కదా అన్న భక్తితో లేని ఓపిక తెచ్చుకొని ఆదిపర్వం మొదలు స్వర్గారోహణపర్వం వరకు ఆసాంతమూ చదివాను. కాని ఏం చెయ్యను ? ఇప్పుడొక్క పద్యం కూడా జ్ఞాపకం లేదు."


**– చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి,**

(శ్రీపాద – చెళ్ళపిళ్ళ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండేదట)

❋ ❋ ❋

# గోడు

"రాయప్రోలు సుబ్బారావుగారిని ఒక ప్రతీకగా తీసుకున్న, అవతలి నుంచీ వచ్చినవాండ్లు ఇక్కడి వాండ్లతో కలిసిమెలిసి పోకుండా, ప్రత్యక్షంగా పని చేయకపోయినా, ఏ విధమైన సహకారం, ప్రోత్సాహం ఇచ్చేటోళ్లు కాదు. ఆనాటికీ ఈనాటికీ ఈ వ్యవహారం ఎట్లు వుండేదీ చెప్పేటందుకే ఇదంతా.



కాళోజీ

ఆంధ్రాఫేమ్ రాయప్రోలు సుబ్బారావుగారిది ఆ తీరు అయితే, ఆలిండియా – కాదు, కాదు – వరల్డ్‌ఫేమ్ సరోజినీ నాయుడు గారిది మరో తీరు. ఆమె తండ్రి అఘోరనాథ్, బెంగాల్ నుంచి ఇక్కడికొచ్చి మదరసే అలియానో మరేదో స్కూలుకి ప్రిన్సిపాల్‌గా వుండెటోడు. ఆమె తమ్ముడు హరీంద్రానాథ్ చటోపాధ్యాయ కూడా మంచికవి. ఠాగూరుని మించిన వాడంటారు కొందరు. సరోజినీదేవి మేజర్ గోవిందరాజులనాయుడిని పెండ్లాడింది. ఈమె కాంగ్రెస్ ప్రెసిడెంటుగా వుండుకుంటూ, గాంధీగారి వెంటపోతూ లెక్చర్లు ఇచ్చుకుంటూ వుండేటిది. హైద్రాబాద్ వచ్చినప్పుడు తన గోల్డెన్ త్రెషోల్డ్ భవనంల కూచోవడం, ఆ నవాబుగారు రావడం, పోయట్రీ గురించి మాట్లాడుకోవడం వుండేది – అంతేగాని కాంగ్రెస్ మాటలేం లేవు. అవతలికిపోతే పెద్ద కాంగ్రెస్ లీడర్. ఇక్కడ మేజర్‌నాయుడు భార్య. కాంగ్రెస్‌కి ఇటువంటి అవగాహన వుండబట్టే

ఇది నేటివ్ స్టేట్ కాబట్టి ఇక్కడ మేం ఏ ఉద్యమమూ ప్రారంభించదలచలేదు. బ్రిటీష్ వాండ్లతో తలపడితే చాలు అనే భావం వుండేటిది. అందుకే వాండ్ల నాయకులు ఇక్కడికి రావడం, మాట్లాడటం చాలా తక్కువ. బయట ఎంత ఖ్యాతి పొందినా, తెలంగాణా పట్ల కొంతమందికి ఎటువంటి భావనలుండేవనెటందుకు యీ వుదాహరణలిచ్చిన".

**– కాళోజీ.** (ఇదీ నా గొడవ)

❋ ❋ ❋

# సౌదామిని

"కృష్ణశాస్త్రిగారి గీతాలను హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ ఇంగ్లీషులోకి అనువదించడం, వాటిని శాస్త్రిగారెక్కడో పారవేసుకోవడం కూడా జరిగిపోయింది.

పురిపండా రాసిన కొన్ని గీతాలు అతని కోరిక మీద ఇంగ్లీషు భాషలోనికి నేను అనువదించాను. వాటిని 'సౌదామిని' అనే పేరిట గ్రంథ రూపంలో అతను ప్రచురించాడు. అనువాదంతోపాటు ముందుమాట కూడా నేనే రాశాను. తన కవిత్వానికి నోబెల్ బహుమానం వస్తుందని ఎందుకో పురిపండాకి గట్టి నమ్మకం. హఠాత్తుగా ఒకరోజు "నాకు నోబెల్ ప్రైజ్ ఇచ్చారన్న వార్త చదివితే నువ్వు అసూయ చెందుతావా" అని నన్ను పురిపండా ప్రశ్నించాడు. 'అసూయ చెందనుగాని బహుమతి ప్రదాతల మీద తప్పకుండా జాలి చెందుతా'నని నేను జవాబిచ్చాను."

**– శ్రీశ్రీ**

❋ ❋ ❋

"దువ్వూరి వేంకటరమణశాస్త్రి స్వీయచరిత్రలో – గోదావరి జిల్లా బ్రాహ్మలు వెర్రిగా సంధ్యావందనంలో 'కాటన్' దొర పేరు చేర్చి సంకల్పం చెప్పుకున్నారని రాశారు."

❋ ❋ ❋



**ఠాగూర్**

# మాట

"కొత్తగా కొమ్ములు మొలిచిన లేడిపిల్ల కొమ్ములతో ఎక్కడపడితే అక్కడ కుమ్మినట్లు, అపుడపుడే కుదురుతున్న పద్యాలతో నాకు నేనే రోత కలిగేటట్లు చేసుకున్నాను. మా అన్న నా పద్య రచనకు మురిసిపోయి శ్రోతల కోసం ఇల్లంతా వెదికేవాడు.

ఒకరోజున మేమిద్దరం మా జమీ కార్యాలయంలో ఉద్యోగుల మీద అధికారం చెలాయించి బయటకు వస్తుండగా "నేషనల్" పేపరు

సంపాదకుడు నవగోపాల మిత్తల్ ఎదురైనాడు. ఎక్కువ గొడవ పెట్టకుండానే మా అన్న "చూడండి, నవగోపాల్‌బాబు! మా రవి వ్రాసిన పద్యం వినరూ ?" అన్నాడు. వెంటనే నేను చదవవలసి వచ్చింది.


అప్పటికి నేను ఎక్కువగా వ్రాయలేదు. కవి తన రచనలను జేబులో పెట్టుకుని తీసుకువెళ్ళవచ్చు. నేనే రచయితను, అచ్చుదారును, ప్రచురణకర్తను. మా అన్న నాకు ఒకే ఒక సహచరుడు, ప్రచారకుడు. నేను వ్రాసిన "పద్యం" అనే పద్యాలు నవగోపాలబాబుకు మెట్ల క్రింద అప్పటికప్పుడు మహోత్సాహంతో గొంతెత్తి చదివి వినిపించాను. "బాగుంది" అన్నాడాయన మందహాసం చేస్తూ, "కాని ద్విరేఫ అంటే యేమిటో చెప్పు." అని అడిగాడు.

ఈ మాట నాకెలా పట్టుబడిందో జ్ఞాపకం లేదు. మామూలు పేరు ఛందస్సుకు సరిపోయేది. నా పద్యాలలో కల్లా ఈ మాటే నాకు పేరు తెచ్చి పెడుతుందని ఆశించాను. మా ఉద్యోగులకు మాత్రం ఈ మాట బాగా నచ్చింది. కాని చిత్రమేమంటే నవగోపాలబాబు ఈ మాటకు ముగ్ధుడై పోలేదు. పైగా చిరునవ్వు నవ్వాడు. ఆయన అర్థం చేసుకోగల మనిషి కాదని నా నమ్మకం. మళ్లీ ఎన్నడూ నేను నా పద్యాలు ఆయనకు వినిపించలేదు. ఆ తరువాత నాకు చాలా ఏళ్ళు పైబడ్డాయి. కాని శ్రోతలు గ్రహించగలగడం, గ్రహించలేకపోవడం ఎందులో ఉందో తెలుసుకునే యత్నం మాత్రం ముందుకు సాగలేదు. నవగోపాలబాబు ఎంతగా నవ్వినా ద్విరేఫ అన్న మాట తేనె త్రాగిన తుమ్మెదలాగా పద్యంలో చక్కగా అతుక్కునిపోయింది."

**– రవీంద్రనాథ్ ఠాగూర్.** (నా జీవిత స్మృతులు)

* * *

# స్వేచ్ఛాప్రియుడు



దేవులపల్లి

"దేవులపల్లి కృష్ణశాస్త్రి 1918 లో పిఠాపురం, కాకినాడలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. పెద్దబావగారి కుమార్తెను వివాహం చేసుకున్నారు. 1919 లో తల్లావజ్ఝుల శివశంకర శాస్త్రి స్థాపించిన సాహితీ సమితిలో సభ్యులైనారు. ఆ రోజులలో కృష్ణశాస్త్రిగారితో పాటు విశ్వనాథ సత్యనారాయణ, అడివి బాపిరాజు, నండూరి సుబ్బారావు, నోరి నరసింహశాస్త్రి, చింతా దీక్షితులు, కొడాలి ఆంజనేయులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు మొదలైన వారుండేవారు. ఈ సాహితీ సమితిని గురించి చెబుతూ కృష్ణశాస్త్రి – బి.ఎ., అనిపించుకోవడం కంటే "సాహితీ సమితి సభ్యుడు" అనిపించుకోవడమే తన కిష్టమని చెప్పాడు.

వ్యావహారిక భాషా ఉద్యమం, బ్రహ్మసమాజోద్యమం ప్రభావంతో మహోన్నత గీతాలాలపిస్తూనే కాకినాడ, పెద్దాపురం హైస్కూళ్ళలో ఉపాధ్యాయులుగా రెండు సంవత్సరాలు పని చేశారు. అయితే కాలం పిలుపుతో కల్మషాన్ని కడిగివేయడానికి రాసిన ఈయన పాటలు సంప్రదాయవాదులకు గిట్టలేదు. మహాకవుల కడుపున చెడబుట్టాడని తిట్టి రాజావారికి చెప్పి సంఘ బహిష్కరణ చేయించారు. తలవంచని స్వేచ్ఛాప్రియత్వం మూర్తీభవించినవాడు కావడంతో అలంకార నిరంకుశాలు సహించలేకపోయారు. పిఠాపురం రాజావారికి వ్యతిరేకంగా "ధర్మసాధన" అనే పత్రికలో కొన్ని వ్యాసాలు రాయడంతో రాజావారు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా తండ్రుల కాలం నుంచి వస్తున్న "వార్షికం" నిలుపు చేశారు. సత్యాసత్యాలు బోధపరిచి తన నిర్దోషిత్వాన్ని నిరూపించడానికయినా అవకాశం యివ్వలేదు. కోటలో ప్రవేశమే లేకుండా దేవిడీమన్నా చేయించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో శాస్త్రిగారి భార్య మరణించింది. శోకావేశంతో "కన్నీరు" అనే ఖండకావ్యం రాశారు. తరువాత సంఘ సంస్కరణాభిలాషియైన గాడేపల్లి సూర్యనారాయణగారి పెద్దమ్మాయి 'రాజహంస'ని పెళ్ళాడారు. మామగారి ప్రోత్సాహంతో సహాయ నిరాకరణోద్యమ కార్యకలాపాలకుపక్రమించిన కృష్ణశాస్త్రి ఉద్యోగం పోయినందుకు బాధపడక "నా స్కూలు మేష్టరీ ఉద్యోగం నా అదృష్టం వల్ల పోయింది" అన్నారు."

**– అదృష్ట దీపక్.**

❋ ❋ ❋

# నేటికాలపు కవిత్వం

"నా మనస్సు యాభై సంవత్సరాల వెనక్కి పోతుంది. 1920 ల ప్రారంభ దినాలవి. ఆ రోజుల్లోనే జమిందారీ కవిత్వాన్ని తోసిరాజని భావకవిత్వం రంగప్రవేశం చేసింది. 1910–20 ల మధ్య ఈ ఉద్యమాన్ని ప్రారంభించినవారు రాయప్రోలు, అబ్బూరి. అయితే దీనికి 1920 లలో అఖిలాంధ్ర ప్రాచుర్యం ఇచ్చినవాడు కృష్ణశాస్త్రి. అయితే కృష్ణశాస్త్రిది ప్రతిఘటన లేని విజయయాత్ర కాదు. మహాపండితుడైన అక్కిరాజు ఉమాకాన్తమ్ "నేటికాలపు కవిత్వం" అనే పుస్తకం రాసి, అందులో ఎక్కువ భాగం కృష్ణశాస్త్రినే వెక్కిరించాడు. ఉమాకాన్తమ్ (సంస్కృతపు స్పెల్లింగు చూడండి) గారికి సంస్కృతంలో తప్ప మరెక్కడా కవిత్వం కనబడదు. నన్నయ్యభట్టును కూడా ఆయన కవిగా ఖాతరు చేయలేదు. నేటికాలం కవిత్వానికి కాలం కాదనేశాడాయన.

నేటికాలపు కవిత్వం ఇప్పుడు లైబ్రరీలలో బూజుపట్టిపోతుంది. కృష్ణశాస్త్రి కవిత్వం భావకవితకు పరాకాష్టగా నిలబడింది.

అనంతపంతుల రామలింగస్వామి అనే ఆయన "కృష్ణపక్షం" కావ్య సంపుటిని వేళాకోళం చేస్తున్నాననుకుంటూ "శుక్లపక్షం" అనే రాతని వెలువరించాడు. దాన్ని ఇప్పుడు చదివేవాళ్లెవరూ లేరు. ఆ రోజుల్లోనే దాన్ని వేదుల "ఈ శుక్లపక్షం సారస్వతారిష్టం అనే శుక్లనష్టం" అని చెప్పి సహృదయుల హృదయపులకాల నుంచి తుడిచిపెట్టి పారేశాడు."

**– శ్రీశ్రీ**

❋ ❋ ❋

# సాహిత్య రసికుడు

"విజయనగరం మహారాజు ఆనందగజపతి మంచి సాహిత్య రసికుడు. ఆయనతో మన అప్పారావుగారికి మనస్సు కలిసిన పరిచయమేర్పడటం గొప్ప విశేషం. కన్యాశుల్కం ఆనంద గజపతికే అంకితం. ఆయన ఆస్థానంలో ముడుంబై నరసింహాచార్యులు, కొల్లూరి కామశాస్త్రి, మండచిట్టి కామేశ్వరశాస్త్రి, భాగవతుల లక్ష్మీనారాయణ, పేరి వెంకటశాస్త్రి, పేరి కాశీపతిశాస్త్రి, ఇవటూరి నందికేశ్వరశాస్త్రి, మైసూరు భీమాచార్యులు, నేమాని కోదండరామ యాజులు మొదలైన మహాపండితులుండేవారు. ఇలాంటి ఉద్దండుల మధ్య వ్యావహారిక భాషావాది అప్పారావుగారు స్థానం సంపాదించుకున్నారంటే, ఆస్థానంలో గోష్ఠికి ఉపాధ్యక్షులు కాగలిగారంటే ఇంక చెప్పవలసిందేముంది ?

పిఠాపురం సంస్థానంలో కూడా పండితులుండేవారు. కాని ఆ మహారాజు ప్రాచీన సాహిత్యానికి, గ్రాంథిక భాషకే తప్ప తన ఆస్థానంలో వాడుక భాషకు తావు కల్పించలేదు. ఆనందగజపతి రెండింటినీ ప్రోత్సహించారు, ఆదర్శప్రాయులైనారు. ఆనందగజపతి ప్రోత్సాహం గురజాడ మహాకవికి వంద ఏనుగుల బలం కలిగించింది."

**– పురిపండా అప్పలస్వామి**

* * *

# బేహద్బీ తాత



**గురజాడ**

"రీవాసర్కారు" లో ఆమెకి బేహద్బీతాత (గురజాడ అప్పారావు) గారు ప్రైవేటు సెక్రటరీ. దినంలో మూడొంతులు కోటలోనే గడిపేవారు. అప్పారావుగారు ఆమెతో మాట్లాడేప్పుడు మిగిలిన వారినందరిని పంపించేసేవారు. దగ్గరకు రానిచ్చేవారు కాదు.

ఆమె రాత్రి భోజనం చేసేటప్పటికి ఒంటిగంట అయ్యేది. వంటకత్తె రామాయమ్మ అంత ఆలస్యం అయినా ఓపిగ్గా అన్నీ అమర్చేది. తగ్గట్టుగానే ఆమెకి లక్ష రూపాయలకు పైగా విలువ చేసే వెండి, బంగారం జవహరీముట్టాయి. అప్పుడప్పుడు రీవారాణిగారు "అప్పారావు! భోజనం చేసి వెళ్ళు" అని ఆపేసేవారు. భోజనానికి ముందు ఆమె మద్యం తీసుకునేవారు. అప్పారావుగారిక్కూడా ఇస్తుండేవారు. మితం దాటగానే ఆమె చూడకుండా వెనుకగా గ్లాసు ఒంపేసి, "మహారాణీ! నాకు ఆకలి వేస్తుంది. మీలా ఒంటిగంట, రెండు గంటల వరకు ఉండలేను. ఇంటికెళ్ళిపోతాను" అనేవారు. అప్పుడు ఆమె రామాయమ్మని పిలిచేవారు వడ్డించమని. ఆమెతోపాటు ఆయన కూడా మాంసాహారం తీసుకునేవారు. ఆయన సిగరెట్టు కూడా కాల్చేవారు.

అప్పారావుగారు వేసే జోక్సకి నవ్వుకుని తరువాత "అప్పారావు! పోయి పడుకో" అని సెలవిచ్చి పంపేవారు."

**– పూసపాటి రాజకుమారీదేవి**

(శ్రీ పురిపండా అప్పలస్వామి గారితో ఆమె సంభాషణలో)

❋ ❋ ❋

# నిలిచిపోయిన పాత్రలు


"హామ్లేట్ నాటకం షేక్స్పియర్ రచించిన నాటకాలలో ఉత్తమోత్తమమయినా ఈ కాలంలో దాని యెడల ఆదరం తగ్గింది. అట్లే కన్యాశుల్కం సంఘంలో అంతరించింది. వరశుల్కం అమలులో ఉంది. ప్రభుత్వం వారు దీనిని తొలగించటానికి చట్టం నిర్మించినా రహస్యంగా సాగుతూనే వుంది. పరిస్థితులు తారుమారయినా కన్యాశుల్కం జనరంజకంగానే వున్నది. అందుకు కారణం లేకపోలేదు. అప్పారావుగారు సార్ధకములు కాగల పాత్రలు సృష్టించారు. వాటికి అమరత్వం సిద్ధించింది. షేక్స్పియర్ రచించిన నాటకాలలో షైలాక్, ఇయాగో, రోమియో, ఫాల్స్టాఫ్, క్లియోపాత్రా వంటి పాత్రలు; గిరీశం, అగ్నిహోత్రావధానులు, లూబ్ధావధానులు, రామప్పంతులు, మధురవాణి పాత్రలు లోకంలో ఆయా గుణములు గలవారికి పెట్టదగిన పేర్లయినవి."

**– గిడుగు వెంకట సీతాపతి**

(తెలుగునాటక రంగం, కళావని ప్రచురణ నుండి)

❋ ❋ ❋

# తెలుగు పడదండీ!



**భమిడిపాటి**

"గొప్పవాళ్లతో సంబంధం కలుపుగోడం అల్లుడికి అవసరం గనుక ఎల్లానో తంటాలు పడి అతడు బాదరాయణిస్తాడు. నేనూ అంతే చేస్తాను. "కన్యాశుల్కం" పుట్టిన సంవత్సరమే నేను జనించాను. ఇటీవల అంతా అంకెల మీదా, బ్రాకెట్ల మీదా నడుస్తోంది గనక అంక సంబంధం గణనీయం. (ఈ వాక్యం నేను సభలో అన్నప్పుడు అధ్యక్ష పీఠంలో ఉన్న శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తను పుట్టిన సంవత్సరమూ అదే అని చెబుతూ మాలో మాకు మరో చుట్టరికం సూచించారు) 1915 లో గురజాడ అప్పారావుగారి నిర్యాణం. 1917–18 లో నేను రాజమండ్రి కాలేజీ విద్యార్థిగా ఉండగానే నన్ను ఎల్లానో గుర్తించి శ్రీ సత్యవోలు గున్నేశ్వరరావుగారు – రాజమండ్రి కేసరి. రాజమండ్రికి కిరీటం లేని రాజు అనే బిరుదు జనం వల్ల పొంది, జనప్రియుడై దీన జనరక్షకుడై వెలిగిన వ్యక్తి – నాతో గురజాడ

అప్పారావుగారిని గురించి ప్రసంగాలు చేస్తూ వూరుకోక వారి ప్రతిభ ప్రశంసిస్తూ, తన అభ్యాసం చొప్పున ఆంగ్లభాషలో "అప్పారావు ఒక తేజస్సు, ఒక తెలుగువెలుగు. అప్పారావు గ్రంథాలు సువర్ణాక్షరాలతో అచ్చు వేయవలెను." అంటూ గంభీరంగా అని, నాతో పరోక్ష వ్యక్తిని గురించి ఆవేశం కలిగించుతూ, అంతటితో ఆగక "మీరు కూడా అల్లాంటివి వ్రాయాలి" అనేవారు. నేను కూడా ఆయన అన్నదానికి జవాబుగా, ఇంగ్లీషు భాషలోనే "మనకు తెలుగు పడదండీ, మన సబ్జెక్టు వేరు" అనేవాణ్ణి. మరికొంచెం తరువాత ఆయన ఒకనాడు తన ఇంటికి తీసికెళ్ళి "కొండుభట్టీయం" చిత్తుప్రతి (బహుశా అది శ్రీ గురజాడ అప్పారావుగారి స్వహస్త లిఖితం అయి వుండవచ్చును) నాకు ఇచ్చి "ఇది మూడంకాలే వుంది. మీరు పూర్తి చెయ్యాలి" అని, నాయందుండే మక్కువ చేత అన్నారు. నాకు భయం వేసి "అవున్లెండి, నన్ను ముందు తెలుగు గుణింతాలు వగైరా నేర్చుకోనివ్వండి" అని నేనన్నాను. తరువాత చాలాసార్లు ఆయన అల్లానే అంటూ ఉండటం, నేనూ అల్లానేలెండి అంటూ ఉండడం జరిగింది."

**– భమిడిపాటి కామేశ్వరరావు**

❋ ❋ ❋

# పోరు

"అడవి డొంకల్లోకి, వంతర్లలోకి, గతకల్లోకి కదలిపోతున్న తెలుగు సాహిత్య రథాన్ని కొత్తపాతల మేలుకలయికలతో మేలుదారి పట్టించిన మేటి సారథి, మహారథి గురజాడ మహాకవి.

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, కాశీకృష్ణమాచార్యులు, కొక్కొండ వెంకటరత్నం, వావిలికొలను సుబ్బారావు, కూచి నరసింహము, మోచర్ల రామచంద్రరావు, జయంతి రామయ్య, వేదం వెంకట్రాయశాస్త్రి, పానుగంటి లక్ష్మీనరసింహం, కొమర్రాజు లక్ష్మణరావు గార్ల వంటి కరడుకట్టిన గ్రాంథిక భాషావాదులు పన్నిన వ్యూహాలు ఛేదించుకొని మాతృభాష అయిన వాడుక భాష కోసం గిడుగు నీడలో పోరాడిన మహాయోధుడు గురజాడ అప్పారావు.

సరిగా ఈ యేటికి వందేళ్ళ క్రితం 1875 లో గిడుగు రామమూర్తిని కలుసుకున్నారు అప్పారావుగారు. అప్పటికి మైనారిటీ అయినా దాటలేదు. పధ్నాలుగేళ్ల యువకుడు. అతనికంటే రెండేళ్ళు చిన్న రామమూర్తిగారు. గిడుగు గురజాడల ఆ కలయిక అపూర్వమైంది, చారిత్రాత్మకమైంది. వాడుక భాషోద్యమానికి శుభవేళ అది. నిజంగా వందేళ్లు నిండుతున్న ఈ ఏట శతజయంతి జరపదగింది.

అప్పారావుగారిని స్మరించినపుడు ఆనాటి వ్యవహారిక, గ్రాంథిక భాషల సంగ్రామ చరిత్ర జ్ఞాపకం వస్తుంది. గ్రాంథిక వాదులు చేసిన, చేస్తున్న కువిమర్శలు, కుతంత్రాలు రక్తం కుతకుతలాడిస్తాయి. అవన్నీ తడవాలంటే ఈ చిన్న వ్యాసంలో వ్యవధి తక్కువ. కాని అప్పారావుగారి మాటల్లోనే ఇక్కడ ఒక మాట చెప్పాలనిపిస్తుంది.

"వారు విరమించి చాలాకాలమైంది. కాని ఏ ముహూర్తాన పోరు తలపెట్టారోగాని ఆ యుద్ధరంగం మట్టుకు యెన్నడూ చల్లారలేదు. కవులు లావైనారు. కొట్లాటలు లావైనాయి. చరిత్ర పునరావృతమవుతున్నది. నలుదిక్కులా జయభేరీలు మ్రోగుతున్నాయి. ఏమని ? బిరుదులు గట్టిన పండిత కవులకు తెలుగు లక్షణం రాదు, రాదు రాదని".

గురజాడ అప్పారావుగారు తాను 'పండితుడ్ని' అని ఎక్కడా చెప్పుకోలేదు. అందుకని నాడూ నేడూ చిన్నచూపు చూసిన 'పండితులు' లేకపోలేదు కాని ఆయన అసలయిన పండితుడు. లోతులు తెలిసిన పండితుడు. గుడ్డిగా అనుసరించని దూరపు చూపుగల పండితుడు. అన్నింటికీ మించి ఆయన ప్రజల పండితుడు."

**- పురిపండా అప్పలస్వామి.**

❋ ❋ ❋


# కానుక

"మచిలీపట్నంలో పురాణం సూరిశాస్త్రిగారు అనే నాటక విమర్శకులు ఉండేవారు. వీరు స్థితిమంతులు. వీరి అల్లుడే సుప్రసిద్ధ కథారచయిత మల్లాది రామకృష్ణ శాస్త్రి. ఆ రోజుల్లో సూరిశాస్త్రిగారు ఇంగ్లండ్ నుంచి ప్రతి పుస్తకం సరాసరి రెండేసి ప్రతులు తెప్పించి, ఒక ప్రతి అల్లుడుగారికి కానుకగా ఇచ్చేవారట. ఆ విధంగా మల్లాదివారు అనేక ఉత్తమ గ్రంథాలు చదివారు, సేకరించారు."

**- వెలగా వెంకటప్పయ్య**

❋ ❋ ❋

# బైరాగి



బైరాగి

"హిందీ సాహిత్య ప్రపంచంలో తెలుగువారికి కీర్తి తెచ్చిన కవులు ముగ్గుర నుకుంటాను. ఆ ముగ్గురు రాంగేయ రాఘవ్, బాలకృష్ణరావు, బైరాగి. ఆ ముగ్గురిలో బైరాగి సవ్యసాచి. ఉభయ భాషల్లో కవితవ్రాసి పాఠకులను ఆశ్చర్యచకితులను చేశాడు బైరాగి.

నా అదృష్టం ఏమంటే - నేను ఆలూరి బైరాగిని చాలా సన్నిహితంగా ఎరుగుదును. 1962 లో మద్రాసు వెళ్ళినప్పుడు - అప్పుడే కొత్తగా కట్టిన అశోకా హోటలులో (ఎగ్మూరు) మేము కలుసుకున్నాము. నేను సినిమా పనిమీద వెళ్ళాను. బైరాగి కూడా ఏదో సినిమాకి వ్రాయదలచినట్లు చెప్పారు. శ్రీ ఈదర లక్ష్మీనారాయణగారితో తరచు చక్రపాణిగారి వద్దకు బైరాగి వస్తుండేవారు. చక్రపాణి గారి కార్యాలయం రచయితలకు దేవాలయం. బైరాగి గారు నన్ను ఆకర్షించింది వారి "నూతిలోని గొంతుకలు"తో.

ఆయన వాచాలుడు కాదు. బహు కొద్దిగా మాట్లాడేవాడు. పెద్దగా వ్రాసేవాడు."BAIRAGI WRITES LIKE AN ANGEL AND SPEAKS LIKE A POOR PAUL" అనేవారు చక్రపాణిగారు. నేన్ను దాన్ని కొంచెం మార్చి "BAIRAGI WRITES ABOUT POOR PAULS. SO NATURALLY HE SPEAKS LIKE HIM" అనేవాణ్ణి.

బైరాగికి హిందీలోని మహాకవుల రచనలు ఎన్నెన్నో జ్ఞాపకం ఉండేవి. అప్పుడప్పుడూ సంభాషణల్లో ఉదహరించేవారు. ఆయన ఏ సిద్ధాంతానికి లోబడినవాడు కాదు. ఆయన సిద్ధాంతం ఆయనదే. ఆయనకి రాద్ధాంతం ఇష్టం లేదు. రాద్ధాంతం ఇష్టం లేని కొద్దిమంది కవులలో ఆయనొకడు."

– దాశరథి

* * *

## బందరు కవితా సమితి

"బందరులో బందరు కోటకు వెళ్ళు దారిలో ఫిరంగివేయు స్థలమున్నది. దానికి దగ్గరలో బొంబాయి అనే ప్రదేశమున్నది. అది బందరు రైలుస్టేషన్‌కు వెళ్ళు తోవలో ఉంటుంది. అచటకు నవయువకులు, కవులు, రాజకీయజ్ఞులు అంతా సాయంవేళ వాహ్యాళికి వెళ్ళి విశ్రమించేవారు. కవులు తాము రచించిన కవిత్వమును వినిపించుట అలవాటు. బందరు కవితా సమితి వారు అచట సమావేశమగుట ఆచారము. వాటినన్నింటిని సావధానంగా విని విమర్శించుట ఆనవాయితి. పురాణం సూరిశాస్త్రిగారు, డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు, ముట్నూరి కృష్ణారావు గారు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు, వెల్లటూరి స్వామినాధన్, చిట్టా సుందరరామయ్యగారు, కోట సుబ్బారావుగారు, చెఱకువాడ వేంకట నరసింహ సిద్ధాంతి, పింగళి లక్ష్మీకాంతం గారు, కాటూరి వేంకటేశ్వరరావుగారు, మునిమాణిక్యం నరసింహారావుగార్లు అక్కడ చేరేవారు. అక్కడ నిగ్గు తేలి భేష్ అనిపించుకున్న కవితయే ప్రచురణార్హత పొందగలిగేది."

– గూడూరి నమశ్శివాయ.

* * *


## ముసలమ్మ మరణం

"చెన్నపురి క్రైస్తవ కళాశాలలో "శ్రీమదాంధ్ర భాషాభిరంజనీ సమాజము" ఉండేది. దానికి పోషకులు శ్రీ సమర్థి రంగయ్యసెట్టి. ఆయన అందులో నూత్నంగా బహుమాన కావ్య పద్ధతి ప్రవేశపెట్టారు. ఆ పోటీ పరీక్షకై కట్టమంచి రామలింగారెడ్డిగారు "ముసలమ్మ మరణం" అనే లఘు కావ్యం రచించారు. అనంతపుర మండల చరిత్రలోని ముసలమ్మ గాథ రెడ్డిగారి హృదయాన్ని స్పందింపచేసింది. అప్పుడు రెడ్డిగారి వయస్సు కేవలం పందొమ్మిది సంవత్సరాలే.

1899 లో ఈ కావ్య నిర్మాణం జరిగింది. మరుసటి సంవత్సరమే ప్రకటింపబడి ఆంధ్రసాహిత్య రంగంలో ఒక సంచలనానికి దారి చూపింది.”

❋ ❋ ❋

## గోలుకొండ కవుల సంచిక



సురవరం ప్రతాపరెడ్డి

“కోస్తా ప్రాంతం నుండి వెలువడే ఒకానొక వారపత్రికలో తెలంగాణములో కవులే లేరని, ఉన్నవారిలో కవితా శక్తియే మృగ్యమనీ, తెలుగు మాట్లాడటమే తెలుగువారికి తెలియదని ఏమేమో వ్రాయబడింది. ఆ పత్రిక యొక్క ప్రతి నొకదానిని సురవరం ప్రతాపరెడ్డి గారికెవరో చూపించారు. అందు ప్రచురించిన అంశాలను చదివిన రెడ్డిగారి అభిమానం దెబ్బతిన్నది. ఆవేశం పెరిగింది. రక్తం పొంగులెత్తింది. పౌరుషం ప్రకోపించింది. తేట తెనుగు నుడికారపు తీయదనమును చవిచూపిన పొన్నగంటి తెలగనార్యుని గోలకొండ కవితలను మరొకసారి ఆంధ్రులకందించాలని రెడ్డిగారు సంకల్పించారు. మూలనున్న కవుల పట్టికను పైకి తీసినారు. మారుమూల గ్రామాల్లో నివురుగప్పిన నిప్పుకణాల వలె పడియున్న కవి దిగ్గజాలను, పుంగవులను, కిశోరులను, కుమారులను గోలకొండ పత్రికాలయమున కాహ్వానించి కవితలు వ్రాయించారు. నగరానికి రాలేని వారి కవితలు తెప్పించుకున్నారు. వారి పూర్వ కృతులను కూడా తెప్పించారు. జాడ తెలియకుండా ఉన్న మారుమూల గ్రామములలో నివసించు కవులను శోధించి వారిచేత కవితలల్లించి తెప్పించుకున్నారు. వారికన్న పూర్వ మందుండిన కవుల పట్టికను, వారు రచించిన గ్రంథముల పట్టికను కూలంకషంగా సిద్ధం చేయించారు. అలా భగీరథ ప్రయత్నంతో కొన్ని మాసములు అవిశ్రాంతంగా శ్రమించి ఆశించిన పనిని సాధించారు. కొండొకనాడు ‘గోలుకొండ కవుల సంచిక’ ను ప్రచురించారు. ఆనాడు తెలంగాణాపు తెలుగుకవులకొక పర్వదినము, తెలుగు ప్రజలకు గర్వదినము. గోలుకొండ కవుల సంచికలో మొత్తము 183 పూర్వకవుల కవితలు, 354 ఆధునికుల కవితలూ ప్రకటింపబడినవి.

కవుల సంచిక యొక్క అవతారికలో ప్రతాపరెడ్డిగారిలా వ్రాశారు – “తెలంగాణములో కవులు లేరను విడ్డూరపు అభిప్రాయములు పలుమారు వినుట, ఆయా పత్రికలందు చూచుటయు తటస్థించినది. అయిననూ అట్టి అభిప్రాయములు అభివ్యక్తము చేయువారికి తెలంగాణము యొక్క పరిస్థితులు తెలియకనూ, తెలిసికొనకనూ, తెలిసికొనుటకు అవకాశము లేకనూ, అలాంటి ప్రయత్నము చేయకనూ చెల్లని వ్రాతలు వ్రాశారేకాని అవి ద్వేషబుద్ధి చేత వ్రాయబడినవి కావని నా యొక్క నిశ్చితాభిప్రాయము.”

గోలుకొండ కవుల సంచిక అవతరణ తెలంగాణ తెలుగు పద్య సాహిత్యమునకొక అలంకారము, తెలుగు పద్యరచనకొక మైలురాయి. నాటి నుండి నేటి వరకూ అట్టి బృహత్తర ప్రయత్నము ఏ పత్రికాధిపతియూ, ఏ సాహిత్యాభిమానియూ చేయలేదు. ప్రతాపరెడ్డిగారి పిలుపు తెలంగాణా కవులకొక శంఖారావమై, కవితా విపంచికి సంక్రాంతియై వెలుగొందినది.

గోలుకొండ కవుల సంచిక – రెడ్డిగారి అకలంక దీక్షకు, నిరుపమ కార్యసాధనా తత్పరతకు, సాహితీ జిజ్ఞాసకు దర్పణమై నిలిచిపోయింది."

**– నాగభైరవ కోటేశ్వరరావు**

❋ ❋ ❋

# సాహిత్య పాండవులు

"భావ కవిత్వపు అంతిమశక్తి అభ్యుదయ సాహిత్యం ఆరంభదశకి గల సంధియుగంలో ఐదుగురు మహారథులు తెలుగు సాహిత్యంలో రంగప్రవేశం చేశారు. తెలుగు సాహిత్యాన్ని వాడుకభాషతో రంగరించి ప్రకాశింపచేశారు. తెలుగుభాషకి ఛందోశృంఖలాల పాతకాలపు అందాలు, నగలు తొలగించి కొత్త అందాలు అందించారు. గిడుగు రామమూర్తి పంతులుగారు అందించిన వ్యవహారిక భాషా ఉద్యమాన్ని వారు ఐదుగురూ భుజాలకి ఎత్తుకుని ఉత్తమ వారసత్వంగా స్వీకరించి, తెలుగు సాహిత్య సీమలలో వైతాళికులుగా ప్రసిద్ధి చెందారు. వారు – 1904 లో జన్మించిన పురిపండా అప్పలస్వామి, 1908 లో జన్మించిన శ్రీరంగం నారాయణబాబు, 1910 లో జన్మించిన శ్రీరంగం శ్రీనివాసరావు, 1912 లో జన్మించిన శిష్టా ఉమామహేశ్వరరావు, 1915 లో జన్మించిన పఠాభి కలిసి వీరంతా కవితా పంచపాండవులు. ఈ పంచపాండవులలో పురిపండా ధర్మనందనుడు, శ్రీరంగం నారాయణబాబు భీముడు, శ్రీశ్రీ అర్జునుడు, శిష్టానకులుడు, ఇంకా పఠాభి సహదేవుడు."

**– మిరియాల లక్ష్మీపతి.**

❋ ❋ ❋

"చిలకమర్తి వారి సొంత పత్రిక పేరు మనోరమ. పోలవరం జమీందారుగారితో కలిసి నడిపించిన పత్రిక సరస్వతి. ఆంధ్రభారతిలో వేమూరి విశ్వనాధశర్మగారు చిలకమర్తివారిని ఏదైనా హాస్య నవల వ్రాయమనగా, దాని ఫలితంగా 1916 లో 'గణపతి' అనే హాస్య నవల ప్రచురించారు. వేమూరివారు నడుము కట్టబట్టే చిలకమర్తి వారి రచనలన్నీ సంపుటాలుగా వెలువడ్డాయి. ఆ రోజుల్లో న్యాపతి సుబ్బారావుగారు నిర్వహించిన నవలల పోటీలో ప్రతిసారి గెలుపు చిలకమర్తి వారిదే."

❋ ❋ ❋

"చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు చతుర చంద్రహాసాన్ని వ్రాస్తున్నప్పుడు కళ్లు కనబడక గురజాడ శ్రీరామమూర్తిగారి రెండో అబ్బాయి ఆయనకు వ్రాయసకారుడుగా వ్యవహరించాడట."

❋ ❋ ❋


# మేధావి

"రెంటాల వేంకట సుబ్బారావు అనే మహామేధావి దక్షిణ భారతదేశంలో గొప్ప మందుల సంస్థను స్థాపించి విరివిగా ప్రకటన చేసి, చాలా డబ్బు సంపాదించాడు. కళాశాల తరగతుల పాఠ్యపుస్తక సహాయకులుగా ఆయన ఎన్నో పుస్తకాలను రచించి విశేష విత్తం ఆర్జించారు. ఒక్క స్కాట్లండ్‌లో తప్ప ప్రపంచంలో ఎక్కడా అంత పెద్ద ఫుటో స్టూడియా లేదు అనిపించుకోగలిగిన ఫుటో స్టూడియోను మద్రాసులో స్థాపించి, భారతీయ సామాజిక జీవన సంబంధమైన ఛాయా చిత్రాలను తయారుచేసి ప్రపంచ దేశాల మార్కెట్‌ను ఆకర్షించిన మేధావి రెంటాల వేంకట సుబ్బారావు. విద్యారంగంలో కూడా ప్రధానోపాధ్యాయ పదవిని చేపట్టినప్పుడు యూరోపియన్‌లతో సరిసమానమైన వేతనాన్ని ఆయన తీసుకున్నాడు."

– **వల్లూరి సూర్యనారాయణరావు,** (స్వీయ చరిత్ర)

❋ ❋ ❋

# జనవాణి



తాపీ ధర్మారావు

"పిఠాపురం రాజా పీపుల్స్‌పార్టీని స్థాపించారు. ఆ పార్టీ ఎన్నికల ప్రచారం కోసం 1936 లో ఇంగ్లీషు, తమిళం, తెలుగు భాషలలో దినపత్రికలను ప్రారంభించారు. తెలుగు పత్రికకు 'జనవాణి' అని పేరుపెట్టారు. ఆ పత్రిక సంపాదకులు తాపీ ధర్మారావుగారు. నార్ల వెంకటేశ్వరరావు, పి. శ్రీరాములు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, కప్పగంతుల సత్యనారాయణ, బోయి భీమన్న, జి.వి. శేషయ్య మరి కొందరు కూడా ఆనాడు జనవాణిలో పని చేసేవారు. పత్రికలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన ఘనత ధర్మారావుగారిదే. కొన్ని నెలల తరువాత జరిగిన ప్రెస్ కార్మికుల సమ్మెను బలపరుస్తూ నార్ల, కప్పగంతుల మొదలగువారు జనవాణి నుంచి బయటకు వెళ్ళిపోయారు. అప్పుడు యండమూరి సత్యనారాయణ (శ్రీవాత్సవ), ధర్మారావుగారి పెద్దబ్బాయి మోహనరావు, మరి కొందరు జనవాణి సంపాదక సిబ్బందిలో చేరారు. 1937 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, కొన్ని రోజులకు పిఠాపురం రాజా ఇంగ్లీషు, తమిళ పత్రికలను మూసివేశారు. కాని ప్రజాదరణ ఉన్న జనవాణి 1939 వరకు కొనసాగింది. అంతలో రెండవ ప్రపంచయుద్ధం

ప్రారంభమైంది. కాగితం కోటా తగ్గి, ఖర్చులు పెరిగాయి అనే సాకుతో పిఠాపురం రాజా ఆ సంవత్సరంలోనే జనవాణిని ఆపేశారు.

1949 లో తాపీధర్మారావుగారు జనవాణి వారపత్రికను ప్రారంభించారు. "నాటి జనవాణి పరతంత్ర. నేటి జనవాణి స్వతంత్రం. అప్పటిలాగా ఇప్పుడు కూడా మీ సేవ చేయడమే మా దీక్ష. కాగడా పట్టుకుని కల్లాకపటము లేకుండా సత్యాన్ని కనపరచటమే మా పని. జంకు గొంకూ లేకుండా జనవాణిని ప్రకటించటమే మా ఉద్యోగం.అన్ని రంగాలలోనూ ఆంధ్రుల పురోగమనానికి పాటుపడటమే మా సూత్రం". 1949 ఫిబ్రవరి 2 వ తేదీన వెలువడిన తొలి సంచిక సంపాదకీయం ఈ మాటలతో ప్రారంభమైంది."

**– యార్లగడ్డ బాలగంగాధరరావు.**

* * *


# చదువు

"కాకినాడ దగ్గర ఓ పల్లెటూరులో జన్మించిన మల్లాది సత్యలింగ నాయకర్ చిన్నతనంలో ఓడ కళాసీగా జీవికను మొదలుపెట్టి ఎన్నో ఓడలకు యజమాని అయినాడు. బర్మా మొదలైన ప్రదేశాలకు ఓడలు నడిపి చాల డబ్బు సంపాదించాడు. అయితే ఆయన తాను చిన్నతనంలో చదువుకోలేదే, చదువు వచ్చిఉంటే ఎంత బావుండేది అన్న తపనతో పాఠశాలలు స్థాపించటానికి, పాఠశాలల్లో చదువుకునే బీద విద్యార్థులు ఆ చదువు ఆగకుండా సాగించడానికి చాలా డబ్బు దానంగా ఇచ్చి, తన తర్వాత కూడా తన దానధర్మాల నిర్వాహకులు తను కోరిన విధంగా తన డబ్బు వినియోగపరచే ఏర్పాటు చేశాడు. ఆ విధంగా ఆయన ఏర్పాటు చేసిన ఉపకారవేతనం పొందిన విద్యార్థులలో ఒకరు అటు తర్వాత స్వతంత్ర భారతదేశపు రిజర్వు బ్యాంక్‌కు గవర్నరు కాగలిగాడు. ఇంకా ఎందరో గొప్పగొప్ప స్థాయిలకు ఎదగగలిగారు."

**– కోనేరు నారాయణరావు**

* * *

# తల్లి వడి



సంజీవదేవ్

"ఇంతవరకు నాకు తెలుగు సాహిత్యంతోను, తెలుగు సాహితీజీవులతోను పరిచయం లేదు. అది భావ కవిత్వపు యుగం. తెలుగు పత్రికలను, ప్రత్యేకించి తెలుగు మాసపత్రికలను చదవడం ప్రారంభించాను.

తల్లావజ్ఝలవారు, దేవులపల్లివారు, రాయప్రోలువారు, కాటూరువారు మొదలైన కవుల పేర్లు వినిపిస్తూ వుండేవి. బెంగాలీ,

హిందీ, ఇంగ్లీషు మొదలైన భాషల సాహిత్యం చదివి వున్న మనసుకు మాతృభాషలో సాహిత్యాన్ని చదువుతుంటే తల్లి ఒడిలో తలదాచుకున్నంత హాయి కలగసాగింది.

ఇటువంటి మృదుమధురమైన సాహితిని సృష్టించే తెలుగు సాహితీపరులు ఏ విధంగా వుంటారో, వారు ఏమి తిని ఆకలి బావుకుంటారో, ఏమి త్రాగి దప్పికను తీర్చుకుంటారో, ఎటువంటి నోటితో మాట్లాడుతారో అనే కుతూహలం ఎక్కువ కాసాగింది. ఇటువంటి తరుణంలో మధురకవి, వివిధ భాషలతో పరిచయం గల సహృదయులు, పండితులు తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి గారితో పరిచయం ఏర్పడింది.”

– **సంజీవదేవ్.** (తెగిన జ్ఞాపకాలు)

*　　*　　*

# అపప్రద

“నేను తాగుతాను. పని చెయ్యను అని నా మీద ఒక వాదు ఉంది. ఇది సగం మాత్రమే నిజం. ఇలాంటి అర్థసత్యాలు నా గురించి ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. ఔను నేను తాగుతాను. కాని తాగినప్పుడు పని చెయ్యను. పని చేసేటప్పుడు తాగను.”

– **శ్రీశ్రీ.** (అనంతం)

*　　*　　*

# చిన్ననాటి ముచ్చట్లు



కె.ఎన్.కేసరి

“కె.ఎన్. కేసరిది ఒంగోలు దగ్గర చిన్న పల్లెటూరు. చిన్నతనంలోనే ఆయన తండ్రి చనిపోవడం వల్ల, ఆదుకునే బంధుబలగం ఎవ్వరూ లేకపోవటం వల్ల చేతినిండా ముద్ద చేసి తినడానికి కూడా లేని పరిస్థితి. తల్లికి ఒక్కగానొక్క కొడుకు. ఆ పిల్లవాడికి కడుపు నిండా అన్నం పెట్టుకునే అదృష్టం కూడా తనకు లేదు. తొమ్మిది, పదేళ్ళు వచ్చిన తరువాత చుట్టుప్రక్కల దగ్గర దగ్గర పల్లెటూళ్ళకు వెళ్ళి, పెట్టగలిగిన వారి దగ్గర ఆ యా ధాన్యాలు యాయవారం చేసి తెచ్చేవాడు పిల్లవాడు. తల్లిని సంతోషపెడదామని పిల్లవాడు చాలా ఎండ పొద్దు ఎక్కు వరకూ ఇంకా రెండు మూడు ఊళ్ళు కూడ ఎక్కువ తిరిగి, రకరకాల ధాన్యపు మూటలు ఒక్కటిగా కట్టి, మోయలేని బరువుతో రెండు జాముల వేళ ఇంటికి తెచ్చాడు. అమ్మ ఎంతో ఆనంద పడుతుంది అనుకున్నాడు అమాయకుడు. అమ్మ పొయ్యిలో పిల్లిని లేపుతుండగానే అలసి అలసి తిరిగి తిరిగి ఎండలో పడి వచ్చిన పిల్లవాడికి

ఆపలేని నిద్ర వచ్చింది. సొమ్మసిల్లినట్లు నిద్రపోయినాడు. కాసేపటికి నిద్ర మెలకువ రాగా చూస్తే తల్లి తన కాళ్ళ దగ్గర కూచుని కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నది. ఆ పిల్లవాడికి అమ్మ ఎందుకు కళ్ళనీళ్లు పెట్టుకుంటున్నదీ తెలియలేదు. ఆ పిల్లవాడి కాళ్ళ నిండా పల్లేరు ముళ్ళు విరిగి ఉన్నాయి. అవి చూసి ఆ తల్లి కడుపు చెరువైంది. 'ఇవాళ చాలా పెద్దమూట తెచ్చాను' అన్నాడు పిల్లవాడు. ఆమె కళ్ళు కాల్వలైనాయి. 'నాయనా! ఇక నీవు ఈ విధంగా యాచనకు వెళ్ళవద్దు' అని ఆమె బావురుమంది. ఆ పిల్లవాడు ఆలోచించాడు. ఒంగోలు నుండి మద్రాసుకు కాలినడకన ప్రయాణమైనాడు. మద్రాసు నగరంలో వీధి కొళాయిల దగ్గర మంచినీళ్ళూ, ఎవరైన కాణి, అర్ధణా ఇస్తే దానితో ఏదైనా కొనుక్కొని కడుపు నింపుకోవటం కొన్నాళ్ళు సాగింది. తర్వాత మందులు తయారుచేసే ఒక కంపెనీలో కల్వంలో మందులు నూరే బాలుడుగా కుదురుకుని, తీరికవేళల్లో పాఠశాలలో చదువుకుని పెద్దవాడైనాడు. ఆయనే స్వయంగా తరువాత మందులు తయారు చేసే సంస్థను స్థాపించాడు. ఉన్నత పాఠశాలను నిర్మించాడు. గృహలక్ష్మి పత్రికను నిర్వహించాడు. రచయిత్రులకు స్వర్ణకంకణం బహుమతులు ఏర్పాటు చేశాడు. ఈ మహనీయుడు 'చిన్ననాటి ముచ్చట్లు' పేరుతో స్వీయచరిత్ర ప్రకటించాడు. ఆయనే కోట నరకేసరి."

❋ ❋ ❋

# గురువును మించిన శిష్యులు


పింగళి

"పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వవిద్యాలయమున తెలుగు శాఖకు అధ్యక్షులుగా నియమింపబడిన సందర్భంలో 1932 సెప్టెంబరులో బందరు పౌరులు బుట్టాయిపేట హాలులో సన్మానం చేశారు. ఆ సభాధ్యక్షులుగా గురుదేవులు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు విచ్చేశారు.

లక్ష్మీకాంతంగారు సౌందరనందంలోని రసవద్ఘట్టాలను చదివి వినిపించారు. శ్రీ శాస్త్రిగారు ఆ స్వీయ కవిత వింటూ, 'నాకంటె నా శిష్యులు రసవత్తరంగా కవిత చెప్పగలవారనడానికి సౌందరనందము ఒక గీటురాయి కాగలదని' అన్నారు. 'పొడుం కాయ మీద దశావతారాలు అన్నట్లు ఈ బౌద్ధగాథ యింత రసవంతంగా సృష్టించారంటే, పాత రామన్న పేటకు కొొక్కు పెట్టారన్నమాట' అన్నారు."

– గూడూరి నమశ్శివాయ

❋ ❋ ❋

# విహారిబాబు

"మా వదినకు సాహిత్యాభిరుచి హెచ్చు. ఎలాగో కాలం వెళ్ళబుచ్చడానికి మాత్రమే ఆమె గ్రంథాలు చదవదు. ఆమె చదివిన బెంగాలీ గ్రంథాలతో ఆమె మనసు నిండిపోయింది. ఆమె సాహిత్య కృషిలో నేను భాగస్వామిని. 'స్వప్నయాత్ర' అంటే చెవి కోసుకునేది. నేనూ అంతే. ఆ కావ్యం సృజింపబడిన వాతావరణంలోనే నేను పెరగడం చేత దాని రమణీయత, నా హృదయ తంత్రులలో పెనవేసుకుంది. అదృష్టవశాత్తూ అనుకరణ నా శక్తికి మించిన పని. అందువల్ల అనుకరించాలనే ఊహయే నాలో జనించలేదు.

ఈ సమయంలోనే విహారిలాల్ చక్రవర్తి రచించిన 'శారద మంగళ్' అనే గీత సముచ్ఛయాన్ని ఆర్యదర్శన్ అనే పత్రికలో వరుసగా ప్రకటిస్తున్నారు. ఈ భావగీతాలలోని మాధుర్యం మా వదినను ఆకర్షించింది. వాటిలో చాలా పాటలు ఆమెకు కంఠతా వచ్చు. ఆమె ఆ కవిని తరచు మా ఇంటికి ఆహ్వానిస్తూండేది. అతనితో స్నేహం కలగడానికి నాకు ఆ విధంగా అవకాశం చిక్కింది. అతనికి నా మీద ఎంతో వాత్సల్యం కలిగింది. ఎప్పుడుపడితే అప్పుడు నేను వారి ఇంటికి వెళుతుండేవాడిని. ఆయన శరీరం ఎంత పెద్దదో, హృదయం కూడా అంత గొప్పది. కవితా తారలాగ దేదీప్యమానమైన కల్పనా వలయం అతని చుట్టూ కానవచ్చేది. యదార్థ కవితానందంలో అతను మునిగి తెలుతూ ఉండేవాడు. అతని ఇంటికి వెళ్ళినప్పుడు నేనూ ఆ ఆనందంలో పాలు పంచుకునేవాడిని. కవితావేశంలో మునిగి చుట్టూ ప్రపంచాన్ని మరచి పద్యాలు చదివి వినిపించేవాడు. పాటలు పాడి వినిపించేవాడు. అతని గొంతు సంగీతానికి అనువైనది కాకపోయినా అపశృతి గొంతు కాదు.

అతనికి వాల్మీకి, కాళిదాసు అంటే మహాఇష్టం. ఒకసారి కాళిదాసు హిమాలయ వర్ణనను చదివి వినిపించాడు. "ఇందులో వరుసగా 'అ'కారం ప్రయోగించడం ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. హిమాలయ మహత్తర విస్తీర్ణతను గుర్తించడానికి సహాయకారిగా 'దేవాత్మ' నుండి 'నగాధిరాజు' వరకు ఈ 'అ' కారాన్ని బుద్ధిపూర్వకంగా ప్రయోగించాడు" అన్నాడు.

ఆ కాలంలో విహారిబాబులా కవిని కావాలనేది నా ఆశయం. అతని లాగానే వ్రాస్తున్నానని నమ్మకం నాకు కలిగేటట్లు చూసుకునేవాడినే కాని, అతని కవిత్వాన్ని ఆరాధించే మా వదిన అడ్డు వచ్చింది. కవితాకీర్తి కోసం ప్రాకులాడే అసమర్థులు అవహేళన పాలవుతారనే సంస్కృత సూక్తిని నాకు జ్ఞాపకం చేస్తుండేది. నా అహంకారానిదే పైచేయి అయితే తర్వాత దానిని అదుపులోకి తీసుకురావడం దుర్లభం అని ఆమెకు తెలిసి ఉండవచ్చు. అందుచేత నా కవన శక్తిని గాని, గానశక్తిని గాని పొగిడేది కాదు. నా ముందు ఇతరులను పొగిడే అవకాశాన్ని జారవిడిచేది కాదు. క్రమంగా నా గొంతులోని లోటు గుర్తించగలిగాను. నా కవనశక్తిలో నాకు అనుమానం ఆవహించేది. నా ఆత్మగౌరవం నిలుపుకోవడానికి అవకాశం ఇచ్చింది వంగసాహిత్య రంగం

ఒక్కటే. కాబట్టి ఇతరుల అభిప్రాయాల మూలంగా నా ఆశను వదులుకునే వాడిని కాని, నాలోని నిరంతర ఆవేశం పెచ్చు పెరిగింది. నా కవితాకృషిని ఆపివేయడం ఎవరి తరమూ కాలేదు."

**– రవీంద్రనాథ్ ఠాగూర్.** (నా జీవితస్మృతులు)

❋ ❋ ❋

# చిరుగీతి



**బసవరాజు**

"ఆ రోజుల్లో నండూరి గొంతు కొండవాగు. గలగలలూ గంతులూ, సుడులూ వడులూ– ఒక చోట పుట్టి ఒక దారిని సాగి ప్రవహించి, ఒక చోట కలిసిపోయేది.

సుబ్బారావు పాట నిభృత సుందరం. అప్పారావు పాట నిసర్గ మనోహరం. బసవరాజు పాటలో శక్తి వేరు – అతను నిట్టూర్పు, అతని కావ్యం నిట్టూర్పు, అతని పాట కూడా వేడివేడి నిట్టూర్పు.

కంఠం త్రుంపి, త్రుంపి నాలుగుసార్లు మ్రోగించేవాడు తునకలు తునకలుగా. అది మమ్మల్ని పిలిచి పిలిచి, దగ్గరగా వచ్చి వచ్చి మా గుండెలలోనికి ఒదిగి ఒదిగి, తలనక్కడ ఆనించి ఒక్కొక్కప్పుడు కుమిలి కుమిలి, ఒక్కొక్కప్పుడు వెక్కివెక్కి ఏడుస్తూ కష్టసుఖాలు చెప్పుకునేది. అతని పాటకు నెత్తురు జీర అంటుకున్నట్లుండేది, బ్రతుకులో నుంచి బ్రద్దలు చేసుకుని ఒరుసుకుని వచ్చినప్పుడు అంటుకున్నట్టు.

ఆ వేగమే, వేదనే అతని కవిత్వానికి ప్రాణం.

కాస్త గాలి కదిలితే, తగిలితే, ఒక్కొక్క ఆకే కదిలి, అన్ని ఆకులూ కలిసి, అంతా నిలువునా ఒక పాటయైన రావిచెట్టులాగ ఉండేవాడు బసవరాజు.

అందుకే ముప్పయి తొమ్మిదేళ్ళలో నూరేళ్ళ బ్రతుకు అతనికి క్రిక్కిరిసిపోయింది. సుఖాలు, దుఃఖాలూ, రాగద్వేషాలూ, ఆలింగనాలూ, అసూయలూ, శిఖరాలూ, అగాధాలూనూ – ఇంత అనుభూతి వస్తే, ఇంత చిరుగీతి."

**– దేవులపల్లి కృష్ణశాస్త్రి.**

❋ ❋ ❋

# స్రవంతి

"చార్మినార్ మీద ఎగిరే పావురాలు శాంతి పతాకాలై కనిపించేవి. బాగ్‌ఆం (పబ్లిక్ గార్డెన్స్) లో పచ్చని గడ్డి మీద పాదాలు మోపితే చిరకాల రోగులు ఆరోగ్యవంతులయ్యేవారు. 'సవ్వారా' ల్లోని జలకణాలు తలల మీద చల్లదనాలను చల్లేవి.



దాశరథి

ఒక రూపాయితో కడుపునిండా భోజనం చేసేవారు నగరానికి వచ్చిన యాత్రికులు. గరం గరం పుల్కాలు, పాలక్‌కీ భాజి, లస్సీ, పావలా ఇస్తే పదిమైళ్ళు తీసుకువెళ్ళేవాడు రిక్షావాడు. రోజూ కవి సమ్మేళనాలు, ముషాయిరాలు, ఖవ్వాలీలు, సంగీత కచేరీలు, ముఖ్దూం మనోహర కవితలు, భవానీప్రసాద్ మిశ్రా భావబంధుర హిందీ గీతాలు, శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయంలో విశ్వనాథ, నాయని, నండూరి, నారాయణరెడ్డి కవితాగానాలు; డా॥ పీశుపాటి వెంకటరమణయ్య గారి ఇంట్లో విందులు, తెలంగాణా రచయితల సంఘ వార్షికోత్సవాలు, కళకళలాడే ప్రతాప్ గిర్జీ కోఠీ సభలు, సమావేశాలు.

ఆబిడ్స్ ఆ రోజుల్లో అందాల బృందావనంలా వుండేది. మల్‌మల్ పట్టాలు గాలికి ఎగిరిపోతుంటే, పొంగిన వక్షోజాలతో నవయువతులు శృంగారం ఒలకబోస్తూ హంస గమనాలతో తిరగడం, చలనచిత్రశాలల వద్ద చలించిన హృదయాలతో యువతీయువకులు గుమికూడటం, చల్లని సాయంత్రాలు, మత్తెక్కిన మధుర రాత్రులు, హైదరాబాదు గజ్జె కట్టిన గజల్‌లా కనిపించేది. గుండెల్లో చల్లదనాన్ని గుమ్మరించే గండిపేట చెరువు, భాగ్యనగరాన్ని ముద్దుపెట్టుకోవడానికి నేలకు వాలే నీలిమేఘాలు, చిరుజల్లులు, వెన్నెల రాత్రులు.

అవీ 'స్రవంతి' పుట్టిన రోజులు. నేడు కాలం మారినా, ఎందరో అప్పటివారు ఈ లోకం విడిచిపోయినా, 'స్రవంతి' నిరంతరాయంగా ప్రవహిస్తున్నది.

స్రవంతి రజత జయంతినాడు ప్రశాంత హృదయంతో గతాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాను."

**– దాశరథి.**

*　　　*　　　*

# అన్నయ్య

"మా అన్నయ్య కల్లాకపటం ఎరుగనివాడు. స్నేహం అంటే ప్రాణం ఇచ్చేవాడు. అతడికి వేల సంఖ్యలో మిత్రులున్నారు. మా అన్నయ్య మానవతా మూర్తి. ఆయన మనసులో, కళ్ళలో, కవితలో, హృదయంలో మానవత నిండి నిబిడీకృతం అయివుంది. మా అన్నయ్య నిజమైన కవి. ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా స్పందించేవాడు. దాన్ని కవితామయం చేసేవాడు. మా అన్నయ్య గొప్ప వక్త. సభలలో గంటల తరబడి అనర్గళంగా ఉపన్యసించేవాడు. ఉత్తరాలు వ్రాయడంలో మా అన్నయ్యను మించినవాడు వున్నాడనుకోను. ఎవరు ఉత్తరం రాసినా వెంటనే జవాబు రాసేవాడు. మా అన్నయ్య హెచ్చుతగ్గులు ఎరుగడు. ప్రధానితోనూ, పసిపాపతోనూ


ఒకేరకంగా మాట్లాడేవాడు. మా అన్నయ్య మహామానవతావాద కవి. అతని కవితలు అగ్గి కురిపించగలవు. పూలవాన రాల్చగలవు. అతడు అన్యాయానికి శత్రువు. అందానికి మిత్రుడు. అతనిలో లావాను చూడవచ్చు, ఇంద్రధనస్సు అవలోకించవచ్చు.

మా అన్నయ్య మృత్యువును గెలిచిన మహాయోధుడు. అతడు అగ్నిధారలో వున్నాడు. రుద్రవీణలో వున్నాడు. తిమిరంలో సమరంలో వున్నాడు. గాలిబ్ గీతాల్లో వున్నాడు. మిత్రుల మనస్సుల్లో వున్నాడు. మా అన్నయ్య వున్నాడు, ఉంటాడు. వుండి తీరుతాడు."

– దాశరథి రంగాచార్య

❋ ❋ ❋

# ఒకడు బైరాగి



బైరాగి

"దాదాపు పాతికేళ్ళ క్రితం – నా మనస్సు చాలా ఉల్లాసంగా ఉండేది ఆ రోజులలో, నా కూతురు వెళ్లిపోలేదు. పద్మరాజు మా ఇంట్లోనే కాపురం అప్పుడు. నా కాటూరి బావ, శివశంకరులు అందరూ నన్ను వదలలేక, నాతోనే వుండేవారు త్యాగరాజనగరం హబీబుల్లా రోడ్డులో సిమ్లాహౌస్‌లో.

సిమ్లాహౌసు చాలా పెద్దది. తెరిచి ఉన్న ఏ కిటికీ నుంచో చల్లగాలి కెరటాలు వీస్తూ – ప్రతి గాలికెరటం మా కవి మిత్రులతో కలిసి ఏదో మాట్లాడేది.

ఒకనాడు మాకుగాని, ఆ గాలులకుగాని తెలియకుండానే మరొక వింత గాలికెరటం చల్లగా లోపలికి పాత స్నేహితుళ్ళాగా వచ్చింది.

ఆ రావటం కూడా భోజనాల గదిలోకే నేరుగా. అక్కడ సొంత యింట్లోలాగా కూర్చుని "ఊ" అంది – పోనీమన్నాడు – 'వడ్డించండి' అన్నట్లు! మాతో హాయిగా కబుర్లు చెప్తూ భోజనం చేశాడు.

అక్కడ వున్న మిత్రులందరూ పరమాప్తులు చిరకాలం నుంచీ, అయినా అతిథులు!

ఈ వచ్చిన గాలికెరటం – ఈయన ఇంట్లో వాడాయెను – బైరాగి.

బైరాగి అరేబియా వాని ఒంటె – మన హృదయంలో మూతి పెట్టడంతో ప్రారంభించి, మనిషంతా దూరిపోయి నిండిపోతాడు. మనలో నుంచి మనల్నే బైటికి తోసేసి – అంటే 'తన తనం' అంతా తోసేసి.

బైరాగి మన కవులు – వ్రేళ్ళ మీద లెక్కపెట్టదగిన బహుకొద్ది మందిలో ఒకడు బైరాగి!

అప్పుడు నా యింట్లోకి వచ్చీపోయే చల్లగాలి కెరటంలానే, ఈ లోకమూ విడిచి వెళ్ళిపోయావా!


వస్తానుండు.”

– కృష్ణశాస్త్రి.

(కవిగా బైరాగి పట్లగల అభిమానంతో 'ఆలూరి బైరాగి సంస్మరణ సంచిక' ప్రచురణకు ఆధ్వర్యం వహించిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు – సంచికకు 1980 ఫిబ్రవరి 23 న వ్రాసిన ఈ వ్యాసమే వారి కడపటి రచన అయింది)

* * *

# అర్థంకాని విశ్వనాథ



మల్లంపల్లి

“ 'వానమామలై' మణిమాల కు పీఠిక రాసినపుడు విశ్వనాథ 'తెలంగాణాకు చెందిన కవులలో ఇతను ప్రసిద్ధుడు' అని రాసిండు. అంటే తెలంగాణా కవులు వేరూ, ఆంధ్రకవులు వేరు అన్నమాట. వాళ్ళ స్టాండర్డ్ వేరూ, వీళ్ళ స్టాండర్డ్ వేరూ అన్నమాట. ఇదీ విశ్వనాథ లాంటి పెద్దల దృష్టి.

విశ్వనాథ తన 'ఆంధ్రప్రశస్తి' మల్లంపల్లి సోమశేఖర శర్మగారికి అంకితమిస్తూ – 'డిగ్రీలు' లేని పాండిత్యంబు వన్నెకు రాని యీ పాడు కాలాన బుట్టినట్టి మహానుభావుడికి అన్నాడు. మరి 'పులుల సత్యాగ్రహం' లోనో ఏమో కొందరు చరిత్ర పరిశోధనలు చేస్తుంటరు. మాకు తెలిసిన వాడొకడున్నాడు. వాడు మెట్రికో, ఇంటరో పాసయిండో, ఫెయిలయిండో! ఆ చదువు వరకే అతని అరెకరమో ఏమో భూమి అయిపోయింది. తరువాత ఉద్యోగం దొరకలేదు. ఏం చేయాలో తోచక చరిత్ర పరిశోధన మొదలుపెట్టిండు. ఆయన మహాపండితుడు. 'చరిత్ర పరిశోధకుడు' అని పెద్దపేరు సంపాదించిండు అని రాశిండు విశ్వనాథ. మల్లంపల్లి మీద విసుర్లన్న మాట! వెక్కిరింపు.

తెలుగు గ్లోసరీ కమిటీలో నేనూ, విశ్వనాథ, మల్లంపల్లి, దిగవల్లి వెంకట శివరావుగారు మూడేండ్లు కలిసి పని చేసినం. అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షుడు. మాడపాటి హనుమంతరావుగారూ, రావి నారాయణరెడ్డి వగైరా చాలామంది సభ్యులుండేటోళ్ళు ఆ కమిటీలో.

రామరాజు ఇంట్లో రాఘునాథ చక్రవర్తి అనే సంస్కృత పండితుడుండేటోడు. ఆయన క్కూడా విశ్వనాథ ఒక పుస్తకం అంకితం ఇచ్చిండు – శశిదూతం కావచ్చు. ఆయన పెద్దాడ అగ్రహారీకుడు. విచిత్రమైన వ్యక్తి. ఆయన రామరాజు ఇంట్లో వుంటే, నేను అక్కడే వుండేది. ఏ భాషలోనూ సమగ్రమైన పరిజ్ఞానం లేని నేనూ, మహాపండితులైన రఘునాథ చక్రవర్తి సన్నిహితులం!

గ్లోసరీ కమిటీ మీటింగుకు వచ్చినపుడు విశ్వనాధకి చెప్పిన, రఘునాధ చక్రవర్తి ఇక్కడనే వున్నరని. పోయి కలుద్దమన్నడు. నా బండిలోనే పోతున్నం. దారిలో మల్లంపల్లి వారిని ఆయన బసలో వదిలి పెట్టి పోతుంటే ఆయన ప్రస్తావన వచ్చింది. 'ఆయన కథలూ, నవలలూ చదవడంతోనే నా పతనం ప్రారంభమయింది' అంటూ మల్లంపల్లిని విశ్వనాథ పొగడుతున్నాడు. రామరాజు ఇంటికి పోంగనే పుస్తకం దొరికింది. తీసి చూపించి "ఏమండీ విశ్వనాథగారూ! మీరు ఇందులో మల్లంపల్లిని వెక్కిరిస్తూ రాసిన్రు. మరి ఆయనకి అంకితం ఇస్తూ ఎంతో మెచ్చుకున్నారు. ఇప్పుడు పొగుడుతున్నారు. ఏంటీ దీని అంతరార్థం ?" అన్న. "రామ రామ! అయన్ని వెక్కిరిస్తనా నేను!" అన్నడు. "మరి ప్రసిద్ధి చెందిన చరిత్రకారుడెవరు ? బీదవాడెవరు ? ఈ వర్ణన ఎవరికి సరిపోతుంది ? పొగుడుతూ పద్యాలు అప్పుడెట్ల రాసిన్రు ? తర్వాత అట్లెట్ల రాసిన్రు ? అప్పుడు సిన్సియరా ? ఇప్పుడిన్సిసియరా ? మీ అసలు అభిప్రాయం ఏది ?" అని అడిగిన. "లేదు లేదు మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు." అన్నడు.

"నేను తప్పుగా అర్థం చేసుకున్న గనకనే మిమ్మల్ని అడుగుతున్న. అది చదివిన వాండ్లకి మల్లంపల్లి స్ఫురిస్తడు కదా! నేనా పుస్తకం ఈ మధ్యనే చదివిన. మన ముగ్గురం యిప్పుడు తటస్థపడ్డం వల్ల మిమ్మల్ని అడగగల్గుతున్నా గాని, ఏ పాఠకుడొచ్చి మిమ్మల్ని అడుగుతడు ? నా జీవితంలో మన సమాజం లోపట వుండే వ్యక్తినే దృష్టిలో పెట్టుకుని రాస్తనని మీరు ఎన్నోసార్లు ఉపన్యాసాలిచ్చిన్రు. వేయిపడగలులోని కిరీటి మొదలైన పాత్రలు నాయని సుబ్బారావు, కృష్ణశాస్త్రి యింకవరెవరో నిజ జీవితంలో మనుషులకు ప్రతీకలని చెప్తిరి. అందుకోసమే అడుగుతున్న - మరి ఈ వ్యక్తి ఎవరు ? సోమశేఖరశర్మగారు కాకపోతే మరింకెవరు ?" అని సూటిగ నిలదీసిన.

"మీ చిత్త వృత్తికే అట్లనిపిస్తుంది. శర్మగారి విషయంల ఆదరము, సద్భావము తప్ప నాకు వేరే దృష్టి లేదు. అట్లనుకుంటే నేనూ మెట్రిక్యులేషనే కదా! నేనాయన్ని ఎల్లా ఎగతాళి చేస్త ? నా రంగంలో నాక్కావలసిన పేరొచ్చేసింది గనక ఆయన్ని ఎగతాళి చేసి నేను పేరు తెచ్చుకోవలసిన పని లేదు. మీ ఆలోచనల్లోనే వక్రత వున్నది' అని తీవ్రంగ అన్నడు. 'విశ్వనాథ స్ప్లిట్ పర్సనాలిటీ (ద్వంద్వ ప్రవృత్తి) మన అంచనాకి తట్టనిది' అని నేను మాత్రం తేల్చుకున్నా సుమా!"

**- కాళోజీ.** (ఇదీ నా గొడవ)

* * *

# అంతర్జాతీయ గీతం


"1934 సెప్టెంబరులో పుచ్చలపల్లి సుందరయ్యగారు వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో కలసి కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. పార్టీ అన్నాక దానికి ఒక జెండా, ఒక ప్రత్యేక గీతం ఉంటాయి. ఏ దేశములో ఉన్న శ్రమజీవులకైనా ఎర్రజెండానే బావుటా. ఇక పాట విషయానికి వస్తే వెంకట పార్వతీశ కవులలో ఒకరైన బాలాంత్రపు వెంకటరావు గారి

కుమారులు బాలాంత్రపు నళినీకాంతరావుగారు, సుందరయ్యగారి ప్రేరణతో – పారిస్ విప్లవ కాలంలో 'యూజివ్ పాటియర్' రచించిన అంతర్జాతీయ గీతం ఆంగ్లానువాదాన్ని "ఆకలి మంటచే మలమలమాడే అనాధులంతా లేవండోయ్" అంటూ తెనిగించారు."

**– వాసిరెడ్డి సత్యనారాయణ**

❋ ❋ ❋

# కవితా తపస్వి



తుమ్మల

"1949 మార్చిలో నిడుబ్రోలులో అభినవ తిక్కన బిరుదాంకితులు తుమ్మల సీతారామమూర్తి గారికి గజారోహణము, కనకాభిషేకము, సన్మానము జరిగింది. ఆ సమావేశానికి కట్టమంచి రామలింగారెడ్డిగారు అధ్యక్షులుగా రావలసి యున్నది. అనారోగ్య కారణాన వారు రాలేక పింగళి లక్ష్మీకాంతం గారిని పంపించారు. లక్ష్మీకాంతం గారు బెజవాడలో దిగి మా ఇంటికి రాగా – నేనూ, ఆయన కలసి బయలుదేరి సభకు వెళ్ళినాము. వేలాది ప్రజలు ఆ సభకు విచ్చేశారు. ఆ సభను ఎంతో రాజఠీవితో నిర్వహించారు లక్ష్మీకాంతం గారు. ముక్త్యాల కుమారరాజాగారు శ్రీ రాజా వాసిరెడ్డి శ్రీరామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్ బహద్దర్‌గారు సభను ప్రారంభించారు. ఆ రోజు ఉదయం గజారోహణ మహోత్సవం జరిపించారు. రైతు నాయకుడు ప్రొఫెసరు ఎన్.జి. రంగాగారు కనకాభిషేకం చేశారు.

తరువాత కృష్ణశాస్త్రిగారు ప్రసంగించారు. రాజకీయ నాయకులు, సాహిత్య విషయాలలో కల్పించుకు వచ్చి ఎలా కలుషితం చేస్తున్నారో దులిపి వదిలి పెట్టారు. బందరులో ఆంధ్రాబ్యాంకు రజతోత్సవ సందర్భంలో డాక్టర్ పట్టాభిగారు కవులను విమర్శిస్తూ మాట్లాడారు – నట విట కవి గాయకులెల్లరూ క్షేమమాయని ప్రశ్నించారు. అది మనసులో పెట్టుకున్నారు కృష్ణశాస్త్రిగారు.

లక్ష్మీకాంతంగారు మాట్లాడుతూ "తుమ్మల సీతారామమూర్తి గారి ఈ సన్మాన సభకు రామలింగారెడ్డిగారు అధ్యక్షులు. అధ్యక్షోపన్యాసమును వ్రాసి సంఘము వారికి పంపిన తరువాత అనారోగ్యముపాలై, తమ కర్తవ్యమును నిర్వహింప నన్ను కోరిరి. వల్లె యంటిని. ఆ ఉపన్యాసమును ఇప్పుడు చదివితిని. మరియు నా మాటలు కొన్ని వినిపించెద – ఒకనాడు రెడ్డిగారింటికి వెళ్ళగా "లక్ష్మీకాంతమా! నిన్న నాకొక గొప్ప రచన వచ్చినది. అది మన ప్రాచీన మహాకవుల రచనను జ్ఞప్తికి తెచ్చినది" అనిరి. వెంటనే నేను "సీతారామమూర్తిగారు పద్యములలో వ్రాసిన గాంధీ ఆత్మకథయా" అంటిని. వెంటనే వారు "సెబాస్ మంచి పల్కు పల్కితివి. నీకునూ ఆ కావ్యము నచ్చినదా! చౌదరి కవితలో చాలా దిట్టగా ఉన్నాడు. ఇతనికి మనము తగు ప్రోత్సాహము నీయవలయును అనిరి. తరువాత ఆ కృతి మన యం.ఎ., విద్యార్థులకు పాఠమయ్యెను.

మద్రాసు యూనివర్శిటీ యందును దానికట్టి గౌరవము లభించుటకు నాకున్న అవకాశము నుపయోగించితిని. ఇందు నా గొప్పతనము ఏమీయు లేదు. తుమ్మలవారి నుడికారము నందలి గొప్పతనమే యిట్లు రాణించినది. సీతారామమూర్తి గట్టిగా చదివిన కవి. చక్కగా చిక్కగా వ్రాయగలడు. తిన్నగా బ్రతకగలడు. తెలుగువారు నేడీ కవితా తపస్విని సన్మానించి ధన్యులైరి" అన్నారు.

తరువాత విశ్వనాథవారు "తుమ్మల్లో ప్రొద్దు పొడిచింది" అంటూ ప్రారంభించిన ప్రసంగము చాలా మందికి కోపకారణమైంది. కాటూరి వెంకటేశ్వరరావు గారు దర్పంగా పద్యాలు చదివారు.

తరువాత లక్ష్మీకాంతం గారినీ, నన్ను పాత పొన్నూరులో ఉన్న కృష్ణశాస్త్రిగారి బసకు తీసుకువెళ్ళారు. అక్కడ వెంకటేశ్వరరావుగారు, కృష్ణశాస్త్రిగారు కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎవరో గుర్తులేదు కాని లక్ష్మీకాంతం గారితో "వెంకటేశ్వరరావు గారు మీకు విడాకులిచ్చి కృష్ణశాస్త్రిగారిని చేపట్టినట్లున్నదే" అని అడిగారు. "ఆ ప్రశ్నకు సమాధానం చెప్పవలసింది నేను కాదు, వెంకటేశ్వరరావు గారినే అడగండి" అన్నారు లక్ష్మీకాంతంగారు. అంతా నవ్వుకొన్నాము.

**– గూడూరి నమశ్శివాయ**

* * *

# బహుమతి

" 'నారాయణరావు' 'వేయిపడగలు' నవలల బహుమతుల నిర్ణయాన్ని గురించీ, తిక్కన చిత్ర బహూకరణ విషయంలోను ఆనాటి పత్రికలలో చాలా విమర్శలు చెలరేగాయి. పింగళి లక్ష్మీకాంతంగారు విమర్శలకు గురియైనారు. అలాంటి వాటికి ఎప్పుడూ చలించలేదు. గంభీరంగా పురోగమిస్తూండేవారు. ఎప్పుడైనా సన్నిహితులెవరైనా 'ఏమిటి మాస్టారూ! ఇదంతా ?' అని అడిగితే, 'అది అంతేనోయ్! లోకం సరిగా చూడలేదు, గుడ్డిది' అనే వారు అంతే! వేయిపడగలు – నారాయణరావు నవలల బహుమతి విషయంలో మా బాబాయి గూడూరి వియ్యన్నగారు ఒకసారి నిగ్గదీసి అడిగారు.

'వియన్నగారూ! మీరు కాబట్టి చెబుతున్నాను – సత్యం ఎవరికీ చెప్పకూడదని విషయం. కమిటీ సభ్యుల మందరమూ నారాయణరావు నవలకే బహుమతి ఇమ్మని సిఫార్సు చేశాము. ఒక్క జయపురం మహారాజా శ్రీ విక్రమదేవవర్మగారు మాత్రం వేయిపడగలకు ఇమ్మని సిఫార్సు చేశారు – 'అందు ప్రాచీన ధర్మములు, సంప్రదాయములు వివరించబడి వున్నాయి. దానికే బహుమతి ఇమ్మని నేను సిఫార్సు చేస్తున్నాను' అన్నారు. మిగతా సభ్యులందరూ నారాయణరావు నవలలో కూడా ప్రాచీన సంప్రదాయములున్నవి. నవలకు ఉండవలసిన ముఖ్య లక్షణములు

నారాయణరావులో మూర్తీభవించి ఉన్నాయి. అందుకని మేమందరము ఏకాభిప్రాయులమై నారాయణరావుకు బహుమతి ఇవ్వాలని సిఫార్సు చేశాము. అప్పుడు శ్రీ విక్రమదేవవర్మగారు రెంటికి చెరిసగము ఇమ్మని తుది పరిష్కారము చేశారు. ఇద్దరకూ ఇచ్చుటకు డబ్బు చాలదని అంటే మిగిలినది నేను ఇస్తానన్నారు. అందువల్ల రెంటికీ చెరిసగముగా ఇచ్చారని చెప్పారు."

**– గూడూరి నమశ్శివాయ**

*　　　*　　　*

# ఆరుద్ర



ఆరుద్ర

"నిలువుటద్దం సైజులో 'మహాప్రస్థానం' అచ్చు కావాలని శ్రీశ్రీ యింకా కలలు కంటుండగా పిఠాపురం నుంచి రాంషా సంపాదకులుగా కళాకేళి ప్రచురణగా 'త్వమేవాహం' అంతకుముందే అచ్చయిన సంగతి అక్కడే తెలిసి ఆశ్చర్యపోయాను. త్వమేవాహం వేసిన తరువాత సోమసుందర్ 'వజ్రాయుధం' ప్రచురించుకున్నారు. ఆనాటి అభ్యుదయ రచయితల ఆప్యాయతలు, మైత్రి అంత గాఢమైనవి. పుస్తక రూపంలో ప్రచురించిన తొలి తెలుగు అభ్యుదయ కావ్యం త్వమేవాహం అవుతుందో కాదో నాకు తెలియదు. ఇది పరిశోధకులు తేల్చాల్సిన విషయం. అయితే 1950 జూన్‌లో బందరు నుంచి నళినీమోహన్ శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గేయాన్ని పుస్తకంగా ప్రచురించే నాటికే అవి వేలాదిమందికి కంఠోపాఠం, వందలాది పత్రికలు పొందిన మహాకావ్యం అది.

ఆరుద్ర కవిత్వం, ఇతర రచనలు ఏది ఎక్కడ కనిపించినా చదవకుండా వదల్లేదు నేను. మా పెద తాతగారు (మాతామహులు) వఝుల చిన సీతారామస్వామి శాస్త్రులు గారి దగ్గరే విజయనగరంలో నా బాల్యం అంతా గడిచినప్పటికీ, వఝుల వారిని గురించి, ఆయన పాండిత్యం, రచనల గురించి ఆరుద్ర ఆంధ్రప్రభలో రాసినప్పుడే నాకు మా పెదతాతగారు బాగా అర్థమయ్యారు.

నాకు బాగా సన్నిహితంగా ఆరుద్ర గారితో పరిచయం విజయవాడలోనే. విశాలాంధ్ర ప్రచురణాలయం మేడమీద సాహిత్య సభలకు ఆయన పాల్గొన్నపుడు అనేక ప్రశ్నలు వేసి ఆరుద్రను ముఖాముఖీ చదవాలని ప్రయత్నించాను. ఆ తరువాత చైతన్యభారతి వార్షికోత్సవాలకు ఆయన వచ్చారు. డబ్బులు అట్టే మిగలలేదనీ, ఖర్చులకి ఇవ్వలేం, ఏమీ అనుకోవద్దని చెప్పడానికి నేను హోటల్‌కి వెళ్ళినప్పుడు ఆయన ఔదార్యం అర్థమైంది. అంతేకాదు శ్రీరంగం నారాయణబాబు కవిత్వం అంటే చాలు ఆరుద్రకి వొళ్ళు వశం తప్పిపోతుందని కూడా అప్పుడే నాకు అర్థమైంది.

'నడవండి నడవండి నా మీంచి నడవండి' అంటూ గడ్డిపరక మీద నారాయణబాబు గేయాన్ని నన్ను కూచోబెట్టి ఆరుద్ర ఎంత ఆవేశంతో వూగిపోతూ చదివింది నాకెప్పటికీ గుర్తుండిపోతుంది."

– మల్లిక్

* * *

## శ్రీశ్రీ కి ఆరుద్ర జాబు



శ్రీశ్రీ

17/98 గోడేవారి వీధి,
విశాఖపట్నం
5-11-1947.

శ్రీశ్రీగారూ,
మైడియర్ బాబాయ్!

ఇన్నాళ్ళూ ఉత్తరం రాయలేకపోయినందుకు ఇదీ జవాబు. నేను సురక్షితంగా ఉంటున్నాను. నాకు మద్రాసులో దొరికిన ఏడునెలల అనుభవాలూ ఎందుకూ లాభసాటివి కావని నాకు తెలిసే ఇక్కడికి వచ్చేశాను. నువ్వు సాంఘిక జీవితానికి అతీతుడవైపోయావు. అంటే ఎవరెన్ని అనుకున్నా లక్ష్యపెట్టవు. నేను ఇంకా తక్కినవాళ్ళకి భయపడే దశలోనే ఉన్నాను. నాకు సజావైన జీవితంలో ఆనందం ఉందన్న నమ్మకం ఇంకా పోలేదు. అందుకే నిన్ను విడిచిపెట్టి వచ్చేశాను.

నీకు డబ్బు లక్ష్యం లేదు (ఉందా ?). ఎంత డబ్బైనా నిముషంలో ఖర్చు పెట్టగలవు. నేను ఇంకా ఆ మాదిరి జీవితంలో నమ్మకం లేనివాణ్ణి. నువ్వు అందరి నోళ్ళలోనూ పడ్డా నాకు ఫరవాలేదు. నువ్వు వినాశనం దిక్కువైపు పోతున్నట్లు నీకు తెలుసు. నన్నూ లాక్కొనిపోతే నేను ఒప్పుకోను. అందుకే వచ్చేశాను. నువ్వు చేతులారా నీ నాశనాన్ని తయారు చేసుకొంటున్నావు. మహాకవులంతా ఇలా బతకాలనే అపోహ నీకు ఉంది. సరే నువ్వు కావాలని అందర్నీ షాకు చేస్తూ బ్రతుకు. నన్ను నా మానాన్ని బతకనీ. నేను కోనేటి రావుగానే బతుకుతాను. నేనుగా! నువ్వుగా! అరాజక జీవితాన్ని గడుపుతూ ఏవీ రాయకపోయినా రాసినా లోకానికి అక్కర్లేదు. ఒక శ్రీశ్రీ, ఒక ఆరుద్ర లేకపోతే ప్రపంచం చచ్చిపోదు. ఒక శ్రీశ్రీ, ఒక కోనేటిరావు అయినా లోకం సంతోషిస్తుంది. నువ్వు నా మాట విని మద్రాసు ఒదిలిపెట్టి ఏ బొంబాయిలోనో సజావుగా బతుకు. కాదంటావో మద్రాసులోనే ఇప్పటి మాదిరిగానే ఉండు. నాకేం. గానీ FOR THE LOVE OF MIKE LEAVE ME ALONE.

నేను మద్రాసు విడిచిపెట్టి వచ్చేస్తూంటే నువ్వు ఇచ్చిన సలహా నాకేం రుచించలేదు. ఉద్యోగం చెయ్యవద్దన్నావు. వీధులు తిరగమన్నావు. మళ్ళీ మద్రాసు రమ్మన్నావు. ఉద్యోగం చెయ్యకపోతే నా బాబెవడు తిండి పెడ్తాడు ? ఎన్నాళ్లు పెడ్తాడు ? నేను కథలు రాయకపోతేనేం. ఎన్నాళ్ళు దానధర్మాల మీద బతుకుతాం.

నన్ను కాలేజీలో చేర్పిస్తానన్నావు. డబ్బేదీ ? నీ ఆదాయం క్రమంగా ఉందీ! మన ఆరేడు నెలల ఉమ్మడి బతుకులో ఒక్కనాడు మనం ఆనందంగా ఉన్నాం! ఒక్కనాడు మరి రేపటికి డబ్బవసరం లేదని అనుకోగలిగాం! కాబట్టి శ్రీశ్రీగా నువ్వు బతక్కు. శ్రీశ్రీగా బతికితే అట్టేనాళ్లు ఉండలేవు. ఇప్పటికే నిన్ను చూస్తే అంతా ఏవగించుకొంటున్నారు. ఇప్పటికి TOO LATE అవ్వలేదు. SO PLEASE GO AWAY TO DISTANT CITY AND LIVE A SANER LIFE. THATS BETTER FOR ALL OF US.

ఇంతకన్నా ఈ లేఖని పొడిగించవలసిన అవసరం లేదు. మన ఏడు నెల్ల జీవితంలో ఏ ఒక్కరోజుని తీసి పరిశీలించినా నా ఏడుపేమిటో నీకు బోధపడుతుంది.

గతాన్ని నేను మరిచిపోతున్నాను. నువ్వు విశాఖపట్నం వస్తే నీతో రోజుకో పది నిమిషాలు, 'బాబాయీ, శంకరం' అవతారాల్లో కాలక్షేపం చేద్దాం. ఇక 'శ్రీశ్రీ, ఆరుద్ర'ల సంబంధం మనకి వద్దు.

మాలితో ఆ ఉత్తరాలు ఆపు చేయించు, నేను మరి మద్రాసు రాను.

ఇంతే సంగతులు.

గుడ్‌బై

**– ఆరుద్ర**

చిత్తగించవలెను

**– కోనేటిరావు.**

(ఆరుద్ర అభినందన సంచిక నుండి)

❋ ❋ ❋

'ఆనందవాణి' ఉద్యోగం ఆనందంగా వుండకపోవడం వల్ల వొదిలిపెట్టి, మద్రాసు నుండి విశాఖపట్నానికి ఆరుద్ర తిరోగమించాడు. ఎక్కడున్నాడో, ఏమి చేస్తున్నాడో పత్తా లేదు చాలాకాలం. ఈ తిరోగమనం, ఆరుద్ర పురోగమనానికి కారణమయ్యింది. హఠాత్తుగా తిరిగి వచ్చాడు. అక్కడ 'త్వమేవాహం' రాసి మద్రాసుకు పట్టుకొచ్చాడు. సన్నిహితులకు చదివి వినిపించాడు. ఇక కవిత్వం రాయడం మానేసినా ఫరవాలేదన్న శ్రీశ్రీ యోగ్యతాపత్రం సంపాదించాడు. (ఈ దీవన, తరవాత కాలంలో శాపనార్ధంగా మారడం ప్రస్తుతానికి అప్రస్తుతం, అస్మరణీయం) ఒక ఘట్టం విశాలాంధ్రలో వేశాడు. 'త్వమేవాహం' తొందర్లోనే అచ్చయి అందరికీ అందుబాటులోకి వచ్చింది.

**– సెట్టి ఈశ్వరరావు**

(విశాలాంధ్ర – సెట్టి ఈశ్వరరావు గారు నడిపే సాహిత్య పక్ష పత్రిక, త్వమేవాహం – ఇది శ్రీశ్రీ పెట్టిన పేరు. తాను 'తెలంగాణా' అని పెట్టుకున్న పేరు శ్రీశ్రీ సలహా ప్రకారం ఆరుద్ర మార్పు చేశాడు)

❋ ❋ ❋

# పోస్టు చేయని ఆరుద్ర జాబు

AARUDRA
C/o R.V. RAO
T.I.C.
NALPUR
PANHALA P.O.
HOWRAH Dt.
25-4-1948.

DEAR సో.మ.రందం గారూ!

ఇక్కడికి ఎప్పుడొచ్చేనో, ఎందుకొచ్చేనో మొదలయిన విషయాలు వ్రాసి విసిగించను. ఇక్కడికి వచ్చేనంతే. ఉంటాను ఓ రెండు నెల్లపాటు (బహుశా మరి రెండు నెల్లపాటు. మూడొంతులు ఇంకో రెండు నెల్లపాటు) జీవితం అంటే విసిగి విసిగి ఎక్కడా నాకు కావలసిన జీవితం, సహవాసం, సమాజం, సభ్యత మొదలయినవి దొరక్క, అందక విసిగి విసిగి ఈ దూరానికి ఎదురీది వచ్చేను. బహుశా మూడొంతులు ఇక్కడే ఓ రెండు నెలలో, మరి రెండు నెలలో ఇంకో రెండు నెలలో అన్నీ జతపడతాయని ఆశిస్తూ ఇక్కడే – ఇక్కడే, ఇలాగే – ఇలాగే ఉండిపోదలచుకొన్నాను. ఆశ అడియాశ అవుతుందని నాకు తెలుసు. అయినా మద్రాసులా ఎరిగిన ముఖం కాదు కలకత్తాది. అందుకే అనుకొన్నవి దొరక్కపోయినా అన్వేషణ మాత్రం (ఫలం నిష్ఫలం అని ముందే తెలిసినా) చెయ్యవచ్చు అన్న ధీమాతో ఓ ఆర్నెల్లు ఉండదలచుకొన్నాను. దొరికాయో కావలసిన బాధల మూట దొరికిందన్న నునువెచ్చని సంతోషంతో కాలాన్ని సద్వినియోగం చెయ్యవచ్చు. లేదా ఉండనే వుంది, బొహీమియన్ జీవితం.

అసలు నాకు ఆ జీవితమే కిట్టదు. సవ్యమైన సమాజం లేనప్పుడు, కృత్రిమ సమాజపు చట్టాలలోకి కుదించబడే నేర్పు చేత కానప్పుడు నాకు బొహీమియన్ వే ఆఫ్ లైఫ్ లోనే సౌందర్యం గోచరిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లోంచి విడుదల కాగానే ఈ జీవిత విధానానికి ఎర అయేను. క్షణిక సౌందర్యం సాక్షాత్కరించింది. ఇప్పుడు నెమరవేసుకుంటే అదంతా డోస్టవస్కీ నవల్లాగా, మోపాసా కథల్లాగ, కన్యాశుల్కంలో రాత్రిలాగ భయపెడుతూ వికిర తాండవం ఆడుతున్నట్లు ఆలోచనలు. 'విప్పనా విప్పనా, విషాల సంచి చెప్పనా చెప్పనా దాన్ని గురించి. ఆ రోజుల్లో నాకు ఇల్లు లేదు. వాకిలి లేదు. శ్రీశ్రీదీ నాదీ ఒకే ఎడ్రసు. కేరాఫ్ పేవ్‌మెంట్స్, రోజుకి ఇద్దరం ఎడం చేత్తో పదిరూపాయలు ఆర్జించేవాళ్ళం. ఒక నెలలో మా ఇద్దరి ఆర్జనా ఆరువందలు. ఖర్చు కనబడలేదు. వెరసి బండసున్నా. ఇల్లు లేక ఇక్కడా అక్కడా బతికేవాణ్ణి. తాగుబోతులతో, జూదగొట్టులతో, సానిముండలతో, సంఘం అడుగున జీవించే పురుగులతో భుజం, భుజం కలిపి ఊపిరి తీసేవాణ్ణి. ప్రతి ఒక్కడూ బాధపడుతున్నా ఆ విషాదాన్ని ఉతికి ఇస్త్రీ చేసి తొడుక్కునేవాణ్ణి. వాళ్ళ ఏడుపులో వాటా పుచ్చుకొని మదరాసు వీధుల్లో నడిచేవాణ్ణి. చేస్తున్నది పరువైన ఉద్యోగం. మోస్తున్నది బరువైన గౌరవం. రెండురకాల మొఖాలను ధరించే నేర్పు లేక చాలామంది చేత 'ఆరుద్ర

చెడిపోతున్నా'డని అనిపించుకున్నాను. రెండు రకాల నాలుకలు లేక 'ఆనందవాణి' నుండి విరమించుకొన్నాను. రెండు రకాల మాటలు చేతగాక మద్రాసు నుంచి మహాభినిష్క్రమణం చేశాను. చిత్రం! ప్రతీ ఒక్కడూ వెళుతున్నది ఆ బాటనే. అయినా నన్ను చూసి పెదవి విరిచి 'అబ్బాయీ! చూడలేదా ఈ సైన్‌పోస్టు. ఇక్కడికీ వినాశనానికీ ఎంతో దూరం లేదు. పో, పో వెనక్కి' అన్నవాడే. అయితే వాళ్ళు చేస్తున్న పనులు నాలుగు గోడల మధ్య, చీకటి ఎల్లలలోనా. అప్పుడే అనుకొన్నాను. నా భావికి తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన కీకారణ్యం ఉన్నా ఇలాగే వెళ్ళిపోవాలని, గానీ నెరవేరింది కాదు మహా సంకల్పం. నా రెండు చేతులూ పట్టుకుని నా రెండు కాళ్లూ కలిపి కట్టి విసిరేశారు, ఇద్దరు నా 'మంచి' కోరే మిత్రులు నన్ను విశాఖపట్నంలోకి.

విశాఖపట్నంలో జీవితాన్ని చూస్తే ఇంతేనా జీవిత పరమార్థం అనిపించింది. స్వల్పమైన ఆశయాలతో అల్పమైన జీవితాన్ని జాపోరుస్తూ ఈడ్చుకుంటూ బతికే లిల్లీపుట్లను చూసి జాలివేసింది. పొద్దున్నే ఆయాసంగా నిద్రలేచి తొందరగా ఆఫీసు ముఖాన్ని తగిలించుకొని భయపడుతూ ఉద్యోగాన్నీ, నిర్వేదాన్నీ పొదుగుతూ నీరసంగా ఇల్లు చేరుకొని బద్ధకంగా నిద్రపోయే ఆఫీసుగత ప్రాణుల్ని చూస్తే వీళ్ళెప్పుడూ ఇలాగే కచేరీలను మోయాలా అనిపిస్తుంది. వీళ్ళ జీవితానికల్లా సారె గది లోనిదే రొమాన్సు, పెద్దదొర ముందు మాట్టాడ్డమే ఎడ్వెంచరు, ఇంక్రిమెంటే కైవల్యం. ఇంత అల్పులతో వుండలేక ఉక్కిరిబిక్కిరి అయి ఇక్కడికి వచ్చేశాను. అయితే నేను కూడా ఒక గుమాస్తా మాత్రుడనై కొంతకాలంపాటు కాలాన్ని ఈడ్చవలసి వస్తే నాకేం ఆశ్చర్యం లేదు. గానీ ఈ గతి పట్టకుండా కొన్ని రకాల డాలులు తయారు చేసుకొంటున్నాను.

మళ్ళీ మదరాసు వెళ్ళిపోతున్నానని రాశానా మీకు, అప్పుడు విశాఖ జీవితానికి అలసిపోయే. గానీ, ఆ గాలి ఇటు కలకత్తాకి కొట్టేసింది. ఈ ఊరు చాలా బాగుంది. ఊరనగా ఏం లేదు. నాలుగు రైల్వే కొంపలూ, పాతికమంది రైలు మనుషులూ. గానీ ఊరంత చెరువుంది. ఇదే నా రోజులో రెండు గంటల్ని తింటున్నది. పది గంటలకు భోంచేసి ప్రబంధ కన్యలని చదువుకుంటూ అల్లసాని పెద్దన, కూచిమంచి జగ్గకవి, శేషం వెంకటపతి, చేమకూర వేంకటకవి మొదలైన వాళ్ళ గ్రాంధిక బూతులు వింటూ కూర్చుంటాను. మీకు ఇంత తీరుబాటు వుంటే పూర్వ కవి ప్రబంధాలన్నీ ముఖ్యఘట్టాలు కంఠతా వచ్చేటట్టు చదవండి. ప్రబంధాలలో వర్ణనలను ఫక్కీ స్టీరోటైపుదయినా ఒక్కొక్క కవి కొక ప్రత్యేకత ఉంది.

చేమకూర పదప్రయోగం చాలా చమక్‌లతో ఉంటుంది. వాళ్ళు శబ్దాలని బానిసలుగా చేసుకొన్నారు. ఆ విద్య పట్టించుకోండి. మీకు చక్కని పద్యాలు రాయడం వస్తుంది. ఒక్కొక్క వృత్తాన్ని మాస్టరీ చేస్తే మాత్రా ఛందస్సులని సొంతం చేసుకోండి. తరలం, వన మయూరం, వృషభగతి రగడ, హంసగతి రగడ, భుజంగ ప్రయాతం మొదలైన చట్రాల్లో జాను తెనుగు మాటలు పొదుగుతే తమాషా దేఖో లంకకే రాజా! (ఈ మధ్య నేను తెలంగాణా రణగీతం

భుజంగ ప్రయాతం వాడుతూ రాశాను. శాస్త్రోక్తంగా ఛందోబద్ధంగా యతి ప్రాసలుండాలి గానీ మాత్రా ఛందస్సులో అంత్యప్రాస పెట్టి రాసినా ధీమాగా వుంటుంది.) శ్రీశ్రీ స్వాతంత్ర్య దిన గీతంలో మహాస్రగ్ధర ఒకటి వాడేడు చూశారా! 'మహాసంకల్పం' అనే శీర్షికతో 1944 'ఆనందవాణి' సంచికల్లో 'ఆసియా అంతవాణ్ణి' అని రాశాడు చూశారా! అందులో శిఖరిళీ వృత్తం వాడేడు. ఈ గమ్మత్తులు జాగ్రత్తగా ఆచూకీ తీసి అతడు చెయ్యని పరిశోధనలు చేసినవాడే శ్రీశ్రీకి వారసుడు అవుతాడు. పఠాభి కృషి చూశారా! అతడు వాడే కొత్త ఛందస్సులు ఊరే చోటు ప్రబంధాలే. మనందరికీ పూర్వకవి అబ్బూరి రామకృష్ణారావుగారు ఆ రోజుల్లో కవులు వాడని భుజంగ ప్రయతాన్ని నగిషీ చెక్కి 'సాధుగీతి' (చూ. వైతాళికులు) రాశారు. వృత్తం భుజంగ ప్రయాతమైనా ఆఖరిపాదాల్లో గమ్మత్తులు చూశారా ? రామకృష్ణారావుగారి LEAD అందుకొని శ్రీశ్రీ స్వంత పరిశోధనలు చేసుకొన్నాడు. శ్రీశ్రీ ముత్యాలసరాల కోసం చేసిన కృషి ప్రతి ఒకడూ ఒక సింహాసనం చేసుకోగలడు. 'ఉదయిని' పాత కాపీలు దొరికితే శ్రీశ్రీ వ్యాసం 'ముత్యాల సరములు – ఒక కృషి' అనేది చదవండి. కవికొండల వెంకటరావు కూడా స్వంత పొలాలను దున్నుకొంటాడు. ఆయన కూడా అనేక స్వంత పోకడలు గలవాడు. ఆయన రాసిన ప్రతి పద్యం కళ్ళు విప్పి చదవండి. ఈ సలహాలన్నీ మీకు ఎందుకిస్తున్నానంటే మీరు రాస్తున్న ఇటీవలి గీతాల్లో 'టెక్నిక్' లోపం చాలా ఉంది. ఇంక ఆంగ్ల సాహిత్యంలో W.H . AUDEN, DYLON THOMAS ల పద్యాలు చదవండి. THOMAS నేటి ఆంగ్ల పఠాభిని. AUDEN శ్రీశ్రీకన్నా గొప్పవాడెవడైనా తెలుగులో ఉంటే వాడితో పోల్చతగ్గవాడు. AUDEN పుస్తకాలన్నీ సంపాదించండి. THE ORATORS, LOOK STRANGER, FOR THE TIME BEING అనేవైనా చదవండి. DYLON THOMAS ది DEATHS AND ENTRANCES అనేది ఇటీవలి పుస్తకం. దానిని మననం చేసుకొంటే మంచిది. T.S. ELIOT COLLECTED POEMS (WASTE LAND) చదివే ఉంటారనుకొంటాను. T.S. ELIOT మన విశ్వనాథ సత్యనారాయణ లాంటివాడు. గానీ విశ్వనాధ మనః ప్రవృత్తి వేరు. అందుకే విశ్వనాధ విశ్వనాధ అయేడు.

ఆధునిక ఆంగ్ల సాహిత్యం గురించి బాగా చదవండి. ప్రస్తుతానికి STEHEN SPENDER రాసిన 'POETRY SINCE 1939' అనే పుస్తకం, HENRY REED రాసిన 'NOVEL SINCE 1939' అనేవి చదవండి. ఆధునిక సాహిత్యానికి ముందు పూర్వ సాహిత్యం చదవాలి. SPENDER పుస్తకంలో DYLON THOMAS, GEORGE BARKER ల మీద కొంచెం చిన్నచూపు చూశాడు. GEORGE BARKER రాసిన CALAMITERROR అనే కావ్యం చాలా గొప్పది. స్పెయిన్ మీద రాశాడు. శ్రీశ్రీ నడగండి దాన్ని వర్ణించమని. ఆధునిక సాహిత్యం మీద తాజావార్తలు TRANSFORMATION అనే పత్రికలాంటి పుస్తకంలో ఉంటాయి. ఈ TRANSFORMATION అనే పుస్తక సంపాదకులకు APOCALYPTICISM అనే జబ్బు ఉంది. దాన్ని చూసి మోసపోకండి. PERSONALIST WRITING అని కొంత అభివృద్ధి నిరోధక సాహిత్యాన్ని వ్రాస్తారు గానీ అందులోని

నవీనతలను ఒంట పట్టించుకోండి. ఇవన్నీ నేను మదరాసు పోతూ పిఠాపురంలో దిగి మీకు చెప్తామనుకొన్నాను.

ప్రతీ తరం కవులకి ఒక పరిభాష ఉంటుంది. భావకవులకు కోయిల, విరహం, కన్నీళ్ళు ఉన్నట్లే, శ్రీశ్రీ తరం వాళ్ళకి స్మశానాలూ, అస్తిపంజరాలు, రక్తం, రాబందులు వున్నాయి. ఈ తరం కవులకి చరిత్ర, దోపిడీ, తిరుగుబాటు, కూలివాళ్ళ కండలు ఉన్నాయి. గానీ చెయ్యి తిరగని రచయితల పద్యాల్లో పడి వాటి అర్థాలు పాడైపోతున్నాయి. కాబట్టి మీరు వాటిని మోతాదుగా వాడండి. ఓసారి కుటుంబరావుగారు 'ఈ లోకం' అని మొదలెట్టి వ్రాసిన ప్రతి గేయాన్నీ దాస్తానన్నారు. చప్పొచ్చేదేమిటంటే 'చరిత్ర'కి అర్థం లేకపోతున్నది. LEFTIST పద్యాలకి ప్రస్తుతం వాడుతున్న పరిభాషే అక్కరలేదు.

నేను మళ్ళీ ఏరిసాల్పూరే, అంధేరా, అంబాలా, లాహోరులలో ఉన్నట్టు దేశానికి దూరంగా సాహిత్యానికి (అనగా పత్రికలకి) అందు విడిగా కాకుండా ఉంటాను. కాబట్టి ఎవరేవి రాస్తున్నదీ కాస్త సంజయుడిలా వార్తా ప్రసారం చెయ్యండి.

నేను ప్రస్తుతం ఒక నవల రాసేందుకు ఉపక్రమించాను. వచన రచనలో కూడా కొత్త దారులనేకం ఉన్నాయి. మన నవలలు మన కవిత్వం అంత ముందికి పోలేదు. – మనకున్న నవలా రచయితలే వేళ్ళమీద లెక్కపెట్టవలసిన వాళ్ళు. కుటుంబరావుగారి నవలలు సజావుగా సైకిలు తొక్కుతూ ఒకే రస్తామీద వెళ్ళిపోతాయి. రస్తా కిరువైపులా చేరేదారుల పేరులే మనం చూస్తాం. ఆయన సూటిగా బాణం కొట్టడంలో సిద్ధహస్తుడు. ఆయనకి పరిశోధనలతో పనిలేదు. బుచ్చిబాబు ఒక నవల రాసి ప్రచురించుతున్నాడు. అది ఏనాటికైనా పూర్తి అయితే పుస్తక రూపంలో చదివి అతనే మాత్రం పరిశోధన చేశాడో చూడాలనిపిస్తున్నది. ఏమంటే అతడు చైతన్య స్రవంతి టెక్నిక్‌లో కొన్ని రాశాట్ట. బుర్రా సుబ్రహ్మణ్యం గారి విజయలో కొన్ని భాగాలు ప్రచురణ అయినంత మట్టుకు చదివేను. కథకి యవ్వనం తప్ప పరిశోధన కనబడలేదు. ధనికొండ హనుమంతరావు వగైరాల రచనలకి ముందు సీట్ల అర్హత లేదు. జరుక్ దేవయ్య స్వీయచరిత్రలో మంచి నవలాకారుడవుతాడన్న ఆశలు కల్పించాడు. జరుక్ నవల్లు రాయలేదన్న బాధ నాకు లేదు. ఏవంటే అతడు మంచి నటనా శిల్పాన్ని అలవర్చుకొంటున్నాడు. ఇంక వచన రచయిత లేరీ ? నిజంగా వచన రంగంలో అనేక గమ్మత్తులు చెయ్యవచ్చు. అవి చెయ్యి తిరిగిందికి నేను నా కథలలో తాపత్రయపడ్డాను. మీరు ఈ క్రింది నా కథలు చదివారా ? (1) మళయాళం అర్థమైంది. (2) మానవత్వం (3) తల్లి ఊఁ అంది. (4) నిశానీలు (5) వైనతేయులు (6) చింతచిగురు (7) ఇందలి నీతి చెడలేదు (8) తా'ళ్ళూ తో'ళ్ళూ (9) మనిషీ ఆడమనిషీ కథలు. ఒక్కొక్క దానికి ఒక లక్షణం ఉంది. ముఖ్యంగా 'వైనతేయులు', 'ఇందలి నీతి చెడలేదు' అన్న

కథల్లో ఒక పేరాకీ, ఇంకొక పేరాకీ పోలిక బాగా చూడవచ్చు. ఒక్కొక్కపేరా ఒక పద్యంలా వుంటుంది. ఇందులో ఎన్ని పాదాలో అందులో కూడా రమారమి అన్ని పాదాలే వుంటాయి.

శైలి గమ్మత్తులు (విచిత్రమే సౌందర్యం) అభ్యుదయ ప్లాటుతో నేయదలచుకున్నాను. శైలి అడ్డపట్టీ, ప్లాటు నిలువుపట్టీ. కొన్ని ప్రకరణాలు వచ్చి వ్యావహారికంలో వృత్తాలు రాసి పాదవిభాగం లేకుండా పేర్చదలచుకొన్నాను. ఎందుకా అని అడగవచ్చు. SOUND EFFECT కోసం.

ఇక్కడ నేనుండబోయే ఆర్నెల్లలోనూ చిత్తుప్రతి పూర్తవవచ్చు. నేను అంధేరీలో, అంబాలాలో, ఆవాణీలో ఉంటున్నప్పుడు రాస్తానన్న పెద్ద ఉత్తరం ఈ రూపంలో మీకు రాసేశాను. మీరు బాకీ చెల్లు పెట్టించండి.

మళ్ళా యుద్ధం వచ్చే సూచనలు వాతావరణంలో అమర్చబడుతున్నాయి. కాబట్టి కాకీడరుసు మళ్ళీ ధరించవలసి వస్తుందేమో అని అనుమానంగా వుంది. ఆ మధ్య ప్రకాశం ప్రకాశంగా హైద్రాబాదు మీదికి వలంటీరు బలం నడుపుతానని వ్రాకుచ్చేడే అది నేపథ్యంలో ఏమయింది ? ఏవైనా దళాలు తయారయ్యాయా ? కలకత్తా వచ్చే ముందు వలంటీరుగా హైదరాబాదు యుద్ధంలో దిగుదామనుకున్నాను. అన్ని సత్సంకల్పాలలాగే అదీ పరిస్థితుల ప్రవాహానికి కొట్టుకుపోయింది.

యుద్ధమొస్తే ఈసారి మీరు భర్తీ అవండి. రచన చెట్టెక్కించకుండా ఉంటే మిలట్రీ బతుకంత తీరుబాటయినది మరోటి లేదు. బొక్కీసు ముండా కొడుకులకే కాదు, పెళ్ళీపెటాకులయిన వాళ్ళకి కూడా ఈ చోటులో చోటుంది.

వింతలు, విశేషాలు, సంగతులు, సన్నివేషాలూ, సన్నివేశాలూ, సమావేశాలు, వార్తలు వగైరాలు, భోగట్టాలు గట్రాలు కొట్రాద నా మొఖాన్ని, సంతోషిస్తాను.

గోరాశాస్త్రి మంచి వచన రచయిత. అతని శైలికి పదును ఉంది. 'స్వర్ణయుగం' అనే అతని కథ చదివేరా ? మంచి కథల్లో మంచి కథ అది.

నా వచన రచనల కట్టింగు లేవైనా మీ దగ్గరుంటే దయచేసి పంపించండి.

ఇప్పటికీ సంగతులు
చిత్తగించండి

YOURS COMRADINGLY

**– ఆరుద్ర**

29/4/1948

(ఆరుద్ర అభినందన సంచిక నుంచి)

❋ ❋ ❋

"ఈ విశాల జగతి నుంచి ఏమిటి నే కోరినాను ? ఒక దోసెడు సానుభూతి, ఒక జానెడు తీరుబాటు."

– శ్రీశ్రీ

❋ ❋ ❋

## 'నయాగరా'

"1944 లో అనిసెట్టి సుబ్బారావు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, రెంటాల గోపాలకృష్ణ మొదలగువారు 'నవ్య కళాసమితి'ని స్థాపించారు. అప్పుడు బెల్లంకొండ, కుందుర్తి, ఏల్చూరి, రెంటాల 'నయాగరా' కవితా సంపుటిని ప్రచురించారు. దానిని అనిసెట్టికి అంకితం ఇచ్చారు."

❋ ❋ ❋

## కవుల చరిత్రము


కందూకూరి

"దక్షిణ హిందూదేశ శాసన పుస్తకములను మాత్రమే గాక, చెన్నపురియందును, ఇతర రాజధానులందును మైసూరునందును ప్రకటింపబడుచు వచ్చిన తామ్ర, శిలా శాసనములు గల పత్రికలను, పుస్తకములను, చరిత్రలను తెప్పించి చదివితిని. చెన్నపురి చిత్రవస్తు ప్రదర్శనశాలలోనున్న తామ్రశాసనములను చదివితిని. ముద్రితము కాని తాళపత్ర పుస్తకములను విస్తారముగా సంపాదించితిని. తంజావూరిలోని సరస్వతి భాండాగారములో తెలుగు పుస్తకము లున్నవని విని, అక్కడకు పోయి, పుస్తకములు చదివి, నాకు కావలసిన భాగములను వ్రాసికొని వచ్చితిని. మూడు సంవత్సరములు వరుసగా వేసవి సెలవులలో చెన్నపట్నము పోయి అక్కడి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము (ORIENTAL MANUSCRIPTS LIBRARY) లో ప్రతిదినము పది నుంచి సాయంకాలం అయిదు గంటల వరకును తాళపత్ర లిఖిత పుస్తకములను చదివి, కావలసిన భాగములు వ్రాసుకొనుచుంటిని.

ఒకనాడు ట్రాము (TRAM) బండిలో నెక్కిపోయి సముద్రతీరమున దిగి, అక్కడ నుండి కోటకు నడిచిపోయి, కావలసిన పుస్తకములను పుస్తక భాండాగారము నుండి పైకి తీయించి వ్రాసుకోబోగా, నా చొక్కా జేబులో వ్రాత పుస్తకము (NOTE BOOK) కనబడలేదు. ట్రాము బండిలో దానిని విడిచి వచ్చితినని, వెంటనే మరల సముద్రతీరము (BEACH) నకు పోయి, మరియొక ట్రాము బండి నెక్కి వెళ్ళి, మొదట ఎక్కి వచ్చిన బండివానిని కనుగొని అడగగా, ఏదో వ్రాత పుస్తకము బల్లమీద నుండగ క్రింద పారవేసితినని అతడు చెప్పెను. అతని బండిలోనెక్కి, అతడు పుస్తకము పారవేసితినన్న స్థలమునకు వచ్చి దిగి, ఆ సమీపమున వెదకి, చుట్టుపక్కలవారిని

విచారించి, పుస్తకమిచ్చినచో సొమ్మిచ్చెదనని ఆశ పెట్టితిని గాని పుస్తకము జాడ కానరాలేదు. పుస్తకము తెచ్చి యిచ్చిన వారికి 25 రూపాయల పారితోషికమిచ్చెదనని ప్రకటించినను కార్యము లేకపోయెను. నేను నెల దినములు పడిన కష్టమంతయు నిష్ఫలమయ్యేను. అందుచేత నేను కోటకు పోయి చదివిన పుస్తకములనే మరల చదివి, వ్రాసిన దానినే మరల వ్రాసుకోవలసి వచ్చెను. ఈ ప్రకారముగా నేను విశేష శ్రమపడి కవుల చరిత్రము వ్రాసి ముగించితిని. పునస్సంశోధనము చేసి దాని నిప్పుడు వృద్ధి చేసి బాగుపరచవచ్చునుగాని, వృద్ధుడనై దుర్బలుడనై యుండుట చేత శక్తియు, ఓపికయు నాకు లేకున్నవి.

**– కందుకూరి వీరేశలింగం**

(స్వీయచరిత్ర)

* * *

# కాలగర్భంలో...

“విజయనగరంలో చాగంటి సోమయాజులు గారి డాబా మీద మేం అయిదుగురం కూర్చున్నాము. 1, 2, 3, 4, 5 అని అంకెలు వేసిన అయిదు కాగితపు ముక్కల మీద ఒక్కొక్కరం ఒక్కొక్క అక్షరం రాయాలనుకున్నాము. అందులో ఒకటో నంబరు కాగితం మీద ఆరుద్ర ‘స్వ’ అని రాశాడు. అయిదో నంబరు మీద నేను ‘మ్’ అని వ్రాశాను. 2, 3, 4 నంబర్ల మీద ‘జే’ ‘ళ’ ‘జ’ అనే అక్షరాలు చేర్చితే ‘స్వజేళజమ్’ అనే మాట ఏర్పడింది. దాన్ని సర్రియలిజానికి పర్యాయపదంగా మేము స్వీకరించాము. ‘జేళాకంపం’ అనే పెద్ద వచన గీతం ఒకటి ఆరుద్ర రాశాడు. కాని అదిప్పుడు కాలగర్భంలో కలిసిపోయింది.

అచ్చులో వెలువడ్డ నా మొట్టమొదటి పద్యరచన ఒక గీత మాలిక. విశ్వరూప సందర్శనం అని శీర్షిక. ఇది ‘స్వశక్తి’ అనే వారపత్రికలో ముద్రితమయింది. కాలగర్భంలో కలిసిపోయిన నా రచనలలో ఇదొకటి.”

**– శ్రీశ్రీ**

* * *

# బాతాఖానీకి

“ఆ రోజుల్లో బైరాగి, నేను ‘తెలుగు స్వతంత్ర’లో తెగ పద్యాలు వ్రాస్తూ ఉండేవాళ్ళం. మా మీద ప్రత్యేకమైన హక్కులేవో ఉన్నట్లు గోరాశాస్త్రి, రామలక్ష్మి మా పద్యాలను ఇంకెవ్వరికీ ఇవ్వనిచ్చే వాళ్ళు కాదు. బాతాఖానీకి తెలుగు స్వతంత్ర ఆఫీసుకి వెళితే మా ముందు ఇన్ని కాగితాలు పడేసి కవిత్వం రాయించుకొనేవాళ్ళు. నేనూ – బైరాగి కలిసి జంట కవిత్వం చెప్పాలని ఒక్కసారి తప్ప ఎప్పుడూ అనుకోలేదు. శ్రీశ్రీ ప్రపంచ శాంతి మహాసభలకు వెళుతున్నప్పుడు

ఇద్దరం కలిసి, ఒక పద్యం రాశాం. బైరాగి దానిని స్వహస్తాలతో కాపీ చేశాడు. ఇద్దరం దానిని తీసుకెళ్ళి తెలుగు స్వతంత్రకు యిచ్చాం. వాళ్ళు పద్యాన్ని అచ్చువేయడానికి తిరస్కరించారు. ఇద్దరం నవ్వుకొన్నాం. బైరాగి స్వహస్తాలతో రాసిన ఆ పద్యాన్ని చింపెయ్యడానికి నాకు చేతులు రాలేదు."

**– ఆరుద్ర.**

* * *

# శ్రీశ్రీ ప్రస్థానగీతి

(శ్రీశ్రీ స్టాక్‌హోమ్ వెళ్లిన సందర్భంలో వ్రాయబడింది)

**– ఆరుద్ర, బైరాగి.**

స్వేచ్ఛా సమీరంలా శాంతి తీరానికి పయనిస్తున్నావు
హృదయానికి చేరువగనే ఉన్న దూరానికి పయనిస్తున్నావు
మా ఉత్సుక నయనాల అయనమంట నీ పయనం
తెరవు పొడుగునా స్నేహ సౌహార్ద్రాల సుమనస్సంచయనం
నీ ప్రయాణ విమాన యంత్ర నిరంతర ముఖర స్వాతంత్ర్య మంత్రనాదం
ఊదుతోంది నీ చెవిలో కోటి కోటి సముత్కంఠిత కంఠాల అకుంఠిత నినాదం
వినీలవ్యోమంలో విమోచన విహంగలా
దశమావతరిత యుగపురుషుని శ్వేతరంగత్తురంగంలా
సాగుతోంది నీ విమానం
మోగుతోంది సముల్లసిత శుభగానం
లేచి వస్తోంది ప్రాణం

## 2

సాగు, సాగు సైనికుడా, సాగు
తెల్ల పల్లటీ సాహిణీ! సాగు
కల్లకపటాల ఖద్దరు తెర తొలగించుకొని
కళ్ళ కాగడాలలో నీ మార్గం వెలిగించుకొని
కవితాగగనంలో కల్పనా విహంగంలా
స్వప్నాల సాగరంలో సర్రియలిజం సబ్‌మెరీన్‌లా
లోక్‌సభ రేడియో చర్చలో నీ నేస్తం హరీన్‌లా
జంకు కొంకులు లేక బొంకు రంకులు చీల్చుకొంటూ
ఆలోచనల సిగరెట్‌లోంచి ఆవేశం పీల్చుకొంటూ

భవితవ్యపు కల్లంలో తాలు చెరిగి సిసలు గింజలు తేల్చుకొంటూ
రేగు, మ్రోగు. ఓ ఆశావైణికుడా! సాగు

**3**

శాంతి సరిత్సంగమంలో అఘమర్షణ స్నానమాచరించి
జన తీర్థాల పావన వనాంతరాల సంచరించి
సుఖజీవన కామనల శుభ సౌహార్ద సందేశాలుచ్చరించి
సుముఖులతో సహకరించి సంసేవ్యులనుపచరించి
చూడవలసినదంతా చూసి రాయవలసినదంతా రాసి
భావాల పడుగుపేకల కవితా చీనాంబరాలు నేసి
(వెడగులు, బడుగులు, చెడుగు లేమనుకొంటే నేమి ?
తెల్లం మన హృదయాలలో కల్లకపటాల లేమి)
చల్లంగా సాగిపొమ్ము, క్షేమంగా తిరిగి రమ్ము
ఈ పయనమ్మెన్నటికీ కాదు వమ్ము
చల్లంగా సాగిపొమ్ము, క్షేమంగా తిరిగి రమ్ము.

BYRAGI
SAHITYA VIBHAG
D.B.H.P. SABHA
T. NAGAR,
MADRAS-17

(ఆలూరి బైరాగి సంస్మరణ సంచిక నుండి)

❋ ❋ ❋

# పిఠాపురం సంస్థానం



పానుగంటి

"పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు రాయలసీమలోని 'ఆనెగొంది' సంస్థానంలో, 'ఉర్లాము' దివాణములో, లక్ష్మీనరసాపురం ఎస్టేటులోను కొన్నాళ్ళు దివాన్గిరీ చేసి, తర్వాత పిఠాపురం సంస్థానంలో ఆస్థాన నాటక కవిగా నియమితులయ్యారు. నెలకు నూటపదహార్లు జీతంగా బహుమానమిచ్చేవారు. వ్రాతకోతలు పనిపాటలు ఏమీ లేని ఉద్యోగం. అప్పుడప్పుడు కోటకు పోయి మహారాజావారు సూర్యారావుగారిని కలిసి చర్చించడం, కోటలో ప్రదర్శింపబడే నాటకాలలో సహకరించడం. ఇంతకుమించిన పనిలేదు. రాజాగారిని గురించి, ఆయన ఏలుబడిని గురించి, రచనలలో ఎక్కడ దుయ్యబడతాడోననే శంకతో రాజుగారు పానుగంటివారికి ఆ జీతమిచ్చేవారని అనుకొనేవారు



(Outputs) 14/10/08

కాని పిఠాపురం ప్రభువుల సాహిత్య ప్రీతి లోకానికి తెలియంది కాదు. దేవులపల్లి సోదరకవులు, వేంకట రామకృష్ణ కవులు, వేంకట పార్వతీశ కవులు, చిలకమర్తి వారు మరెందరో వారి ఆస్థానంలోని వారే. రాజావారికి కళలంటే అభిమానం. తెలుగుదేశంలో గొప్ప సంగీత విద్వాంసులు తుమురాడ సంగమేశ్వర శాస్త్రిగారు ఆ ఆస్థానములోని వారే. వీరి వీణాగానం రవీంద్రుని వంటి రసజ్ఞులను పరవశులను చేసింది. ఓసారి దివాణంలో సంగమేశ్వర శాస్త్రిగారి వీణాకచ్చేరి జరిగింది. శ్రోతలలో పానుగంటి వారొకరు. వీణా గానానంతరం ఆ సంగీత శిరోమణిని – మహారాజా వారిని ప్రస్తుతిస్తూ పానుగంటివారు,

"స్వ జనుల నేరీతి బరిపాలన మొనర్తు
వాశ్రితు నెవ్వాని నాచరింతు
వాదాయమున నెంత యర్థుల కిచ్చెద
వెగెటు చేసిన భృత్యు నెద గణింతు
వవని పాలన నేది యార్జించి నాడవు
కవిత గానంబు నేపగిది విందు
వెట్లుగా బృధు సౌఖ్య మీక్షింపగా నుంటి
వాత్మ సంస్తుతుల కేమందువయ్య
సరిగ, ధని, సగమ, పనిని సరిగ, గరిమ
మరిమరిగ, పాపనిని గని, సరిసరియను
వీణకాని 'మా' వెన్క 'నీ' వీణ వరుస
మీద! 'నీ' వెన్క 'మా' సూర్యమేది నీశ!"

అంటూ చెప్పిన ఈ సీసము బంగారమే!."

❋ ❋ ❋

# తెల్లవారి అఘాయిత్యం



బిపిన్ చంద్రపాల్

"1905 లో బెంగాలు విభజన జరిగింది. బెంగాలీ వారికి తీరని అన్యాయం జరిగిందని వారిపై సానుభూతి చూపిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వ చర్యను ఖండిస్తూ దేశంలో చాలా ప్రదేశాలలో బహిరంగ సభలు జరిగాయి. ఆ సందర్భంగా బ్రహ్మమత ప్రచారకుడైన బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరం వచ్చాడు. టౌనుహాలులో వరుసగా అయిదు రోజులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఆంగ్లంలో గంభీరోపన్యాసాలు చేశాడు. అయితే ఇంగ్లీషులో బిపిన్ చంద్రపాల్ గారి ఉపన్యాసాలు అర్థం చేసుకోవటం కష్టమయిన సభ్యులు వాటిని తెలుగులో చెప్పవలసినదిగా చిలకమర్తివారిని కోరారు. ఆ కోరిక



(Outputs) 14/10/08


మన్నించి ఉపన్యాసం చెప్తున్నప్పుడే మనస్సులో ధారణ చేసుకుని, ఒక్క విషయం వదలకుండా చిలకమర్తి వారు తెలుగులో వివరించారు. ఆ ఉపన్యాసాలు విని జనులుద్రేక పూరితులయ్యారు. ఆఖరి రోజు చిలకమర్తి వారు,

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చు చుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

అని పద్యం చదివారు. ఎందరో దాన్ని మళ్ళీ మళ్ళీ చదివించుకున్నారు. కొందరు కంఠోపాఠం చేశారు. కృష్ణానది వంతెన గోడల మీద పెన్సిళ్ళతో రాయబడిందీ పద్యం. ఆనాటి గోదావరీ మండల సభాపద్యాలతో బాటు హరికథలలో కెక్కింది."

❋ ❋ ❋

## ప్రజల పాటల త్యాగయ్య


గరిమెళ్ళ

"సహాయ నిరాకరణోద్యమ స్థాపకుడైన గాంధీజీ సబర్మతీ ఆశ్రమంలో ఉండి, ఒకసారి దేశంలో జాతీయగీతాలను చక్కగా వ్రాసిన వారినందరినీ పిలిపించి, వారి పాటలు వింటున్నారు. గరిమెళ్ళ సత్యనారాయణగారికి అవకాశం వచ్చింది. ఆయన గాంధీ గారితో "నా పాటకి ప్రభుత్వం వారు ఒక సంవత్సరం కఠినశిక్ష విధించారు." అన్నారు బింకంగా. "నేను నమ్మను. నీవు మరి ఏదేని చేసి ఉండాలి" అన్నారు గాంధీజీ. "కాదు" అని ఆ దగ్గర ఉన్నవాళ్ళు గాంధీజీకి చెప్పగా, ఆయన ఆశ్చర్యపోయాడు. అంతట ఆ పాటను వినిపించమన్నారు. గరిమెళ్ల వారు.....

మా కొద్దీ తెల్లదొరతనము – దేవా!
మాకొద్దీ తెల్లదొరతనము –


అంటూ తారాస్థాయిని ఎత్తుకుని సముద్రపు హోరుగాలా పాడారు. గాంధీజీ చాలా మెచ్చుకున్నారు. ఆ పాటని వరుసనే ఇతర భాషలలోకి తర్జుమా చేయమని కోరగా కొందరు తయారు చేశారు. మా కొద్దీ తెల్లదొరతనం పాట ఇంగ్లీషులోకి అనువదించబడి, టంగుటూరి ప్రకాశంగారి స్వరాజ్య పత్రికలో ప్రచురితమైంది. ఎన్.జి. రంగా గారు కవిగారికి "ప్రజల పాటల త్యాగయ్య" అను బిరుదునిచ్చారు."

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# గొప్పపద్యాలు



చిలకమర్తి

"1895 లో కాకినాడలో గోదావరి మండల మహాసభ జరిగింది. మూడవ రోజు సభలో చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు పద్యాలు చదివారు. ప్రతి పద్యానికి చప్పట్లు చరిచారు సభ్యులు. ఆ పద్యాలు గోదావరీ మండల మంతా వ్యాపించాయి. ఎవరి కవిత్వాన్ని మెచ్చని వీరేశలింగం పంతులుగారు ఈ పద్యాలు బాగున్నాయని మెచ్చుకున్నారు.

సీ॥ తుహినాద్రి మొదలు సేతువు దాక రాజ్యంబు
జరిపె నీ యాంగ్లేయ దొరతనంబె
జాతి మతా చార సర్వ స్వతంత్రముల్
నెరిపె నీ యాంగ్లేయ దొరతనంబె
పిండారి దండుల పేరైన లేకుండ
దోలె నీ యాంగ్లేయ దొరతనంబె
నేర్పుతో చట్టముల్ నిర్మించి క్లేశమున
తొలిచె నీ యాంగ్లేయ దొరతనంబె

తే.గీ. ప్రజలు లోపముల్ జూప నాగ్రహము లేక
కరుణ జూపు నీ యాంగ్లేయ దొరతనంబె
ఇట్టి యాంగ్లేయ దొరతనం బేలుగాక
ధర్మమతి తోడ నాచంద్రతారకంబు!

అంటూ అందరినీ ఆశ్చర్య పరుస్తూ ఆంగ్లేయ దొరతనం గొప్పలు చెప్పి -

సీ॥ దీప్తి మంతంబైన దీపంబు తోడ గ్రీ
నీడ యొక్కింత గన్పించునట్లు
కమ్మ కమ్మని తావి గుమ్మున వెదజల్లు
నల గులాబికి ముండు లలమినట్లు
సర్వ జనానంద సంధానకరుడైన
చందమామను గందు జెందునట్లు
జీవనాధారమై చెలగు చల్లని వాని
బెడిదంబు పిడుగుల నడరినట్లు

తే.గీ. ఉత్తమం బగునట్టి యీ హూణ రాజ్య
మందు గనుపించు లోపంబు లరసి జూడ
తన్నివారణార్థంబు గాదె ధన్యులార
గౌతమీ మండల సభ సంకల్పమయ్యె



(Outputs) 14/10/08

అంటూ అసలు రహస్యం బయట పెట్టారు. మొదటి పద్యంలో దొరతనాన్ని కీర్తించి, ఆ చంద్రతారార్కం నిలవాలని ఆశీర్వదించటం, రెండో పద్యంలో దొరతనంలో లోపాన్ని చూపి సర్దుకోండని హెచ్చరించడం, ఆపై.....

సీ॥ నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలె నన్న నీటి పన్ను
వాణిజ్య మొనరింప వచ్చుబడికి పన్ను
సరుకు లమ్ముదమన్న సంత పన్ను
కర్రలమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణమ్ముల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపమ్ము కొన్నచో స్టాంపు పన్ను

తే.గీ. ఉన్నమట్టుకు తినకుండ ఉప్పు పన్ను
ననెడు పన్నులె దిగదీసె జనులనెల్ల
కటకటా! యెట్టులున్నదో కాపుల దశ
సుగుణ ధనులార జనులార చూడరయ్య

సీ॥ అధికార భూతంబు లడుగు లంచము లిచ్చి
పరిపరి విధములౌ పన్ను లిచ్చి
మునసబు కరణాల ముడుపు లన్నియు నిచ్చి
కోసి నూర్చిన వారి కూలినిచ్చి
కచ్చేరి బంట్రోతు గములకీనామిచ్చి
పాలేళ్ళకును కొంత పంటనిచ్చి
యజమానునకు బంట నర్ధభాగంబిచ్చి
పైకమిచ్చిన వాని వడ్డి నిచ్చి

తే.గీ. గడ్డి మాత్రమే మిగిలించు గాపువాడు
సేద్యమున దాను బసువులు భక్షించు కొరక
కట కటా! ఎట్టులున్నదో కాపుల దశ
సుగుణ ధనులార జనులార చూడరయ్య

అంటూ విజృంభించి దొరతనం చేస్తున్న అన్యాయాలను నిరాటంకంగా, నిస్సంశయంగా చాటి చెప్పి ఆనాటి రాజకీయ సాంఘిక స్థితి గతులను కళ్ళకు కట్టినట్లు విశదీకరించారు.

సభలయిన రాత్రి భోజన సమయంలోఈ పద్యాలను న్యాపతి సుబ్బారావు గారు, కృత్తివెంట పేర్రాజుగారు, గంజాము వెంకటరత్నంగారు, బాదం వెంకటరత్నంగారు మొదలైన పెద్దలు చిలకమర్తి వారి చేత మళ్ళీ మళ్ళీ చదివించుకున్నారు. ఆ పద్యాలను హరికథల్లో హరిదాసులు



(Outputs) 14/10/08

వాడడం మొదలుపెట్టారు. చిలకమర్తివారి స్నేహితుడు పిళ్ళారిసెట్టి నారాయణరావు నాయుడుగారు చిలకమర్తిని అభినందిస్తూ, ఇలాంటి పద్యాలు దొరతనం వారిని మెచ్చుకుంటూ చెప్తే, మీకు రావుబహద్దర్ బిరుదము తప్పక ఇస్తారు అన్నారు. న్యాపతి సుబ్బారావు గారు విజయనగరం ఆంగ్లోపన్యాసకులుగా ఉన్న గురజాడ అప్పారావు గారి చేత ఇంగ్లీషులోకి తర్జుమా చేయించారు. తరువాత తెలుగు పద్యాలు, ఇంగ్లీషు పద్యాలు కూడా గౌతమీ మండల సభా వృత్తాంతాన్ని తెలియజేసే రిపోర్టులో అచ్చయినవి."

❋ ❋ ❋

# హాస్యం

"తెలుగు వారికి వెక్కిరించడమూ, బూతాడడము తప్ప హాయిగా నవ్వడము గురజాడ వారి కన్యాశుల్కం వచ్చే వరకూ తెలియదు. ఏ నన్నెచోడుడో నాలుగు పద్యాలు రాసినా ఆ సంగతి మొన్నమొన్నటి వరకూ మనకు తెలియలేదు. నవ కవులలో వెటకారము చెయ్యడము జలసూత్రం రుక్మిణీ నాథశాస్త్రిగారు బాగా నేర్చారు. ఒక వ్యక్తికున్న విపరీత గుణాలు కనిపించేటట్లు వాటిని పెంచి, వేరే పరిస్థితుల్లో వాటి వైకల్యాన్ని పొదిగి చూపించి చేసేది అపహాస్యమూ, వెటకారమూను. ఆ గుణాల్ని మానవత్వపు లోపాలుగ అన్వయించి అందరూ ఆనందించటానికి వెండితెర మీద చూపడము హాస్యము. రుక్మిణీనాథశాస్త్రి గారి పేరడీలు అపహాస్య కావ్యాలు – వికట కవిత్వమన్న వ్యాసంలో మాచిరాజు దేవీప్రసాద్‌గారు వివరించారు. ఒక కవి రచనలో, పోలిక మార్చీ, ఒక మాటను మార్చీ, పద్యములోని పాదము మార్చీ, సందర్భాన్ని మార్చీ చివ్వరదాకా తెలియని పోలికనీ (జగ్గకవి లాగా) ఆఖరి పాదంతో స్ఫురింపచేసి కొట్టె, తెలుగు కవులు – ఆధునికులూ, పూర్వీకులూ కూడాను – సాధించిన హాస్యమును సూచించారు.

మాచిరాజువారికి హాస్యము కాలక్రమానుగత విద్య కాబోలు. బండరాముడు అనే రామచంద్రమూర్తి గారిని తెలుగువారు మరచిపోలేదనే అనుకుంటాను. వారి సోదరి కూడా వనభోజనాల్లో నిండా భోజనం చేసిన వారికి 'చాలాబాధ' హాస్యపు మాటల వల్ల కలిగించే వారట.

దేవీప్రసాద్‌కి ఆ ప్రసాదము లభించడము మన అదృష్టము – "ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం" అని ప్రారంభించి ఒక గేయం వ్రాశారు శ్రీశ్రీ. దానిలోని తొలిపాదాల జోరు శక్తివంతం. ఆ శక్తినే ఇంకొక ముఖంగా ఉపయోగించారు మాచిరాజుగారు. "ఏ దారి చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం రహదారి చరిత్ర సమస్తం ధూళిధూసర పరిస్సృస్తం. రహదారి చరిత్ర సమస్తం పైజమ్మాలను పాడుచేయడం..." ఇలాగే ప్రతీదానికీని. అయితే దేవీప్రసాద్‌గారి స్వంత ముక్తకాలూ, ఖండకావ్యాలూ ఉజ్వలంగా ఉంటాయి. "నేను రెస్టారెంటు కేగి వస్తాను అంటే, ఆల్‌రయిట్ మొక్కిరండి పొందనుచు పంపి, మధ్య సాంబారులో నే మైమరచియుండ, పచ్చజెండాను పట్టి వూపాడు వెధవగార్డుగాడు. వాడొట్టి బ్లాగార్డుగాడు",



(Outputs) 14/10/08

"సిజరు పీల్చుటందు సిద్ధహస్తుడతండు, నవ్య విధి విధాత, సవ్యసాచి, దినము కొక్క టిన్ను కొనగ కుబేరుండు, ముష్టి అగ్గిపుల్ల ముష్టి ఎత్తు."

కళారాధకుడు, సంక్రాంతి కాన్కలు, చిత్రంగాలలో తప్పక చదవవలసినవి. పదేళ్ళ నుంచి భార్య సంగతి ప్రేయసీకీ, ప్రేయసి సంగతి భార్యకి తెలియకుండా గడపి ఒకనాడు పట్నాన కేగుదెంచి ఇద్దరికీ ప్రేమ లేఖలు వ్రాసి పడేశాడు – దాని దిందులో, దీన్ది దాన్లోను బెట్టి."

– శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

*    *    *

# విద్వాన్ విశ్వం



విద్వాన్ విశ్వం

'మీసరగండ విశ్వరూపశాస్త్రి (విద్వాన్ విశ్వం) అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో 1915 లో జన్మించారు. తండ్రి మీసరగండ మునిరామాచార్యులు మంచి ప్రోత్సాహమిచ్చి మరీ కొడుకుని చదివించారు. ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకులు తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి కాశీవిశ్వవిద్యాలయంలో విశ్వంగారికి సహాధ్యాయులు. ప్రాచ్య విద్యలు చదివి సామ్యవాదం వైపు మొగ్గ చూపిన ప్రజ్ఞావంతుడు విద్వాన్ విశ్వం. 1938 లో నవ్యసాహిత్యమాల స్థాపించి చాలా పుస్తకాలు ప్రచురించారు. ఫాసిజం, లెనిన్, స్టాలిన్ వంటి రాజకీయ గ్రంథాలు కూడా ప్రచురించి జైలుశిక్షలు అనుభవించారు. మీజాన్ పత్రికలో కొన్నాళ్లు పని చేశారు. ఆ తరవాత ప్రజాశక్తి సంపాదకవర్గంలో చేరారు. 1952 లో ఆంధ్రప్రభ వారపత్రికలో చేరారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణలకు ప్రధాన సంపాదకుడై, కథాసరిత్సాగరం 12 భాగాలలో అనువదించారు."

*    *    *

# బసవరాజాగారి ఇల్లు

"బసవరాజు అప్పారావుగారు బి.ఎ., పూర్తి కాగానే 'ఆంధ్రపత్రిక' సంపాదకవర్గంలో ఉద్యోగం లభించింది. తరువాత మేనమామ కూతురు రాజ్యలక్ష్మమ్మతో వివాహం జరిగి మద్రాసు మాంబలంలో కాపురం పెట్టారు. అక్కడ శ్రీ అడివికొలను సుర్యారావు. అబ్బూరి రామకృష్ణారావు, దువ్వూరి సాంబమూర్తి, అధికార్ల సూర్యనారాయణరావు, గంటి సూర్యనారాయణ శాస్త్రిగార్ల వంటి తెలుగు వారుండేవారు. వారంతా రాత్రి భోజనానంతరం సాహిత్యాది చర్చలతో కాలక్షేపం చేస్తుండేవారు. నండూరి సుబ్బారావు గారు సిటీలో ఉండి తరచూ వస్తుండేవారు. మద్రాసు



(Outputs) 14/10/08

వచ్చినపుడల్లా శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు అప్పారావుగారి అతిథిగా ఉండేవారు. వారున్న రోజులలో వారిని చూడటానికి వచ్చే సాహితీ బంధువులూ, కళాభిమానులూ, రాజకీయవేత్తలతో అప్పారావుగారి ఇల్లు కళకళ లాడేది.

❋ ❋ ❋

# ప్రేమమూర్తి

"బాపిరాజు ఎన్ని పాటలు, గేయాలు వ్రాశాడో లెక్కలేదు. చిత్రకళలో అతను చాలా గొప్ప పేరు సంపాదించాడు. అతనిలో ఉన్న భావుకత, కవిత్వమే అతని వర్ణచిత్రాలలోను కనిపిస్తుంది. అతను వ్రాసిన కథలు, నవలలూ అనేకాలు. వాటిలోని కల్పన లత్యద్భుతములైనవి. అతనికి కథా, నవలా, గేయమూ వ్రాయడమంటే ఒక ఆటవంటిదే. కూర్చుంటే పుటలకు పుటలు లేఖకులకు చెప్పివేసేవాడు. తడబాటు లేదు. తడుముకోవడం లేదు. అంతటి నిశితమైన ప్రజ్ఞ అతనిది. అతడు ప్రేమమూర్తి. అతను ఉన్నచోటల్లా ఆనందం తాండవిస్తూ ఉండేది. అతనిది చాలా గొప్ప మనసు. నవ్యాంధ్రలోకాన్ని సాహిత్యంలోను, కళలోను తనకు గల ప్రజ్ఞా విశేషం చేత ధీవిశేషం చేత దీప్తిమంతం చేసిన ప్రతిభావంతులలో అడవి బాపిరాజు ఒకడు".

**– మల్లంపల్లి సోమశేఖరశర్మ**

❋ ❋ ❋

# నా కత్తి కవిత

"జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు – పేదరికం, కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండోది నాలో ఎదిరించే శక్తిని పెంచిందేగాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్నీ కుల భేదాన్నీ కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకో దలచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవిత."

**– గుఱ్ఱం జాషువా**

❋ ❋ ❋


# రాయిస్టు

"1936 ఏప్రియల్ 10 వ తేదీన ఇండియన్ ప్రోగ్రసివ్ రైటర్స్ కాన్ఫరెన్స్ లక్నోలో జరిగింది. ఆ సాహిత్య సభకు మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసాన్ని హిందీలో చదివారు. అబ్బూరి రామకృష్ణారావు గారు ఆంగ్లంలో మాట్లాడుతూ ఉంటే, హిందీలో ప్రసంగించమని ప్రేమ్‌చంద్‌తో సహా కొంతమంది ప్రతినిధులు పట్టుబట్టడంతో



(Outputs) 14/10/08

కొంత ఘర్షణ జరిగింది. ఇది యం.యన్.రాయ్ దృష్టికి వచ్చింది. లక్నో సభలో అనేక తీర్మానాలు ఆమోదించారు. ఒక మానిఫెస్టోను రూపొందించారు. దాని ప్రాతిపదిక మీద అన్ని రాష్ట్రాలలో రచయిత. సంఘాల్ని స్థాపించాలని తీర్మానించారు. ఆంధ్రాలో సంఘాన్ని స్థాపించే బాధ్యత రామకృష్ణారావు గారిపై పెట్టారు. లక్నో నుండి 'ఇండియన్ లిటరేచర్' అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించాలని సంకల్పించారు. దాని సంపాదకవర్గంలో అబ్బూరివారిని చేర్చుకున్నారు. కార్యభారాలను తమ భుజంపై వేసుకుని అబ్బూరివారు వాల్తేరుకు తిరుగుముఖం పట్టారు. అబ్బూరివారు లక్నో నుండి బయలుదేరే ముందు కపూర్ రెస్టారెంట్ అనే భోజనశాలలో ఒక అగంతక వ్యక్తి కనిపించి రాయ్ సాహిత్యాన్ని అబ్బూరివారి చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. ఈ విధంగా మొదట రాయ్ సాహిత్యంతో పరిచయం, పిదప యం.యన్.రాయ్‌తోనే ప్రత్యక్షంగా సహచర్యం అబ్బూరి వారికి కలిగింది.



అబ్బూరి

ఇల్లు చేరుకున్నాక అబ్బూరివారు శ్రీరంగం శ్రీనివాసరావును పిలిచి లక్నో మానిఫెస్టోను ఇచ్చి, అతని సహకారంతో 'ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘం' అనే సంస్థను స్థాపించారు. తాను అధ్యక్షులు, శ్రీశ్రీ కార్యదర్శి. ఊళ్లోనే ఉన్న గుడిపాటి వెంకటచలంగారిని సభ్యులుగా చేర్చారు. ప్రణాళిక అచ్చువేసి ప్రకటించారు. అయితే సంఘ నిర్మాణం అక్కడితో ఆగిపోయింది. అబ్బూరి వారికి ఎం.ఎన్.రాయ్ భావాలు నచ్చాయి. వాటిని విశాఖపట్నంలోని కమ్యూనిస్టు స్నేహితులతో చర్చించసాగారు. అప్పుడు చంద్ర రాజేశ్వరరావుగారు విశాఖపట్నంలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన తమ సాటి సభ్యులలో ఉన్న అనుమానాలను తొలగించడానికి కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్‌లో ఎం.ఎన్. రాయ్ విచ్ఛిన్నకర పాత్రను ఓపిగ్గా వివరించసాగారు. అంతర్జాతీయంగా ట్రాట్స్కీయిజాన్ని, జాతీయంగా రాయిజాన్ని ఎదుర్కోవలసిన అవసరాన్ని పుచ్చలపల్లి సుందరయ్యగారు సామ్యవాద శక్తులకు ఉద్బోధించసాగారు.

అబ్బూరివారు విభేదించారు. 1937 లో ఎం.ఎన్.రాయ్‌గారు మన రాష్ట్రానికి వచ్చారు. అబ్బూరివారు కాకినాడ వెళ్ళి రాయ్‌గారికి కలుసుకున్నారు. వాల్తేరుకు ఆహ్వానించారు. ఒక ఆరు వారాలపాటు రాయ్‌గారు వాల్తేరులో ఉన్నారు. అబ్బూరివారు ప్రతిరోజు రాయ్‌గారితో గడిపారు. ఎన్నో విషయాలు చర్చించారు. కమ్యూనిస్టులతో తెగతెంపులు చేసుకుని రాయిస్టుగా మారారు. అంతేకాకుండా విశాఖపట్నంలో తొలి నుండి హోల్‌టైమర్‌గా పని చేస్తున్న కె.ఎల్. నరసింహారావుగారిని తమవైపు తిప్పుకున్నారు. అబ్బూరివారితోపాటు వారి మానసపుత్రుడు శ్రీరంగం శ్రీనివాసరావు కూడా రాయిస్టు అయ్యాడు."

– ఆరుద్ర

* * *



(Outputs) 14/10/08

# మహాప్రస్థానం



శ్రీశ్రీ

"శ్రీరంగం శ్రీనివాసరావు మంచి భావుకుడు, జిజ్ఞాసి. ఆయనకు స్థిరత్వం తక్కువ. ఇహమంటే మక్కువెక్కువ. నీతన్నా, సత్యమన్నా, శీలమన్నా మోజులేని మనిషి. ఆయనా మొదట్లో ఛందోబద్ధంగా కవితలల్లారు. రాణింపుకు రాలేదు. అలాగే సాగిపోతే రాటుదేలి రాణింపుకు వచ్చేవారేమో! అంత ఓపికాయనకు లేక ఎర్రజెండా నీడన చేరారు. గర్జించు రష్యా, గాండ్రించు రష్యాయని గర్జనలు సలిపాడు. గాండ్రు గాండ్రుమని గర్జించాడు. గ్రావంబంత ఎత్తుకు ఎదిగాడు. "మహాప్రస్థానం"తో మాన్యుడైనాడు. ఆంధ్రావని మన్ననలందుకొని మహాకవిగా వినుతికెక్కాడు. అరుణవర్గీయుల ఎదలో స్థిరపడినాడు. పద్యకవిగా గాక గేయకవిగా సుప్రసిద్ధుడైనాడు. మాత్రాఛందస్సుతో వ్రాసినవి మధురంగా హృద్యంగా, మనోహరంగా రూపొందించాడు. ఎదనిండా శబ్దజాలం నింపుకున్న మనిషి గనక శబ్ద సౌందర్యం మహాప్రస్థానం నిండా అగుపర్చాడు. రష్యాపుంస్కోకిలను మదినిండా ప్రేమించాడు. ఆ కోకిల దృఢ స్వరం క్షీణించింది. స్వర భంగమై వాక్పలనం దాపురించిన దుస్థితి చూడకుండా దీర్ఘనిద్ర చెందినాడు. అంతవరకు అదృష్టవంతుడు శ్రీశ్రీ. ఇక ఆయన పొత్తం గూర్చి చెప్పుకుందాం.

'మహాప్రస్థానం' అంటే దీర్ఘనిద్ర. అదే మరణమన్న అర్థం గైకొంటున్నారు అనేకులు. మహాభారతంలోని ధర్మరాజాదుల మహాప్రస్థానమును తలచుకొని ధర్మరాజాదులు స్వర్గారోహణకు పతనమైన ఘట్టం అది. శ్రీశ్రీ నాస్తికుడు. స్వర్గనరకాల నమ్మకం ఆయనకు లేదు. "హరోంహరా" అన్న పలుకుల్ని ఆయన వాడకపోలేదు. ఆయన మహాప్రస్థానం నిండా గీర్వాణ భాషారవములనే వాడి గేయాలకు సొబగును చేకూర్చాడు నిజమే. కానీ ఆయనకు భగవంతుడన్నా, స్వర్గనరకాలన్నా విశ్వాసం లేదు. అందువలన దీర్ఘప్రయాణం (మరణం) అన్న అర్థంలో 'ప్రస్థానం' పలుకు వాడి యుండడు. 'యాత్ర' గమనం అన్న అర్థాలు ప్రస్థాన గీర్వాణరవమునకున్నా మహా = గొప్ప, ప్రస్థానం = గమనం (నడక) అన్న పేరు తన పొత్తమునకు పెట్టాడా ? లేక ప్రస్థానం అంటే కావ్యం అనే అర్థం గీర్వాణరవమునకున్నది.

'ప్రస్థానత్రయం' (ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత) తత్వ వాఙ్మయములో 'ప్రస్థానం' కావ్యానికి పేరుగా వాసి గాంచియున్న భోజుడు శృంగార ప్రకాశము (సాహిత్య ప్రకాశము అని కూడా పేరు) ప్రబంధముల గూర్చి వివరిస్తూ – ప్రబంధములు ద్వివిధం. ప్రేక్ష్యము, శ్రవ్యమునని. అందభినేయము ప్రేక్ష్యము. అయ్యది నాటకాది భేదమున 24 భేదములు గలది.

(1) నాటకము (2) ప్రకరణము (3) వ్యాయోగము (4)ఈహామృగము (5) సమవకారము (6) డిమము (7) ఉత్సృష్టికాంకము (8) భాణము (9) ప్రహసనము (10) వీధి (11) నాటిక



(Outputs) 14/10/08

(12) సట్టకము (13) శ్రీ గడితము (14) దమ్మిల్లిక (15) ప్రస్థానము (16) కావ్యము (17) భాణకము (18) భాణిక (19) గోష్ఠి (20) హల్లీనకము (21) నర్తనకము (22) ప్రేక్షణము (23) నాట్యము (24) రాహము అని. ఇందు పదునైదవదయిన 'ప్రస్థానము' ఉత్కంఠకరముగా అంత్యమున వీరరసము చిప్పిలుచుండు రచన. ప్రాకృట్ వసంత ఋతువర్ణనాది విషయాలతో నుండునది.

మహాప్రస్థానం - గొప్ప కావ్యం లేక ప్రబంధము అను అర్థము వచ్చునట్లుగా పేరు బెట్టి, అలా అని వివరించుటకు సాహసించలేకపోయినారని నాకనిపించుచున్నది."

**- ప్రకాశచంద్ర శతపధి**

❋ ❋ ❋

# యోగ్యాతాపత్రం

"1940 లో పరప్రభుత్వానికి నిరసనగా ఆంధ్రప్రభను మూసేశారు. శ్రీశ్రీ నిరుద్యోగి అయ్యాడు. మహాప్రస్థానం గీతాలను పుస్తక రూపంలో తీసుకురావడానికి మళ్లీ ప్రయత్నాలు చేశాడు. విశ్వనాధ సత్యనారాయణగారు దీన్ని అచ్చే వేయిస్తామన్నారు. 1940 లోనే చలంగారి చేత జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి ఈ గ్రంథానికి ఉపోద్ఘాతం రాయించాడు. చలం అప్పుడు నిరీశ్వరవాది. శ్రీశ్రీ అరాచకవాది. అందుచేత ఈ పీఠికను "యోగ్యతాపత్రం" అని శ్రీశ్రీ భావించి కుండలీకరణాలలో 'అరాచకవాదికి - నిరీశ్వరవాది' అనే మాటలు శ్రీశ్రీ చేర్చాడు. ఉత్తరోత్తరా ఈ వివరణ ఉపసంహరించుకొన్నాడు. చలం ఇంట్రోను రాసినా విశ్వనాధవారు ఏ కారణాల వల్లనో ఆ సంకలనాన్ని అచ్చు వేసి పెట్టలేదు."

**- ఆరుద్ర**

❋ ❋ ❋

# మామూలు



**చెళ్ళపిళ్ళ**

"పళ్యాలంటే యేమిటో యిప్పటి వారికి తెలియనే తెలియదు. నాకు ఇరవైయేళ్ళు వచ్చే వరకున్నూ కవులకు, తోలుబొమ్మలాటకు, హాస్యగాళ్ళకు, యింకా యెక్సెట్రాలకు కోమట్ల యిండ్లలో జరిగే వివాహాలలో పళ్యాలు (సన్మానాలన్న మాట) కంపల్‌సరీగ యిచ్చే ఆచారం వకటి వుండేది. ఆ యేర్పాటు మన పూర్వ జమీందార్లు యేర్పరచి ఆయా విద్యలకు పట్టాలిచ్చి వున్నారు. అందుచేత యిచ్చి తీరవలసిందే కాని యెగొట్టడానికి వీల్లేదు. నేను కూడా వొకటి రెండు పళ్యాలు యెత్తిన వాణ్ణే. మా వంశం కవితావంశం కావడం



(Outputs) 14/10/08

ఆ గౌరవం మా ప్రాంతంలో మా వంశస్థులకు (కవిత్వం చేతకాని వాళ్ళకు కూడా) వుండేది. యిటీవల కోమట్లు తెగులుమీరి యివ్వడం మానేశారు. పిఠాపురం ప్రాంతం గొల్లప్రోలు గ్రామంలో కోర్టుదాకా వెళ్ళింది ఈ విషయం. దానిలో కోమట్లే గెల్చి వుంటారు. పిండిప్రోలు కవిగారు పెళ్ళి అయిన సంవత్సరంలోగా యెప్పుడైనా వెళ్ళి వసూలు చేసేవారట. సకాలంలో మీరు రాలేదు గనక యిచ్చేది లేదని ఒక కోమటి నిర్భయంగా సతాయించి కూర్చునేటప్పటికి, మన కవిగారు "పిండీ, ప్రోలూ లేకుండా నీ యింట్లో పెండ్లేలా జరిగింది ? బాగా ఆలోచించుకో జాగ్రత్త!" అని కళ్ళెర్ర జేసేటప్పటికి, ఆ వర్తకుడు భయపడి కాలదోషశంక వదులుకొని పెండ్లి మామూలు యిచ్చి పంపించినట్లు చెప్పగా విన్నాను."

**– చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి**

* * *

# గర్వకారణం

"మద్రాసు ప్రభుత్వం శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రుల వారిని ఆస్థానకవిగా ఎన్నుకుంది. ఎన్నుకొని తానుగూడా ఆ గౌరవం పొందింది. వేంకటశాస్త్రిగారు అస్వస్థత వల్ల పదవీ స్వీకారానికి మద్రాసు పోలేదు. అది బాగానే ఉందనిపించింది. ఎందుకు వెళ్ళాలి ఆ కవివీరుడు ? తరువాత విజయవాడలోనే బ్రహ్మాండమైన ఉత్సవం చేసేరు. వారిని గౌరవించడానికి రెండు మూడు రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు, విశ్వవిద్యాలయోపాధ్యక్షులూ ఎందరో వచ్చి వారి యెడ తమకున్న గౌరవం తెలుపుకున్నారు.

ఆనాడొక చిన్న సంఘటన జరిగిందని విన్నాను. తిరుపతి వేంకటకవుల గురించి విన్న ఇతర గాథలలో అది సరిపోతుంది. ఒక శిష్యుడు – మంచం పట్టి ఉన్న ఆయన దగ్గరికి వెళ్లి ఫలానా ముఖ్యమంత్రులూ, పెద్దలూ మిమ్మల్ని చూడ్డానికి వస్తాం అంటున్నారు" అన్నాడట. "సరే, మూడు గంటలకు దర్శనం ఇస్తాం అని చెప్పు" అని ఆయన అన్నారట. ఏమో ఇది నిజం అవునో కాదో! నిజం అనడానికి వీలు ఉంది. నిజం అయితే బాగుంటుంది కూడా అనిపిస్తుంది. కాస్త అక్షరజ్ఞానం గల ప్రతివాడికీ గర్వం కల్గిస్తూందీ కథ."

**– దేవులపల్లి కృష్ణశాస్త్రి**

* * *

# గోల శ్రీశ్రీ

"గజ్జల మల్లా!

నీ గేయాలు చదివాను. మళ్ళీ చదివాను. ఈ పాతికేళ్ళలో నేను కూడబెట్టుకున్న కీర్తిని నువ్వు పాతికకన్నా తక్కువ కావ్యాలలో తస్కరించావని నీ మీద కేసు పెడుతున్నాను. నువ్వు



(Outputs) 14/10/08



గజ్జల

వట్టి మార్క్సిస్టు మాత్రుడివి గాక నిజమైన కవివే ఐతే, చోరీ సొత్తు యధాస్థానంలో దాఖాలుచెయ్యి. నువ్వేదో నీ రాజకీయాలేవో చూచుకోక అనవసరంగా కావ్య జగత్తులో కూడా దురాక్రమణ చెయ్యడం నీకేమైనా బావుందీ ? ఐనా గుండెల మీద చెయ్యి వేసుకొని చెప్పు. అరసున్నా ఎక్కడ పెట్టాలో నీకు తెలుసా ? (రాయలసీమ వాడివి కాబట్టి బండిరాల సంగతి దాటవేస్తున్నాను)

నీకు ఇంగ్లీషు రాదు. ఫ్రెంచి రాదు. సంస్కృతం రామ రామ రానే రాదు. ఇలాంటి వాడివి నువ్వు తెలుగు కవిత్వం రాయడమేమిటి చెప్పు.

క్షణికంబులు, తాత్కాలికంబులునగు సమకాలిక సమస్యలా నీ కవితా వస్తువులు ? నువ్వు భారతీయ సంస్కృతికి తీరని కళంకం తెచ్చావు. సార్వకాలిక సమస్యలు, శాశ్వత విలువలు నీకేం తెలుసునంటా ?

తెలియదని నాకు తెలుసు కాబట్టి నీ కవిత్వం ఉత్త ప్రాపగాండా అని రూలింగ్ యిచ్చాను.

మళ్ళీ చెబుతున్నాను మల్లా! నువ్వు కవివి కావు. కావు. కావు..... ఇది కాకిగోల అనుకున్నా సరే నువ్వు కవ్వి కావు.

ఇట్లు

**– మహా మహా మహాకవి శ్రీశ్రీ**

(విశాలాంధ్ర దినపత్రిక)

* * *

# సతీస్మృతి



కొమర్రాజు

"వడ్డాది సుబ్బారాయుడిగారి వైవాహిక జీవితం చాలా పరితాపకరమైనది. వారికి కళత్ర వియోగం అలా వాటిల్లుతూనే వచ్చింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు, అయిదుగురు భార్యలు వరుసగా పోయినారు. మొదటి భార్య పోయినప్పుడు 1881 లో సుబ్బారాయుడుగారు తమ దుఃఖాన్ని 'సతీస్మృతి' అనే కావ్యంగా వెళ్ళబోసుకున్నారు. ఈ రచనను ఆనాటి పత్రికలు అచ్చువేయడానికి నిరాకరించాయి. అయితే కొక్కొండ వెంకటరత్నం గారు తమ 'ఆంధ్ర భాషా సంజీవని'లో ప్రకటించారు. ఉత్తరోత్తరా ఈ రచన పుస్తక రూపంలో వెలువడింది. దీనిని చదివి కొమర్రాజు వెంకట



(Outputs) 14/10/08

లక్ష్మణరావుగారు ఉత్తేజితులై 'వియోగగీతి' అనే మరాఠీ కవితను రచించి ప్రచురించారు. అది పాఠకుల హృదయాలను కదిలించి వేసింది. ఇంత చిన్నతనంలో కవికి భార్యావియోగం కలిగినందుకు, ఎందరో వచ్చి పరామర్శించారు. ఊరడింపు ఉత్తరాలు చాలా వచ్చాయి. అయితే అప్పటికి లక్ష్మరావుగారికి పెళ్ళి కానేకాలేదు."

❋ ❋ ❋

# మహా సందేశం

"ఏ మహాకవీ ముసలివాడు కాదు. అతనికి వార్ధక్యం ఉండదు. ఎప్పుడూ తరుణుడే. చిలకమర్తి లక్ష్మీనరసింహం జీవితం నుండి మనం నేర్చుకోవలసిన మహాసందేశం ఒకటి వుంది. అది ఆశావాదం. ఆయన కెప్పుడూ నిరాశ జనించలేదు. 'మిల్టన్' ఒకానొకప్పుడు తన అంధత్వానికి వగచాడు. కాని ఈయన అలా కాదు. బాహ్యదృష్టి లేకపోయి, అంతర్దృష్టి ఉన్నదా అనిపించుతుంది. వీరి హాస్యంలోని గొప్పతనానికి కారణం వీరి నిష్కల్మష హృదయమేనని నా అభిప్రాయం. బాహ్యప్రపంచంలోని ఆనందాలను వీరు చూడలేకున్నా, సమస్త విషయాలను అర్థం చేసుకుని, తమ కవిత్వం వల్ల బాహ్యప్రపంచాన్నంతటినీ ఈ మహాకవి ఆనందింప జేస్తున్నారు. ఇది సామాన్య మానవునికి సాధ్యమైన పనిగాదు. వీరిని గౌరవించడం ఎంతో ప్రశంసనీయమైన కార్యం."

**– దేవులపల్లి కృష్ణశాస్త్రి**

(30–12–1944 న ఆంధ్ర అభ్యుదయ రచయితల రెండవ మహాసభలో
చిలకమర్తి వారిని సన్మానించిన సందర్భమున)

❋ ❋ ❋

# అమ్మ

"నాయని సుబ్బారావుగారి పద్యరచనాధార నిరాఘాటమైనదీ మెత్తనిదీను. వచన రీతి తలచూపనే చూపదు ఎక్కడా. "కడలి వరకు వాకలు కట్టి 'పారు' గిరికుమారుని ప్రేమగీతాల పొంగు" వలె వీరి పద్యాలు ప్రవహిస్తాయి. వీరి మాతృగీతాలు ఆనాటి ప్రేయసీ గీతాల నడుమ సర్వజనాదరణము పొందినవి. తల్లి అందరికీ అభిమాన పాత్రురాలే కదా ? 'పోయినది పార్వతీదేవి' అన్నారుట మరణించిన ఈయన తల్లిని కనుటకు వచ్చిన జనము. ఈయన అంటారు. "మరల నీ వచ్చుటెన్నడో మంట మండు నా కడుపులోన కుడుము లుండ్రాళ్ళు పడియు చలువలూరించుటెన్నడో తెలియబడదు. జగతి నింక వినాయక చవితి లేదో" అని."

**– శ్రీపాద గోపాలకృష్ణమూర్తి**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# చాటువు

"ఆంధ్రరత్న గోపాలకృష్ణుని చాటువులు" అనే చిన్న పుస్తకం మొదటి ముద్రణకు, రెండవ ముద్రణకు చిన్న తేడా వుంది. మొదటి ముద్రణలోని 'ఎంకిపాటలు' పై గోపాలకృష్ణయ్యగారు చేసిన విమర్శ అసభ్యతగా ఉండగా, ఆచార్య రంగా గారి కోరిక మీద రెండవ ముద్రణలో తొలగించి, కొందరు మిత్రుల కోరికపై ఆంధ్రనాయకులపై చెప్పిన చాటువును కలిపారు."

మ॥ ఉపమాపై పెసరట్టు పూ యిడలి పూ గుమ్మంచు చూపించు నీ
జపసంబద్ధ పరాక్రమ కటాక్ష శ్రేణి మన్నించి శు
భ్రపు జిల్లేబి పకోడిల ద్వయియి నాపై కొంత రానిమ్ము శ్రీ
చపలా పాంగ సీతాంగ నా హృదయ పాశా పూజ్య వస్తు ప్రియా

**– అబ్బూరి రామకృష్ణారావు**

(దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని సంబోధిస్తూ)

❋ ❋ ❋

# హంపీక్షేత్రము



**విశ్వనాథ**

"చిన్నతనంలో తన మేనమామ కామరాజుగడ్డ శివ యోగానందరావు గారితో కలిసి కొడాలి సుబ్బారావు గారు కవిత్వం అల్లడం నేర్చుకున్నారు. కాని ఆ రచనల్లో సుబ్బారావుగారి ప్రత్యేకత ఏదీ గోచరించలేదు. ఆయన వర్ణ్య వస్తువుని దూరం నించి చూచి వర్ణిస్తున్నట్లుంటుంది. పద్యం కూడా ఆయన ఎక్కి సవారి చేసే గుర్రం లాగా కాక, ఆయన పదిలంగా కాపలా కాసే లేడిపిల్లలాగు కనబడుతుంది. కాబట్టి ఆ కాలపు రచన సుబ్బారావుగారిలో అణిగివున్న భాషాభిమానాన్ని చూపించడానికి తప్ప మరెందుకూ అక్కరకు రాదు. మొదటి పుస్తకం అచ్చువేసిన తర్వాత సుబ్బారావుగారు చాలాకాలం మౌనం దాల్చారు. ఈ ఘట్టంలో, పద్యాల్ని ఇంజన్లలాగు నడిపించగల శక్తి ఆయనలో నెమ్మదిగా చేరుకుంది కాబోలు. అదృష్టవశాత్తూ విశ్వనాథ సత్యనారాయణ గారి పరిచయ స్నేహాలు కూడా ఈయనకు లభించాయి. విశ్వనాథవారంటే మూర్తీభవించిన ఆవేశమే. అందులో పద్యపఠనా కాలంలో మరీని. సంతత సాహచర్యమూ, సమానత్వము – రెండూ చేరి వారి ఆవేశాన్ని వీరికి ఆవహించేటట్లు చేశాయి. సత్యనారాయణగారు అప్పటికి ముఖలింగమూ, వేగీ వంటి చారిత్రక క్షేత్రాలు దర్శించి ఆంధ్రప్రశస్తిని కీర్తించి ఉన్నారు. హంపిని గూర్చి ఆయన కావ్యమల్ల లేదు. అది సుబ్బారావు గారి వంతుకు వచ్చింది. సరిగా ఈ వేళకి వారణాసి శ్రీనివాసరావుగారు



(Outputs) 14/10/08

తోడ్కొని పోయిన విద్యార్థి బృందముతో సుబ్బారావుగారు హంపి వెళ్లడం కూడా తటస్థించింది. హంపిలోని ప్రతి శిల యొక్క చరిత్రా వెంకట రంగయ్యగారు చెప్పినట్లు చెప్పగలరట వారణాసి శ్రీనివాసరావు గారు. వారు చెప్పిన కథలన్నీ మనసుకి పట్టించుకుని, ఏకాకిగా తిరిగి కవితా సమాధి నలవరుచుకొన్నారు కొడాలి సుబ్బారావుగారు. దాని ఫలమే 'హంపీ క్షేత్రము".

**– శ్రీపాద గోపాలకృష్ణమూర్తి**

❋ ❋ ❋


# కరుణశ్రీ

"పద్యాన్ని మాటగా, పాటగా, సూక్తిగా, స్ఫూర్తిగా మలచిన చతుర చతురాసనుడు కరుణశ్రీ. కళ్ళనిండా దయ, కవిత నిండా లయ ఉన్న సాదు వర్తనుడాయన. ఒకే కవితా సంపుటి అచ్చులో యాభై జన్మలెత్తిందంటే అది కరుణశ్రీ సురుచిర ప్రతిభకు అక్షరపతాక."

**– సి. నారాయణరెడ్డి**

❋ ❋ ❋

# సౌందర్య తపస్వి



శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

'భారతి' తెలుగువారికి ఇచ్చిన ముగ్గురు నవకవులు – జాషువా, కొడాలి సుబ్బారావు, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి గారలు. శ్రీనివాసమూర్తిగారు రాయలసీమ కోయిల. తలమర్ల గ్రామ జన్ములు. ఆజన్మ సిద్ధమైన ప్రకృతి సౌందర్య దిదృక్ష వీరి స్వభావానికి జీవనము. 'మంజులంబయి తోచు బ్రహ్మాండమెల్ల కౌగలింతు నొక్కొక్కమారు గాఢరక్తి' అంటారీయన. 'లోచనోత్సవకరమైన ఈ ప్రకృతి తన్వి విలాసము గాంచి' నివ్వెరపోతారు. 'పక్షిగా ప్రసూనముగా భావవీచికగా మనోహర నిర్ఘరిగా' ఒక్కొక్క మారు, మెరుపుగా గర్జితంబుగా మేఘమాలగా సురేంద్ర చాపప్రభగా ఇంకొక మారు పరమేశ్వరుని సరణులు దర్శించుకుంటారు. శ్రీనివాసమూర్తిగారు జన్మతః సౌందర్య తపస్వి. విశ్వవిభుని సుందరోద్యానమే తపోవనముగా పెద్దకాలము వీరు సౌందర్యాన్వేషణ చేశారు. మీలాగా నాలాగే 'క్షితిని రాలిన తొలకరి చినుకు నమ్మి లేతపైరులు నాటి, ఎదిగి కేదారమెల్ల ఫలించినపుడు కనులగాంచెడు భాగ్యము కలదో లేదో"అని సంశయాకులౌతారు. 'పూరిగుడిసెలలో నైనా బుత్తుగాని గీతమల్లక బ్రదుకు సాగింపలేన'నే తత్వము వారిది. భావనాపథము బట్టిపోయే వారిని చూచి 'శ్రీనివాసమూర్తి' కాదు 'ఉన్మాదమూర్తి' అన్నది లోకము. ప్రకృతిలో వలెనే ఈయన రచనలో ఎన్నో మారులు వింటాము కోయిల కూతను."

**– శ్రీపాద గోపాలకృష్ణమూర్తి**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# సరస్వతి గ్రంథమాల

"చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు పోలవరం జమీందారు కొచ్చెర్లకోట వెంకట కృష్ణారావుగారి పేరు మీద 'సరస్వతి' అనే పత్రికను ప్రారంభించారు రాజమండ్రిలో. 1899 లో జమీందారుగారు పత్రికతోపాటు కొత్తపల్లి సూర్యారావుగారిని కాకినాడ తీసుకువెళ్ళారు. సరస్వతి గ్రంథమాల పేరుతో చిలకమర్తి గారి 'సౌందర్య తిలక', ధరణీ ప్రగడ శివరావుగారి 'భువనమోహన',; ఎన్. మూర్తిరాజుగారి 'కాంచనమాల', కొత్తపల్లి సూర్యారావుగారి 'ఫసానే అజాయబు', 'ఆతింతాయి', 'బీరబల్ వినోదాలు' ప్రచురించారు."

❋ ❋ ❋

# లేఖ

బాజే శివపురం

హోవడా



ఠాగూర్

రవీంద్రనాధ ఠాకూర్‌కు!

శ్రీ చరణములకు!

మీరు నా పట్ల మిక్కిలి అసంతృప్తులైనట్టు పిల్లల ద్వారా విన్నాను. మిమ్మల్ని గురించి నేనేదైనా లేనిపోని మాట ఆవేశంతో అంటే అని వుండవచ్చు. కాని ఆ మాట నిజమో, అబద్ధమో తెలుసుకోవాలని ఆ వ్యక్తి మీ దగ్గరికి వచ్చి అడగటం మంచి పని కాదు. ఆ పంజాబ్ దేశీయుడు రాసిన లేఖను పురస్కరించుకుని మీరు ఇంగ్లండు విషయమై చాల క్షుబ్ధచిత్తులైనారు. అసలతడా లేఖ రాయకుండానే వుంటే ఈ గొడవంతా వచ్చేది కాదు. – అలా ఆ సమయంలో ఏమేమి మాట్లాడానో నాకు సరిగా జ్ఞాపకం లేదు. నేను కల్పించి అబద్ధాలు చెప్పేవాడిని కాను. నానోట ఎప్పుడూ అబద్ధమనేది రాదని కాదు. ఈసారి మీరు విదేశాల నుంచి వచ్చాక చాలా మారిపోయారని, వంగదేశ ప్రజల పట్ల మీకిదివరకుండిన ప్రేమ, వాత్సల్యం ఇప్పుడు లేవనీ, అసహాయోద్యమం పట్ల మీకు లేశమాత్రమూ శ్రద్ధ, విశ్వాసం లేవనీ – ఇలా కొన్ని మాటలు నేనన్నమాట నిజమే.

ఒకనాడు మిమ్మల్ని కలిసి మాట్లాడి కోపంతో తిరిగి వచ్చేశాను. ఆ తరువాతనే కొన్ని లేనిపోని విషయాలు ప్రచారం చేసి వుంటాను. లోకులు అపార్థం చేసుకుంటే చేసుకుంటారులే అన్న నిర్లక్ష్యభావం నాకు కలిగి వుంటుంది.



(Outputs) 14/10/08

మీ యెడల నేను మహాపరాధమే చేశాను. కాని ఇది మొదటి తప్పే కాబట్టి క్షమించండి. మీ ఒక్కరి దగ్గరకు తప్ప ఇంకెవరి దగ్గరకూ – వాళ్ళెంత గొప్పవాళ్ళయినా సరే – నేను సాధారణంగా వెళ్ళను. కాని నా స్వయంకృతాపరాధం వల్లనే మళ్ళీ మీ దగ్గరకు రావడానికి మొఖం చెల్లకుండా చేసుకున్నాను. ఇది నాకు చాలా విచారంగా వుంది.

మీ అనేకమంది శిష్యులలో నేనొకడిని. వారికి మల్లేనే నేను కూడా మిమ్మల్ని ఎప్పుడూ నిందించలేదు. కాని ఈ సారి ఈ దౌర్భాగ్యం ఎందుకు పట్టిందో తెలియదు. ఇవే మీకు నా నమస్కారములు.

మీ సేవకుడు,

**– శరచ్చంద్ర ఛటోపాధ్యాయ**

(శరత్)

* * *

# నవ్యసాహిత్య పరిషత్తు

“1911 లో పిఠాపురం మహారాజా వారి ఆశీస్సులతో జయంతి రామయ్య పంతులుగారు ‘ఆంధ్ర సాహిత్య పరిషత్’ స్థాపించారు. ఆనాటి తెలుగు సాహితీపరులైన ఛాందస గ్రాంధిక భాషావాదులు, వ్యవహారిక భాషావాదులు అందరూ ఆ పరిషత్‌లో సభ్యులు.

ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు గ్రాంధిక భాషను నిలబెట్టడమే ప్రధానోద్దేశం. అయినా ఆధునిక సాహితీపరులు అదే వేదికను ఉపయోగించి వాడుక భాషకు గుర్తింపు తేవాలనే ప్రయత్నం.

1924 అక్టోబరు 9 నుండి 13 వరకు పశ్చిమగోదావరిజిల్లా తణుకులో ఆంధ్రసాహిత్య పరిషత్తు 13 వ వార్షికోత్సవం ఆచటం వెంకటరాయ సాంఖ్యాయనశర్మగారి అధ్యక్షతన జరిగింది.

నవీనులంతా కలసి 1919 లో సాహితీ సమితిని ఏర్పరచారు. దానిలోని సభ్యులు సంచలనం కలిగించే సాహిత్యాన్ని సృష్టించారు. కాని 1930 నాటికి అది నీరసించింది.

బరంపురంలోని గురుభాగవతుల ధర్మారావుగారు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు సాహితీ పరులను ఆ వూరు ఆహ్వానించి 1933 మార్చి 10, 11, 12 తేదీలలో ‘అభినవాంధ్ర’ కవి పండిత సభను ఏర్పాటు చేశారు. చిలుకూరి నారాయణరావు గారు అధ్యక్షత వహించగా, గిడుగు రామమూర్తి గారు ప్రారంభోపన్యాసం గావించారు. చారిత్రాత్మకమైన ఆ సభలో మంచి నిర్ణయాలు తీసుకున్నారు.

గిడుగు రామమూర్తి గారి 70 వ జన్మదినం సందర్భంగా రెండవ సమావేశం 1933 డిసెంబరులో రాయప్రోలు సుబ్బారావు గారి అధ్యక్షతన రాజమండ్రిలో జరిగింది. ఈ సందర్భంలోనే ‘అభినవాంధ్ర కవి పండిత సభ’ను ‘నవ్యసాహిత్య పరిషత్తు’గా పేరు మార్చారు




(Outputs) 14/10/08

– ఈ పరిషత్తు 1934 లో తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రిగారి అధ్యక్షతన అనంతపురంలో, 1936 లో పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారి అధ్యక్షతన కాకినాడలో, 1937 లో గిడుగు రామమూర్తిగారి అధ్యక్షతన గుంటూరులో, 1938 లో బుర్రా శేషగిరిరావు గారి అధ్యక్షతన బందరులో, 1940 లో విశ్వనాథ సత్యనారాయణగారి అధ్యక్షతన బెజవాడలో, 1941 లో అడివి బాపిరాజుగారి అధ్యక్షతన మద్రాసులో, 1942 లో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి అధ్యక్షతన ఏలూరులో, 1944 లో కాటూరి వెంకటేశ్వరరావు గారి అధ్యక్షతన తెనాలిలో, 1946 లో మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అధ్యక్షతన ముక్త్యాలలో సభలు జరిగాయి.”

❋ ❋ ❋

# సమితి


తల్లావఝ్ఝల

“సాహితీ సమితి సభాపతులు తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రిగారు బహుభాషా ప్రవీణులు. నారాయణ తీర్థుల వంశములోని వారు. కావ్యానుభవమెంత ఉన్నా కడలి వలే గంభీరులు, ప్రియవాదులు. అనేక రీతులలో పలుకుతూండిన నవరచనా పరుల నందరినీ సాహితీ సమితిగా కూర్చి రచనలు అనుభవాలను బట్టి చేయ సూచించి నవ కవిత్వానికి బంగారు బాటు వెలయించిన దేశికులు. సౌందర్యమెవరి రచనలో ఉన్నా దానిని గుర్తించి చెప్పి నవ్యసాహిత్యానికి ఉత్సాహమిచ్చిన అమృతమూర్తి. ఈ అభిమాన గుణము ఈయనను ఒకరి దారిని ఒకరు పోని నవకవులకు అన్నగారిని చేసినది. ఒకరి నొకరు తిట్టుకునే సంప్రదాయానికి చెందిన తెలుగు కవులు వీరి స్నేహ ప్రభావముల మూలమున తిట్టుకొనుట మాని తమ తమ రచనలలో నిమగ్నులైనారు. ధనవంతుల నాశ్రయించిన వారికి ప్రీతికరమైన రీతులలో కవనమల్లే కవి తన సౌందర్య దర్శనోత్సాహాన్ని, తన బాధను, తన నిర్వేదాన్ని వస్తువుగా చేసి కావ్య రచన చేశాడు. నవ కవిత్వానికి ధ్యేయము ఏర్పడింది.

ఊరూరా కావ్య పఠన సభలు ఏర్పరచి, నవ కవిత్వాన్ని గురించి నచ్చజెప్పి, నవ కవిత్వములోని అందపు రచనలను వినిపించి, ప్రజాయుగంలో సారస్వత వ్యాపనానికి వీలిచ్చే సాధనాన్ని వీరూ, వీరి సమితివారూ చేపట్టినారు. కావ్యానుభవము వైయుక్తికమే అయినా, నాటక – ప్రేక్షకులలో వలె మోహప్రభావము కలిగి ఆనందాన్ని వెలిబుచ్చ సదస్యులూ, నిజంగా నచ్చి మెచ్చుకునేవారు దేశంలో ఏర్పడతారు. సాహితీ సమితి వార్షికోత్సవాలలో సమతి సభ్యులు కొందరు ఒత్తుగా టోపీ పెట్టినట్లుగా కనబడే జుట్టూ గిరిజాలు పెంచేవారు. కండువాలను వల్లెవాటుగా వేసేవారు – ఇది కవికి ఒక విశిష్ట వేషము అన్న అభిప్రాయం కలిగింది దేశంలో. యువకులు చాలామంది వల్లెవాటు కండువాలు వేసుకొని పద్యాలల్లడమూ, కావ్యపఠనాలంటూ



(Outputs) 14/10/08

చేయడం ప్రారంభించారు. రాజమండ్రిలో సారస్వత సమాజము, విశాఖపట్నములో కవితా సమితి, హైదరాబాదులో సాధన సమితి ఏర్పడ్డాయి. జంటకవుల ఉద్యమము వెళ్ళిపోయి సమితు లేర్పడ్డాయి. విమర్శా ప్రతివిమర్శలనే కాలకూటాన్ని ఈ సమితి నిర్మాణోద్యమాలు మింగేశాయి. ఈ రకపు సంఘీభావోద్యమానికి శివశంకర శాస్త్రిగారే పునాది వేశారనాలి.”

**– శ్రీపాద గోపాలకృష్ణమూర్తి.**

❋ ❋ ❋

# సినారె

ఆ పెదవి మెదిపితే ఆణిముత్తెపు జల్లు
ఆ కలము కదిపితే అందాల హరివిల్లు
అతని తీయని వాణి అది నిత్య కళ్యాణి
అతడు నిల్చిన క్షోణి అమృతలహరి ‘త్రివేణి’
అభ్యుదయ భావాల కాతడొక సెమినారె
బుధులరసినారె! ఆ మధుర సుకవి ‘సినారె’

**– కరుణశ్రీ**

❋ ❋ ❋

# అన్నదమ్ములు

“ఆధునిక ఆంధ్ర కవులలో ఓ ఇద్దరు నాకు కేవలం అభిమాన కవులేకాక నాకు చాలా ఆప్తులు, సన్నిహితులు. ఒకరు అన్న అయితే, ఒకరు తమ్ముడు. ఈ ఇద్దరు భిన్న భిన్న రీతులలో కవిత చెప్పేవారు. నా రచనా రీతికి, వారి రచనా రీతికి కూడా ఎంతో భిన్నత్వం ఉంది. అయినా ఎంతో సన్నిహితులం మేం ముగ్గురం. వారి పేర్లు ఏమిటో చెబుతాను. నాకంటే వయసులో కొంచెం పెద్ద కనక అన్నగా భావించేకవి ఆరుద్ర. రెండోవాడు వయసులో నాకంటే చిన్న గనక తమ్ముడుగా భావించబడుతున్నవాడు డాక్టర్ సి. నారాయణరెడ్డి.”

**– దాశరథి**

❋ ❋ ❋

# అభ్యుదయ రచయితల సంఘం

“చదలవాడ పిచ్చయ్య కృషి వల్ల 1943 ఫిబ్రవరి 13, 14 తేదీలలో తెనాలిలో ప్రథమాంధ్ర ‘అభ్యుదయ రచయిత సంఘ’ సమావేశం తాపీ ధర్మారావుగారి అధ్యక్షతన జరిగింది. రెండవ మహాసభ 1944 డిసెంబరు 29, 30, 31 తేదీలలో బెజవాడలో తెలికిచర్ల వెంకటరత్నం గారి



(Outputs) 14/10/08

అధ్యక్షతన జరిగింది. అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి శ్రీ సజ్జాద్ జహీర్ ఈ సభను ప్రారంభించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిని సన్మానించి, వెయ్యిన్నూట పదహార్లు ఇచ్చి సత్కరించి, వారి స్వీయ చరిత్రను ప్రచురించారు. మూడవ మహాసభ 1945 డిసెంబరు 31, 1946 జనవరి 1, 2 తేదీలలో రాజమండ్రిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగింది. ముల్కరాజ్ ఆనంద్‌గానీ, ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీగాని వచ్చి ప్రారంభిస్తారనుకున్నారు కాని, వారు రాలేదు. మహాసభను శ్రీశ్రీ ప్రారంభించారు. నాల్గవ మహాసభ 1947 జనవరి 17, 18, 19 తేదీలలో పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన మద్రాసులో జరిగింది. ప్రసిద్ధ అభ్యుదయ రచయిత క్వాజా అహమ్మద్ అబ్బాస్ సభను ప్రారంభించారు. 1947 స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సంఘంలో నిర్లిప్తత ఏర్పడింది. అయిదవ మహాసభ 1955 జులై 30, 31 తేదీలలో శ్రీశ్రీ అధ్యక్షతన విజయవాడలో జరిగింది. 1955 తర్వాత అరసం నిర్జీవమైపోయింది. కాని అభ్యుదయభావాలు సాహిత్యంలో విరివిగా వ్యాపించాయి. ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఆరవ మహాసభ ఒంగోలులో 1947 జనవరి 12, 13, 14 తేదీలలో చాగంటి సోమయాజులుగారి అధ్యక్షతన జరిగింది. ఈ సంఘం ఏడవ మహాసభలు విజయనగరంలో తర్వాత జరపడానికి ఏర్పాట్లు చేస్తూ ఒక సన్నాహక సంఘం కూడా రూపొందింది. అయితే ఎమర్జెన్సీ కారణాన సభలు జరగలేదు."

*　　　*　　　*

## విజ్ఞానచంద్రికా గ్రంథమండలి

"1906 వేసవిలో ఒకరోజు చెన్నపట్నంలోని మునగాల రాజాగారి బంగళాలో రాజా నాయని రంగారావుగారు, దివాను కొమర్రాజు లక్ష్మణరావు గారు, రావిచెట్టు రంగారావుగారు, గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, అయ్యదేవర కాళేశ్వరరావుగారు కలసి చర్చించి, గ్రంథాలయాలు నెలకొల్పితే చాలదు. వాటికి పుస్తకాలు అందించే సంస్థలు కావాలని నిర్ణయించుకుని కొమర్రాజు లక్ష్మణరావు గారి సారథ్యంలో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపించారు. ఏడాదికి నాలుగు పుస్తకాలు ప్రచురించాలనుకున్నారు. మొదటి పుస్తకం గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి 'అబ్రహం లింకన్' జీవిత చరిత్రను ప్రకటించారు. చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలపై అభిరుచి గల లక్ష్మణరావుగారు చారిత్రక నవలల పోటీ పెట్టగా పది నవలలు వచ్చాయి. వాటిలో దుగ్గిరాల రాఘవ చంద్రయ్యగారి 'విజయనగర సామ్రాజ్యము'కు మొదటి బహుమతి ఇచ్చి ప్రచురించారు. భోగరాజు నారాయణమూర్తి గారి 'విమలాదేవి', వేలాల సుబ్బారావు గారి 'రాణీ సంయుక్త', కేతవరపు వెంకట శాస్త్రి గారి 'రాయచూరు యుద్ధం', ఎ.వి. నరసింహం గారి 'పాతాళభైరవి' అందులో పేరెన్నిక గలవి. 1916 వరకు ముప్పై పుస్తకాలు వెలువరించారు. 1923 జూన్ 12 న లక్ష్మణరావు గారు కన్ను మూశారు. 1924 లో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని అయ్యదేవర కాళేశ్వరరావుగారు బెజవాడకు మార్చారు. 1924–34 మధ్య కాలంలో 18 పుస్తకాలను ప్రచురించారు.

*　　　*　　　*


(Outputs) 14/10/08

## అరసం

"తుమ్మల వెంకటరామయ్య, రాంభట్ల కృష్ణమూర్తి మొదలైన వారు తయారుచేసిన ప్రణాళికతో 'ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయిత సంఘం' అనే కొత్త సంస్థ స్థాపించబడింది. ప్రథమ మహాసభలు 1973 ఆగష్టు 10, 11, 12 తేదీలలో గుంటూరులో జరిగాయి. అదే ఆరవ మహాసభ అని చాటుకున్నారు. తరువాత జరిగిన 2, 3, 4 మహాసభలకి 7, 8, 9 అనే సంఖ్యలను కలుపుకున్నారు. 1974 లో ఒంగోలులో జరిగిన మహాసభను వీరు గుర్తించలేదు. ఈ అరసం చాలా జిల్లాలలో ప్రాంతీయ సంఘాలు ఏర్పాటు చేసి చురుగ్గా పనిచేసింది."

* * *

## గుర్తింపు

"జాతీయోద్యమము ప్రారంభమైనప్పటి నుంచి ప్రజాప్రబోధము జరుగుతూనే ఉంది. బలిజేపల్లి లక్ష్మీకాంతం, వడ్డాది సీతారామాంజనేయులు, దామోజీపురపు వెంకట నరసింహారావు, గరిమెళ్ళ సత్యనారాయణ, మద్దూరి అన్నపూర్ణయ్య వంటి దేశభక్తులందరూ ప్రజాప్రబోధము చేసినవారే. అభ్యుదయ రచయితలు వీరినెవ్వరినీ లెక్కపెట్టరు. కారణం నాకు ఒక్కటే స్ఫురిస్తున్నది. వారందరూ వీరి వలె వర్గ కలహాన్నీ కార్మిక కర్షక అభ్యుదయాన్నీ జండాకట్టి ప్రచారం చేయలేదు."

**– శ్రీపాద గోపాకృష్ణమూర్తి**

* * *

## ఆంధ్ర ప్రచారణీ గ్రంథమండలి

'బాలాంత్రపు వెంకటరావు గారికి, ఓలేటి పార్వతీశం గారిని నడకుదుటి వీరరాజు గారు పరిచయం చేశారు. ఇద్దరూ కలసి రచనలు చేద్దామనుకొని, బావా అంటే బావా అని వరస కలుపుకుని వెంకట పార్వతీశకవులు అని పేరుపెట్టుకున్నారు.

1909 లో తణుకులో వెంకట పార్వతీశ కవులు, కొవ్వూరి చంద్రారెడ్డి గారు, వారి ఆంతరంగిక కార్యదర్శి చాగంటి శేషయ్యగారు అనే ప్రచారకులు, అయ్యగారి నారాయణమూర్తి గారు కలసి 'ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలిక' స్థాపించారు.

నాలుగు దశాబ్దాలకు పైగా పుస్తక ప్రచురణను విజయవంతంగా చేశారు. ఈ గ్రంథమండలికి పిఠాపురం, ఉయ్యూరు, మునగాల, కపిలేశ్వరపురం, తుని, ఉర్లాము, విజయనగరం, జటప్రోలు, వెంకటగిరి మొదలైన సంస్థానాధిపతులు ఉదారంగా రాజపోషకు లయ్యారు. 1911 లో తొలి ప్రచురణ వేంకట పార్వతీశ కవుల 'వసుమతీ వసంతం' అనే



(Outputs) 14/10/08

నవల ప్రచురించారు. ఈ మండలి నెలకు రెండు పుస్తకాలు విడుదల చేసేది. మొదట నిడదవోలులో స్థాపించబడి, పిఠాపురంలో పేరు పొందింది. వందలాది నవలలు ప్రచురించి ఆంధ్ర పాఠకులకి సాహిత్యాభిరుచి, దేశాభిమానం కలిగించాలనే సంకల్పం నెరవేర్చుకుంది.

వీరేశలింగం గారు మొదటి నవలను ప్రారంభించినా, నవలారచనా పితామహులనే మాట వెంకట పార్వతీశ కవులకు చెల్లుతుంది. 'మాతృమందిరం', 'తిరుగుడు పెళ్ళి', 'ప్రమదావనము', 'వసుమతీ వసంతము', 'శ్యామల' మొదలైనవి వారి స్వతంత్ర రచనలు. వీరు బెంగాలీ, మరాఠీ, కన్నడ భాషల పుస్తకాలను అనువాదాలు చేశారు. బెంగాలీ నుండి బంకించంద్ర చటర్జీ రచనలు అన్నీ, రవీంద్రుని గోరా, నౌకాభంగము మొదలైన గొప్ప రచనలు అనువదించారు. 'పాంచకడే దేవ్' బెంగాలీలో వ్రాసిన అపరాధ పరిశోధన నవలలు కూడా అనువదించారు. వీరి రచనలను 'ఆంధ్ర ప్రచారిణి గ్రంథ మండలి' ప్రచురించింది."

❋ ❋ ❋

# దిగంబర కవులు

"1965 ఏప్రియల్ నెలలో సమాజము. సాహిత్యం గురించి ఆలోచించే ఆరుగురు యువకులు కేశరావు, యాదవరెడ్డి, రాఘవాచారి, భాస్కరరెడ్డి, మదన్‌మోహన్ సహాయ్, కమ్మిసెట్టి వెంకటేశ్వరరావు ఒక చోట కూర్చుని వారి ఆశయాలను, ఆశలను కలబోసుకున్నారు. కేశవరావు ఇచ్చిన ఉద్యమ స్వరూపం అంగీకరించారు. సంఘంలో నవ చైతన్యం కలిగించడం, కుళ్ళుని నాశనం చేయడం, బానిసత్వ మనసులను విప్లవాత్మకంగా నడిపించడం వీరి ధ్యేయం.

దిగంబర శకం, నగ్న నామ సంవత్సరం ఆశ రుతువు (సరిగ్గా క్రీ.శ. 1965 మే 6 వ తేదీ) న ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరం హైదరాబాద్‌లో ప్రప్రథమంగా ఆరుగురు యువకులు తాము దిగంబర కవులమని ప్రకటించుకున్నారు – నగ్నముని (మానేపల్లి హృషీకేశవరావు), నిఖిలేశ్వర్ (కె.యాదవరెడ్డి), జ్వాలాముఖి (ఆకారం వీరవెల్లి రాఘవాచార్యులు), చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), భైరవయ్య (మదన్‌మోహన్ సహాయ్), మహాస్వప్న (కమ్మిసెట్టి వెంకటేశ్వర్లు). దిగంబర కవుల సంచాలకుడు సుబ్రహ్మణ్యం. ఆ రోజే అర్ధరాత్రిZERO HOUR లో హైదరాబాద్‌లోని ఆబిడ్స్ సర్కిల్‌లో నాంపల్లి పాండు అనే రిక్షావాలా ఈ దిగంబర కవుల సంపుటిని ఆవిష్కరించాడు.

నిఖిలేశ్వర నామ సంవత్సరం మదిర రుతువు స్నేహవారం (సరిగ్గా క్రీ.శ. 1966 డిసెంబరు 18 వ తేదీ) నాడు ఇంకా భయం భయంగా బానిసత్వంగా దుర్భరంగా, హేయంగా ఛండాలంగా ఉన్న ఆంధ్రప్రదేశమనే మురిగ్గుంటలోంచి నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, భైరవయ్య, మహాస్వప్నలు పలికిన దిగంబర దిక్కులను (దిక్‌లు – 30, దిగంబర కవుల సంపుటి–2) విజయవాడ గవర్నర్‌పేట సెంటర్‌లో రాత్రి ZERO HOUR లో జింగాల చిట్టి అనే హోటల్ క్లీనర్ ఆవిష్కరించాడు.



(Outputs) 14/10/08

దోపిడీ వ్యవస్థను దిగంబర కవులు జ్వాలానామ సంవత్సరం (1968) వచ్చేసరికి కుష్ఠువ్యవస్థగా గుర్తించారు. వీరి మూడవ సంపుటి 'నేటి కుష్ఠు వ్యవస్థపై దిగంబర కవులు' కంచికచర్ల కోటేశుకు అంకితం ఇచ్చారు. (కంచికచర్ల కోటేశు అనే హరిజన బాలుని కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో ధనమదంతో, కులమదంతో 1968 లో సజీవ దహనం చేశారు) జూన్‌లో ప్రచురించినా 1968 సెప్టెంబరు 14 న విశాఖపట్నంలోని లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద ఎడమనూరి యశోద అనే బిచ్చగత్తె చేత అర్ధరాత్రి ZERO HOUR లో ఆవిష్కరించారు."

* * *

# సాహిత్యసేవ

"రాజమహేంద్రవరంలో అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు 'సరస్వతీ గ్రంథమాల' స్థాపించారు. వీరు ఎక్కువగా బెంగాలీ సాహిత్యాన్నీ, ఆంగ్ల సాహిత్యాన్నీ అనువదించి, తెలుగువారికి అందించారు. బెంగాలీ అనువాదాలు దాదాపు అన్నీ జొన్నలగడ్డ సత్యనారాయణగారు అనువదించారు. 'ఆంధ్రప్రచారిణి గ్రంథ మండలి' ప్రచురించినట్లే వీరు కూడా వందకుపైగా ప్రచురించారు.

చిత్రాడలో చెలికాని లచ్చారావుగారు రామవిలాస గ్రంథమాల నెలకొల్పారు. దీనిలో ప్రచురించబడిన వంగూరి సుబ్బారావుగారి 'ప్రభాతము' చెప్పుకోదగ్గది.

బరంపురంలోని ఆంధ్రవిశారద తాపీ ధర్మారావుగారు, దేవరాజు వెంకట కృష్ణారావుగారు, భాగవతుల నృసింహశర్మగారు కలసి 'వేగుచుక్క గ్రంథమాల' స్థాపించారు. ఉషఃకాలము – కలభాషిణి పేరుతో, విలాసార్జునం – నేను పేరుతో, క్రొవ్వురాళ్లు – ఉపాధ్యాయుడు అనే కలం పేర్లతో తాపీ ధర్మారావుగారు వ్రాశారు. దేవరాజు వెంకట కృష్ణారావుగారు వాడేవీడు, నేనే, కాలూ రాయీ మొదలగు డిటెక్టివ్ నవలలు ప్రచురించారు. వేగుచుక్క వెలువరించిన ప్రొద్దుపొడుపు. ప్రభాతం రెండు రచనలలో ఆంధ్ర చరిత్ర, ఆంధ్ర సాహిత్య చరిత్ర ప్రధాన ఇతివృత్తాలు. 1965 లో కొండపల్లి వీరవెంకయ్య & సన్స్, రాజమండ్రి వారు వేగుచుక్క గ్రంథమాల రచనలను కాపీరైట్‌కు కొన్నారు.

బందరులో 'ఆంధ్రభాషాభివర్ధని' ప్రచురణ సంస్థ ఆరు స్వతంత్ర నవలలు, ఆరు బెంగాలీ అనువాదాలు ప్రచురించింది.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కథకులే కాక నవలా రచయితగా పేరు పొందారు. స్వంతంగా 'కళాభివర్ధనీ పరిషత్' నెలకొల్పి చారిత్రక, సాంఘిక, పరిశోధక నవలలు గ్రాంధికంలోనూ, వ్యావహారికంలోనూ వ్రాసి ప్రచురించారు. రక్షాబంధము, శ్మశానవాటిక, మిథునానురాగం, అనాథ బాలిక, ఆత్మబలి మొదలైనవి తెలుగు పాఠకులకు అందించారు.



(Outputs) 14/10/08

ఆనాటి పాఠకులను రాణీసంయుక్త, విమలాదేవి, రాయచూరు యుద్ధం, విజయనగర సామ్రాజ్యము, కమల కుమారి, వసుమతీ వసంతం, ప్రమాదావనం, హేమలత, అహల్యాబాయి; నోరి నరసింహశాస్త్రిగారి రుద్రమదేవి, నారాయణభట్టు, మల్లారెడ్డి అలరించాయి.

నవలా రచనలు బయటకి రావడానికి పాటుపడిన ఆంధ్ర ప్రచారిణి గ్రంథనిలయము, సరస్వతీ గ్రంథమాలలకు తెలుగు పాఠక ప్రపంచం ఋణపడి వుంది."

* * *

# పైగంబరులు

"దిగంబర కవుల తరువాత వచన కవిత్వంలో మరొక సాహిత్య సమాజం పైగంబరులది. యం.కె. సుగమ్‌బాబు కమలాకాంత్, కిరణ్‌బాబు, వోల్గా, దేవీప్రియ – ఈ అయిదుగురే పైగంబరు కవులు. వారి ధ్యేయం గురించి వారి సంకలనం మొదట్లో 'ఇది మా పైగంబర కవుల రెండవ సంకలనం యుగ చైతన్యం. ప్రజాహృదయ స్పందన, వారి జీవితం, పోరాటాలే మా కవితకు ఇతివృత్తం, ప్రాణం. పీడిత వర్గ మానవుడు యిందు నాయకుడు. అతని ముందడుగే కవితాదేశం! మార్క్సియన్ సోషలిజమే ధ్యేయం' అని అన్నారు."

* * *

# తెలుగు జాతీయ కవి ?

"ఒకందుకు నాకు విచారం వేస్తుంది. తమిళులు తమ జాతీయ కవిగా సుబ్రహ్మణ్య భారతిని అంగీకరిస్తారు. మలయాళీలకు వల్లథోల్ ఉన్నాడు. వంగీయులకు మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్. అలాగే ఇతర ప్రాంతాలకు ఇతర కవులు. కాని తెలుగులో మాత్రం తమ జాతీయ కవి విషయమై తెలుగువారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఎవరిని గొప్పవాడంటే ఇంకెవరికి కోపం వస్తుందో అనో లేక ఎవరి గొప్ప వారిది, మనం ఎవరము నిర్ణయించడానికి అనో! మళ్లీ కవి పూజలో తెలుగువారు మరే ఇతర ప్రాంతీయులకు తీసిపోరు. బహుశా భారతదేశం అంతట్లోకి కవులను హెచ్చుగా ఆరాధించేది తెలుగుదేశమే యేమో కూడా. అయినప్పటికీ రాజకీయాలలో వలెనే సాహిత్యంలో కూడా మనకి బహునాయకత్వం తప్పలేదు."

**– శ్రీశ్రీ**

(1956 జనవరి పరిశోధన సంచిక)

* * *

# మలుపు

"విశాఖపట్నంలో ఫిబ్రవరి 1, 1970 పానగల్ మహల్‌లో శ్రీశ్రీ సన్మాన సభలో హనుమచ్ఛాస్త్రి ఉపన్యాసం అయిన వెంటనే మల్లంపల్లి కృష్ణారావు అనే మెడికల్ విద్యార్థి విశాఖ విద్యార్థుల తరపున 'రచయితలకు సవాల్' అనే కరపత్రం చదివాడు. సభికులకు కరపత్రాలను పంచారు. సభలో గొప్ప సంచలనం లేచింది. ఈ కరపత్రం చదివిన తర్వాత గోష్ఠి చాలా ఉద్రేకపూరితంగా జరిగింది. జ్వాలాముఖి, సోమసుందర్‌లు వ్యక్తిగతంగా కూడా తిట్టుకునేంత వరకు వెళ్ళింది. ఆ తర్వాత తెలుగుసాహిత్య చరిత్ర మారిపోయింది ఈ కరపత్ర ప్రభావంతో."

❋ ❋ ❋

# రచయితలకు సవాల్

"తెలుగు కవిత్వాన్ని ప్రబంధాల బంధాల్లోంచి బయటకు లాగి ఊర్వశుల ఊహల్లోంచి తప్పించి, శనిదేవత రథ చక్రపుటిరుసులలో పడి నలిగిన దీనుల కోసం దగాపడిన తమ్ముళ్ళ కోసం, ఆయుధంగా చేసి ఆడించిన మహాకవికి ఆయన ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రారంభించిన 'మరో ప్రపంచపు' యుగానికి ఈ వేళ సన్మానం చేయడానికి వచ్చిన అందరు ఆంధ్ర కవులకూ, రచయితలకూ స్వాగతం. ముప్ఫై ఏళ్లుగా సాహిత్యం ఏం చేస్తుంది ? ఎటు వెళ్తోంది ? మీరంతా ఎందుకోసం రాస్తున్నారు ? ఎవరి కోసం రాస్తున్నారు ? అని చూచుకోడానికి మీరంతా సమావేశం అవుతున్నందుకు మరీ సంతోషం.

సాహిత్యం ఆనందం కోసమనీ, ప్రభువులకీ, మంత్రులకు, తారలకి అంకితాలివ్వడం కోసమని, అందలాలెక్కడం కోసమనీ, సన్మానాలు, బిరుదులూ పొందడం కోసమనీ ఒకప్పుడు కొందరు అనుకునేవారనీ, వారినందరినీ శ్రీశ్రీ వచ్చి నడ్డి విరగొట్టాడని సంతోషించాం. అభ్యుదయ కవిత్వం అనగానే కవులూ, రచయితలూ ప్రజల సంగతి పట్టించుకుని వాళ్ళ కన్నీళ్ళ కారణం తెలుసుకుని ఆ కారణం వాళ్ళకి చెప్పి, అసలు దొంగల్ని బయటపెడతారని అందరమూ అనుకొన్నాం. మత్తుమందు సాహిత్యాన్ని మసిచేసి, కన్నీటి సాహిత్యాన్ని వదిలేసి, కళ్ళని తెరిపించే కొత్త నెత్తురిచ్చే సాహిత్యాన్ని సృష్టిస్తారని ఎదురు చూశాం.

కానీ అభ్యుదయం పేరుతో గొంతు చించుకుని అరిచిన వాళ్ళంతా ఆ పేరుతో కవిత్వాన్ని CASH చేసుకుంటున్నారు. సాహిత్యాన్ని సొంత ప్రయోజనాల కోసం వాడుకొంటున్నారు. ప్రజాకవిత్వం సినిమాలకు PASSPORT మాత్రమే అయింది. అభ్యుదయం ఆకాశవాణికి అడ్డుదారి మాత్రం అయింది. భావకవిత్వపు రోగం కవుల్లా ప్రజాకవులమని చెప్పుకునే వాళ్ళు కూడా ఒకరికన్నా మరొకరు పేరు తెచ్చుకోడానికి నానాగడ్డీ కరవడం, ఒకర్ని చూచి ఒకరు ఈర్ష్యపడడం, అధికారంలో ఉన్న ప్రతీ అడ్డమైనవాడి కాళ్లు పట్టుకోవడం, అకాడమీలో ఆధిపత్యం కోసం నానా అగచాట్లూ పడ్డం – యిది కాక యింకేమన్నా చేస్తున్నారా ?



(Outputs) 14/10/08

వంటింటి పత్రికల్లో బహుమానాల కోసం ఆడంగి నవల్ని సృష్టించేవాళ్ళు అకాడమీ బహుమానాల కోసం ఓపిగ్గా క్యూలో నుంచున్న వాళ్ళు, ఏ ప్రొడ్యూసర్ కటాక్ష వీక్షణమో తమ మీద ప్రసరించకపోతుందా అని సాయంత్రం గుమ్మం దగ్గర నిలబడ్డ పడుపుకత్తెల్లా ఎదురుచూస్తున్న వాళ్లూ – ఈ వేళ సాహిత్యరంగం నిండా కనిపించడం ఎందుచేత ?

అభ్యుదయ సాహిత్యం కన్నా 'మదనలూ' 'మన్మధలూ' నిత్యం పారాయణ గ్రంథాలు కావడం, నాగేశ్వరరావులూ, రామారావులూ ఆదర్శదైవాలు కావడం ఎందుచేత జరుగుతోంది ? శ్రీశ్రీ అంటే ఎవరు ? ఆ డబ్బింగు సినిమాకి వ్రాస్తాడూ ఆయనేనా ? అని అడిగే దుస్థితికి ప్రజలు దిగజారిపోవడం ఎందుకు జరుగుతోంది ? ఈ వేళ శ్రీశ్రీ మొదలు పెట్టిన ప్రచండోద్యమానికి సన్మానం జరపడం అంటే వీటన్నిటికీ సమాధానాలు వెతడకం. మిమ్మల్ని మీరు తిరిగి చూచుకోండి. 'దొంగ లంజాకొడుకులసలే మెసిలే ఈ లోకంలో' మీరు కూడా భాగస్వాములై పోతున్నారు జాగ్రత్త!

జీవిత వాస్తవాల్లోంచి పుట్టి తిరిగి జీవితాన్ని చైతన్యవంతం చేయగలిగేదే సాహిత్యం. కదిలేది కదిలించేది, మారేది, మార్పించేది, పెను నిద్దర వదిలించి ముమ్మందుకు నడిపించేది సాహిత్యం. సామాజిక జీవితంలోని కాలుష్యాన్ని, అవ్యవస్థనీ ఎత్తిచూపి విప్లవకర మార్పుల్ని ఆహ్వానించేది సాహిత్యం. యిలాంటి సాహిత్యాన్ని సృష్టించి పదివేల సం॥ల క్రితం విశృంఖలంగా ఉన్న వర్ణవ్యవస్థలో నిజమైన సాహిత్యం ఉందనే హాహాహూహూల్నీ, ప్రేయసి కన్నుల నీడలలో నిజమైన సాహిత్య విలువలున్నాయనే పడుపు కవుల్నీ, దేశభక్తి గీతాలలో ప్రజల్ని మభ్యపెట్టి ప్రక్కతోవలు పట్టించే కవితా వంచకుల్నీ చీల్చి చెండాడవలసిన తరుణంలో మీలో ఎందుకింత స్తబ్ధత ?

'భావ విప్లవం రాకుండా సాంఘిక విప్లవం రాదు' అన్నారు కుటుంబరావుగారు. శ్రీశ్రీ తన ప్రచండ కవితాశక్తితో ఆంధ్రసాహిత్యంలో భావవిప్లవానికి ముప్ఫైఏళ్ల క్రితమే నాంది పలికాడు. అదృష్టవశాత్తూ దేశంలో యిప్పటికి నిజమైన సాంఘిక విప్లవ పరిస్థితులు ఏర్పడ్డాయి. తుపాకీ దెబ్బకి వెరవకుండా, విప్లవ పంథాలో జనం వెల్లువలా విరుచుకుపడుతున్నారు. ధైర్యంగా చెరసాలలకీ, ఉరికొయ్యలకీ ఆహుతి అవుతున్నారు. 'గోడల్ని పగులగొడుతున్నారు' యింతటి ఉత్సాహపూరితమైన సమయంలో శ్రీశ్రీ కలలుగన్న మరో ప్రపంచాన్ని వాస్తవం చేసే ఈ ప్రయత్నంలో అభ్యుదయం పేరుతో COMMIT అయిన మీ సాహిత్య కంఠం ఎందుకు నిశ్శబ్ధంగా ఉండిపోయింది ?

స్పానిష్ విప్లవంలో ప్రాణాలు పోగొట్టుకున్న సాహిత్యకారుడు 'క్రిస్టఫర్ కాడ్‌వెల్' లాగా, తను రాసిన ప్రతి పద్యం గిరిజనుల నోట ఊతపదంగా చేసి, శ్రీకాకుళ విప్లవపోరాటంలో వీరమరణం చెందిన సుబ్బారావు పాణిగ్రాహిలా, సాహిత్యాన్ని జీవితాన్ని మార్చే శక్తిగా మీరెందుకు చెయ్యలేరు ?



(Outputs) 14/10/08

నమ్మిన ఆదర్శాల కోసం పట్టుదలగా నిలబడి ఓ కుటుంబరావులా, ఓ రావిశాస్త్రిలా, ఓ కాళీపట్నంలా, ఓ బీనాదేవిలా విప్లవాన్ని రెండు చేతులా ఆహ్వానిస్తూ జనాన్ని మేల్కొల్పగలిగేది మీలో ఎంత మంది ?

'సాయుధ విప్లవమే మా లక్ష్యం', 'హింస విప్లవానికి నాంది' అని ధైర్యంగా ప్రకటించి, విప్లవ కవులుగా శ్రీశ్రీ వారసత్వాన్ని తీసుకుని, సాహిత్య సందేశాన్ని ముందుకు తీసుకుపోయే దిగంబర కవుల సాహసం మీలో కన్పించదేం ?

ఈ దినం శ్రీశ్రీకి ప్రశంసోత్సవ దినం. అందుచేత ఈ వేదికను నిజమైన విప్లవ వేదికగా మేం భావిస్తున్నాం. ఈ వేదిక మీద నుండి యువకులు మీ నుండి తక్షణం స్పష్టమైన సమాధానాన్ని అడుగుతున్నారు. మీరు ఎటున్నారు ? ముందుకు నడిచేవాళ్ళలోనా ? వెనక్కిపోయే వాళ్ళలోనా ? అభిప్రాయాలు కోసం బాధలు లక్ష్యపెట్టని వాళ్ళల్లోనా ? అభిప్రాయాలు మార్చుకొని సుఖాలు కామించేవాళ్ళలోనా ?

ఈ వేళ వీటికి గుండెమీద చెయ్యి వేసుకుని సమాధానం చెప్పుకోండి. చేతనయితే రండి. నిజాన్ని నిర్భయంగా రాయండి. మేం వున్నాం. మీవల్ల ఉత్తేజితులమయి, మీరు చూపించే దారి పట్టి, మీరూహించే మరో ప్రపంచాన్ని వాస్తవం చేస్తాం.

లేదా – వెళ్ళండి – వారపత్రికల మోచేతుల క్రింద గంజి తాగండి. పెద్దింటివాళ్ళ ఉంపుడు కవులుగా ఆకాశవాణీల ఓణీలు మోస్తూ, సినిమా హీరోల బూట్లు తడుస్తూ కూర్చోండి. మిమ్మల్ని మేమూ, చరిత్ర కూడా క్షమించం."

**– విశాఖ విద్యార్థులు**

* * *

# శ్రీశ్రీ సన్మానసభలో

1970 ఫిబ్రవరి 1, 2 తేదీలలో విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ సన్మానసభలో ఆరుద్రని వేదిక మీదకు రమ్మని సోమసుందర్ శ్రీశ్రీ చేత చెప్పించారు. జనం కూడా ఆరుద్ర వేదిక మీదికి రావాలని అరిచారు. ఆరుద్ర ఇష్టం లేనట్లు వచ్చారు.

తాపీ ధర్మారావు లేచి 'ఆరుద్రగారు రెండు ముక్కలు మాట్లాడతారు' అని మైకులో చెప్పారు. 'సభకు నమస్కారం, ఇక సెలవు. నా రెండు మాటలూ అయిపోయాయి' అని కూర్చున్నారు ఆరుద్ర.

జనం ఆరుద్ర మాట్లాడాలి అని కేకలు వేసారు.

వెంటనే ఆరుద్ర లేచి 'కారణం నన్ను పిలవలేదు' అన్నారు.

'డోంటాక్ రాట్, నోర్మియ్' అంటూ స్టేజీ మీద వలంటీర్లు కేకలేశారు. దాంతో ఆరుద్ర తన ఉపన్యాసం మొదలెట్టారు –



(Outputs) 14/10/08

ఇంజనీరింగ్ కాలేజీ ఖర్చులతో రమ్మన్నారని, తాను చిన్నప్పుడు పద్యాలెలా రాశారో, మొదట్లో తననే అడిగితే ఒక్కముక్క అయినా బీరుపోకుండా శ్రీశ్రీ రచనలు ఇచ్చేవాడనని, తెలంగాణా గొడవల్లో మొదట తనే 'తెలుగు జాతికి పిచ్చి పట్టిందా!' గేయాలు రాసానని, ఇంకా ఏవో సొంత విషయాలు మాట్లాడేరు. సన్మాన సంఘం వారికి ఇలా సలహా ఇచ్చారు –

"సన్మానం ఎక్కడైనా జరగొచ్చు. U.N.O. లో కూడా చెయ్యవచ్చు. కాని పుట్టిపెరిగిన విశాఖపట్నంలో చేస్తే తృప్తి అక్కడ రాదు. అందుచేత శ్రీశ్రీకి విశాఖలో జరుగుతోందంటే ఎంతెంతో సంతోషం.

కార్యకర్తలు ముందే చెప్పారు, "శ్రీశ్రీకి ఒక పర్స్ ఇద్దామనో, ఒక కాంస్య విగ్రహం స్థాపిద్దామనో, పుస్తక సంపుటం ఇద్దామనో అనుకొన్నాం. అందులో ఒక్క సంపుటి ఒక్కటే ఇస్తున్నాం' అన్నారు. నిజానికి మూడూ ఇవ్వవలసిందే. ఈ షష్టిపూర్తి ఇంకా విస్తృతంగా చేస్తే ఈ మూడూ జరగవలసింది. పర్స్ ఇవ్వడం అన్నది శ్రీశ్రీకి షష్టిపూర్తి సందర్భంలో అరవై వేల రూపాయలివ్వవచ్చు. నార్ల గారికి యాభై ఏళ్లు పూర్తి అయినపుడు యాభైవేల రూపాయలిచ్చారు. అలాగే అరవై పూర్తయేక అభిమానులు, ఆప్తులు, ఆత్మీయులు, అందరూ చాలా సంపాదించి ఇచ్చారు. అలాగే శ్రీశ్రీకి ఇవ్వాలి. ఎందుకంటే అరవై ఏళ్ళు ఒక వ్యక్తికి వచ్చాక అందులో షుమారు నలభై సంవత్సరాలు జాతికి సేవ చేసిన తరువాత ఆ వ్యక్తికి రెక్కాడితేగాని డొక్కాడదు అనే సూత్రం మీద ఆధారపడక హాయిగా తాను ఆశించింది రాసుకొనేందుకు వీలుగా ఒక పర్స్ ఉండటం చాలా అవసరం. మనకు సామ్యవాద ప్రభుత్వము ఏర్పడే మాటుంటే ఇటువంటివి ప్రభుత్వమే చూసుకొంటుంది. మన ప్రభుత్వాలు అటువంటివి చెయ్యవు – ఏదో ఒక కాగితం ముక్కతో తీరిపోయే ఓ పద్మశ్రీయో, పద్మభూషణో ఇచ్చేస్తాయి. దాంతో తృప్తి పడమంటాయి. మన విశ్వవిద్యాలయాలు ఇచ్చిన బి.ఎ., పట్టాలతో ఎలా బతగల్గుతున్నామో ఈ బిరుదుల మీద అలాగే బతగల్గుతాం.

శ్రీశ్రీ కాంస్య విగ్రహం చెయ్యాలంటే ఈ విశాఖపట్నంలోని పురపాలక సంఘానికి ఏ మాత్రం అభిమానం ఉన్నా, సిగ్గున్నా, లజ్జవున్నా తమంతట తాము కాంస్య విగ్రహాన్ని ఎల్లమ్మతోట మధ్యకాని, ఇంకో చోటగాని ప్రతిష్టించాలి. నేను తమ దయ వల్ల ఇప్పటిదాకా సమగ్ర ఆంధ్ర సాహిత్యం నన్నయకు ముందు నుంచి ఇప్పటిదాకా వస్తున్న సాహిత్య చరిత్ర రాస్తున్నాను. ఇప్పటికి 12 సంపుటాలయ్యాయి కాని ఈ వేదిక మీద నిలబడి చెప్పుకునేందుకు సిగ్గుపడుతున్నా, కుంఫిణీయుగం వచ్చిన దాకా విశాఖపట్నం కవి ఒక్కడూ కనబడలేదని! నన్నయ్య పుట్టిన దగ్గర నుంచి 1657 దాకా ఒక్క కవిని విశాఖపట్నం వాడని చెప్పుకునేందుకు లేదని నాకు కొంచెం తలవంపులుగా ఉంది. కాని 1600 సం॥ కాదు గడచిన 1600 ల సంవత్సరాలలోను, రాబోయే 1600 సంవత్సరాల దాకా శ్రీశ్రీని విశాఖ కవి అని యావత్తు లోకం కీర్తిస్తుంది. ఆ ఒక్క నమ్మకం చాలు.



(Outputs) 14/10/08

శ్రీశ్రీని నా జ్ఞానం వచ్చిన దగ్గర్నించి ఆరాధిస్తూనే ఉన్నాను. ఆయన పోలికలు చాలా వచ్చాయి. ఆ పోలికలు చాలా మట్టుకు వదుల్చుకున్నాను. శ్రీశ్రీ శిల్పం, సౌందర్యము, శ్రీశ్రీ భావాలు, వాటి ప్రభావం, ఏ యే పద్యం మీద ఎవరెవరి ప్రభావం ఉంది మొదలైనవన్నీ చర్చించడానికి అవకాశముంది. కాని ఇవేమీ రాయలేకపోయాను. ఎందుకంటే నేను రాస్తున్న సమగ్ర ఆంధ్రసాహిత్యం శ్రీశ్రీ మీద ప్రత్యేకంగా ఆధునిక యుగంలో ఒక సంపుటి ఉంటుంది. పెద్దదిగా రాయాలి కనుక నేను ఇప్పుడేం రాయలేదు. రాసి తృప్తి లేకపోయేకన్నా రాయకపోతే ఫర్వాలేదు. ఒక పద్యం చదివి నా ప్రసంగాన్నీ అధిక ప్రసంగాన్నీ ముగిస్తాను.

నీ పద్యం నిరవద్యం
నిఖిల ప్రజకు నైవేద్యం
త్వర త్వరగా తెరవెడలే
సామ్య సంఘ నేపద్యం

నీ పద్యం వైవిధ్యం
చీకటిలో అభిమర్ధ్యం
ఆకలితో కేకలిడే
శోక జగతి కిడుఖాద్యం

నీ పద్యం సామర్థ్యం
విప్లవ రథ సారథ్యం
బడుగు పేద బ్రతుకునీడ
గొడుగుపట్టు ప్రతి నిత్యం

నీ పద్యం వైదగ్ధ్యం
వైమర్శిక దుర్భేద్యం
కమనీయం రమణీయం
కైపు దిగని ఒక మద్యం

నీ పద్యం శ్రమ స్వేదం
ధనస్వామి వైరుధ్యం
సామాన్యుల కామనులను
పండించే తొలి సేద్యం

నీ పద్యం ఆరాధ్యం
మా నిషాద సాపత్యం
అనవరతం ప్రణవరతం
నినదించే శుభవాద్యం

నీ పద్యం జనవేద్యం
అది అర్ఘ్యం అది పాద్యం
కూడులేని గూడులేని
అనాధలకు ఆతిధ్యం

నీ పద్యం బహు హృద్యం
కవనదేని సాన్నిధ్యం
ఇంకముందు ఇట్టి విందు
నీకైనా దుస్సాధ్యం.

**– ఆరుద్ర**

(భమిడిపాటిఅనంతనారాయణ గారి తెలుగు సాహిత్యంలో
కల్లోల క్షీణ దశాబ్దాలు 1965–1985 నుండి.)

* * *

శ్రీశ్రీ సన్మాన సభ అయిన అనంతరం.....

కె.వి. రమణారెడ్డి : ఆరుద్రగారూ! ఏమిటండీ ఈ రగడ అంతా.

ఆరుద్ర : ఏముందీ నక్సలైట్లు కావాలని నన్ను ఇలా వెలివెయ్య చూసారు. సభ నిర్వాహకులలో వాళ్ళదే పెత్తనం.

* * *



(Outputs) 14/10/08

# కొత్తమాట

"ఈనాడు అన్ని భాషా నిఘంటువులలోనికి ఒక కొత్తమాట ప్రవేశించింది – నక్సలైట్. పదిమంది, పది వందల మంది, పదివేలమందిని, లక్షమందిని ఈ పేరుపెట్టి చంపినా ఈ మాటని మాత్రం ఎవరూ తుడిచి పెట్టలేరు."

– **శ్రీశ్రీ**

❋ ❋ ❋

# విరసం జననం

"దీ. 4–7–1970 (అల్లూరి సీతారామరాజు జన్మదినం) న రాత్రి గం. 1–10 ని. లకు హైదరాబాద్ ఇంపీరియల్ హోటల్‌లో విప్లవరచయితల సంఘం పుట్టింది. ఆ సమావేశంలో దిగంబర కవులు, కె. వి. రమణారెడ్డి, చలసాని ప్రసాద్, శ్రీశ్రీ ఉన్నారు. ఆ దగ్గరలోనే బస చేసిన పురిపండా అప్పలస్వామికి ఆ గదిలో విప్లవ శిశువు పుడుతోందన్న సంగతి తెలీదు, మర్నాడు ఉదయం వి.ర.సం. ప్రణాళిక చేతిలో పడేంతవరకూ.

శ్రీశ్రీ అధ్యక్ష్యుడు, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాధశాస్త్రి ఉపాధ్యక్షులు, కె.వి.ఆర్. కార్యదర్శి, నిఖిలేశ్వర్, నగ్నముని, జ్వాలాముఖి, చెరబండరాజు, వరవరరావు సభ్యులుగా తాత్కాలిక కార్యనిర్వాహక సంఘం ఏర్పాటైంది."

❋ ❋ ❋

# హోమర్

"మహాకవి 'హోమర్' మరణించిన తరువాత – అతను బ్రతికున్న రోజుల్లో మా నగరంలో ముష్టెత్తుకున్నాడంటే, కాదు కాదు మా నగరంలో అడుక్కుతింటూ బతికాడని తొమ్మిది నగరాల ప్రజలు పెద్దగా తగవులాడుకొన్నారంటూ చరిత్రకారులు వ్రాశారు. నిజంగా అలా తగాదాలాడుకొన్నారో లేదో కాని, హోమర్ మంచి కవిత్వం రాశాడని లోకం మెచ్చుకుంది కాబట్టి తొమ్మిది నగరాల ప్రజలు తలచారు కాని లేకపోతే ఓ వీధి వారన్నా తలుస్తారా ?!"

❋ ❋ ❋

# భారం

"హరికధా పితామహుడు శ్రీ ఆదిభట్ల నారాయణ దాసుగారికి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు 'కళాప్రపూర్ణ' బిరుదు ఇస్తే, "భగవంతుడొక్కడే 'కళాప్రపూర్ణ' శబ్ద వాచ్యుడు. మానవ మాత్రుడెవరూ అందుకర్హుడు కాదు. నేను దాని భారం భరించలేను" అని నిరసించారు."

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# జయపురం సంస్థానం

"ఆంధ్ర విశ్వవిద్యాలయం శైశవావస్థలో ఉన్నప్పుడు, సాధన సంపత్తిని సమకూర్చుకోడానికి శక్తి చాలని గడ్డుకాలంలో జయపురం సంస్థానాధిపతులు ఆదుకుని దాని పురోగతికి దోహదం చేసిన సంగతి జగమెరిగిన చరిత్ర. జయపురం మహారాజా శ్రీ రామచంద్రదేవ్ ఆ రోజుల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండు లక్షల రూపాయలు విరాళ మిచ్చారు. విశ్వవిద్యాలయం అవతరించిన మొదట్లో (1926–30) సాలుసరి ఆదాయ వ్యయ పట్టిక – బడ్జెట్ – లక్షకు పై చిలుకు మించలేదు. 1930 నాటి ప్రభుత్వపు గ్రాంటు ఒకటిన్నర లక్షకు బొటాబొటి. ఉత్తమోత్తమ విద్యాసంస్థగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దిన మహాశిల్పులలో జయపురం మహారాజా డాక్టర్ విక్రమదేవవర్మ గారు ముఖ్యులు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి షుమారు ఇరవై లక్షల వరకు విరాళమిచ్చి, శాస్త్రీయ విజ్ఞాన పథములు సర్వతోముఖ ప్రగతిని సాధించటానికి మూలవిరాట్టులు విక్రమదేవవర్మగారు. పధ్నాలుగేళ్లపాటు (1937–51) ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రొఛాన్సలర్‌గా ఉంటూ వర్మగారు ఎనలేని సేవ చేశారు. అంతకు పూర్వం పిఠాపురం మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దర్‌వారు, జయపురం మహారాజా రామచంద్రదేవ్ బహద్దర్‌వారు, బొబ్బిలిరాజా శ్రీరావు రామకృష్ణ రంగారావుగారు ప్రొఛాన్సలర్‌లుగా ఉండేవారు. జయపురం సంస్థాన పక్షాన ఆంధ్ర విశ్వవిద్యాలయ శాస్త్ర విభాగములలో రెండు ఆచార్య పీఠాలు నెలకొల్పబడ్డాయి."

❋ ❋ ❋

# విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల

"ది. 3-3-1918 న హైదరాబాదులో కోదాటి రామకృష్ణారావు, కోదాటి వెంకటేశ్వరరావు, ఎస్.బి. రామానుజాచార్యులు, షబ్నవీసు వెంకటరామ నరసింహారావు, అక్కినేపల్లి జానకీ రామారావు, ఒద్దిరాజు సీతారామచంద్రరావు, ఒద్దిరాజు రాఘవరంగారావు గారలు ఇష్టాగోష్ఠి మాట్లాడుతూ విజ్ఞానదాయకాలు, దేశభక్తి ప్రభోదించే పుస్తకాలు ప్రకటించాలనుకున్నారు. ఇనుగుర్తిలో 'విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల' స్థాపించి, అక్కినేపల్లి జానకీరామారావుగారి సంపాదకత్వంలో మొదటి పుస్తకం ఒద్దిరాజు సీతారామచంద్రరావు గారి 'రుద్రమదేవి' అనే చారిత్రక నవల బెజవాడ మారుతీ ప్రెస్‌లో ముద్రించారు. తరువాత ఒద్దిరాజు సోదరులు వీరన్న శ్రేష్ఠిగారి సహకారంతో 1919 లో ఇనుగుర్తిలో సొంత ముద్రణాలయం నెలకొల్పారు. సోదరులు ఇద్దరు రాత్రులు చదవడం, రాయడం పగలు ప్రింట్ చేయడం చేసేవారు. వారు ప్రింట్ చేసిన మొదటి గ్రంథము ఉపదేశ రత్నమాల. నెలకు ఒక పుస్తకం వెలువరించాలను కున్నారు. ఇంతలో ముద్రణాలయాన్ని షబ్నవీసు వెంకటరామ నరసింహారావు గారు నల్లగొండకు తీసుకుపోయి, కొందరు భాగస్వాములను చేర్పించి పని ప్రారంభించారు. కాని పనితనం తెలియక



(Outputs) 14/10/08

ముద్రణాలయానికి నష్టం వచ్చింది. ఆ నష్టం ఒద్దిరాజు సోదరులు భరించి మరల ఇనుగుర్తిలో కొత్త ముద్రణాలయాన్ని స్థాపించారు. తెలంగాణమున విజ్ఞాన ప్రసారం చేయాలనే తలంపుతో విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాలలో ఇరవై పుస్తకాలు ప్రచురించారు. ఒకటి, అర తప్ప మిగిలినవన్నీ ఒద్దిరాజు సోదరుల రచనలే. తరువాత రాజవైద్య పింగళి లింబాద్రి రెడ్డిగారు గ్రంథమాలను స్వగ్రామం నెమలికొండకు తరలించి 1932 వరకు తమ సంపాదకత్వంలో అనేక గ్రంథాలను ప్రకటించారు."

❋ ❋ ❋

# ఆశ

"మీ విషయమై ఆంధ్రపత్రికలో ప్రకటితమైన వార్తలు చూస్తూనే ఉన్నాను. మీ అవస్థ తలచుకొని దుఃఖిస్తూ ఉంటాను. కాని మీరు ప్రకటించిన దేశాభిమానం స్థైర్యము ధైర్యము కొనియాడదగినవేను. మీది నిష్కలంకమైన ప్రవర్తన. మీ వంటివారికి ఇట్టి పాట్లు కలగడం దురదృష్టం. మీ ఫోటోగ్రాఫు మా కంటి ఎదుటనే ఉంటున్నది. అది ఉండకపోయినా ప్రియమిత్రులైన మిమ్ము తలచుకోకుండా ఉండగలమా ? బందిఖానాలో ఉన్న మీరు క్రొత్త గీతాలు రచిస్తున్నారు. బందిఖానా మీ మనస్సునూ, ఉత్సాహాన్ని అరికట్టలేదు. మనకు ప్రాణప్రియమైన వాడుకభాషలో 'మాలపల్లి' శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రచించినట్లే మీరు కూడా ఏదైనా గొప్ప గ్రంథము రచిస్తారని అనుకుంటూ ఉంటిని. ఇప్పుడు కాకపోతే ఏమాయెను. విముక్తి అయిన తరువాతే 'స్థిత ప్రజ్ఞులు' మీ సంకల్పము వల్లను – అట్టిది పుట్టవచ్చును. మీరు మీ ప్రతిజ్ఞను పరిపాలించుకోగలరని నేనెరుగుదును. అది చూడటానికైనా బ్రతికి ఉండగలననే ఆశతో ఉన్నాను..."

**– గిడుగు**

(తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రిగారికి గిడుగు రామమూర్తి పంతులు 24–10–1930 న పర్లాకిమిడి నుండి కడలూరు జైలుకు వ్రాసిన లేఖలోనిది)

❋ ❋ ❋

# పెద్ద గ్రంథం

"కట్టమంచి రామలింగారెడ్డి గారి గ్రంథములలో ప్రముఖమయినవి 'కవిత్వతత్త్వ విచారము', 'ముసలమ్మ మరణము'. కవిత్వతత్త్వ విచారము పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నములను గూర్చిన విమర్శగ్రంథం. ఈ గ్రంథానికి బీజప్రాయమైన వ్యాసం 1899 లో చెన్నపురి క్రైస్తవ కళాశాలలో చదువుతున్న రోజుల్లో



(Outputs) 14/10/08


కట్టమంచి

వ్రాయబడింది. ఇది కళాపూర్ణోదయానికి సంబంధించింది. ఇది ఆనాడు ఆ కళాశాలలోని 'ఆంధ్ర భాషాభిరంజని సమాజం'లో చదువబడింది. ఆ వ్యాసాన్ని పలువురు ప్రశంసించారు. అది మరి కొన్ని సమావేశాలలో చదువబడి పలువురు పండితుల మన్ననలను పొందింది. వేదం వెంకట రాయశాస్త్రిగారు ఆ వ్యాసాన్ని మెచ్చుకొని అందలి కొన్ని లోపాలను సూచించారు. రెడ్డిగారు ఇంగ్లండు వెళ్ళి వచ్చిన తరువాత వావిళ్ళ వారు ఆ వ్యాసాన్ని ప్రచురించటానికి ఇవ్వవలసిందని కోరగా, ఆ వ్యాసం అప్పటికే దొరకకుండా పోయిందట! ఆ వ్యాసాన్ని మళ్ళీ వ్రాయదలిస్తే అంత పెద్ద గ్రంథం తయారైంది. ఈ గ్రంథంలో కళాపూర్ణోదయానికి తోడు ప్రభావతీ ప్రద్యుమ్నం కూడా చోటు చేసుకుంది."

❋ ❋ ❋

# మందలింపు

"1928 లో నా 18 వ ఏట ప్రభవ సంవత్సరంలో నేను రాసిన పద్యాలన్నీ పోగు చేసి 'ప్రభవ' అనే పేరుతో ప్రకటించాను. ముద్రణకు కావలసిన డబ్బంతా మా నాన్నగారే ఇచ్చారు. పురిపండా ముద్రణ బాధ్యత తీసుకోవడమేగాక 'ముందుమాట' కూడా తనే రాశాడు. రాజమహేంద్రవరంలోని సరస్వతీ పవర్‌ప్రెస్‌లో ఈ పుస్తకం అచ్చయింది. 'కవితాసమితి' వారి గ్రంథాలలో ఒకటిగా ప్రకాశితమయింది.

దీన్ని 'భారతి'లో కొంపెల్ల జనార్ధనరావు రివ్యూ చేశాడు. ఇందులో సార్ధకత కంటే సమాసతత్పరత హెచ్చుగా గోచరిస్తున్నదని మెత్తమెత్తగా మందలించాడు. అప్పటి నుంచి నాలో సమాసాల మీద మోజు సన్నగిల్లిపోయింది."

– శ్రీశ్రీ

❋ ❋ ❋

# కొ.కు.

"కొడవటిగంటి కుటుంబరావును పరమోత్తముడుగా నేను పరిగణిస్తాను. వాదంలో ఆయనతో నెగ్గడం కష్టం. ఏకీభవించడం కూడా కష్టమే. చాలా తీవ్రమైన భావాలు ఆయనవి. మొదటి నుంచి వామపక్ష భావాలే. అవి పోనుపోను మరీ తీవ్రమైనాయి. అయితే ఆయనతో మాట్లాడటం, ఆయనను వాదంలోకి దించడం చాలా సరదాగా ఉండేది. ఆయనతో సంభాషణలో మామూలు కుశల ప్రశ్నలకు, ఉబుసుపోక కబుర్లకు చాలా తక్కువ స్థానం ఉండేది. వాటిని



(Outputs) 14/10/08

కూడా ఆయన PHILOSOPHISE చేసేవారు. దేన్ని గురించి సంభాషిస్తున్నా మౌలిక విషయాలలోకి తీసుకుపోయేవారు. అయితే ఛలోక్తులతో, తను చదవిన పుస్తకాలలోంచి కొటేషన్‌లతో, వాటి రచయితల IDIOSYNCRACIES తో సంభాషణ రసవత్తరంగా ఉండేది. ఆయన ఎప్పుడూ ఎవరినీ ఎదురుగాగానీ, పరోక్షంగాగానీ వ్యక్తిగతంగా విమర్శించడం నేను వినలేదు. వారి రచనలపై మాత్రమే వ్యాఖ్యానించే వారు. ఎదురుగా ఉంటే మరీ ఘాటుగా అనేసేవారు. ఒక్క శ్రీశ్రీ ని తప్ప ఎవరినీ ఆయన మినహాయించలేదు. శ్రీశ్రీ అంటే దాదాపు ఆరాధనా భావం లాంటిది ఉండేది. కృష్ణశాస్త్రిది సన్నాయి వాద్యమయితే, శ్రీశ్రీది డోలు వాద్యం అనేవారు.”



**రామమోహనరావు**

**– నండూరి రామమోహనరావు.**

❋ ❋ ❋

# కడుపునింపాయి

“నా పుస్తకాల్లో కొన్ని తుక్కువి, పరమతుక్కువి ఉన్నాయని విమర్శకులంటున్నారు. నిజమేనని అంగీకరిస్తూనే, ఆ పుస్తకాలు నా కడుపు కక్కుర్తిని ఆదుకొన్నాయని ఈ విమర్శకులకు సవినయంగా సంజాయిషీ యిచ్చుకుంటున్నాను.”

**– రావూరి భరద్వాజ**

❋ ❋ ❋

# వినయం

“జీవిత వైవిధ్యాన్ని అభ్యుదయ దృక్పథంతో పరిశీలించి అసంఖ్యాకమైన రచనలు చేసిన కొడవటిగంటి కుటుంబరావు గారిని మహాకవి శ్రీశ్రీ ‘ఆంధ్ర ఛెఖోవ్’ అన్నారు. ఆ ప్రశంసను కుటుంబరావుగారి దృష్టికి తీసుకువచ్చినప్పుడు ‘చెఖోవ్ విశ్వసాహిత్యంలో ఒక్కడే వున్నాడనుకుంటున్నాను’ అని వినయంగా పలికారు.”

**– కె. రామమోహనరాయ్**


❋ ❋ ❋

# రిమార్కు

“ఏమండీ రామారావుగారూ! నేను సడెన్‌గా చచ్చిపోయినా మీకు ఏమీ ఇబ్బంది వుండదు. మార్చి నెల వరకూ కథలన్నీ తయారు చేశా” నన్నారు కొడవటిగంటి కుటుంబరావుగారు, ఎవరో వర్ధమాన రచయితకు జవాబు వ్రాసి, అతగాడి ఉత్తరం చింపేస్తూ.



(Outputs) 14/10/08



కొడవటిగంటి

ఈ రిమార్కులో – నిస్పృహ, నిస్త్రాణ, రోత ధ్వనించినై. ఇది ఆయన నిష్క్రమణకు పదిరోజుల ముందు.

స్థలం : 'చందమామ' సంపాదకవర్గపు గదిలో, వారి బల్ల వద్ద.

సమయం : వారు ఇంటికి ప్రయాణమవుతున్న ఒంటి గంట.

వారూ, నేనూ, మరో ఉద్యోగీ మధ్యాహ్నం ఇళ్ళకు కలిసి వెళ్ళటం రివాజు.

వెంటనే నా సహజ ధోరణిలో "ఎక్కడికి వెళ్ళుతారండి ? ఎందుకా తొందర, యింకెంత సాహిత్య సేవ చేయాలో" అన్న నాతో "ఎందుకండి యింకా బ్రతకడం యీ వెధవ సాహిత్యంలో నా పేరు కూడా వుండాలి ?" ఛళ్ళున అన్నారు.

కుటుంబరావూ, నేనూ 32 సంవత్సరాలుగా ఒకే వృత్తి వలయంలో పరిభ్రమించాము – 'చందమామ' కార్యాలయంలో – నేను మేనేజరుగా, ఆయన వర్కింగ్ ఎడిటర్‌గా."

**– 'చందమామ' రామారావు**

❋ ❋ ❋

# కళాస్రష్ట

సారాని రావిశాస్త్రి (రాచకొండ విశ్వనాథశాస్త్రి) సృష్టించలేదు. దాన్ని తాగిన నూకాలమ్మ, కుంచాలమ్మలను గాని, వాళ్ళని పట్టుకొన్న పోలీసువాళ్ళనుగాని, శిక్షించిన న్యాయాధికార్లనుగాని అతడు సృష్టించలేదు. మద్యనిషేధం (పాపము శమించుగాక) విశ్వనాథశాస్త్రి సష్టించాడని అతని విరోధులు కూడా అంటారనుకోను. నీలయ్యా, గురయ్యా, అప్పారావూ, మూర్తీ మీకు ఏ రోజైనా కనబడతారు. మూత్యాలమ్మా, పోలమ్మా ఏ రాత్రయినా కనబడతారు. అందుచేత రావిశాస్త్రి సృష్టికర్త కాదు.

కాని అతడు కళాస్రష్ట. అతడు వ్రాసిన ఆరు కథానికలూ ఆరు కళాఖండాలు. తెలుగులో ఒక్క గురజాడ మహాకవికి మాత్రమే సాధ్యమైన పాత్ర చిత్రణ ఈ కథల్లో కనబడుతుంది. ఇది వాస్తవికతకు నివాళి. వీటిలో కథనం ఉంది. కవిత్వం ఉంది. డ్రామా ఉంది. జీవితాన్ని నిశితంగా పరిశీలించడం ఉంది. ఆ చూసిన దాని మీద వ్యాఖ్యానించినట్టుగా కనిపించని వ్యాఖ్యానం ఉంది."


**– శ్రీశ్రీ**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# రాష్ట్రగానము


గౌరెపాటి

"ఏ కవినైనా నీ రచనలలో గొప్పవి యేవి అని ప్రశ్నిస్తే సహజముగా అన్నీ సమానమేనంటాడు. తల్లి తన సంతానాన్ని సమదృష్టిని భావించినట్లే కవి భావమున్నూ. కాని విమర్శకుని దృష్టిలో అవి అన్నీ ఏకరాశికి చెందవు. ఎట్టి విఖ్యాత కవియైనా ఆయన రచనలు సమానాదరణ భాజనములు గావు. కవికుల గురువగు కాళిదాసు కావ్యాలన్నీ గౌరవింపబడుచున్నవా ? కాళిదాసుని ప్రపంచ విఖ్యాతునిగా చేసినది అభిజ్ఞాన శాకుంతలమే.

అభినవ తిక్కన శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు 'పెద్దకాపు'తోను, 'పరిగపంట'తోను తృప్తిచెందక 'ఆత్మార్పణము' కావించి 'ధర్మజ్యోతి' వెలిగించి 'రాష్ట్రగానం' చేసి 'ఆత్మకథ' నల్లుటతో నాగక 'అమరజ్యోతి' కూడా వెలిగించారు.

అయితే ఆయన సప్త సంతానములలో ప్రశస్తి గాంచినది రాష్ట్రగానము. అద్దిరా అనిపించింది, ఆంధ్రావళిని మోదమును పొందించినదియు అదియే.

రాష్ట్రగానము కేవలము ఆంధ్రరాష్ట్ర వాంఛేగాదు. అది ఆంధ్రుల సర్వస్వము. ఆంధ్రుల సర్వస్వముతోబాటు సీతారామమూర్తి గారి సర్వస్వము కూడా. సీతారామమూర్తి గారికి తెలుగు భాష అన్నను తెలుగు వారన్నను అధికాభిమానము. అభిమానమే కాదు ఆవేశము కూడా అధికము. ఆయన ఆంధ్రులలో తాను ఒక్కడుగా తలచడు. ఆంధ్ర మాతృస్థానము పొందగలిగా డాయన. అందుచేతనే ఆయనకు కమ్మ, కాపు, బ్రాహ్మణ, అబ్రాహ్మణ, సాగరాంధ్ర, పర్వతాంధ్ర, స్వదేశాంధ్ర, ఖండాంతరాంధ్ర అనే బేధము లేదు. రాజకీయ పాక్షికత లేని ఆంధ్రాభిమాని. ఆయన అందుచేతనే రాష్ట్రగానము అంత ఉజ్వలముగా వ్రాయగలిగాడు. పండితులు, ప్రజలు సరిసరి అని తలలూపిన సాటిలేని మేటి గ్రంథమది. ఆయన రచనల్లోనే కాదు ఆంధ్రులను గురించి వెలువడిన సాహిత్య సృష్టిలో సానలు దీరిన జాతిరత్నమది."

**– గౌరెపాటి వెంకట సుబ్బయ్య**

* * *

# 'డికెన్సే' దేవుడు

"1957 లో 'తిరస్కృతి' రాద్దామని 'కన్యాశుల్కం' చదివేను. దేవతలు తప్ప మనుషులు రాయలేరనిపించింది. దానిలో వున్న కష్టం, గొప్పతనం అర్థమయింది. ఆ తర్వాతే నేను మనుషులు ఎలా మాట్లాడుతారా అని గమనించాను. 'కన్యాశుల్కం' ప్రభావం నా నాటకాల మీద పెద్దగా



(Outputs) 14/10/08



చార్లెస్ డికెన్స్

లేదుగాని, నా కథలమీద వుంది. ఇది చదవకపోతే సారాకథలు రాయగలిగేవాడ్ని కాదేమో! సారాకథలు మూడుసార్లు రాసేను. రఫ్, రఫ్ ఫెయిర్, ఫెయిర్. ఈ కథల్ని వాసిరెడ్డి వెంకటప్పయ్య బాగా ప్రోత్సహించేవాడు. విశాలాంధ్రలో చదివి శ్రీశ్రీ ఉత్తరం రాసేడు – I was amused and bemused అని శ్రీశ్రీ వుగ్రూతలూగిస్తే, గురజాడ ప్రభావితం చేసేడు. అలాగే డికెన్స్ గొప్ప రైటరు. చెహూవ్ కూడా. కాని ఇతనిది పండిత రంజకం. డికెన్స్‌ది పండిత పామర రంజకం. అందుకే నాకు చెహూవ్ అంటే ఇష్టం, డికెన్స్ అంటే ఆరాధన. దేవుడు ఎవడన్నా వుంటే వాడు డికెన్సే. Law is an ass అన్నవాడు నాకు నిజంగా దేవుడే.

నేనెప్పుడూ చూసింది చూసినట్లు రాయనే లేదు. టిపికల్ పాత్రల్ని ఎంచుకుని రాసేను. నేను జనం మాటలు నోట్ చేసుకోను. వాళ్ళెలా మాట్లాడుతారో, వాళ్ళ వ్యక్తీకరణ ఎలా ఉంటుందో గ్రహించి రాస్తా. అలాగే నేను డబ్బు కోసమో, మరో ప్రయోజనం కోసమో నా పుస్తకాలు అంకితం ఇవ్వలేదు. నా బంధువులకి, నా స్నేహితులకి మాత్రమే ఇచ్చేను."

**– రాచకొండ విశ్వనాథశాస్త్రి**

❋ ❋ ❋

# సొగసు

"చిన్నతనంలో బొమ్మలాట నేర్చి వుండుట చేత లోకమనే రంగంలో చిత్రకోటి రీతులను ఆటాడే మనుషులనే పాత్రముల సొగసునే కనిపెట్టడము నాకు అలవాటైనది. సొగసు లేని మనిషే వుండడు. స్నేహమూ, ప్రేమా అనేవి అనాది అయిన్నీ యిప్పటికీ సరికొత్తగా వుండే రెండు వెలుగులను నరుని మీద తిప్పికాంచితే, వింతవింత సొగసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా ఏక నలుపే!"

**– గురజాడ**


❋ ❋ ❋

# ఉత్తేజం

"12–4–1934 న శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గేయాన్ని ఒక్క ఊపులో ఐదు నిమిషాల్లో రచించాడు. 'మరో ప్రపంచం' అనే పేరుతో వ్యాసం వ్రాయదలచుకున్న శ్రీశ్రీ చివరకు ఈ గేయం రచించాడు.



(Outputs) 14/10/08


గురుప్రసాదరావు

ఈ గేయాన్ని రచించి మొదట ఒక సాహిత్య పత్రికకు పంపించే నాటికి శ్రీశ్రీ దీనికి మహాప్రస్థానం అనే పేరు పెట్టలేదు. ఆ పత్రికవారు దీన్ని ప్రకటింపకుండా తిరిగి పంపారు. తర్వాత శ్రీశ్రీ 'మహాప్రస్థానం' పేరుపెట్టి జ్వాల పత్రికకు పంపించాడు. జ్వాల పత్రికలో అచ్చుపడి వచ్చిన వెర్షనుకూ, తర్వాతి కాలాన రూఢమైన వెర్షనకూ తేడా ఉన్నట్లు తెలుస్తుంది. (చూడు – శ్రీశ్రీ సాహిత్యం, రెండు కావ్య విభాగం పుట 41) శ్రీశ్రీ ఈ గేయంలో తొలుత 'కాంద్రు కాంద్రుమని గర్జిస్తూ' అని రచించి, తర్వాత దాని స్థానంలో 'హృదంతరాళం గర్జిస్తూ' అని మార్పు చేశాడు. 1934 ఫిబ్రవరిలో రచించిన గేయంలోని "హరోం హరోం హర హర హర హర హర హరోం హరాయని పలికే గంటలు" అనే చరణ భాగాలు దీనిలో చేరాయి.

ఈ గేయం పేరయిన "మహాప్రస్థానం" అనేదే కావ్యనామం కూడా అయిందంటే శ్రీశ్రీ దీన్ని ఎంత ప్రధానంగా భావించాడో తేటతెల్లమవుతుంది. ఈ పాటలోని ఆవేశానికి ప్రధాన ప్రోద్బలాలు చాలా ఉన్నాయి. బరన్స్, అలెగ్జాండర్ బ్లేక్ మొదలైన విదేశీ రచయితే కాకుండా జయదేవుడు, హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ, నజ్రుల్ ఇస్లామ్, శిష్లా మున్నగు స్వదేశీ రచయితల రచనలు కూడా శ్రీశ్రీకి ఉత్తేజాన్ని కల్గించాయి. ఇక శంకర భగవత్పాదులు రచించిన 'భజగోవిందం' కూడా మహాప్రస్థానం మొదటి చరణాల గతికి కారణమయింది. (చూడు – ఆరంభం పెద్ద అవస్థ, శ్రీశ్రీ సాహిత్యం రెండు, వచన విభాగం, పుటలు 526 నుండి 531 వరకు)"

**– నాగళ్ళ గురుప్రసాదరావు**

*　　*　　*

# చక్రవర్తి పుట్టపర్తి

"వెయ్యేండ్ల తెలుగు సాహితీ చరిత్రలో ఒక వందమందిని ఉత్తమోత్తమ సాహితీవేత్తలుగా గుర్తిస్తే అందులో పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి విశిష్టత, విలక్షణత కలిగినవారు అరుదు. తిక్కన తరువాత ఉభయకవి మిత్రుడనదగినవారు ఆయన ఒక్కరేనని సప్త సాగర సాహితీ పాదోధులను తలస్పర్శిగా మథించి అందులోని మణిమాణిక్యాలను అందుకున్న సకల కవితాకులాలంకార చక్రవర్తి పుట్టపర్తి."

*　　*　　*



(Outputs) 14/10/08

# ఖండాంతర ఖ్యాతి



దువ్వూరి రామిరెడ్డి

"దువ్వూరి రామిరెడ్డి ఖండాంతర ఖ్యాతి పొందిన ఆంధ్రకవి. వారికి జేమ్స్ హెచ్. కజిన్స్‌తో గల మైత్రి దీనికెంతో దోహదం చేసింది. వారు తన ఖండకావ్యాల్లో కొన్నిటిని ఆంగ్ల భాషకనువదించి "వాయిస్ ఆఫ్ ది రీడ్" అనే పేరుతో ప్రకటించారు – కవి మనోరథం, కవి, వానకాలపు వరిచేలు, ఎంత మోసం, మర్మకవి మొదలైన ఖండ కావ్యాలను "ద పోయెట్స్ యాంబిషన్", "రెవలేషన్', 'ఫీల్డ్స్ ఇన్ రెయిన్', "డిసెప్షన్", "ఎ మిస్టిక్ పోయెట్" అనే పేర్లతో అనువదించారు. "కవి అండ్ సన్యాసిన్", "ట్రావెలర్ అండ్ ఫైల్డ్", 'హార్ట్ సొలేస్' మొదలైనవి కూడా వీటిల్లో చేరాయి. కజిన్స్, శ్రీ రామిరెడ్డి కవిత్వాన్ని గూర్చి కలకత్తాలోనూ, లండన్‌లోనూ ప్రసంగించాడు. కలకత్తా పత్రిక "ఫార్వర్డ్" కజిన్స్ ప్రసంగాన్ని యదాతథంగా ముద్రించి "in our Rabindranath, in Harindranath, Sarojini and in young Ramireddy was burning a light of the spirit which sent an appeal in other parts of the world to release the poet with in" అని వ్యాఖ్యానించింది.

కజిన్స్ ఆంగ్లభాషలో రచించిన 'సమదర్శన' అనే గ్రంథంలో "భారతదేశ భాషా కవిత్రయం' అనే అధ్యాయమున్నది. దానిలో కజిన్స్ మహమ్మద్ ఇక్బాల్, పూరన్‌సింగ్, రామిరెడ్డి – ఈ ముగ్గురు కవుల కవిత్వాన్ని గూర్చి వివరించాడు. రామిరెడ్డి కవిత్వాన్ని కొనియాడుతూ ఆయన "Ramireddy's poems are ages above than what is produced in America" అని అన్నాడు. "బ్రిటీష్ ఎంపైర్ ఎడిషన్ ఆఫ్ ఇంగ్లీష్ పొయెట్రీ"లో శ్రీరామిరెడ్డి పద్యాలు చేరాయి."

**– నాగళ్ళ గురుప్రసాదరావు**

❋ ❋ ❋

# బాపిరాజు

"బియ్యం కోసం దాచిన పాతిక రూపాయలతో తటస్థ పడితే చక్కని పరిమళం గల అత్తరు కొని పస్తుండడానికి ఇష్టపడే తత్త్వం అడివి బాపిరాజుగారిది. బాల్యం తాలూకు ఉత్సాహం, సౌకుమార్యం చివరి వరకూ బాపిరాజు గారిలో ఉండిపోయాయి. ఆయన ఎదగలేదు. నది ఒడ్డున ఇసుకలో పిల్లనగ్రోవిని తుంచి దూదుంపుల్ల ఆడుకునే వాడు. వరదలొచ్చి వెళ్ళాయి. ఇసుక పాదాల క్రింద కదిలి పూడుకుని గడ్డ కట్టింది. నదే క్రొత్త దోవలో పారింది. ఇంకా బాపిరాజుగారు దూదూంపుల్లల్ని ఏరుకొని తుంచిన రెంటినీ కలిపి పిల్లనగ్రోవి మ్రోగించాడు. అది ధ్వనించదు. కాని గానం ఏ కొండలోయలోనో మార్మోగినట్లు అనిపిస్తూ ఉంటుంది."

**– బుచ్చిబాబు**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# కవిరాజు



త్రిపురనేని

"భావ విప్లవ కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి తెలుగు వాడుగా తెలుగు గడ్డపై కాకుండా ఏ ఠాగూరుల భూమిలోనో, ఏ నాయకర్ల నేలపైనో జన్మించి వుంటే రాజారామమోహనరాయ్, కేశవ చంద్రసేన్, దయానంద, రామస్వామి నాయకర్‌ల వలె ఆసేతు శీతనగ పర్యంతం ప్రచారం పొంది వుండేవారు.

ఆంధ్రకవితా సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా పాలించిన తిరుపతి వెంకట కవులలో ఒకరైన వెంకట శాస్త్రిగారికి కవిరాజు ఆత్మీయుడైన శిష్యుడు. ఆయన శుశ్రూషలోనే కవిరాజు కలం మెరుగులు దిద్దుకొన్నది. 1929 లో విజయవాడలో కడప కోటిరెడ్డిగారి అధ్యక్షతన సమావేశమైన ఆంధ్రమహాసభలో త్రిపురనేనికి 'కవిరాజు' బిరుదం ఇవ్వవలసినదిగా ప్రతిపాదించినది విశ్వదాత, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు "సూతపురాణమును బోలు మరియొక్క సృష్టి ఇంతవరకు ఉత్పన్నము కాలేదు, కాబోదు. సంస్కృత పురాణములలోని అభూతాంశములు, స్వకపోల కల్పితగాధలు సూతపురాణములో గోచరింపవు. ఇందులోని కవిత సుధామధురము. మొత్తం గ్రంథమొక అమృత ఝరి. తెలుగు సాహితి కొక నూతనసృష్టి, కొత్తవెలుగు. ఇలాంటి ఉత్తమ పౌరాణిక విమర్శనా గ్రంథములను ఆంధ్రులకు ప్రసాదించిన రామస్వామి చౌదరికి పౌరాణిక ప్రపంచమున వ్యాసునికి గల స్థానము కలదు" అన్నారు. మహామహోపాధ్యాయ కళాప్రపూర్ణ ఆనాటి ఆస్థాన కవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, కవిరాజుగారి 'భగవద్గీత' గురించి వ్యాఖ్యానిస్తూ "ఆంధ్ర సాహిత్యంలో వ్యంగ్యోక్తిని అత్యంత ప్రతిభావంతంగా వాడుకొన్న మహాకవి శ్రీ రామస్వామి చౌదరి. వారి భగవద్గీత ఏ విషయంలోనూ సంస్కృత గీతకు తీసిపోదు. పూర్వజన్మ పట్ల విశ్వాసం గల నాకు అలనాటి వ్యాసుడే ఈ అవతారమునెత్తెనా యనిపించినది. భగవద్గీత వంటి మహోత్తమ గ్రంథాల ద్వారా, నిస్తేజమైన జాతిలో చైతన్యం కలిగించి, ముందడుగు వేయించిన చౌదరిగారికి ఆంధ్రజాతి తరతరాలుగా రుణపడి వుండగలదు. ఇది నా ప్రగాఢ విశ్వాసము, దృఢ నమ్మకము" అన్నారు."


❋ ❋ ❋

# చురక

"అబ్బూరి రామకృష్ణారావుగారు 1918–19 లో "ఊహాగానము – పూర్వప్రేమ" అనే సంకలనం ప్రచురించారు. ఇది వారికి బాగా పేరు తెచ్చిన కృతిద్వయం. అప్పటికే ఆయన కలకత్తా సిటీ కాలేజీలో "నాన్ కాలేజిమేట్' విద్యార్థిగా చేరి చదువు ప్రారంభించారు. హేరంబ చంద్రమిత్ర వద్ద అధ్యయనం చేసి బి.ఏ.లో ఉత్తీర్ణులయ్యారు. కలకత్తాలో ఉన్నప్పుడు బెంగాలీ



(Outputs) 14/10/08




అబ్బూరి

భాషను నేర్చుకుని ఆ సాహిత్యాన్ని చదివారు. బెంగాలీ కవితలోని అందాలను తెలుగులోకి తీసుకురావాలనే కోరిక 'ఊహాగానం'లో కనబడుతుంది. రవీంద్రుని రచనలు, అరవిందఘోష్ కవితలు కొన్ని అనువదించారు కాని రాసిన వేవీ విరివిగా ప్రచురించలేదు. రవీంద్రుని రక్త కరవీర్ అనువాదం సగంలోనే ఆగిపోయింది. కలకత్తాకు వెళ్ళడానికి ముందు మైసూరులో టి.సి. కైలాసం గారి ప్రహసనాలను కొన్ని తెనిగించారు గాని అదీ ప్రచురించలేదు. "వాటిని ప్రచురించాలనే ఉద్దేశమే ఆయనకు లేకపోయింది. ఇప్పటికీ ఆ వ్రాత ప్రతులు కూడా సాఫ్‌గా అంతర్ధానమయి ఉంటాయి. ఈ మాదిరి సుస్తే సహించకూడనిది. అయినా మనకు ఆ ఆచారం అమరేశ్వరుడి నాటినుంచీ.... ఇంకా అంతకు పూర్వం నుంచీ కూడా వస్తూనే ఉంది. అలాంటి అశ్రద్ధ మరీ బలిస్తే ఒక్కొక్కప్పుడు మహాకవి అయినా.... తరువాత కాలానికి పేరు మాత్రం.... అదీ చూచాయగా మిగులుతుంది..." అని మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ఒక చురక తగిలించారు. అయినా అబ్బూరి వారిలో చలనం లేదు."

❋ ❋ ❋

# చెలం



చెలం

"1894 మే 18, బుద్ధపూర్ణిమ (వైశాఖ పూర్ణిమ) నాడు చెలంగారు పుట్టారు. తండ్రి కొమ్మూరి సాంబశివరావు, తల్లి వెంకట సుబ్బమ్మ. మాతామహ స్థానానికి పెంపుడువెళ్ళి గుడిపాటి వెంకట చెలం అయినాడు. చిన్ననాటి నుండీ అనారోగ్య దేహం. కొట్టే తండ్రి, ఏడ్చే తల్లి. పాలు కూడా జీర్ణం కాని బలహీనుడు. చిన్నప్పటి నుండీ పురాణగాథలు చెవికెక్కినా వాటిల్లో అతనికి అన్యాయమే కనిపించేది. అక్కరకు రాని ధర్మాల కోసం పనికిరాని త్యాగాలు, స్త్రీల ఆక్రందనలు, రామాయణ కథలో పురుషుల అన్యాయం ఇవే ఎక్కువగా మనసుపై ముద్ర పడ్డాయి. చిన్నప్పటి నుండీ ఆడపిల్లల స్నేహమే ఎక్కువ. లోకవిరుద్ధంగా పెదనాన్న కూతురుని వివాహం చేసికోటానికి అనుమతి ఇమ్మని శృంగేరి పీఠానికి దరఖాస్తు పెట్టాడు. ఇవన్నీ ఉన్నా మత విషయాలలో తీవ్ర నిష్ఠ, గాయత్రి అనుష్ఠానం అతి ఛాందసంగా చేశారు. నమ్మిన దానిని ఆచరించటంలో తీవ్రత ఆజన్మ సిద్ధ గుణం. చదువు కోసం కాకినాడకు పోయి, బ్రహ్మర్షి నాయుడుగారి ప్రభావంతో బ్రహ్మసమాజీకుడైనాడు. చెలం సాహిత్యం మొత్తానికి స్త్రీ కేంద్రం అనిపిస్తుంది. స్త్రీకి ఉన్న సమస్యలు, స్త్రీ వల్ల కలిగే సమస్యలు చలం సాహిత్యానికి ఇతివృత్తాలు. చలం గారు 1936 లో మొదటిసారిగా రమణ మహర్షిని



(Outputs) 14/10/08

దర్శించారు. 'నేనెవరు' అన్న సాధనలోకి కూడ ప్రవేశించారు. 1950 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్‌తో తెగతెంపులు చేసుకుని రమణాశ్రమానికి వెళ్ళిపోయారు. తరువాత రెండు నెలలకే భగవాన్ కాలం చేశారు. అయినా తానిక్కడే ఉంటానన్న భగవాన్ మాటమీద విశ్వాసంతో చలం అక్కడే ఉండిపోయాడు. 1979 మే 14 న అనంతమైన ఆనందంలో లీనమైనారు."

❋ ❋ ❋

## నండూరివారు



నండూరి సుబ్బారావు

"నండూరి వెంకట సుబ్బారావు గారిని కన్న ఊరు వసంతవాడ. అప్పటి కృష్ణాజిల్లాలోని, ఇప్పటి ఏలూరు తాలూకాలోని దా వూరు. నండూరి వారు 1895 డిసెంబరులో జన్మించారు. 'కంఠంలోకి కిన్నెరుడున్నాడే అన్నారు జాతకం వ్రాసినవారు. "అమావాస్యనాడు పుట్టాను. జారుణ్ణీ చోరుణ్ణీ అవుతాను" అని తరువాత సరదాగా అంటుండేవారు నండూరివారు. ఈ రెండూ నిజమే! కంఠంలో ఒదిగిన ఆ కిన్నెరుడే యెంకి పాటల రూపంలో తెలుగు నేలను గాంధర్వంలో ముంచెత్తాడు. అమావాస్యనాడు పుట్టిన ఫలితమేమో రసిక హృదయ గోపికా జారుడైనాడు. అసంఖ్యాక పాఠక చిత్త చోరుడైనాడు. ఆరోఏట సంగీతం నేర్చుకున్నాడు. స్వరజ్ఞానం అలవడింది. రాగ పరిచయం ఏర్పడింది. అది భవిష్యత్తులో యెంకి పాటల రాగసృష్టికి ప్రాతిపదికగా మిగిలింది."

❋ ❋ ❋

## దడ దడ గడ బిడ

"సురవరం ప్రతాపరెడ్డి గారికి తెలంగాణా ప్రాంతమంటే ప్రత్యేకాభిమానం. ఆయన నిజామాంధ్రం అని వ్యవహరించేవారు. ఎవరైనా తెలంగాణా భాషని, సంస్కృతినీ తక్కువచేసి మాట్లాడితే వెంటనే స్వాభిమానంతో ప్రతి స్పందించేవారు 'బ్రిటీషు ఆంధ్రులు బ్రౌణ్యాంధ్రం మాట్లాడితే, మేము తౌరక్యాంధ్రం మాట్లాడుతాము. వారిది ఇంగ్లీషు దడ, దడ మాది ఉర్దూ గడబిడ' అనేవారు".

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# బంకింబాబు



బంకించంద్ర ఛటర్జీ

"బంకించంద్ర ఛటర్జీ (1838 – 1894) పూర్వాచార పరాయణమైన కుటుంబానికి చెందినవాడు. హుగ్లీ కాలేజీలో చదువుకున్నాడు. మైకేల్‌మధు సూదన్ దత్తు వంగ కవిత్వానికి చేసినది, బంకించంద్ర వంగ నలవకి చేశాడు. ఈశ్వర్ చంద్ర గుప్తా మార్గాన్ని అనుసరించి బంకింబాబు మొట్టమొదట పద్య రచనతో తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించాడు. కవితామార్గం తన మార్గం కాదని వెంటనే గ్రహించాడు. తన ప్రతిభని నవల రచనవైపు తిప్పాడు. ప్రకటించిన ఒక బహుమానం కోసం మొట్టమొదటి చిన్న నవల వ్రాశాడు. బహుమానం రాలేదు. ఆ నవల అచ్చు కాలేదు. అచ్చులో వచ్చిన అతని మొట్టమొదటి నవల "రాజ్‌మోహన్స్ వైఫ్" అనేది. ఇది ఇంగ్లీషులో ఉంది. ఇండియన్ ఫీల్డ్ అనే పత్రికలో ప్రకటింపబడింది. (1864) బహుమానం రాని అతని వంగ నవలకి ఇది అనువాదం కావచ్చును.

వంగీయుల మేథాసంపత్తికి ఉద్దీపన కలిగించడం, సాంస్కృతిక పునరుజ్జీవనం తీసుకు రావడానికి ఆదర్శంగా పెట్టుకుని రచనలు సాగించడం మొదలుపెట్టాడు. ఈ ఆశయంతో 'వంగదర్శన్' అనే మాసపత్రికను 1872 లో ప్రారంభించాడు. చివరి రెండు పుస్తకాలు తప్ప మిగిలిన రచనలన్నీ మొదట ఈ పత్రికలోనే ముద్రించబడ్డాయి. ఈ పత్రికలో – నవలలు, వ్యాసాలు, హాస్య రచనలు, విషయ వివరణ చేసే వచన రచనలెన్నో ఉన్నాయి. ఇవిగాక ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాహిత్య విమర్శలు, పుస్తక సమీక్షలు కూడా ఇందులో అచ్చయ్యేవి.

1884 నాటికి బంకింబాబుకి సాహిత్య కళ మీద అభిమానం తగ్గి, ప్రచారం మీద మక్కువ ఎక్కువైంది. భగవద్గీతకి నవ్య నిర్వచనం చేస్తూ, థియోసఫీ నుంచి పరోక్షంగా సహాయాన్ని పొందుతూ ప్రచారంలోకి వచ్చిన ఛాందస హిందూమతం యొక్క ఏకేశ్వరారాధన, సంఘ సంస్కరణ అంటే నచ్చని వ్యక్తిగా మారిపోయాడు. కృష్ణతత్వాన్ని గురించి తెలుసుకోవడంలోను, గీతాధ్యయనంలోను కాలం వెళ్ళబుచ్చాడు. తన పరిశోధనల ఫలితాల్ని – 'ధర్మతత్త్వ', 'కృష్ణచరిత్ర' అనే రెండు గ్రంథాలలో నిక్షిప్తం చేశాడు. వీటిలో కృష్ణ చరిత్ర చాలా ఉద్గ్రంథం."

**– డి. సత్యన్నారాయణరెడ్డి**

* * *


# శరత్‌బాబు

"శరత్‌చంద్ర ఛటర్జీ (1876–1938) తన మాతామహుల ఇంటిలో భాగల్‌పూర్‌లో పెరిగి పెద్దవాడయ్యాడు. స్కూలు చదువు, రెండేళ్ళ కాలేజీ చదువు అక్కడే జరిగింది. తల్లిదండ్రుల మృతితో ఇతని గృహ జీవితం భగ్నమయిపోయింది. దానితో ఇల్లూ వాకిలీ లేకుండా నిరాధారంగా



(Outputs) 14/10/08

కొన్ని ఏళ్ళు ఉత్తర బీహార్‌లో గడపవలసి వచ్చింది. 1903 లో బర్మా వెళ్ళి, రంగూన్‌లో ఒక ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా కొన్నాళ్ళు పని చేశాడు. బర్మా వెళ్ళే ముందు ఒక కథ వ్రాసి తన మామ సురేంద్రనాథ్ గంగూలీ పేరు మీద ఒక పోటీకి పంపాడు. దానికి ప్రథమ పురస్కారం లభించి, 1904 లో అచ్చయింది. 1907 లో శరత్ పేరుతోనే 'బడదీదీ' అనే పెద్ద కథ, రెండు భాగాలుగా భారతీ పత్రికలో ప్రచురించబడింది. కాని 1913 వరకు సాహిత్య రంగంలోకి పూర్తిగా దిగలేదు. ఆనాటికి శరత్ రచనలు – జమునా, సాహిత్య, భారత్‌వర్ష వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురించబడ్డాయి. తన కథలు ప్రజాదరణాన్ని పొందడం వల్ల, డబ్బు ఇబ్బంది తొలగిపోయి, శరత్ బర్మా నుండి స్వదేశానికి తిరిగి రావడానికి వీలు చిక్కింది. తరువాత కలకత్తాలో స్థిరపడటం జరిగింది. సొంత రచనల వల్ల డబ్బు సంపాదించుకుని సుఖమయ జీవితం గడిపిన ప్రథమ భారతీయ రచయిత శరత్ అనవచ్చును. శరత్‌కి వచ్చిన పేరు, ప్రచారం అంత తక్కువ కాలంలో ఎవరికీ రాలేదనడంలో అతిశయోక్తి కాదు. బంకించంద్ర ఛటర్జీ రచనలుగాని, ఆఖరుకి ఠాగూర్ రచనలుగాని ప్రజలను ఇంతగా ఆకర్షించలేకపోయాయి."



**శరత్**

– **విశ్వేశ్వరరావు**

❋ ❋ ❋

# రవిబాబు

"1901 డిసెంబరులో ఠాగూర్ శాంతినికేతన్‌లో 'బ్రహ్మచర్య' పాఠశాలని ప్రారంభించాడు. 'నైవేద్య'లో వ్యక్తం చేయబడిన భావనకి ఇది రూపకల్పన. తనకి చిన్నతనంలో క్రమబద్ధంగా చదువు సాగకపోవడాన్ని మనసులో ఉంచుకొని, దానికి ప్రతిరూప సానుభూతిగా ఈ పాఠశాలని ప్రారంభించాడేమో!

1902 నవంబరులో ఠాగూర్ భార్య మృణాళినీదేవి మరణించారు. ఆమె స్మృతి మీద కవి వ్రాసిన గీతాలు 'స్మరణ్' (1903) అనే పేరుతో వెలువడ్డాయి. ఈ సంకలనంలోని గీతాలలో కోమలత, ఆర్ద్రత, కృతజ్ఞతతో కూడిన సంస్మరణ మనకి కనబడుతుంది."

❋ ❋ ❋

# హిందీ కథ

"హిందీలో 'కథ' ఉద్భవించడం ఆలస్యంగా జరిగింది. అప్పట్లో హిందీ రచయితలు కవితల్లో, నవలల్లో ఎక్కువగా నిమగ్నులయ్యారు. అయినా హిందీకథ అనతికాలంలోనే తన విశిష్టతను చాటుకుంది. అందువల్ల భారతీయ సాహిత్యంలోనే కాకుండా, విశ్వసాహిత్యంలో హిందీకథ తన ప్రత్యేకత నిరూపించుకుంది.



(Outputs) 14/10/08

మొదట్లో చంద్రధర్‌శర్మ గులేరీ, కిశోరిలాల్ గోస్వామి, బృందావన్‌లాల్ వర్మ, జయశంకర ప్రసాద్, రాజా రాధికా రమణ్ ప్రసాద్ సిన్హా, విశ్వంభరనాథ్ శర్మా కౌశిక్, ప్రేమ్‌చంద్, జైనేంద్ర కుమార్, యశ్‌పాల్, అజ్ఞేయ, భగవతీ చరణ్ వర్మ, ఉపేంద్రనాథ్ 'అశ్క్' మొదలైన వారి రచనలు హిందీ కథకు విశిష్టస్థానం కల్పించాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత హిందీ కథా సాహిత్యంలో కొత్త మార్పు వచ్చింది. నవీన కవితల ధోరణిలో నవీన కథ కొనసాగింది. ఈ కథా రచనలో గాంగేయ రాఘవ్, ఫణీశ్వరనాథ్ 'రేణు', ద్విజేంద్రనాథ్ మిశ్ర 'నిర్గుణ', భీష్మ సహానీ, కృష్ణసోబతీ, కృష్ణ బలదేవ్ వైద్, రామ్‌కుమార్, కమల్‌జోషీ, లక్ష్మీనారాయణ్‌లాల్, హరిశంకర్ పరసాయీ, మోహన్ రాకేశ్, అమర్‌కాంత్, ఉషాప్రియంవద, మన్నూభండారీ, నిర్మల్‌వర్మ, మార్కండేయ, రాజేంద్రయాదవ్, కమలేశ్వర్, శేఖర్ జోషీ, శివప్రసాద్ సిన్హా, ధర్మవీర్ భారతి, రఘువీర్ సహాయ్, మనోహర్, శ్యామ్‌జోషీ, శైలేష్ మటియానీ మొదలగువారి పేర్లు ఎన్నదగినవి. ఇంతమంది రచనాత్మక ప్రతిభాశాలురు కథారచన వైపు మొగ్గటం హిందీ సాహిత్యంలోనే ప్రముఖ సంఘటన. భైరవ్ ప్రసాద్ సంపాదకత్వంలో వెలువడే 'కహానీ' అనే మాసపత్రిక, 'నయీ కహానియా' అనే పత్రిక ఈ మేధావులకు వేదికగా మారాయి.

ఆ తరువాత తరువాత మరోతరం రచయితలు పైకి వచ్చారు. సంప్రదాయ సిద్ధమైన యదార్థాన్ని ప్రక్కకునెట్టి, సామాన్య మానవుని జీవితంలో ఎదురయ్యే వైపరీత్యం, భీతి, అమానుషత్వము, ఆత్మ బహిష్కరణ మొదలైన విషయాల లోతుపాతులను కనుక్కోటానికి ప్రయత్నించారు. ఈ రచయితలలో శ్రీకాంత్‌వర్మ, మహేంద్ర భల్లా, జ్ఞానరంజన్, కాశీనాథ్ సింఘ్, రవీంద్ర కౌలియా, కామ్‌తానాథ్, సుధా ఆరోరా, రమేష్ బక్షీ, ప్రబోధ్‌కుమార్, విజయచౌహాన్ మొదలైనవారి పేర్లు ఎన్నదగినవి."

**– చలసాని ప్రసాదరావు.**

* * *

# గురు శిష్యులు

"మరాఠీ సాహిత్యంలో మొట్టమొదటి జ్ఞానపీఠ పురస్కారం వి.సి. ఖాండేకర్ రచించిన నవల ' యయాతి'కి లభించింది. రెండవసారి ఆ పురస్కారం అతని శిష్యుడు కవి కుసుమాగ్రజ్‌కు లభించింది. వాళ్ళిద్దరూ గురుశిష్యులే. వి.సి. ఖాండేకర్ పూర్తిపేరు విష్ణు సఖారామ్ ఖాండేకర్. అతని వ్యవహారనామం భావూసాహెబ్. మహారాష్ట్రుల్లో వ్యవహారనామం ఉండడం ఒక సంప్రదాయం. కుసుమాగ్రజ్‌గా ప్రసిద్ధిగాంచిన మహాకవి పేరు వి.వా. శిర్వాడ్కర్ పూర్తిపేరు విష్ణు వామన్ శిర్వాడ్కర్. అతని వ్యవహారనామం తాత్యాసాహెబ్."


**– ఎస్. సదాశివ**

* * *



(Outputs) 14/10/08

# ఆపా



శ్యామ్‌బెనగల్

"శ్యామ్ బెనగల్ కొన్ని మంచి సినిమాలు తీసి 'జునూన్' అనే ఇంకో మంచి సినిమా తీయబోతూ – అందులో ఒక వృద్ధమహిళ పాత్ర ఉన్నది. చిన్నపాత్రే కాని విశిష్టమైంది. ఆ పాత్రను సృష్టించిన 'ఇస్మత్ ఆపా' చేతనే ఆ పాత్ర వేయించాలనుకున్నారు. ఆమె ఇంటికి వెళ్ళారు. అప్పుడామె వయసు డెబ్భై యేళ్లు దాటింది. తెల్లని ముగ్గుబుట్టలాంటి తల, ఖద్దరు చీర, దళసరి కళ్ళద్దాలు, వాటిల్లోంచి ఎదుటివాళ్ళను శోధిస్తున్నట్లు చూచే నిశితమైన చూపులు. మాటలో దురుసుతనం. మనసునిండా మమకారం. ఆమె పేరు 'ఇస్మత్ చొగ్తాయి'. అంతా ఆమెను 'ఆపా' అని పిలిచేవాళ్లు. ఆపా అంటే అక్క. 'జునూన్' రచయిత్రి ఆమె. శ్యామ్ బెనగల్ "ఆపా! ఆ వృద్ధ మహిళ పాత్ర మీరు పోషిస్తే చాలా గొప్పగా ఉంటుంది" అని విన్నవించారు. 'ఆ పాత్ర నేను నటిస్తాను' అని హామీ ఇచ్చి పంపింది. చక్కగా నటించింది.

అమృతలాల్ నాగర్ హిందీలో గొప్ప రచయిత. అతడు భంగ్‌ప్రియుడు. భంగ్ నూరించి త్రాగటమే కాక పాన్ బీడాలలో కూడా భంగ్‌పొడి కలుపుకుని నమిలేవాడు. ప్రతి సంవత్సరం హోలీ పండగనాడయితే అతనింట్లో భంగ్ తయారీ ఒక యజ్ఞం లాగా జరిగేది. తనకు సన్నిహితులైన కొందరు హిందీ, ఉర్దూ కవులను ఆహ్వానించేవాడు. ఇస్మత్ ఆపా అతనింటికి సాధారణంగా వెళ్ళేది. కాని హోలీ నాడెన్నడూ ఆమెను ఆహ్వానించలేదు. ఒక హోలీ పండగకు ఆమెను ఆహ్వానించాడు. తాను జగమెరిగిన రచయితే అయినా, తన తాజా కథల సంకలనానికి ఆపా చేత ప్రస్తావన రాయించాలన్నది అతని బహుకాల వాంఛ. ఆపా ఒప్పుకున్నది. కానీ అక్కడ అందరూ భంగు తాగుతుంటే తానూ తాగుతానని పట్టు పట్టింది. 'ఆపా! అది మీ వంటికి పడదు' అది నాగరే కాక అక్కడున్న వాళ్ళంతా మనవి చేశారు. 'అంటే మీరంతా మగవాళ్లు. మీ వంటికి పడుతుంది. నేను స్త్రీని. నా వంటికి పడదు. ఈ దౌర్భాగ్యపు ఆలోచన మీకు అన్ని విషయాల్లోనూ వుంటుంది. నా కిప్పుడు భంగు కావాలి' అని హఠం చేసింది. ఆమెను వారించటం ఎవరి తరమూ కాలేదు. కాబట్టి అంతా తలో భంగు గ్లాసు తీసుకుని, ఆమెకు భంగులేని చిక్కని పాలగ్లాసిచ్చారు. ఒకటి తర్వాత ఒకటి, మూడు గ్లాసులు త్రాగింది. అంతా నవ్వుతున్నారు, తుళ్లుతున్నారు, వదురుతున్నారు. తనకేమీ కావటంలేదు. 'నాగర్ నాకు ధోకా చేశావు కదా! బంగని చిక్కనిపాలు త్రాగించావు. ధూర్తునివి. అబద్ధాల కోరువు" అని కోప్పడింది ఆపా. ఆ కోపంలోనే "నీ కథా సంకలనం కు ఇప్పుడు అభిప్రాయం రాస్తా" అన్నది. భంగు ప్రహసనమంతా రాసి "ఈ అమృతలాల్ నాగర్ ఎంత గొప్ప నవలలు రాసినా, ఎంత గొప్ప కథలు రాసినా ధూర్తుడు, అబద్ధాల కోరు. కాని ఇతని కలం మాత్రం సత్యం తప్ప తదసత్యం రాయజాలదు" అని ముగించింది – అదీ పెద్ద సర్టిఫికెటే."


– ఎస్. సదాశివ

* * *



(Outputs) 14/10/08

# కాటూరి



కాటూరి

"కాటూరి వెంకటేశ్వరరావుగారికి, కృష్ణా పత్రికకు విడదీయరాని సంబంధమున్నది. 1902 వ సంవత్సరంలో కొండా వెంకటప్పయ్యగారు, దాసు నారాయణరావుగార్ల సంయుక్త సంపాదకత్వంలో కృష్ణాపత్రిక ప్రారంభమయింది. 1903 లో సహాయ సంపాదకులుగా ప్రవేశించిన ముట్నూరి కృష్ణారావుగారు 1906 నాటికి ఆ పత్రికకు సంపాదకులైనారు. 1945 జూన్ మరణించే వరకూ వారే సంపాదకులు. ముట్నూరి వారికి కాటూరి వారంటే ఎంతో అభిమానం. వెంకటేశ్వరరావుగారు ముట్నూరి వారి దర్బారు కవి. వెంకటేశ్వరరావుగారిని తన తదనంతరం కృష్ణాపత్రికకు సంపాదకులుగా నియమిస్తూ వారు వీలునామా వ్రాశారు. 1945 జూలై నుండి 1953 అక్టోబరు వరకు కృష్ణాపత్రికకు వెంకటేశ్వరరావుగారు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. కోలవెన్ను రామకోటేశ్వరరావు, కమలాకర వెంకట్రావు గార్లు వారికి సహకరిస్తుండేవారు. కాటూరి వారి సంపాదకీయాలు వచన కావ్యాలు. అప్పుడప్పుడు చంపూ కావ్యాలు కూడా. "మా గ్రామం", "రసమంజరి", "పన్నీటిజల్లు, "వడగళ్లు" మొదలైన శీర్షికలతో ఆనాడు కృష్ణాపత్రిక నాటి సాంఘిక రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతూ సర్వజన మనోభిరామంగా వుండేది. వెంకటేశ్వరరావుగారి రచనలు చాలా వరకు కృష్ణాపత్రికలో అచ్చయినాయి. 1945 లో వారు నవ్య సాహిత్య పరిషత్తుకు అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. కాటూరి వారి జీవితంలో సామరస్యమే గాని సంఘర్షణ కనబడదు. పింగళివారితోనే కాక, దేవులపల్లి వారితో, తుమ్మల వారితో, అడివి బాపిరాజు, మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి, జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి మొదలైన కవులతో వీరికి చక్కని మైత్రీ బంధాలున్నవి."

*   *   *

# ఆదర్శ మహిళ



వరలక్ష్మమ్మ

"కనుపర్తి వరలక్ష్మమ్మ సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో మధ్య తరగతి జీవనం సాగిస్తున్న పాలపర్తి రామమూర్తి గారి సోదరిగా 6-10-1896 న బాపట్లలో జన్మించారు. ఆ రోజుల్లో స్త్రీలకు అయిదో తరగతి చదువు ఎక్కువ. 13 వ యేటనే వివాహమైంది. సంస్కారి అయిన ఆమె భర్త, అన్నల ప్రోత్సాహముతో, మహిళా సంఘాలలో పాల్గొంటూ రచనా వ్యాసాంగాన్ని చేపట్టింది. 'లీలాదేవి' అనే కలం పేరుతో ఆంధ్రపత్రికలో 1922 నుంచి "మా



(Outputs) 14/10/08

చెట్టు నీడ ముచ్చట్లు" అనే వ్యాస పరంపరను ధారావాహికంగా ప్రచురించింది. స్త్రీల సమస్యలను ఆమె చర్చించిన విధానం చాలా మందిని ఆకట్టుకుంది. కె.ఎన్. కేసరిగారి "గృహలక్ష్మి" పత్రికలో 1928 నుంచీ ప్రచురితమైన "శారదా లేఖలు"తో ఆమె అసలుపేరు బయట పడింది. 1934 లో "గృహలక్ష్మి స్వర్ణ కంకణం" స్వీకరించిన ప్రథమాంధ్ర మహిళ వరలక్ష్మమ్మ గారు.

కనుపర్తి వరలక్ష్మమ్మగారి సమకాలికులలో కాంచనపల్లి కనకాంబు, గుడిపూడి ఇందుమతీదేవి, పుట్టపర్తి కనకమ్మ, బసవరాజు (సౌదామిని) రాజ్యలక్ష్మి, బండారు అచ్చమాంబ వంటివారు విద్వత్కవయిత్రులుగా పేరు మోశారు. వారు సంఘసేవారంగంలో గాని, మహిళా సంఘాల్లోగాని ప్రముఖ పాత్ర వహించలేదు. అలాగే దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కొండా పార్వతి, ఉన్నవ లక్ష్మీబాయమ్మ వంటివారు రాజకీయ సాంఘిక రంగాల్లో సుప్రసిద్ధులుగా ఉండేవారు. వారికి సాహితీరంగంలో ప్రవేశం లేదు. వారందరూ ఉన్నత విద్యావంతులు. వరలక్ష్మమ్మగారితో పోలిస్తే సంపన్నులు, గురువుల సన్నిధిలో విద్య నేర్చినవారు. వరలక్ష్మమ్మగారిది కేవలం స్వయంకృషి పూర్వకమైన పరిజ్ఞానం. ఆమె అన్నగాని, భర్తగాని పరోక్షంగా ప్రోత్సహించినవారేగాని ప్రత్యక్షంగా విద్యాగురువులు కాదు. కుటుంబ సంస్కారం, పరిసర వాతావరణం, పట్టుదల ఆమెకు సమాజంలో స్థానం కల్పించాయి. ఎందరి సాయమో పొంది ఆమె తన సంకల్ప బలంతో సంస్థలు స్థాపించి నిర్వహించింది. ఆమె సాహిత్యం కన్నా, ఆమె వ్యక్తిత్వం దొడ్డది. స్వార్థ రహిత సేవలకు ఆమె జీవన యాత్ర మార్గదర్శకం."

**– స్నేహ మువ్వల**

* * *

# వంగసాహిత్యం

"వంగసాహిత్యం యొక్క విస్తృతమైన ప్రగతి నన్ను బాగా ఆకర్షించింది. ఈ మధ్య కాలంలో పాశ్చాత్య ప్రభావాల వల్ల వచ్చిన మార్పులు, కలిగిన అభివృద్ధి నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. వీటి నన్నింటిని నేను చాలా ఆసక్తితో పరీక్షించాను. ఈ అభివృద్ధి పథంలో రామ్‌మోహన్‌రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, మైకేల్ మధు సూదన్ దత్, బంకించంద్ర ఛటర్జీ, రమేశ్ చంద్ర దత్, శరత్ చంద్ర ఛటర్జీ, కొంత భిన్న మార్గంలో కాజా నద్రుల్ ఇస్లాం – ఉన్నత శిఖరాలుగా కనపడతారు. కానీ అందరికంటే ఉన్నతంగా – సాహిత్యంలోనూ, చిత్రలేఖనంలోనూ, సంగీతంలోనూ, ప్రతి కళలోనూ ప్రముఖ స్థానం ఆక్రమించిన ఠాగూర్ కుటుంబం కనబడుతుంది."

**– జవహర్‌లాల్ నెహ్రూ**

* * *



(Outputs) 14/10/08


# మాసిక్ పత్రికా

"వంగ జీవితాన్ని ఆచార వ్యవహారాల్ని చక్కగా చిత్రించే వచన రచనల్ని ప్రారంభించిన వాడు పియర్‌చంద్ మిత్ర (1814–1883) అని చెప్పాలి. ఇతను టేక్ చంద్ ఠాకూర్ అనే మారు పేరు పెట్టుకుని తన వంగ రచనల్ని ప్రకటించాడు. 1854 లో స్త్రీల కోసం ఒక పత్రిక స్థాపించడంతో మిత్రా యొక్క సాహిత్యకృషి ప్రారంభం అయింది. ఈ కార్యంలో ఇతనికి తోడు నీడ అయినవాడు రాధానాథ్ సిక్ధర్ అనే అతను. హిమాలయాలలో అత్యున్నత శిఖరం ఎవరెస్ట్ అని కనుగొన్నది ఇతనే. పత్రికా సంపాదకులయిన ఈ ఇద్దరు, స్త్రీలకు అర్థమయ్యే భాషలో రచనలు ఉండాలని నిర్ణయించుకుని, తేట మాటలతో – వ్యవహారిక భాషకి, సాహిత్య భాషకి మధ్యగా ఉండే భాషలో రచనలు చేసి, తమ పత్రికలో ప్రకటించి, మంచి కృషి చేశారు. ప్రతి నెలా వెలువడే దీనికి 'మాసిక్ పత్రికా' అన్నారు.

**– కొండపల్లి కోటేశ్వరమ్మ**

❋ ❋ ❋

# కృతజ్ఞతలు



**మునిమాణిక్యం**

"నా కథలు చిన్నప్పుడు మా తల్లావజ్ఝల శివశంకర శాస్త్రిగారు నాలో పెంపొందించిన ఉపజ్ఞకు ఫలితాలు. వారు చూపిన దారిలోనే ఇవి ఇంతవరకూ రాణించి ఆంధ్రుల అభిమానాన్ని పొందినవి. నాకు దేశంలో కొద్దోగొప్పో పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిందీ, నన్ను కధకునిగా తయారు చేసిందీ మా శివశంకరశాస్త్రిగారే. అందుకని నిజంగా నేను పుస్తకం వ్రాసి కృతజ్ఞత చూపాలిసింది మా సాహితీ సమితి సభాపతులకే. అప్పుడప్పుడు మిత్రులు బాగున్న విషయాలను మెచ్చుకుంటూ నాలో ఉత్సాహం పురికొల్పినా అవి క్షణికాలు. నిజంగా చేయూతా, స్థానం ఇచ్చింది మా శాస్త్రిగారే. మా సాహితీ సమితి సభాపతులూ, పండితులూ, దేశభక్తులూ, ఉత్తమ కవులూ నాకు గురుమూర్తులూ అయిన శ్రీశ్రీ శివశంకర శాస్త్రిగారికి నా కృతజ్ఞతలు విన్నవించుకుంటున్నాను."

**– మునిమాణిక్యం నరసింహారావు**

❋ ❋ ❋

# రచయిత

"నన్ను ఎవరో అడిగారు – "డాస్టొవొస్కీ వ్రాసిన దానికీ మీరు వ్రాసిన దానికి పోలికలున్నాయ్" అని. తప్పకుండా వుండవచ్చును. ప్రపంచ ప్రఖ్యాత రచయితల ప్రభావం నా మీద కాస్తో కూస్తో లేకుండా లేదు. అలా ఉండటం సహజం. అందులో విమర్శించాల్సింది ఏమీ లేదు.



(Outputs) 14/10/08

కాగా వాళ్లు ఆలోచించినటువంటిది మనం ఆలోచించనూ ఆలోచించలేమా. ఇది వరకు జరిగినదీ, ఇప్పుడు జరుగుతున్నదీ, ఇకముందు జరగబోయేది కూడా అదే.


హేమలత

అనటోల్ ఫ్రాన్స్ వ్రాసిన 'థేయిస్' కీ, ఎమిలీజోలా వ్రాసిన 'నానా'కూ ఏ విధమైన బేధమూ లేదు. కొద్ది తేడా తప్ప. అలాగే 'థేయిస్'నే 'చిత్రలేఖ'గా చిత్రించాడు భగవతీ చరణ్‌వర్మ. దానికి చాలా పేరు వచ్చింది. తెలుగులోకూడా వెలువరించారు.

ఆ మాదిరిగానే ఠాగూర్ 'గోరా'ను కొంచెం మార్పు చేసి 'కమల'గా సృష్టించాడు శరత్‌బాబు. కాగా గోరా కన్నా కమల ఎంతో ఉదాత్త గంభీరంగా వుంది.

ఇక నా సంగతి – డాస్టొవొస్కీని నేనసలు చదవనే లేదు. మరో సంగతి – ఒక పాత్రను చిత్రించేటప్పుడు దారానికి పూసలు గుచ్చినట్లు సంఘటనలను గుచ్చాలి. ఆయా పాత్రల స్వభావాలను బట్టి సంఘటనలను, సంభాషణలను చిత్రిస్తాడు రచయిత. అదొక దివ్యదృష్టి."

రెండు రెళ్ళు నాలుగని ఇండియన్‌కు, అమెరికన్‌కు, రష్యన్‌కు కూడా తెలుసు. ఈ లెక్క అంతటా కూడా ఒకటే. రచన అనేది కూడా ఒకే విధమైన గణితం. ఇలాంటి పాత్రకు ఇలాంటి సంఘటన ఎదురైతే ఇలాగే సంభవిస్తుంది – అన్నది రచయితలయిన వారందరికీ సమానమైన గణితం.

అది తెలిసినవాడే మహారచయిత అవుతాడు. డాస్టొవొస్కీ, నేనూ ఒక మాదిరి పాత్రలను సృష్టించి ఒక మాదిరిగా నడవడం అట్టే ఆశ్చర్యపడ దగ్గ సంగతి కాదు. కాబట్టి ఎవరైనా అది కాపీ అనుకుంటే అందులో పెద్దతప్పులేదు, ఏమయితే ?

'వైన్' ఎంత నిలవున్న సరుకయితే అంత మంచిది. సాహిత్యం కూడా అంతే. సామాన్యంగా నా సృష్టి అంతా భగవత్ సృష్టి అనుకరణే. జీవితం మాతృక, రచన తూలిక. నేను వట్టి చిత్రకారిణిని మాత్రమే."

**– తెన్నేటి హేమలత**


* * *

# ఉత్పతనము కన్న అధఃపతనము సులువు

"నాయని సుబ్బారావు పెండ్లి కొరకు (25–2–1925) గూడూరునకు వచ్చి యుంటిని. ఈ పెండ్లి చాలామంది స్నేహితులను, విద్యావంతులను నొకచోట సమావేశపరిచినది. రామకోటేశ్వరరావు (త్రివేణి పత్రిక సంపాదకులు), విశ్వనాథ సత్యనారాయణ, అడివి బాపిరాజు, బెల్లంకొండ రాఘవరావు, నోరి నరసింహశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతం, ఇంకా నొకరిద్దరు జాతీయ



(Outputs) 14/10/08



నాయని

కళాశాల విద్యార్థులు వచ్చి యుండిరి. పింగళి లక్ష్మీకాంతమును నెల్లూరికి వచ్చియుండినపుడు అయిదారు సంవత్సరముల క్రిందట చూచి యుంటిని. తక్కినవారితో నెవ్వరితోనూ (బెల్లంకొండ రాఘవరావు తప్ప) ఇదివరకు నాకు పరిచయము లేదు. రామకోటేశ్వరరావు, సత్యనారాయాణ, బాపిరాజు వారి సహజ సౌజన్యము చేతను కలుపుగోలుతనము చేతను నాకు క్రొత్తవారుగా నగపడలేదు. వారితోడి సహవాసము నాకు సంతోషము గలిగించినది. నేనును గోవిందరాజులు నాయుడును ముహూర్తము జరుగునప్పుడు అచ్చటనే యుంటిమి. బాపిరాజు 'కృష్ణమ్మ' పాట పాడెను. అచ్చట మరి యొకరు ఎంకిపాటలు (నండూరి సుబ్బారావు వ్రాసినవి) చదివిరి. సత్యనారాయణ ఆ పాటలు మహాకవి నండూరి సుబ్బారావు రాసినవని ప్రకటించెను. ఈ పాటలు మహాకావ్యములని నమ్మించుటకు వారు ప్రయత్న పూర్వకముగ కృషి సల్పుచున్నట్లున్నది.

నేను గ్రాంధిక భాషావాదుల తరగతికిగాని, గ్రామ్యభాషావాదుల తరగతికి గాని సంబంధించిన వాడను గాను. నేను పట్టుబట్టి గ్రామ్యభాషనే వ్రాయవలయునని 95 పాళ్ళు గ్రాంధిక భాషలోను, 5 పాళ్ళు గ్రామ్యము కలిపి, గద్యమునుగాని, పద్యమునుగాని వ్రాయలేదు. గ్రామ్యభాషను నేను నిరసింపను. వాఙ్మయము నందు దానికిని ఒక స్థానము గలదు. ప్రాణవంతమైన భాష ప్రవాహము గావున ఏ కట్టుదిట్టములకు లోబడి యుండజాలదు. కాని ఉత్పతనము కన్న అధఃపతనము సుళువు."

**– దువ్వూరి రామిరెడ్డి**

* * *

# కీర్తి

"కేవలం కీర్తి వల్ల ప్రయోజన మేమిటి ? నా స్నేహితుడొకాయన తన రాజకీయ పక్షం ద్వారా కీర్తి సంపాదించాడు. రేపు ఆ పక్షం నామరూపాల్లేకుండా పోవచ్చు. ఆ పక్షంలోని సభ్యులు ఎక్కడి వారక్కడ చెదరిపోవచ్చు. అటువంటి కీర్తి వట్టిదై, ఒక పుక్కిటి పురాణంగా, ఒక రూపం లేని కలగా తేలిపోతుంది.

ఎవరైనా కీర్తి సంపాయించ దల్చుకుంటే, అది రవీంద్ర మహాశయుడు పొందిన కీర్తి లాగా ఉండాలి. అది ఒక్క వంగదేశానికి చెందింది మాత్రమేనా ? ఒక్క భారతదేశానికి పరిమితమైనదేనా ? లేక ఏషియా ఖండానికేనా ? ఆయన ఖ్యాతి యావద్విశాల ప్రపంచంలో


పరివ్యాప్తమై, జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్ దేశాలన్నింటా ప్రాకింది. కాని ఆయన గీతాలు బెంగాలీ భాషలోనే ఉన్నాయి. ప్రపంచానికి అది అనువాదాలుగానే తెలుసు. అయితేనేం, అనువాదాలే అంత పరివ్యాప్తమైన ఖ్యాతిని తెచ్చిపెట్టినవి."

**– సుబ్రహ్మణ్య భారతి**

('స్వదేశమిత్రన్' పత్రికలో ఆయన వ్రాసిన చివరి వ్యాసం లోనిది)

❋ ❋ ❋

# భారతి



**భారతి**

"అయ్యా! కీ. శే. సుబ్రహ్మణ్య భారతి నాలుక చివర సరస్వతీదేవి నృత్యం చేసిందని చెబితే తప్పక నమ్మవచ్చు. ఆమె చేసింది దేశభక్తి నృత్యం. ఈ భారతదేశంలో కాకుండా ఏ ఇతర దేశంలో జన్మించి ఉండినా, ఆ వ్యక్తిని ఆస్థాన కవిగా దేశం ఆదరించి ఉండేది. ప్రజల మనోభావాలను గుర్తెరిగి ప్రవర్తించే ప్రభుత్వం ఆయన్ని గౌరవాలతో బిరుదులతో సన్మానించి ఉండేది. ఆయన అత్యంతము గౌరవింపబడిన వ్యక్తిగా జీవించి మరణించి ఉండేవాడు. కాని మనది ఒక పరాధీన దేశం కావడం వల్ల, ఆయన దేశ బహిష్కృతుడుగా, పాండిచ్చేరిలో ఫ్రెంచి ప్రభుత్వపు ఆతిధ్యంలో రోజులు గడపవలసి వచ్చింది. కృంగి కృశించి మరణించవలసి వచ్చింది. కారణం ఈ ప్రభుత్వాధికారం క్రింద ఆయన వట్టి నిష్ప్రయోజకుడయ్యాడు. కానీ అయ్యా, ఆత్మత్యాగం చేసినవారూ, దేశభక్తులూ ఆయనకు పూర్వం కూడా, ఇటువంటి గతే అనుభవించిపోయారు! సుబ్రహ్మణ్య భారతి దేశభక్తుడుగానే బ్రతికి నిష్క్రమించాడు. అధ్యక్ష మహాశయా! నేను మళ్ళీ చెబుతున్నాను – తమిళభాష ఉండే అంతకాలం, మీరు పుస్తకాల ప్రతులన్నింటినీ వశపరచుకొని మాయం చేసినప్పటికీ, పవిత్రమైన వేదాలు తరం నుంచీ తరానికి పరంపరగా సంక్రమిస్తూ వచ్చినట్లే, యుగయుగాల వరకూ, వ్రాత మూలకంగా ఒక్క ముక్క లేకపోయినా ప్రాచీనులైన మా పూర్వుల ధారణశక్తి వల్ల అవి సంక్రమిస్తూ వచ్చినట్లే, మెకాలే పండితుడు మిల్టన్ కవీంద్రుని "పారడైజ్‌లాస్ట్" కావ్యాన్ని ప్రతిపాదమూ వల్లించగలిగినట్లుగానే, తమిళుడైన వాడొక్కడు ప్రాణంతో నిలిచి ఉండేంత వరకూ, ఈ గీతాలు, ఈ రచనలు తమిళ జాతి యొక్క అమూల్యమైన వారసత్వ సంపదగా నిలిచి ఉంటాయని నేను ఘంటాపదంగా చెప్పగలను."

**– ఎస్. సత్యమూర్తి**

(మద్రాసు శాసనమండలిలో ప్రసంగిస్తూ – 1928)

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# విలువలేని విమర్శ

“పోలవరపు రామబ్రహ్మముగారు ‘ప్రజామిత్ర’లో ఆధునిక కవిత్వమును విమర్శించిరి. వారి విమర్శలో కొంత సత్యమున్నది. కొంత తొందరపాటు, కొంత పొరపాటు కూడా ఉన్నది. వీరికి సుబ్బారాయుడుగారు మున్నగు పెద్ద కవులతో ఎలాంటి తగాయిదా లేదు. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు గార్ల కావ్యములతో గూడ వీరి కెలాంటి యిబ్బంది లేదు. కాని యితర కవులు రచించిన కావ్యములన్నియు చెత్తలని వీరభిప్రాయపడిరి. సుబ్బారావు, రామకృష్ణారావుగార్ల కావ్యములను మెచ్చుకోగలవారు తదితరులు వ్రాసిన దంతయు చెత్తయని యెట్లు తలంచిరో నాకు బోధపడుట లేదు. వారి కావ్యములలో నున్న గుణములను దోషములను తక్కినవారి కావ్యములలో గూడ నున్నవి. పింగళి లక్ష్మీకాంతం, వెంకటేశ్వరరావు గార్ల “సౌందరనందం”, విశ్వనాధ సత్యనారాయణ గారి ‘ఆంధ్రప్రశస్తి’, శివశంకరశాస్త్రిగారి ‘హృదయేశ్వరి’, కృష్ణశాస్త్రిగారి గీతములు, వేదుల సత్యనారాయణశాస్త్రిగారి ఖండకావ్యములు, జాషువాగారి ‘ఫిరదౌసి’, నాయని సుబ్బారావుగారి ‘మాతృగీతములు’, కొడాలి సుబ్బారావుగారి ‘హంపీక్షేత్రము’, బసవరాజు అప్పారావుగారి గేయములు, నండూరి సుబ్బారావు గారి ‘ఎంకిపాటలు’, కుందుర్తి నరసింహారావుగారి ‘పంపాసరస్సు’ (ఇది యొక కావ్యఖండము), బొడ్డు బాపిరాజుగారి ‘విపంచి’యే వాఙ్మయమునకైనా అలంకార ప్రాయములుగ నుండగలవు. మచ్చునకుగా కొందరి కవులును, వారి కావ్యములను పేర్కొంటిని. చక్కగా కవిత్వము వ్రాయగల కవులు ఇంకనెందరో నేడు ఆంధ్రదేశముననున్నారు. ఈ రచనలన్నియు చెత్తలని చెప్పుటకు రామబ్రహ్మముగారు సాహసింతురా ? అట్లు సాహసింతురేని వారి యభినవ కవితా పరిచయము 1916 వ సంవత్సర పర్యంతమనియే మనమూహింపగలము. అట్లు గానిచో వారి సహృదయత్వమును మనము శంకింపవలసి యుండును.

రామబ్రహ్మముగారు బూతుకథల విమర్శించిరి. వీరికి బూతు కథలపై గలిగిన ఆగ్రహము అభినవ సాహిత్యము నంతటిపై ప్రసరించి వారి విమర్శనమునకున్న విలువను తగ్గించినది. బూతు కథలు వెలువడుచుండుట యదార్థమేగాని, అభినవ సారస్వతమంతయు ఈ బూతులు తప్ప ఇంకేమి లేదని చెప్పుట ఆ సాహిత్యము తోడి వీరి పరిచయమెంతటి పాటిదో మనకు గోచరించుచున్నది. మొన్నటివైనను నేటివైనను బూతులు బూతులే. నాగరికాభిరుచిగలవారికి అట్టి కథలు ఏవము పుట్టించును. అట్టి కథకులు ఏ స్త్రీలను సంస్కరించుటకు (గిరీశము వలె) ప్రయత్నించుచున్నారో ఆ స్త్రీల ఆత్మ గౌరవమునకే అట్టి కథలు భంగకారులుగనున్నవి. కథలు వ్రాయువారందరు ఇట్టి బూతు కథలే వ్రాయుట లేదు. ఇట్టి కథలు ప్రచురించుటకు రెండు మూడు మాస పత్రికలె కంకణము కట్టుకొన్నవి.

‘సుబోధిని’ పత్రికయందు ‘నవ కవులు – బూతుకవనము’ అని రామబ్రహ్మముగారు రచించిన వ్యాసము ‘ప్రజామిత్ర’లోని వ్యాసము కన్నా మరింత తీవ్రమై బూతు కథలతో వారికి



(Outputs) 14/10/08

గల పరిచయమును సార్థకపరచుచున్నది. నవ కవులెవ్వరును బూతు కవనము వ్రాయుట లేదు. వారి కవిత్వములోని శృంగారము సభ్యముగను నాజూకైన యభిరుచి గలదిగ నుండును. కవిత్వము వ్రాయువారిలో కథలు వ్రాయువారి సంఖ్య చాలా తక్కువ. వారి కథలలో కూడ బూతు లేదు. అందులో ఒక్కరు మాత్రము అట్టి కథలు వ్రాయుచుందురు. ఇకమీదనైనను రామబ్రహ్మముగారు విషయపృథక్కరణము నందు కొంత పరిశ్రమ చేయుదురుగాక యనియు, అభినవ కావ్య సాహిత్య పరిచయము కలిగించుకొందురుగాక యనియు నా మనవి.”

**– దువ్వూరి రామిరెడ్డి.**

(‘ఉదయని’ సాహిత్యపత్రిక, 1936, మే)

* * *

# మోనియర్ విలియమ్స్

“ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సంస్కృతశాఖ బోడెన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ వుండిన ప్రముఖ సంస్కృత విద్వాంసుడు హోరెస్ హెమన్ విల్సన్ 1860 మే నెల 8 వ తేదీన కన్ను మూశాడు. ప్రతిష్టాత్మకమైన ఆ స్థానానికి తగిన విద్వద్వరేణ్యుని ఎన్నుకోవడానికి విశ్వవిద్యాలయ పట్టభద్రుల సమావేశం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఆ ఎన్నికలో 3786 మంది విద్వాంసులు పాల్గొన్నారు. ఆ పదవిలో నున్న ఆచార్యుని వార్షిక వేతనం 900 పౌండ్ల మొదలు 1000 పౌండ్ల వరకు వుండేది. అతి విశిష్టమైన ఆ పదవికి తగిన విద్యాయోగ్యతలు గలవారు కొందరు మాత్రమే వున్నా, వాస్తవంగా పోటీ ఇద్దరి మధ్యనే సాగింది. ఒకరు ప్రొఫెసర్ మేక్స్‌ముల్లర్, మరొకరు మోనియర్ విలియమ్స్.

మోనియర్ విలియమ్స్ రచనలలోకెల్లా మకుటాయమానంగా నిలిచినది అతని ‘ఇంగ్లీషు–సంస్కృత’ నిఘంటువు. ఆంగ్ల మాధ్యమంలో సంస్కృతం అభ్యసించే వారందరికీ అత్యంత ఉపయుక్తమైన దీ నిఘంటువు. కొన్నేళ్ళు కృషి చేసి 1851 లో ఇంగ్లీషు–సంస్కృత నిఘంటువును పూర్తి చేశాడు. మరింత విస్తృత మొనర్చిన ఈ నిఘంటువును 1899 లో ద్వితీయముద్రణగా వెలువరించాడు. ఈ నిఘంటువులోని పదములకు ధాతు వ్యుత్పత్తులను, లక్షణయుక్తంగా ఇండోయూరోపియన్ పదాల అర్థాలతో కూర్చడం విశేషం.

ఈ నిఘంటువు సంతరించుటలో మోనియర్ విలియమ్స్ సంస్కృత–జర్మన్ నానార్థ నిఘంటు సంపుటాలు ఏడింటిని బాగా పరిశీలించాడు. ఈ బృహత్ సంపుటాలను కూర్చిన జర్మనీలోని సంస్కృత విద్వాంసులు బోట్లెంగ్ మరియు రుడాల్ఫ్ రోథ్ గార్లు వీటిని పరామర్శించినప్పటికీ, విలియమ్స్ తన స్వీయప్రణాళికను సిద్ధపరచుకొన్నాడు. భారతీయ విద్వాంసులు – మిషనరీల కొరకు సిద్ధపరచిన నిఘంటువుగా భావించినప్పటికీ, కాలక్రమంలో మోనియర్ విలియమ్స్ కూర్చిన నిఘంటువు అత్యంత ఉపయుక్తమని, ఈనాటికీ ప్రామాణికమైనదని ధృవీకరించారు. విలియమ్స్ అందజేసిన సేవలలో మరో ప్రధాన ఘట్టం –



(Outputs) 14/10/08

1883 లో ఆక్స్‌ఫర్డ్‌లో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్'ని నెలకొల్పటం. భారతీయ సాహిత్యం, సంస్కృతిని గురించిన విశేషాలను సాధికారంగా అధ్యయనం చేయుటకు ఈ సంస్థ కేంద్రంగా వుంటుందని, ఇంగ్లండు – ఇండియాల మధ్య సద్భావ సౌజన్యాలను పెంపొందించగలదని భావించాడు. ఈ సత్కార్య సాధనలో భాగంగా మోనియర్ విలియమ్స్ 1875, 1876, 1883 సంవత్సరాలలో మూడు పర్యాయాలు మన దేశాన్ని సందర్శించాడు. సంస్థానాధిపతులను కలుసుకుని వారి సహాయంతో 34,000 పౌండ్ల పైకం సంపాదించాడు. తాను నెలకొల్పిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సంస్థకు తాను సేకరించిన ప్రాచ్య భాషా సాహిత్య గ్రంథాలను, వ్రాతప్రతులను మూడు వేలకు పైగా దానం చేశాడు."

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి

* * *

# నిఘంటువు

"గురజాడవారు ప్రారంభించిన వ్యావహారిక భాషా విప్లవం సరైన నిఘంటు నిర్మాణం జరిగితే కాని ఒక కొలిక్కి వచ్చినట్లు కాదు. భాషను ప్రమాణబద్ధం చేసే ప్రయత్నాలు జరగాలి. ఒకటి కాదు, పెక్కు నిఘంటువులు రావాలి, వ్యావహారిక భాషకు వ్యాకరణం ఒకటి విస్తృతమైనది రావాలి. భాష వాడకమైతే పెరిగింది కాని స్థిరీకరణ పదకోశాలు ఏర్పడలేదు. పూర్వం విశాఖపట్నం కలెక్టరుగా పనిచేసిన గ్విన్ దొరగారు వ్యావహారిక భాషకు వ్యాకరణం రాశారు. అది విస్తృతంగా ప్రచారంలోకి రావాలి.

నిఘంటు నిర్మాణంలో తలపండిన డాక్టర్ జాన్సన్ తాను అనేక శ్రమదమాదులకోర్చి నిర్మించిన నిఘంటువుకు ఆముఖం రాస్తూ "ప్రతి ఒక్క రచయిత పొగడ్తకు ఆశించవచ్చు. కాని నిఘంటుకారుడు దూషణల నుంచి తప్పించుకోడాన్ని కోరతాడు. అయితే ఈ వ్యతిరేకమైన ప్రతిఫలం కూడా కొద్దిమందికే లభ్యమవుతుంది!" ఆయన నిఘంటుకారుడైన రచయితను నిరపాయకరమైన కష్టజీవి అన్నాడు.

ఒక సాహిత్య నిఘంటు నిర్మాత నిఘంటువు తయారు చేయడం, ఒంటి చేత్తో తగుమాత్రం నివాసయోగ్యమైన ఇల్లు కట్టడం లాంటిదన్నారు. నిఘంటు నిర్మాణం పూర్తయినా విజయానికి దొరికే చప్పట్లు, మెప్పులు లభించవు. ఎంత జాగ్రత్తగా చూసినా ఏమీ బహుమానం అనేది వుండదు. నిఘంటుకారుడు నిజంగా సాహిత్యకారునికి మార్గదర్శి. అయినా కవులెవరూ చిరునవ్వు కూడా అతనిపై చిందించరు.కవులందరికీ పొగడ్తలు, దండలై వచ్చి మెళ్లో వాలితే, నిఘంటుకారుడు మాత్రం చివాట్లను, దెప్పుళ్ళను పాపం తప్పించుకుంటూ తాపత్రయపడతాడు. చాలామందికి యివి కూడా లభ్యం కావు. నిఘంటువులో పనిచేసేవారు నిజంగా నిరాశోపహతులు."

– పురాణం సుబ్రహ్మణ్యశర్మ

* * *



(Outputs) 14/10/08

# కె.వి.ఆర్.



కె.వి.ఆర్

"తెలుగు మార్క్సిస్టు మేధావుల్లో కె.వి. రమణారెడ్డి గణనీయుడు. 1998 జనవరి 15 ఉదయం మరణించి, మార్క్సిస్టు సాహిత్య విమర్శకు తీరని లోటు కలిగించాడు. నిరంతర పఠనాసక్తి, అనితరసాధ్య రచనా వ్యాసాంగం, సామాన్య జనశ్రేయోభిలాష, శ్రీశ్రీ మీద ఎనలేని ఎల్లలు లేని వల్లమాలిన అభిమానం – కె.వి.ఆర్.లో వున్న గుణాలు. జీవితాంతం మార్క్సిజానికి నిబద్ధుడైన కవీ, విమర్శకుడు. అలనాటి అభ్యుదయ సాహిత్యం నుండి విరసం వరకు క్రియాశీలిగా, కార్యోత్సాహిగా పెనవేసుకుని పని చేశాడు. దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ, రాహుల్ సాంకృత్యాయన్, డి.డి. కోశాంబి వంటి భారతీయ మార్క్సిస్టు ఉద్దండ పండితులు తెలుగుదేశంలో జన్మించలేదు. అభ్యుదయ రచయితలు రష్యాకు, విరసం కవులు చైనాకు మనసును, బుద్ధిని అర్పించినవారే గాని జాతిజనుల గుండెల్లో నినదించే రచనలు చేయలేకపోయారు. మార్క్సిస్టులు బహిర్ముఖులు. అందుకే కవిత్వం పట్టుబడలేదు. మార్క్సిజమే సర్వస్వం అనుకునే వారిని గురించి రాస్తున్నానని అర్థం చేసుకోవాలి. ఆధునిక కవులు కందుకూరి నుంచి అందరిమీదా కె.వి.ఆర్. చేయి చేసుకున్నారు. స్వేచ్ఛ అన్నా, గుండెల్ని పిండే ఉత్తమ కవిత్వమన్నా మార్క్సిస్టులకు మంట పెట్టినట్టుంటుంది. కె.వి.ఆర్. మంచి కవుల కవిత్వాన్ని విమర్శించిన వ్యాసాలున్నాయి. తిలక్‌లోని స్వాదుతత్వాన్ని గుర్తించినా, మార్క్సిస్టుగా జీవకారుణ్యం వుంది గనుక విమర్శించాడు. అడివి, అంగార వల్లరి, భువనఘోష, జైలు కోకిల, సూరీడు మావోడు కవితా సంకలనాలు వచ్చాయి. కవిత్వంలో రమణారెడ్డి పండిత భాషను ఎన్నుకున్నాడు. అంగారవల్లరిలో లఘుటిప్పణి యివ్వాల్సి వచ్చింది. తనది ABSTRUSE POETRY అన్నాడు."

– శివలింగం

* * *

# మరణం

"తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి 1921 ఆగస్టు నెలలో ఒక సాయంత్రం ప్రొద్దుపోయి తిరువళిక్కేణి దేవాలయానికి వెళ్ళారు. అక్కడ ఏనుగుకి ఒక కొబ్బరికాయ అందించాడు. దురదృష్టవశాత్తూ ఆ ఏనుగు ఋతుమతి అయి ఉండడం వల్ల తొండంతో ఆయన్ని కొట్టింది. స్పృహ కోల్పోయిన భారతిని ఆయన స్నేహితుడు కువలై కణ్ణన్ రక్షించాడు. కాని భారతికి తగిలిన దెబ్బ ఆయన దుర్బల దేహానికి తీరని హాని కలిగించింది. పరిస్థితి విషమించి, వైద్య సహాయం లభించినప్పటికీ ఆయన 1921 సెప్టెంబరు 12 న కన్నుమూశారు.

* * *



(Outputs) 14/10/08

# ఏకాంత సేవ

"రవీంద్రుని గీతాంజలికి తెలుగులో అనువాదాలైతే చాలా వచ్చాయి. వచనంగా, వచన కవితలుగా వచ్చినవే ఎక్కువ. గేయాలుగా వచ్చిన వాటిలోనైనా భావాలకు లభించినంత ప్రాధాన్యం రాగానికి, లయకు చేకూరలేదు. ఇట్టి పరిస్థితిలో గీతాంజలి లాంటి ఒక మధుర భక్తి కావ్యం తెలుగులో లేకపోయిందే నన్న వెలితిని నివారించడం కోసం ప్రభవించిన భక్తి భావనోద్వేగాల మధుర కవితా వాహిని "ఏకాంతసేవ". (రచించినవారు వెంకట పార్వతీశ్వర కవులు. రచనాకాలం 1922) తెల్లవారగట్ల పెళ్ళివారిని లేపే మనోహరమైన సన్నాయి పాటలా పోలుస్తారు దీన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు."

**– మధురాంతకం రాజారాం**

❋ ❋ ❋

# వ్యాఖ్య

"1954 లో ఎం.ఎన్. రాయ్ చనిపోయినప్పుడు నార్ల వెంకటేశ్వరరావు సంపాదకత్వాన మద్రాసు నుండి వెలువడే ఆంధ్రప్రభ సంపాదకీయ ప్రస్తావన చేయలేదు. దేశంలోని ప్రముఖ పత్రికలన్నీ రాశాయి. గుంటూరులో ఎ. కోదండరామయ్య హాలులో సంతాప సభ జరిగింది. ఎజికె (ఆవుల గోపాలకృష్ణమూర్తి) మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యల్ని ఆంధ్రప్రభ విలేకరి సోమయాజులు యధాతథంగా పంపారు. ఎవరో దారినపోయే టొంపాయ్ చనిపోతే, ఒక వటవృక్షం కూలింది. ఒక తార రాలింది అని సంపాదకీయాలు రాసే ఆంధ్రప్రభకు ఎం.ఎన్. రాయ్ ఎవరో తెలియదు అని ఎజికె చేసిన వ్యాఖ్యానం నార్ల వెంకటేశ్వరరావుకు తగిలింది. వెంటనే ఎం.ఎన్. రాయ్ రచనలు తెప్పించుకుని కూలంకషంగా చదివి మరుసటేడు గొప్ప సంపాదకీయం రాశారు. అప్పటి నుంచి ఎజికె, నార్ల మిత్రులయ్యారు."

**– ఎన్. ఇన్నయ్య**

❋ ❋ ❋

# సాహిత్య పిపాసి

"చాలాకాలం సి.పి.బ్రౌన్ అప్పులతో బ్రతికాడు. ఒక ఆంగ్ల వ్యాపారి దగ్గర అప్పులు తీసుకుని ప్రతినెలా కంతులు చెల్లించేవాడు. తెలుగుభాష సముద్ధరణ కోసం అరవై వేలుదాకా అప్పులు చేసి చివరికి అన్ని అప్పులు తీర్చినట్లు తన స్వీయ చరిత్రలో వెల్లడించాడు. బ్రౌన్ ఎన్నో త్యాగరాజు కృతులు, సారంగపాణి పదాలను సేకరించాడు."

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# ఛలోక్తి



దుగ్గిరాల

"అలవోకగా ఛలోక్తులు విసరడంలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారికి ఎవరూ సాటిరారు. రాష్ట్రంలో సాంఘిక సేవకు అంకితమైపోయిన కొందరు ప్రముఖులకు గుర్తింపుగా బిరుదులు ఇవ్వాలని నిర్ణయించి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఆంధ్రరత్న కూడా సభ్యులుగా ఉన్నారు.

ప్రముఖ సాంఘిక సేవకురాలు దువ్వూరి సుబ్బమ్మగారికి 'దేశబాంధవి' అని ఇవ్వాలని నిర్ణయించారు. అంతా బాగానే ఉందన్నారు. మరో దేశభక్తునికి 'దేశ బాంధవ' అని ప్రదానం చెయ్యాలని నిర్ణయించారు. వెంటనే దుగ్గిరాల వారు నిలబడి "మీరు దేశబాంధవి, దేశ బాంధవ అని ఇస్తే వారిద్దరికీ ఏదో సంబంధం ఉందని చాలామంది అపోహపడే ప్రమాదం ఉంది. కనుక మార్చండి" అని సూచించారు. కమిటీ, వారి సూచనను పాటించింది.

ఒకసారి జ్వరపడి మంచంలో ఉన్న దుగ్గిరాల వారిని పరామర్శించటానికి వెళ్ళారు దువ్వూరి సుబ్బమ్మగారు. ఆయనను పలకరించి "జ్వరం ఎక్కువగా ఉందా ?" అంటూ చెయ్యి పట్టుకు చూడసాగింది.

"అసలే జ్వరంతో బాధపడుతుంటే పైగా పాణిగ్రహణం కూడానా" అన్నారట ఆంధ్రరత్న ఛలోక్తిగా."

❋ ❋ ❋

# మహాశ్వేతాదేవి



మహాశ్వేతాదేవి

"యువతరం కత్తులైనా పట్టాలి, కత్తుల్లాంటి కలాలైనా పట్టాలి" అన్నాడు రాచకొండ విశ్వనాథశాస్త్రి. కత్తిలాంటి కలాన్ని హలంగ చేతబూని సాహితీ వ్యవసాయం సాగిస్తున్నారు ప్రముఖ బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి. ఆదివాసి, హరిజన, గిరిజన అట్టడుగు వర్గాల కోసం, వారి అభ్యున్నతి కోసం కత్తిలాంటి కలాన్ని ఆయుధంగా స్వీకరించారు మహాశ్వేతాదేవి. బెంగాల్, బీహారు, ఒరిస్సా రాష్ట్రాలలోని ముండా, ఖేడియా, శబర్, లోధ, సంథాల్ మొదలైన గిరిజనులకు మహాశ్వేతాదేవి "మారాందాయి" అంటే పెద్దక్క – "మాయీ" అంటే అమ్మ.



(Outputs) 14/10/08

మహాశ్వేతాదేవి 42 నవలలు రచించారు. ఝాన్సీ పరిసర ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి, చరిత్రను, అక్కడ ప్రచారంలో ఉన్న కథలను సేకరించి పరిశీలించి "ఝాన్సీరాణి" జీవిత చరిత్రను రాసారు.

1895–1900 లలో రాంచీ ప్రాంతంలోని అడవులలో నివసించే 'ముండా' గిరిజనుల తిరుగుబాట్లకు నాయకత్వం వహించిన బిర్సముండా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని "అరణ్యేర్ అధికార్" నవలను వ్రాశారు. ఈ నవల ముండా, ఒరంన్, ఖేడియాశబర్, లోధ్‌శబర్, సంథాల్ వంటి గిరిజన భాషలలోకి గిరిజనులు అనువాదం చేసుకున్నారు. "ఎవరిదీ అడివి" అన్న పేరుతో తెలుగులో అచ్చయింది. 1979 లో "అరణ్యేర్ అధికార్" నవలకు సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 'ఒక తల్లి కథ', 'రాకాసికోన', 'దెయ్యాలున్నాయి జాగ్రత్త' రచనలు – మకరసవర, దీబారీ, ద్రౌపది, విత్తనాలు, దొంగతనం మొదలైన కథలు, 'కట్టుబానిస' నాటిక తెలుగులోకి అనువదించబడ్డాయి.

మన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును గురించి ఈవిడ బెంగాలీలో 'సూర్యుడి గుండెల్లో గాయం' అన్న కథ వ్రాశారు. నవల వ్రాసే ప్రయత్నంలో వున్నారు.

గిరిజనుల జీవితాల మీద మహాశ్వేతాదేవికున్న అవగాహన అపారమైనది. ఆమెకున్న అంతర్ దృష్టి చాలా విలక్షణమైనది. అందుకే ఆమె రచనలోని వర్ణనలు, శిల్పం, ఆమె రచనలను మహాకావ్యాల ప్రక్కన నిలబెట్టేట్లు చేస్తాయి. ఇతిహాసాల స్థాయికి చేరుస్తాయి.

మహాశ్వేతాదేవి వైవాహిక జీవితం సాఫీగా జరగలేదు. ఈమెకు రెండుసార్లు వివాహ జరిగింది. 1947 ఫిబ్రవరి 10 న విజన్‌భాట్టాచార్యతో వివాహం జరిగింది. ఈయన కథా రచయిత, నటుడు, నాటక రచయిత. వీరి కుమారుడు నవారుణ్ భట్టాచార్య. నవారుణ్ కూడా ప్రసిద్ధ కవి, నటుడు, నాటక దర్శకుడిగా పేరు ప్రఖ్యాతులు పొందారు. విజన్‌భట్టాచార్యతో 1962 లో విడాకులు తీసుకున్న మహాశ్వేతాదేవి, సుప్రసిద్ధ బెంగాలీ రచయిత అసిత్‌గుప్తాను మళ్ళీ పెళ్ళి చేసుకుంది. 1976 లో వీరిద్దరూ విడిపోయారు.

కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి మహాశ్వేతాదేవి బి.ఎ., ఆనర్సు, ఎం.ఎ., (ఇంగ్లీషు) డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు పొందారు. భుక్తి కోసం అనేక ఉద్యోగాలు చేయవలసి వచ్చింది. రంగులు, సబ్బులు అమ్మారు. పిల్లలకు ట్యూషన్లు చెప్పారు. కొంతకాలం టీచరుగా పని చేశారు.

గిరిజనులకు వీరందించిన సేవలకు గుర్తింపుగా 1986 లో పద్మశ్రీ బిరుదు నందుకున్నారు. వీరి సాహితి సృజనకు గుర్తింపుగా 1996 లో 'జ్ఞాన్‌పీఠ్' బహుమతి లభించింది. జర్నలిజం, సాహిత్యం, సృజనాత్మక కళలు, సమాజసేవ, అంతర్జాతీయ అవగాహన పెంచడం వంటి రంగాలలో విశిష్ట సేవలను అందించే వారికిచ్చే 'మెగసేసె' అవార్డు 1997 లో మహాశ్వేతాదేవికి గిరిజనులకు అందించిన అత్యున్నత సేవలకు గుర్తింపుగా లభించింది."

**– నెల్లూరి సత్యనారాయణ**

* * *



(Outputs) 14/10/08

# స్వీయచరిత్ర

"తెలుగులో స్వీయ చరిత్రలు పద్యాలలోనూ, వచనంలోనూ కూడా వెలువడ్డాయి. వచనంలో వెలువడిన మొట్టమొదటి స్వీయచరిత్ర కందుకూరి వీరేశలింగం గారిది. ఈ స్వీయచరిత్ర కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారి సంపాదకత్వంలో 1911 లో మొదటి భాగం అచ్చయింది. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు కందుకూరి వారి స్వీయచరిత్రను విమర్శిస్తూ 'స్వీయచరిత్ర' అనే ప్రయోగం తప్పనీ 'స్వకీయ చరిత్ర' అని ప్రయోగించాలని వ్రాశారు. కానీ, వ్యావహారంలో స్వీయచరిత్ర యే రూఢి అయింది.

తెలుగులో మొదటి స్వీయచరిత్ర విషయంలో కొంత వివాదముంది. వెన్నెలకంటి సుబ్బారావు గారి స్వీయచరిత్ర 1872 లో అచ్చయింది. అయితే అది ఆంగ్లంలో వుంది. ఆదిభట్ల నారాయణదాసు గారిది మొదటిదనే వాదం కూడా ఉంది. కాని కందుకూరి వారిదే ముందు అచ్చయింది. కాగా తెలుగువాడు తెలుగులో రాసుకుని ప్రచురించిన మొదటి స్వీయ చరిత్ర కందుకూరి వీరేశలింగం గారిదేనని చెప్పాలి. వారి స్వీయచరిత్ర యించుమించు అర్ధశతాబ్ది ఆంధ్రదేశపు సాంఘిక చరిత్రగా చెప్పవచ్చు. అఖిలభారత దేశస్థాయిలో రాజారామమోహన్‌రాయ్ ఎటువంటి సేవ చేశారో, దక్షిణ భారతదేశానికి వీరేశలింగం పంతులుగారు అటువంటి సేవ చేశారు. వీరి స్వీయచరిత్ర ద్వారా నాటి తెలుగు సమాజాన్ని, సాంఘిక సాంస్కృతిక ఉద్యమాన్ని గురించి తెలుసుకోవచ్చు."

**– జాస్తి వేంకట సుబ్బారావు**

* * *

# ఫకీర్ మోహన సేనాపతి

ఒరియా సాహిత్యం ఎంతో ప్రాచీనమైందీ, సుసంపన్నమైనది. సరళాదాసు భారతానువాదం, జగన్నాథదాసు భాగవతం ఒరియా సాహిత్యపు ఆది గ్రంథాలుగా చెప్పుకోవచ్చు. మధ్యయుగంలో పద్య ప్రబంధ సాహిత్యాలున్నాయి. ధనంజయ భంజ, లోకనాథ విద్యాధరుడు, ఉపేంద్ర భంజ వంటి కవివరేణ్యులున్నారు. గోపీనాథ మొహంతీ 'దానాపానీ' నవల ద్వారా జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందాడు. శీతాకాంత మహాపాత్ర వంటి ఆధునిక కవి కూడా జ్ఞానపీఠ్ పురస్కారంతో సహా ఎన్నో పురస్కారాలు పొందినవాడే. ఒరియాలో ఉన్నతస్థాయి కథలూ, నవలలు కూడా ఎక్కువ. మనోజ్‌దాస్ వంటి రచయిత భారతదేశంలోనే కాక, విదేశాల్లో కూడా ప్రశంసలు పొందినవాడు.

ఇంత విస్తృతి గల ఒరియా సాహిత్యం బెంగాలీ భాషావాదుల ఆధిపత్యం క్రింద ఎన్నో ఏళ్ళు నలిగిపోయింది. శిష్ట వ్యావహారం బెంగాలీలో జరగడం, బెంగాలీలు ఒరిస్సాలో చాలాకాలంగా కీలకస్థానాల్లో ఉండటం మూలాన, ఒరియా భాష తన పూర్వపు వైభవాన్ని సంతరించుకునేందుకు సుదీర్ఘ సంఘర్షణ చెయ్యవలసి వచ్చింది.

అలాంటి పునరుజ్జీవనానికి జీవం పోసిన ఒరియా సాహిత్యపు నవయుగ వైతాళికునిగా ఫకీరు మోహన సేనాపతిని చెప్పుకోవచ్చు. 1843 లో పుట్టి 1918 లో పరమపదించిన ఈయన సంచలనాత్మక జీవితంతో ఒరియా సాహిత్యం కూడా పెనవేసుకుపోయింది. ఎంతో ఆసక్తికరంగా సాగిన ఆయన జీవనక్రమం కందుకూరి, చిలకమర్తిల జీవిత చరిత్రలను స్ఫురణకు తెస్తుంది.

ఫకీరుమోహన్ 1843 సంవత్సరం లేక 1250 ఒరియా సంవత్సరం శుక్రవారం మకర సంక్రాంతి రోజున, బాలేశ్వరనగర సమీపాన గల మల్లికాసపూర్ గ్రామంలో జన్మించాడు. చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి రోగగ్రస్తుడైన ఈ పసివాడిని మాతామహి కుచిలాదేవి పెంచింది. ఆవిడ తనకు 65 వ సంవత్సరం వచ్చే వరకూ ఈయన వద్దనే ఉండి బాలేశ్వర్‌లోనే కన్నుమూసింది. 'ఠాకురమా' (అమ్మవారు)గా భావించిన ఆమెను తన జీవనదాయినిగా ఆయన స్వీయచరిత్రలో పేర్కొన్నాడు.

ఫకీర్ మోహన్ బాలేశ్వర్‌లో బారాబటి స్కూల్లో జేరాడు. నిఘంటువులనూ వ్యాకరణాల్ని అక్కడే నేర్చుకున్నాడు. పెద్దనాన్న తాలూకు ఓడ తెరచాపలు కుట్టే సంస్థలో పని చేశాడు. మూడేళ్ళ తరువాత ప్రభుత్వ ఉప్పు కార్యాలయంలో (Govt salt-office) గుమాస్తాగా చేరాడు. 1863 లో ఎంట్రెన్స్ పరీక్షలో ప్రథమశ్రేణిలో పాసయ్యాడు. విద్యాసాగర్ యొక్క వ్యాకరణ కౌముది నాలుగు భాగాలు, రుక్‌పాఠాలు మూడు భాగాలుగా వెలువడినందున తన సంస్కృత భాషా అధ్యయనం సుగమమైందని చెప్పుకున్నాడు.

పావలా స్కూలు ఫీజు చెల్లించలేక విద్యను సాగించలేని ఫకీర్ మోహన్, అదే బాలేశ్వర్ మిషన్ పాఠశాలలో 2 రూపాయల జీతం మీద 1864 లో ప్రధాన శిక్షకుడిగా జేరాడు. పదకొండు భాషల్లో పండితుడైన 'జాన్ బీమ్స్' అనే ఆంగ్ల పండితుడికి ఆయన తలపెట్టిన 'COMPARATIVE GRAMMAR OF INDIAN LANGUAGES' కు సహాయకుడిగా పనిచేశాడు. ఆయన్ను తన గురుతుల్యుడిగా భావించాడు. 1866 లో సంభవించిన భీకర దుర్భిక్షానికి ప్రత్యక్ష సాక్షిగా కన్నీరు కార్చాడు. ఒరిస్సాలో రెండవదీ, బాలేశ్వర్‌లో మొదటిదీ అయిన ముద్రణాలయాన్ని 1866 లోనే స్థాపించాడు. అందుకుగాను ధనసేకరణకై జాయింట్ స్టాక్ పద్ధతిలో మొట్టమొదటి కంపెనీని స్థాపించి, షేర్లు అమ్మిన ఘనత కూడా ఈయనదే. అంతకు ముందు ముద్రణాలయం (భాషాఖానా) అంటే తెలియని బాలేశ్వర్ ప్రజలు కలకత్తా నుంచి వచ్చిన ప్రెస్ సామాగ్రిని చూసేందుకు తండోపతండాలుగా రాగా, రోడ్డుమీద రాకపోకలు స్థంభించాయట. రామనాధరాయ్, ఆయన సమకాలీనుడు చెప్పినట్లు నవీన ఒరిస్సాలో ఆయన్ను యుగపురుషుడుగా నిలిపేందుకు ఇదొక్కటి చాలును. 'బోధాదాయిని' అనే సాహిత్య పత్రికనూ, 'బాలసోర్ సంవాద వాహిక' అనే వార్తా సంచికనూ వెలువరించాడు. అవి మూతబడే వరకూ వాటికి ఏకైక రచయిత, పత్రికాధిపతి, ముద్రాపకుడు, ప్రచురణకర్త, సంచాలకుడు, పెట్టుబడిదారూ అన్నీ తానే అయి వ్యవహరించాడు. ఏకముఖాన బహు కార్యక్రమాలు చేపట్టి నిర్వహించిన కార్యదక్షుడు.



(Outputs) 14/10/08

ఫకీర్ మోహన్ సేనాపతి మన గురజాడ వారి 'దిద్దుబాటు' లానే మొట్ట మొదటి ఒరియా కథ 'లఛ్ఛమనియా' రాశాడు. ఆ తరువాత దాదాపు 23 కథలు రాశాడు 'ధూర్జటి' అనే కలం పేరుతో. పుష్పమాల, ఉపాహార కవితా ఖండికలు, 'అపూర్వమిలన్' నవల ఒరియా సాహిత్యంలో శాశ్వత స్థానం సంపాదించుకుంది. 'ఆత్మ జీవన చారతా' లో నాటి సాంఘిక, రాజకీయ వాతావరణానికి అద్దం పట్టిన ఈ రచనలో ఎన్నో ఆసక్తికరమైన విషయాలు ఉదహరించబడ్డాయి. కష్టసుఖాలను సమానంగా స్వీకరించిన ఇలాంటి ద్వంద్వాతీతుల చరిత్రలే మనకు స్ఫూర్తినీ, విశ్వాసాన్నీ యిస్తాయి."

**– కె.యం.వి.జి. కృష్ణమూర్తి**

* * *

# కీలుబొమ్మలు



**జి.వి. కృష్ణారావు**

"కవి, నాటక కర్తా, నవలాకారుడూ, విమర్శకుడూ అయిన జి.వి. కృష్ణారావుగారు నాటి రాజకీయ, సామాజిక సమస్యలపై నిశితమైన సాంఘిక స్పృహతో రచించారు. ఆయన తన చుట్టూ ఉన్న రాజకీయ, సామాజిక సంబంధాల్లో వచ్చిన క్లిష్టమైన మార్పుల పైన మాత్రమే దృష్టిని కేంద్రీకరించకుండా, మార్పు చెందుతూన్న దశలో జీవించిన స్త్రీ, పురుషుల మానసిక సంఘర్షణలనూ, నైతిక సందిగ్ధాలను కూడా గణనలోకి తీసుకుంటారు. ప్రగతి శీలమైన సంస్కరణాత్మక సందేశం ఒకటి ఆయన నవలల్లో కనిపిస్తుంది. 'సంపూర్ణ మానవుడు' ఆవిర్భవించటానికి వ్యక్తిగతమైన స్వేచ్ఛ ఆవశ్యకమని కూడా ఉద్బోధిస్తారు.

'కీలుబొమ్మలు' లో మనస్తత్వపరంగా, అభ్యుదయపరంగా స్వాతంత్ర్యానంతర రాజకీయాలను కృష్ణారావు పరిశీలిస్తారు. కొత్తగా స్వాతంత్ర్యాన్ని పొందిన దేశంలో నైతిక విలువలెలా దిగజారిపోయాయో ముఖ్యంగా అనుశీలన చేస్తారు. 'కీలుబొమ్మలు' అనే పేరులోనే మానవజీవితం లోని యాంత్రిక స్వభావం ధ్వనిస్తుంది. ఈ యంత్రాన్ని నడిపే మరలు అవినీతిమయమైన సమాజం ఆధీనంలో వుంటాయి. వైయుక్తికమైన ఆలోచనలూ, కార్యనిర్వాహక శక్తీ కనబడకుండా పోయేంతగా వ్యక్తుల జీవితాలు సామాజికంగా, సాంస్కృతికంగా మానసికంగా శాసించబడతాయి. స్త్రీ, పురుషులు కేవలం కీలుబొమ్మల స్థాయిలో మిగిలిపోతారని ఈ ప్రబోధాత్మక కథ తన సందేశాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తుంది. డా॥ వాసుదేవశాస్త్రి (ఈ కథలోని ఒక పాత్ర) అంటాడు – "సమాజంలోని స్త్రీ, పురుషులు స్వతంత్రముగా ఆలోచించడమూ, ఆత్మప్రబోధం ప్రకారం నడుచుకోవడమూ చేయలేకపోతే, యీ సంఘానికి ప్రగతి శూన్యం."



(Outputs) 14/10/08

ఈ నవలకు రాసిన ప్రస్తావనలో కృష్ణారావుగారు ఈ రచన ఏ రాజకీయ పార్టీనిగాని ఉద్దేశించి చేసింది కాదనీ, దీనికి స్వచ్ఛమైన కళానుభూతే ప్రధానమనీ రాశారు. పార్టీ ఆవేశాలను మరిచి, నిష్పక్షపాత వైఖరితో ఈ నవలను చదవమని పాఠకులను కోరుతారు. అయినప్పటికీ యీ యితివృత్తం, కథనంలో ధ్వనించే రచయిత కంఠము కూడా కృష్ణారావుగారు సోషలిస్టు సిద్ధాంతం చేత ప్రభావితులయ్యారని స్పష్టం చేస్తాయి."

**– సి. విజయశ్రీ**

* * *

# సాహిత్యసేవ

"ఆంధ్ర సంస్థానాధీశ్వరులు అందరును గారుకాని పెక్కురు సాహితీపోషకులు. జటప్రోలు సురభిమాధవరాయలు, బిక్కనవోలు కామినేని యల్లారెడ్డి, విజయనగరము పూసపాటి తమ్మ భూపాలుడు, గద్వాల ముష్టిపల్లి సోమభూపాలుడు, వనపర్తి అష్టభాషాకవి గోపాలరాయలు, పెద్దాపురము వత్సవాయ బలభద్ర జగపతి, కాళహస్తి దామెర్ల వెంగళ భూపాలుడు, బొబ్బిలి రావు రాయడప్ప రంగరాయ నృపాలుడు, సాలూరు బలారిసింహ నరసింహ రాజసింహుడు, సురపురము రాజా బహిరీపామ నృపాలుడు, నూజివీటి వెంకటాద్రి అప్పారాయ ప్రభువు, సంగమవలస రాజా మృత్యుంజయ నిశ్శంక బహద్దరు, మొగల్తుఱ్ఱు రాజా కలిదిండి రామరాజ బహద్దరు, పాచిపెంట రాజా కృష్ణారావు, జగ్గమపేట చిన వేంకట రాయణింగారు, పానగల్లు రాజా పార్థసారథి నాయనింగారు, లక్కవరము మంత్రిప్రగడ భుజంగరావు – మొదలగు సంస్థానాధీశ్వరులు కృతికర్తలుగా కూడా చరిత్రకెక్కిన చరితార్థులు. వీరి సరస సారస్వతాభిలాష యును, సాహితీ సముద్ధరణ చణత్వమును ప్రశంసాపాత్రములు.

అమరావతి, ఉర్లాము, కిర్లమపూడి, కోలంక, చల్లపల్లి, పిఠాపురము, మాడుగల, వనపర్తి, విజయనగరము, సాలూరుల వంటి సంస్థానములు సంస్కృత విద్యాలయములను స్థాపించియు, సంస్కృత భాషా పండితులను ప్రోత్సహించియు, వేద ధర్మవాహకమగు సంస్కృతమును, ఆర్ష విజ్ఞానమును విస్తరింపజేసియు చిరయశమును సముపార్జించినారు. భాషాసాహితీ సేవా పరాయణములగు సాహితీ సంస్థలకు, గ్రంథ ప్రచురణ మండలులకు, గ్రంథాలయములకు, సాహిత్య పత్రికలకు, తదితర విద్యాసంస్థలకు భూరిగా విరాళము లొసంగి భాషోద్ధరణ మొనర్చిరి. ఎర్నగూడము, కపిలేశ్వరపురము, జయంతిపురము, పోలవరము, ముక్త్యాల, లక్కవరము మున్నగు జమీందారులు పత్రికలను స్థాపించి సాహితీ ప్రచారమునకు తోడ్పడిరి.

ఉంద్రాజవరము, ఎర్నగూడెము, కపిలేశ్వరపురము, గద్వాల, దోమకొండ, పాపన్నపేట, బొబ్బిలి, ముక్త్యాల, వనపర్తి, విజయనగరము, ఉయ్యూరు, వెంకటగిరి వంటి జమీందారులు కొందరు అచ్చు కూటముల స్థాపించియూ, ప్రాచీనార్వాచీన గ్రంథముల ననేకము ప్రచురించియు భాషోపకార మొనర్చిరి. చల్లపల్లి, పాల్వంచ, పిఠాపురము, ముక్త్యాల, వల్లూరుల వంటి జమీందారులు ఇతరులు స్థాపించిన ముద్రణా యంత్రశాలలకు ఆర్థిక సహాయము గావించిరి.



(Outputs) 14/10/08

ఉర్లాము, పిఠాపురము, వనపర్తి వంటి సంస్థానములలో వేదశాస్త్ర పరీక్షలు నిర్వహించి ఆర్షధర్మ విజ్ఞాన జ్యోతి ఆరిపోకుండా నిలిపిరి. కార్వేటినగరము, గద్వాల, నూజివీడు, పిఠాపురము, బనగానపల్లి, బొబ్బిలి, ముక్త్యాల, వల్లూరు, విజయనగరము – మున్నగు సంస్థానములు సంగీత నృత్యాది లలిత కళలను కూడా ప్రోత్సహించిరి. అనకాపల్లి, ఉంద్రాజవరము, కపిలేశ్వరపురము, చల్లపల్లి, పానగల్లు, పిఠాపురము, బొబ్బిలి, వనపర్తి, విజయనగరము, ఉయ్యూరు – మున్నగు జమీందారులు విశ్వవిద్యాలయాల అధ్యక్ష కల్పుగానో, ఉపాధ్యక్షులుగానో, సెనేట్, సిండికేట్ సభ్యులుగానో విద్యారంగమున విశిష్టమైన సేవను సలిపినారు. అనకాపల్లి, ఉంద్రాజవరము, కపిలేశ్వరపురము, కురపాము, చల్లపల్లి, దోమకొండ, పానగల్లు, పిఠాపురము, పోలవరము, బొబ్బిలి, మునగాల, వనపర్తి, విజయనగరము, ఉయ్యూరు – మున్నగు జమీందారులు రాజకీయ రంగము నందును, సాంఘిక సేవా క్షేత్రము నందును నిర్వహించిన పాత్రము విస్మరింపరానిది.

ఈ యుగమునందలి చివరిభాగము నందు ఆంధ్ర సంస్థానములను పాలించినవారిలో చాలామంది స్త్రీలుండుట గమనింపదగిన యంశము. వీరందరును ఇంచుమించుగా నొక కాలమునకు చెందిన వారగుటయే గాక కవి పండిత పోషణమునందు, సాహితీ సముద్ధరణము నందు ప్రదర్శించుట యాదృచ్ఛిక సంఘటనయినను వింతలలో వింతగా గోచరింపకపోదు. అనకాపల్లి జమీందారిణి మహారాణి గొడేచిట్టి జానకయ్యమ్మా గజపతిరావు, ఆత్మకూరు సంస్థాన ప్రభ్విణి సవైరాణి భాగ్యలక్ష్మమ్మదేవి, ఉర్లాము సంస్థానాధీశ్వరి శ్రీ కందుకూరు మహాలక్ష్మమ్మ, కోలంక–వీరవరము జమీందారిణి రావు రామాయమ్మగారు, గద్వాల మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ, గూటాల జమీందారిణి మన్యం మహాలక్ష్మమ్మ, గొల్లప్రోలు జమీందారిణి రావు రామాయమ్మా రావు, తుని మహారాణి వత్సవాయ వెంకట లక్ష్మాయమ్మ సర్దేశాయి. మునగాల జమీందారిణి రాణీ లచ్చమ్మారావు, వనపర్తి సంస్థానాధీశ్వరి రాణీ సరళాదేవి మున్నగువారు తమ పూర్వులు పోయిన త్రోవలో విద్వత్పోషణము గావించిన సాధ్వీమణులు."

**– తూమాటి దొణప్ప**

* * *

# శ్రీశ్రీ వీలునామా

"సరే, మరణించాను. నాకు 1990 లో చచ్చిపోవాలని ఉంది. (కాని శ్రీశ్రీ 15–6–1983 సాయంత్రం మద్రాసులో కన్నుమూశాడు) బహుశా విమాన ప్రమాదంలో లేదా జలగండం వల్ల ? అదీ ఇదీ కాకపోతే నేలమీదనే కాలధర్మం.

నా శవం చుట్టూ చాలామంది చేరి ఏడుస్తున్నారు. "ఎందుకేడుస్తారు ? ఇప్పుడేమయి పోయిందని ?" నేనెంత ధారాపాతంగా అరుస్తున్నా ఎవరికీ నా మాటలు వినపడవు. "అనంతర కార్యక్రమం గురించి ఆలోచించ" మన్నారెవరో! దహన సంస్కారం ఎజెండాలోకి వచ్చింది. అదే వీల్లేదన్నాను నేను. మతానికి సంబంధించిన ఏ విధమైన కర్మకాండకీ నా (సజీవ లేదా



(Outputs) 14/10/08

నిర్జీవ) కళేబరాన్ని అంకితం చెయ్యం అనే పనికి నేను సుతరామూ అంగీకరించను. After all it is my corpse isn't it ? or is it ?

చుట్టూ మూగిన వాళ్లలో కొంతమందికి నేనొకసారి రాసిన మరణశాసనం జ్ఞాపకం వచ్చింది. అందులో నేను "నేను చచ్చిపోయాక జరగవలసిన మొట్టమొదటి పని నా శవాన్ని విశాఖపట్నంలోని కింగ్‌జార్జి ఆసుపత్రికి అప్పగించడం" అని రాశాను. ఆ తర్వాత జరగవలసిన పని అక్కడున్న మెడికల్ కాలేజీ విద్యార్థులలోని నిరీశ్వరవాదుల ఆధ్వర్యం క్రింద జరగాలని నా ఆకాంక్ష.

ఏడ్చి, ఏడ్చి ఆగిపోయిన వాళ్ళు ఆగిపోయినా, ఏడుస్తున్న వాళ్ళింకా ఏడుస్తూనే ఉన్నారు. ఏడవమనండి. నాకు అభ్యంతరం లేదు.

పత్రికలవాళ్ళకి కావలసినంత కాపీ ఏమిటేమిటో రాసేస్తున్నారు. రాసుకోమనండి. నా అభ్యంతరం లేదు.

విరసం వాళ్ళు నన్నూరేగిస్తామన్నారు. నా అభ్యంతరం లేదు. నా శవం మీద ఎర్రజెండా కప్పడం మాత్రం మర్చిపోకండని మరీమరీ అభ్యర్థించాను.

నా కొడుకే వచ్చి తన చేతుల్తో నా తలకి కొరివి పెడతానన్నాడు. ఇది వాడికి పుట్టిన బుద్ధి కాదనుకుంటాను. ఎవరో చెప్పించిన ట్యూషన్ అయినా, అదే వీల్లేదంటాన్నేను.

మతంతోనూ, మతం తాలూకూ మూఢ విశ్వాసాలతోనూ ఆమరణాంతం పోరాడే నన్ను మళ్ళీ ఆ ఊబిలోనికెవరు దించదలచుకొన్నా నేనెంత మాత్రమూ అంగీకరించను.

**– శ్రీశ్రీ**

(అనంతం, స్వాతి మాసపత్రిక, జూలై, 1979 పేజీ 8–9)

❋ ❋ ❋

# అంత్యక్రియలు

శ్రీశ్రీ అంతిమయాత్ర అందులో పాల్గొన్న వారికి మరపురానిది. 1983 జులై 3 వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరుద్ర వ్యాసపీఠం.

పాల్గొన్నవారికే కాదు, పాల్గొనలేకపోయిన నాబోటి "శ్రీశ్రీ కవిత్వలాలసు"లకు కూడా ఆ అంతిమయాత్రను మరపురానిది చేశారు – ఆరుద్ర.

ఆంధ్రజ్యోతి వారపత్రిక, శ్రీశ్రీ బ్రతికుండగానే కాక చనిపోయిన తర్వాత కూడా "ఇచ్చట శ్రీశ్రీ అమ్మబడును" అనే బోర్డు తలిగించుకొని, ఆ మహాకవిని ఒక వాణిజ్య సరుకుగా



(Outputs) 14/10/08

వాడుకొంటున్న ఆంధ్రజ్యోతి వారపత్రిక 1983 జులై 8 వ తేదీ నాటి ప్రత్యేక సంచికలో 'శ్రీశ్రీ అంత్యక్రియల విశేష వ్యాఖ్య' లను విపరీత వ్యాఖ్యలుగా సెలవిచ్చి, మరొకసారి లాభసాటి వ్యాపారం సాగించుకుంది.

'శ్రీశ్రీ విరసం జేబులో కలమా ?' అంటూ ఒక కొంటె ప్రశ్న – కాదు కుంటిప్రశ్న వేసిందా పత్రిక. శ్రీశ్రీ అంత్యక్రియలలో 'విరసం' వారు 'హంగామా' చేశారట. 'శ్రీశ్రీ చావును కూడా పొలిటికలైజ్' చేసేశారట. విరసం ముఖ్యులైన కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని, చలసాని సొంతబిడ్డ పోయినట్లే 'హడావుడి' చేశారట.

మిగతా విషయాలను అటుంచండి. 'శ్రీశ్రీ విరసం జేబులో కలమా ?' అన్న ప్రశ్న ఆయన బ్రతికుండగా ఎవరైనా అడిగుంటే, 'అవునని' ఆయన సగర్వంగా సమాధానం ఇచ్చి వుండేవాడని ఆంధ్రజ్యోతికి తెలియదా ? 'నా శాశ్వత చిరునామా విరసం', 'ఈ దేశానికి అధ్యక్షుడు కావడం కంటే విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షుడు కావడమే నాకు గొప్ప', 'విరసం సభ్యుడుగా చనిపోవాలని వుంది' – అని చెప్పుకున్న శ్రీశ్రీ "విరసం జేబులో కలం" అనిపించుకోవడానికి సంతోషించి వుండేవాడే కాని, అవమానంగా భావించి వుండేవాడు కాదు గదా!

తన శవాన్ని విశాఖపట్నం హాస్పిటల్ కివ్వమని శ్రీశ్రీ వీలునామాలో రాశాడట. శ్రీశ్రీ కోర్కె అదే అయితే దాన్ని నెరవేర్చమని విరసం ముఖ్యులు పట్టుబట్టడంలో తప్పేముంది ? అందుకు ఒప్పుకొనక పోవడం శ్రీశ్రీ పిల్లల తప్పు కానీ, విరసం వారి తప్పెట్లా అవుతుంది ? 'విశ్వమానం సమాజం కోసం నరజాతిలో విప్లవ నెత్తురు పోయటానికి సమిధ (ఏమిటో దీని అర్థం ?) అయిన శ్రీశ్రీని – శ్రీశ్రీ మావాడే అంటారేమిటి ? మేం తీసుకపోతము – మోసుకపోతామంటారేమి'టని ఆంధ్రజ్యోతి ప్రశ్న. 'విరసం నా చిరునామా అని చెప్పుకున్న శ్రీశ్రీ 'విరసం వాడు' కాక, అరసం వాడెట్లా అవుతాడో ఆంధ్రజ్యోతికే తెలియాలి. శ్రీశ్రీ తమవాడు గనుక, తమ సభ్యుడు గనుక 'మావాడు' అని విరసం చెప్పుకోవడంలో 'సంకుచితత్వం' ఏముంది. హ్రస్వదృష్టి ఎక్కడుంది ? అసలు 'విరసం' సభ్యుడైన శ్రీశ్రీని 'విరసం'కు చెందనివ్వకుండా అందనివ్వకుండా చేయాలని ఆరాటపడటంలోనే ఉంది సంకుచితత్వం.

శ్రీశ్రీ శవం చితిమీదికి వెళ్లిన తరువాత విరసం గీతాలాపన మొదలెట్టిందట! ఐతే అవి శ్రీశ్రీ గీతాలు కావట. ఇదీ ఆంధ్రజ్యోతి ఆవేదన! కానీ నిజానికక్కడ విరసం మధుసూదనరావు పాడిన 'ఊగరా ఊగరా" – ఈ గీతం శ్రీశ్రీదో కాదో తెలియదా ఆంధ్రజ్యోతికి ?

తెలియకపోయినా ఆశ్చర్యం లేదు. ఎందుచేతనంటే, అదే సంచికలో 'శ్రీశ్రీ కేలండర్'లో 'తారీఖులు దస్తావేజులు'కు బదులుగా 'తేదీలు దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్రసారం' అంటూ మహాకవిని ఉటంకించిన ఘనత వీరిదే! అంతేకాదు, విషయసూచికలో 'పాడుతా శ్రీశ్రీ గురించి – మీటుతా వందన విపంచి' అన్న కె.వి. రమణారెడ్డి గేయాన్ని సొంతం చేసుకున్న ఘనత కూడ వీరిదే!



(Outputs) 14/10/08

ఇంతటితో పోనివ్వకుండా కొన్ని ప్రశ్నలు గుప్పించారు – "శ్రీశ్రీని మహాకవిని చేసింది విరసమా ? శ్రీశ్రీ మంచి చెడ్డలు చూసింది విరసమా ? శ్రీశ్రీని ఒక దారిలో పెట్టింది విరసమా ? శ్రీశ్రీని విప్లవమార్గానికి మళ్లించింది విరసమా ?" – ఈ ప్రశ్నలన్నింటికీ ఒకటే సమాధానం అవును, విరసమే. 1970 లో షష్టిపూర్తి పేర శ్రీశ్రీకి శాశ్వత సమాధి కట్టే ప్రయత్నం జరుగుతుంటే, అందులోంచి శ్రీశ్రీని వెలుపలికి తెచ్చింది విరసం, ఆనాటి నుంచి ఈనాటి దాకా శ్రీశ్రీ మంచి చెడ్డలు చూసిందీ, ఒక దారిలో పెట్టిందీ, పాపులర్ చేసిందీ, విప్లవ మార్గానికి మళ్లించిందీ విరసమే – సందేహం ఏమాత్రం లేదు. 1970 లోనే శ్రీశ్రీ కవిత మారాకు తొడిగింది విరసం వల్లనే. శ్రీశ్రీ తప్పులను సవరించిందీ విరసమే.

అందువల్లనే శ్రీశ్రీ అంత్యక్రియలలో విరసం ముఖ్యులు తమ 'సొంతబిడ్డ పోయినట్లు హడావుడి చేసినా' తప్పులేదు. ఐనా నాకు తెలియక అడుగుతాను– సొంతబిడ్డ పోయినప్పుడెవరైనా హడావుడి చేస్తారా ? హతాశులవుతారా?' ఆరారా టీ త్రాగా'రట, అది పెద్ద ఆక్షేపణ. ఎక్కడో తిరుపతి, విజయవాడ, కావలి నుంచి హుటాహుటిన బయల్దేరి, వచ్చినవారు ఆరార టీలు త్రాగటం నేరమాండీ ? పత్రికలవార్ని పిల్చి అభిప్రాయాలు చెప్పారని మరొక ఆరోపణ. పిలిచి చెప్పారా! ఆంధ్రజ్యోతి విలేకరి బ్రతిమలాడి ప్రక్కకు తీసుకుపోయి, టీ తెప్పించి యిచ్చి, అడిగితే చెప్పారా ?

అదీ పోనీండి. 1976 లో "విరసం అధ్యక్ష పదవి నుండి తొలగింపు" అన్నారు. అది తొలగింపు కాదు, శ్రీశ్రీ రాజీనామా చేశాడు. ఇటువంటి తప్పులు కొల్లలు. అరసం దూరంగా వుండిపోయిందని వాపోయారు. ఈ రోజు ఏమిటి ? అరసం శ్రీశ్రీకి దూరమై చాలాకాలమైంది. అందువల్లనే అంత్యక్రియలలో కూడా దూరంగా వుండిపోక తప్పలేదు. అసలు శ్రీశ్రీ కుమారుడెవరో కూడా తెలియకుండా, వేరేవారి ఫోటో క్రింద 'శ్రీశ్రీ కుమారుడు రమణ' అని రాశారు. ఇన్ని అవకతవకలతో, అబద్ధాలతో 'ప్రత్యేక సంచిక'ను తయారు చేయడం శ్రీశ్రీ మీద అభిమానంతో కాదు, వ్యాపారం మీద వ్యామోహంతో అని స్పష్టమవుతూనే ఉంది.

పోతే, ఆరుద్ర శ్రీశ్రీ అంత్యక్రియలను గూర్చి రాస్తూ, విరసం మీద పనిగట్టుకొని మరికొంత బురద చల్లడానికి ప్రయత్నించినట్టున్నాడు. "విరసం వారు దిగగానే శవం ఉన్న గది నినాదాలతో మారుమ్రోగింది. కె.వి. రమణారెడ్డి మహాప్రస్థానం గీతాలు మంత్రాలుగా చదివారు" ఒక గొప్ప వ్యక్తి మరణించినప్పుడు 'అమర్ రహే' అనో 'లాంగ్‌లివ్' అనో నినాదాలివ్వడంలో ఆశ్చర్యమేమీలేనట్లే, శ్రీశ్రీ చనిపోయినప్పుడు విప్లవ రచయిత సంఘం వర్ధిల్లాలి అని నినాదాలివ్వడంలో కూడా విడ్డూరమేమీ లేదు. ఇక మహాప్రస్థాన గీతాలు – ఎర్రజెండా తెప్పించి శవం మీద కప్పించిన ఆరుద్రకు మహాప్రస్థాన గీతాలు చదవడంలోని ఔచిత్యం ఎందుకర్థం కాలేదో తెలియడం లేదు. పైగా 'మంత్రాలు లాగా, అనడమేమిటి ?



(Outputs) 14/10/08

అంతిమయాత్ర వ్యాన్‌ను ఎవరో 'షార్ట్‌కట్' అని 'నేరోలేన్'లోకి మళ్లించారట. వ్యాన్‌లో విరసం సభ్యులున్నారు గనుక, ఆ పని వారే చేసి వుంటారని కాబోలు ఆరుద్ర భావం. మండుటెండలో త్వరగా శ్మశానవాటిక చేరడానికి దగ్గర దారికి వ్యాన్ మళ్ళించడం నేరమా ? అసలు విరసం సభ్యులకు మద్రాసు సందులు గొందులు కొత్త. ఇక వారు వ్యాన్ మళ్ళించడమేమిటి? 'చితి చుట్టూ విరసం సభ్యులు చేరి వేదమంత్రాలకు బదులు విరసం మంత్రాలు చదవార'ని మరొక ఎత్తిపొడుపు. పోనీ, వాళ్ళు విరసం మంత్రాలే చదివారనుకుందాం, మరి ఆరుద్ర గారైనా వేదమంత్రాలు చదివి తృప్తి పడి వుండవచ్చునే. ఐనా వేదమంత్రాలు చడవలేదన్న కొరత ఆరుద్రకే కానీ, మరెవరికీ లేదన్న విషయం మనం మరిచిపోకూడదు.

మొత్తం మీద శ్రీశ్రీ అంత్యక్రియలను కూడా ఇంతగా రచ్చకీడ్చి, లేనిపోని వివాదాలు రేగదీయడం చూస్తుంటే, కనీసం మరణించిన తర్వాతనైనా శ్రీశ్రీని విప్లవ రచయితల సంఘానికి దూరం చేయాలనే ఆరాటం అందులో లేదా – అని మనబోంట్లుకు అనుమానం కలగడంలో ఆశ్చర్యమేమీ లేకపోవడం ఆశ్చర్యం కాదు."

– గోపి

* * *

# యెంకి



యెంకి

"ఒకనాడు కాలేజీ నుండి ట్రాం బండిలో వస్తుండగా, గొంతులో సన్ననిరాగం బయలుదేరింది. దానిని నాలో నేను పాడుకోవాలని సాహిత్యం జ్ఞాపకం చేసుకోబోయాను. ఎప్పుడో విన్న పదంలాగున "గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అన్న పల్లవి వచ్చింది. అదే మననం చేసుకోగా చేసుకోగా యిల్లు చేరేసరికి నేను వ్రాసిన మొదటి పాట తేలింది.

మా "జానకీపతికిన్నీ, అప్పారావుకున్నూ ఆ పాట గద్గదితో వినిపించాను. 'సెభాష్ వ్రాయ' మన్నాడు జానకీపతి. 'నీవు నిత్యం వాడే భాష కాదిది, ఈ భాష సాయమున సత్యాన్వేషణం చేయలే'వన్నాడు మా బసవరాజు అప్పారావు.

ఏ సమయమున వెన్ను చరిచాడో అధికార్ల సూర్యనారాయణ, అప్పటి నుండియు 'యెంకిని' కవితారీతిని స్మరించుట నిముసమైన మానలేదు. అతడును అంతకంతకు తన అభిప్రాయమును బలపరచుకొన్నాడు. మా అప్పారావు రానురాను తన అభిప్రాయం మార్చుకొని ఇటీవల అతడును వల్లె అనుకున్నాడు. పాటలు అప్రయత్నంగా వచ్చేటట్లు ప్రసాదించిన యెంకికి కృతజ్ఞుడనా ? ప్రోత్సాహము చేసి వీపు దట్టిన అధికార్ల వారికా ? కవిత్వకళా రహస్యాలు తెలియజెప్పిన మా బసవరాజు అప్పరాయనికా ? ముప్వురకును. ఇంకను సహృదయులెందరో



(Outputs) 14/10/08

చాలాకాలం నుంచీ నన్ను హెచ్చరిస్తున్నారు. అందులో 'యెంకి' పాటలు పదిమందికీ వినిపించినవారు దేశోద్ధారక శ్రీయుత కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు. ఆంధ్రపత్రికలో నేమి, భారతిలోనేమి ఆ పాటలకు తగిన తావొసంగి, యీ పుస్తకం తమ అచ్చులో యెంతో అభిమానం చూపి, రెండు మాసములు ఈ పుస్తకంను తమ మూడు పత్రికలలోనూ ఉచితంగా అడ్వర్‌టైజ్ చేయునట్లు ఆర్డరు దయచేసినారు – వారికెంతో కృతజ్ఞుడను.

'సాహితీ' మా పత్రికే. అనసూయ, జనరంజని, జ్యోతి, సుజన, రంజినీ పత్రికాధిపతులును నాకెంతో గౌరవ మొసంగినారు. శారదయు అట్లే. వారూ తెలుగు తల్లి యొక్క నిజస్వరూపం చూడవలెనని, ఉవ్విళ్ళూరుచున్నవారే. తెలుగు పస, తెలుగు నుడి, తెలుగు నాదం, తెలుగు రుచి తెలుసుకొని మనజాతి సాంప్రదాయాలలో గల సొగసు జీవనమూ, పదిమందికిన్నీ మనసు కెక్కించవలెనని కంకణము కట్టుకుని కృషి చేస్తున్న వారే. వారందరికీ నా నమస్కృతులు."

**– నండూరి వెంకట సుబ్బారావు**

❋ ❋ ❋

# ఆదర్శం

"నవలా రచయిత లెందరికో స్ఫూర్తి నిచ్చిన ఫ్రెంచి నవలా రచయిత జనరీ ద బాల్జాక్ (1799–1850) పంతొమ్మిది, ఇరవై శతాబ్దాలలో మహామహులైన వారెందరో ఈయన్ని ఆదర్శంగా స్వీకరించారు. ఫెడోర్ డోస్టవిస్కీ, కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్, హెన్రీ జేమ్స్, ఆస్కార్‌వైల్డ్, మార్సెల్ ప్రౌస్ట్, ఆల్డస్ హగ్జలే లాంటి వాళ్ళు తమ జీవితాంతం ఆయన్ని ప్రశంసిస్తూనే వున్నారు."

❋ ❋ ❋

# చతుర్విధ పురుషార్థములు

"ఏలూరులో ఒక పెద్ద సభ జరిగింది. ఒక ప్రముఖ వ్యక్తి ఏలూరులో ప్రారంభింపబోవు కళాశాల చతుర్విధ పురుషార్థములను బోధించేదిగా వుండాలని, దేశానికే ఆదర్శప్రాయంగా వుండాలని, ఇంకా ఏవేవో వుండాలని ఆవేశంగా మాట్లాడారు. ఆ సభకు అధ్యక్షత వహించిన కట్టమంచి రామలింగారెడ్డిగారు చతుర్విధ పురుషార్థాలకు సమకాలీన సామాజిక స్పృహతో ఒక చక్కని సమన్వయాన్ని సమకూర్చారు. "చతుర్విధ పురుషార్థములన నెవ్వి ? ధర్మ, అర్థ, కామ, మోక్షములు. మేము కళాశాలలో ప్రతిదినము ధర్మములు బోధించుచునే యుంటిమి కదా! పైగా కళాశాల వీడిన పిమ్మట ప్రతి విద్యార్థి అర్థమునకే కదా ఎగబ్రాకుట. మూడవది కామము. దీనిని గురించి మేము చెప్పబూనినచో కళాశాలకు మీ పిల్లలను ఎంతవరకు పంపుదురో దురూహ్యము. కట్టకడపట మోక్షమును గురించి చెప్పబూనినచో మాకు 'కపాల మోక్షములే' యగును."

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# మ్లేచ్ఛులు

"అంగలకుదురులో ఒక ఉపన్యాస చక్రవర్తి కవిరాజు త్రిపురనేని రామస్వామి గారితో ఢీకొన్నప్పుడు, "మీరు మ్లేచ్ఛులు గదా" అని కవిరాజు గారు వారిని అంటే వారు హుంకరించి "నేను స్వచ్ఛమైన బ్రాహ్మణ్ణి సుమా" అన్నారట. "మీరు మనుస్మృతి నంగీకరిస్తారా" అని కవిరాజు వారిని అడుగగా, వారు "మహాప్రసాదంగా" నన్నారట. మనుస్మృతిలో గల శ్లోకాన్ని విసిరి, అర్థాన్ని వివరిస్తూ "వింధ్య దాటి దక్షిణానికి వచ్చినవాడు మ్లేచ్ఛుడ"న్న వాక్యాన్ని చెప్పగా, సభికులు గొల్లుమన్నారట. ఉపన్యాస చక్రవర్తికి నక్కెళ్ళు పడినవట!"

❋ ❋ ❋

# సామ్యము

"కొల్లూరు ఆ రోజుల్లో వేటభూమి. ఒక దీక్షితులు "కమ్మ", "కుమ్మరి" శబ్ద సామ్యము వారిరువురు ఏకోదరులనిపించునన్నారట. గభీలున కవిరాజు త్రిపురనేని రామస్వామిగారు "అవును దీక్షితులు గారూ! "విప్ర", "వుప్పర" శబ్ధ సామ్యమును బట్టి ఏకగర్భ జనితులుగా నున్నారనగా సభలో హర్షధ్వానాలు మిన్నుముట్టినవట. దీక్షితులుగారు దిగ్భ్రమ చెందిరట."

❋ ❋ ❋

# పద్య రచన

"ఓసారి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో నాటకాలలో పద్యరచన మంచిది కాదు అను విషయం మీద చర్చ జరిగిందట. దానికి అనుకూలంగా శ్రీపాద కామేశ్వరరావు, జయంతి గంగన్న, టేకుమళ్ల కామేశ్వరరావు, పిలకా గణపతిశాస్త్రిగారును – ప్రతికూలంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఐలావజ్ఝల సూర్యప్రకాశశర్మ గారలు మాట్లాడారట."

❋ ❋ ❋

# ఉదయిని

"ఉదయిని" ద్వైమాసపత్రిక. అతి కష్టం మీద ఏడాదిపాటు కొంపెల్ల జనార్ధనరావు దానిని నడిపించాడు. ఆరవ సంచిక కేసరీ ముద్రణాలయం నుంచి బయటకి రాలేదు. ఆ బెంగతోనే జనార్ధనరావు మరణించాడని నా నమ్మకం. 'ప్రతిభ'కు ఉండే ప్రాపకాలు 'ఉదయిని'కి ఎప్పుడూ ఉండేవికావు. ఏ సంచిక కాసంచికను అతి ప్రయాసతో తీసుకొస్తూ ఆరవది అచ్చుకెక్కిన



(Outputs) 14/10/08

తర్వాత జనార్ధనరావు క్షయవ్యాధిగ్రస్తుడయ్యాడు. ఆ వ్యాధితోనే చనిపోయాడు. ఆరవ సంచిక ప్రతులన్నింటినీ ప్రెస్ బిల్లు నిమిత్తం చెత్త కాగితాల కింద అమ్మేయడం జరిగింది. కనీసం ఒక్క కాపీ అయినా దొరుకుతుందేమోనని నేను కేసరి ప్రెస్‌కి వెళ్లి చాలా ప్రాధేయపడ్డాను. 'అన్నీ అమ్మేశాం' అని జవాబు వచ్చింది.

జనార్ధనరావు చిరిగిపోయిన మురికి ఖద్దరు దుస్తులు ధరించేవాడు. కాని తన పత్రికను మాత్రం ఫెదర్‌వెయిట్ కాగితం మీదనే అచ్చు వేయించేవాడు. అతడే మరి కొన్నేళ్లు బ్రతికివుంటే తెలుగు సాహిత్యానికి పదిహేను అంతస్తుల భవనం నిర్మించేవాడేమో!"

**- శ్రీశ్రీ**

❋ ❋ ❋

# అభియోగము

"పురజనుల ఉపయోగార్ధము పురమందిరము నేను కట్టించి ఇయ్యదలచినప్పుడు సంతోషించి పురజనులందరును నాకు తోడుపడి యుందురని మీరు అనుకోవచ్చును. మా పట్టణమట్టి పాపము కట్టుకోలేదు. నేను పురమందిరమును కట్టించుటకు ముందే ఆ స్థల విషయము నాలుగు వ్యాజములు వేయబడి కొట్టుబడిపోయినవి. ఇవి యిట్లుండగా 1889 సెప్టెంబరులో, ఖాజా అహమ్మదుల్లాఖాన్‌గారు ఇచ్చిన స్థలములో మేము గోయిపెట్టి కర్రలు కోయించుచుండగా ఒక పెద్ద మనుష్యుడు ఖాజాసాహెబ్‌గారి దూరజ్ఞాతి అయిన ఒక బీద తురకవానిని పిలిపించి, వాని చేత నేను తన తాత సమాధిని తవ్వించి వేసినట్టు నాపై అభియోగమును తెప్పించెను. రంపపు గోతిలో నుండి తన తాతగారివని ఏరి తెచ్చిన ఎముకల బుట్టతో ఆ బీద తురక వానిని పోలీసులు రాజకీయవైద్యునిచేత పరీక్షించి వాని తాత ఎముకలన్నీయు మేక ఎముకలని డాక్టరు నిర్ణయ పత్రమిచ్చిన తరువాత, ఇతరులను కూడా విచారించి, ఏలూరి లక్ష్మీనరసింహం గారి ప్రేరణ చేత తేబడినదిగాని, నిజమైన అభియోగము కాదని తెలియజేసిరి."

**- కందుకూరి వీరేశలింగము**

❋ ❋ ❋

# ప్రతాపరెడ్డిగారు

"గోలకొండ పత్రికాలయం హైద్రాబాదు ట్రూప్‌బజారులో గల ఒక చిన్న పెంకుటింట్లో ఒక ప్రక్కన ముద్రణ యంత్రం, మరొక మూలన టైపు కంపోజు చేయు అక్షరమాలిక పెట్టెలు, ఇంకో కొసలో సురవరం ప్రతాపరెడ్డిగారి గది. ఆ గదిలో రెండు పుస్తకాల బీరూలు, ఒక బెంచి, ఒక మేజుబల్ల, మరొక పాతకుర్చీ రెడ్డిగారి ఆసనము. గది గోడలపై వేదం వెంకటరాయశాస్త్రిగారిది,



(Outputs) 14/10/08

అళియ రామరాజుగారిది, వీరరసం ఉట్టిపడు మీసాల కృష్ణమూర్తిది ఫోటోలు వ్రేలాడుతుండేవి. అదే గోలకొండ పత్రికాలయము, ప్రచురణాలయమును. అదియే కోటి తెలుగన్నల పవిత్రాలయము. యువకులు, కవిపుంగవులు, పండిత ప్రకాండులు, నాయకులు, ఆచార్యవర్యుల కదొక దివ్యాలయము. అక్కడే అభివృద్ధి పక్షము, విజ్ఞానవర్ధినీ పరిషత్తు, ఆంధ్ర సారస్వత పరిషత్తు లాంటి రాజకీయ, వైజ్ఞానిక, సారస్వత సంస్థలు పుట్టి పెరిగినవి.

ఆంధ్ర పితామహులగు మాడపాటి హనుమంతరావుగారు, డా॥ బూర్గుల రామకృష్ణారావు గారు, ఆచార్య రావాడ సత్యనారాయణగారు, ఆదిరాజు వీరభద్రరావుగారు, చిదిరెమఠం వీరభద్రశర్మగారు, దేవులపల్లి రామానుజరావుగారు, అనుముల, పెండ్యాల, కప్పగంతుల, చెలమచర్ల, పల్లెర లాంటి అతిరథ మహారధులెందరో అనుదినం విద్వద్గోష్ఠిలో పాల్గొంటుంటే, ప్రతాపరెడ్డిగారు అధ్యక్ష పీఠంపై అపరంజిలా వెలిగేవారు. ఆయన కన్ని విషయాలలో ఆకళింపు వుండేది. అన్ని రంగాలలో ప్రమేయం ఉండేది. సంగీతం, సాహిత్యం, చిత్రకళ, వాస్తుశాస్త్రం, ఆయుర్వేదం, దేనిపై చర్చ జరిగినా అందు తానున్నాడనిపించుకోవడమేగాక, కొసరుగా సరికొత్త విషయాలు రెండు చేర్చి అధ్యక్ష హర్యక్షుడనిపించుకునేవారు."

**- దాసరి చంద్రశేఖర్**

*　　　*　　　*

# చరిత్ర చతురానన

"చిలుకూరి వీరభద్రరావుగారు ఏలూరులో సత్తిరాజు సీతారామయ్య గారి 'దేశోపకారి' పత్రికలో పని చేశారు. తరువాత ఒక ముద్రశాలను కొని 'ఆంధ్రదేశాభిమాని' పత్రికను బెజవాడ నుండి నడిపించేరు. రాయసం వెంకట శివుడు గారితో స్నేహం ఏర్పడింది. పత్రికా ప్రచురణలో భూములను అమ్ముకోవలసి వచ్చింది. విబుధరంజని, దేశోపకారి పత్రికలను నడిపారు. 1965 లో వీరేశలింగంగారు నడుపుతున్న సత్యవాదిని పత్రికలో కొద్దికాలం పనిచేశాడు. తరువాత సత్యవోలు గున్నేశ్వరరావు గారు నడుపుతున్న ఆంధ్రకేసరి పత్రికకు సంపాదకులుగా ఉన్నారు.

మహాపురుషుడు కొమర్రాజు లక్ష్మణరావుగారు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని 1910 లో స్థాపించి, ఆధునిక విజ్ఞానాన్ని వెదజల్లడానికి ఎన్నో పుస్తకాలను అచ్చువేశారు. లక్ష్మణరావుగారి ప్రోత్సాహం లేకపోతే వీరభద్రరావు గారి ఆంధ్రుల చరిత్ర కృషి బయట పడుండదు. ఆంధ్రుల చరిత్ర రెండు సంపుటాలు మాత్రమే మండలి తరఫున అచ్చయినాయి. భేదాభిప్రాయముల వలన మూడో సంపుటం ఇతిహాస తరంగిణి గ్రంథమాల తరఫున వచ్చింది. ఆయన ఆంధ్రరాజయుగ చరిత్రను 1936 లో అచ్చువేశారు. చిల్లర విమర్శకులకు జవాబులు చెప్పవలసి వచ్చింది. నాలుగు వందల పేజీల పుస్తకాన్ని ఆరువందల నలభై పేజీలకు పెంచి కొంత అక్కసు తీర్చుకున్నారు. ఈ భాగాన్ని వారు ఆంధ్రుల చరిత్ర అయిదో భాగమన్నారు.



(Outputs) 14/10/08

ఆంధ్రుల చరిత్రను మొత్తం పది భాగాలు అచ్చువేయించాలనుకున్నారు. కాని ఆంధ్రులకు ఆ అదృష్టం కలగలేదు.

అన్యాపదేశ (సెటైర్) చక్రవర్తి అయిన కల్లూరి వెంకట రామశాస్త్రి గారి జీవిత చరిత్రను 1937 లో విపులంగా వ్రాసి, వారి పేరుతో తమ పేరును కూడా చిరస్థాయిగా చాటుకున్నారు. ఆంధ్ర మహాసభవారు చిలుకూరి వారికి 'చరిత్ర చతురానన' బిరుదు సమర్పించారు. 1939 లో దివంగతులయ్యారు."

**– లంకా సూర్యనారాయణ**

❋ ❋ ❋

# నిబంధనావళి

"పానుగంటి వారి సాక్షి సంఘములో అయిదుగురు సభ్యులు. వారిలో ముఖ్యుడు సాక్షి – సభాసమావేశములు, పత్రికా ప్రకటనములు మొదలగునవి చూసుకొను బాధ్యత అతనిది. జంఘాల శాస్త్రి గంటల కొలది ఉపన్యాసములీయగల వాగ్ధారాధాటికుడు. కాలాచార్యుడు వెట్టి సభ్యుడు, పొడుము పట్టునకు మొగము వాచినవాడు. వాణీదాసు కవి. శ్లేష కవిత్వంలో భట్టు. నువ్వుగింజ మీద నూరు పద్యములు చెప్పిన దిట్ట. బొఱ్ఱయసెట్టి వ్యాపారి, సాక్షి సంఘాధ్యక్షుడు.

ఈ సంఘమునకు ఒక నిబంధనావళి వుంది – రాజకీయములు మాటాడరాదు. వ్రాయరాదు. చెడ్డను గూర్చి విమర్శించినపుడు వ్యక్తి నామములు ఉదహరించకూడదు. తప్పనిసరి అయితే కల్పిత నామము ఉపయోగించవచ్చు. సభ్యులలో వివాదమేదైనా వస్తే తిట్లలోనికి కొట్లాట లోనికి దిగరాదు. ఖర్మకాలి ఒకవేళ అలాంటిది సంభవిస్తే కోర్టుల కెక్కకూడదు."

❋ ❋ ❋

# విశ్వనాథ సహజ ధోరణి

"ది. 24-12-1967 న హైదరాబాదులో జరిగిన అఖిలభారత బెంగాలీ రచయితల మహాసభలో మన సాహిత్య అకాడమీ 'విశిష్ట సభ్యుడు', 'కవిసామ్రాట్' అనిపించుకొంటున్న శ్రీ విశ్వనాథ సత్యనారాయణ దురహంకారంతో ఆంధ్రులను తీవ్రంగా అవమానపరిచారు. ఆ సభలో ఆంధ్ర – బెంగాలీల జీవిత సాహిత్య సాన్నిహిత్యాన్ని గూర్చి మాట్లాడుతూ ప్రముఖ బెంగాలీ నవలాకారుడు శ్రీ మనోజ్‌బసు విప్లవ సంస్కర్త, సాహిత్యవేత్త శ్రీ వీరేశలింగం పంతులుగారు ఆంధ్ర సాహిత్యాన్ని తన రచనలతో ఏ విధంగా సుసంపన్నం చేసి నూతన శకానికి నాంది పలికారో వివరించారు. అదే సభలో అధ్యక్షుడుగా ఆహ్వానింపబడిన, బెంగాలీ రచయితలచే ఆంధ్ర కవిగా సన్మానింపబడిన మన 'కవిసామ్రాట్' అనబడే శ్రీ విశ్వనాథ సత్యనారాయణ తన సహజ కవి మాత్సరంతో తాను, తన గురువు మాత్రమే కవులమని



(Outputs) 14/10/08


పేలుతూ, శ్రీ వీరేశలింగం పంతులుగారు సాహితీవేత్త కాదని నిరూపించడానికి నానా పాట్లు పడి, నానా కారుకూతలు కూశారు. ఆంధ్రేతరుల ఎదుట తెలుగుతనాన్ని, ఆధునిక విప్లవ యుగ పురుషుణ్ణి, సాహితీవేత్తను అవమానపరిచే ద్రోహులు అకాడమీలో వుండటం ఎంత వరకు సముచితం ?"

**– దిగంబర కవులు**

(1–2–1968 న అకాడమీ ఏర్పాటు చేసిన సభలో
దిగంబర కవులు పంచిన ఆలోచనా పత్రం నెం. 1 నుండి)

❋ ❋ ❋

## కళ ఏదీ ?



**పుట్టపర్తి**

"రేషనింగు బియ్యమునకు ప్రాకులాడుటకే పొద్దులు చాలని మనకును, కళకును నేమి సంబంధము. నక్క యెక్కడ నాగలోక మెక్కడ ? ఈ కడుపు గొడవలో గోష్ఠులెవరికి గాబట్టినవి ? మన గృహిణులు కూడా మనకు దగినవారే తయారైనారు. వాకిండ్ల ముందు ముగ్గులు పెట్టుట వారికి మోటుతనము. పెండ్లి నలుగులలో వక్కలాకుల ఖర్చేగాని యెుక్క పాటైనను బాడుకొనరు. అట్లు పాడుట ఛాందసమను నొక రోగము కూడా మన నాగరికత దిగుమతి చేసిన సరుకు. వారికి హాయిగా దమలపాకు చిలుకలు గట్టుటకు రాదు. ప్రొద్దున లేచినది మొదలు – వారికి పది గంటలకాఫీసుకు బోవు మగనీని కేమి వంట చేయవలెనన్న కూటి చింతయే. ఇక జీవితమున కళ యేదీ ? అందువలన కవికి దిక్కుతోచదు.వాడూరక వెర్రికి బెట్టుకొని మనలను జంపుచుండును."

**– పుట్టపర్తి నారాయణా చార్యులు**

❋ ❋ ❋

## జ్యోతి

"కథలు రాస్తే డబ్బిస్తారన్న సంగతి, నాకు 1948 లో గానీ తెలీదు. అలా తెలియ జేసినవారు జ్యోతి మేనేజ్‌మెంట్‌వారు. ఆ పత్రిక తెనాలి నుండి వెలువడుతూ ఉండేది. తొలిసారిగా అయిదు రూపాయలు పారితోషికం నాకిప్పించిన 'దేవుడు పుట్టాడు' అన్న నా కథ 'జ్యోతి' పత్రికలో అచ్చయింది. ఇది జరిగిన రెండు, మూడు మాసాలకే నేను జ్యోతి పత్రికలో ఉద్యోగిగా చేరాను. ఇది – నేను కలలో కూడా ఊహించని సంఘటన.



(Outputs) 14/10/08



రావూరి భరద్వాజ

నాకిప్పటికీ బాగా జ్ఞాపకం.. "ఈ ఉత్తరం అందగానే, తగినన్ని గుడ్డలు తీసుకొని తెనాలి రండి!" అంటూ వచ్చిన ఓ కార్డు, నా జీవితాన్ని గొప్పగా మలుపు తిప్పుతుందని, నేననుకోలేదు. ఆ ఉత్తరం రాసింది ఆలపాటి రవీంద్రనాథ్‌గారు. నేను తెనాలిలో బతకడానికీ, పత్రికారంగంలో కాలు నిలదొక్కుకోడానికి, ఆ ఉత్తరమే కారణం!

జ్యోతి పక్షపత్రిక చాలామంది కొత్త రచయితలను వెదికి పట్టుకొచ్చింది. అప్పటికే ప్రసిద్ధులైన రచయితల సరసన వారిని నిలబెట్టింది. 'శారద', భుజంగరావు, ప్రకాశరావు, శివం, శ్రీనివాసరావు, 'చౌడీశ్వరీదేవీ', 'వెంచాశా', రంగాచార్య వీరందరూ వీరితోపాటు నేనూ కొత్తవాళ్ళమే! మా అందరి పేర్లూ, అటు చలంగారి పక్కనా, ఇటు కొప్పరపు సుబ్బారావు గారి పక్కనా, చూసుకొని పొంగిపోతూ ఉండేవాళ్ళం."

**– రావూరి భరద్వాజ**

*　　*　　*

# తెలుగు కవిత్వం

"నన్నయ్య మొదలు తిరుపతి వెంకట కవులదాకా వచ్చిన మన తెలుగు కవిత్వం ఎక్కువ భాగం జమీందారీ యుగ కవిత్వమే! సంఘంలో చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సజీవంగా ప్రతిస్పందిస్తూ, స్వంత అనుభూతులను స్వంత గొంతులలో ప్రకటించడంగాని, ఉదాత్తాశయాలతో జీవిత సత్యాన్ని అన్వేషిస్తూ, పరిణతాత్ములై తమ స్వంత సందేశాలను, ప్రబోధాలను వినిపించడం గాని ఎన్నడూ మన తెలుగు కవులకు ధ్యేయాలు కావు. ప్రభువుల తలలూపించే ఉత్‌ప్రేక్షలతోనూ, అతిశయోక్తులతోనూ, అక్షరరమ్యత అనబడే శబ్దాల గారడీతోనూ 'కవి' అనే యశస్సు గడించడం, తత్ ఫలితంగా ప్రభువుల మెప్పు పొంది అగ్రహారాదులు ఆర్జించుకోవడం – ఇవే మన వెనుకటి తెలుగు కవులకు ప్రధాన కవితా ప్రేరణలుగా ఉండేవి.

ఇందుకు అపవాదాలుగా ఆత్మ సంతుష్టి కోసం, ఆత్మ పరిణతి సాధనంగా కవిత్వాన్ని ఉపాసించిన వారు – పోతన, వేమన, గోపన్న, పుసులూరి సోమరాజు, అన్నమయ్య వంటి భక్త కవులు కొందరు కనిపిస్తున్నా, తెలుగులో ప్రథమశ్రేణి కవులుగా వారికి గుర్తింపు లేదు. అదీగాక – ఆత్మ ద్రష్టలై శిష్య పరంపరను సంపాదించుకున్న కబీరు, సూరదాస్, తులసీదాస్, మీరాబాయి వంటి హిందీ కవుల స్థాయికిగాని, నమ్మాళ్వార్ (శఠగోపయతి), పెరియాళ్వార్ (విష్ణుచిత్తుడు), తొండర డిప్పొడి యాళ్వార్ (విప్రనారాయణుడు), గోదాదేవి వంటి దక్షిణాత్య భక్త కవుల



(Outputs) 14/10/08

స్థాయికి గాని వారు ఎదిగనవారు కాదు. దేవాలయాలలో విగ్రహాలుగా వెలసి, ఆరాధింపబడే ఔన్నత్యానికి వారు నోచుకోలేదు. వారి రచనలు దేవాలయాలలో పారాయణ చేయబడే ఉదాత్త స్థాయిని అందుకోలేదు. త్యాగరాజు, జగన్నాథపండితుడూ, వల్లభాచార్యులు, రామానుజాచార్యులూ మన తెలుగు వారే అని మురిసిపో జూసినా, వారు తెలుగు గడ్డను వదలిపోయి అన్య ప్రాంతాలలో మహాకార్యాలను సాధించిన వారు. తెలుగువారిచేత పూర్తిగా విస్మరింపబడి, ఇతర ప్రాంతీయుల స్వంత ఖాతాలో జమ కట్టుకోబడ్డవారు.

"అల నన్నయ్యకు లేదు. తిక్కనకు లేదా భోగము...." అని స్వోత్కర్షను చాటుకునే లక్షణం తెలుగు కవులలో ఆధునికుడైన శ్రీ విశ్వనాథలోనే ఆరంభం కాలేదు. "విపుల శబ్ద శాసనుడను", "అవిరళజప హోతత్పరుడుదును", "నిత్య సత్యవచనుడను" "నానారుచిరార్థ సూక్తి నిధిని" అని తనను గురించి తానే ఆత్మ వికత్థనం చేసుకునే ఆచారం ఆదికవి నన్నయ నుంచే మనలో ఆరంభమైనట్టు కనిపిస్తుంది. ఆత్మ శ్లాఘ, అన్యోన్యశ్లాఘ, తమని కాదన్న వారిని కుకవులని దూషించడం, వస్తు నిష్ఠమైన సత్యదృష్టితో చేసే నిష్పాక్షిక విమర్శను సహృదయతతో స్వీకరించగల ఔదార్యం లోపించడం నేటి మన కవులకు మన ప్రాచీన కవుల నుంచి వారసత్వంగా సంక్రమించినవే అనడానికి బోలుడు రుజువులున్నాయి. 'ప్రసన్నకథాకవితార్థయుక్తి', 'అక్షర రమ్యత' సత్కవిత్వ లక్షణాలని నన్నయగారు నిర్వచిస్తే, "సొగసు కోర్కులు రావలె ఆలకించినన్" అని పెద్దన్నగారూ, "పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన లీల" అని పింగళి సూరన – ఇలా ఎవరికివారు తమ కవిత్వం ఆధారంగానే కవితా లక్షణం నిరూపించి, అందుకు భిన్నమైన దాన్ని కుకవిత్వం అని త్రోసిపుచ్చారు. ఈ విధంగా తెలుగు కవులే విమర్శకులైనందు వల్ల అందరి కావ్యాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, సర్వాంధ్ర కవిత్వానికి వర్తించే సాధారణ సూత్రాలను రూపొందించే తెలుగు అలంకార శాస్త్రం అభివృద్ధి పొందే ఆస్కారం లేకుండా పోయింది. తెలుగులో ఉన్న లక్షణ గ్రంథాలు ఇంచుమించు అన్నీ సంస్కృతానికి అనువాదాలే!

మన ఆంధ్ర సాహిత్యాన్ని గురించి ఇలాంటి అప్రియపు మాటలు చెప్పిన వారిలో నేనే మొదటివాణ్ణికాను. అక్కిరాజు ఉమాకాంత పండితుడు తెలుగు సాహిత్యాన్ని గురించి కొన్ని నిష్ఠురమైన నిజాలు పలికి, సాహిత్య బంధు విరోధి అయ్యాడు. ఇలా ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని గూర్చి నిర్భయంగా కొన్ని ఆక్షేపణలు లేవదీసినవారు మరొకరున్నారు – వేంకట రామకృష్ణ కవులు, 'ప్రాచీన ఆంధ్ర కవుల అపరాధాలు' అనే శీర్షికతో 30 పద్యాలు వ్రాసి, భారతిలో వారు ప్రచురించగా, ఆనాటి ఆంధ్ర విద్వత్‌లోకంలో అవి గొప్ప సంచలనం కలిగించాయట!"

**– బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు**

❋ ❋ ❋

# కాలం

"కొన్ని గ్రంథాలకు బహుమతులివ్వడం వల్ల అవి గొప్పవయిపోవు. మరి కొన్నింటిని నిషేధించడం వల్ల అవి మరుగున పడిపోవు. గవర్నమెంట్లు వస్తాయి. పోతాయి. కాని కాలం మా తరఫున ఉందని విప్లవ రచయితలమైన మాకు తెలుసు".

**– శ్రీశ్రీ**

(2-1-1972)

❋ ❋ ❋

# తెలుసుకో తేల్చుకో

తెలంగాణా మహాకవికి,

ఒరే అబ్బాయ్, తీవ్రమైన వర్గ విభజన జరుగుతున్న ఈ రోజుల్లో, నత్త గుల్లలన్నీ ఒకవైపుకి జరుగుతున్న ఈ కాలంలో ఎటువైపు నువ్వు మొగ్గుతావు ? ఎవరిని తిడుతున్నావు ? ఎవరి మీద జుగుప్స కలిగించదల్చుకున్నావు ? ఏ వర్గం కొమ్ము కాయడానికి నిలుచున్నావు ? కళ్ళున్న కబోదులెవరో నువ్వే తేల్చుకో. సామ్యవాదాన్ని ఏవగించుకునే వాళ్ళని నే నర్థం చేసుకోగలను. ఎటొచ్చీ సామ్యవాదం కావాలంటూ, ఆచరణలో వెన్నుపోట్లు పొడిచే వాళ్ళతోనే నా పేచీ! అబ్బీ! చీనా అంటే మనకెందుకురా భయం ? భయపడేవాళ్ళని భయపడనీ! మళ్ళీ కలుసుకుందాం!

**– శ్రీశ్రీ**

(దాశరథిని సంబోధిస్తూ)

❋ ❋ ❋

# అభిప్రాయం

"శాంతినికేతనంలో వొక మూడు వారాలు – నాలుగు వారాలు గడిచిన తరువాత నాకిదివరకున్నటువంటి ఆ భావం త్వరలో సడలిచ్చింది. చాలా వరకూ యెందువల్లనో మరి తరిగింది. వైతాళికులని చెప్పి ఉదయమే ఠాగూరు పాడినట్టు పాడుతూ – మేలుకొలుపులు పాడుతూ – విద్యార్థులందరూ తిరగాలి. అక్కడున్నటువంటి ప్రతి కుర్రవాడు కూడా ఠాగూరును పొగుడుతూ వుండటం నిష్కారణంగా – యివన్నీ చూసి ఒక విధమైనటువంటి జుగుప్స కలిగింది. యెందుకంటే స్వతంత్రమైనటువంటి బుద్ధి కలిగినటువంటి భావంలో నాకు నేను ఉండటం చేత – అక్కడున్నటువంటి యీ భావదాస్యాన్ని సహించలేకపోయాను.



(Outputs) 14/10/08


తరువాత అక్కణ్ణించి నేను వెళ్ళిపోయాను. కలకత్తాలో ఉపన్యాసం చెయ్యడానికి వచ్చినప్పుడల్లా ఠాగూరు చక్కని పట్టుబట్టలు కట్టుకొని ప్రసన్నమైన చూపులతో, గడ్డం సవరించుకొంటూ పెద్ద విలువ కలిగిన మోటారు కారులోంచి దిగి, సభావేదిక పైకి వస్తుంటే ఆయన ఆ వచ్చే కాస్తదూరంలోనూ కొన్ని వందలమంది భిక్షుకులు ఆయన అఖండమైనటువంటి తేజస్సు, ఆయన శరీర సౌష్టవమూ వీటన్నింటి వెనుకా దారిద్ర్యం వాళ్ళ నెగతాళి చెయ్యటం వంటివి చూస్తే ఆ తారతమ్యం వుంటే చాలా హృదయ విదారకంగా వుండేది."

**- అబ్బూరి రామకృష్ణారావు**

(రేడియో ఇంటర్వ్యూలో)

* * *

# వేలూరి



**వేలూరి**

వివిధ శాస్త్రాలలో తలస్పర్శి పాండిత్యం, జ్యోతిష, ఖగోళాది శాస్త్రాలలో ప్రగాఢ పాండిత్యం, గ్రహణ ధారణాక్రియలలో అద్వితీయ ప్రతిభామతిత్వం అన్నింటికీ తలమానికంగా సహృదయత్వమ్, దావాగ్నిలా పరివేష్టించిన కష్టాలను దరహాసంతో చిత్తుచేయగల మనస్థైర్యం మూర్తీభవించిన కవిర్మనీషి శతావధాని వేలూరు శివరామశాస్త్రిగారు.

అది 1929 వ సంవత్సరం. శాస్త్రిగారి సాహిత్య మందిరంలో వెలసిన అమూల్య గ్రంథాలతోబాటు సాహిత్య తపః ఫలమగు వారి బహుమూల్య రచనల వ్రాత ప్రతులన్నీ అగ్నిదేవుని కాహుతి కాగా, శాస్త్రిగారి హృదయం ఎంతగా తపించిందో వారి పలుకుల్లోనే చదవటం బాగు.

"పెంచితి పెద్ద చేసితిని ప్రీతియుతంబుగా రాణివాస మం
దుంచితి రాజయోగ్య కుసుమోపవనంబులు క్రుమ్మరిల్ల ని
ర్మించితి విస్మరించితిని మేదిని మింటిని నొక్కపెట్ట న
ర్పించితి నిన్ను నగ్నికిని పెన్‌బలిగా గవితా సరస్వతీ!

కాల్చితి విల్లు సర్వమును గాల్చితి పాత్రము లూచముల్పుగా
గాల్చితి వెల్లయున్ ధనము గాల్చితి వెల్లయు ధాన్యరాసులన్
గాల్చితి వున్న వెల్లయును గాల్చిన గాల్చితి గాక గ్రంథముల్
గాల్చితి నీకు నోజ్వలన, కడ్పది నిండెనొ కాలు నిండెనో



(Outputs) 14/10/08

ఋగ్వేదమా! యష్ట దిగ్వీధులను నన్ను
గనవెంతో యడలితో గాలునపుడు
వేదాంతమా! నన్ను వీక్షింప యోగదృ
జ్మతి నెంత పూనితో మాడునపుడు
వ్యాకృతీ! యల యుజుగంతమౌ 'దృశి' నెంత
వఱపితో నాకయి చరమవేళ
కవితా కుమారి; నిన్ గనుపొంటె నెన్ని ము
ఖాల దుఃఖించితో క్రాగు తరిని
కట్ట! సాహితిరో నన్ను గౌగలింపు
నెంత చేతులు చాపితో, యేమనందు
నన్ను గంగాతమును జేసి చన్నవారె
పుస్తకములార! విజ్ఞానపుటములార!"

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి

* * *

## మాడపాటి



మాడపాటి

"ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారు ఆంధ్ర, ఆంగ్ల, ఉర్దూ భాషలలో మంచి ప్రావీణ్యం కలవారు. పార్సీ, మరాఠీ భాషలలో కూడా పరిచయం ఉంది. ఈయన వ్యాసరచనలు, కథానికలు, గ్రంథాలు పలువురు సాహితీవేత్తల ప్రశంసలందుకున్నవి. తెలంగాణా ఆంధ్రోద్యమం (2 భాగాలు), రోమన్ సామ్రాజ్య చరిత్ర, క్షేత్రకాలపు హిందర్వార్యులు, గారీబాల్డీ జీవితం, రాజ్యాంగ సంస్కరణలు మున్నగు గ్రంథాలను ఆయన రచించారు. పర్షియన్ కవులను గురించి వ్యాసాలు వ్రాశారు. బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన "ఆనందమఠం"ను ఆంధ్రీకరించారు. వివిధ తెలుగు, ఉర్దూ పత్రికలకు అనేక కథలు, కథానికలు వ్రాశారు. వీటిలో కొన్ని 'మల్లికా గుచ్ఛము' పేర ప్రచురితమైనవి."

* * *

## గాడిచెర్ల

"ప్రజాహిత జీవి గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ఉన్నత విద్య నభ్యసించి విద్యావంతుడుగాను, భాషావేత్తగాను గణతికెక్కారు. (1900–1906) తర్వాత దేశంలో ప్రజ్వరిల్లిన



(Outputs) 14/10/08

రాజకీయోద్యమాల్లో తలమునకలుగా దిగి ప్రయాణం చేశారు. (1927–28) కొద్దికాలం పాటు పార్లమెంటీరియన్‌గా రాణించారు. (1927–30) దరిమిలా 1935 నుండి గ్రంథాలయోద్యమం, ఆంధ్రోద్యమాలలో పాల్గొని, నిర్మాణ కార్యక్రమాలకే జీవితాన్ని అంకితం చేశారు."

❋ ❋ ❋

# సాహితీ వసంతోత్సవాలు

"గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, కల్లూరి సుబ్బారావు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, పప్పూరి రామాచార్యులు రాయలసీమలో శ్రీ కృష్ణదేవరాయ 'సాహితీ వసంతోత్సవాలు' జరుపుతుండేవారు. 1928 లో నంద్యాల పట్టణములో జరిగిన వసంతోత్సవ సభలో సంగీత, సాహిత్య, నాట్యరంగ ప్రముఖులకు సముచిత బిరుదులు ప్రదానం చేసి, గౌరవించాలని తీర్మానించుకున్నారు. ఆ నంద్యాల సభలోనే చిలుకూరి వీరభద్రరావుకు 'చరిత్ర చతురానన', బళ్ళారి రాఘవాచారికి 'నాట్యకళాప్రపూర్ణ', దుగ్గిరాల బలరామకృష్ణయ్యకు 'బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ' అను బిరుదులతో సన్మానించారు. ఆ విధంగా పలువురు కవి పండితులకు శాలువలిచ్చి సత్కరించారు. వసంతోత్సవ సంచికలు కూడా వెలువరించారు."

**– మాదాల వీరభద్రరావు**

❋ ❋ ❋

# దేశం కోసం

"వందేమాతరం ఉద్యమం రోజుల్లో గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, బోడె నారాయణరావుగారు మొదటిలో కఠిన జైలు శిక్షలు అనుభవించిన త్యాగమూర్తులు. బాలగంగాధరతిలక్‌తో కాంగ్రెస్ సంస్థకు ప్రజలతో సంబంధం పెరగడం ప్రారంభమైంది. దేశంలో ఒక నూతన శక్తి ఉద్భవించింది. బెంగాలు రహస్య విప్లవోద్యమం యువకుల్లో దేశభక్తిని రగుల్కొల్పింది. అనీబిసెంట్ హోంరూల్ ఉద్యమం వచ్చే వరకు, చెప్పుకోదగిన ప్రజా ఉద్యమం (MASS MOVEMENT) లేదనే చెప్పవచ్చు. గాంధీగారి సహాయ నిరాకరణోద్యమంతో స్వాతంత్ర్యోద్యమం ప్రజా ఉద్యమంగా అభివృద్ధి అయింది. అప్పటికే కొండా వెంకటప్పయ్యగారు తమ న్యాయవాద వృత్తిని విసర్జించి, సంఘ సేవకు పూనుకున్నారు. గుంటూరులో గొప్ప సభ జరిపి, వారికి 'దేశభక్త' బిరుదును ప్రదానం చేశారు. గుంటూరు జిల్లాలో పలువురు న్యాయవాదులతోపాటు, నేనూ న్యాయవాదవృత్తికి స్వస్తి చెప్పాను. జైలు కెళ్ళాను. అప్పుడు నేను జిల్లా కాంగ్రెస్ సంఘ ప్రచురణ విభాగం చూచేవాడిని. చాలా కరపత్రాలు, చిన్న పుస్తకాలు వెలువరించాము. బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి, దామరాజు పుండరీకాక్షుడు జాతీయ నాటకాలు



(Outputs) 14/10/08

రచించారు. ఆ నాటకాలు వ్రాసిన కవులు, ప్రదర్శించిన నటకులు కూడా జైలు శిక్షలకు గురి అయినారు. తదనంతర స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు తెలిసినవే గదా!

నా కంటికి శుక్లం వచ్చింది. శరీర బలహీనతల వల్ల డాక్టరు నా కంటికి ఆపరేషన్ చేయవద్దనుకున్నారు. పత్రికల్లోని హెడ్డింగ్ టైపులు మాత్రం చదవగలుగుతున్నాను. నేనిపుడు ఏదీ వ్రాయగలిగిన స్థితిలో లేను. ఐతే నా జ్ఞాపకశక్తి, మానసిక శక్తి ఇంకా సన్నగిల్లలేదు. ఇక మాబోంట్ల పని అయిపోయినట్లే! ఏదో చేయగలిగింది చేశాం. కొంత మంచి చేశామనే సంతృప్తి ఉంది. ఇక యువతరం అందుకోవలె. దేశ రాజకీయ పరిస్థితులు ఏమీ బాగాలేవు. మున్ముందు ఏమి జరుగనున్నదో ఊహించలేకుండా వున్నాను.

నేటి కలుషిత రాజకీయాలు, రాజకీయ పక్షాలు దేశీయ ప్రజలను ఐక్యపరచలేక పోతున్నాయి. ప్రజలను నీతిమంతులను చేయలేకపోతున్నాయి. మన పురాణాలు, ఇతిహాసాలలో చెప్పిన సత్యహరిశ్చంద్ర వంటి కథలు, ఉత్తమ సాహిత్యం, కళలు సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడవలసి వుంటుందని అభిప్రాయపడుతున్నాను.

రాష్ట్ర ప్రభుత్వం కొద్ది ఆర్థిక సహాయం అందిస్తున్నది. మిత్రులు కూడా కొంత పంపిస్తున్నారు. వాటితో ఎలాగో కాలక్షేపం చేస్తున్నాను. నేను న్యాయవాదినైనా, న్యాయవాదవృత్తిలో ప్రవేశించలేదు. 'జర్నలిజం'లో చిరకాలం సుఖాలనో, కష్టాలనో అనుభవించాను. దేనిలోనూ నేను పెద్దగా ఆర్జించినదేమీ లేదు. నేను కూడా దేశానికి కొంత మంచి చేశాననే తృప్తి, సంతోషం వుంది".

**- కోలవెన్ను రామకోటేశ్వరరావు**

* * *

# నడింపల్లి

"సహాయ నిరాకరణ ఉద్యమంలో బార్డోలీ ఉద్యమం చెప్పుకోదగినది. గాంధీజీ చేస్తున్న పనిని శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారు స్వయంగా చూశారు. ఆ ఉద్యమం ప్రారంభించే ముందుగా గాంధీజీ వైశ్రాయికొక లేఖ వ్రాశారు. అది చక్కని భాషాపటుత్వం గల లేఖ. పోస్ట్ చేసే ముందు "బారిష్టర్! (నడింపల్లి) దీనిని చూడు" అని ఆయన చేతికిచ్చారు. దానిని ఆయన చదివారు. గాంధీజీ ఆ లేఖలో 'అల్టిమేటమ్' అని వ్రాసిన దానిని నడింపల్లివారు 'మహజరు' అని మార్పు చేశారు. ఆ మార్పు బాగుంది అన్నారు గాంధీగారు. ఈ అభ్యర్థనను మన్నించకపోతే ఎంతటి పెద్ద శిక్షను అనుభవించడానికైనా నేను సంసిద్ధంగా ఉన్నానని గాంధీజీ ఆ లేఖలో స్పష్టం చేశారు.



(Outputs) 14/10/08

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు లండన్ వెళ్ళి విద్యార్జన చేయడానికి శ్రీ నడింపల్లి ఆర్థిక సహాయం చేశారు. ఈ సంగతి చాలామందికి తెలియదు. ఇది ఆయన ఔదార్యానికి మచ్చుతునక.

ఆయనను ఆఖరుసారి కలిసి, స్వీయచరిత్రను వ్రాయమనడం జరిగింది. భావి చరిత్రకారుల కోసం ఆ రచన చేయక తప్పదని కోరాను. అప్పుడే ఆయన ప్రకాశం పంతులు గారిపై ప్రచురించే శతజయంతి ప్రత్యేక సంచికకు వ్యాసాలు వ్రాశారు.

నడింపల్లివారి ఆత్మకథను బొడ్డుపల్లి సోమయాజులు 'ప్రజావాణి'లో ప్రచురించారు. తర్వాత గ్రంథంగా వెలువడింది. ఆంధ్రదేశంలో ప్రభవించిన స్వరాజ్య ఉద్యమ వృద్ధ పితామహుడుగా నడింపల్లి చిరస్మరణీయుడు."

**– మాదల వీరభద్రరావు**

❋ ❋ ❋

# గోపీచంద్



**గోపీచంద్**

"ఆయన (శ్రీ గోపీచంద్) 1932 వ సంవత్సరము "కొంచెం చదువు సంస్కారం గల అమ్మాయి కావాలి" అని పదునారు సంవత్సరముల ప్రాయం గల నన్ను వివాహం చేసుకున్నారు. వివాహం అయింది మొదలు సామాన్యురాలనైన నన్ను తమ అర్ధశరీరంగా భావించుకున్నారు. శివుడు గంగను జటాఝూటంలో ధరించినట్లు ఎంతో గౌరవించారు. అటువంటి వారికి ఆత్మార్పణ గావించుకున్నాను. తమ నర్థం చేసుకున్నందుకు చాలా సంతుష్టులయ్యారు.

నాకు తెలిసిన దగ్గర నుంచి "దేవుడున్నాడా, లేడా ?" అనే జిజ్ఞాసతోనే ఉండేవారు. ఈ సమస్యను గురించి చాలా మందితో వాదోపవాదాలు జరుపుతూ ఉండేవారు. నిరంతరం పూజలు సలిపే మాతృదేవికి ఉద్భవించడం వల్ల పూర్తిగా తండ్రిగారిని అనుసరించలేకపోయారేమో!

పితృదేవుల జ్ఞానాన్ని, సిద్ధాంతాలను సంతరించుకొని, జీవితం మొదట్లోనే హేతువాదిగా పై మెట్టుకు ఆరోహణ చేశారు కాని అక్కడే తిష్ట వేయడానికి మనస్కరించక, ఇంకా పైకి ఆరోహణ చేయడానికి ఆరాటపడ్డారు.

ఉన్నవ దంపతుల దగ్గర ఎనిమిది సంవత్సరములు శిక్షణ పొందిన నేను, మాస్టారుగారి ప్రార్థన చేస్తూ వుంటే, చూచి, వారు కూడా చెయ్యాలని దృఢ నిశ్చయులయ్యారు.

భిన్న దృక్పథాలు కలవారైనా ఒకే గమ్యాన్ని సాధించిన మా మామగారు శ్రీ రామస్వామి చౌదరిగారూ, పితృతుల్యులు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు ఆప్తమిత్రులు.



(Outputs) 14/10/08

పంతులుగారు తెనాలి వచ్చినప్పుడు సూతాశ్రమములో దిగుతూ ఉండేవారు. ఒకసారి వచ్చినప్పుడు వారు పంతులుగారిని 'మాస్టరుగారి ప్రార్థన మంత్రం ఉపదేశం చేయమని' కోరారు.

అడిగినదే తడవుగా ఎంతో ఆనందంతో పంతులుగారు వారికి మంత్రోపదేశం చేశారు. భారత భాగవత రామాయణములు కూడా చదవమని సలహా ఇచ్చారు.

ఆనాటి నుండి వారు పంతులుగారిని దీక్షనిచ్చిన గురువుగా భావించుకున్నారు. చివరి వరకు అవకాశాన్ని పురస్కరించుకొని తమ గురువుగారి ఔన్నత్యాన్ని శక్తివంచన లేకుండా చాటుతూ ఉండేవారు. 'చీకటి గదులు'లో కూడా శివకామయ్య పాత్రను పంతులు గారి నుద్దేశించి చాలా విశాలంగా వ్రాశారు.

1953 వ సంవత్సరంలో ప్రచారశాఖ డైరెక్టరుగా గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశించారు. పెద్దవారితో స్నేహాలు, పరిచయాలు విరివిగా ఆరంభించారు. వారి పాదధూళితో మా గృహం పావనం కావటం మొదలు పెట్టింది. మజిలీ మజిలీకి ఎందరెందరితోనో స్నేహాలు చేస్తూ ఉండేవారు. అవన్నీ ఒక ఎత్తు, మొదటి నుండి చివరి వరకు సోదరులు శ్రీ ఆవుల సాంబశివరావు గారితో చేసిన స్నేహం ఒక ఎత్తు. వారిద్దరు నరనారాయణులను మరిపించేటంత మైత్రితో ఉండేవారంటే అతిశయోక్తి కాదేమో!"

**– శకుంతలా గోపీచంద్**

❋ ❋ ❋

# నిరంతర రచన



రాహుల్

"రాహుల్ సాంకృత్యాయన్ (కేదారనాథ్ పాండె) 1927 లో తమ 34 వ ఏట నిరంతరాయమైన రచనా వ్యాసంగాన్ని మొదలుపెట్టారు. 1961 లో రోగగ్రస్తులు అయ్యేంత వరకు సాగించారు. 'ఆయన తమ రచనా వ్యాసాంగాన్ని మంచి క్రమపద్ధతిలో గడియారంలా నిర్వహించారు' అని ప్రకాశచంద్రగుప్త అంటారు. 34 సంవత్సరాలలో ఆయన యాభై వేల పేజీల ప్రచురణ చేశారు. ఇంకా 12 గ్రంథాలు అముద్రితాలుగానే ఉండిపోయాయి. ఇది ప్రశంసనీయమైన కృషి. అందులో ఆయన ఎన్నో సంవత్సరాలు ప్రమాదభరితాలైన ప్రయాణాలు చేస్తూ, విదేశ సంచారాలు చేస్తూ గడపటమేగాక, కొన్ని సంవత్సరాలు కారాగారాలలో కూడా గడపవలసి వచ్చింది. అటువంటి వ్యక్తి చేసిన రచనల విస్తృతి కూడా మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయన అత్యంత వేగంతో, అలసట ఎరగకుండా రచనలు చేసేవారు. రచనలు చేయడానికి ఒక ప్రత్యేక మానసిక స్థితి కోసం, సౌఖ్యమైన



(Outputs) 14/10/08

పరిస్థితుల కోసం కాచుకుని కూర్చునేవారు కాదు. రైలు ప్రయాణాలలోనూ, ఓడ ప్రయాణాలలోను, హోటళ్లలోను, సత్రాలలోను, చిన్న కేంపులకి వెళ్ళినప్పుడు, ఇంటి దగ్గర, మార్గమధ్యలోను – అన్ని చోట్లా ఆయన తమ రచనా కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉండేవారు.”

**– యం. పెరుమాళ్లు**

*　　*　　*

# తారాశంకర్

“తారాశంకర్ బందోపాధ్యాయ (1898–1971), బిభూతిభూషణ్, మాణిక్ బెనర్జీలతోబాటు, శరత్‌బాబును ఒక్కరినీ మినహాయిస్తే టాగోరు తరువాతి కాలపు బెంగాలీ నవలా చరిత్రలో అగ్రశ్రేణి రచయితలలో ముఖ్యులు. మిగతా ఇద్దరు బెనర్జీలతో పోల్చి తారాశంకరు సాహిత్య స్థానాన్ని నిర్ధారణ చేయటం సాధ్యం కాదు. ఈ ముగ్గురు రచయితలు ఎన్నో విధాలా వ్యత్యాసాలు వున్నవారు. నవలా రచయితగా తారాశంకరు స్థానమెటువంటిది ? మాణిక్‌బెనర్జీ వలె, సాంఘిక వ్యవస్థను సమూలంగా నాశనము చేస్తున్న అంతరంగములోని రుగ్మతను ఆయన విశ్లేషించలేదు. బిభూతి భూషణ్‌తో కూడా ఆయనకు పోలికలు ఎక్కువ లేవు. వంగసాహిత్యంలో బిభూతిభూషణ్ ప్రతిభ ‘నభూతో న భవిష్యతి’ అని చెప్పవచ్చు.

అయితే, అసంఖ్యాక పాఠకుల ఆదరాభిమానాలకు తారాశంకరు పాత్రుడవటానికి కారణం ఏమిటి ? ఈ ప్రశ్నకు సమాధానం ముఖ్యముగా ఆయన ఎన్నుకున్న కథావస్తువుపై ఆధారపడి వుంటుంది. రచయితగా ఆయనలోని సుగుణము తానెన్నుకున్న ఇతివృత్తమును గురించి ఆయనకు ఉన్న ప్రత్యక్ష పరిజ్ఞానము. ఆయన దృష్టిలో గ్రామసీమలు ఊహాచిత్రాలు కావు. ప్రజలు, పొలాలు, పంటలు, వ్యవసాయం, పన్నులు, ఆదాయం, రైతుల అప్పులు, కాలువలపై పన్నులు, పంటల నాశనము, కరువు, వరదలు, నడుములు విరిగేలా శ్రమించే వ్యవసాయ కూలీల కాయకష్టము – ఇవన్నీ కలబోసిన కటిక సత్యమే ఆయన దృష్టిలో పల్లెసీమలు. నవలా రచయితగా ఆయన విజయానికి ఇదే కారణం. తారాశంకరు – చరిత్రకారుని వలె ఒక జాతి ప్రజల ఉన్నతిని, పతనాన్ని, ఉనికిని, పునరుజ్జీవనాన్ని అసమాన ప్రతిభతో చిత్రించారు.

తారాశంకర్ బందోపాధ్యాయకు 1947 లో కలకత్తా విశ్వవిద్యాలయం శరత్ స్మారక పతకము బహూకరించింది. 1947 జులైలో ఆయన 50 వ జన్మదినం సందర్భంగా బెంగాలులోని రచయితలు ఆయనను గొప్పగా సన్మానించారు. 1951 లో రష్యాను సందర్శించమని వచ్చిన ఆహ్వానాన్ని ఆయన అంగీకరించలేదు. 1952 లో ఆయన రాష్ట్ర శాసనసభ సభ్యులుగా నియమింపబడ్డారు. 1955 లో పశ్చిమబెంగాలు ప్రభుత్వం ఆయనకు రవీంద్ర స్మారక పతకాన్ని ప్రదానము చేసింది. 1956 లో భారత ప్రభుత్వం చైనా రచయిత, లు–షూన్ వర్ధంతి ఉత్సవాలలో పాల్గొనటానికి ఆయనను చైనా పంపింది. కానీ అనారోగ్యం కారణము వలన రంగూన్ నుంచి



(Outputs) 14/10/08

వెనుకకు వచ్చారు. ఆ సంవత్సరమే సాహిత్య అకాడమీ బహుమతి లభించిందాయనకి. 1957 లో చైనా ప్రభుత్వ ఆహ్వానముపై ఆయన చైనాలో పర్యటించారు. 1958 లో ఆఫ్రికా–ఆసియా రచయితల సమావేశానికి ఏర్పాట్లను పర్యవేక్షించటానికి రష్యా వెళ్ళారు. ఆ సమావేశానికి భారత ప్రతినిధి వర్గానికి నాయకులుగా ఆయన తాష్కెంట్ వెళ్ళారు.

1959 లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఆయనకు 'జగత్తరిణి' స్వర్ణ పతకము లభించింది. మద్రాసులో జరిగిన అఖిల భారత రచయితల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 1960 లో రాష్ట్ర శాసనసభ సభ్యులుగా పదవీవిరమణ చేయగా, భారత రాష్ట్రపతి ఆయనను పార్లమెంటు సభ్యులుగా నియమించారు. 1962 లో భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మశ్రీ' ప్రదానం చేసింది. 1967 లో జ్ఞానపీఠ్ బహుమతి అందుకున్నారు. 1968 లో భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మవిభూషణ్' ప్రదానం చేసింది. ఆ సంవత్సరమే కలకత్తా విశ్వవిద్యాలయం, జాదవుపూరు విశ్వవిద్యాలయము ఆయనకు గౌరవ డాక్టరేటు పట్టాలనిచ్చి గౌరవించాయి.

1971 జూలైలో నాసికారంధ్రము, దవడ ఎముకలలోను 'సైనుస్' అనే వ్యాధితో ఆయన బాధపడటం మొదలైంది. ఆగస్టు 13 న అకస్మాత్తుగా కోమాలోకి వెళ్ళారు. సాయంత్రానికి తెలివిలోకి వచ్చారు. సెప్టెంబరు 16 వరకు బాగానే ఉన్నారు. వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. సెప్టెంబరు 17 ప్రభాత సమయములో తారాశంకర్ పరమపదించారు."

❋ ❋ ❋

# నిజం

"శ్రీరంగం శ్రీనివాసరావు నలుగురి మధ్యా సామినేమి ముద్దుకృష్ణను ఎద్దేవా చేశారు. ఆ నలుగురిలో పురిపండా అప్పలస్వామి, పూడిపెద్ది వేంకట రమణయ్య, శ్రీరంగం నారాయణబాబు ఉన్నారు – వైతాళికుల్లో అచ్చయిన గీతాలను ఎంపిక చేసింది కృష్ణశాస్త్రి కాని, ముద్దుకృష్ణ కాదని – ముద్దుకృష్ణకి కోపం వచ్చింది. శ్రీనివాసరావన్న దాంట్లో కొంత నిజం లేకపోలేదు."

**– అబ్బూరి వరదరాజేశ్వరరావు**

❋ ❋ ❋

# విమర్శ

"కట్టమంచివారి "కవిత్వతత్వ విచారం" వచ్చిన కొత్తలో దానిమీద చాలా ప్రతి విమర్శలు వచ్చాయి. కాళూరి వ్యాసమూర్తిశాస్త్రిగారు, అక్కిరాజు ఉమాకాంతంగారు, నోరి నరసింహశాస్త్రిగారు ఆ గ్రంథం మీద విరుచుకు పడ్డారు. వీరెవరూ రామలింగారెడ్డిగారు లేవనెత్తిన అంశాలకు



(Outputs) 14/10/08

జవాబు చెప్పలేదు. వీరు రామలింగారెడ్డిగారు పాశ్చాత్య సులోచనాలతో తెలుగు సాహిత్యాన్ని చూస్తున్నాడన్నారు. రెడ్డిగారు పెద్దపెద్ద పదవుల్లో ఉండటం చేత సాహిత్యంలో వారి మాట చెల్లుతోందన్నారు. కానీ కాలం వారిని పక్కకు నెట్టి ముందుకు సాగింది. ఆనాడే విశ్వనాథ సత్యనారాయణరావుగారు "రామలింగారెడ్డిగారు తమ 'కవిత్వతత్వ విచారము' రాసి విమర్శ పదాల్లో గొప్ప దృక్పథం కలిగించి నవ్యసాహిత్యానికి కొత్త బోదెలు తవ్వారు" అని చాలాకాలం క్రితమే అన్నారు. ఈనాడు చేకూరి రామారావు వంటివారు "కాలానికి అవసరమైన విమర్శ కట్టమంచిది. కాలగమనం ఇష్టం లేక అన్నీ తాటాకుల్లోనే ఉన్నాయనే తత్వం ఆయన వ్యతిరేకులది" అంటున్నారు."

**– వల్లంపాటి వెంకట సుబ్బయ్య**

❋ ❋ ❋

# సీస పద్యము

"వేయిపడగలు నవలలో తెలుగు సాహిత్యంలో శ్రీనాధుని గూర్చి చర్చ వచ్చినప్పుడు ఏడవ అధ్యాయంలో ధర్మారావు శ్రీనాధుడు సీస పద్యములను పాడు చేశాడని అంటాడు. ప్రక్కనే ఉన్న రాఘవరావు ఆ మాట వినగానే ధర్మారావుని చెంప పగులగొట్టాడు. శ్రీనాధుడు లేకపోయినచో సీస మంత దౌర్భాగ్య దశకు రానేరాదని ధర్మారావు నిశ్చితాభిప్రాయము. ఆ మాటంటే ఎవరైనా ఊరుకోరు. ఊరుకోకపోవటాన్ని రాఘవరావు పాత్ర చూపిస్తుంది. అయినా ధర్మారావు మారడు. లోకంలో అందరికీ ఇది విశ్వనాధవారి అభిప్రాయమని తెలిసిన సంగతే. ఒకచోట విశ్వనాథవారి ఉపన్యాసంలో ఈ యంశము రాగా, మర్నాడు పత్రికలు దానిని ప్రచురించినవి. దానిని చూచి అప్పటి ఆస్థాన కవి శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు కోపించి దానిని నిరూపించమని అడుగుతూ పత్రికలో ఉద్ఘాటించారు. నేను స్వయంగా వచ్చి మనవి చేస్తానని విశ్వనాథ వారి సమాధానం. కాదు కాదు పత్రికలోనే తెలియజేయాలని శ్రీపాద వారి పునరుద్ఘాటన. అది అక్కడ ఆగింది. విశ్వనాథ వారికి తన వాదం తనకున్నది. కథా కదనశైలిలోని నన్నయ సీసాన్ని శ్రీనాధుడు రకరకాల వంకరులు తిప్పాడని ఎన్నో దోషాలు చేశాడని ఆయన అభిప్రాయం. అక్కడ కూడా దీనికి సంబంధించిన వాదాన్ని ఆయన చెప్పటం తరువాత పండితులనేకులు దానికి ప్రతివాదం చేయటం జరిగింది. ఇటువంటి వివాదాస్పదమైన విషయాలు విశ్వనాధ వారి జీవితంలో ఎన్నో...."

**– ప్రసాదరాయ కులపతి**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# మా భూమి


"సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు జంటగా రాసిన నాటకాలు ముందడుగు, అపనింద, మా భూమి. మా భూమి 1946 లో మొదటిసారి ప్రదర్శించబడింది. 1947 లో ప్రజాశక్తి ప్రచురణగా వెలువడింది. అప్పట్లో దాని వెల ఒక రూపాయి. మొదటి ప్రచురణ రెండు వేల ప్రతులూ ఒకటిన్నర నెలలో అమ్ముడయ్యాయి. 1948 లో రెండవ ముద్రణ నాటికి ఈ నాటకాన్ని ప్రదర్శించడానికి దాదాపు 125 నాటక దళాలు వివిధ జిల్లాలలో ఏర్పడి, అప్పటికే వెయ్యికిపైగా ప్రదర్శనలిచ్చాయి. సుమారు 20 లక్షల మంది ప్రజలు ఈ నాటకాన్ని అప్పటికే చూశారు. ఈ నాటక ప్రదర్శనా, నాటక బృందాలూ ప్రపంచ రికార్డును బ్రద్దలు చేశాయని కె.ఎ. అబ్బాస్ రాశారు.

ప్రజానాట్యమండలి రాష్ట్రదళం డా॥ రాజారావు నాయకత్వాన ఈ నాటకాన్ని బొంబాయి, అహ్మదాబాద్, పూనా, షోలాపూర్‌లలో 1948 జనవరిలో ప్రదర్శించింది. బొంబాయి నగరం నడిబొడ్డున వున్న సుందరీబాయి థియేటర్లో మతకలహాల వాతావరణంలో ప్రదర్శించారు. అహమ్మదాబాదులో అక్కడి బట్టల మిల్లులలో పని చేస్తున్న 20 వేల మంది ఆంధ్రా కార్మికుల కోర్కెపై ఉదయం పది గంటలకు ప్రదర్శించారు. అటు నుంచి పూనా ఆంధ్రా అసోసియేషన్ ఆహ్వానంపై పూనాలో ఉదయం పూట ప్రదర్శించారు. ఆ తర్వాత రోజు రాత్రి షోలాపూర్‌లో ఒక బట్టల మిల్లుకు చెందిన ఆరుబయట రంగస్థలంలో అర్థరూపాయి టిక్కెట్టు పెట్టి ప్రదర్శించారు. తెలంగాణా జిల్లాల నుంచి వచ్చిన లక్షా యాభైవేల మంది చేనేత కార్మికులు అక్కడి బట్టల మిల్లులలో పని చేస్తున్నారు. వారు మరో ప్రదర్శనను కోరినా నటుల తీవ్ర అనారోగ్యం వల్ల రాష్ట్రదళం తిరిగి వచ్చేసింది."

**– కొత్తపల్లి రవిబాబు**

*　　*　　*

# కృష్ణపక్షం



**దేవులపల్లి**

"1919 లో బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నంగారు నవ్యమానవీయ మతానికి గురువుగా, ప్రవక్తగా ప్రజల నాకర్షిస్తున్నారు. ప్రార్థనా సమావేశాలలో కృష్ణశాస్త్రి రచించి గానం చేస్తున్న ఏకేశ్వరోపాసన గీతాలను వింటున్నారు. కవిత్వంలో కొత్త సొగసులను రచిస్తున్నారు.

ఒకనాటి సాయంత్రం ప్రార్థనా సమావేశంకు కృష్ణశాస్త్రి రాలేదు. సమావేశానంతరం తారకంను పిలిచి అడిగారు "అవునూ, మన కృష్ణశాస్త్రి తన కవితా సంపుటిని ప్రచురించడేమీ ?"



(Outputs) 14/10/08

"కృష్ణశాస్త్రి దగ్గర ప్రస్తుతం డబ్బు లేదట!" అన్నారు తారకంగారు.

"అదేమయ్యా, వెయ్యితులాల బంగారం ఏమైపోయింది ?" అది గురువుగారు అడగ వలసిన ప్రశ్న కాదు, తాను చెప్పవలసిన అవసరమూ లేదు. ధన, కనక, వస్తు వాహనాలు ఎలా వస్తాయో, ఎలా వెళతాయో! కొబ్బరికాయలో నీళ్ల బాపతు – అనుకున్నారు. మౌనంగా తారకం చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

"పోనీ ఎంతవుతుందో నేనిస్తాను, కృష్ణశాస్త్రి కవితా సంపుటిని ప్రచురించమను" అన్నారు బ్రహ్మర్షి.

అలాగే నన్నారు తారకం. ఆ సమావేశం ముగిసింది. అప్పటికి కృష్ణశాస్త్రి రాజమండ్రిలో ఉపన్యాసానికి వెళ్ళి వున్నారు. రాగానే తారకం కలుసుకున్నారు. గురుదేవులు చెప్పిన విషయం అందజేశారు.

కృష్ణశాస్త్రికి పౌరుషం వచ్చింది. "ఆయనేం ఇవ్వక్కర్లేదు. నేనే అచ్చువేస్తాను" అన్నారు. వారి అన్నగారు శివశంకరశాస్త్రితో కలసి అప్పటికే రాసి రాశిగా పడి వున్న కవితల నుంచి మంచివి ఎన్నిక చేశారు. కవితా సంపుటికి పేరు ఆలోచించారు. ఏకాంతంలో కృష్ణపక్షం అని పెట్టారు.

ఏమిటి కృష్ణపక్షం ? శివశంకర్లు తర్జనభర్జనలో పడ్డారు. ఈ కావ్యంలో నాయకా నాయికలు లేరు. వారి పేర్లని బట్టి ఈ కావ్యానికి ఈ పేరు రాలేదు. పోనీ విషయము కృష్ణపక్షముకు చెందినది కాదు. ఇందలి అరవై ఖండకావ్యాల్లో కృష్ణపక్షమనే శీర్షిక కనిపించదు. కృష్ణపక్షాన్ని వర్ణించే కవిత కనిపించదు. మరి ఈ కావ్య నామం ఎలా ఏర్పడింది ?

'రూపకప్రాయమై సౌమ్యమైన సాంకేతిక నామం కావచ్చు. కవి కృష్ణశాస్త్రి కావడం వల్ల కవిత్వం విశేష భాగం కరుణ రసాత్మకం కావడం వల్ల బహుశా కృష్ణపక్షం అనే పేరుపెట్టి ఉంటారు' అన్నారు. నిజానికి ఈ అన్ని కారణాలకూ అవకాశం లేకపోలేదు. ఇవి ఏవీ కృష్ణశాస్త్రి ఉద్దేశించినవి కావు. తాను ప్రారంభించిన నాటి నుండి ఇక ముందు తెలుగు కవిత్వం తన పక్షమై ప్రవర్థిల్లుతుంది! అన్న ఆత్మవిశ్వాసంతో ఆయనీ పేరు పెట్టారు."

**– ఆవంత్స సోమసుందర్**

* * *

# బారిష్టరు పార్వతీశం

"1922 లో మొక్కపాటి నరసింహశాస్త్రిగారు తమ మామగారి ఊరయిన గుమ్ములూరు వెళ్లారు. అప్పటికే ఆయన 'పిలక', 'నేనూ మా ఆవిడ', 'లక్ష్మి' అనే కథలు వ్రాసి వున్నారు. మొదటి రెండు 'సాహితి' అనే పత్రికలో, మూడవది 'భారతి'లో అచ్చయినవి. రచయిత, హాస్య



(Outputs) 14/10/08



మొక్కపాటి

సంభాషణ చతురుడు కావడం వల్ల ఆయన బావమరుదులు, మరదళ్లు, చుట్టుప్రక్కల ఉన్న కుర్రాళ్ళు ఆయన చట్టూ మూగి ఏవో సరదా కబుర్లు చెప్పమని కోరారు. శాస్త్రిగారు తన విదేశ ప్రయాణ అనుభవాలు కొన్ని, విన్నవి, కన్నవి, ఊహించినవి, మరికొన్ని తమాషాలు, హాస్య సన్నివేశాలు కలిపి ఒక కుర్రాడికి అంటకట్టి కథానాయకుణ్ణి చేసి వారికి వినిపించారు. వారు చాలా సంతోషించి, ఎలాగూ కథలు వ్రాసే అలవాటుంది కనుక ఇదంతా ఒక కథగా వ్రాస్తే బాగుంటుందని సూచించారు. మొక్కపాటి వారికి ఆ సలహా నచ్చింది.

1924 డిసెంబరు మొదట్లో గుంటూరు వెళ్ళిన శాస్త్రిగారు తన మిత్రులు తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, శ్రీనివాస శిరోమణి మొదలైన వారికి ఆ కథ చెప్పారు. వారు చాలా బాగుందని, పూర్తిగా వ్రాయమని ప్రోత్సహించారు. మొక్కపాటి వారు చెప్పగా, శ్రీనివాస శిరోమణి వ్రాయగా కథ పూర్తయింది. శివశంకర శాస్త్రిగారప్పుడే కుర్రాడికి అంటే కథానాయకుడికి 'పార్వతీశం' అని నామకరణం చేశారు. వెంటనే విజయవాడ శారదా ప్రెస్‌లో అచ్చయి, అదే నెల 24 న తెనాలి సాహితీ సమితి ప్రథమ సమావేశంలో ఆవిష్కరించబడ్డది. అప్పుడొక గమ్మత్తు విషయం జరిగింది. పుస్తకం చివర ఎవరు వ్రాశారో ఏమో ప్రథమభాగం సమాప్తమని అచ్చుపడింది. శాస్త్రిగారు గానీ, శ్రీనివాస శిరోమణిగాని వ్రాసింది కాదు. ఏమైతేనేం అది పార్వతీశానికి ఎంతో భవిష్యత్తు నిచ్చి అతని మేధాసంపదని, ప్రయోజకత్వాన్ని చెప్పే మరి రెండు భాగాల రచనకు కారణమయింది. మొదటి భాగం వచ్చిన నలభై సంవత్సరాలకు నార్ల వెంకటేశ్వరరావుగారు దాన్ని ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురిస్తూ, మిగిలిన నాలుగు భాగాలు వ్రాయమని ప్రోత్సహించారు. మొక్కపాటివారు చెప్పగా కప్పగంతుల రాజేశ్వరి, ఇంద్రగంటి శ్రీకాంతశర్మలు లేఖకులుగా మిగిలిన రెండు భాగాలు పూర్తయినాయి. 1971 లో మూడు భాగాలు ముద్రించబడ్డాయి."

**– పింగళి వెంకట కృష్ణారావు**

(రేడియో ప్రసంగం నుండి)

❋ ❋ ❋

"పెన్నానది పరీవాహక ప్రాంతంలోని జన జీవితాన్ని కరుణరసార్ద్ర హృదయంతో రచించిన కన్నీటి పాటే విద్వాన్ విశ్వంగారి పెన్నేటిపాట. రాయలసీమలోని పెన్నేటిగట్టున ఉన్న పల్లె జనం బతుకుల నీడ ఇందులో ఉంది. వారి జనజీవనం, పేర్లు, పలుకుబడులూ ఇందులో ఉన్నాయి. రాయలసీమ జన జీవితాన్ని ప్రతిబింబించిన తొలి కావ్యం ఇది. దీన్ని 1956 లో తెలంగాణా రచయితల సంఘం వారు ప్రచురించటం విశేషం. శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు పీఠిక రాసినారు."

❋ ❋ ❋



(Outputs) 14/10/08


"పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారి జీవిత చరమదశ చాలా దుర్భరంగా గడిచింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిఠాపురం రాజావారికి వీరిపై ఎందుకో అనుగ్రహం తప్పింది. మామూలుగా ఇచ్చే గౌరవవేతనం నూట పదహారు రూపాయలు ఆగిపోయాయి. ఆ మహాకవి దుస్థితి ఏమిటో యర్రమిల్లి లక్ష్మీనారాయణగారు ఆంధ్రపత్రికలో ప్రకటించిన లేఖలోని పానుగంటి వారి మాటలే చెబుతాయి.

"నాకెవరూ దాన ధర్మము చేయనక్కరలేదు. తగ్గింపు ధరలకు యాభై సెట్ల పుస్తకాలు యాభైమంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును."

మరొకసారి ఈ దేశంలో కవితా శ్రీనాధునికి ఈ దుస్థితి పట్టింది."

❋ ❋ ❋

## వడపోత


టాల్‌స్టాయ్

"టాల్‌స్టాయ్ తెలుసు కదా, ఆయన రాత ఏమీ బాగుండదు. పైగా, ఆయన రాసేది కూచుని కాదు. గదిలో పచార్లు చేస్తూ – గదిలో గోడకు ఒక డెస్క్‌ను అమర్చుకున్నాడు, తాను నిలబడి రాసేందుకు వీలుగా. అలా ఆయన గీచిన చిత్తు ప్రతికి ఆయన భార్య శుద్ధప్రతి తయారు చేసేది. మళ్లీ చదివేవాడు టాల్‌స్టాయ్. మళ్ళీ వడపోత ప్రారంభం. అది మూడు దఫాలుగా జరిగేది. మూడుసార్లూ సాపు రాసేది అర్ధాంగి. అంతటితో వడపోత ఆగేదా ? ప్రెస్‌లో ఇచ్చిం తర్వాత కూడా 'ఫలానా మాట మార్చండి, ఫలానా మాట చేర్చండి' అంటూ పబ్లిషర్‌కు టెలిగ్రామ్‌లు పంపేవాడు టాల్‌స్టాయ్. ఆంగ్ల కవి 'రుడ్‌యార్డ్ కిప్లింగ్' ఓసారి అన్నాడట – 'రచయితగా తన విజయానికి కారణం, తాను చేసిన రచనలను వడపోసి, పదో శాతం మాత్రమే ప్రచురించడం' అని."

– నార్ల

('నాస్తికబాబా' నార్ల, సినారేతో ఓ సందర్భంలో)

❋ ❋ ❋

## పాశ్చాత్య సాహిత్యం

"రాండమ్ హౌస్ అనుబంధ శాఖ అయిన మోడరన్ లైబ్రరీ సాహితీవేత్తలతో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో మయాంజెలాన్ (MAYAAMGELON) డేనియల్, జె. బూర్టిన్ (DANIAL J. BOORSTIN), ఎ.యస్. బ్యాట్ (A.S. BYATT), క్రిష్టోఫెర్ సెర్ఫ్(CRISTOPHER



(Outputs) 14/10/08

CERF), షెల్బీఫూటి (SHELBY FOOTE), వర్టన్ గ్రెగోరియన్ (VARTAN GREGORIAN), ఎడ్మండ్ మోరిస్ (EDMUND MORRIS), జాన్ రిచర్డ్సన్ (JOHN RICHARDSON). ఆర్దర్ స్కెల్సింగర్ (ARTHUR SCHILESINGER), జూనియర్ విలియమ్ స్టిరాన్ (WILLIAM STYRON), గోరెవిడాల్ (GOVEVIDAL) ఉన్నారు. వీరికప్పగించిన పని ఈ శతాబ్దంలో ఇంతవరకు వచ్చిన వంద అతి మంచి నవలలు ఎంపిక చేయడం. వీరు అనేకమంది నిష్ణాతుల సలహాలు స్వీకరించారు. వీరు ఎంపిక చేసిన వంద నవలలో జేమ్స్ జాయిస్ రచించిన 'యూలిసీజ్' ప్రథమస్థానం ఆక్రమించింది. దీనితోపాటు మరో నాలుగు నవలలు కూడా ప్రథమస్థానం కోసం పోటీపడ్డాయి. ఈ ఐదింటిలో దేనికి ప్రథమస్థానం ఇవ్వాలో అర్థం కాలేదు. మళ్లీ మళ్లీ పునర్విమర్శించుకుని చివరకు యూలిసీజ్‌కే ప్రథమస్థానం ఇచ్చారు.

మోడరన్ లైబ్రరీ సంపాదకవర్గ అధ్యక్షుడు సెర్ఫ్ (CERF). ఇతడు మోడరన్ లైబ్రరీని, రాండమ్ హౌస్ (RANDOM HOUSE) ను కొన్న బెనెట్ సర్ఫ్ (BENNET CERF) కొడుకు. అతడన్నాడు – "కాలం మీద నిలిచిన, గొప్ప గుణం ఉన్న నవలలనే ఏరడానికి ప్రయత్నం చేశాము."

స్కాట్ ఫిట్జరాల్డ్ (SCOTT FITZERLD) రాసిన 'THE GREAT GATSTT' రెండవదిగా, జేమ్స్ జాయిస్ రాసిన "A POSTRAIT OF THE ARTIST AS A YOUNG MAN" మూడవదిగా, నాల్గోది వ్లాదిమిర్ నబకోవ్ (VLADIMIR NABAKOV) రాసిన "లోలిట", ఐదో స్థానం ఆల్డస్ హక్స్లీ రాసిన "BRAVE NEW WORLD" కు వచ్చింది."

❋ ❋ ❋

# సందేశం

"నవీన కేరళ సాహిత్యంలో త్రిమూర్తులనదగినవారు కుమారన్ ఆసన్, ఉల్లూర్ పరమేశ్వర అయ్యర్, వల్లథోల్ నారాయణ మీనన్. కుమారన్ ఆసన్ మృతి వల్ల ఏర్పడిన లోటును వెనువెంటనే పూరించిన ఘనత మహాకవి జి. శంకరకురూప్‌కు చెందుతుంది. 3–6–1961 న షష్టిపూర్తి జరిగింది. రచయితలకు ఆయన ఇచ్చిన జన్మదిన సందేశం – "ఆహ్లాదపరచడమొక్కటే సాహిత్యానికీ కళలకూ ఏకైక లక్ష్యం కాదు. మానవ హృదయాలను వేరుపరచే అడ్డంకులను తోసిరాజని, తన భావాల ద్వారా, భావన ద్వారా వాటిని సమైక్యం చేసి, విశ్వైక్య స్వప్న సాధన కొరకై, శోభామయమైన మానవ జీవితాన్ని రచయిత సృష్టించగలగాలి. మానవ జీవితాన్ని పూరా విప్పార నివ్వకుండా మతము, జాతి, వర్గ చైతన్యములనేవి నేడు అవరోధాలు కల్పిస్తున్నాయి. ఈ అనైక్యతా కళంకాలను తగ్గించి తుడిచివేయగలిగింది, కవి యొక్క సార్వజనీనానుభూతి మాత్రమే. విజ్ఞానశాస్త్ర సత్యాలను, నైతిక మూల్యాలను, స్వీయోద్రేకాగ్నితో కరిగించి కలగలిపి, నవ్య ప్రపంచ దృష్టికి కవి సాధన చెయ్యాలి. అతని కళాధ్యేయం ఇదే కావాలి".

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# ఉత్తమ వ్యసనం

“పుస్తకాలు కొనడమంటే నాకు చెడ్డ సరదా. జేబులో డబ్బున్నా, లేకపోయినా, మంచి పుస్తకం కంటబడగానే బేరం చేస్తాను. అది పదేపదే పని పడగల పుస్తకం కావచ్చు, ఒకసారి చదివిన తర్వాత మరి పనికిరానిది కావచ్చు. అయినా దాన్ని కొనేదాకా మనస్సు రెపరెపలాడుతుంది. అప్పుచేసి కూడా పుస్తకాలు కొనడం అనేకసార్లు సంభవిస్తూ వుంటుంది. ఉప్పూ, పప్పూ, గుడ్డా గుడుసూ, మందూ మాకూ అవసరాలు కూడా మరిచిపోయి, పుస్తకాలు కొనడం, తర్వాత పస్తాయించడమూ మామూలైపోయింది. ఎప్పటికప్పుడు పుస్తకాల షాపుల వైపుకు మరి వెళ్ళరాదు అనుకుంటాను. కాని ఏం లాభం ? ఉదయాన్నే “ఇక కల్లు ముట్ట”నని వొట్టు వేసుకొని సాయంత్రం కాగానే కల్లుపాక దగ్గరకి తయారయ్యే తాగుబోతు మాదిరిగా, మళ్ళీ నాలుగైదు రోజుల నాటికే పుస్తకాల షాపుల వద్ద హాజరౌతాను. ‘ఇది వ్యసనం సుమా!’ అంటారు కొందరు మిత్రులు. కావచ్చు, కాని ఉత్తమ వ్యసనం.

“ఎరవు పుస్తకం వల్ల కలిగే ఆనందం బహు స్వల్ప”మని స్టాన్లీ బాల్డ్విన్ అన్నాడు. ఈ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. సొంతపుస్తకాన్ని ఒక్కబిగిని చదివి వెయ్యవలసిన అగత్యం వుండదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎంత కావాలంటే అంతే, తాపీగా చదువుకోవచ్చు. పంజాబ్ కేసరి లాలాలజపత్‌రాయ్, ఒకనాడు లాహోర్ నుంచి ఢిల్లీకి ప్రయాణం చేస్తున్నాడు. పెద్ద ప్రయాణం, ఉబుసుపోదు. అందుచేత ఇన్ని పుస్తకాలు వెంట తీసుకు బయలుదేరాడు. రైలు సాగారిన వెంటనే రుడియార్డ్ కిప్లింగ్ నవల “కిం” ను తీసి, చదవడం ప్రారంభించాడు. పది, పదిహేను పేజీలు చదివాడో లేదో, అది భారతజాతిని నిరసిస్తున్న ధోరణి ఆయనకు చెడ్డ వెగటు పుట్టించింది. పట్టరాని కోపంతో పుస్తకాన్ని పరుగెత్తుతూ ఉన్న రైలు కిటికీగుండా గిరాటుకొట్టాడు. కాని అంతలోనే అది యెరవు తెచ్చిన పుస్తకమని జ్ఞాపకం వచ్చి నాలుక కరుచుకున్నాడు.”

**– నార్ల వెంకటేశ్వరరావు**

* * *

# విజ్ఞాన సర్వస్వం

“అయిదు సంపుటాలుగా వెలువడిన రాహుల్ సాంకృత్యాయన్ ఆత్మకథ, సమగ్రమైన జీవితచరిత్రలు, జీవితగాథలకి చెందే రేఖాచిత్రాలు సంకలనం చేయబడ్డ పదిహేడు సంపుటాలు– రాహుల్ చేసిన సాహిత్య వచన రచనల్లో ప్రముఖ స్థానాన్ని అలంకరిస్తాయి. ఆయన ఆత్మకథ 2814 పేజీలను విస్తరించి ఉంది. ‘భారతదేశంలోను, విదేశాలలోను, వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు సృష్టించిన రాజకీయ, సాంఘిక, సాహిత్య, చారిత్రక పరిస్థితుల్ని తెలియజేసే విజ్ఞాన సర్వస్వమే ఆ గ్రంథం” అని కీ.శే. శివచంద్రశర్మ ప్రశంసించారు.



(Outputs) 14/10/08

ఇంకో నాలుగు సంపుటాలు కూడ ఆయన జీవితగాథకి సంబంధించినవే. 'బచ్‌పన్ కే స్మృతియా' లో ఆయన చిన్ననాటి ముచ్చట్లు కనిపిస్తాయి. 'అతీత్ సె వర్తమాన్'లో ఆయన కలుసుకున్న మహావ్యక్తుల్ని, మహామేధావుల్ని గురించిన జ్ఞాపకాలు, వ్యాసాలు ఉన్నాయి. సహాయ నిరాకరణోద్యమానికి సంబంధించిన తమ జ్ఞాపకాలని 'మేరి అసహాయ్ యోగ్ కె సాథీ' అనే గ్రంథంలో వివరించారు. 'జిన్ కే మె కృతజ్ఞ'లో తమకి బాగా తెలిసిన ఏభైఒక్క మంది మహామేధావులకి ఆయన అర్పించిన భక్తిపూర్వకమైన నివాళులు కనిపిస్తాయి."

**– గారపాటి పాండురంగ మోహన కుమార్**

❋ ❋ ❋

# విశ్వకవి

"మూడురోజులు అసిత్‌కుమార్ హాల్దార్‌తో కలసి లక్నోలో తిరుగుతూ కాలం గడిపిన తరువాత, రవీంద్రుడు అలహాబాద్ నుంచి కారులో లక్నో వచ్చి ప్రభుత్వపు అతిథి గృహంలో బస చేసినట్లు తెలిసింది. ఒకటి రెండురోజులు సభలు, సన్మానాలు వీటితో హడావిడిగా వుంది. ఈ సందడి తగ్గిన తరువాత నన్ను ఆ విశ్వకవికి పరిచయం చేస్తానన్నారు హాల్దార్. ఒక మధ్యాహ్న సమయాన ఎవరులేని తరుణం చూచి మేముభయులం ప్రభుత్వ అతిథి గృహానికి వెళ్ళి రవీంద్రుని దగ్గర కూర్చున్నాం. నన్ను పరిచయం చేసిన తరువాత రవీంద్రుడు, నేను కొన్ని నిమిషాలు బెంగాలీలో మాటాడుకున్నాం. తదుపరి రవీంద్రుని బెంగాలీ కవితలు రెండు ఆయనకు వినిపించాను. ఒక వంగేతరుని నోటివెంట తన స్వీయ వంగ కవితలను విని విశ్వకవి అమితానందం పొందారు, ప్రశంసించారు. అప్పటికే ఆయన జీవితం అస్తగత సూర్యుని విధంగా వాలిపోతూంది. ఆరోగ్యం సరిగా లేదు. వెనుకటి ఫొటోగ్రాపులో చూచిన రవీంద్రుని రసరూపం ఇప్పుడాయనలో లోపించింది. తాను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లోగడ మానవుడు అనే విషయం మీద ఉపన్యాసాలు ఇచ్చినప్పటి విశేషాలను గురించి ముచ్చటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చాలా సుందరమైన ప్రదేశంలో ఉందన్నారు.

నేడు ఆయన సమక్షంలో కూర్చున్నానని గుర్తువచ్చి నిజంగా ఆయన ఉనికిలో వున్నానా ? లేక ఇదొక స్వప్నమా ? అనిపించింది. కొంతసేపయిన తరువాత ఆయనను శ్రమపెట్టకూడదని మేము లేచాము. రేపు తన ఇంటికి భోజనానికి తీసుకువెడతానని హాల్దార్ తన తాతగారిని అడిగారు. అందుకు రవీంద్రుడు నవ్వి భోజనాలకు వచ్చే తరుణం తప్పిపోయింది. పథ్యంతో కూడిన ఏవో కొన్ని ప్రత్యేకమైన తేలిక పదార్థాలు తప్ప మరేమీ తీసుకోడం లేదు కనుక తనను భోజనానికి తీసుకువెళ్ళవద్దని, తిరిగి ఎల్లుండి కలకత్తా వెళ్ళిపోతానని చెప్పారు. ఆయన వద్ద సెలవు తీసుకుని మేము బంగళాకు వెళ్ళాము."

**– సంజీవదేవ్**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# దేవదాసీలు

"రాజరాజచోళునిచే తంజావూరులో నిర్మింపబడిన బృహదీశ్వరాలయంలో 'తేలిక్ చేరి పెండుగల్' అనే పేరిట 400 మంది దేవదాసీలు నియమింపబడినారనీ, దేవస్థానానికి చెందిన ఉచితగృహాల్లో (FREE QUARTERS) వీరు నివసించేవారనీ, దేవాలయ భూములకి చెందిన మాన్యాలు వీరికివ్వబడేవనీ క్రీ.శ. 1004 నాటి శాసనాల ద్వారా తెలుస్తుంది. దాదాపు ఈ విధమైన ఏర్పాట్లే నాటి దేవాలయాన్నిటిలో వుండేవి. 18 వ శతాబ్దం ప్రథమదశలో - కాంచీపురంలోని గుడిలో 100 మంది దేవదాసీలుండేవారు. అలాగే మధురమీనాక్షి ఆలయలంలో కూడా వందల సంఖ్యలోనే వుండేవారు. వీరి జీవనోపాధికోసం వేతనములూ, ఇనాముల రూపంలో దేవస్థాన ఆదాయం నుండి డబ్బు ఇవ్వబడేది. ఉదయ - అస్తమయ సమయాల్లో దేవుడికి కుంభహారతి ఇవ్వడం, ఉత్సవ సమయాల్లో దైవ విగ్రహాలకు చామరలతో విసరడం, నృత్యగానాలతో ఉత్సవం వెంట వెళ్ళడం, దేవాలయాల్లో అన్నమయ్య, క్షేత్రయ్య, జయదేవుడు లాంటి మధురశృంగారకవులు రాసిన పచ్చి బూతు పదాల్నీ, అష్టపదుల్నీ అభినయిస్తూ నాట్యం చేయడం - వీరి విధులు. వారి వారి అంతుస్తుని బట్టి రాజుగారికో, రాజమంత్రికో, ఆస్థాన కవీశ్వరునికో, దేవాలయ ధర్మకర్తకో, గుడిపూజారికో వీరు ఉంపుడుకత్తెలుగా వుండి, గొలుసులోని కుక్కల్లా జీవితాలు గడిపారు. కాకతీయ సామ్రాజ్య చక్రవర్తియైన ప్రతాపరుద్రుని వేశ్యాప్రియురాలి పేరు - మాచలదేవియనీ, రెడ్డిరాజుల బ్రాహ్మణ మంత్రియైన బెండపూడి అన్నయామాత్యుడు పచ్చి ముండల ముఠాకోరనీ, కవిసార్వభౌముడైన శ్రీనాధుడు - కలియుగ శ్రీకృష్ణ భగవానుడేనని చరిత్ర వేనోళ్ళ చాటి చెప్పింది.

ప్రభుత్వంచే కంట్రోలు చేయబడే సంస్థల ఆధ్వర్యాన ఈ దేవదాసీలు జీవించేవారనీ, వీరిద్వారా వొచ్చిన ఆదాయం రక్షకభటుల నిర్వహణకి వినియోగింపబడేదనీ క్రీ.శ. 15 వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యం సందర్శించ వచ్చిన పారశీక రాయబారి అయిన అబ్దుల్ రజాక్ రాశాడు. వేశ్యావృత్తిని అత్యంత దారుణంగా హిందూ ధర్మశాస్త్రాలు గర్హించినా, వేశ్యల్ని పతితలూ - భ్రష్టులూ - పాపకూపాలు- నరకద్వారాలూగా విమర్శించినా, హిందూమతము, హిందూ దేవాలయమూ - వీరిని తనలో అంతర్ భాగంగా చేసుకోవడం సిగ్గుచేటైన విషయం."

**- సి.వి. (సి. విజయలక్ష్మి)**

*　　*　　*

# సులభ బోధన

"ప్రొఫెసర్ రంగాగారు జైలుకు రాగానే చాలామంది యువకులకు ఉత్సాహం కలిగింది. ఆచార్య రంగా వద్ద ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చునని అనుకున్నారు. కారల్‌మార్క్స్ వ్రాసిన 'కాపిటల్' (పెట్టుబడి) అనే ఆర్థిక రాజకీయ గ్రంథాన్ని బోధించమని కొందరు రంగాగారిని



(Outputs) 14/10/08

ప్రార్థించారు. రంగాగారు సమ్మతించలేదు. కారల్‌మార్క్స్ గారి కొన్ని అభిప్రాయాలతో తాను ఏకీభవించడం లేదని వారి ఆక్షేపణ. 'మరీ మంచిది. మీ ఇద్దరి అభిప్రాయాలు మాకు తెలుస్తవి. తప్పక మీరే క్లాసు తీసుకోవాల'ని ఎంతో బ్రతిమలాడిరి. కాని, రంగాగారు అంగీకరించలేదు. రంగాగారు ఇంతగా ఎందుకు సంకోచించాలి ? అని అందరికీ ఆశ్చర్యం. ఆయనను అడిగినవారు కమ్యూనిస్టులా ? కాదు. కార్మికసంఘాలలో పని చేయుచుండిన కాంగ్రెసువాదులు, యువకులు, జైలుకు వచ్చినవారు. డాక్టర్ పట్టాభిగారు జైలుకు రాగానే రాజకీయ విషయాలలో జైలులో ఉన్నంతకాలం జోక్యం కలుగజేసుకోనని ఖచ్చితంగా చెప్పేశారు. మరి క్లాసులు తీసుకోగలవారు కాంగ్రెసు నాయకులలో లేరు.

అటు తరువాత డాక్టర్ కె.బి. కృష్ణ Ph.D., (కాట్రగడ్డ బాలకృష్ణ) గారు జైలుకు వచ్చారు. వారు మాకు క్రొత్త. వారిని గురించి వివరాలు తెలియవు. రాజకీయశాస్త్రంలో గొప్ప పండితుడని మాత్రం విని వున్నాం. యువకులు 'ది కాపిటల్' గ్రంథాన్ని బోధించమన్నారు. 'మీ యంతట మీరే నేర్చుకొనవచ్చునే, కష్టం లేదే' అని వారు అంటే, అందరికీ ఆశ్చర్యం కలిగింది. బోధించడానికి ఒప్పుకొని మరునాడే క్లాసు ప్రారంభించారు. ఎంతో సులభంగా బోధించారు. ఆయన శక్తి మాకు ఆశ్చర్యంగా వుంది. ఆచార్య రంగా గారు కూడా విద్యార్థిగా చేరారు. అంతేకాదు, కాంగ్రెసు నాయకులు చాలామంది చేరారు. అయితే పట్టాభి మొదలైన నాయకులు వారిని వెళ్ళకూడదని నివారించారు. కృష్ణగారు 'ఇండియాలో మైనారిటీల చరిత్ర' (THE HISTORY OF THE MINORITIES IN INDIA) అనే గ్రంథాన్ని వ్రాసినవారు. ఆయన రాజకీయ, ఆర్థిక శాస్త్రాలలో పారంగతుడు. వేదాంతశాస్త్రంలో అసమాన పాండిత్యం కలవారు. చరిత్ర పఠనలో ఆరితేరినవారు. ఆయనది చాలా నిశితమైన బుద్ధి. ఏ విషయాన్నైనా శాస్త్రీయంగా యోచించి పరిష్కరించగల మేథావి. వారి సహాయంతో డెటిన్యూల క్యాంపు ఒక సర్వకళాశాలగాను, విప్లవ కళాశాలగాను మారింది."

**– దరిశి చెంచయ్య**

(డా. కృష్ణతోపాటు 1940–42 లో డిటెయిన్ చేయబడిన ప్రముఖులు – డా. పట్టాభి సీతారామయ్య, ఎన్.జి. రంగా, ఎ.కె.గోపాలన్, నీలం సంజీవరెడ్డి, దరిశి చెంచయ్య, కంభంపాటి సత్యనారాయణ, కామరాజు నాడార్)

* * *

# శాంతి కుటీరం

"ఆచార్య వినోబాభావేగారు నన్నొక ఉదయమున రాయవేలూరు జైలులో "కాళేశ్వరరావు జీ! మీరు ఉపనిషత్తులను గురించి యొక గ్రంథమును వ్రాయుచున్నారని తెలిసినది. మీరు ఏరుకున్న ఉపనిషన్మంత్రములను నాకు చూపించగలరా ?" అని అడిగారు. "ఇంకా వాటిని గ్రంథముగా ప్రచురించవలెనో లేదో నిశ్చయించుకోలేదు. కాని కొన్ని ఉపనిషన్మంత్రములను



(Outputs) 14/10/08

కొన్ని కొన్ని భావముల క్రింద ఏరి నా నోట్‌బుక్కులలో నా స్వలాభము కొరకే, నేను వల్లించుట కొరకే వ్రాసుకున్నాను” అని చెప్పి వాటినన్నిటినీ వారికి చదివి, వినిపించి – నేను వ్రాసిన ఇంగ్లీషు తెలుగు అర్థములను కూడా వారికి వివరించితిని. ఒకటి రెండుచోట్ల మాత్రము నా అర్థములను వారు సవరించిరి. మిగిలిన వాటి అర్థములన్నిటితోను వారు ఏకీభవించిరి. ఇంకను నాలుగైదు మంత్రములను చేర్చవలసినదని వారు సెలవివ్వగా వాటిని కూడా ఇంగ్లీషు, తెలుగు అర్థములతో నా నోట్‌బుక్కులో చేర్చితిని. ఉపనిషత్పాఠము అని ఆ గ్రంథమునకు పేరు పెట్టితిని. మొదటిపాఠము సత్యాన్వేషణము, రెండవ పాఠము సృష్టిక్రమము, మూడవ పాఠము పరమాత్మ, నాలుగవ పాఠము జీవాత్మ, ఐదవ పాఠము పరమాత్మను పొందు మార్గములు, ఆరవ పాఠము మానవ ధర్మములు. వీటన్నిటిని ఈ విధముగ విభజించుటను కూడా వారంగీకరించిరి. వారు ఒక చిన్న ఉపోద్ఘాతమును కూడా హిందీలో వ్రాసి ఇచ్చిరి. తరువాత కొద్ది రోజులకే నేను విడుదలగుట, మద్రాసులో లక్ష్మీపతిగారి ఇంటి వద్ద కొన్ని రోజులుండి మందు పుచ్చుకుని బెజవాడ వెళ్ళుట, అక్కడ నుంచి నందిగామలో మా కుటుంబంతో కూడ నివాసమేర్పరచుకొనుట జరిగెను. నందిగామలో మా ఇంటికి ‘శాంతికుటీర’మని (PEACE COTTAGE) పేరు పెట్టితిని. ఇది చైనా స్వతంత్ర విప్లవ నాయకుడగు డాక్టరు సన్యటుసేను తాను తలదాచుకున్న చిన్న ఇంటికి పెట్టుకున్న పేరు. దానినే మా ఇంటికి పెట్టితిని. అదిగాక ఉపనిషత్తులు చదువుట వలన నాకు మనశ్శాంతి కలిగిన గృహము. ఈ కారణముచేత కూడా దానికి శాంతికుటీరమని నామకరణము చేసితిని. ఆ ఇంటిముందున్న వసారాలో వటవృక్ష ఛాయను కూర్చుని నాకు ఆరోగ్యము కుదిరినకొద్దీ మరల ఉపనిషత్పాఠముల వ్రాత నారంభించితిని. మంత్రములను వాని అర్థములను సరిచూచితిని. అందులో వేదకాల నిర్ణయము చేసి హిందూ నాగరికతను, పాశ్చాత్య కమ్యూనిస్టు నాగరికతను పోల్చి చూచితిని. ఉపనిషత్‌కథలను క్లుప్తముగా వ్రాసితిని. ఆఖరున ఒక అనుబంధం స్త్రీల స్థితిని గురించి, రెండవ అనుబంధం వర్ణభేదములను గురించి వ్రాసితిని. ఈ రెండు అనుబంధములను బృహదారణ్యకోపనిషత్తు మీద నాధారపరచితిని. 1944 వ సంవత్సర ప్రారంభమున ఆ పుస్తకము పూర్తియై, బెజవాడకు ముద్రణకుగాను పంపబడి త్వరలోనే ముద్రితమయ్యెను.”

**– అయ్యదేవర కాళేశ్వరరావు**

* * *

# స్వరాజ్య సంఘం

“ఆదివాసి వైతాళికులు వెన్నెలకంటి రాఘవయ్య నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా శింగపేట కుగ్రామంలో సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. స్కూలు ఫైనల్ పరీక్షలో కృతార్థుడయినట్టు తెలిసిన క్షణాన రాఘవయ్య సంతోషానికి అవధులు లేవు. జీవితంలో తొలిసారిగా సోడా త్రాగారు. పాత పాఠ్య పుస్తకాలను అమ్మివేసి కాఫీహోటల్‌లోకి దూరారు.



(Outputs) 14/10/08

మద్రాసు పచ్చయప్ప కళాశాలలో చదువుతున్న కాలంలో రాఘవయ్యగారు సెలవులకు ఇంటికి వచ్చారు. సెలవుల తరువాత కళాశాల కోసం రు. 50/–లను చందాలుగా వసూలు చేసుకుని మరల మద్రాసుకు పయనమయ్యారు. ఆ 50/– రు.లు ఎవరో జేబుదొంగ తస్కరించాడు. మద్రాసు సెంట్రల్ స్టేషనులో రైలుదిగి సామగ్రిని నెత్తిన పెట్టుకుని రెండుమైళ్లు నడిచి తంబుచెట్టి వీధిలోని గదికి చేరారు. 'తిక్కన వంశ' అనే కలం పేరు పెట్టుకున్న పాటూరు సుబ్బారావు, రాఘవయ్య, మరొకరు ఆ గదిలో వుండేవారు. ఇంటినుంచి నెలకు రు. 11/–లు వచ్చేవి. స్టౌ మీద రొట్టెలు కాల్చుకుంటూ నెలనెలా అయిదు రూపాయల చొప్పున పదినెలలలో కళాశాల చందాను కట్టివేశారు. మధ్యాహ్నం పూట అర్థణా పెట్టి జామపండును కొనుక్కుతిని, మంచినీళ్ళు త్రాగి పొట్ట నింపుకునేవారు.

రాఘవయ్యకు సేవికా వృత్తిపై వుండే మోజును తగ్గించి స్వతంత్ర జీవనానికి దారి చూపిన సంవత్సరం 1917. మనిషి ప్రాణాన్ని అయినా సరే తృణప్రాయంగా ఎంచి త్యాగమయ జీవి కావాలనే దృఢ సంకల్పానికి ఆయన వచ్చింది ఆ సంవత్సరమే. బాలగంగాధరతిలక్, మహాత్మాగాంధీ, అరవిందఘోష్ వంటి మహనీయుల పరిచయం కలిగింది ఆ యేడే. ఆ సంవత్సరమే తండ్రిగారు కాలధర్మం చెందారు. రాఘవయ్య వాటాగా శింగపేటలో మూడు ఎకరాల పొలం వచ్చింది. మద్రాసులో ఇంటర్మీడియెట్ చేరడానికి లోగడే ఎకరం అమ్మివేశారు. బి.ఏ. చదువుకు మరొక ఎకరం అయింది. వకీలు ఎఫ్.ఎల్. పరీక్షకు మిగిలిన ఆ ఒక్క ఎకరా హారతి కర్పూరమైంది. అంతేకాదు, తెరచాప పడవకు చుక్కాని విరిగినట్టు హఠాత్తుగా అర్ధాంగి అసువులు బాసింది. పోరాటమే ఊపిరిగా గల తలవంచని వీరుడు రాఘవయ్యగారు. రాజకీయాలను నమ్మిన తొలి యవ్వనదశలో నెల్లూరు జిల్లాలో 'స్వరాజ్య సంఘం' అవతరణకు దోహదించారు. శ్రీమతి పొణకా కనకమ్మ, బాలసరస్వతమ్మ, శ్రీయుతులు వేమూరి లక్ష్మయ్య, చతుర్వేదుల వెంకట కృష్ణయ్య, పట్నం వెంకట సుబ్బారెడ్డి, పొట్లూరు సుబ్బరామయ్య, గండవరపు హనుమంతరెడ్డి ప్రభృతులు దానిలో సభ్యులు."

❋ ❋ ❋

# ప్రేరణ

"మా పాఠ్య గ్రంథాలలో టాగూర్ రచించిన కథానిక 'కాబూలీవాలా' చాలా గొప్ప కథ. ఎత్తుగడే ఎంతో బాగుంటుంది. 'నేను'గా చెప్తాడు కథ. ఏమీ జరగదు. కాని వెనుక ఒక గంద్రగోళమైన సమాజం వుందన్న ధ్వని వుంది. ఆ కథలో మానవుడు ఏకాకి – కాని చిత్రం, సమాజం లేకుండా అతనికి జరగదు. అతన్ని జైలుకు తీసుకుపోతుంటె, ఆ పిల్ల పొందిన బాధ అందరిదీను. చదివినప్పుడల్లా నా కళ్ళంట నీళ్ళు తిరిగేవి. ఆ వేసంగిలో, మా ఇంట్లో ఎవరో ఒదిలేసి వెళ్ళిన మరో పుస్తకం టాగూర్ రచించిన నవల 'ది రెక్' అనేది. నేను ఊహలో టాగూర్ కల్పించిన జగత్‌లోకి జారుకున్నాను. అందులో వ్యక్తులు ప్రేమిస్తారు – కాని ప్రేమని



(Outputs) 14/10/08

– వాంఛని వితర్కించరు. సంప్రదాయాన్ని అతిక్రమించని వ్యక్తులు ఆ నవలలో వారు, కట్టుబాట్లకిలోనై వుంటారు. దేశభక్తి గలవారు – సమాజం శ్రేయస్సు కోరతారు. దాని కోసం తమ స్వంత సౌకర్యాన్ని త్యాగం చేసే స్వభావం వారిది. అందులో స్త్రీ పాత్రలలో ఒక అమాయకత్వం వుంది. వారు జీవితాన్ని – అందలి చెడుగునీ, అనర్థాన్నీ స్వీకరిస్తారు. ఆ పాత్రలు నాకెంత నచ్చాయి. ఈ విధంగా తిరుగుబాటు చెయ్యక జీవితాన్ని స్వీకరించేపాత్రని "కుముదం – నన్ను గురించి కథ వ్రాయవూ ?" అన్న కథలో చిత్రించాను. అందులో ఒకచోట కథ చెప్పే వ్యక్తి ఇల్లా అంటాడు కుముదం గురించి – "కుముదం లాంటి వ్యక్తులున్న ఈ సమాజానికి స్వాతంత్ర్యం లేకపోయిందంటే నాకు దిగులేస్తుంది" – అంటే ఈ కథ 1946 లో వ్రాసింది. మరోమారు అచ్చయినప్పుడు ఈ వాక్యాన్ని తొలగించాను. కథ పూర్తయింతర్వాత మరికొన్ని వ్యాక్యాలున్నాయి అందులో. "త్వరితంగా ముగిసిపోతున్న వెనకటి శతాబ్దిలో వ్యక్తి కుముదం. ఈ శతాబ్దిలో అట్లాంటి వారు వుండరు" ఇప్పుడనిపిస్తుంది, ఈ వాక్యం వెనుక ఆనాడు నే చదివిన టాగూరు నవల ప్రేరణ కాస్త వుందా అని."

**– బుచ్చిబాబు**

(నా అంతరంగ కథనం)

* * *

# త్యాగశీలి

తుమ్మల సీతారామమూర్తి గారు 1943 లో ప్రకటించిన 'పఱిగ పంట' ను కొసరాజు లక్ష్మయ్య చౌదరి గారికి అంకితమిచ్చారు. లక్ష్మయ్య గారి స్వగ్రామం నిడుబ్రోలు. నిడుబ్రోలు జంట గ్రామమైన పొన్నూరులో గల పాఠశాల 1915 లో సంభవించిన గాలివానకు కూలిపోయింది. దానిని పునరుద్ధరించడానికి ఆ పాఠశాల సభ్యులు గ్రామంలోని భాగ్యవంతుల నెందరినో అర్థించారు. కాని ఒక్కరు కూడా కనికరం చూపి సహాయపడడానికి ముందుకు రాలేదు. నిరాశతో ఇళ్ళకు మళ్ళిన వారికి దారిలో కొసరాజు లక్ష్మయ్యగారు ఎదురయ్యారు. వారిని వెంటబెట్టుకుని వెళ్ళి బడి దుస్థితి చూపించారు. 'ఎందరో పెద్దలుండగా నేనేమి చేయగలను. నాకు తోచిన సహాయాన్ని చేస్తాను గాని పెద్దగా ఆశ పెట్టుకోవద్దు' అన్నారు లక్ష్మయ్యగారు. ఆయన సాధారణ రైతే అయినా, ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో అన్నదానం చేస్తూండేవారు. ఆ రాత్రి లక్ష్మయ్యగారికి కలలో శ్రీకృష్ణుడు కనిపించి 'ఇక అన్నదానాలు చాలు, బడిని ఉద్ధరించు' అని చెప్పాడట. ఆ విషయాన్ని భార్యకు చెబితే ఆమె కూడా అలాగే చేయమన్నది. ఇంకేం పొలము, నగలు, చివరకు ఇల్లు కూడా అమ్మివేసి, ఆ రోజుల్లో 14 వేల రూపాయలు ఖర్చుపెట్టి, బడిని బాగు చేయించారు. కూలికి బండి తోలుతూ, పాలికి పొలాన్ని చేసుకుంటూ జీవనం సాగించారు. ఇటువంటి త్యాగశీలికి తుమ్మలవారు తమ కృతిని ఇచ్చి, లోకం మరిచిపోయిన



(Outputs) 14/10/08

ఆ మహనీయుని కావ్యముఖంగా చిరంజీవిని చేశారు. ఆ బడిలోనే కొన్నాళ్ళు అధ్యాపక వృత్తిని సాగించిన తుమ్మలవారు, లక్ష్మయ్య గారి చిత్రపటాన్ని నిర్మింపజేసి బడికి బహూకరించారు. ఆ త్యాగధనునికి మనం ఏమిచ్చుకుంటే ఋణం తీరుతుంది!?

**– సింగంపల్లి అశోక్‌కుమార్**

❋ ❋ ❋

# యోగం

"విజయవాడలో డాక్టర్ గూడూరి నమశ్శివాయ గారి మృత్యుంజయ ఫార్మసీ ఒక సాహిత్య పీఠమనే చెప్పాలి. వారి షాపులో సాహిత్య మీమాంస చాలా రసవత్తరంగా జరుగుతూండేది. ఒకరోజు నేను వారి షాపునకు వెళ్ళాను. విశ్వనాథ సత్యనారాయణగారు అక్కడ ప్రత్యక్షమయ్యారు. నన్ను చూసి వారు 'ఏమండి రామకోటయ్యగారూ మీ మాస్టర్ సి.వి.వి. యోగమంతా తప్పని నేనొక గ్రంథం రాశాను. సుమారు ఐదు వేల పద్యాలయ్యాయి. మీరు మృత్యువును జయించాలని, మానవులను నిత్యులను చేయాలని, భువిని దివ్యం చేయాలని ప్రయత్నం చేస్తున్నారు గదా! అది ఇది వరకు జరగలేదు. ఇక ముందు కూడా జరగదని నేను కథ రాశాను. వేద వ్యాస మహర్షి మృత్యువును జయింపరాదని నిర్ధారణ చేస్తూ 'రురుడ–ప్రమద్వర' కథ భారతంలో రాశారు. నేనా కథను తీసుకుని మీ యోగం తప్పని ప్రతిపాదిస్తూ పెంచి రాశాను. పుట్టిన వారంతా తప్పక చచ్చిపోగలరని నిర్ధారణ చేసి రాశాను' అన్నారు.

అప్పుడు నేను 'మీరు మా యోగం తప్పనియే కదా రాశారు. నేను మీ వాదన తప్పని వేరొక కథ రాస్తున్నాను. ఆ కథా వేదవ్యాస మహర్షి ప్రోక్తమే' అన్నాను. 'ఆ కథ ఏమిటి' అన్నారాయన. 'సావిత్రి మృత్యువుని జయించి సత్యవంతుని బ్రతికించిన కథ' అన్నాను."

**– కొత్త రామకోటయ్య**

('న్యూ యోగా' అనే గ్రంథాన్ని అనువదించి మరికొన్ని వ్యాసాలు సేకరించి 'భృక్త రహిత తారక రాజయోగము' అను పేరుతో రామకోటయ్యగారు ప్రకటించారు)

❋ ❋ ❋

# వరుస

"వరుసలు పెట్టి పిలుచుకోవడం చాలా వాంఛనీయం. కాస్త మాటేగదా, ఇందులో నీకు కలిగే నష్టం లేదు. లాభం మటుకు ఉన్నది. నా జీవితం ఇలాంటి ఏర్పాటు వల్ల మధురతము అయిందని నేను భావిస్తున్నాను. గొట్టిపాటి సుబ్బయ్యగారు అన్నగారు. నన్ను సొంత సోదరునిలాగ చూచుకుంటారు. శ్రీ తెలికిచర్ల వెంకటరత్నం గారు నాకు బావగారు. ఆయనకు కోపం వచ్చే పని ఒకటి నేను చేశాను. కాని బావగారిని ఏమీ అనలేక ఊరుకుంటున్నాడు. ఈ వరుస లేకపోతే నన్ను ఏమి చేసేవాడో!



(Outputs) 14/10/08

కాటూరి వెంకటేశ్వరరావుగారు నాకు అన్నగారు. మా ఆవిడ కూడా, ఈ బావగారితో సరసమాడుతూ ఉంటుంది. ఇంకా ఇలాంటి బంధువులు చాలా మంది ఉన్నారు. జమదగ్నిశర్మ మా అల్లుడు. హనుమచ్ఛాస్త్రి నన్ను అన్నా అని పిలుస్తారు. ఈ జీవితానికి ఇంకేమి కావలె, ఇంతమంది బంధువుల ఆదరణ పొందడమే మహా భాగ్యము. ఇక మా ఆవిడ సంగతి చెప్పనక్కర లేదు. అందరూ ఆమెకు బంధువులే!"

**– మునిమాణిక్యం నరసింహారావు**

❋ ❋ ❋

# మొసలి కన్నీరు

'పేరుకు ఆంధ్ర మహాసభేకాని బూర్గులవారికి, రావినారాయణరెడ్డిగారికి మాత్రమే చక్కగా తెలుగు మాట్లాడడం వచ్చు. మాడపాటి హనుమంతరావుగారు తెలుగు బాగా మాట్లాడగలరు. వీరు తప్ప తక్కిన కొండా వెంకటరంగారెడ్డి, మందుముల నరసింహారావు, మందుముల రామచంద్రరావు మొదలైన వారికి తెలుగు బాగా రాదు. ఆంధ్ర మహాసభలో వేదిక మీద ఉర్దూలో మాట్లాడేవారు. సురవరం ప్రతాపరెడ్డిగారికి అది నచ్చలేదు. ఆంధ్ర మహాసభలో 'అభివృద్ధి పక్షం' స్థాపించారు. అందులో వి.బి. రాజు, మాడపాటి, రామచంద్రరావులు వారికి సహాయకులు. ప్రతాపరెడ్డిగారు ఆంధ్రమహాసభల వేదికల నుండి ఉర్దూ మాట్లాడరాదని పట్టు పట్టిరి. అయితే తెలుగురాని నాయకులు ఎక్కువైనందున వారి మాట చెల్లలేదు. వెంటనే రాజకీయాల నుండి తప్పుకుని గోల్కొండనే పరమాయుధం చేసుకుని రాజకీయ, సాంఘిక, విద్య, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో జరగవలసిన కృషిని గురించి నాయకులకు కనువిప్పు కలిగేటట్లుగా సంపాదకీయాలను, వ్యాసాలను రాశారు. అట్టి సురవరం ప్రతాపరెడ్డి గారికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952 లో మొట్టమొదటిసారి ఎన్నికలు జరిగినప్పుడు సొంత నియోజకవర్గమైన అలంపూరు ఈయక వనపర్తి నియోజకవర్గమిచ్చిరి. అయినా హైదరాబాదులోని యూనివర్శిటీ, డిగ్రీ కాలేజీల విద్యార్థులు పట్టుదలతో ప్రచారం చేసి ఆయనను గెలిపించారు. మంత్రి పదవుల పన్యారంలో బూర్గులవారికి, కొండావారికి ప్రతాపరెడ్డిగారు జ్ఞాపకం రాలేదు. ఇది స్వార్థం, నయవంచన తప్ప మరొకటి కాదు. ఎవరికైనా మరణం సహజం. అట్లే ప్రతాపరెడ్డిగారు 1953 ఆగస్టు 25 వ తేదీన మరణించి తెలంగాణాను శోక సముద్రంలో ముంచిరి. ఆగస్టు 30 న హైదరాబాదు రెడ్డి హాస్టలులో రెడ్డిగారి సంతాపసభ ఏర్పాటైంది. బూర్గుల, మాడపాటి, కొండా వంటి నాయకులు కడవలతో కన్నీరు కార్చిరి. అచ్చుతరెడ్డిగారి బలవంతం వల్ల ఆ సభలో నాకు ఐదు నిమిషాలు మాట్లాడే అవకాశం లభించింది. నేను వేదిక ఎక్కి రెండు నిముషాల్లో నా ప్రసంగం ముగించితిని. 'ప్రతాపరెడ్డిగారు సహజంగా



(Outputs) 14/10/08

మరణించినందుకు నేను దుఃఖించడం లేదు. కాని వారి ముఖ్య సహచరులైన ఈ నాయకులు, బ్రతికి ఉన్నప్పుడు వారికి ఏమీ చేయకపోయినా, ఇపుడు కడవలతో కన్నీళ్లు కార్చుతున్నందుకు నేను దుఃఖించుచున్నాను' అని దిగి వచ్చితిని. సభకు వచ్చిన వారందరూ నన్ను సమర్థిస్తూ చప్పట్లు కొట్టిరి."

**– గడియారం రామకృష్ణశర్మ**

❋ ❋ ❋

# కనీస బాధ్యత

"పెద్ద పెద్ద కవులు చాలామంది నిరుత్సాహం వల్ల, పేరుప్రతిష్టలకు దూరమయ్యారు. స్వర్గీయ సత్యేంద్రదత్తా సంతాపసభకు వెళ్ళి చూశాను – నిజంగా, 'చాలామంది కన్నీరు కారుస్తున్నారు. అప్పుడు నేను మహాక్షోభ పడుతూ – కటూక్తులు యిలాంటి సందర్భంలో విసరటం నాకు అలవాటే. 'ఇప్పుడు మీరందరూ కంట తడిపెట్టి వలవలయేడుస్తున్నారు. కాని ద్వాదశవత్సరాల సుదీర్ఘకాలంలో, వారివి ఐదు వందల కాపీలు కూడా అమ్ముడుపోలేదని ఎరుగుదురా' అని అడిగాను. 'చాలామందికి వారి గ్రంథాలపేర్లు కూడా తెలియవనుకుంటాను. కాని, ఇవాళ అశ్రుమయసానుతాపం వెలిబుచ్చటానికి తయారయ్యారు! గొప్పవారు, కనీసం సామాజిక కర్తవ్యంగా భావించి అయినా, గ్రంథాలు కొనడం ద్వారా రచయితలకు తోడ్పడితే, సాహిత్యాభివృద్ధికి అవకాశం కలుగుతుంది. అందువల్ల రచయితకు ప్రోత్సాహం లభిస్తుంది. కడుపు నిండా తిండి దొరుకుతుంది. వారు స్వయంగా వివిధ గ్రంథాలు చదువుకొని, జ్ఞానం పెంపొందించుకుంటారు. ఆనాడే వారు జ్ఞానదాయకమైన గ్రంథాలు రచించగలుగుతారు."

**– శరత్‌చంద్ర ఛటర్జీ**

❋ ❋ ❋

# ప్రభావం

"నేను కాలేజీలో చేరిన పిదప తెలుగును అభ్యసించాలని, తెలుగుభాషా సాహిత్యాన్ని, ప్రబంధాలని, అధ్యయనం చేయాలన్న కోరిక నాకు మాడపాటి హనుమంతరావుగారి ప్రేరణ వల్లనే కలిగింది. వారు నన్ను ఆంధ్రమహాసభ వంటి ఉద్యమాల్లోకి ఆకర్షించినారు. ప్రోత్సహించినారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలూ, సంఘాలేవీ లేని కాలంలో వారు సంఘాలు పెట్టి ప్రజల్ని చైతన్యవంతం చేసినారు. తెలుగుభాషా సంస్కృతుల ఉద్ధరణకు పాటుపడినారు. అయితే వారి రాజకీయ సైద్ధాంతిక ప్రభావం మాత్రం నా మీద పడలేదనే చెప్పవచ్చు."

**– రావి నారాయణరెడ్డి**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# వచన కవిత

"ఇండోసోవియట్ స్నేహ సమితి హైదరాబాదులో 21.2.1986 సాయంకాలం రష్యన్ కవి డేవిడ్ గుల్టినోవ్‌ని కలుసుకోవడానికి ఏర్పాటుచేసిన ఇష్టాగోష్ఠి సమావేశానికి నేను వెళ్ళాను. సుప్రసిద్ధ తెలుగు కవి గజ్జెల మల్లారెడ్డి, కొత్తపల్లి వీరభద్రరావు, ప్రసిద్ధ కవి శ్రీ పోతుకూచి ప్రభృతులు, హిందీ, ఉర్దూ కవులు కూర్చుని వున్నారు. ఆరింటికి ప్రారంభమైన సమావేశం అనేక ప్రశ్నల చెత్తాచెదారంలో నుంచి నడుస్తూ నడుస్తూ విసిగి లేచిపోదామనుకుంటున్న క్షణంలో ఒక పెద్ద మనిషి లేచి కేవలం తెలుగులో ఒక ప్రశ్న వేశాడు. 'డేవిడ్ గారూ! మీరు రాసే కవిత్వం పాడబడుతుందా ? చదవబడుతుందా ?' శ్రీ డేవిడ్‌కు అనువాదకురాలుగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయ రష్యన్ లెక్చరర్ ప్రతిమా దేవి తెలుగు మహిళ. ఆమె చేసిన అనువాదం విని శ్రీ డేవిడ్ ఇలా చెప్పారు. – 'ఎక్కువగా చదవబడుతుంది.' 'పాడాలంటే పాడవచ్చా ?' అని మళ్ళీ పెద్దమనిషిగారి ప్రశ్న. 'ఎవరయ్యా ఈయన ?' అని నేను గజ్జెలగార్ని అడిగాను. 'ఆయన్నెరుగరా జగమెరిగిన బ్రాహ్మడు చాసో' అన్నారు. శ్రీ చాసోగారి కీర్తి ఎరిగినా, ఆయన్ని చూడటం నాకు అదే మొదటిసారి. నేను ఇక కాలయాపన చేయకుండా డేవిడ్ అనువాదమ్‌గార్ని చూసి సూటిగా ఇంగ్లీషులో చెప్పాను – 'నేను చాసోగారి వ్యాఖ్యాతగా అడుగుతున్నాను. మీ కవిత లయాత్మక రచనా లేక పొడి వచన రచనా ?' (మా తెలుగులో మాదిరి). 'లయాత్మక రచన అని డేవిడ్ సమాధానం చెప్పాడు. 'మీరు లయరహిత వచన కవిత రాయలేదా ? 'లేదు'. 'అయితే రష్యన్ కవులు ఎవరూ వచన కవిత్వం రాయరా ?'. 'రాస్తారు. కానీ వాళ్ళు బహుశా నూటికి ముగ్గురు ఉండవచ్చు'. 'అలా ఎందుకని'. 'అది మాలో లోకప్రియ పద్ధతి (పాప్యులర్) కాదు.' శ్రీ గజ్జెల వెంటనే అన్నాడు – 'అంటే వాళ్ళు బ్యాక్‌వర్డ్ అన్నమాట (అది ఆయన జోక్). విప్లవదేశాల్లో మొదటి దేశమైన రష్యాలోనే అప్రధానంగా పరిగణింపబడే ఈ వచన కవిత తెలుగులో ఇంత ప్రధానం ఎలా అయింది! అభ్యుదయ కవితగానీ విప్లవ కవితగానీ ఏ పేరుతో పిలుచుకున్నా ఆ కోవకు చెందిన కవిత, రష్యాలో అక్టోబర్ రివల్యూషన్‌కు పూర్వంగానీ అనంతరంగానీ లయాన్విత రచనలోనే వచ్చింది. మాయాకోవ్‌స్కీ, అలెగ్జాండర్ బ్లాక్, ఒసివ్ మాండల్‌స్టామ్, అన్నా అఖ్మటోవా, సెర్గీ పసివిన్, ఆంద్రేఖేలీ, బ్రైయసోవ్, బోరిస్ పాస్టర్‌నాక్ ప్రభృతులు అందరూ VERSE లోనే అంటే పద్యంలోనే రాశారు. (పద్యం అంటే కొంపదీసి మత్తేభము, శార్దూలము అనుకుంటారేమో మన ఆంధ్రులు) మరి అభ్యుదయము, విప్లవము ఇలాంటివాటికి, వచన కవితకూ అవినాభావ సంబంధం లేదా ? వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు ఉందన్నాడు, ప్రసిద్ధకవి విమర్శకుడు కె.వి. రమణారెడ్డి లేదన్నాడు!"

**– గుంటూరు శేషేంద్రశర్మ**

* * *



(Outputs) 14/10/08

# అన్నీ తెలిసిన ఋషి

"మాలో చాలామందికి రవీంద్రనాథ్ ఠాగూర్ పేరు వంగసాహిత్యం సాధించిన అత్యుత్తమ స్థితికి పర్యాయపదంగా కనుబడుతుంది. మా తరానికి చెందిన వ్యక్తులు ప్రతిభావంతమైన ఆయన వ్యక్తిత్వం యొక్క ప్రభావం కిందికి వచ్చారు. దానిచేత తీర్చిదిద్దబడ్డారు. భారతీయ విజ్ఞానం మూర్తీభవించిన ప్రాచీన ఋషి వంటివాడు ఆయన. కాని ఆయనకి సమకాలిక సమస్యలు అన్నీ తెలుసును. భవిష్యత్తులోకి చూడగలిగిన ప్రజ్ఞ ఉంది. ఆయన వంగభాషలో వ్రాశారు. కాని, ఆయన విశాలదృష్టి దేశంలో ఏదో ఒక భాగానికి బంధించబడి ఉండేదికాదు. వాస్తవానికి అది భారతీయమైనదైనా, మానవకోటి సంతతిని తన పరిధిలోకి తెచ్చుకుంది. ఆయనలో జాతీయత, అంతర్జాతీయత రుచి రససమ్మేళనాన్ని పొందాయి. ఆయన్ని కలుసుకున్నప్పుడు, లేదా ఆయన రచనలు చదువుతూంటే, మానవానుభూతి యొక్క విజ్ఞానం యొక్క అత్యున్నత శిఖరాన్ని సమీపిస్తున్నట్లు మనకనిపిస్తుంది.

రవీంద్రనాథ్ అంత గొప్పవాడైనా, ఎక్కడో ఆకాశసౌధంలో ఉండే వ్యక్తి మాత్రం కాదు. జీవితం ఇచ్చింది ఇచ్చినట్లు స్వీకరించి, పరిపూర్ణంగా జీవించిన వ్యక్తి. ఒక విధంగా ఆయన కృషి అంతా జీవితానికి సంబంధించినదే. ఆయన ఒక స్నేహితుడికి వ్రాస్తూ 'మానవ జీవితంతో ముడిపడి వుంటేనే సత్యం మంచిదీ పూర్ణమైనదీ అవుతుంది' అన్నారు."

**– జవహర్‌లాల్ నెహ్రూ**

* * *

# యెంకి

"శివరాజు వేంకట సుబ్బారావుగారు అనే బుచ్చిబాబుగారు యెంకిని నాయికను చేసి ఒక నాటిక రచించారు. వారి దృష్టికి నాయుడు ప్రేమయోగానికి ఒక మెట్టు దిగువగా ఉన్నట్టు కనబడింది. యెంకి ప్రేమయోగిని. వివాహము అనే కృతకబంధం ఆమెకిష్టము లేదు. నాయుడు ప్రేమికుడే. అయితే సంఘానికి వెరచి పెండ్లి చేసుకుంటే మాత్రమేమీ ? అని యెంకిని ఒప్పించబోతాడు. ఆమె చిక్కక నిత్య స్వాతంత్ర్య సీమలోనికి – వెలుగునీడల నడిమికి వెళ్ళిపోతుంది. ఈ రచనలో బుచ్చిబాబుగారు యెంకిని పైకెత్తారు నిజమే. కాని నాయుణ్ణి జారవిడవడానికి యెంకి పాటలలో కారణము కానరాదే అంటాను."

**– శ్రీపాద గోపాలకృష్ణమూర్తి**

* * *



(Outputs) 14/10/08

# నియమశీలత

"ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులకు కన్నకొడుకు అర్జునరావొక్కడే. అయినప్పటికి శారదానికేతనం నిర్వహణ నిమిత్తం వారు అతని ఎడబాటును గూడా సహించారు. అతను విద్యార్థిగా ఉన్నప్పుడు, ఉద్యోగిగా ఉన్నప్పుడు గూడా నికేతనంలో ఉండేవాడు కాదు. పరాయి పిల్లల నిమిత్తం కన్నబిడ్డను యెడం చేసుకున్న నియమశీలత వారికే చెల్లింది. కుమారుడు ఒకడైనా ఉన్నవ దంపతులకు కుమార్తెలకు కొదువలేదు. వారు పునర్వివాహాలు చేసినవారు, వారి నికేతనంలో విద్య నభ్యసించినవారు, వారు పెంచి పెద్దజేసిన అనాథ బాలికలు – అందరూ వారి కుమార్తెలే. శారదా నికేతనం ఉత్సవాల్లో జరిగే ప్రదర్శనల్లో గూడా గ్రామాలపై వారికున్న అభిమానం ప్రకటితమవుతూ ఉండేది. వారి ప్రదర్శనల్లో ఒక తెలుగు నాటకం, ఒక సంస్కృత నాటకం, ఒక హిందీ నాటకం, ఒక ఇంగ్లీషు నాటకం తప్పకుండా ఉండటం రివాజు. అందులో ఒక పౌరాణికం, ఒకటి చారిత్రకం. ఒకటి సాంఘికంగా ఉండేవి. ఒకటి దైవభక్తిని చూపిస్తే, మరొకటి దేశభక్తిని రగుల్కొలిపితే, వేరొకటి సంతోషాలను బయటపెట్టేది. ఆయన వ్రాసేవి వర్తమాన విషయాలైనా, వ్రాసే రీతులు మాత్రం పాతకాలపు పల్లెటూరి గేయపద్ధతిలోనే. అవి వీధి నాటకాలు, బుర్రకథలు, సోదెలు, ఖడ్గాలు, గొల్లసుద్దులు, ఈలపాటలు, బ్రహ్మంగారి తత్త్వాలు మొదలైనవి ఉంటాయి. ఆయన బుడబుక్కల జోస్యం, ఎరుకలసాని సోదె, ప్రభల ముందు చెప్పే శరభలు అన్నీ మనదేశానికి, మన స్వరాజ్య పోరాటానికి సంబంధించినవే."

**– కనుపర్తి వరలక్ష్మమ్మ**

❋ ❋ ❋

# చిరంజీవి

'నార్ల చిరంజీవి జీవితం వడ్డించిన విస్తరి కాదు. ఆయనది కవితాత్మ. గుండెల్లో గాయం సెలవేస్తూ వుంటే కవిత్వాన్ని ఒలికించాడు. కథలుగా పలికించాడు. ఎన్నిటికో రూపకల్పన చేశాడు. కష్టంలో ఉన్న మనిషికోసం అనుకంపనతో బ్రతికిన సహృదయుడు. అలసట ఎరుగని ఆశయాలకు, మహోన్నతమైన విలువలకు ఆటపట్టుగా నిలిచినవాడు. 'విప్లవాత్మ' వ్రాసి ఉద్రేకపరచి ఉరికించిన చిరంజీవి చివరకు జీవితంలో మానవతకే ప్రాముఖ్యత ఇచ్చిన సుతిమెత్తనివాడు. బాలసాహిత్యం ద్వారా చిరస్మరణీయుడు. 'కొమ్మల రెమ్మల' ద్వారా తెలుగు కవితలో కొత్త సాహిత్య ప్రక్రియను ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. లక్షలాది పాఠకులను ఉర్రూతలూగించిన 'భాగ్యనగరం' నాటకకర్తగా తెలుగుసాహిత్యంలో ధృవతారగా నిలిచాడు. కొమ్ములు తిరిగిన రచయితలను, కవులను ఎందరినో తీర్చిదిద్దాడు. ఎన్నో సాంస్కృతిక సంఘాలకు సలహాదారుడై తన చేయూత నిచ్చాడు. ఎన్నో ఆదర్శ వివాహాలకు సారథ్యం వహించాడు. కాని.... బాహ్యా జీవితంలో ఎప్పుడూ లభించని ప్రశాంతత కోసం తనలో తానే యుద్ధం చేసుకుంటూ అలసిపోయాడు.'

**– విశ్వేశ్వరరావు**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# తొలిరచన

"రెండవ ప్రపంచయుద్ధం రోజుల్లో పంచదార, కిరసనాయిలు వంటి వాటిమీద కంట్రోలు ఉండేది. వ్యాపారస్తులు బ్లాక్ మార్కెట్ చేసి, ప్రజలకు అందనీయక పోయేవారు. నల్లబజారు వర్తకుల మీద ఆంధ్ర మహాసభ పోరాటం ప్రకటించింది. నేను గార్లలో బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాను. అనేక పంచదార బస్తాలు బయట పడేయించాను. కిరసనాయిలు డబ్బాలు వెలికి తీయించాను. బియ్యం, జొన్నలు వెలికి తీయించాను.

ఆ రోజుల్లో తెలంగాణా నుండి మూడు తెలుగు దినపత్రికలు వచ్చేవి. గోలకొండ పత్రిక, తెలంగాణా పత్రిక, మీజాన్. గార్లలో పంచదార కరువును గురించి మీజాన్‌లో ఒక లేఖ రాశాను. అది నా తొలిరచన. దాని ప్రభావం కనిపించింది. పంచదార కోటా మార్పు చేశారు. తాసిల్దార్ నన్ను పిలిపించి 'బద్‌హోనా బద్నాం నహోనా' అని మళ్ళీ పత్రికలకు రాయవద్దు అన్నారు. నేను మానలేదు. ప్రజాశక్తి సహితంగా అన్నింటికీ జాగీర్ల పరిస్థితులను గురించి రాశాను. అది చూసి అధికారులు నామీద కారాలు, మిరియాలు నూరారు. అయినా ప్రజలు – కాదు– గ్రామం సొంతం మా కుటుంబాన్ని తమ స్వంత కుటుంబంగా చూసుకున్నారు.

విచిత్రం ఏమంటే ఎవరి బ్లాక్ మార్కెట్ వస్తువులు బయట పడేశానో వారు సైతం మా విషయంలో అభిమానం కనబరిచారు."

**– దాశరథి రంగాచార్య**

❋ ❋ ❋

# ఇంగ్లీషు చదువు

"నేను నాయుడుపేట చేరేటప్పటికి దేశంలో ఇంగ్లీషు చదువు ప్రారంభమై ఏ పది సంవత్సరాలో అయివుంటుంది. ఇంగ్లీషువాళ్ళు ఈ దేశం పూర్తిగా స్వాధీనం చేసుకున్న తరువాత 'ఈ దేశంలో ఏ విద్యా పద్ధతి అమలులో పెట్టాలా ?' అని తర్కించారు. చివరికి 'మెకాలే' సలహామీద ఈ దేశంలో ఇంగ్లీషు చదువు స్థాపించడానికి నిర్ణయించారు. ఆనాటి పాలకుల విద్యాదర్శం – ఆనాడన్న మాటేమిటి ? ఈనాటివరకూ కూడా అదే ఆదర్శం! – తమ పరిపాలనకి కావలసిన గుమాస్తాలనీ, దుబాషీలని తయారుచెయ్యడమే! అందుకోసమనే వాళ్లు ఆ పని పైనించి ప్రారంభించారు. ముందు కాలేజీలు స్థాపించారు. వాటికి శాఖలుగా హైస్కూళ్ళు నడిపించారు. వాటికి ఉపశాఖలుగా ఇంగ్లీషు ఆదర్శాలతో నిండిన గ్రాంటు స్కూళ్ళు స్థాపించారు. అంతకు పూర్వం వాటి స్థానంలో వుండే వీధి బళ్ళు ఎత్తివేశారు. మన జాతీయమైన వీధి పాఠశాలల్లో నాలుగేళ్ళపాటు చదువుకుంటే వ్రాతా, చదువూ రావడమేకాకుండా, భారత భాగవతాది గ్రంథపఠనానికి పునాది పడడమూ, మంచి లౌకికజ్ఞానం కలగడమూ కూడా జరిగేవి. ఈ



(Outputs) 14/10/08

గ్రాంటుబళ్ళు వచ్చి ఆ విధానం మార్చివేశాయి. ఆ విద్యావిధానపు ఆదర్శం జాతీయమైనదీ, విశాలమైనది. ఈ నూతన విద్యకి ఆదర్శం నౌఖరీ, ధన సంపాదనా, స్వార్థమూనూ. ఎప్పుడైతే మిడిల్ స్కూళ్ళ చదువు పూర్తి చేసినవాళ్ళూ, మెట్రిక్యులేషన్ పాసైన వాళ్ళూ కూడా పెద్ద పెద్ద ఉద్యోగస్థులై ధన సంపాదనలో పడ్డారో, అప్పుడే దేశంలో విద్యాదర్శాలు క్షీణించాయి. ఆంగ్లేయ పాలకులు కూడా తమ రాజ్యానికి వేళ్ళు పారించడానికి మన దేశీయ సంస్థలనన్నింటినీ క్రమక్రమంగా పెకలించారు. ఆ రోజుల్లో పంచాయతీ పద్ధతిని న్యాయనిర్ణయం చేసుకోవడం అమలులో ఉండేది. ఆ పద్ధతి తొలగించి కోర్టుల పద్ధతి స్థాపించారు. దాంతో కాని మన పతనం ప్రారంభంకాదు. ఆ కోర్టులకి జడ్జీలూ, వకీళ్ళూ కావాలి కదా! అందుకోసం ముందుగా ఆంగ్లేయ పాలకులు మన సంఘంలోవుండే పెద్దల్ని ఏరి, వాళ్ళకి పెద్ద పెద్ద పదవులు అంటగట్టారు. క్రమంగా కొంచెం చదువు – అంటే ఏ మిడిల్ స్కూలు చదువో – చదువుకుంటే జిల్లా మునసబీ అయ్యేది. అందుచేత దేశంలో వివేకవంతులనబడే వాళ్ళ దృష్టి అటు మళ్ళింది. జనం ఇంగ్లీషు చదువులకి తియ్యనీటికి చేపలెక్కినట్టు ఎక్కారు. క్రమంగా మెట్రిక్యులేషను పాసయినవాళ్ళ సంఖ్య, ఎఫ్.ఏ.ల సంఖ్య, బి.ఏ.ల సంఖ్య పెరిగింది. దాంతో ప్లీడరీలకీ, నౌకరీలకీ అర్హతలు ఏర్పరిచారు. అప్పట్లో ఈ చదువుల్లోకి వెళ్ళిన వాళ్ళంతా ఉద్యోగస్థులై, ధనార్జన బాగా చెయ్యడం వల్ల దేశస్థుల వ్యామోహం అటు తిరిగింది.”

**– టంగుటూరి ప్రకాశం**

❋ ❋ ❋

# మాధుర్యం

“రష్యాలో విప్లవం జరిగిన ఏడే నేను పుట్టాను. మాది గుంటూరుజిల్లాలోని మారుమూల గ్రామం. మొదటి ప్రపంచ యుద్ధం మూలంగా మానవాళిలో పెద్ద మార్పులు వచ్చినా, మా చిన్నగ్రామంలో వెంటనే తేడాలు కనిపించలేదు. జీవితం దేవాలయాల వలయాలలో తిరుగుతూ ఉండేది. కులాల పట్టుదల మీద నడుస్తూ ఉండేది. పాతుకుపోయిన ఆచారాలకు, అలవాట్లకు అంతం లేదేమో అనిపించేది. చదువు సంధ్యలకు కూడా అవకాశం పెద్దగా దొరికేది కాదు. వీధిబళ్ళు, ఉన్నవారు ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న గురువులు – వీరే విద్య గరిపేవారు. ఈ పరిధిలోనే నా బాల్యస్థితి నడిచింది. మా క్లాసు పుస్తకంలో చదివాను – ‘మందార మకరంద మాధుర్యమును గ్రోలు... ?’ అనే పోతనగారి పద్యాన్ని. ఎంత తియ్యగా మనోహరంగా ఉంది ఈ పద్యం, అది కంఠతా పట్టాను. ఆ పద్యమే పాడుకుంటూ తిరుగుతూ ఉండేవాణ్ణి. మననం చేసుకున్న కొద్దీ దాని మాధుర్యం నన్ను ఆవరించింది. భాగవతం యావత్తూ చదివేదాకా ఆగలేదు మనసు. ఆ చిన్నవయసులో అంతా అర్థమైకాదు ఆ చదవడం. ఆ నడక, ఆ పదలాలిత్యం, ఆ శబ్ద సౌందర్యం, అందులోని భక్తి పారవశ్యత, నాలోను పారవశ్యతను నింపినాయి. వేమనగారి



(Outputs) 14/10/08

పద్యాలు చదివాను. ఆటవెలది, తేటగీతి అనే పేర్లు ఆ పద్యాల మూలంగానే సార్థకతను సంతరించుకున్నవా అనిపించింది. పోతనగారు, వేమనగారు కలిసి, నాలో తెలుగుభాష యెడల గాఢమైన అభిమానాన్ని పెంచారు. దొరికిన ప్రతి కావ్యమూ, పుస్తకమూ చదవడం మొదలుపెట్టాను.”

**– ఆవుల సాంబశివరావు**

❋ ❋ ❋

# పరిశోధన

“నేను చిన్నప్పటి నుండి పల్లెటూరి వాతావరణంలో పెరిగినవాణ్ణి. వ్యవసాయకూలీలు పాడేపాటలు, మా నాయనమ్మ, మా నాయనగారి మేనత్త పాడే పాటలు, వాళ్ళు చెప్పే కథలు చిన్నప్పుడే నాలో ప్రగాఢమైన ముద్ర వేసినాయి. నాలో సృజనాత్మక రచన చేసే శక్తి తక్కువ. తొలిదశలో కవిత్వము రాశాను. కాని సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, ఖండవల్లి లక్ష్మీరంజనంగారలు నన్ను పరిశోధన వైపు మరల్చినారు. సృజనాత్మక రచనలు చేసేవారికి కష్టం తక్కువ. పరిశోధన చేసేవాళ్ళకు కష్టమెక్కువ. తాళపత్రాలు సేకరించడం, జానపద గేయాలు సేకరించండం కష్టంతో కూడుకున్న పని. ఇంత సాహిత్యం, అనాదృతంగా పోతున్నదే ? అని భావించి కృషి చేశాను. ఫీల్డ్ వర్క్ చేయాలంటే ఎంతో ఓపిక అవసరం. కష్టాన్ని భరించాలి. పైగా ఈ రోజుల్లో ఉన్న సౌకర్యాలు ఆనాడు లేవు. ఎంతో కష్టపడవలసి వచ్చేది.”

**– బిరుదురాజు రామరాజు.**

❋ ❋ ❋

# బెనారస్ యూనివర్శిటీ



**తరిమెల**

“నా రాజకీయ ఆర్థిక అభిప్రాయాలను పూర్తిగా మార్చింది బెనారస్ యూనివర్శిటీ. బహుశా నా వ్యక్తిగత జీవితంలో, రాజకీయ జీవితంలో కూడా అన్నిటికన్నా గొప్ప మలుపు అదే. ఎన్నెన్నో స్నేహాలను సంపాదించిపెట్టిన ప్రదేశం అది. వివిధ రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలను సీరియస్‌గా అధ్యయనం చేయటానికి, బెనారస్‌లో నా చదువు ముగింపుకొచ్చేనాటికి కమ్యూనిజం, కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ఈ దేశాన్ని సామ్రాజ్యవాద దోపిడీ నుండి రక్షించగలవని అంతిమంగా తెలుసుకోవడానికి నాకు తోడ్పడింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి రాజకీయ దృక్పథం గల వివిధ రాజకీయ తత్త్వశాస్త్రాలకు, పార్టీలకు చెందిన విద్యార్థులంతా కూడా ప్రదేశంగా ఉండేది.



(Outputs) 14/10/08

అప్పట్లో బెనారస్ యూనివర్శిటీ రాజకీయ కేంద్రంగా వుండేది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు బహిరంగంగా, రహస్యంగా విద్యార్థులకు రాజకీయ కార్యకలాపాల్లో ఆసక్తి కల్పిస్తుండేవారు. గాంధేయులు, నెహ్రూవాదులు, టెర్రరిస్టులు అందరికీ అక్కడ స్థానం ఉండేది. రాజకీయ వాద వివాదాలు నిత్యకృత్యం. విశ్వవిద్యాలయంలో చేరేప్పుడు నేను పూర్తిగా నమ్మిన గాంధేయవాదిని. అక్కడ చదివిన నాలుగయిదేండ్లలో కాంగ్రెస్ సోషలిస్టులైన కమలాదేవి చటోపాధ్యాయ, జయప్రకాశ్ నారాయణ్, అచ్యుత పట్వర్ధన్ మొదలైన వారిచే ప్రభావితుడనయినాను. ఆ తర్వాత క్రమంగా కమ్యూనిస్టు పార్టీ ప్రభావం పడ్డది. మార్క్స్ గురించి మార్క్సిజం గురించి నాకు తెలిసింది బెనారస్ యూనివర్శిటీలోనే. రష్యన్ విప్లవ ప్రాముఖ్యత గురించి, లెనిన్, స్టాలిన్‌లు రష్యాకందించిన రాజకీయ నాయకత్వం గురించి నాకు అర్థమయింది అక్కడే. మార్క్సిజాన్ని భారతదేశ పరిస్థితులకు అన్వయించవచ్చును అని మొదటిసారి నాకు అనిపించింది కూడా అక్కడే. ఆశ్చర్యకరమైనదేమంటే జయప్రకాష్ నారాయణ్‌గారి సోషలిజం ఈ అంశాన్ని అర్థం చేసుకోవడంలో ముఖ్య పాత్ర నిర్వహించింది. తరువాత లక్నో కాంగ్రెస్‌లో ఇచ్చిన తన ఉపన్యాసంలో జవహర్‌లాల్‌నెహ్రూ – ప్రసిద్ధులైన సిడ్నీ వెబ్స్ సోవియట్ కమ్యూనిజం గురించి రాసిన గొప్ప గ్రంథాలను ప్రత్యేకించి పేర్కొన్నారు. గాంధీవాదం నుంచి కమ్యూనిజానికి నా పరిణామక్రమాన్ని ఇది దాదాపు పూర్తి చేసింది. ఈ కాలంలోనే యస్.పి. త్రిపాఠి, రుస్తుమ్ శాటిన్ అన్న ఇద్దరు విద్యార్థి మిత్రులతో నాకు పరిచయం ఏర్పడింది. నేను కమ్యూనిస్టు పార్టీ సాహిత్యాన్ని తెప్పించుకుని చదవడంలో వారిద్దరూ నాకు సాయం చేశారు. ఈ కాలంలోనే బెనారస్‌లోని విద్యార్థుల యూనిట్‌కి బాధ్యత వహించిన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ భరద్వాజ మాతో సంబంధాలు పెట్టుకున్నారు. ఆ రోజుల్లోనే లండన్‌లోని 'లెఫ్ట్ బుక్స్ క్లబ్' వారు ప్రచురించిన చాలా పుస్తకాలు చదివాను. ముఖ్యంగా జాన్ స్ట్రాచీ రాసిన 'సోషలిజం సిద్ధాంతం – ఆచరణ', 'అధికారం కోసం రానున్న పోరాటం' అన్న పుస్తకాలు, పామీదత్ రాసిన పుస్తకాలు – ముఖ్యంగా ప్రఖ్యాతమైన 'ప్రపంచ రాజకీయాలు' అన్న పుస్తకాన్ని చదివాను.

ఆ రోజుల్లో జరిగిన అత్యంత ప్రముఖ అంతర్జాతీయ సంఘటనల్లో ఒకటి స్పెయిన్‌లో అంతర్యుద్ధం. ఆనాటి యువతరం ఆలోచనలపై ఎంతో ప్రగాఢమైన ప్రభావం కలిగించింది. ఆ అంతర్యుద్ధంలో కమ్యూనిస్టుల ఆత్మత్యాగం నన్ను అప్పట్లో ప్రభావితం చేసింది. వీటన్నిటితోపాటు యూనివర్శిటీలో ముఖ్యమైన తెలుగు వ్యక్తి ఒకరుండేవారు, కెమిస్ట్రీ ప్రొఫెసర్ కాళీపట్నం కొండయ్యగారు. ప్రపంచ రాజకీయాలను శాస్త్రీయమైన పద్ధతిలో అర్థం చేసుకునేట్టు నా అధ్యయనంలో ఆయన ఆర్భాటంలేని తన సహజపద్ధతిలో ప్రభావితం చేశారు. ఆ కాలంలో మా రాజకీయ జీవితం చాలా చురుకుగా ఉండేది. జాతీయోద్యమపు ప్రతి అంశాన్ని విశ్లేషిస్తూ వుండేవారం, ఎన్నో పాత సిద్ధాంతాలు అక్కడ ధ్వంసం చేయబడ్డాయి. కొంగ్రొత్త రాజకీయ దృగంతాలను సృష్టించి విస్తరించిన ఆ కాలంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం బలమైన రాజకీయ కేంద్రంగా వుండేది."

**– తరిమెల నాగిరెడ్డి**

❋ ❋ ❋

# కమ్యూనిజం వస్తేనే

" Men would rather die than think' అంటాడు బెర్ట్రండ్ రస్సెల్. లోకం, సంసారం, ఆస్తి. ఈ నీతి పద్ధతి ఇవన్నీ శాశ్వతమైన విషయాల్లాగ చూస్తారు. – ప్రస్తుతం అమలులో ఉన్న విషయాల మల్లే కాకుండా, ఇంత రాస్తున్నానేగాని కమ్యూనిజం వంటి గొప్ప మార్పు వచ్చి వరదల్లే ఈ చెత్తనంతా ఊడ్చేసిందాకా ఈ మనుషులు ఎట్లానూ కదలరు. ఎన్ని ఇట్లాంటి వ్యాసాలు వ్రాసినా, ఏ యుద్ధాలో, ఉద్యమాలో, కమ్యూనిజాలో కదిలించివలసిందే గడ్డ కట్టిన ఈ సంఘాన్ని. ఇట్లాంటి రాతలన్నీ అట్లాంటి గొప్ప మార్పులు రావడానికి సోపానాలు. కమ్యూనిజం వచ్చి ఈ గృహాలనే గూళ్ళని విధ్వంసం చేసి, ఈ ఊరగాయల గూళ్ళనీ, దేవుడి గదుల్నీ, వంటిళ్ళనీ కూలదోసి 'కామన్ మెసెస్' నీ, పిల్లలకి గొప్ప ఆట మందిరాల్నీ, విద్యాలయాన్ని స్థాపించేదాకా ఒకళ్ళనొకళ్ళు పెనవేసుకుని ఒకరి రక్తాన్ని ఒకరు తాగుతూ బతికే ఈ భార్యభర్త, పిల్ల, అత్త, ముత్తవ్వ, వితంతువా ఒకర్నొకరు హింసించుకోవడం మాన్తారా ? తెల్లారి లేస్తే పప్పు, పిడకలు, మళ్ళు, చీదరలు, అలుకలు, అధికారాలు, మూలుగులు, మురుకులు – ఇవన్నీ వదిలి సూర్యోదయాన్ని చూసి నవ్వే మనోవ్యవధి, సంతోషం, ఉత్సాహం – ఎప్పుడు కలుగుతుందీ మానవులకి!"

**– గుడిపాటి వెంకటచెలం**

❋ ❋ ❋

# అనుబంధం

చిలకమర్తి లక్ష్మీ నరసింహం, టంగుటూరి ప్రకాశం ఒకరికొకరు పరిచయమైన తర్వాత చాలా రోజులు 'ఏమండీ' అనుకునేవారు. ప్రకాశం బుద్ధి, రూప విశేషాలు చిలకమర్తి నాకర్షించాయి. ప్రకాశం మెట్రిక్ పరీక్షలో కృతార్థుడైనపుడు రెండు రూపాయల చీనా మిఠాయి కొని మిత్రులకు పంచిపెట్టాడు చిలకమర్తి. వారిద్దరి స్నేహం ఎక్కువై 'ఏమిరా' అనుకోటం మొదలుపెట్టారు. చిలకమర్తివారి నాటకాలలో ప్రకాశం వేషం ధరించేవారు. చిలకమర్తి వారి కీచకవధ నాటకంలో ప్రకాశం ద్రౌపది పాత్ర ధరించారు. శ్రీరామజనన నాటకంలో దశరథుని పాత్ర ధరించారు. అంతేకాక కౌసల్య పాత్ర కూడా ఆయనే ధరించి అందర్నీ మెప్పించారు. 1904 లో ప్రకాశం బారిష్టరు చదవడానికి ఇంగ్లాండు వెళ్ళి, తిరిగి వచ్చిన తర్వాత స్నేహితులంతా కలసి ఒక విందు ఏర్పాటు చేశారు. ఆ విందులో పాల్గొన్నందుకు సంఘం నుండి తీవ్రమైన విమర్శకు గురికావలసిన వచ్చింది. చిలకమర్తి కూడా పంక్తి భోజనం చేయబట్టి వెలివేయాలని పెద్దల పట్టుదల ఆనాడు. ప్రకాశంగారికి చిలకమర్తిపై ఎంతో గౌరవాభిమానాలుండేవి. ప్రకాశంగారు మంత్రి అయ్యాక కూడా రాజమహేంద్రవరం వచ్చి, చిలకమర్తిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఆనాటి గౌరవసభకి, చిలకమర్తి అధ్యక్షత వహించారు. చిలకమర్తికి ప్రకాశానికి వున్న అనుబంధము అలాంటిది."

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# ఆప్తబంధువు

"శ్రీమతి భారతీదేవి (ఎన్.జి. రంగాగారి భార్య) గారిని మొదటిసారి 1924 వ సంవత్సరంలో ఆక్స్‌ఫర్డ్‌లో చూచాను. రంగాగారు, శ్రీకృష్ణగారు, నేను 1920–21 నుండి 1922 వరకు కలసి ఆక్స్‌ఫర్డ్ శివారు బాట్‌లేలో ఒక ఇంటిలో వుండేవారం. 1923 లో రంగాగారు ఆర్థికశాస్త్రంలో అత్యున్నతంగా పరీక్షల్లో నెగ్గి, పరిశోధన డిగ్రీ నిమిత్తం వస్తు సంచయం కొరకు ఇండియాకు వెళ్ళి, తిరిగి వస్తూ శ్రీమతి భారతీదేవిగారిని తీసుకుని వచ్చారు. ఆమెగారు కొంతకాలం ఆక్స్‌ఫర్డ్‌లోను, కొంతకాలం లండన్‌లోను ఉండేవారు. ఆ కాలంలో వారినప్పుడు చూచుట తటస్థించింది. 1926 లో ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణగారు ఆక్స్‌ఫర్డ్‌లో ఆప్టన్ ఫౌండేషన్ ఉపన్యాసాలిచ్చినపుడు, అప్పుడాక్స్‌ఫర్డ్‌లో వున్న ఆంధ్ర విద్యార్థులం వారితో కలిసి ఫోటో తీయించుకున్నాం. ఆ ఫోటోలో శ్రీమతి భారతీదేవి ముఖ్య స్థానం అలంకరించారు. అప్పటికింకను చిన్నవారైనా, అనుభవం తక్కువ వారైనా ఆమె సహజ గంభీరం అందులో ప్రస్ఫుటమైనది. తరువాత 1927 ఫిబ్రవరిలో నేను స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు స్వాగతమివ్వటం, నేను వారి ఇంట 1928 లో మూడుమాసాలు అతిథిగా గడపటం జరిగాయి. తర్వాత అప్పుడప్పుడు కలుసుకోవటం, నా సంసారం చక్కబడటానికి నా భార్యకు సలహాలివ్వటం వంటి ఆత్మీయతలు పాటించారు. 1938 వేసవిలో నా పెద్ద కుమారుడు వారి మదనపల్లి వేసవి రైతు శిక్షణాకేంద్రంలో చేరినప్పుడు కన్నతల్లి కంటె ఎక్కువ ఆదరణతో, ప్రేమతో వానిని చూచి, వాని హృదయాన్ని చూరగొని మాకానందం కలిగించి మరింత దగ్గరైనారు. ఆ యువకుడు కొలది మాసాలకే అకాల మృత్యువాతబడగా ఆమె కన్నతల్లివలె శోకవ్యధను పొంది మాకు కొంతకు గొంత ఊరట కలిగించారు. ఈ విధంగా శ్రీ రంగయేకాక, శ్రీమతి భారతీదేవిగారు కూడా మాకు మిక్కిలి ఆప్తబాంధవులైనారు."

**– లింగం వీరభద్రయ్య చౌదరి.**

* * *

# ఉత్తరం

"రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణగారు నన్ను రచన, చిత్రలేఖనం మానవద్దంటూ నాకు అప్పుడప్పుడు ఉత్తరాలు కూడా రాసేవారు. 1966 లో ఒంగోలు నియోజకవర్గం నుండి లోక్‌సభకు పోటీ చెయ్యమనీ, అందుకు నేను సమర్థురాలిననీ నాకు ఉత్తరం రాశారు. అప్పట్లో ఆంధ్రా చీఫ్ మినిస్టర్ శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు కూడా ప్రెసిడెంట్‌గారి అభిప్రాయాన్ని బలపరుస్తూ నాకు టెలిగ్రాం ఇచ్చారు. సినిమా ప్రొఫెషన్‌లో ఉన్న మనకు – ఒకరోజు రాళ్లు, ఒక రోజు పూలు వేయించుకునే రాజకీయాలు వద్దంటూ మా వారు రాధాకృష్ణగారికి పోటీ



(Outputs) 14/10/08

చెయ్యనందుకు మన్నించమంటూ లెటరు వ్రాశారు. అప్పుడే శ్రీ జగ్గయ్యగారు ఒంగోలు నించి పార్లమెంటుకు పోటీచేసి గెలిచారు. ఒకవేళ నేను పోటీ చేసి ఉంటే రాజకీయాలలో ప్రవేశించి వుంటే, నా జీవితం ఏ మలుపు తిరిగి ఉండేదో! నా జీవితరథాన్ని కుంటుపడకుండా, మిట్టపల్లాల్లో తప్పిస్తూ, నడపగలిగిన గొప్పదనం – నా జీవన రథ పార్థసారథి – మా వారికే చెందుతుంది.”

**– భానుమతీ రామకృష్ణ**

❋ ❋ ❋

# వరలక్ష్మీ వ్రతం

“కాటూరి వెంకటేశ్వరరావుగారు స్వాతంత్ర్యోద్యమంలో జైలుపాలయ్యారు. వారిది ఉమ్మడి కుటుంబం. శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం వచ్చింది. అప్పటి భార్య పరిస్థితిని, వర్షఋతు వర్ణనతో మేళవించి వ్రాసిన కవిత ‘వరలక్ష్మి’. ఈ కవితను ఆమె పలికినట్లుగానే కాటూరివారు వ్రాశారు.

భర్త కారాగారంలో ఉన్నాడు. ఆర్థికమైన ఇబ్బంది అయినా ఏదో విధంగా వరలక్ష్మీ వ్రతం చేసుకుందామని ఆమె తాపత్రయం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆమె నోటితోనే ఆమె సౌందర్యాన్ని పలికించిన కాటూరి వారి అమోఘమైన నేర్పు –

“విందలైన నిన్ను లీడుకొల్పను లేను/వ్రతమొనర్ప సజ్జురాలగను
ముందు నోతునన్న ముందేమొ నేనేమొ/కులము వారి బిలుతు నిలుము తల్లి”

అంటుంది ఆమె వరలక్ష్మిని ఉద్దేశించి, ఇంతకు కులము వారెవరు ? బ్రాహ్మణ ముత్తయిదువ అనుకుంటాం. కాని ఆమె ఎవరిని పిలిచిందో చూడండి.

“రావె కాదంబినీ! క్షణ ప్రభరో! రమ్ము/చాతకీ! రమ్ము కేతకీ! జాగుసేయ
కీవు నీవారుగారె! మా యింట నేడు/విందు వరలక్ష్మి మీకెల్ల పేరటమ్ము”

మేఘమాల, మెరుపు, చాతకపక్షి – కేతకీ పుష్పం వీరు ఆమె కులము వారు. మేఘాలను కురులకు ఉపమానంగా మెరుపు తీగను తనువుకు ఉపమానంగా చెప్పడంలో కవిలోక ప్రసిద్ధం. ఇక భర్త కొరకు ఎదురు చూచే ఆమె చాతక పక్షే! పైకి సామాన్యంగా కనిపించి, మానసిక ఔన్నత్యం గలవారు బాహ్యంగా సామాన్యమై అంతర్గతంగా సౌరవభరితమైన మొగలి పూవు వంటివారే! ఉపమానాలతోనే ఆ సాధ్వీమణి సౌజన్యాన్ని చిత్రించారు కాటూరివారు. మరొక వంక ఇదంతా వర్షఋతు వర్ణన!”

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# ఆక్షేపణలు

"కాళిదాసుకూ, భవభూతికీ కూడా ఆక్షేపణలు రాకపోలేదు. భాసుడూ మొదలైన వాళ్ళ నాటకాలు ఉండగా ఈ కొత్త నాటకమెందుకూ అని అప్పటి అజ్ఞానులు ఆక్షేపిస్తే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'లో –

"పురాణ మిత్యేవనసాధు సర్వమ్/న చాపి కావ్యం నవమిత్య వద్యమ్
సంతః పరీక్ష్యాన్యతగద్భజంతే/మూఢః పరప్రత్యయ నేయ బుద్ధిః"

అని ప్రస్తానవలో చెప్పించి నవకవులను హేళన చేసేవారిని మూఢుల కింద కట్టివేసినాడు. భవభూతి కూడా అప్పటివాళ్ళు 'ఎందుకివి' అని ఆక్షేపిస్తే.

"యేనామ కిచిదిహనః ప్రథయన్త్యవజ్ఞాం/జానంతు తేకిమపి తాన్ప్రతి నైషయత్నః
ఉత్పత్స్యతేఽ ఇస్తు మమకోఽ పి సమానధర్మా/కాలో హ్యాయం నివరధి ర్విపులాచ పృధ్వీ"

అని చెప్పుకోవలసి వచ్చినది. వర్డ్సువర్తు వంటి మహాకవి పుస్తకాలు మొదటి పదకొండేళ్ళలో పది ప్రతులు మాత్రమే అమ్మకమయినవి. టెన్నిసను వంటివాడు తన పుస్తకాలు అమ్ముడు కాకపోవడం చూచి "This will never Do" అన్నాడు. బెర్నార్డు షా పుస్తకాలు అచ్చు వేసేవాళ్ళు మొదట లేకపోయినారు. కాని ఇప్పుడు 'షా' పుస్తకాలు విరివిగా అమ్ముడవుతున్నవి. 'షా'ను నీవు ఎందుకు పుస్తకాలు వ్రాస్తున్నావంటే, "నేను నేటి వాళ్ళ కోసం వ్రాస్తున్నాను. నేటిలోకం కోసం వ్రాస్తున్నాను. శాశ్వతత్వం కోసం కాదు" అన్నాడు."

**– గిడుగు వెంకట రామమూర్తి**

❋ ❋ ❋

# తోబుట్టువులు

"తిరుపతి వెంకటకవుల శిష్యులైన పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు సరికొత్త జంటకవులై రాసిన కథాకావ్యం 'సౌందర నందము' భావకవిత్వ యుగంలో వెలువడిందనే గాని, ఆత్మాశ్రయ ధోరణిలో గాక వస్త్వాశ్రయ ధోరణిలో రాసింది. 'అహింస'కు రాజకీయ నైతిక ప్రాముఖ్యం రాసాగిన గాంధీశకంలో, బౌద్ధ ఇతివృత్తాలు కావ్యవస్తువులు కావడం గమనించదగింది. హైందవ పునరుద్ధరణోద్యమ ప్రభావం కూడా దీనికి కొంతకారణం. దుగ్గిరాల బలరామకృష్ణయ్య 'బుద్ధ చరిత్రము' ఆయనను 'బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ'ను చేసింది. తిరుపతి వెంకట కవుల 'బుద్ధచరిత్రము', సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి 'జాతక కథా గుచ్ఛము', తల్లావఝుల శివశంకరశాస్త్రిగారి 'జాతక కథలు', సౌందరనందము తోబుట్టువులు."

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# పురిపండా వీలునామా



పురిపండా అప్పలస్వామి

1980 వ సంవత్సరం జనవరి నెల 15 వ తేదీని విశాఖపట్నం కాపురస్తుణ్ణీ, లేటు పురిపండా వెంకటస్వామిగారి కుమారుణ్ణీ అయిన పురిపండా అప్పలస్వామి అనే నేను స్వస్థచిత్తంతోను, స్థిరబుద్ధితోనూ వ్రాసిన వీలునామా. నా వయస్సు డెబ్బయి ఐదు సంవత్సరాల రెండు నెలలు. ప్రస్తుతం పరిపూర్ణమైన ఆరోగ్యం కలిగి ఉన్నాను. అయినప్పటికీ జీవితం క్షణబంగురం కనుక ఈ వీలునామా వ్రాసినాను.

నా భార్య 1972 సంవత్సరం జనవరి 10 వ తేదీన చనిపోయింది. అంతకు ముందే నా సంతానం ముగ్గురు పిల్లలు చనిపోయారు. నేను ఏకాకినయి వుండటం చేత నా ఆప్తమిత్రులు లేటు జయంతి సుబ్బారావుగారి భార్య చి॥ వెంకట లక్ష్మిగారు ఈ వృద్ధాప్యంలో నాకు తోడునీడగా వుండి పూర్తి అయిన సహకారం అందిస్తున్నారు నాకు.

1. నా స్వార్జితం అయిన విశాఖపట్నం శివాలయం వార్డు దూడావారి వీధిలోని డోరు నెం. 23-7-11 ఇల్లున్నూ
2. రాజకీయ బాధితుడిగా నాకు ప్రభుత్వం వారిచ్చిన పోతన మల్లయ్యపాలెం సర్వే 48/3, ఎ.సి. 9.98 (తొమ్మిది ఎకరాల తొంభై ఎనిమిదిసెంట్లు) భూమిన్నీ
3. ఇతర చరాస్తి సామానులున్నూ, కొన్నివేల పుస్తకాలున్నూ కలవు.

కాబట్టి నా తదనంతరం పైని ఉదహరించిన చరాస్తి స్థిరాస్తులున్నూ, బ్యాంకు బ్యాలెన్సులు వగైరా యావత్తూ దానదమన విక్రయాది సర్వహక్కులతోనూ సదరు జయంతి వెంకటలక్ష్మిగారికే చెందవలెను.

నా పుస్తకాలు (లైబ్రరీ) ఆంధ్రా యూనివర్సిటీ వారికి బహూకరించితిని. అవన్నీ నా తదనంతరం సదరు వెంకటలక్ష్మిగారు, సదరు ఆంధ్రా యూనివర్సిటీ గ్రంథాలయానికి ఇచ్చివేయవలెను.

ఇందుగురించి తగాయిదా చేయడానికి ఎవరికీ ఏ విధమైన అధికారమూ లేదు. ఎవరి ప్రోత్సాహమూ బలవంతమూ లేకుండా నా మనస్ఫూర్తిగా ఈ వీలునామా వ్రాసినాను. నా శేష



(Outputs) 14/10/08

జీవితకాలంలో ఈ వీలును రద్దుచేయుటకుగాని, మార్పుచేయుటకుగాని తగు అధికారం నాయందు వుంచుకున్నాను.

**(సం) పురిపండా అప్పలస్వామి**
15-1-1980.

సాక్షి సంతకము :

**(సం.) ఎ.ఎం. ఇక్బాల్,** హిందీ రీడర్,
ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేరు,

**(సం.) యర్రా సూర్యారావు వ్రాలు,**
అల్లిపురము, విశాఖపట్నం.

* * *

# మునిమాణిక్యం హేళన

"మునిమాణిక్యం వారు సౌందరనందం మీద ఒక రూపకం వ్రాసి తీసుకువచ్చి చదివి వినిపించారు. కాటూరి వారు నవ్వి ఊరుకున్నారు. తరువాత దానిని కృష్ణాపత్రికలో ప్రచురించారు. చివరకు 'మా బావగారికి ఇంటిలో ఈ అలవాటుంది కాబోలు కావ్యంలోకి కూడా దానిని ఎక్కించారు. మా అక్కగారి కాళ్ళమీద పడ్డట్టు' అంటూ వ్రాసి ఆ వ్యాసాన్ని ముగించారు. ఆ అశ్వాసము కాటూరి వారే వ్రాశారని మునిమాణిక్యం వా రూహించారు. మునిమాణిక్యమేమిటి ? రసికలోకమంతా ఊహించింది. తరువాత కొన్నాళ్ళకు హైదరాబాదు – సుల్తాన్‌బజార్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రక్కనేగల డాక్టర్ పిసుపాటి వేంకటరమణయ్య గారింట్లో కాటూరి వారు వెళ్ళి మకాం వేశారు. వారి ఇల్లే ఒక సాహిత్య దర్బారు. సాయంకాలం వేళ చాలామంది కవులు, పండితులు, సాహిత్య ప్రియులు అక్కడకు వచ్చి కూర్చుని కాలక్షేపం చేస్తూండేవారు. రోజూ ఎవరో ఒకరిని దర్బారుకు పరిచయం చేసేవారు రమణయ్యగారు. ఆ కాలంలో అడివి బాపిరాజుగారు హైదరాబాద్‌లో మీజాన్ దినపత్రిక సంపాదకులుగా పనిచేస్తున్నారు. మునిమాణిక్యం ఏదో పనిమీద వచ్చి ఆ పూట అక్కడకు చేరారు. పింగళి లక్ష్మీకాంతంగారు సతీసమేతంగా వచ్చి వెంకటరమణయ్య గారింట్లోనే దిగారు.

ఆ పరిస్థితిలో అందరూ అక్కడ దర్బారు చేశాము. కాటూరివారు మునిమాణిక్యాన్ని సౌందరనందం వ్యాసం చదివి వినిపించమన్నారు. రసవత్తరంగా చదివి వినిపించారు మునిమాణిక్యంగారు. అందరూ ఆనందించారు. లక్ష్మీకాంతంగారిని ఎట్లా వుందని వెంకటరమణయ్య గారడిగారు. లక్ష్మీకాంతంగారు 'ఈ వ్యాసం విన్నది వెంకటేశ్వరరావు కాబట్టి నవ్వుతూ ఆనందించాడు. నేనే అయితే..." అని వూరుకున్నారు.



(Outputs) 14/10/08

సభంతా నివ్వెరపోయింది. ఎవరినోట వెంట మాట రాలేదు. మెల్లగా అంతా జారుకున్నారు. ఇంత కోపం ఎందుకు వచ్చిందో నా కర్థం కాలేదు. తరువాత కొంతకాలానికి పింగళివారి ధర్మపత్ని లక్ష్మీనరసమ్మగారు దివంగతులైంది. వారి స్మృతి పద్యాలు 'లక్ష్మీ నిర్గమనం' అని ఎలిజీ వ్రాశారు పింగళివారు. ఆ పద్యాలలో –

'డెందము నొప్పించిన న
న్నుందండన సేయునీవు! నొవ్వని రీతిన్
సౌందరనందము నాయిక
సుందరి నీ యొద్దమాట సొంపులు నేర్చెన్'

అన్న పద్యం చదివిన తరువాత యీ ఘట్టాన్ని లక్ష్మీకాంతంగారే వ్రాశారు! అందుకనే ఆయన ఆనాడు మునిమాణిక్యం వ్యాసం విని అంతగా అఫెండ్ అయినారనిపించింది."

**– గూడూరి నమశ్శివాయ**

*　　　*　　　*

# చేజార్చుకున్న శిల్పసంపద!

1816 ప్రాంతంలో సర్వేయర్ జనరల్‌గా పనిచేసిన కల్నల్ కానిన్ మెకంజీ మన దేశంలోని గ్రామాల చరిత్రలు వ్రాయించాడు. ఆనాటి గ్రామ పెద్దల నుండి తీసుకున్న కైఫీయతులే మెకంజీ వ్రాయించిన చరిత్రలకు మూలాధారం. ఈ చరిత్ర ప్రతులు శిథిలమవుతుండగా వాటిని తిరగ వ్రాయించి ప్రాచ్యలిఖిత భాండాగారంలో భద్రపరచుట ద్వారా సి.పి. బ్రౌన్ ఆంధ్రదేశ చరిత్రకు, ఆంధ్ర సాహిత్యానికి అపారమైన సేవ చేశాడు. వారు భద్రపరచిన ప్రాచీన పత్రాలు మన చరిత్ర రచనకు తోడ్పడ్డాయి. కృష్ణాజిల్లా ఘంటసాలలో లభించిన పాలరాతి చెక్కడాలను, శిల్పావశేషాలను మొదటి నుండీ భద్రపరిచి వుంటే ఘంటసాల ఘనకీర్తిని తెలిపే విలువైన చారిత్రక సంపద మనకు ఎంతో మిగిలివుండేది. ఆనాడే ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ తీసుకున్నా చారిత్రకమైన శిల్పసంపద పరాయి దేశాలకు పోయి వుండేదికాదు. బౌద్ధ శిల్పాలు బట్టలుతికే బండలుగా మారి శిథిలమై వుండేవి కావు. బుద్ధుని నిలువెత్తు శిలా విగ్రహం ఎనిమిది వేల రూపాయలకు దళారీల వద్దకు చేరి మాయమయ్యేది కాదు.

1920 లో ఘంటసాలలోని కోటదిబ్బలో ఒక రైతు దున్నుతుంటే 60 శిల్పాలు బయటపడ్డాయట. అందులో ప్రతి ఒక్కటి శాక్యముని జీవితాన్నో, జాతక కథనో చిత్రించిన శిలాఫకలమేనట. దొరికిన శిలాఫలకాలనన్నిటినీ గ్రామస్తులొక చెట్టుక్రిందకు చేర్చి గుట్టవేసి వుంచారట. కొన్నాళ్ళకు పాండిచ్చేరి నుండి ఎం.డి. జోనియన్ డూబ్రియల్ ఏజెంట్ వచ్చి అయిదు వేల రూపాయలకు రాళ్లు మొత్తం కొని, తీసుకుపోయాడట. అక్కడ నుండి అవి పారిస్‌లోని గుయ్‌మెట్ మ్యూజియం చేరుకున్నాయి. ఒకసారి డూబ్రియల్ స్వయంగా వచ్చి కొన్ని బౌద్ధ విగ్రహాలు కొనుక్కుపోయాడట. ఆ విధంగా ఘంటసాల బౌద్ధ శిల్పసంపద శాశ్వతంగా



(Outputs) 14/10/08

చేయిజారిపోయింది. ఘంటసాల శిల్పాలలో కల్లా ముఖ్యమైన శిల్పం బోస్టన్‌లో వున్నట్టు బ్రిటీష్ మ్యూజియం అసిస్టెంట్ కీపర్‌గా పని చేసిన డగ్లర్ బారెట్ తెలిపాడు.

**– ఎ.కె.ఆర్.బి. కోటేశ్వరరావు.**

❋ ❋ ❋

# అనుభవాలు



ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

"నేను రష్యా వెళ్ళినప్పుడు విల్‌నూస్‌లోని ఓరియంటల్ డిపార్టుమెంటులో డైరెక్టరైన ఎడ్వర్‌దాస్ అనే పండితుడు నేను సంస్కృత కవయిత్రినని తెలుసుకుని బెల్ట్ ఆఫ్ పోయట్స్‌ను నాకు బహూకరించారు. జకోస్లవేకియాలో మాకాతిథ్యమిచ్చిన మిస్ మరియమ్ నల్లావికా అనే రష్యన్ రచయిత సంఘాధిపతికి ఇంగ్లీషులో వ్యాఖ్యానాలున్న భగవద్గీతను నేను ఆమెకిస్తుంటే, ఆమె తన కాలి చెప్పులను విప్పి, అతి వినయంగా ఆ పుస్తకంమీద తనకున్న భక్తి ప్రపత్తులను చాటుతూ తీసుకున్నది. అది చూసి నేను ఆశ్చర్య పోయాను. 'మీ కమ్యూనిస్టు దేశాలలో భగవద్గీతపై ఇంతటి గౌరవం చూపుతారా' అని అడిగాను. అందుకామె 'కర్మపరమైన సందేశాన్ని ప్రపంచమంతటికి ఆదర్శపూర్వకంగా చాటి చెప్పిన ఒకే ఒక మహాద్గ్రంథం భగవద్గీత. దానికి మా రష్యాలో స్థానం లేదంటారా' అని ఎదురు ప్రశ్న వేసింది. అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ దగ్గర ఆగ్రా రాధస్వామి అనుయాయులైన రెండువేల మంది స్పెయిన్ దేశీయులను చూశాను. విధులేనియాలో ఇటలీ చర్చి, ఫ్రాన్సు చర్చిలుండడం చూసి మీకు ఇన్ని రకాలైన చర్చీలున్నాయా అని ఇంటర్‌ప్రిటర్ విక్టర్‌ని అడిగేను. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకంగా వుంటాయన్నాడు. మొత్తం 242 భేదాల ధర్మసూత్రాలున్నా యన్నాడు. అయితే మా భారతదేశంలో 20, 25 మతభేదాల కంటే లేవు. అయినా మేమంతా 'ఏకం సద్విప్రాబహూధావాదులు' అనే పరమేశ్వర తత్త్వం మీద విశ్వాసముతో వున్నాము. అయితే మీరు ఆరాధించే భగవంతుని పేరేమిటి ? అని అడిగాను. వెంటనే ఆయన క్రీస్తు అని అనకుండా 'హహహహ' అని అన్నాడు. నేను 'బాబు హహహహ గంధర్వరాజు శబ్దము' అన్నాను. అందుకతను ప్రపంచంలో మహాత్ముడొక్కడే. మనం భిన్న భిన్న భేదాలతో సతమతమవు తున్నామన్నాడు.

లిండర్స్‌లో ఉన్నప్పుడు వారి కోరికపై నేను భగవద్గీతలోని విశిష్ట కర్మభక్తి అని ప్రబోధించిన భక్తియోగాన్ని గూర్చి ప్రవచించాను. అక్కడికి వచ్చిన యూనివర్సిటీ లైబ్రరీ అసిస్టెంట్ ఫ్రెడ్రిక్‌తో నేను 'ఏమండీ మీ క్రైస్తవమతంలో 242 భేదాలున్నాయా' అని అడిగితే, చాలా వున్నాయి. 460 దాకా వున్నాయన్నాడు. ఇలా నా అనుభవాలు కోకొల్లలు."

**– ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# అర్థమే మారిపోయింది

"ఆంగ్లభాషలో విస్టన్‌స్ట్రాచ్ అనే మహనీయుడు 'ఎమినెంట్ విక్టోరియన్స్' అనే పుస్తకం వ్రాశారు. అందులో విక్టోరియా మహారాణి, జనరల్ గోర్డోన్ మొదలైన వారిని గురించి ఆయన ప్రస్తావించాడు. ఆ వ్యక్తుల జీవితాల్లో వున్న చీకటి కోణాలను గురించి కూడా ఆయన నిర్మొహమాటంగా వ్రాయగలిగాడు. నిజానికి వారంతా మహామహులు, తమ తమ రంగాలలో నిష్ణాతులు, తిరుగులేని నాయకులు, మోస్ట్ ఎమినెంట్ అనిపించుకున్నవారు. కానీ విస్టన్‌స్ట్రాచ్ ఆ పుస్తకం ప్రకటించిన తర్వాత 'ఎమినెంట్' అన్న మాటకే అర్థం మారిపోయింది. అది వ్యంగ్యార్థ సూచకమైంది."

❋ ❋ ❋

# గోదావరిలో పుట్టి కృష్ణలో కలిశారా!

"1950 ఫిబ్రవరి మహాశివరాత్రినాడు ఉదయం 8 గంటలకు నేను వెళ్ళిపోతున్నాను. చూచి వెళ్ళమని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు పెద్ద అల్లునితో కబురు పంపారు. వెళ్ళి చూచాను. ప్రాణోత్క్రమణ సమయమాసన్నమయింది. ఆయాసంతో బాటు హిక్క కూడా ఆరంభమైంది. అయినా ఏమయినా మందు ఇస్తానన్నాను. నీ ఇష్టమన్నారు. ఇంటికి వెళ్ళి మందు తెచ్చి ఇచ్చాను. అయిదు నిముషాల్లో బాధలు తగ్గాయి. బాగా తెలివి వచ్చి మాట్లాడారు. అంతలోనే మళ్ళీ క్షణం వచ్చింది. ఇక లాభం లేదని అందరికీ కబురుపెట్టాను. విశ్వనాథ, వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, ఆకాశవాణి అందరకు కబురుపెట్టాను. అందరిలో ముందు వచ్చిన వారు విశ్వనాథ, తరువాత వేటూరి. పోయిన అరగంటకు శ్రీపాద గురువులు వచ్చారు. ఆకాశవాణి వారు అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. అక్కడ నుండి వేలాదిమంది జనం వచ్చి చూచారు. ఆర్.బి. శేషాచార్లు అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. సరిగ్గా ఉదయం గం. 11.40 నిముషములకు వారి ప్రాణం పంచభూతాలలో కలిసిపోయింది. మధ్యాహ్నం గం. 2.30 ని.లకు మద్రాసు ఆంధ్రప్రభ ఆఫీసు నుండి నార్ల – కృష్ణశాస్త్రి, కాటూరి కవిగార్లు నాకు ఫోన్ చేశారు. 'నమశ్శివాయా నీవు ఎంత అదృష్టవంతుడవోయి! నీ సాన్నిహిత్యంలో శాస్త్రులుగారు ప్రాణం వదిలారుట. అదృష్టమంటే నీదేనని చెప్పాలి' అన్నారు కాటూరి వారు. తరువాత శ్రీపాద గురువులు 'వెంకటశాస్త్రీ వెళ్ళి పోయావా ? ఎంత అదృష్టం. ఎంత గొప్పవాడివనిపించుకున్నావు ? వెంకటశాస్త్రి అంటే ఏకపత్నీవ్రతుడు. దుఃఖమంతా నాపాలు చేసి వెళ్ళిపోయాడు' అన్నారు. సాయంకాలం ఆరుగంటలకు అంత్యక్రియలు జరిగాయి. కృష్ణాఘాటులో వేలాది కవి పండితుల సాన్నిధ్యంలో బెజవాడ ప్రజలందరు కన్నీటితో జలాంజలి అర్పించారు. గోదావరిలో జన్మించి కృష్ణలో దుర్గ సాన్నిధ్యంలో కలిసిపోయారు."

**– గూడూరి నమశ్శివాయ**

❋ ❋ ❋



(Outputs) 14/10/08

# ఆప్తకోటి

"నేను ఆంధ్రపత్రిక (దినపత్రిక)లో చేరిన రోజుల్లో నాకు శంభుప్రసాద్‌గారిని చూస్తే చాలా భయంగా ఉండేది. దూరదూరంగా తిరిగేవాడిని. ఆయన ముందు సిగరెట్ తాగేవాడిని కాదు. ఆ కొత్తలో – అప్పటికే ఆయనకి గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఉండేది. అప్పుడు (1954) ఒకసారి ఆయన డాక్టరు గాలి బాలసుందరరావుగారి నర్సింగ్‌హోమ్‌లో చేరారు. ఒకనాడు సంపాదకశాఖలో కొందరు ఆయన్ని చూడడానికి వెళ్తూ నన్ను కూడా తీసుకువెళ్లారు. వారంతా లోపలికి వెళ్ళి దగ్గరగా కూర్చుని మాట్లాడారు. నేను భయంకొద్దీ గడపదగ్గరే నిలబడి చూస్తున్నాను. అంత బాధలోనూ, ఆయన తన జబ్బుమీద, ఆసుపత్రులమీద, డాక్టర్ల మీద జోక్సువేసి అందరినీ నవ్విస్తున్నారు. చీకటిచాటున నేనూ నవ్వుకున్నాను. అరగంట తరువాత అందరూ బయలుదేరారు. నేనూ వెళ్ళిపోతున్నాను. 'రమణా' అని ఆయన పిలిచారు. నాకు గుండె ఆగినంత పనైంది. మెల్లిగా వెనక్కి తిరిగి గదిలోకి నడిచాను. మంచం పక్కన నుంచున్నాను. దగ్గరగా రమ్మన్నారు. నా చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా గాఢంగా అదిమారు. అంతలోనే అంతవరకూ నవ్వుతూ నవ్విస్తున్న ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. కంట నీరు తిరిగింది.

'నేను మళ్ళీ ఆఫీసుకొస్తాను కదూ రమణా!' అన్నారు.

నాకు ఏడుపు ఆగలేదు. గుండె జల్లుమంది. కష్టంమీద సరిచేసుకుని రెండు చేతులతోనూ, ఆయన చెయ్యి పట్టుకుని 'వచ్చేస్తారు అయ్యవారూ.... తప్పకుండా వచ్చేస్తారు.' అన్నాను. ఆయన బాధగా చిరునవ్వు నవ్వారు. నా చేతులపై తట్టారు. 'అవును' అన్నారు. ఒక క్షణం అయ్యాక, 'అంతా వెళ్తున్నట్టున్నారు, మీరూ వెళ్ళండి' అన్నారు.

నేను బయటకు వచ్చి మెట్ల మలుపు దగ్గర ఆగి కళ్ళు తుడుచుకుని మేడ దిగాను. అంతమంది పెద్దలు, ఆత్మీయులు మాట్లాడి వెళ్ళాక ఆయన నాతో మాట్లాడటం – ఆ ప్రశ్న – చిత్రం అనిపించింది. ఎందుకో నేనూ ఆయన ఆప్తకోటిలో ఒకడిని అనిపించింది."

**– ముళ్ళపూడి వెంకటరమణ**

* * *

# సాహిత్య ధీశాలి

"1868 లో రాజమహేంద్రవరం (రాజమండ్రి)లో ఓ రెండేళ్ళ శిశువు విషజ్వరం వచ్చి చనిపోయాడని ఎంచి శ్మశానానికి తీసుకువెళ్ళి గోతిలో పాతిపెడుతుండగా, ఆ శిశువులో చలనం ఏర్పడి జీవం కనబడింది. అది మొదలు తొంభై నాలుగేళ్ళు జీవించి ఒక్క చేతిమీదుగా భారతం పద్దెనిమిది పర్వాలు, రామాయణం ఏడుకాండలు, భాగవతం పన్నెండు స్కంధాలు,



(Outputs) 14/10/08

సంస్కృతం నుండి తెనిగించిన ఆ శిశువే శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి. 97 పద్యకావ్యాలు, 32 నాటకాలు, 5 శతకాలు, 35 వచన కావ్యాలు వ్రాసిన ధీశాలి."

❋ ❋ ❋

# గాలివాన

" ప్రతి గొప్ప రచన వెనక ఒక అలజడో, ఆవేదనో, అనుభూతో ఉంటుంది. వెనుక ఉండేకథ ఒక్కోసారి ఆసక్తికరంగా ఉంటుంది. పాలగుమ్మి పద్మరాజుగారు భీమవరం కాలేజీలో కెమిస్ట్రీ హెడ్‌గా ఉండేవారు. ఆ రోజుల్లో మామిడిపూడి వెంకటరంగయ్య, నండూరి రామకృష్ణమాచార్యులు, ధూళిపాళ సోమయాజులు, డి. సన్యాసయ్య వంటి అతిరథ మహారథులకి భీమవరంలో తమ కాలేజీలో ఉద్యోగాలిచ్చి, మళ్ళీ వారెవరూ కాలేజీ వదలి వెళ్ళిపోకుండా ఉండేందుకు చిన్న చిన్న ఇళ్లస్థలాలు ఉచితంగా ఇచ్చి ఇల్లు కట్టుకోమన్నారు – కాలేజీ అధికారులు.

నండూరి వారి ఇంటి ప్రక్కనే పద్మరాజుగారు చిన్న ఇల్లు కట్టుకున్నారు. డబ్బు అంతగా లేకపోవడం వల్ల పక్కా ఇల్లు కట్టుకోలేదు. నాలుగైదు అడుగుల ఎత్తువరకూ ఇటుకగోడలూ, ఆపైన తాటాకులపాక. ఆ పాకనే గది, హాలు, వంటిల్లుగా విభజించుకుని కాలక్షేపం చేస్తున్నారు. వారి ఇల్లు అంటే ఒక పెద్ద తాటాకుల పాక.

ఓ అర్ధరాత్రి భయంకరమైన గాలివాన వచ్చి ఇంటి కప్పులు ఎగిరిపోతున్నాయి. పెద్ద పెద్ద చెట్లు కూలిపోతున్నాయి. గాలీ, వానా, కరెంట్ లేదు, పై కప్పు ఆకులు ఎగిరిపోతున్నాయి. ఇటుక గోడలు ఊగిపోతున్నాయి. ఇంటో ఉంటే ప్రమాదం అని చెప్పి, పద్మరాజుగారు భార్యని హెచ్చరించి, బయటికి వెళ్ళిపోదాం అన్నారు. ఇద్దరూ బయలుదేరారు. ఆయన బయటకు వచ్చారు. ఆమె ఇంట్లో చిక్కుకుపోయారు. ఇటుకగోడలూ, ఇంటి పైకప్పు మొత్తం అంతా ఫెళ..... ఫెళ... మని కూలిపోయింది. ఆ శిథిలాల క్రింద ఆమె ఇరుక్కుపోయారు.

పద్మరాజుగారికి పిడుగుపాటు! శిథిలాల క్రింద తన భార్య ఏమైందో ? అవి తియ్యడానికి తన ఒక్కడివల్లా అయ్యేదికాదు. చుట్టూ కారుచీకటి.... అంధకారం... భయంకరమైన తుఫాను.... ఎవ్వరూ కనిపించడం లేదు. నిస్సహాయంగా తను ఒక్కడూ నిలబడి ఉన్నాడు. భార్య బతికి ఉందా ? చనిపోయిందా ? భయంకరమైన ఆలోచనల్లో చేష్టలుడిగి చైతన్యం నశించి స్థాణువులా నిలబడిపోయాడు. ఈలోగా ఫెళ.... ఫెళమన్న శబ్దం విని చేతిలో టార్చి లైట్లు పుచ్చుకుని హాస్టల్లో ఉన్న విద్యార్థులూ, ఊళ్ళో ఉన్న తోటి లెక్చరర్లూ పరిగెత్తుకుని వచ్చారు. వంద, రెండువందల మంది పోగుబడ్డారేమో ఓ అరగంటలోపులో ఆ ఇటుకలూ, ఆకులూ తొలగించి పద్మరాజుగారి భార్య శరీరాన్ని బయటికి తీశారు. తీశారేగానీ ఆమె బ్రతికుందో లేదో తెల్లవారితేగాని తేలలేదు.



(Outputs) 14/10/08

ఈలోగా ఆయన పొందిన ఆవేదనా, పడిన ఆందోళనా.... గుండెనీ, మనసునీ కలచివేసిన అనుభవం చాలా భయంకరమైందీ, బలమైందీ. అంత బలమైన అనుభూతిలోంచి వచ్చింది. కనుకే అయన 'గాలివాన' తెలుగుకథకి ప్రపంచ కథానికల పోటీలో ద్వితీయ బహుమతి వచ్చింది. ”

**– పి.పి.సి. జోషి.**

❋ ❋ ❋

## కాలం

నెల్లుట్ల రామకృష్ణామాత్యుడు అనే కవి వరంగల్‌లో ఉండేవాడు. ఆయనకు జాషువా కవిత్వంపైన అపారమైన అభిమాం. 'సురబాల' అనే కావ్యం వ్రాసి జాషువా కవిగారికి వెయ్యిన్నూట పదహార్లు సమర్పించి, తన కావ్యాన్ని అంకితం చేశాడు. ఆ రోజుల్లో జాషువాగారికి తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారికి ఏవో మనస్పర్థలు ఉండేవి. తుమ్మలవారు జాషువాగారి స్వప్న కథ కావ్యంపైన విమర్శ 'స్వప్న కథ ఔచిత్య విచారం' అనే పేరుతో వ్రాయగా, రామకృష్ణామాత్యుడు 'స్వప్నకథా ఔచిత్యం విచార పరామర్శ' అని సమాధానం వ్రాసి, గ్రంథరూపంలో ప్రకటించారు. ఆయన 'భావార్ణవం' మొలైన మరికొన్ని కావ్యాలు కూడా వ్రాశారు. తరువాత కొంతకాలానికి తుమ్మల వారికి కూడా ఆయన ఆప్తులైనారు.

❋ ❋ ❋

## రిజర్వేషన్

ఒకసారి మొక్కపాటి నరసింహశాస్త్రిగారు మద్రాసుకు ప్రయాణమయ్యారు. కానీ రిజర్వేషన్ దొరకలేదు. ఒంగోలులో దిగిపోయి శివశంకర శాస్త్రిగారి దగ్గరకి వెళ్ళారు. శివశంకరశాస్త్రి గారికి అప్పటికే హార్ట్ అటాక్ వచ్చింది. మంచం మీద ఉన్నారు. ఆయన మొక్కపాటి వారిని చూడగానే నవ్వుతూ 'నేను వెళ్ళిపోతున్నాను' అన్నట్టుగా చెయ్యి ఊపారు.

మొక్కపాటి చిరునవ్వు నవ్వుతూ 'మీ ప్రయాణం ఆపుచేయడానికే వచ్చా. మీ రిజర్వేషన్ నాక్కావాలి' అన్నారు.

అనంతరం మొక్కపాటివారు మద్రాసులో తన కేన్సర్‌కి చికిత్స చేయించుకుని, సరాసరి పిఠాపురం వెళ్ళిపోయారు. అన్నట్టుగానే శివశంకరశాస్త్రి గారికంటే మొక్కపాటివారే ముందు చనిపోయారు. ఆ వార్త విన్న శివశంకరశాస్త్రి కాస్సేపు మాట్లాడలేకపోయారు. తర్వాత, కంట తడితోనే నవ్వుతూ 'నా టికెట్ ఆయన తీసుకుపోవడం బావులేదు' అన్నారు.

❋ ❋ ❋



(Outputs) 14/10/08

**చెలం - జరుక్‌శాస్త్రి ఇద్దరూ సాహిత్య ప్రసిద్ధులే అయినా చెలంగారు రమణాశ్రమం నుంచి శాస్త్రిగారికి వ్రాసిన ఉత్తరాల్లో సాహిత్యాంశాలు తక్కువ. మచ్చుకి ఒక ఉత్తరంలో ఆసక్తికర విషయం -**

తిరువణ్ణామలై,
18-4-1957.

రుక్మిణీనాధ శాస్త్రికి,

సాయంత్రం ఆశ్రమం కుక్క నా కాలు కరిచింది. పోతున్న నా కాలివెంట రక్తపుధార నర్తకి చూసింది. అరుగుపైన కూచుని ఆరుగురు చూస్తున్నారు. ఒక్కళ్లు కదల్లేదు. ఆశ్రమం డాక్టరు దగ్గరకి వెళ్ళాం. డాక్టరు మమ్మల్ని చూసి తలుపు వేసుకున్నాడు. నర్తకి, డాలీ, కిష్టా వెళ్ళి బతిమాలారు 'నెత్తురు కారుతోంది కట్టు కట్ట'మని. 'పెద్దాసుపత్రికి పొండి' అని కసిరాడు. ఆ డాక్టరు అంతకుముందు కనబడి నవ్వుతూ మాట్లాడారు. నాకు స్నేహితుడు.

రక్తం కారుతోనే వుంది. బండి లేదు. ఏం చేసినా రక్తం ఆగడంలేదు. కాంపౌండరన్నా దయ తలుస్తాడని ఆశ్రమానికి పరుగెత్తింది నర్తకి. అతను భోంచేసి కాని రానన్నాడు. తిరిగి తిరిగి బతిమాలింది నర్తకి. ఆస్పత్రిలోంచి మందు ఇవ్వనన్నాడు. మనిషిని పంపనన్నాడు. పాపం కాంపౌండరు ఉత్త చేతుల్తో వస్తూ వుంటే దోవలో ఆశ్రమవాసులు అతన్ని అడ్డంకొట్టి వెళ్ళవద్దన్నారు. నర్తకి లాక్కొచ్చింది. నర్తకి వొస్తావుంటే తోవలో ఎంకడు - రామస్వామి అయ్యర్ నవ్వుతున్నారు. ఇదే అయ్యర్ గారికి దెబ్బ తగిలినప్పుడు ఒళ్ళో పడుకోపెట్టుకుని కట్టుకట్టాను. ఆస్పత్రికి పోయి సేవచేసేను రోజూ ధైర్యం చెపుతూ. కాలు నయమయింది. ఎట్టా నయమయిందో మీకు తెలుసు, నాకు తెలుసు. కుక్క కాటు మానింది - మనిషి కాటు మానలేదు మరి.

చిత్రం చాలా లోతు గాయం. ఒక్క నిముషం నాకు ఏ నొప్పీ కలగలేదు. అది లేనట్టే గుర్తు లేకుండా మాయమయింది, అంత గట్టి గాయమూను - మనిషి కాటుకు - ఈశ్వరుడే మందు.

ఈశ్వరాశీర్వాదాలతో,
మీ **చెలం.**

* * *

# తొలి సాహితీ సంస్థ

తెలుగు రాష్ట్రంలో తొలి సాహితీ సంస్థను నెలకొల్పిన ఘనత బందరుదే. 'బందరు' పేరుతో ఒక సముద్ర తీరప్రాంతం 17 వ శతాబ్ధి ప్రారంభంలోనే ఏర్పడింది. బ్రిటీషుపాలన ప్రారంభమైన తర్వాత ఈ ప్రాంతపు బ్రిటీషు అధికారి 'మౌంట్ గోమెరీ' ఒక సాహిత్య సంస్థను ప్రారంభించడానికి స్ఫూర్తిని అందించాడు. దానిపేరు 'మసులీ పటమ్ ఏక్జిలరీ హిందూ లిటరరీ సొసైటీ'. గోమెరీ తన పరిపాలన దాదాపు ఇరవై ఎనిమిది సంవత్సరాలు బందరులోనే పూర్తిచేసి రిటైరయి ఇంగ్లాండు తిరిగి వెళ్ళాడు. ఈయన వీడ్కోలు సభను, ఈ సాహిత్య సంస్థ ఘనంగా నిర్వహించిందని చరిత్రకారులు రాసారు. వీడ్కోలు సభ 1842 జనవరి 6 న జరిగింది.



(Outputs) 14/10/08

ఆదివారం వార్త లో నాలుగు సంవత్సరాలు పాఠకులను అలరించిన సాహిత్య మరమరాలు

- ముప్పల సుబ్బరామయ్య















